శ్రీ వేంకటేశ్వర సాహిత్య సర్వస్వము

నాల్గవ సంపుటం

# ప్రాచీనాంధ్ర సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరుడు

**(క్రీ.శ. 14–17 శతాబ్దాలు)**


**డా॥ కె.వి. రాఘవాచార్య**

శ్రీ వేంకటేశ్వర సాహిత్య పరిశోధకుడు



*ప్రచురణ*

కార్యనిర్వహణాధికారి

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2018**

**PRACHINANDHRA SAHITHYAMLO SRI VENKATESWARUDU - Vol.4**

By

**Dr. K.V. RAGHAVACHARYA**

T.T.D. Religious Publications Series No. 1299
© All Rights Reserved

*First Edition :* 2018

*Copies :* 500

*Published by :*
**SRI ANIL KUMAR SINGHAL**, I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Office of the Special Officer,
Publications Wing,
T.T.D., Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి**

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారికి సమానమైన దైవం కానీ, వేంకటాద్రికి సమానమైన క్షేత్రం కానీ ఈ బ్రహ్మాండంలో ఇంతకుమునుపు లేదు, ఇకముందు ఉండదు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారు అపార కృపాకటాక్ష సంపన్నులు. తనను ఆశ్రయించిన భక్తులకు కొంగుబంగారంగా ఉంటూ వారిని సర్వదా రక్షించే స్వామి ఆయన.

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గురించి వేదాలు పురాణాలు, ఇతిహాసాలు ఉపనిషత్తులు స్తుతిస్తున్నాయి. స్వామి వారి ప్రస్తావన ప్రాచీన అర్వాచీన భారతీయ సాహిత్యంలో విస్తృతంగా ఉంది. భారతీయ సాహిత్యంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాహిత్యాన్ని ఒకచోట చేర్చి పాఠకులకు అందించాలనే సంకల్పంతో తి.తి.దేవస్థానములు 1999లో **"భారతీయ సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరుడు"** అనే ఒక ప్రాజెక్టును ప్రారంభించింది.

తి.తి.దే. ఈ ప్రాజెక్టులో భాగంగా 1) శ్రీ వేంకటాద్రిక్షేత్ర వైభవం, 2) శ్రీ వేంకటేశ్వర వైభవం 3) శ్రీ వేంకటాద్రి తీర్థవైభవం 4) ప్రాచీనాంధ్ర సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరుడు, 5) నవీనాంధ్ర సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరుడు – అనే శీర్షికలతో గ్రంథాలను తయారుచేసే బాధ్యతను ప్రముఖ సాహితీ పరిశోధకులు, రచయిత అయిన డా॥ కె.వి.రాఘవాచార్యులు గారికి అప్పగిస్తూ ఆయనను ఆ ప్రాజెక్టులో పరిశోధనాధికారిగా నియమించింది.

ఆ తరువాత 2002లో ఈ ప్రాజెక్టు తి.తి.దే శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయానికి బదిలీ చేయబడి **"శ్రీ వేంకటేశ్వర సాహిత్య సర్వస్వము"** ప్రాజెక్టుగా నామాంతరం చేయబడి, మూడు సంపుటాలు వెలువడ్డాయి.

ఆ తరువాత మళ్ళీ తి.తి.దే కో-ఆర్డినేటర్ ఆఫ్ పబ్లికేషన్స్ కార్యాలయానికి ఈ ప్రాజెక్టు బదిలీ చేయబడింది.


ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర సాహిత్య సర్వస్వం ప్రాజెక్టు క్రింద నిర్దిష్ట సంపుటాలలో భాగమైన నాలుగవ సంపుటం **"ప్రాచీనాంధ్ర సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరుడు"** అనే గ్రంథం వెలువడుతున్నది.

ఈ గ్రంథంలో రచయిత పురాణ, ఇతిహాసాలలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రస్తావన మొదలుకొని క్రీ.శ.14వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకు వచ్చిన ఆంధ్ర సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరుని ప్రస్తావన ఎక్కడెక్కడ ఉన్నదో ఆ విషయాలను సహేతుకంగా చక్కగా వివరించారు. దాదాపు 51 మంది కవులు వారివారి కావ్యాలలో స్వామివారిని ప్రస్తావించినట్లు, 25మంది కవులు తమ అంకిత కావ్యాలలో శ్రీనివాసుని స్తుతించినట్లు ఈ గ్రంథం ఆధారంగా తెలుస్తున్నది. ఇక తాళ్ళపాక కవులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి చేసిన సేవ చెప్పనలవికానిది. అన్నమాచార్యుల వారి సంకీర్తనలు వారి తదనంతరం వారి వంశీకులు శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ప్రస్తుతిస్తూ చేసిన రచనలు మొదలైన అనేక విషయాలను రచయిత ఈ గ్రంథంలో కూలంకషంగా వివరించారు.

**"శ్రీవేంకటేశ్వర సాహిత్య సర్వస్వం"** లో భాగంగా డా॥కె.వి. రాఘవాచార్యులుగారు పరిశోధించి, పరిశీలించి, పరిష్కరించి సిద్ధంచేసిన **"ప్రాచీనాంధ్ర సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరుడు"** అనే ఈ నాల్గవ సంపుటాన్ని భక్త మహాశయులు, సాహితీ ప్రియులు, సాహితీ పరిశోధకులు ఆదరిస్తారని ఆకాంక్షిస్తూ.....

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.





# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| **ప్రవేశిక** | | **1-28** |
| 1) | ఇతిహాసములు | 5 |
| 2) | పురాణములు | 13 |
| **శ్రీ వేంకటాచల మాహాత్మ్యగ్రంథము** | | **29** |
| 1) | స్కంద పురాణము | 29 |
| 2) | వరాహ పురాణము | 34 |
| 3) | హరివంశగత శేషధర్మము | 40 |
| 4) | బ్రహ్మ పురాణము | 43 |
| 5) | ఆదిత్య పురాణము | 45 |
| 6) | గరుడ పురాణము | 46 |
| 7) | భవిష్యోత్తర పురాణము | 50 |
| 8) | పద్మపురాణము | 57 |
| 9) | మార్కండేయ పురాణము | 62 |
| 10) | బ్రహ్మాండ పురాణము | 66 |
| 11) | వామన పురాణము | 69 |
| 12) | భాగవతము | 74 |
| 13) | వేంకటాచల మాహాత్మ్య గ్రంథ రచనాకాలము | 75 |

**4.1 ప్రస్తావన కావ్యములు** **79**

1) నృసింహ పురాణము - ఎఱ్ఱన 79

2) సింహగిరి వచనములు - కృష్ణమాచార్యులు 81

3) హరవిలాసము - శ్రీనాథుడు 82

4) కాశీఖండము - శ్రీనాథుడు 83

5) ఆంధ్రమహాభాగవతము - బమ్మెరపోతన 85

6) విక్రమార్క చరిత్రము - జక్కన 86

7) జైమిని భారతము - పిల్లలమర్రి పినవీరభద్రుడు 87

8) పంచతంత్రము - దూబగుంట నారాయణ కవి 87

9) ఒంటిమిట్ట రఘువీర శతకము - అయ్యలరాజు త్రిపురాంతకుడు 88

10) మనుచరిత్ర - అల్లసానిపెద్దన 89

11) పారిజాతాపహరణము - నంది తిమ్మన 90

12) రామాభ్యుదయం - అయ్యలరాజు రామభద్రుడు 91

13) రాజశేఖర చరిత్రము - మాదయగారి మల్లన 91

14) శ్రీకాళహస్తి మాహాత్మ్యము - ధూర్జటి 92

15) ఘటికాచల మాహాత్మ్యము - తెనాలి రామకృష్ణుడు 93

16) పాండురంగ మాహాత్మ్యము - తెనాలి రామకృష్ణుడు 102





17) వాసిష్ఠ రామాయణము - మడికి సింగన 103

18) కళాపూర్ణోదయము - పింగళి సూరన 104

19) రాఘవ పాండవీయము - పింగళి సూరన 109

20) వసుచరిత్ర - రామరాజ భూషణుడు 110

21) శ్రీరంగమాహాత్మ్యము - భైరవకవి 111

22) ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధము - బొడ్డుచెర్ల చినతిమ్మయ 111

23) దశరథరాజనందన చరిత్ర - మరింగంటి సింగరాచార్యులు 113

24) శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణము - మరింగంటి సింగరాచార్యులు 114

25) పంచతంత్ర - భానుకవి 115

26) వల్లభాభ్యుదయము - భట్లపెనుమర్తి కోదండరామకవి 116

27) రామరాజీయం - అందుగుల వెంకయ్య 117

28) వైజయంతీ విలాసము - సారంగు తమ్మయ్య 117

29) రాయవాచకం - విశ్వనాథుని స్థానాపతి 118

30) చంద్రభాను చరిత్రము - తరిగొప్పుల మల్లన 118

31) సుదక్షిణా పరిణయము - తెనాలి అన్నయ్య 127

32) ఇందుమతీ పరిణయము - తెనాలి రామభద్రుడు 131

33) బహుళాశ్వచరిత్ర - దామెర్ల వేంగళనాయకుడు 132

34) వాల్మీకి చరిత్రము - రఘునాథ నాయకుడు 133

35) విజయ విలాసము - చేమకూర వేంకటకవి 135

36) కవి చౌడప్ప శతకము - కుందవరపు కవి చౌడప్ప 136

37) భానుమతీ పరిణయము - రేటూరి రంగరాజు 137

38) మూర్తిత్రయోపాఖ్యానం - దంతులూరి బాపకవి 137

39) శుకసప్తతి - పాలవేకరి కదిరీపతి 138

40) కృష్ణరాయ విజయము - కుమార ధూర్జటి 139

41) హంసవింశతి - అయ్యలరాజు నారాయణామాత్యుడు 140

42) క్షేత్రయ్య పదములు - క్షేత్రయ్య 142

43) పరమయోగి విలాసము - సిద్ధిరాజు తిమ్మరాజు 142

44) కకుత్స్థ విజయము - మట్ల అనంతభూపాలుడు 144

45) విష్ణుభజనానందము - బమ్మెర కేశకవి, మల్లకవి 145

46) పంచతంత్రము - రాజనీతి రత్నాకరము 145
- నేబతి కృష్ణమాచార్యులు

47) నారసింహపురాణము - ఉత్తరభాగము - హరిభట్టు 147

48) వామనపురాణము - పొన్నతోట ఓబళకవి 148

49) దశావతారచరిత్రము - ధరణిదేవుల రామయ 149

50) నల్లందిగళ్ వంశము వారి ప్రశంస - అజ్ఞాత కవి 151

51) వైశ్యపురాణము - గురు భాస్కరాచార్యులు 152

52) పరిశీలన 152



**4.2 అంకిత కావ్యములు** **155**

1. ఆముక్తమాల్యద - శ్రీకృష్ణదేవరాయలు 156
2. తత్త్వదీపిక - మారేపల్లి వేంకటయోగి 166
3. సకల నీతి కథా నిధానము - కూచిరాజు ఎర్రన 167
4. శ్రీకృష్ణ కర్ణామృతము - వెలగపూడి వేంగనార్యుడు 172
5. లక్ష్మీవిలాసము - రాయసం వేంకటపతి 173
6. కనకరంజిత శిఖామణి పరిణయము
   - గూళికల్లు వేంకటరమణ కవి 176
7. రాజవాహన విజయము - కాకుమాని మూర్తికవి 178
8. వాణీ విలాస వనమాలిక - టేకుమళ్ళ రంగశాయి 186
9. విష్ణుమాయావిలాసము - ఎర్రగుడిపాటి వేంకటకవి 193
10. శ్రీ వేంకటేశాంధ్రము (నిఘంటువు)
    - గణపవరపు వేంకటకవి 199
11. మధురవాణీ విలాసము - చింతలపల్లి వీరరాఘవ కవి 202
12. పరమభాగవత చరిత్ర - కట్టా వరదరాజు 207
13. శ్రీరంగ మాహాత్మ్యము - కట్టా వరదరాజు 209
14. రామాయణము (ద్విపదకావ్యం) - కట్టా వరదరాజు 211
15. శేషశైల విహారశతకం - పుష్పగిరి తిమ్మన 213
16. రాఘవ యాదవ పాండవీయము
    - ఎలకూచి బాలసరస్వతి (వేంకటకృష్ణయ్య) 215

17. జయ విజయాభ్యుదయము – రాజవోలు సుబ్బరాయ కవి 216

18. ఆనందకానన మాహాత్మ్యము – లింగమకుంట రామకవి 217

19. ద్రౌపదీ కల్యాణము
– బోయనపల్లి కుమార వేంకటరాయలు 219

20. సకలజన సంజీవనము (శ్రీరామానుజాచార్యుల చరిత్ర)
– సాయపనేని వేంకటాద్రినాయకుడు 221

21. దివ్యదేశమాహాత్మ్యదీపిక (ద్విపదకావ్యం)
– నాడగేడు ముష్టిపలి వేంకటభూపాలుడు 226

22. ఆంధ్ర ప్రయోగ రత్నాకరము – గణపవరపు వేంకటకవి 227

23. వేంకటాచలపతి శతకము – ఉదుమూడి సూరపరాజు 228

24. కరియావుల కాటమరాజు చరిత్రము (పద్యకావ్యం)
– గుర్రంకొండ భక్తవత్సలుడు 229

25. దేశ్యనామార్థ కోశము (నిఘంటువు)
– హయనం కృష్ణయ 230

**4.3.0. శ్రీ వేంకటేశ్వర సాహిత్యము– తాళ్ళపాక కవుల వరివస్య 233**

**4.3.1. తాళ్ళపాకవారి ప్రస్తావన కావ్యములు**

1) సుభద్రా కల్యాణము (మంజరీ ద్విపదకావ్యం)
– తాళ్ళపాక తిమ్మక్క 236

2) అష్టమహిషీ కల్యాణము (ద్విపదకావ్యం)
– తాళ్ళపాక తిరువేంగళనాథుడు 239





3) గురుబాలప్రబోధిక (అమరకోశమునకు) వ్యాఖ్య
– తా॥ తిరువేంగళప్ప 240

4) సుధానిధి (కావ్యప్రకాశకు) వ్యాఖ్య
– తా॥ తిరువేంగళప్ప 240

**4.3.2. తాళ్ళపాకవారి అంకిత కావ్యములు 241**

1) సంకీర్తన లక్షణము – తాళ్ళపాక అన్నమాచార్యులు 241

2) సుదర్శన రగడ – తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు 245

3) రేఫ, ఱకార నిర్ణయము (శ్రీకృష్ణశతకము)
– తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు 248

4) నీతిసీస శతకము – తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు 249

5) అన్నమాచార్యచరిత్రము (ద్విపదకావ్యం)
– తాళ్ళపాక తిరువేంగళనాథుడు (చిన్నన్న) 253

6) పరమయోగి విలాసము (ద్విపదకావ్యం)
– తాళ్ళపాక తిరువేంగళనాథుడు (చిన్నన్న) 260

7) ఆంధ్రామరుకము (అనువాద శతకము) – తా॥తిరువేంగళప్ప 265

8) శకుంతలాపరిణయము – రేవణూరి వేంకటార్యుడు 268

9) లక్ష్మీ వేంకటేశ్వర సీసపద్యశతకము – తా॥ శ్రీనివాసులు 271

**4.3.3. తాళ్ళపాకవారి వేంకటేశ్వరాత్మక కావ్యములు** 271

**1) అన్నమాచార్యుల సంకీర్తనలు 274**

1. అన్నమాచార్యుల శృంగార కీర్తనలు 276

2. అన్నమాచార్యుల అధ్యాత్మ కీర్తనలు 300

3. అన్నమయ్య పదముల ప్రశంసలు 323

4. తోడయ మంగళం 324

5. శృంగారమంజరి 326

6. వేంకటేశ్వర శతకము 329

**2) తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు 332**

7. ఆధ్యాత్మిక సంకీర్తనలు 333

8. శృంగార సంకీర్తనలు 339

9. శృంగార దండకము 345

10. చక్రవాళమంజరి 348

11. శృంగార వృత్త పద్యాల శతకము 350

12. శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము 353

13. శ్రీ వేంకటేశ్వరోదాహరణము 357

14. శ్రీ వేంకటేశ్వర వచనములు 361

**3) తాళ్ళపాక చిన తిరుమలాచార్యులు 367**

15. అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు 368

16. అష్టభాషా దండకము 371

**4) రేవణూరి వేంకటార్యుడు 372**

17. శ్రీపాదరేణు ప్రభావము 373





**4.3.4. శ్రీ వేంకటేశ్వర సాహిత్యము – పరిశిష్టకావ్యములు 381**

1. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము మొదలగు స్తోత్రములు
– ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి 381

2. సమీక్ష 385

3. సుప్రభాత అనువాదములు (తెలుగు) 394

4. సుప్రభాత అనువాదములు (ఇంగ్లీషు) 431

5. సచిత్ర వేంకటేశ సుప్రభాతములు 447

6. జానపద గేయాలలో సుప్రభాతం 451

7. తిరుప్పళ్ళి యెళుచ్చి – ప్రాబోధకీ స్తుతి 452

8. అన్నమయ్య మేలుకొలుపు సంకీర్తనలు 459

9. శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము 465

శ్రీలతకుం బ్రాఁకయి వృష
శైలంబున వెలసి తనదు చాయకెలయు ధ
న్యాళి దగమాన్చి కోర్కులు
చాలంగా నొసఁగు కల్పసాలము గొలుతున్.
– చిన్నయసూరి.

**శ్రీ వేంకటేశ్వర సాహిత్య సర్వస్వము**
**నాల్గవ సంపుటం**
**క్రీ.శ.14-17 శతాబ్దాలు**

# ప్రాచీనాంధ్ర సాహిత్యంలో శ్రీ వేంకటేశ్వరప్రశస్తి

## ప్రవేశిక

ఆంధ్రసాహిత్యములో ఆంధ్రుల ఇష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రశస్తి, ప్రస్తావనలు ఎప్పటినుండి కనిపించుచున్నవి? ఆంధ్రుల ఇష్టదైవమగు శ్రీవేంకటేశ్వరుని ఆంధ్రజనులు, ఆంధ్రకవులు ఏ కాలము నుండి తమ భాషలో కీర్తించుటకు మొదలుపెట్టి యుందురు? అను ప్రశ్నలకు సమాధానము విచారణీయము.

ఆంధ్రసాహిత్యము క్రీ.శ.11 శతాబ్దములో నన్నయ్యభట్టు రచించిన ఆంధ్రమహాభారతముతో ప్రారంభమైనది. నన్నయభట్టు రాజమహేంద్రవరము రాజధానిగా వేంగి దేశమును పరిపాలించిన తూర్పు చాళుక్యరాజగు రాజరాజనరేంద్రుని ఆస్థానకవి. నన్నయ శ్రీహరి, హర, బ్రహ్మలను ప్రార్థించుచు ఆంధ్రమహాభారతమునకు శ్రీకారము చుట్టినాడు; ఆంధ్ర సాహిత్యమునకు నాంది పలికినాడు. నన్నయభట్టు అర్జునుని తీర్థయాత్రను వర్ణించుసందర్భములో అమూలకమైన వేంగి దేశ ప్రశస్తిని చేసినాడు. ఆ తీర్థయాత్ర వర్ణన ఇట్లున్నది –

**దక్షిణగంగ నాఁ దద్దయు నొప్పిన**
**గోదావరియు జగదాదియైన**
**భీమేశ్వరంబును బెడఁగగుచున్న శ్రీ**
**పర్వతంబును జూచి యుర్విలోన**
**ననఘుమై శిష్టాగ్రహార భూయిష్ఠమై**
**ధరణీసురోత్తమాధ్వర నిధాన**

**పుణ్య సమృద్ధమై పొలుచు వేంగీదేశ**
**విభవంబుఁ జూచుచు విభుఁడు దక్షి**

**ణాంబు రాశి తీరంబున కరిగి దురిత**
**హారియైన కావేరీ మహాసముద్ర**
**సంగమంబున భూసురేశ్వరుల కభిమ**
**తార్థదానంబుఁ జేసి కృతార్థుఁడగుచు ॥**

**- నన్నయ భారతము - ఆదిపర్వం - 8-139.**

నన్నయభట్టు అర్జునుని తీర్థయాత్ర వర్ణనలో శేషాచల పర్వతశ్రేణిలో పుచ్ఛభాగమైన శ్రీశైలమును వర్ణించినాడు. శిరోభాగమైన వేంకటాద్రిని విస్మరించినాడు. ఇట్లు నన్నయ భారత భాగములో వేంకటాచల ప్రసక్తి గాని శ్రీవేంకటేశ్వర స్వామి ప్రశస్తి గాని కనిపించదు.

ఆంధ్రమహాభారతములో విరాటాది పదిహేను పర్వములను రచించి, మహాభారతమును సంపూర్తి గావించిన తిక్కన సోమయాజి (క్రీ.శ.13 శతాబ్దం) తన భారత భాగమును హరిహరనాథునకు అంకితమిచ్చినాడు. వేంకటాచలమునకు అనతిదూరమున నున్న విక్రమసింహపుర (నేటి నెల్లూరు) నివాసియగు తిక్కన సోమయాజి వేంకటాచల ప్రసక్తిగాని, శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రశస్తిగాని చేయలేదు. అందుకు ఆతని ధర్మాద్వైత దృష్టి, ఆనాటి మతసాంఘిక పరిస్థితులు, కథా సందర్భములు అనుకూలించక పోవడం కారణములై యుండును. తిక్కన మహాకవి శివకేశవాభేదరూప మగు హరిహరనాథ తత్త్వమును ప్రతిపాదించినాడు. "విష్ణురూపాయ నమశ్శివాయ యని గొల్చెడు భక్తజనంబు వైదికధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వమునే" సేవించినాడు. తిక్కన సోమయాజికి సమకాలికులు, శిష్యులు అగు కేతన, మారన, మంచనాదులు కూడ ఏ సందర్భముననను వేంకటాచలమును స్మరించలేదు. శ్రీ వేంకటేశ్వరుని ప్రశంసించ లేదు. తిక్కన శిష్యుడైన మారన



సంస్కృత మార్కండేయ పురాణమును తెనింగించినాడు. అందులో వేంకటాచల ప్రసక్తిగాని, శ్రీ వేంకటేశ్వరుని ప్రశస్తిగాని కనిపించదు.

భారత కవిత్రయములో మూడవ వాడగు ఎఱ్ఱాప్రెగ్గడ (క్రీ.శ.14 శతాబ్దం) రచించిన అరణ్యపర్వ శేషములో కూడ వేంకటాచల ప్రసక్తిగాని, శ్రీ వేంకటేశ్వర ప్రశస్తిగాని కనిపించుట లేదు. ఇట్లు ఆంధ్రసాహిత్యములో ఆదికావ్యమైన మహాభారతములో ఏ సందర్భములోగాని శ్రీవేంకటేశ్వరస్వామి ప్రశంసగాని, వేంకటాచలప్రసక్తిగాని కనిపించుట లేదు. ఆంధ్రభారతములో శ్రీవేంకటేశ్వర ప్రశస్తి కనిపించనందున వేంకటాచలమునకుగాని, వేంకటపతికి గాని ఆ కాలమున (క్రీ.శ.11, 12, 13 శతాబ్దములు) ప్రసిద్ధి లేదనుటకు గాని, వేంకటేశ్వరుడు ఆంధ్రుల దైవముగా కవులచే కీర్తింపబడ లేదనుటకు గాని వీలులేదు. ఆద్యంతములు లేని ఆదిదేవునకు ఆంధ్రమహాభారతమును బట్టి యా కాలనిర్ణయము చేయజూచుట, తగు సాహిత్యాధారములు లభించకుండుట మన దురదృష్ట మనవలె.

తిరుమల తిరుపతి దేవస్థానమునకు లభించిన శాసనములలో తమిళ భాషలో వ్రాయబడిన శాసనములు పల్లవుల కాలమునుండి (క్రీ.శ.9 శతాబ్దం) కలవు. కాని తెలుగులో వ్రాయబడిన మొదటి శాసనము విజయనగర రాజుల కాలం నాటిదిగ (క్రీ.శ.14 శతాబ్దం) కనబడుచున్నది. ఈ శాసనం మహామండలేశ్వర మీసరగండ మంగిదేవమహారాజు వేయించినది. ఆ తెలుగు శాసనం ఇట్లున్నది:-

**"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శక వరుషంబులు 1281 అగు నేంటి వికారి సంవత్సర ఆషాఢ శుద్ధ దశమి మందవారాన స్వస్తిశ్రీమన్మహామండలేశ్వర మీసరగండ మంగిదేవ మహారాజులు తిరుమల దేవరకు పటాదినగగు సువర్ణాది శిఖరమును ఎత్తించెను. మంగళమహాశ్రీశ్రీశ్రీ."**

శాసనకాలము క్రీ.శ.6-7-1359. తెలుగుభాషలో తిరుమల దేవరప్రశంస గల లిఖితాధారము ఈ శాసనంగానే కనబడుచున్నది. (తి.తి.దే.శాసన సంపుటం : 1-179 శాసనం).

ఆంధ్రజనులు శ్రీ వేంకటేశ్వరస్వామిని తమ ఇష్టదైవముగా ఎప్పటినుండి భావించిరి? ఆంధ్రకవులు ఎప్పటినుండి శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహమునకు పాత్రులై ఆ స్వామిని కీర్తించి, తమ రచనలను ఆతనికి అంకితమిచ్చి ధన్యులైరి? అను విషయము తెలిసికొనదగియున్నది.

క్రీ.శ. 14 శతాబ్దములో జీవించిన మహాభారత కవిత్రయములో మూడవ వాడయిన ఎఱ్ఱాప్రెగ్గడ తన నృసింహ పురాణమున వేంకటాచలమును పేర్కొనియున్నాడు. ఎఱ్ఱన నృసింహపురాణమును శేషశైలము నుండి శ్రీశైలము వరకు వ్యాపించియున్న తూర్పుకనుమలను పర్వతపంక్తిలో మధ్య భాగమున వెలసియున్న అహోబల నృసింహస్వామికి అంకితమిచ్చినాడు. ఈ నృసింహపురాణము ఆంధ్రసాహిత్యమున మొట్టమొదటి క్షేత్రమాహాత్మ్య కావ్యము.

నృసింహపురాణమున నైమిశారణ్యమునందలి మునులు రోమ హర్షణునితో "ఏ తీర్థము కలియుగమున భూతాభయ దాన చతుర పుణ్యోన్నతి నుద్యోతించు ?" (1-2) నని ప్రశ్నింపగా, అతడు గాలవుడను మహర్షిచేసిన తీర్థయాత్రను వర్ణించినాడు. ఆ వర్ణన ఇట్లున్నది :-

**అర్థి గంగా ద్వార మాడె బుష్కరములు**
**గనియెఁ గురుక్షేత్రమునఁ జరించెఁ**
**గౌశికిఁ గొనియాడెఁ గాశి వసించెఁ బ్ర**
**యాగంబు సొచ్చె గయా వటమున**
**నిలిచె, గంగాపయోనిధి సంగమముఁ జూచె**
**శ్రీ పురుషోత్తమ సేవఁ జేసె**
**సింహాచలంబుపాసించె, గోదావరీ**
**కృత గాహనుండయ్యెఁ గృష్ణవేణిఁ**



**దరిసె <u>శ్రీవేంకటాచల స్థాయి గొలిచె</u>**
**సహ్యజావేణిఁ దోగె తత్సవిధ సీమ**
**సప్త సాలాంతరశయాను సరసిజాక్షు**
**రంగనాథుని నెఱిగె శుభాంగుఁడగుచు ॥ (1-11)**

ఆ గాలవమహర్షి గంగాద్వారము, కాశి, ప్రయాగాది క్షేత్రములను దర్శించిన పిదప ఆంధ్రదేశమున సింహాచలము, గోదావరి, కృష్ణవేణి పుణ్యతీర్థములను సేవించి శ్రీవేంకటాచల స్థాయి యగు వేంకటేశ్వరుని సేవించినాడు. అనంతరం గాలవమహర్షి శ్రీరంగనాథుని సేవించి, చివరకు అహోబల నృసింహక్షేత్రమును దర్శించినాడు.

ఎఱ్ఱన గాలవమహర్షి తీర్థయాత్రను వర్ణించుచు "వేంకటాచల స్థాయి గొలిచె" నని చెప్పుటచే వేంకటాచల క్షేత్రమున వెలసియున్న వేంకటవిభుని కొలిచెనని చెప్పినట్లయినది. అయితే వేంకటేశ్వరస్వామి వర్ణన విశేషముగా చేయలేదు. అయినను పుణ్యక్షేత్రముగా వేంకటాచలమును, తదధిపతియైన వేంకటేశ్వరుని పేర్కొనిన ఆంధ్రకవులలో శంభుదాసుడగు ఎఱ్ఱాప్రెగ్గడ మొదటివాడని, ఆతని నృసింహపురాణము మొదటి కావ్యమని నిర్ణయించ వలసియున్నది. ఇట్లు క్రీ.శ. 14 శతాబ్దమునుండి ఆంధ్రసాహిత్యమున వేంకటాచల ప్రసక్తి, ఆ క్షేత్ర దైవమగు వేంకటేశ్వరుని ప్రశంస కనిపించు చున్నవి.

క్రీ.శ. 15 శతాబ్దములో తాళ్ళపాక అన్నమాచార్యులు (1408-1503) శ్రీ వేంకటేశ్వరస్వామి మాహాత్మ్యమును కీర్తించి, స్వామికి అంకితముగా రచనలు చేసి శ్రీవేంకటేశ్వరాంధ్ర సాహిత్యమునకు నాంది పలికినాడు. ఆనాటి నుండి నేటివరకు తెలుగు కవులు అనేకులు శ్రీవేంకటేశ్వరస్వామి మాహాత్మ్యమును వివిధ సాహిత్య ప్రక్రియలలో వర్ణించి, తమకావ్యములను స్వామికి అంకితమిచ్చి వేంకటేశ్వరాంధ్ర సాహిత్యమును సుసంపన్నము చేసినారు; చేయుచున్నారు. ఇక ప్రాచీనాంధ్ర సాహిత్యములో (క్రీ.శ. 14-17 శతాబ్దములు) గల శ్రీవేంకటేశ్వర ప్రశస్తి ప్రస్తావనలు పరిశీలింపబడుచున్నవి.

## 1. ఇతిహాసములు

ఇతిహాస పదమునకు ఇతి–హ–అస్మిన్ అస్తీతి ఇతిహాసః అని వ్యుత్పత్తి. ఇది ఇట్లు జరిగినదని వర్ణింపబడిన ఇతివృత్తము గల గ్రంథము ఇతిహాసము.

**ధర్మార్థ కామ మోక్షాణాం**
**ఉపదేశ సమన్వితమ్,**
**పురావృత్తం కథాయుక్తం**
**ఇతిహాసం ప్రచక్షతే.**

ధర్మార్థ కామమోక్షములను ఉపదేశించుచు పూర్వరాజుల కథలను వర్ణించు గ్రంథము ఇతిహాసము. రాజశేఖరుడు (9 శతాబ్దం) కావ్య మీమాంసలో ఇతిహాస భేదములను ఇట్లు వివరించారు.

**పరక్రియా పురాకల్ప ఇతిహాసగతిః ద్విధా**
**స్యాదేక నాయకా పూర్వా ద్వితీయా బహునాయకాః**
**తత్ర రామాయణం భారతం చోదాహరణే**

ఇతిహాసము పరక్రియ, పురాకల్పము అని రెండు విధములు. పరక్రియ యందు ఒక్కడే నాయకుడు. పురాకల్పమున బహునాయకులు ఉందురు. రామాయణము పరక్రియ ఇతిహాసమునకు, భారతము పురాకల్ప ఇతిహాసమునకు ఉదాహరణములు. ఇతిహాసంలో చారిత్రాత్మక ఇతివృత్తం ప్రధానంగా ఉంటుంది. పురాణము, ఇతివృత్తము, ఆఖ్యాయిక ఉదాహరణము, ధర్మశాస్త్రము లన్నియు గలది ఇతిహాసమని కౌటిల్యుని వచనము.

**రామాయణము :-**

వాల్మీకి మహర్షిచే రామాయణము త్రేతాయుగమున రచింపబడింది. "కలౌ వేంకటనాయకః" అను ప్రసిద్ధిని బట్టి కలియుగావతారమైన శ్రీ వేంకటేశ్వరుని ప్రశస్తి ప్రాచీనమైన రామాయణమున కనిపించుటకు అవకాశము లేదు. వాల్మీకి రామాయణమున వేంకటాచలప్రసక్తి కనిపించ



కున్నను కంబరామాయణమున (క్రీ.శ.12 శతాబ్దం) వేంకటాచల వైభవ వర్ణన చేయబడింది.

తమిళ సాహిత్యములో కవిచక్రవర్తి బిరుదాంకితుడైన కంబమహాకవి ప్రథిత యశస్కుడు. ఇతడు మూడవ కులోత్తుంగచోళుని (క్రీ.శ.1170–1216) ఆస్థానకవి. విద్యాధికారి. కంబమహాకవి వాల్మీకి రామాయణమును రామావతారము అను పేరుతో తమిళభాషలో రచించినాడు. వాల్మీకి రామాయణమును అనుసరించి రచన సాగించినను కంబకవి రామాయణంలో మూలమున లేని కథాంశములు, వర్ణనలు, మార్పులు ఎన్నో ఉన్నవి. ఆ కోవకు చెందిన వాటిలో వేంకటాచల వర్ణన ఒకటి. ఇరవైనాలుగు వేల శ్లోకముల రామకథను కంబమహాకవి 10,569 వృత్తములలో విస్తరించి, రచించినాడు. దేశభాషలందు వెలసిన రామాయణములలో మొట్టమొదటిది కంబరామాయణం. అభినవ పోతన, సాహిత్య రత్నాకర బిరుదములు గల పూతలపట్టు శ్రీరాములురెడ్డి (1892–1971) కంబ రామాయణమును తెలుగున అనువదించాడు. ఆదిపూడి సోమనాథరావు (1867–1941) కూడ కంబరామాయణమును తెనిగించినాడు. కంబకవి జీవిత చరిత్రను తెలుగున తి.సు.మురుగేశం పిళ్లై రచించినాడు.

కంబరామాయణమున కిష్కింధకాండమున అన్వేషణ పటలమున సుగ్రీవుడు సీతను వెదకుటకై దక్షిణ దిశకు వెళ్ళుచున్న వానరసేనకు చూడవలసిన ప్రదేశములను వివరించు సందర్భమున వేంకటాచల ప్రస్తావన, వర్ణన కలదు.[1] కాని శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రశస్తి వర్ణన లేదు. కంబ మహాకవి వేంకటాచలమును ఇట్లు వర్ణించినాడు (నాడవిట్ట పటలం.26–28 వృత్తములు).

1. కంబరామాయణము. కిష్కింధకాండము (10) అన్వేషణ ప్రేషణ పటలము – పూతలపట్టు శ్రీరాములురెడ్డి, ప్రథమ సంపుటము, ప్రగతి ప్రచురణలు, హైదరాబాదు–500004, 1968.

సీ. ఉత్తర భాష యౌ నురు సంస్కృతమునకు
దక్షిణ భాషయౌ ద్రావిడ మున
కెల్లగాఁ గలదియు నెల్ల వేదాంతముల్
వివరించు తత్త్వంబు వెలయునదియు
మేటి ధర్మములకు మేర యౌనదియు న
సామాన్యమగుట యశశ్శరీర
మట్లు ప్రకాశించునది మహర్షులకు మ
హత్త్వములకు స్థానమైన నగము

వేంకటాచలమను పేర వెలయు చుండు
దొందముల ద్రోచి సమసుఖదుఃఖులైన
తత్త్వవేత్తలు జ్ఞానాగ్ని దగ్ధ కర్ము
లైన తపసులా శైలంబు నందు గలరు.

సీ. సర్వపాపఘ్నముల్ స్నాన తీర్థంబులు
మౌని ప్రశాంతాశ్రమ స్థలములు
రత్న పుంజములతో రాజిల్లు చరియలు
వేల్పుబోటుల గాన విధము వినుచు
సారంగపోతముల్ శార్దూల శాబముల్
ద్వేషంబు మాని నిద్రించు చోట్లు
కాంచు వారలకు నాకలియుఁ గన్పింపదు
విసుగు పుట్టదు మోదమెసఁగుచుండు

గిరిని దర్శింపఁ గల్మష గిరు లడంగు
డాసినన్ ముక్తి తప్పక దక్కుచుంట
మనకుఁ గార్య భంగంబగుఁ గనుక నచట
దూరమున నుండి ప్రణుతించి తొలఁగుడీరు.

– కంబరామాయణము, కిష్కింధాకాండము
పుట : **475 (1968)**



వేంకటాచలమను పేరు గల పర్వతముఉత్తర దేశ భాష యగు సంస్కృతమునకు (ఆంధ్రభాషకు) దక్షిణ దేశ భాషయగు ద్రావిడమునకు (తమిళభాషకు) సరిహద్దుగా ఉంది. ఆ పర్వతముపై వేదవేదాంతములు వివరించిన పరతత్త్వము (వేంకటేశ్వరుడు) వెలసియున్నది. అది ఉత్తమ ధర్మములకు స్థానము. వేంకటాద్రి అసామాన్యమగు పర్వత మగుటచే యశశ్శరీరము వలె ప్రకాశించు చుండును. అది మహర్షులకు, మహిమలకు నిలయమైన పర్వతము. ద్వంద్వములను ద్రోసివైచి సుఖదుఃఖములందు సమభావముగల తత్త్వవేత్తలు, జ్ఞానాగ్నిచే కర్మలను దహించుకొనిన తాపసులు ఆ పర్వతంపై నివసించి యున్నారు.

వేంకటాద్రి యందలి పుణ్యతీర్థములు సర్వపాపములను పోగొట్టగల మహిమ గలవి. ఆ పర్వతము మునులయొక్క ప్రశాంతమైన ఆశ్రమములకు నిలయము. ఆ కొండచరియలు రత్నములతో ప్రకాశించుచున్నవి. దేవతాస్త్రీల పాటలు వినుచు జింకపిల్లలు, పులిపిల్లలు సహజవైరమును విడిచిపెట్టి నిద్రించుచోట్లు చూపరులకు ఆకలి తెలియనీయక, విసుగు పుట్టించక సంతోషమును గల్గించుచుండును. వేంకటాద్రిని చూచిన వారి పాప పర్వతములు నశించును. ఆ పర్వతమును సమీపించినచో తప్పక ముక్తి గలుగును. దానిచే మనకు కార్యభంగము గలుగును. గనుక వేంకటాద్రిని సమీపించక దూరము నుండి నమస్కరించి, స్తుతించి వెళ్ళండి" అని సుగ్రీవుడు దక్షిణ దిక్కున సీతను వెదకుటకు వెళ్ళుచున్న అంగద హనుమదాదులకు చెప్పినాడు. వాల్మీకి రామాయణములో కిష్కింధాకాండము 41 సర్గలో దక్షిణ దిక్కున వున్న ప్రదేశములను సుగ్రీవుడు వర్ణించి చెప్పిన సందర్భములో వేంకటాచల వర్ణన లేదు. కంబకవి వేంకటాచలమును, అందు వెలసి యున్న పరతత్త్వమును స్తుతించుటకు, అమూలకమైన వర్ణన చేయుటకు భగవద్రామానుజాచార్యుల (క్రీ.శ. 1017–1137) ప్రభావము, కంబని వైష్ణవ భక్తి కారణములుగ ఉన్నవి.

**భారతము :-**

భారతము వ్యాసమహర్షిచే ద్వాపరయుగాంతములో రచింపబడిన ఇతిహాసము. శ్రీ వేంకటేశ్వరావతారము కలియుగ ప్రారంభములో జరిగింది. కనుక కలియుగదైవమైన శ్రీ వేంకటేశ్వరుని ప్రశస్తి వ్యాసభారతములో కనిపించుటకు అవకాశము లేదు. వ్యాసభారతమునకు అనువాదమైన కవిత్రయ భారతములో కూడ వేంకటేశ్వర ప్రశస్తి, ప్రస్తావనలు కనిపించవు. కాని పిల్లలమఱ్ఱి పినవీరభద్ర కవి (క్రీ.శ.15 శతాబ్దం) రచించిన జైమినీ భారతమున శ్రీవేంకటాద్రినాథుని ప్రస్తావన కనిపించుచున్నది.

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు నెల్లూరు మండలము లోని బిట్రగుంటకు సమీపమున నున్న సోమరాజుపల్లె నివాసి. ఈతని తల్లి నాగమాంబ. తండ్రి గాదయామాత్యుడు. గురువు భారతీ తీర్థులు. గురువు అనుగ్రహమున తనకు కవిత్వ మలవడె నని చెప్పుకొన్నాడు. పినవీరభద్రుడు జైమినీ భారతము, శకుంతలా పరిణయము, నవరస దర్పణము, నారదీయము, మాఘ మాహాత్మ్యము, మానసోల్లాసము మొదలగు గ్రంథములను రచించినాడు. కాని లభించినవి జైమినీభారతము, శకుంతలా పరిణయములు మాత్రమే.

పినవీరభద్రుడు సంస్కృతమునుండి జైమినీ భారతమును ఆంధ్రీకరించి నాడు. భారతమందలి అశ్వమేధపర్వ కథయే ఇందలి ఇతివృత్తము. ఇందులో శ్రీకృష్ణుని మహిమ విశేషముగా వర్ణింపబడింది. జైమినీ భారతము ఎనిమిది ఆశ్వాసముల గ్రంథము.

పినవీరభద్రుడు విజయనగర సామ్రాజ్య చక్రవర్తియగు సాళువ నరసింహరాయల (1487-1490) ఆస్థానకవి. నరసింహరాయలు తాళ్ళపాక అన్నమాచార్యులకు మిత్రుడు. అన్నమయ్యను ఆదరించిన ప్రభువు. సాళువ నరసింహరాయలకు "ధరణీవరాహ" మను బిరుదమున్నది. పినవీరభద్రుడు జైమినీ భారతమును సాళువ నరసింహరాయలకు అంకితమిచ్చినాడు. ఇతడు తన కృతిపతిని



**<u>శ్రీవేంకటాద్రినాథ ద</u>**
**<u>యావర్ధిత రాజ్య</u> సన్నుతార్థి జన మహీ**
**దేవాగ <u>వైరి</u> నృపరా**
**జీవ నికర చంద్ర నారసింహ నరేంద్రా! -5-1.**

అని సంబోధించినాడు. సాళువ నరసింహరాయలు మొదట కడప మండలములోని టంగుటూరుకు ప్రభువు. తర్వాత చంద్రగిరి, పెనుగొండ రాజ్యములకు అధిపతియై, పిమ్మట విజయనగర సామ్రాజ్యానికి చక్రవర్తి అయినాడు. ఈ వరం పరాభివృద్ధి సాళువ నరసింహరాయలకు ఇష్టదైవమైన వేంకటాచలపతి అనుగ్రహముచే లభించింది. ఈ విషయాన్ని పినవీరభద్రకవి శ్రీవేంకటేశ్వరస్వామి దయచేత అభివృద్ధి పొందిన రాజ్యము గలవాడా! అని సాళువ నరసింహరాయలను సంబోధించినాడు. పినవీరభద్రకవి జైమినీ భారత కృత్యాది ప్రశంసలో నరసరాయల ఇష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరుని ప్రశంస చేయలేదు. ఈ సాళువ నరసింహరాయల మూలముననే తర్వాతి విజయనగర రాజులలో శ్రీ వేంకటేశ్వర సేవాసక్తి ప్రబలి ప్రవర్ధమానమైనది. శ్రీకృష్ణదేవరాయల కాలములో (క్రీ.శ.1509-1530) శ్రీ వేంకటేశ్వరస్వామి దేశప్రసిద్ధుడైనాడు.

**శిలప్పదికారము (అందియ కత)**

శిలప్పదికారం క్రీ.శ.రెండవ శతాబ్దానికి చెందిన తమిళ ఇతిహాసము. ఇల్లంగో అడిగళ్ అను జైన సన్యాసి రచించిన ఈ మహాకావ్యంలో సతీదేవి అని ప్రజలు కీర్తించిన కోవలన్ ధర్మపత్ని కణ్ణకి అను పతివ్రత దివ్యచరిత్ర వర్ణించబడింది. ఈ కణ్ణకి కథ ప్రాచీన తమిళుల జాతీయగాథ. కణ్ణకి - సతీదేవి ఆలయాలు తమిళనాడంతట ఉన్నాయి. ప్రధాన దేవాలయం మధురై నగరంలో ఉంది.

ఇల్లంగో అడిగళ్ (పూజ్యపాదులు) చేరరాజగు శెంగుత్తవాన్ (క్రీ.శ. 140-192) కు సోదరుడు, క్రీ.శ.రెండవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలోని

కావేరీ పూం పట్టణం (చోళరాజుల రాజధాని), మధురై (పాండ్యుల రాజధాని), వంజినగరం (చేర రాజుల రాజధాని) అను మూడు నగరాలలో కణ్ణకి కథ జరిగింది. శిలప్పదికారంలో మూడు కాండలు, ముప్పది అధ్యాయాలు, 1652 పద్యములు ఉన్నాయి. ఇల్లంగో అడిగళ్ సమకాలీన సాంఘిక జీవితాన్ని సాంస్కృతిక విశేషాలను వర్ణించినారు.

మధురైకాండలోని కాద్‌కణ్‌కతైలో పడమటి కనుమలలోని మాంగాడు నివాసి యగు బ్రాహ్మణుడొకడు తిరుమలయాత్ర చేసివచ్చి, తాను దర్శించిన తిరువేంగడ ముడైయాన్ (వేంకటేశ్వరుని) గురించి కథానాయకుడైన కోవలన్‌కు చెప్పుతాడు. ఈ శిలప్పదికారమును పూతలపట్టు శ్రీరాములురెడ్డి 'అందియ కత' అను పేరుతో మంజరీ ద్విపదకావ్యంగా అనువదించాడు. ఇందులో తిరువేంగడ ముడైయాన్ వర్ణన ఇట్లున్నది :-

**వృషభాచలమ్మున నిరుపక్కియలను**
**చంద్రసూర్యు లలరు స్థలమున మెరుపు**
**వలువగా నింద్రచాపము ధరియించి**
**నిలచిన కారు మొగులు వలె నొప్పి**
**శంఖ చక్రములు హస్తమున ధరించి**
**యురమున గౌస్తుభం బొప్పుగా వెలుగఁ**
**గనకచేలముతోడఁ గమలనేత్రుండు**
**నేత్రపర్వంబుగా నిలిచిన తీరు.**

**- పంక్తులు; 38-45. పుట:101**

అందియకత (2) మధురాకాండము (11) అటవీదర్శనము.

ఈ వర్ణన వలన తిరువేంగడముడైయాన్ (వేంకటాద్రినాథుడు) శంఖ చక్రములను, కౌస్తుభమును, పీతాంబరమును ధరించియున్న, పూలమాలలచే అలంకరింపబడి ఇంద్రధనుస్సును హారంగా ధరించి ప్రకాశిస్తున్న నీలమేఘము వలె నున్న దేవుని విగ్రహము పుండరీకాక్షుడని - విష్ణుదేవుడని (శెంగణ్ నెడియోన్) స్పష్టమగుచున్నది.



## 2. పురాణములు

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ,**
**వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్ ॥**

**- వాయుపురాణము, 3-10**

సర్గము (ఆదిసృష్టి) ప్రతిసర్గము (కల్పాదులందు జరుగు పునఃసృష్టి) వంశము (దేవతల, మహర్షుల గోత్రాను క్రమము) మన్వంతరము (మనువుల జన్మము, వారి పరిపాలన) వంశానుచరితము (సూర్య, చంద్ర వంశమున జన్మించిన రాజుల చరిత్ర) అను అయిదు లక్షణములు గలది పురాణము. వంశానుచరిత స్థానమున 'భూమ్యాది సంస్థానం' అను పాఠాంతరం గలదు. ఇందు భౌగోళిక స్థితిగతులు వర్ణించబడును. శ్రుతి, స్మృతులందు కనిపించని ధర్మాది సర్వవిషయములను పురాణములు బోధించును. పురాణములు సర్గప్రతిసర్గాది మహావిషయములను మిత్రసమ్మితములుగా బోధిస్తూ చతుర్వర్గఫలముల నొసంగుచున్నవి. భారతీయ సంస్కృతికి మూలకందమైన వేద ధర్మములను లోకములో సుప్రతిష్ఠితము చేస్తున్నవి. నారదీయ పురాణము "వేదాః ప్రతిష్ఠితాః సర్వే పురాణేష్వేవ సర్వదా" (2-24-18) - వేదములు పురాణములచే సుప్రతిష్ఠితములని వెల్లడించింది. పరమ ధర్మ ప్రతిపాదనములో, ధర్మాధర్మ నిర్ణయములో వేదముల కొసంగిన ఉన్నత స్థానమును, ప్రమాణ గౌరవములను భారతీయులు పురాణముల కొసంగి గౌరవించారు.

ప్రాచీన గాథలను వర్ణించు గ్రంథములను పురాణములని శతపథ బ్రాహ్మణము పేర్కొన్నది. "పురా భవతి పురాణమ్", "పురాఽపి నవం భవతి పురాణమ్" అను వ్యుత్పత్తులు పురాణములు వర్ణించే విషయములు ప్రాచీనము లైనను, నిత్యనూతనములుగా నుండు నని పురాణ వస్తు స్వభావమును తెలియజేస్తున్నది. పురాణము నందలి ఈ నవ్యతయే వానికి

ఉత్తమ సాహిత్య గౌరవమును గల్గించుచున్నది. పురాణములందు దైవ, తీర్థ, క్షేత్ర మాహాత్మ్యములు, దాన, వ్రత, భక్తి యోగాది విషయములతో పాటు వివిధ శాస్త్ర విషయములు గూడ చేర్చబడి, అవి భారతీయ విజ్ఞాన సర్వస్వములుగా తీర్చిదిద్దబడినవి. పురాణములు మత ప్రచారమునకు ఉత్తమ సాధనములుగా గుర్తింపబడినవి. శైవ వైష్ణవాది మత ప్రచారకులు తమ మతములకు అనాదిత్వ గౌరవమును ఆపాదించుకొనుటకు వేదప్రామాణ్యము, వేద తుల్యత్వము సిద్ధింపజేసి కొనుటకు ప్రత్యేక పురాణములనే రచించినారు. కాలక్రమమున అష్టాదశమహా పురాణములకు తోడుగ అష్టాదశ ఉపపురాణములు రచింపబడినవి. (ఉపపురాణముల సంఖ్య అధికముగా గలదు) క్రీ.శ. 6 వ శతాబ్దమునకు పూర్వమే మహాపురాణములు (18) వెలసినవి. క్రీ.శ.7-13 శతాబ్దముల మధ్య ఉపపురాణములు వెలసినవి. ఇట్లు సంస్కృతమున వెలసిన పురాణ వాఙ్మయము క్రమముగా ప్రాంతీయ భాషలందు అనువదింపబడినది.

కుమారిలభట్టు తన తంత్ర వార్తికమున పురాణ ప్రశంస చేయుచు, అవి పురుషార్థసాధనోపయోగములని తెలియజేసినాడు. పురాణములు లోకములో ధర్మాసక్తిని, ఆస్తిక్యబుద్ధిని పోషించుచున్నవి. పురాణములందు సర్వ విధచిత్తవృత్తులకు ఆనందమును కలిగించెడి కథలు పెక్కులు గలవు. అందుచేతనే పురాణములు ఉత్తమ సాహిత్యగౌరవమును పొంది, కావ్యనాటకాది వివిధ సాహిత్య ప్రక్రియలకు వస్తుదానమును, అర్థదానమును ప్రసాదించుచున్నవి. దేవీభాగవతము అష్టాదశ మహాపురాణములను ఇట్లు సూత్రప్రాయ మైన శ్లోకమున చెప్పినది.

**మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్**
**అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్. -3-2.**



**అష్టాదశ మహాపురాణములు**

1. మత్స్యపురాణము
2. మార్కండేయ పురాణము
3. భవిష్య పురాణము
4. భాగవత పురాణము
5. బ్రహ్మ పురాణము
6. బ్రహ్మాండ పురాణము
7. బ్రహ్మ వైవర్త పురాణము
8. వరాహ పురాణము
9. వామన పురాణము

10) వాయు పురాణము
11) విష్ణు పురాణము
12) అగ్ని పురాణము
13) నారదీయ పురాణము
14) పద్మ పురాణము
15) లింగ పురాణము
16) గరుడ పురాణము
17) కూర్మ పురాణము
18) స్కాంద పురాణము

ఈ అష్టాదశ మహా పురాణములలోని ఎనిమిది మహాపురాణములలో, మూడు ఉపపురాణములలో, భారతమునకు శేష భాగమైన హరివంశములో వేంకటాద్రి క్షేత్ర, తీర్థ, దైవతముల మాహాత్మ్యములను వర్ణించిన అధ్యాయములు గలవు. అవి ఇట్లున్నవి:-

| | పురాణము | అధ్యాయాలు | అధ్యాయాల సంఖ్య |
|---|---|---|---|
| 1. | వరాహ పురాణము ప్రథమ భాగం | 33-62 | 30 |
| 2. | పద్మ పురాణము | 24-34 | 11 |
| 3. | గరుడ పురాణము | 63 | 1 |
| 4. | బ్రహ్మాండ పురాణము | 1-12 | 12 |
| 5. | మార్కండేయ పురాణము | 1-5 | 5 |
| 6. | వామన పురాణము | 20-44 | 25 |
| 7. | బ్రహ్మ పురాణము | 1-10 | 10 |
| 8. | స్కంద పురాణము - వైష్ణవ ఖండము | 1-40 | 40 |

**ఉపపురాణాలు**

| | | | |
|---|---|---|---|
| 9. | బ్రహ్మోత్తర ఖండము | 50-51 | 2 |
| 10. | ఆదిత్య పురాణము | 1-5 | 5 |
| 11. | భవిష్యోత్తర పురాణము | 1-14 | 14 |
| | అందలి రహస్యాధ్యాయము | 80 | 1 |
| 12. | హరివంశ గత శేషధర్మము | 48 | 1 |
| | | మొత్తం అధ్యాయములు | 157 |

హరివంశము భారతమునకు ఖిలము. ఖిలమనగా పరిశిష్ట గ్రంథము. కనుక హరివంశము రచించక పోయినచో మహాభారత రచన సంపూర్ణము కాదు. ఈ కారణం చేతనే ఎఱ్ఱాప్రెగ్గడ అరణ్యపర్వ శేషముతో పాటు హరివంశమును కూడ రచించి మహాభారతమును సంపూర్ణము చేసినాడు. "ఆదిపర్వము మొదలు స్వర్గారోహణ పర్వము వరకు గల గ్రంథము భారత మనియు, హరివంశముతో కలిసిన గ్రంథమును మహాభారతమనియు అందురు" అని వేలూరి శివరామశాస్త్రి హరివంశ పీఠికలో (21పుట) వివరించినాడు. నన్నయభట్టు పర్వానుక్రమణికలో హరివంశమును భారతమున గల శతపర్వములలో ఒక పర్వముగా పేర్కొన్నాడు.

క్రీ.శ. 15 శతాబ్దములో పసిండి వేంకటత్తు రైవర్ (జీయరు రామాను జయర్) అను తిరుమల శ్రీ వేంకటేశ్వరుని అర్చకస్వామి పై పంద్రెండు పురాణములలో గల వేంకటాద్రి క్షేత్ర తీర్థ దైవతముల మహిమలను, వైభవమును వర్ణించిన 157 అధ్యాయములను సంపాదించి, ఒక గ్రంథముగా సంకలనము చేసి శ్రీ వేంకటాచల మాహాత్మ్యము (తిరువేంకట మాహాత్మ్యము) అని నామకరణము చేసినాడు. అంతేగాక, పసిండి వేంకటత్తురైవర్ వేంకటాద్రి స్థలపురాణమనదగిన శ్రీ వేంకటాచలమాహాత్మ్య గ్రంథమును వేంకటేశ్వర స్వామి సన్నిధిలో దేవతాప్రీతికొరకు నిత్యము 'తిరువోలక్కం' (ఆస్థానము) సమయములో శ్రీవారి సన్నిధిలో పారాయణము చేయుటకు శ్రీభండారమున 2000 నార్పణములు చెల్లించి, ఏర్పాటుచేసి తేది: 27-6-1491 న శాసనం వేయించాడు. (శాసన సంఖ్య : 95, సంపుటం-2, తి.తి.దే. శాసనములు, 1998). స్వయం వ్యక్తమైన శ్రీవేంకటేశ్వర (శ్రీనివాస) అర్చావతారమునకు పౌరాణికమూలమును కల్పించుట కొరకు పసిండి వేంకటత్తురైవర్ శ్రీ వేంకటాచల మాహాత్మ్యమును సంకలనం చేసి యుండును. తత్ప్రచారమునకై నిత్యపారాయణ కార్యక్రమమును ఏర్పాటు చేసినాడు.



పసిండి వేంకటత్తు రైవర్ వేంకటాచలమాహాత్మ్యమునందు ఆ యా పురాణ భాగములుగా పేర్కొని సంకలనం చేసిన అధ్యాయములు ప్రస్తుతం లభించిన మూల పురాణ గ్రంథములలో కనిపించుట లేదు. అయితే ప్రస్తుతం లభించి ప్రచారములో ఉన్న స్కంద మహాపురాణంలో రెండవదగు వైష్ణవ ఖండములో శ్రీ వేంకటాచల మాహాత్మ్యము 40 అధ్యాయములలో 2,476 శ్లోకములలో వర్ణింపబడియున్నది. మహాభారతములో – హరివంశములో – ఆశ్చర్య పర్వములో ఉన్న శేషధర్మములో 48 అధ్యాయములో 57 శ్లోకములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్య కథనము గలదు. పసిండి వేంకటత్తురైవర్ సంకలనము చేసిన పురాణభాగములు గాక ప్రస్తుతం లభించి ప్రచారములో ఉన్న మహాభాగవతము, దశమ స్కంధములో 89 అధ్యాయములో కలియుగంలో శ్రీనివాసావతారమునకు కారణమైన భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన వృత్తాంతము గలదు. మహాభారతములోనే బలరాముని తీర్థయాత్ర వర్ణనలో బలరాముడు వేంకటాద్రిని, వేంకటేశ్వరుని సందర్శించినట్లు దశమ స్కందములో 79 అధ్యాయము 13 శ్లోకములో చెప్పబడింది. భృగుమహర్షి వృత్తాంతము పద్మపురాణములో ఉత్తరఖండములో 60 అధ్యాయములో గలదు.

పసిండి వేంకటత్తురైవరుకు సమకాలికుడయిన తాళ్ళపాక అన్నమాచార్యులు (క్రీ.శ. 1408-1503)

**ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున**
**నవముగా రామాయణము, దివ్యభాష**
**నా వేంకటాద్రి మాహాత్మ్యమంతయును**
**గావించి, రుచుల శృంగారమంజరియు**
**శతకముల్ పదిరెండు సకల భాషలను**
**ప్రతి లేని నానా ప్రబంధముల్ చేసి**

**– అన్నమాచార్య జీవిత చరిత్రము, పుట:49**
**తి.తి.దే. ప్రచురణ, 2001**

సంస్కృత భాషలో వేంకటాద్రి మాహాత్మ్యమును రచించినట్లు అన్నమయ్య మనుమడు చిన్నన్న (చిన తిరువేంగళనాథుడు) "అన్నమాచార్య చరిత్రము" అను ద్విపద కావ్యంలో చెప్పియున్నాడు. అన్నమాచార్యులు రచించిన వేంకటాద్రి మాహాత్మ్యము లభించలేదు. అన్నమాచార్యులు ఒక సంకీర్తనలో భాగవతము, బ్రహ్మాండపురాణము, వామన పురాణములలో వేంకటాద్రి మాహాత్మ్యమునకు సంబంధించిన కథలున్నట్లు తెలిపియున్నాడు.

**శ్రీ వేంకటేశుడు శ్రీపతియు నితడే**
**పావనపు వైకుంఠ పతియును నితడే ॥పల్లవి॥**

**భాగవతములో జెప్పె బలరాము తీర్థయాత్ర**
**నాగమోక్తమైన దైవ మాత డీతడే**
**బాగుగా బ్రహ్మాండ పురాణ పద్ధతి యాతడీతడే**
**యోగమై వామన పురాణోక్త దైవ మీతడే ॥శ్రీవేంక॥**

**వెలయు సప్తఋషులు వెదకి ప్రదక్షిణము**
**లలర జేసిన దేవుడాత డీతడే**
**నెలవై కోనేటి పొంత నిత్యము గుమారస్వామి**
**కలిమి దపము సేసి కన్న దేవు డీతడే ॥ ॥శ్రీవేంక॥**



**యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు**
**తక్కక కొలిచియున్న తత్త్వమీతడే**
**చక్కనారదాదుల సంకీర్తనకు జొక్కి**
**నిక్కిన శ్రీ వేంకటాద్రి నిలయుడు నీతడే ॥ ॥శ్రీవేంక॥**

**– అన్నమయ్య ఆధ్యాత్మిక కీర్తనలు**
**సంపుటం–1 సంకీర్తన 425, 1980.**

శ్రీ భాగవత మహాపురాణంలో బలరాముని తీర్థయాత్రా సందర్భంలో బలరాముడు శ్రీశైలమల్లికార్జునుని దర్శించిన పిమ్మట ద్రవిడ దేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేంకటాద్రిని, వేంకటేశుని దర్శించినట్లు వర్ణించ బడినది. (దశమ స్కంధం, అధ్యా. 79 – శ్లో. 13). బ్రహ్మాండ పురాణములో విష్ణుదేవుని క్రీడాద్రియగు వేంకటమునకు శేషాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, అంజనాద్రి అనుపేర్లు గలుగుటకు కారణములైన వృత్తాంతములు, తొండమాన్ రాజు వృత్తాంతము వర్ణింపబడియున్నవి. సప్తఋషులు భగవంతుని దర్శించుటకై వేంకటాద్రికి వచ్చి నలుదిక్కుల వెదకుచు గిరిప్రదక్షిణము చేసి భగవంతుని దర్శించుట అను వృత్తాంతములు వామన పురాణములో వర్ణింపబడినవి. (25–34 అధ్యాయములు). తారకాసుర వధ వలన గల్గిన బ్రహ్మహత్యాపాతకమును పోగొట్టుకొనుటకై కుమారస్వామి వేంకటాద్రికి వచ్చి, కుమారధార సమీపమున తపస్సుచేయుట, వేంకటేశుడు ప్రత్యక్షమై కుమారస్వామికి కోరిన వరమునిచ్చి, బ్రహ్మహత్యా పాపమును నశింపజేయుట, వామన, మార్కండేయ పురాణములలో వర్ణింపబడినవి.

అన్నమాచార్యులు రచించిన "శ్రీనివాస! జగదేకనాయక! ఆశ్రిత కల్పతరువ" ఇత్యాది సంకీర్తనలోని –

**తొండమాన్ చక్రవర్తిపై సేసిన దయ సేయుమయ్య**
**కురువనంబిగారి మీద నుంచిన కూర్మి నాపై నుంచుమయ్య**

**– తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలు**

సంఖ్య : 6609ఏ:పుట:42 కాగితపు వ్రాతప్రతి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయం, తిరుపతి.

అనే పంక్తులు వేంకటాచల మాహాత్మ్యము లోని కథాంశములను పేర్కొనుచున్నవి.

పై ఉదాహరణములను బట్టి తాళ్ళపాక అన్నమాచార్యులు బ్రహ్మాండ, భాగవత, వరాహ, వామన, మార్కండేయాది పురాణములలోని, వేంకటాచల ఇతిహాసమాలలోని వేంకటాచల క్షేత్ర, తీర్థ, దైవత మాహాత్మ్యములను ప్రకటించు వృత్తాంతములను గ్రహించి, సమన్వయించి, సంస్కృతమున వేంకటాద్రిమాహాత్మ్య కావ్యమును రచించియున్నట్లు నిశ్చయింపవచ్చును. ప్రస్తుతం ప్రచారములో నున్న శ్రీవేంకటాచలమాహాత్మ్య గ్రంథము (సంకలనము) అన్నమాచార్యుని రచనయే యని చెప్పుటకు తగిన సాక్ష్యాధారములు లేవు. ఈ వేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథకర్త పసిండి వేంకటత్తురైవర్ అని నిశ్చయింపవచ్చును. సంస్కృత వేంకటాద్రి మాహాత్మ్య సంకలన గ్రంథకర్త పసిండి వేంకటత్తురైవర్ సమకాలికులై తిరుమలలో నివసించియుండుట, వేంకటేశ్వరునికి సేవచేసియుండుట గుర్తుంచుకోవలసిన వాస్తవాంశములు. సంకలన గ్రంథమునకు పురాణముల మూలముండుటచే పారాయణార్హత గల్గియున్నందున నేటికీ నిలిచినది. అన్నమయ్య గ్రంథము స్వతంత్ర గ్రంథమగుటచే పారాయణ యోగ్యత కోల్పోయి ప్రచారము లేనందున నష్టమైయుండ వచ్చును.

ఈ వేంకటాచల మాహాత్మ్య సంబంధి కథాంశములు శ్రీవేంకటేశ సుప్రభాత, స్తోత్ర, ప్రపత్తి, మంగళాశాసనముల రచయితయగు ప్రతివాది భయంకర అణ్ణన్ కాలము (క్రీ.శ.1361–1453) నాటికే ప్రచారములో నున్నట్లు విశదమగుచున్నది. కంచి నగరమున నివసించుచున్న ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి తన గురువగు అళఘియ మణవాళమహాముని వెంట తిరుమలకు యాత్రగా వచ్చినపుడు, మణవాళ మహాముని ఆజ్ఞాను–



సారము శ్రీవేంకటేశసుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళా శాసనములను రచించినాడు.[1]

**బ్రహ్మాదయ స్సురవరా స్సమహర్షయ స్తే**
**సంత స్సనందన ముఖా స్త్వథ యోగివర్యాః ।**
**ధామాంతికే తవ హి మంగళ వస్తు హస్తాః**
**శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 27**

బ్రహ్మాది దేవతలు, ఋషీశ్వరులు, సనందనుడు మొదలగు యోగీశ్వరులు మంగళకరమగు వస్తువులను చేతబట్టి నీ ఆలయము ఎదుట వేచియున్నారు. శ్రీ వేంకటాచలపతీ! నీకు సుప్రభాతమగు గాక!

ఈ శ్లోక భావము వేంకటాచల మాహాత్మ్య గ్రంథమందలి వరాహపురాణ ప్రథమ భాగములోని 47 అధ్యాయములోని "బ్రహ్మాది దేవతలు భగవన్మందిరమున ప్రవేశించుట అను కథాంశమును సూచించుచున్నది.

**శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీ తటే ।**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥**
**మంగళాశాసనము–12**

శ్రీ వేంకటేశుడు (వేంకటమను పర్వతమునకు అధిపతి. వైకుంఠముపై విరక్తితో స్వామిపుష్కరిణీ తీరమున లక్ష్మీసహితుడై విహరించుచున్నాడు అను ఈ శ్లోకభావము వేంకటాచలమాహాత్మ్యమున పలు పురాణ భాగములలో వర్ణించబడియున్నది.

**మాయావీ పరమానంద స్త్యక్త్వా వైకుంఠ ముత్తమమ్ ।**
**స్వామిపుష్కరిణీ తీరే రమయా సహ మోదతే ॥**
**– హరివంశాంతర్గత శేషధర్మము, 48–15**

1. Souvenior in commemoration 616th birth anniversary of Sri Vadibheekara Mahaguru Anna, pp:13.

మాయావి, ఆనంద స్వరూపుడు అగు శ్రీమన్నారాయణుడు వైకుంఠము వదలిపెట్టి, లక్ష్మీదేవితో స్వామి పుష్కరిణీ తీరమున విహరించుచున్నాడు.

**వైకుంఠాత్పరమో హ్యేష వేంకటాఖ్యో నగోత్తమః ।**
**అత్రైవ నివసామ్యేవ శ్రీభూమి సహితోహ్యాహమ్ ॥**
**– వరాహ పురాణం, 35-12**

ఈ వేకంటాచలము వైకుంఠము కంటె ఉత్తమమైనది. నేను శ్రీ, భూదేవులతో ఇచ్చటనే నివసింతును.

**శ్రీనివాసోఽపి శేషాద్రౌ తతస్స్వామి సరస్తటే ।**
**నివసన్నాత్మనః కుర్వన్ అర్వాచీనాన్ సుఖాత్మనః ॥**
**– పద్మపురాణం, 29-61**

అటుపిమ్మట శ్రీనివాసుడు (వేంకటేశ్వరుడు) శేషాచలముపై, స్వామి పుష్కరిణీ తీరమున చేతనులను సుఖవంతులను చేయుచు నివసించు చుండెను.

**ఆరాధ్యః సర్వదేవానాం మాధవో భక్తవత్సలః ।**
**విహాయ స్వం పరంధామ రమతే రమయా సహ ॥**
**– బ్రహ్మాండపురాణం, 1-20**

సర్వదేవతలకు పూజనీయుడు, భక్తుల యందు వాత్సల్యము గలవాడు అగు శ్రీమన్నారాయణుడు తన వైకుంఠమును వీడి శ్రీదేవితో వేంకటాద్రిపై విహరించుచున్నాడు.

శ్రీ వేంకటాచలమాహాత్మ్యములోని వివిధ పురాణాంతర్గత కథాంశములను సూచించు కథాంశములను వర్ణించు శ్లోకములు శ్రీవేంకటేశ్వరసుప్రభాతమున గలవు.

**పంచాననాబ్జ భవ షణ్ముఖ వాసవాద్యాః**
**త్రైవిక్రమాది చరితం విబుధా స్తువంతి ।**
**భాషాపతిః పఠతి వాసర శుద్ధి మారాత్**
**శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥ 6**



శివుడు, బ్రహ్మ, కుమారస్వామి, ఇంద్రుడు మొదలగు దేవతలు మీ త్రివిక్రమావతారం (వామనావతారం) మున్నగు అవతార లీలలను స్తుతించుచున్నారు. ఈ సమస్త దేవతలు శ్రీమన్నారాయణుని స్తుతించు కథాఘట్టములు వరాహ పురాణము – అధ్యాయం:48, పద్మపురాణం – అధ్యాయం:33, మార్కండేయ పురాణం – అధ్యాయం:4, వామన పురాణం – అధ్యాయం:35 లో గలవు.

**శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి**
**నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్ ।**
**ఆఖ్యాం త్వదీయ వసతే రనిశం వదంతి**
**శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 15**

శ్రీవేంకటాచలపతీ! మీ నివాసమగు ఈ పర్వతమును శ్రీశైలము, శేషాచలము, గరుడాచలము, వేంకటాచలము, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి మొదలగు పేర్లతో పిలుచుచున్నారు. నీకు సుప్రభాతమగు గాక!

శ్రీవేంకటాచల మాహాత్మ్య గ్రంథములో శ్రీమన్నారాయణునికి భూలోకమున నివాసమగు సువర్ణముఖి నదికి సమీపమున నున్న క్రీడాచలము (వేంకటము) నకు వివిధ కారణములచేత, యుగభేదములచేత ఏర్పడిన నామాంతరములు, వాటికి సంబంధించిన ఇతిహాసములు వర్ణింపబడినవి. సుప్రభాత శ్లోకములో వేంకటాద్రికి గల వింశతి (20) నామములలో ముఖ్యమైన సప్తగిరులు స్తుతింపబడినవి.

శ్రీ వేంకటేశ స్తోత్రములో చివర గల

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**
**హరే వేంకటేశ ప్రసీద ప్రసీద**
**ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥ 9**

**అహం దూరతస్తే పదాంభోజ యుగ్మ**
**ప్రణామేచ్ఛయాఽఽగత్య సేవాం కరోమి ।**
**సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం**
**ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ ॥** 10

**అజ్ఞానినా మయా దోషా నశేషాన్ విహితాన్ హరే ।**
**క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే ॥** 11

శ్రీ వేంకటేశ్వరుడు తప్ప వేరు ప్రభువు లేడు. ఎల్లప్పుడు వేంకటేశునే ధ్యానింతును. శ్రీహరీ! వేంకటేశా! అనుగ్రహింపుము. నాకు అభీష్టమును దయచేయుము. శ్రీవేంకటేశా! నీ పాదపద్మములకు నమస్కరింపవలెనను కోరికతో దూరము నుండి వచ్చి మీ సేవ చేయుచున్నాను. వేంకటేశ ప్రభూ! ఈ ఒక్కమారు చేయు నీ సేవచేత నాకు నిత్యము సేవించు ఫలమును అనుగ్రహింపుము. శేషశైలేశా! శ్రీహరీ! అజ్ఞానముచే నేను చేసిన అపరాధముల నన్నింటిని క్షమింపుము. క్షమింపుము.

పై మూడు శ్లోకములను సుప్రభాత కర్త (క్రీ.శ.1361-1453) ప్రతివాదిభయంకర అణ్ణన్ స్వామి వేంకటాచలమాహాత్మ్య గ్రంథములో నున్న మార్కండేయ పురాణ విభాగము (2-19, 20, 21) నుండి శ్లోకములు గ్రహించి వేంకటేశ స్తోత్రములో చేర్చుకొన్నాడు. మార్కండేయ పురాణములో మార్కండేయ మహర్షి వేంకటాచలమునకు యాత్రగా వచ్చి, వేంకటేశుని దర్శించి, స్వామిని స్తుతించిన సందర్భములో ఈ శ్లోకములు (2-16-21) గలవు. వీటన్నింటిని బట్టి వేంకటాచలక్షేత్రమహిమను చాటెడి పౌరాణిక గాథలు, దేశీయగాథలు శ్రీ వేంకటేశ సుప్రభాత రచనకు ముందే (క్రీ.శ.15 శతాబ్దమునకు ముందే) ప్రచారములో నుండెనని స్పష్టమగుచున్నది.

తన కాలానికే ప్రసిద్ధమైయున్న శ్రీవేంకటేశ్వరుని మహిమలను చాటెడి దేశీయ గాథలను తాళ్ళపాక అన్నమాచార్యులు (క్రీ.శ.1408-1503) ఒక సంకీర్తనలో పేర్కొనియున్నాడు.



ఎటువంటి వాడవో నీ మహిమ
లెట్టుదెలియవచ్చును
నిటల లోచనుడు అజుడు తెలియలేరు
నిన్నెట్లు దెలిసేరు మానవులు ॥పల్లవి॥

తిరుమలనంబి తా తాత యన్ననాడె
తెలిసెబో మీ పెద్ద తనములు
కురువనంబి గారి చేతి బంక మట్టి పువ్వులు
కొన్ననాడె తెలిసె మీ భోగము
మరియు ననంతాళువారి చెరువు గట్ట
మన్ను మోయగా దెలిసె మీ నటనలు
గరుడ గంభము కాడ కాసు కొక్క వరమిచ్చి
గడియించ దెలిసె మీ సంపద ॥ఎటు॥

తొండమాం జక్రవర్తికి సంపద
తొలుత నియ్యగా దెలిసె మీ యీవులు
అంద యెరుకువారి కొర్రచేని యెన్ను
లారగించగా దెలిసె మీ రుచులు
వుండి గొల్లల కావిళ్ళ పాలెల్ల
వుచ్చుకోగ దెలిసె మీ నేమములు
దండిగ సంపంగి మాకుల నడిపించ
దైవరాయ తెలిసె మీ విద్యలు ॥ఎటు॥

మును దాసుతిమ్మన్న తుంబురు కొండకు
మోక్షమియ్యగా దెలిసె మీ బుద్ధులు
పనివడి తాళ్ళపాక అన్నయ్య గారి
పదములలో దెలిసె మీ వోజలు
యెనయ శ్రీవేంకటనాథ యలమేల్మంగ
నెద నుంచగా దెలిసె మీ గోప్యము

**వెనుకొని పరుషవారి కెదురు వోయి**
**వెంట రాగా దెలిసె మీ రాజసము ॥ఎటు॥**

**– శేషాచార్యులగారి వ్రాతప్రతి.**
**తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము – పీఠిక**
పుట:23, 24, తి.తి.దే. ప్రచురణ, 2001

భక్తజన వత్సలుడు శ్రీవేంకటేశ్వరుడు తిరుమలనంబిని తాత యని పిలిచిన వృత్తాంతము తిరుమలై ఒళగు (తిరుమల సమయాచారములు), శ్రీ వేంకటాచల ఇతిహాసమాలలో గలదు. తిరుమలనంబి (క్రీ.శ.11 శతాబ్దం) శ్రీరామానుజాచార్యులకు గురువు, మేనమామ. కురవనంబి – కుమ్మరి భీముని కథ –తిరుమలై ఒళగులో, వేంకటాచల ఇతిహాసమాలలో వేంకటాచల మాహాత్మ్య గ్రంథములోని వరాహ పురాణభాగము ద్వితీయ భాగము, 10 అధ్యాయంలోను, భవిష్యోత్తర పురాణ భాగం 14 అధ్యాయంలోను, స్కాంద మహాపురాణం, వైష్ణవ ఖండము శ్రీవేంకటాచల క్షేత్రమాహాత్మ్యములో 10 అధ్యాయములోను గలదు. అనంతాళ్వారు కథ వేంకటాచల ఇతిహాస మాలలో గలదు. ఈ గ్రంథకర్త అనంతాచార్యుడే (1053–1140). తొండమాన్ చక్రవర్తి కథ వరాహపురాణం – భాగం 9, 10 అధ్యాయములలో, బ్రహ్మపురాణం 7 అధ్యాయంలో, బ్రహ్మాండపురాణం 8, 9 అధ్యాయములలో, భవిష్యోత్తర పురాణం 14 అధ్యాయంలో, స్కందపురాణం 9, 10 అధ్యాయములలో గలదు. ఎరుకువాని కథ (వసువను నిషాదుని కథ) వరాహపురాణం–॥ భాగం 9 అధ్యాయంలో, బ్రహ్మపురాణం 8 అధ్యాయంలో, బ్రహ్మాండపురాణం 8 అధ్యాయంలో, స్కందపురాణం 9 అధ్యాయంలో గలదు. గొల్లకావిళ్ళపాల కథ బ్రహ్మాండ పురాణం 8 అధ్యాయంలో వర్ణించబడింది. సంపంగి మాకులు నడచిన కథ వేంకటాచల ఇతిహాసమాల 6 స్తబకంలో గలదు. వేంకటాచలపతి తన తపఃఫలముగా లభించిన అలమేల్మంగను ఎదనుంచుకొని, శ్రీనివాసుడను సార్థక నామధేయము పొందిన కథ పద్మపురాణం 34 అధ్యాయంలో వర్ణించబడింది. మిగిలిన సంఘటనలు – కాసు కొక్క వరమిచ్చుట, దాసు తిమ్మన్న మోక్షం, పరుస వారికి తోడుగా నుండుట – అన్నమాచార్యుల సమకాలమున జరిగినట్లున్నవి. ఇవి వేంకటాచల మాహాత్మ్యమున వర్ణింపబడలేదు. దేశి యక్షగాన నాటక లక్షణములైన కొరవంజి, చిలుక రాయబారములు, పద్మావతీ శ్రీనివాస కల్యాణ కథలో శ్రీనివాసుడు ఎరుకత (కొరవంజి) వేషములో వచ్చి ఎరుక చెప్పడం, పద్మావతి మనోభీష్టమును చిలుక ద్వారా రాయబారమంపి శ్రీనివాసునికి తెలియజేయడం మున్నగు సన్నివేశములలో కనబడుచున్నవి. ఈ దేశి యక్షగాన నాటక లక్షణములు గల సన్నివేశములు వేంకటాచల మాహాత్మ్యము లోని భవిష్యోత్తర పురాణంలోని 8 అధ్యాయంలో, వరాహ పురాణం–॥ భాగం 7 అధ్యాయంలో, స్కాంద పురాణంలో 7 అధ్యాయంలో వర్ణించబడింది.

శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయమును పునర్నిర్మాణము చేయించి తాళ్ళపాక చినతిరుమలాచార్యులు (క్రీ.శ.1485–1550) అన్నమాచార్యుల మనుమడు, పెదతిరుమలాచార్యుల కుమారుడు వేయించిన 22–03–1540 నాటి తెలుగు శాసనములో 'స్కాందపురాణోక్త మైన శ్రీవేంకటేశమాహాత్మ్య' ప్రస్తావన గలదు. (సంపుటం:4, సంఖ్య:144, తి.తి.దే. శాసనములు, 1998)

ఆ శాసన పాఠము ఇట్లున్నది :–

**TIRUPATI DEVASTHANAM INSCRIPTIONS :-**
**Vol.IV Edn:1998 No.144. (No.429-G.T.)**

(On the right door-jamb wall of the entrance of Sri Kalyana Venkatesasvami Temple at Mangapuram village (Near Chandragiri)) 22-03-1540 A.D.

**Text**

1. స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౪౬౩ అగునేటి శార్వరి చైత్రశుద్ధ

2. ౧౫లు చిత్తానక్షత్రమందు శ్రీమద్వేదమార్గ్గప్రతిష్ఠాపనాచార్య శ్రీరామానుజ సి(ం)ద్ధాంత(స్థా)పనాచార్య
3. వేదాంతాచార్య కవితార్కికకేసరి శరణాగతవజ్రపంజరులైన శ్రీతాళ్లపాక పెదతిరుమలయ్యంగారి
4. కొమారుండు శ్రీచిన్నతిరుమలయ్యంగారు స్కందపురాణోక్త మైన శ్రీవేంకటేశమాహాత్మ్య(ము) –
5. లో వికల్యనదీతీరమందు శ్రీరంగమాహాత్మ్యంలోను దశాధ్యాయంలోను దేవళతీర్థతీరమందు
6. తమ (క్లైంకర్యంగాను) సర్వమాన్య అగ్రహారమైన అలమేలుమంగపుర మందు జీర్ణోద్ధారణంగాను
7. శ్రీవేంకటేశ్వరులాను నాచ్చియారును అనంతగరుడవిష్వక్సేనాదు లాను.......... పెరు.
8. మాళ్లను ఆళ్వారులాను వుడైయవరును పూర్వాచార్యులాను అన్నమాచార్యులైన తమ ఆచార్యు
9. లాను తిరుప్రతిష్ఠ చేశి ఆయాళ్వారుల సన్నిధిని ప్రొద్దుగ్రుంకి అప్పుడు నిత్యానుసంధానాలు
10. మోదలైనది అనుసంధించి ఆచార్యపురుషులు జీయ్యరు.... శ్రీవైష్ణవుల ........ ప్రొ.
11. ద్దుగ్రుంక్కిన అప్పుడు ఆరగింపు...... ఫలం చందనకాపు సమ –
12. ర్పించి ఇది తను పుత్రపౌత్రపరంపర ఆచంద్రార్కంగాను శ్రీ..... శ్రీయతిరాజియ్య–
13. ంగారి చాతను వ్రాయించిన శిలాశాసనం (II*) pp.265, 266.

ఇట్లు క్రీ.శ.15 శతాబ్దమునకు పూర్వమే వేంకటేశ్వరుని మహిమలను చాటెడి పురాణ కథలు, దేశీయ గాథలు ప్రచారములో నున్నట్లు నిరూపించిన సాహిత్య, శాసనాధారములు లభించినవి.

* * *

# శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథము

## 1. స్కంద పురాణము

స్కంద పురాణములో (1) మహేశ్వర ఖండం (2) వైష్ణవ ఖండం (3) బ్రహ్మఖండం (4) కాశీఖండం (5) అవంత్య ఖండం (6) నాగర ఖండం (7) ప్రభాస ఖండము అను ఏడు ఖండములు ఉన్నవి. రెండవ ఖండ మగు వైష్ణవ ఖండములోని మొదటి క్షేత్రమాహాత్మ్యమే వేంకటాచల క్షేత్రమాహాత్మ్యము. ఈ వైష్ణవ ఖండములో ఇంకా (2) పురుషోత్తమ (జగన్నాథ) క్షేత్రమాహాత్మ్యం (3) బదరికాశ్రమ మాహాత్మ్యం (4) కార్తికమాస మాహాత్మ్యం (5) మార్గశీర్ష మాహాత్మ్యం (6) భాగవత మాహాత్మ్యము (7) వైశాఖమాస మాహాత్మ్యం (8) అయోధ్యా మాహాత్మ్యం (9) వాసుదేవ మాహాత్మ్యము అను మాహాత్మ్య కథనములు ఉన్నవి.

వేంకటాచల మాహాత్మ్యములో క్షేత్ర, దైవత, తీర్థ మాహాత్మ్యములు నలువది (40) అధ్యాయములలో విస్తృతంగా 2,474 శ్లోకములలో వర్ణించబడినవి. ఇందులో భూవరాహ సంవాదము, పద్మావతీ శ్రీనివాసుల కల్యాణము, వసువు అను వనచరుని వృత్తాంతం, అస్థి తీర్థ మహిమ (వీరశర్మ కథ), స్వామి పుష్కరిణీ మాహాత్మ్యము (కాశ్యపుని కథ), రామకృష్ణ తీర్థము, తిరుమలక్షేత్ర మహిమ, పాపవినాశ తీర్థ మహిమ, ఆకాశ గంగా మాహాత్మ్యము, చక్రతీర్థ మహిమ, జాబాలి తీర్థ మహిమ, తుంబురు తీర్థ మాహాత్మ్యము, కటాహ తీర్థ మహిమ, సువర్ణ ముఖరీ మాహాత్మ్యము, అంజనాదేవి తపస్సు, హనుమంతుని జనన సూచన మొదలగునవి విపులముగా వర్ణింపబడినవి. స్కాంద పురాణము, వైష్ణవ ఖండము లోని వేంకటాచలమాహాత్మ్యములో వేంకటాద్రిని ఎక్కునపుడు పవిత్రమైన ఆ పర్వతాన్ని ఇట్లు ప్రార్థించాలి అని తెలుపబడింది.

**స్వర్ణాచల మహాపుణ్య సర్వదేవ నిషేవిత**
**బ్రహ్మాదయోఽపి యం దేవాః సేవంతే శ్రద్ధయా సహ**
**తం భవంత మహం పద్భ్యా మాక్రమేయం నగోత్తమ**
**క్షమస్వ తదఘం మేఽద్య దయయా పాపచేతసః**
**త్వన్మూర్ధని కృతావాసం మాధవం దర్శయస్వ మే ॥**
**– అధ్యా.19–11–13 శ్లో॥**

నీవు బంగారు పర్వతమవు. గొప్ప పుణ్యమును కలిగించు దానవు. సమస్త దేవతలచే పూజింపబడుదానవు. బ్రహ్మ మొదలగు దేవతలందరు శ్రద్ధతో నిన్ను సేవించుచున్నారు. అట్టి పరమపవిత్రమైన నీపై నేను కాలుపెట్టి ఎక్కబోవుచున్నాను. నా ఆ పాపమును క్షమింపుము. పాపాత్ముడైన నాకు నీ శిఖరముపై నివసించు విష్ణుదేవుని (వేంకటేశ్వరస్వామిని) చూపించుము."

వేంకటాచలక్షేత్ర వైభవాన్ని ప్రకటించుచున్న ప్రసిద్ధ శ్లోకము స్కంద పురాణం – వైష్ణవ ఖండములోని వేంకటాచల మాహాత్మ్యము లోనిదే.

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥ 38–71**

బ్రహ్మాండములో వేంకటాద్రికి సమానమైన స్థానము లేదు. వేంకటేశునికి సమానమైన దైవము లేదు. ఇకముందు ఉండబోదు.

"ఓం నమః శ్రీవరాహాయ, ధరణ్యుద్ధరణాయ చ" (భూమిని ఉద్ధరించిన శ్రీవరాహస్వామికి నమస్కారము) అను మంత్రమును వరాహస్వామి భూదేవికి చెప్పినాడు. ఈ మంత్రమును నూట ఎనిమిది పర్యాయములు జపించవలెను. అట్లు జపించినచో సర్వసిద్ధులు ప్రాప్తించును. వరాహస్వామి అనుగ్రహముచే భూమి, గృహము లభించును. సకల సంపదలు గలుగును. మోక్షమును పొందగోరినవారు ఈ మంత్రమును సద్గురువు నుండి ఉపదేశమును పొంది నాలుగు లక్షలు జపించవలెను అని ధరణీ వరాహ సంవాదమున తెలుపబడింది.



పద్మావతి వృత్తాంతములో పద్మావతి తన తల్లి ధరణీదేవికి భక్తుల లక్షణములను గూర్చి ఇట్లు చెప్పింది. "విష్ణుభక్తుడు చక్రాంకితములను పొంది, నిత్యం ద్వాదశ ఊర్ధ్వ పుండ్రములు ధరించవలెను. వేదపారాయణము చేయుచు, వేదోక్త కర్మలను చేయుచుండవలెను. సత్యమునే పలుకవలెను. ఇతరుల యెడ అసూయ లేకుండుట, ఇతరులను నిందించకుండుట, పరభార్యా విముఖత్వము గల్గియుండుట. సమస్త ప్రాణులందు దయ గల్గి ఉండుట, సర్వభూత హితము కోరుట, తనకు కలిగిన దానితో సంతుష్టుడై యుండుట, ఎల్లప్పుడు దేవదేవుని స్తుతించుచుండుట మున్నగు లక్షణములు గలవారే నిజమైన విష్ణుభక్తులు".

ఇందులో పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ పూర్వరంగములో ఎరుకత వృతాంతముతో పాటు చిలుక రాయబారము కూడ వర్ణించబడింది. (వేంకటాచల మాహాత్మ్యం 7–57–68 శ్లో॥) చిలుక శ్రీనివాసునితో పద్మావతి మాటలుగా "మామంగీకురు మాధవ!" (మాధవా! నన్ను అంగీకరింపుము) అని చెప్పింది (7–60). నా తల్లిదండ్రుల అనుమతి ననుసరించి, అనుగ్రహముతో నన్ను స్వీకరింపు మని పద్మావతి కోరుచున్నది అని చిలుక శుభవార్తను శ్రీనివాసునకు తెలిపింది. అందుకు శ్రీనివాసుడు సంతోషించి, ఓ చిలుకా!

**కర్తుం కల్యాణ ముద్వాహ మాగమిష్యామి చామరైః ।**
**శుక గచ్ఛ వదైవం తామిత్థం దేవోఽబ్రవీదితి ॥**

నేను పద్మావతిని వివాహమాడుటకు దేవతలతో గూడి రాగలనని పద్మావతితో చెప్పుమనెను. ఆ మాటలు విని చిలుక శ్రీనివాసుడు ఇచ్చిన వనమాలికను స్వీకరించి, పద్మావతి వద్దకు వెళ్ళింది. చిలుక పద్మావతికి నమస్కరించి, శ్రీనివాసుడిచ్చిన

**తులసీమాలికాం దత్వా మృగనాభి సుగంధినీమ్ ।**
**ప్రీత్యా తన్మాలికాం గృహ్య భూమిజా శిరసా దధౌ ॥ 7–68**

కస్తూరీ పరిమళ భరితమగు తులసీ వనమాలికను ఇచ్చి శ్రీనివాసుని శుభసందేశమును తెలిపింది. పద్మావతి ఆ మాటలను విని, ప్రీతితో తులసిమాలను స్వీకరించి తలపై ధరించింది. ఈ కథలోని విశిష్టత చిలుక రాయబారము. ఇది యక్షగాన నాటక లక్షణములలో ఒకటి. నాయిక విరహతాపము ఉపశమించుటకు తులసిమాల తగినమందు. కనుకనే శ్రీనివాసుడు పద్మావతిని విరహతాపము ఉపశమించుటకు, తన ప్రేమ సూచకముగా తులసిమాలను చిలుక దూత ద్వారా ఆమెకు పంపినాడు. పద్మావతి దానిని తలలో పెట్టుకున్నది. శఠగోపనాయకి (నమ్మాళ్వారు యొక్క నాయకీభావము) విరహమునకు ఉపశమనముగా నమ్మాళ్వారు రచించిన తిరువిత్తములోని "ఉఱుగిన్ర కన్మంగళ్" అను 81వ పాశురములో" తుళాయ్ కుఱల్వాయ్ త్తుఱుగిన్రలర్" – భగవంతుని తులసిదళమును తెచ్చి ఈమె కొప్పులో ముదువుదు – అని వర్ణించినాడు. ఈ సన్నివేశములో యక్షగాన లక్షణము, అలంకార శాస్త్ర సంప్రదాయం చక్కగా పాటించబడింది. స్కంద పురాణములోని వేంకటాచల మాహాత్మ్యములో పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ ఘట్టము అతి సంగ్రహముగా వర్ణించబడింది.

స్కందపురాణములోని వేంకటాచల మాహాత్మ్యములో వేంకటేశ్వర భక్తి ఎనిమిది విధములని చెప్పబడింది.

**వేంకటేశ్వరదేవస్య భక్తి రష్టవిధా స్మృతా ।**
**తద్భక్తజన వాత్సల్యం, తత్పూజా పరితోషణమ్ ॥**
**స్వయం తత్పూజనం భక్త్యా తదర్థే దేహచేష్టితమ్ ।**
**తన్మాహాత్మ్య కథావాం శ్చ శ్రవణే ష్వాదర స్తథా ॥**
**స్వర నేత్ర శరీరేషు వికారస్ఫురణం తథా ।**
**శ్రీనివాసస్య దేవస్య స్మరణం సతతం తథా ॥**
**వేంకటాద్రి నివాసం తమాశ్రిత్యైవోపజీవనమ్ ।**
**ఏవ మష్టవిధా భక్తి ర్యస్మిన్ మ్లేచ్ఛేఽపి వర్తతే ॥**
**– స్కంద 2-1-18-23-26 శ్లో॥**



వేంకటేశ్వరుని భక్తి ఎనిమిది విధములు. (1) స్వామి భక్తుల యందు వాత్సల్యము చూపుట (2) వారిని పూజించుట వలన సంతోషము పొందుట (3) స్వయముగా వేంకటేశ్వరస్వామిని పూజించుట (4) స్వామికొరకే సర్వ కర్మలను చేయుట (5) స్వామి మాహాత్మ్యమును వర్ణించు కథలను వినుట యందు ఆసక్తి చూపుట (6) స్వామి కథలను వినునప్పుడు స్వర, నేత్ర, శరీరములందు వికారము కల్గుట (7) ఎల్లప్పుడు శ్రీనివాస స్మరణము చేయుట (8) వేంకటాద్రివాసుని – శ్రీనివాసుని – ఆశ్రయించి జీవించుట. ఈ ఎనిమిది విధములైన భక్తి మ్లేచ్ఛుని యందు ఉన్నను, అతడు ముక్తిని పొందును.

స్వామి పుష్కరిణి మహిమను వెల్లడించు కాశ్యప మాంత్రికుని కథలో (అధ్యా:11) పూర్వభాగం అంతా మహాభారతములోని పరీక్షిత్తు మరణ వృత్తాంతమే. ఇందులో మరణము తప్పదని తెలిసియున్నను, జీవించియున్న రోగికి చికిత్స చేయుటా? లేక మానుటా? అను సందేహమునకు శాకల్యమహర్షి

**"యావత్కంఠ గతాః ప్రాణా ముమూర్షో ర్మానవస్య హి ।**
**తావచ్చికిత్సా కర్తవ్యా కాలస్య కుటిలా గతిః ॥**
**– స్కంద 2-1-11-79 శ్లో॥**

కంఠములో ప్రాణములున్నంతవరకు మరణించగోరు మానవుని అయినను చికిత్సచేసి రక్షింపవలయును. కాలము యొక్క వక్రగతి ఎవరికిని తెలియదు" అని వైద్యశాస్త్రవేత్తలు చెప్పుచున్నారు. కనుక విషరోగాతురుడైన పరీక్షిత్తును చికిత్సచేసి రక్షింపగల సమర్థుడైన కాశ్యప మాంత్రికుడు తక్షకుని మాటలు విని పరీక్షిత్తును రక్షింపకుండుట ప్రాయశ్చిత్తము లేని మహాపాతక మని నిశ్చయించినాడు.

స్కాందపురాణము, వైష్ణవ ఖండములోని వేంకటాచల మాహాత్మ్యమునకు ఆంధ్ర వచనానువాద కర్తలు :- 1) మేరు సోమయాజుల దుర్గయ్య శాస్త్రి (1971) 2) సరిపెల్ల విశ్వనాథశాస్త్రి,1975 (3) డా॥ మోదేకుర్తి సత్యనారాయణ (1979) 4) డా॥ పిన్నా మధుసూదన్ (2003) (5) తూ.వెం. చూడామణి (1973).

## 2 వరాహ పురాణము

తిరుమల తిరుపతి దేవస్థానముల విచారణకర్త శ్రీ మహంతు భగవాన్‌దాసుచే ప్రచురించబడిన శ్రీవేంకటాచల మాహాత్మ్య గ్రంథము (1885) లోని వరాహ పురాణ ప్రథమభాగమున సంస్కృత వరాహ పురాణములో అధ్యాయం 33 నుండి అధ్యాయం 62 వరకు గల ముప్పది (30) అధ్యాయములలో వేంకటాచల మాహాత్మ్యము వివరంగా వర్ణించ బడింది. ఇందులో శ్వేత వరాహ కల్ప వృత్తాంతము, శ్వేత వరాహ విష్ణుమూర్తి హిరణ్యాక్ష రాక్షసుని వధించి భూమండలమును ఉద్ధరించుట, వైకుంఠము నుండి విష్ణుదేవుని క్రీడాద్రి – వేంకటము – భూలోకమున అవతరించుట, స్వామిపుష్కరిణి మాహాత్మ్యము, క్రీడాద్రికి నామాంతరములు గలుగుట, కుమారధార మహిమ, శంఖణరాజు వృత్తాంతం, ఆత్మారాముని వృత్తాంతం, కపిలతీర్థాది సప్తదశ (17) తీర్థముల మాహాత్మ్యము, పాండవతీర్థ (గోగర్భ తీర్థం) మహిమ, శ్రీరాముడు వేంకటాద్రికి వచ్చుట, వైకుంఠ గుహ ప్రభావం, బ్రహ్మాది దేవతలు వేంకటాద్రికి వచ్చుట, పుత్రార్థియై దశరథుడు వేంకటాచలమునకు వచ్చుట, భగవంతుని సాక్షాత్కారము, రావణోప ద్రవమును గూర్చి బ్రహ్మాది దేవతల నివేదన, భగవంతుని అనుగ్రహము, దశరథునికి పుత్ర ప్రాప్తి వరము లభించుట. శ్రీవేంకటేశ్వర మహోత్సవము, వేంకటేశ్వరుని వైభవము, ఫల్గుణతీర్థ మహిమ, జాబాలితీర్థ మహిమ, వేంకటాద్రికి నలుదిక్కుల ఉన్న రాక్షసులను సుదర్శనుడు (చక్రము) సంహరించుట, అష్టాంగ యోగ స్వరూపము, శ్రీ వేంకటేశ్వర అష్టోత్తర శత (108) నామస్తోత్రము మహర్షులు వేంకటాద్రికి తీర్థయాత్రగా వచ్చుట భగవంతుని దర్శించుట, భగవంతుని స్తుతించుట, శౌనకాది మహర్షులు సూతుని కీర్తించుట మొదలగు వృత్తాంతములు విపులంగా వర్ణింపబడినవి.

వరాహ పురాణములోని వేంకటాచల మాహాత్మ్యమును తెనిగించిన తరిగొండ వేంగమాంబ వరాహ పురాణములో ముప్పది అధ్యాయములే ఉన్నట్లు



**అని యిష్ట దేవత నాత్మాబ్జమందు భా**
**వించి, సేవించి, శ్రీ వేంకటాద్రి**
**మాహాత్మ్యమందా వరాహ పురాణంబు**
**ముప్పది అధ్యాయములను దొలుత**
**మొనసి మూడాశ్వాసములు చేసి యా వరా**
**హస్వామికర్పించి, యంతమీద**

**– వేంకటాచలమాహాత్మ్యం, 4-7.**

అని దృఢపరిచింది. కాని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రకటించిన శ్రీ వేంకటాచల మాహాత్మ్యగ్రంథములో వరాహ పురాణం ద్వితీయ భాగము అనుపేరుతో పది అధ్యాయములు ఉన్నవి.

ఈ పది అధ్యాయములలో ధరణీ వరాహ సంవాదము, శేషాచల మాహాత్మ్యము, స్వామిపుష్కరిణి, కుమారధార, తుంబురు తీర్థం, ఆకాశగంగ, పాండవ తీర్థం, పాపనాశన తీర్థం, దేవతీర్థముల మాహాత్మ్యములు, వరాహ మంత్రారాధన విధి. మిత్రవర్మ కుమారుడు ఆకాశరాజు వృత్తాంతం, ఆకాశరాజుకు పద్మావతి లభించుట, పద్మావతి వృత్తాంతము, శ్రీనివాసుడు వేటకు వచ్చుట, పద్మావతీ శ్రీనివాసుల తొలి సమాగమము, శ్రీనివాసుని మోహము, పద్మావతి పూర్వజన్మ వృత్తాంతము, వకుళమాలిక రాయబారము, ఎరుకత వృత్తాంతం, పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ వైభవము, వసువు అను నిషాదుని వృత్తాంతం, తొండమాన్ రాజు వృత్తాంతం, రంగదాసు (తొండమానుని పూర్వజన్మ) వృత్తాంతం, తొండమానుడు వేంకటాచలమున దేవాలయమును నిర్మించుట, పద్మసరోవర మాహాత్మ్యము, వీరశర్మ కథ, అస్థి సరోవర మహిమ, కుమ్మరి భీముని కథ, శ్రీనివాసుని కృపచే తొండమానునికి సారూప్య ప్రాప్తి, ఫలశ్రుతి వర్ణింపబడినవి.

యధార్థమునకు ఈ పది అధ్యాయములు సంస్కృత వరాహ పురాణములో గాక స్కంద పురాణములో గలవు. సంస్కృత స్కంద పురాణములో రెండవ

ఖండమగు వైష్ణవ ఖండమునందు తొలి క్షేత్ర మాహాత్మ్యమగు వేంకటాచల మాహాత్మ్యములో మొదటి పది అధ్యాయములుగ ఉన్నవి. స్కంద పురాణాంతర్గతమగు వేంటాచల మాహాత్మ్యములో వేంకటాచల క్షేత్రమహిమ నలువది (40) అధ్యాయములలో 2,474 శ్లోకములలో విపులముగా వర్ణింపబడింది. ఇందలి మొదటి పది అధ్యాయములు వరాహ పురాణ ద్వితీయ భాగముగ గ్రహింపబడినవి. మిగిలిన ముప్పది అధ్యాయములు స్కందపురాణముగ నాలుగు భాగములుగ (17+1+10+ 2=30) చేయబడినవి. ఇదంతా తొలి ముద్రణ ప్రతి (1885) సంపాదకులు చేసిన కైలాటముగ ఉంది.

వరాహ పురాణ ప్రథమ భాగము శ్వేత వరాహ విష్ణుదేవుని స్తుతితో ప్రారంభమైంది.

**శ్రీమతే భూ వరాహాయ నమః కృత్స్నా వసుంధరా ।**
**ఉద్ధృతా యేన పాతాళా ద్వాసార్థం సర్వదేహినామ్ ॥**

సమస్త ప్రాణులు నివసించుటకై పాతాళ లోకము నుండి భూమండలమును ఉద్ధరించిన వరాహ రూప విష్ణుదేవునకు నమస్కారము.

స్వామిపుష్కరిణీ తీర్థ మహిమ ఇట్లు వర్ణింపబడింది.

**స్వామి పుష్కరిణీ పుణ్యా సర్వపాప ప్రణాశినీ ॥**
**వైకుంఠా ద్భగవత్క్రీడావాపీ శ్రీభూమి లాలితా ।**
**అప్రాకృత జలౌఘా చ సుగంధా సుమనోహరా ॥**
**గంగాది సర్వతీర్థానాం జన్మభూమి శ్శుభోదకా ।**
**ఆనీతా వైనతేయేన క్రీడార్థం తత్ర తిష్ఠతి ॥**

**– వరాహ.35–16–18 శ్లో॥**

స్వామి పుష్కరిణి పుణ్యప్రదమైనది. సర్వపాప నాశకరమైనది. వైకుంఠమున విష్ణుభగవానునికి క్రీడా సరస్సుగా ఉండి, శ్రీదేవి భూదేవులచే ఉపయోగింప బడునది. అప్రాకృతమగు విశేష జలము గలది. మంచి పరిమళము గలది. మిక్కిలి మనోహరమైనది. గంగాది సర్వతీర్థములకు జన్మస్థానమైనది. పవిత్రమైన జలము గలది."



దశరథుడు శ్రీమన్నారాయణుని నాలుగు శ్లోకములతో ప్రస్తుతించాడు. తత్ఫలముగా భగవంతుడు దశరథునకు నలుగురు పుత్రులను ప్రసాదించి నాడు.

**యస్మాత్ ప్రీత్యా చతుఃశ్లోకీ త్వయోక్తా మమ భూపతే ।**
**తస్మాత్తు తవ పుత్రాశ్చ చత్వారోఽమిత విక్రమాః ॥**

**– వరాహ, 49–50 శ్లో॥**

వేంకటేశ అష్టోత్తర శతనామావళిలో (అధ్యాయం–61) ఓం వేంకటేశాయ నమః (1) అని వేంకట పర్వతమునకు అధిపతియైన భగవంతునికి – శ్రీనివాసునికి నమస్కారము. ఓం వేంకటాయ నమః (22) వేంకట పర్వతమునకు నమస్కారము అని అభేదము చెప్పబడింది.

సంస్కృత వరాహ పురాణమును నంది మల్లయ ఘంట సింగయ అను జంటకవులు(తెలుగు జంటకవులలో మొదటివారు) ఆంధ్రీకరించారు. వీరి గ్రంథములో వేంకటాచల మాహాత్మ్యము లేదు. వీరి వరాహ పురాణము తుళువ నరసనాయకునికి (విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల తండ్రి) అంకితమీయబడింది. ఈ 12 ఆశ్వాసముల వరాహ పురాణములో క్షేత్ర మాహాత్మ్యములు లేవు. అయితే జంటకవులు కృతిపతిని "శ్రీ వేంకటాద్రిపతి సంసేవా హేవాక నిపుణ!" (2–1) – వేంకటాచలపతిని సేవించుటయందు అధికమైన నేర్పుగలవాడా! – అని సంబోధించినారు. జంటకవులు రైభ్యుని తీర్థయాత్రను వర్ణిస్తూ

**చేదోయి నొసలఁ జేర్చె ననంత శాయికి**
**రంగధామునకు సాష్టాంగ మెఱగె**
**ప్రణమిల్లెఁ గాంచి వరదరాజునకు, నమ**
**స్కృతి చేసె వేంకటాద్రీశునకును**

**మ్రొక్కె నహోబలేంద్రునకు సింహాచల**
**నాయకునకు వందనము ఘటించె**
**నతిసల్పె శ్రీకూర్మపతికి దండంబు స**
**మర్పించెఁ బురుషోత్తమాధిపునకు**

**- వరాహపురాణం, 2-76.**

'అతడు అనంతశయనునికి (తిరువనంతపురం), శ్రీరంగనాథునకు (శ్రీరంగం) కంచి వరదరాజునకు, వేంకటాచలపతికి (తిరుమల) నరసింహస్వామికి (అహోబలం) వరాహనరసింహునకు (సింహాచలం) కూర్మనాథునకు (శ్రీకూర్మం) జగన్నాథునికి (పూరి) నమస్కరించినాడు." అని రైభ్యుడు దక్షిణ భారతమున గల వైష్ణవక్షేత్రములను దర్శించినట్లు చెప్పినారు. తుళువ నరసనాయకునికి వంశపారంపర్యంగా వచ్చిన 'ధరణీ వరాహ' అనే బిరుదం ఉంది.

ప్రియంగు ప్రియ భక్షాయ, కిన్నర ద్వంద్వ శాపాంత ప్రదాతే, వైఖానస మునిశ్రేష్ఠ పూజితాయ, కుమారా కల్ప సేవ్యాయ, శంఖరాజన్య నేత్రాబ్జ విషయాయ, అగస్త్యాభ్యర్థితాశేష జన దృగ్గోచరాయ, బ్రహ్మ కృతోత్సవాయ, చోళపుత్ర ప్రియాయ, నీల ధేనుపయోధారా సేక దేహోద్భవాయ మున్నగు అష్టోత్తరశతనామ స్తోత్రంలోని నామములు వేంకటేశ్వరస్వామివారి దివ్యలీలలను మహిమలను వర్ణించేవిగా ఉన్నాయి.

సంస్కృత వరాహ పురాణము - కైవల్య ఖండము -ను హరిభట్టు (క్రీ.శ.1450-1520) ఆంధ్రీకరించినాడు. ఇందు వరాహావతార చరిత్ర, హిరణ్యాక్షరాక్షస సంహారము, భూమండల ఉద్ధరణ, వరాహస్తుతి మున్నగునవి హృదయాహ్లాదముగ వర్ణింపబడినవి. ఈ వరాహపురాణములలో వేంకటాచల క్షేత్ర మాహాత్మ్యము వర్ణింపబడలేదు. వరాహమూర్తి వసుంధరను దంష్ట్రాగ్రమున ఉద్ధరించుట ఇట్లు మనోహరముగ వర్ణింపబడింది.



**కిరివర దంష్ట్రా దండో**
**పరిభాగమునందు నాత పత్రము కరణిన్**
**ధరణీ చక్రము తనరెను**
**సురశైలము పసిడి గుబ్బ చొప్పున నొప్పెన్ ॥ - వరాహ-3-14**

వరాహమూర్తి కోరపంటి దండముపై భూచక్రము గొడుగు వలెను, మేరు పర్వతము గొడుగు మీది గుబ్బవలెను అందగించెను.

లోకరక్షకుడగు విష్ణుదేవుడు పాతాళమున నీటమునిగియున్న భూమండలమును ఉద్ధరించుటకు

**"ఆమ్నాయములు చరణారవిందములుగా**
**రవి సుధాకరులు నేత్రములు గాగ**
**గంధవాహస్ఫూర్తి కర్ణయుగ్మంబుగా**
**శివపద్మభవులు దంష్ట్రికలు గాగ**
**నుగ్రానలంబు ఘోణాగ్రభాగంబుగా**
**జలధరంబులు సటాచ్ఛటలు గాగ**
**గాకోదరేంద్రుండు కఠిన వాలంబుగా**
**గాలంబు గమన వేగంబు గాగ**

**యజ్ఞ రూపంబు తోడ బ్రహ్మాండ మెల్ల**
**దానయై నిండి సురలద్భుతంబు నొంద**
**భక్తవత్సలు డిందిరా ప్రాణవిభుడు**
**రాక్షస ధ్వంసి యాది వరాహమయ్యె ॥ - వరాహ, 2-202**

వేదములు పాదములుగా, సూర్యచంద్రులు నేత్రములుగా వాయువు చెవులుగా, శివబ్రహ్మలు దంతములుగా (కోరలుగా), అగ్ని నాసికగా (ముట్టెగా), మేఘములు జూలుగా, సర్పరాజు తోకగా, కాలము నడకగా, యజ్ఞము శరీరముగా దేవతలు ఆశ్చర్యపడుచుండగా రాక్షస సంహారకుడు,

భక్త వత్సలుడు అయిన లక్ష్మీనాథుడు బ్రహ్మాండమంతయు నిండి ఆదివరాహ మైనాడు."

వరాహ పురాణంలోని వేంకటాచలక్షేత్ర మాహాత్మ్యమునకు అనువాదములు –

1) శ్రేష్ఠలూరి వేంకటార్యుని – శ్రీనివాస విలాస సేవధి (ద్విపద)
2) తరిగొండ వెంగమాంబ – వేంకటాచల మాహాత్మ్యము.
3) ములుపాక బుచ్చయ్య శాస్త్రి – వేంకటేశ్వర మాహాత్మ్యము
4) దామెర చిన వెంకటరాయని – వేంకటాచల మాహాత్మ్యము
5) శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి – వేంకటాచల మాహాత్మ్యము
6) కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితుల (వచనం)
7) పరవస్తు వేంకట రామానుజ స్వామి (వచనం)
8) తూ. వేం. చూడామణి (వచనం)

వరాహ పురాణమును శలాక రఘునాథశర్మ ఆంధ్రీకరించారు. ఈ వచన వరాహ పురాణంలో వేంకటాచల మాహాత్మ్యము లేదు.

* * *

## 3. హరివంశగత శేషధర్మము

హరివంశములోని ఒక పర్వము ఆశ్చర్యపర్వం. అందులో ధర్మబోధలు చేసే కథలున్నాయి. వాటిని శేషధర్మాలు అంటారు. సంస్కృత హరివంశము లోని కొన్ని పర్వాలను ఎర్రాప్రెగ్గడ ఆంధ్రీకరించలేదు. శేష ధర్మాన్ని తామరపల్లి తిమ్మయ్య, వెణుతురుపల్లి విశ్వనాథం మొదలగువారు ఆంధ్రీకరించారు. పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు భీష్ముడు కామ్యక వనానికి వెళ్ళినాడు. అక్కడ భీష్ముడు ధర్మరాజుకు చెప్పిన కథలలో వేంకటాచల మాహాత్మ్యం ఒకటి". జగద్గురుండగు శ్రీనివాసుని దర్శనంబు నెవ్వడాచరించు నతని



వంశంబు వారెల్ల ముక్తులగుదురు. భూలోకంబున గలుగు పుణ్యక్షేత్రంబు లెల్ల నద్దేవుని సేవించు. నీవు నరిగి యా వేంకటేశ్వరు పాదారవిందంబులకు వందనం బాచరింపుము. భక్తిముక్తులు సిద్ధించును" అని భీష్ముడు ధర్మరాజుకు వేంకటాచల యాత్ర చేయుటకు ప్రేరేపించాడు.

సంస్కృత హరివంశములోని 48 అధ్యాయములో వేంకటాచల మాహాత్మ్యము వర్ణించబడింది. ఇందులో శ్రీనివాస భగవానుని సేవించుటకై నారదాది మహర్షులు వేంకటాద్రికి వచ్చుట, వేంకటాద్రిపై నివసించుచున్న మహాజనుల చరిత్ర, వేంకటాద్రిపై ఉన్న శ్రీనివాసుని సేవించమని భీష్ముడు ధర్మరాజును ప్రేరేపించుట వర్ణింపబడినవి. శ్రీనివాస భగవానుని లీలలను వర్ణించు ప్రసిద్ధమైన స్తుతి శ్లోకము ఈ శేషధర్మము నందే గలదు.

**"మాయావీ పరమానందః త్యక్త్వా వైకుంఠముత్తమమ్ ।**
**స్వామిపుష్కరిణీ తీరే రమయా సహ మోదతే ॥ – 48-14.**

మాయలమారి, ఆనంద స్వరూపుడు అగు శ్రీనివాసుడు శ్రేష్ఠమైన వైకుంఠమును వదలిపెట్టి, వేంకటాచలమున ఉన్న స్వామి పుష్కరిణీ తీరమున లక్ష్మీదేవితో విహరించుచున్నాడు.

వ్యాసమహర్షి రచించిన హరివంశమును ఎర్రాప్రెగ్గడ ఆంధ్రీకరించినాడు. ఇందులో వేంకటాచల మాహాత్మ్యము వర్ణించబడలేదు. కాని వరాహావతార వృత్తాంతము, శ్రీమన్నారాయణుడు శ్వేత వరాహ రూపమున పాతాళమున దిగబడియున్న భూమండలమును ఉద్ధరించుట, ఆ ప్రయత్నములో హిరణ్యాక్ష రాక్షసునితో యుద్ధము, హిరణ్యాక్ష సంహారము, భూమిని ఉద్ధరించి యథాస్థానములో నిలుపుట వర్ణింపబడినవి.

**ముస్తాకందము గ్రుచ్చి యెత్తు క్రియ నిర్ముద్ర స్ఫుర ద్దంష్ట్రికా**
**హస్తాగ్రంబున గ్రుచ్చియెత్తెఁ బ్రియ మొప్పారంగ గేళీరసా**

**భ్యస్తోదీర్ణ జవంబునన్ వెడలి యయ్యాశ్చర్య తోయంబునా**
**యస్తాధారపథంబుగా నునిచె విశ్వాధారుఁడద్ధారుణిన్ ॥**
**– హరివంశము, ఉత్తర భాగం, 9-173**

లోకములన్నింటికి ఆధారభూతుడైన శ్రీమన్నారాయణుడు ప్రీతితో పాతాళమున దిగబడి బురదలో చిక్కిన ఆవు వలె ఉన్న భూమిని చూచి, శ్వేతవరాహ రూపమున తుంగ గడ్డను గ్రుచ్చి యెత్తునట్లుగా బలిష్ఠమైన ముట్టె అనెడు హస్తాగ్రముతో ఉద్ధరణ కళానైపుణ్యముతో విలాసముగా, అలవోకగా భూమిని ఉద్ధరించి సకల ప్రాణులకు ఆధారముగా – నివాస స్థలముగా – విశ్వంభరగా నిలిపెను.

నారదుడు వ్యాసమహర్షితో వైకుంఠమున పుట్టిన ఆశ్చర్యకరమైన వార్త –

**అధిక మయావిహారి నారాయణుండు**
**పుణ్యనిలయుండు వైకుంఠపురము విడిచి**
**స్వామి పుష్కరిణీ తీర్థ సౌధ వీథి**
**నువిదతోఁ గూడి విహరించుచున్న వాఁడు. – శేషధర్మం, 5-106**

అని వినిపించినాడు. లోకహితము కోరినవాడై

**శతపత్ర మల్లికాచంపక కరవీర**
**కుంద మందారాది కుసుమములును**
**బంచామృత స్నాన బహువిధ నైవేద్య**
**కర్పూర తాంబూల కల్పనములు**
**మాధవ గోవింద మధుసూదనాచ్యుత**
**కృష్ణాది బహునామ కీర్తనములు**
**దండకాష్టక గద్య తారావళీముఖ**
**మహిత ప్రబంధ సమర్పణములు**



**వారి వారికిఁ దగినట్లు వసుధయెల్ల**
**భక్తియుక్తులఁ బూజింప భద్రలీల**
**స్వామి పుష్కరిణీ నామ సరసియందు**
**నువిదతోఁ గూడ మాధవుఁడున్న వాఁడు. – శేషధర్మం, 5-113**

తామరపూలు, మల్లెలు, సంపెంగలు, గన్నేరులు, మొల్లలు, మందారాలు మొదలగు పుష్పములతో పూజలు, పంచామృత స్నానము (నీరు, పాలు, పెరుగు, నెయ్యి, తేనె పంచామృతములు) అనేక విధములైన నైవేద్యములు, కర్పూర తాంబూలముల ఏర్పాట్లు, మాధవ, గోవింద, మధుసూదన, అచ్యుత, కృష్ణాది అనేక నామములతో కీర్తించుటలు, దండకము, అష్టకము, గద్యము, తారావళి మొదలగు కావ్యములను అంకితము చేసి సమర్పించుటలు, వారివారికి తగినట్లు యథాశక్తి లోకులందరు భక్తియుక్తులతో పూజించు చుండగా స్వామిపుష్కరిణీ తీరమున శ్రీనివాస భగవానుడు లక్ష్మీదేవితో కూడ నివసించుచున్నాడు. ఇట్లు శేషధర్మము శ్రీనివాసవైభవాన్ని వర్ణించింది.

శేషధర్మం అనువాదకులు. (1) తామరపల్లి తిమ్మయ్య (2) వెణుతురు పల్లి విశ్వనాథం (3) చదలవాడ సుందరరామశాస్త్రి (4) యస్. శఠగోపాలాచారి (వచనం) (5) అల్లంరాజు సుబ్రహ్మణ్య కవి (6) నోరి గురులింగశాస్త్రి (వచనం).

* * *

## 4. బ్రహ్మ పురాణం

వేంకటాచల మాహాత్మ్యములోని బ్రహ్మపురాణ భాగం వేంకటాచల మాహాత్మ్యాన్ని వర్ణించినది. ఈ వర్ణన అంతా దుర్వాసమహర్షి దిలీప మహారాజుకు బోధించాడు. ఈ పురాణంలో వాయువు ఆదిశేషుల బలా బలపరీక్ష, శేషుని పరాజయము, శేషుని తపస్సు, విష్ణుదేవుడు శేషాచలమున నివసించుటకు అంగీకరించుట, స్వామిపుష్కరిణి తీరమున శ్రీనివాసుడు నివసించుటకు కారణము, భగవంతుడు వాయువునకు ప్రధానాంగత్వము

అనుగ్రహించుట, అగస్త్యమహర్షి తపస్సు, శంఖరాజు తపస్సు, శ్రీనివాసుడు అవతరించుట, భగవంతుని ఆజ్ఞచే శంఖరాజు వేంకటాద్రిపై ఆలయమును నిర్మించుట, స్వామి పుష్కరిణి మొదలగు సప్తతీర్థముల వర్ణన, తొండమాన్ రాజు చరిత్ర, తొండమానుడు వేంకటాద్రిపై ఆలయమును పునర్నిర్మించుట, స్వామి శంఖ చక్రములను తొండమానురాజుకు అనుగ్రహించుట, వేంకటాద్రిపై వరాహస్వామి ప్రాధాన్యము, స్వామిపుష్కరిణి మధ్యలో నున్న యమ, ధనదాది తొమ్మిది తీర్థముల వర్ణన, వేంకటాద్రిపై చేయవలసిన దానములు, వాని ఫలములు, విష్ణువర్ధనుని వృత్తాంతము, వేంకటాద్రిపై దీపారోప మహిమ, వేంకటాచల మాహాత్మ్య గ్రంథ ప్రశంస వివరముగా వర్ణింపబడినవి. మనకు లభించిన, ప్రచారములో నున్న బ్రహ్మ పురాణములో విష్ణుదేవుని అవతారములు, పూరీజగన్నాథ మాహాత్మ్యము, గోదావరీ మాహాత్మ్యము మొదలగునవి విపులముగా వర్ణింపబడినవి. ఆ బ్రహ్మపురాణములో వేంకటాచల మాహాత్మ్య వర్ణన లేదు.

**బ్రహ్మోత్తర ఖండము :**

బ్రహ్మపురాణములోని ఉత్తర భాగములో రెండు అధ్యాయములలో (50, 51) వేంకటాచల మాహాత్మ్యం వర్ణింపబడింది. వసిష్ఠ మహర్షి తాను రాజ పురోహితుడుగా ఉండుటవలన గల్గిన పాపమును బ్రహ్మను గూర్చి తపస్సుచేసి పోగొట్టుకొనుట, సర్వాబద్ధుని చరిత్ర, వేంకటాద్రిపై గల ఘోణ తీర్థమున స్నానము చేసి వసిష్ఠమహర్షి పాపరహితుడగుట, సర్వాబద్ధుడు సర్వసిద్ధు డగుట, తుంబురునికి నారదుని శాపము, ఘోణతీర్థ తీరమున తుంబురుని తపస్సు, భగవంతుని సాక్షాత్కారము, భగవదనుగ్రహముచే తుంబురునికి శాపవిమోచనము, ఘోణతీర్థమునకు తుంబురు తీర్థమను ప్రసిద్ధి గలుగుట వివరముగా వర్ణింపబడినవి. ఈ తీర్థమునకే ఘోణ, తుంబ, ఫల్గుణి, తుంబురు తీర్థమను నామాంతరములు కలిగినవి.

బ్రహ్మపురాణమును దివాకర్ల రామమూర్తి (వచనం) జనమంచి శేషాద్రి శర్మ (పద్యకావ్యం) అనువదించారు.



## 5. ఆదిత్య పురాణము

అష్టాదశ ఉపపురాణములలో ఆదిత్య పురాణం ఒకటి. ఈ పురాణంలో అయిదు అధ్యాయాలలో వేంకటేశ్వర మహిమ, శ్రీనివాస వైభవము, విపులంగా వర్ణించబడింది. వాయుదేవుని శిష్యుడగు దేవశర్మ వేంకటాచల యాత్ర చేసి, వేంకటేశ్వరుని దర్శించి ఆపాదమస్తకము వర్ణించి, భగవదనుగ్రహమును పొంది దారిద్ర్య బాధల నుండి విముక్తుడై సుఖ సంపదలను పొందుట రమ్యంగా వర్ణించబడింది.

ఆదిత్య పురాణంలో దేవశర్మ "శ్రీనివాసం భజేఽనిశమ్" అను మకుటములో ఇరవై ఏడు శ్లోకములలో శ్రీనివాస వైభవాన్ని కీర్తించినాడు. ఈ శ్లోకముల సంపుటం శ్రీనివాస తారావళి అను పేరును సార్థకం చేసుకున్నది. ఈ తారావళి

**"శ్రీ వేంకటేశం లక్ష్మీశం అనిష్టఘ్న మభీష్టదమ్ ।**
**చతుర్ముఖేర తనయం శ్రీనివాసం భజేఽనిశమ్ ॥**

ఓ వేంకటాచలపతీ! లక్ష్మీనాథా! నీవు భక్తుల అనిష్టములను దొలగించి, అభీష్టములను ఇచ్చువాడవు. చతుర్ముఖుడగు బ్రహ్మదేవుడు, వాయుదేవుడు నీ కుమారులు. ఓ శ్రీనివాసా! నిన్ను ఎల్లప్పుడు సేవింతును" అను శ్లోకముతో ప్రారంభమగుచున్నది. పంద్రెండవ శ్లోకము నుండి ఇరవై ఏడవ శ్లోకము వరకు దశావతారస్తుతి కలదు. ఈ తారావళి

**కల్కినం తురగారూఢం కలి కల్మష నాశనమ్ ।**
**కల్యాణదం కలిఘ్నం చ శ్రీనివాసం భజేఽనిశమ్ ॥**

గుర్రము నెక్కినవాడు, భక్తుల కలిదోషములను హరించువాడు, శుభముల నొసంగువాడు, దుష్టుడయిన కలి పురుషుని నాశనము చేయువాడు, కల్కి రూపముతో అవతరించునట్టి శ్రీనివాసుని సదా సేవించెదను" అను శ్లోకముతో పరిపూర్ణమగుచున్నది.

ఆదిత్య పురాణాంతర్గత వేంకటేశ మాహాత్మ్యమునకు అనువాదమును, వ్యాఖ్యానమును ఆర్.రామమూర్తిశర్మ చేశారు. ఇది తి.తి.దేవస్థాన ప్రచురణ (1997). ఎలకూచి పిన్నయ ప్రభాకరుడు క్రీ.శ.17 శతాబ్దంలో తెనిగించినాడు.

* * *

## 6. గరుడ పురాణము

తిరుమల తిరుపతి దేవస్థానం వారు క్రీ.శ.1885లో ప్రచురించిన శ్రీ వేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథము (సంస్కృతం) లోని గరుడ పురాణ భాగములో ఒక్క అధ్యాయం (అధ్యాయం-63) ఉన్నది. ఇందులో వసిష్ఠమహర్షి వేంకటాచల మాహాత్మ్యమును అరుంధతికి వివరించుట, ఆకాశగంగ, పాపనాశన, తుంబురు తీర్థముల ప్రశంస, వసిష్ఠమహర్షి అనుమతి గైకొని అరుంధతి వేంకటాచలయాత్ర చేసి, తుంబురు తీర్థ తీరమున తపస్సు చేయుట, భగవంతుని సాక్షాత్కారము, అరుంధతి కృత భగవన్నుతి. శేషాద్రివాసుడగు శ్రీనివాసుడు తుంబురుతీర్థమునకు మహిమను అనుగ్రహించుట, ఫాల్గుణ పూర్ణిమనాడు భగవంతుని సాక్షాత్కార దినము అగుటచే తుంబురు తీర్థమునకు ఫల్గుణి తీర్థమనుపేరు ప్రసిద్ధమగుట వర్ణింపబడినది.

యథార్థమునకు గరుడ పురాణములో ఆచారకాండ, ప్రేతకాండ (మృతాశౌచ దినములలో పఠించు గరుడ పురాణ భాగము. ఈ కాండకు ధర్మకాండ అని నామాంతరము కలదు), బ్రహ్మకాండ అను మూడు కాండలు గలవు. ఆచార కాండలో 240 అధ్యాయాలు, ప్రేత (ధర్మ) కాండలో 49 అధ్యాయాలు, బ్రహ్మకాండలో 29 అధ్యాయాలు ఉన్నవి. ఈ బ్రహ్మకాండలో 23 నుండి 27 వరకు గల అయిదు అధ్యాయాలలో 410 శ్లోకములలో వేంకటాచల మాహాత్మ్యము వర్ణింపబడింది. ముందు పేర్కొనిన 63వ అధ్యాయము ఇందు కనిపించుట లేదు. ఈ వేంకటాచల మాహాత్మ్యాన్ని శ్రీకృష్ణుడు గరుడునికి వివరించినాడు. శ్రీకృష్ణుని అష్టమహిషులలో ఒకర్తె



అయిన జాంబవతి తన గురువు అయిన జైగీషవ్య మహర్షి మూలమున వేంకటాచలయాత్ర చేసి, శ్రీనివాసుని దర్శించి, కృతార్థురాలయినది. జైగీషవ్య మహర్షి వేంకటాద్రి మహిమను, వైభవాన్ని విపులముగా వర్ణించినాడు.

**తీర్థాటనం పాదచారైః కృతం చేత్**
**పూర్ణఫలం ప్రాహురార్యాః ఖగేంద్ర ।**
**పాదత్రాణం పాదరక్షాం చ కృత్వా**
**తీర్థాటనం పాదహీనం తదాహుః ॥ - గరుడ, 3-23-23 శ్లో॥**

తీర్థయాత్ర పాదచారిగా చేయాలి. అప్పుడే తీర్థయాత్రా ఫలము సంపూర్ణముగా లభించును. పాదరక్షలతో తీర్థయాత్ర చేసినట్లయితే యాత్రాఫలము పాదహీనము (నాల్గవ వంతు తగ్గిపోతుంది) అవుతుంది" అని శ్రీకృష్ణుడు గరుడునికి బోధించినాడు.

**కన్యే శ్రుణుత్వం వేంకటాఖ్యాచలస్య**
**స్మేరాననే పుణ్య మారోహణేఽస్య**
**శ్రీగీతాయాః పఠనం చైవ కుర్వ**
**న్నారోహణం కురుతే సర్వలోకః ॥ - గరుడ, 3-24-1 శ్లో॥**

వేంకటాచలము అధిరోహించునప్పుడు భగవద్గీత చదువుతూ ఎక్కుతుంటే పుణ్యం అధికమవుతుంది" అని జైగీషవ్య మహర్షి జాంబవతికి ఉపదేశించాడు.

**రమాశ్రయత్వా న్నితరాం సర్వదా**
**చేత్యతో హరిః శ్రీనివాసాభిధానః ॥ - గరుడ, 3-24-49 శ్లో॥**

ఎల్లప్పుడు లక్ష్మీదేవికి (శ్రీ) ఆశ్రయుడగుటచేత విష్ణువుకు శ్రీనివాసు డను పేరు గలిగింది".

ఈ గరుడపురాణంలోని వేంకటాచలమాహాత్మ్య భాగములో శ్రీనివాసుడు 'వ్యంకటేశః' అని వ్యవహరింప బడినాడు.

**వేతి హ్యుత్తమవాచీ స్యాద్వేతి జ్ఞాన ముదాహృతం**
**కకారః సుఖవాచీ స్యాట్టేతి విత్తముదాహృతమ్ ॥**

**ఈశత్వ మాత్మవాచి స్యాదేవం జ్ఞేయంతు కన్యకే ।**
**పూర్ణజ్ఞానం సుఖం విత్తం వ్యాప్యత్వా ద్వ్యంకటాభిధః ॥**

వకారము ఉత్తమ వాచకము. ఎకారము జ్ఞాన సూచకము. కకారము సుఖవాచి. టకారము సంపదను సూచిస్తుంది. ఈశ ఆత్మవాచకము. ఇట్లు పూర్ణజ్ఞానము, ఆనందము, ఐశ్వర్యము గల్గి యుండుటచే భగవంతుడు 'వ్యంకటేశుడు' అనబడుచున్నాడు. (25–37, 38 శ్లో॥) మరొక వ్యుత్పత్తిని జైగీషవ్య మహర్షి ఇట్లు వివరించినాడు.

**విశిష్ట జ్ఞాన రూపత్వా ద్వ్యేతి ముక్తాః సదా స్మృతాః ।**
**ముక్తానాం చ సమూహస్తు వ్యంకటేతి ప్రకీర్తితః**
**సదాముక్త సమూహానా మీశత్వా ద్వ్యంకటాభిధః ॥ (25–41, 42)**

వ్య–విశిష్టజ్ఞానమును పొందిన ముక్తులను తెలియజేస్తుంది. అట్టి ముక్తుల సమూహము వ్యంకట మనబడుచున్నది. వ్యంకటమను ముక్తుల సమూహమునకు నియామకుడు అగుటచే భగవంతుడు 'వ్యంకటేశుడు' అనబడుచున్నాడు. వేంకటాచలపతియగు శ్రీనివాసుడు 'వ్యంకటేశుడు' అనబడుటకు మరొక వ్యుత్పత్తిని జైగీషవ్య మహర్షి జాంబవతికి బోధించినాడు.

**లింగ దేహ మతో జీవో వ్యంకటేతి సమాహృతః ।**
**లింగానాం చైవ స్వామిత్వా ద్వ్యంకటేశేతి సంజ్ఞితః ॥**
**26–41, 42 శ్లో॥**

లింగ శరీరములోని జీవుడు వ్యంకట మనబడుచున్నాడు. కనుక లింగశరీర మందలి జీవులకు (వ్యంకటమునకు) స్వామి యగుటచే శ్రీనివాసభగవానుడు 'వ్యంకటేశుడు' అని వ్యవహరింపబడుచున్నాడు.



మరొక సందర్భంలో "అమృతైశ్వర్య సంయుక్తో వ్యంకటాద్రిరితి స్మృతః (26–32 శ్లో॥) అమృత, ఐశ్వర్యముల కూడిక యగుటచే ఈ పర్వతం వ్యంకటాద్రి అనబడుచున్నదని నిర్వచించినది. గరుడ పురాణంలో జాంబవతి శ్రీనివాసుని

**శ్రీ వ్యంకటేశశ్చ నృసింహమూర్తిః**
**శ్రీ వరదరాజశ్చ వరాహమూర్తిః**
**శ్రీ రంగశాయీ చ అనంతశాయీ**
**కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥ 25–47**

శ్రీ వ్యంకటేశుడు, నరసింహుడు, వరదరాజు, వరాహమూర్తి, శ్రీరంగనాథుడు, విష్ణుదేవుడు (శేషశాయి) నాకు ఈ ఉదయము సుప్రభాతముగా చేయుదురుగాక!" అని 14 శ్లోకములలో (25–47–60 శ్లో॥) సుప్రభాత స్తుతి చేసింది. ఈ పురాణం కూడ

**మాయావీ పరమానందః త్యక్త్వా వైకుంఠ ముత్తమమ్ ।**
**స్వామిపుష్కరిణీ తీరే రమయా సహ మోదతే ॥ 26–36 శ్లో॥**

అని శ్రీనివాసుడు స్వామిపుష్కరిణీ తీరమున వెలయుటను వర్ణించింది. ఇట్లు గరుడపురాణం వ్యంకటేశుని మహిమను వర్ణించి, చివరకు "శ్రీనివాసాత్పరో దేవో న భూతో న భవిష్యతి" (27–39) (శ్రీనివాసుని కంటె అధికుడైన దేవుడు పూర్వము లేడు. రాబోవు కాలములో ఉండడు" అని ఎలుగెత్తి చాటింది. గరుడ పురాణంలో స్వామిపుష్కరిణి, పాండవ తీర్థము, పాపనాశన తీర్థము, తుంబురు తీర్థము, కపిలతీర్థము, సువర్ణముఖి నది ప్రశంసింపబడినవి.

గరుడ పురాణమును పింగళి సూరన తెనిగించినాడు. ఈ పురాణం అలభ్యము.

* * *

## 7. భవిష్యోత్తర పురాణము

సంస్కృత వేంకటాచల మాహాత్మ్య గ్రంథములో (1885) భవిష్యోత్తర పురాణమున 14 అధ్యాయాలలో శ్రీనివాస వైభవము, వేంకటాచల మాహాత్మ్యము విస్తారముగా వర్ణింపబడినవి. అంతేగాక, రహస్యాధ్యాయములో (80) భగవంతుని తత్త్వము, ఉపనిషత్తుల సిద్ధాంతమగు వేంకటేశ్వర మాహాత్మ్యము భవిష్యోత్తర పురాణ సారాంశముగ, సకల వేదాంత విషయ సంగ్రహముగ విస్తృతంగా వర్ణించబడింది. ఈ అధ్యాయము పార్వతీ పరమేశ్వర సంవాద రూపమున వివరించబడింది.

భవిష్యోత్తర పురాణంలోని వేంకటాచల మాహాత్మ్యాన్ని శతానందుడు జనక మహారాజుకు బోధించాడు. ఇందులో మొదట వేంకటాద్రికి కృతయుగంలో వేంకటాచలము, త్రేతాయుగంలో అంజనాచలము, ద్వాపర యుగంలో శేషాచలము, కలియుగంలో వేంకటాచలము అను నామధేయములు గలుగుటకు కారణమైన కథలు వర్ణింపబడినవి, పిమ్మట శ్రీమన్నారాయణుడు భూలోకమున వేంకటాద్రిపై శ్రీనివాసుడుగ వెలయుటకు కారణమైన భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించుట, దాని ఫలితము, లక్ష్మీదేవి వైకుంఠమును వీడి కొల్హాపురము చేరుట వివరముగ వర్ణింపబడినవి.

భవిష్యోత్తర పురాణంలో స్వామిపుష్కరిణి మాహాత్మ్యము, శ్రీనివాసుడు పుష్కరిణికి పడమట ఉన్న పెద్దపుట్టలో ప్రవేశించుట, బ్రహ్మ, శివుడు ఆవు, దూడల రూపమున చోళరాజు కడ చేరుట, గోరూపమున ఉన్న బ్రహ్మ పుట్టలో నున్న శ్రీనివాసునికి క్షీరదానము చేయుట. ఆ దృశ్యమును చూచిన గోపాలుడు (శరభయ్య) ఆవును దండించుట, శ్రీనివాసుడు గోవును రక్షించుట, గొల్లవాని మృతి, శ్రీనివాసుడు చోళరాజును శపించుట, వేంకటాద్రిపై శ్రీనివాస, వరాహస్వాముల కలయిక, వకుళమాలిక సేవ, వకుళమాలిక పూర్వజన్మ వృత్తాంతము, ఒకనాడు శ్రీనివాసుడు నారాయణ



వనం వైపు వేటకు వెళ్ళుట మొదలగు వృత్తాంతములు విపులముగా వర్ణింప బడినవి.

పిమ్మట ఆకాశరాజుకు పద్మావతి లభించుట, వసుదానుని జననం, పద్మావతి ఉద్యానవన విహారము, పద్మావతి శ్రీనివాసుల సమాగమము, వారి సంవాదము, పద్మావతి సఖులు శ్రీనివాసునిపై రాళ్ళు విసరుట, శ్రీనివాసుడు రాళ్ళదెబ్బలతో వేంకటాద్రి జేరుట, వకుళమాలిక ఓదార్పు, సేవ, పద్మావతి పూర్వజన్మ వృత్తాంతము, వకుళమాలిక పెండ్లి రాయబారము, ఎరుకత వృత్తాంతము, వకుళమాలిక ధరణీదేవితో సంభాషించుట, పద్మావతీ శ్రీనివాసుల వివాహము నిశ్చయింపబడుట, బృహస్పతి వివాహ లగ్నమును నిర్ణయించుట, ఆకాశరాజు శ్రీనివాసునకు శుభలేఖ వ్రాయుట, శుకమహర్షి శుభలేఖను శ్రీనివాసునికి అందజేయుట, శ్రీనివాసుని ప్రత్యుత్తరము సవివరముగా వర్ణింపబడినవి.

అనంతరం శ్రీనివాసుడు తన వివాహమునకై బ్రహ్మాది దేవతలను ఆహ్వానించుట, బ్రహ్మరుద్రాది దేవతలు వేంకటాద్రి జేరుట, కరవీరపురము నుండి లక్ష్మీదేవి వచ్చుట, శ్రీనివాసుడు పెండ్లికుమారుడగుట, శ్రీనివాసుడు కులదేవతను - శమీవృక్షమును - ఆరాధించుట, వివాహము కొరకు శ్రీనివాసుడు కుబేరుని కడ అప్పుజేయుట, ఋణపత్రమును వ్రాయుట, ఆహ్వానితులకు విందు, నారాయణ వనమునకు ప్రయాణము, మార్గమధ్యమున శ్రీనివాసుడు శుకమహర్షి చేసిన ఆతిథ్యమును స్వీకరించుట, నారాయణవన పురప్రవేశము, ఎదురుకోలు, దుర్గాదేవిని (అవణాక్షమ్మను) పద్మావతీ శ్రీనివాసులు పూజించుట, శ్రీనివాసుడు కల్యాణమండపమును జేరుట, వివాహవైభవము, అప్పగింతలు, శ్రీనివాసుడు పద్మావతితో వేంకటాద్రికి ప్రయాణమగుట, మార్గమధ్యమున అగస్త్యాశ్రమమున ఆరునెలల పాటు నివసించుట, ఆకాశరాజు మరణము, రాజ్యమునకై తొండమానుడు, వసుదానుడు కలహించుట, వారి యుద్ధము-సంధి, శ్రీనివాసుడు

తొండమానుని వేంకటాద్రిపై మందిరమును నిర్మింపుమని ఆదేశించుట, భవన నిర్మాణము, తొండమానుని పూర్వజన్మ వృత్తాంతము, శ్రీనివాసుడు నూతన భవనమున ప్రవేశించుట, బ్రహ్మదేవుడు మహోత్సవమును నిర్వహించుట, మహోత్సవ వైభవము, కూర్మద్విజుని వృత్తాంతము, అస్థి సరోవర మాహాత్మ్యము, కుమ్మరి భీముని వృత్తాంతము, కుమ్మరి దంపతులు భగవంతుని సాయుజ్యము నందుట, తొండమానుడు మరుజన్మమున విష్ణుదేవుని సారూప్యమును పొందుట మొదలగు వృత్తాంతములు సవివరముగ వర్ణింపబడినవి.

జనక మహారాజు వైకుంఠగిరి (వేంకటాద్రి) మాహాత్మ్యమును, కలియుగములో దాని చరిత్రమును తెలుపుమని కోరగా శతానందుడు

**కృతే వృషాద్రిం వక్ష్యంతి, త్రేతాయాం అంజనాచలం**
**ద్వాపరే శేష శైలేతి కలౌ శ్రీ వేంకటాచలమ్**
**నామాని యుగభేదేన శైలస్యాస్య భవంతి హి ॥**

**- భవిష్యోత్తరం, 1-36, 37.**

ఈ పర్వతమును కృతయుగమున వృషాద్రి అని, త్రేతాయుగమున అంజనాద్రి అని, ద్వాపరయుగమున శేషాద్రి అని, కలియుగమున శ్రీవేంకటాచలమని యుగముల మార్పు ననుసరించి వ్యవహరించెదరని చెప్పినాడు. (జనక, శతానందులు త్రేతాయుగమున జీవించినారు) భవిష్యోత్తర పురాణము.

**సర్వపాపాని 'వేం' ప్రాహుః 'కటః' తద్దాహ ఉచ్యతే ।**
**తస్మాద్వేంకట శైలోఽయం లోకే విఖ్యాత కీర్తిమాన్ ॥ 1-220**

'వేం' అనగా సర్వపాపములు. 'కటః' అనగా దహింపజేయునది అని అర్థము. కావున ఈ పర్వతము వేంకటాద్రి అని కీర్తిని గడించినది అని వేంకట పదమునకు వ్యుత్పత్తిని చెప్పింది.



**అరాయి కాణే వికటే గిరిం గచ్ఛేతి తం విదుః ।**
**ఏవం వేదమయః సాక్షాత్ గిరీంద్రః పన్నగాచలః ॥**

**- భవిష్యోత్తరం, 4-21**

ఐశ్వర్యహీనుడైన, దృష్టిహీనుడైన మోక్షగామిని వేంకటగిరికి వెళ్ళమని (శ్రీనివాసుని సేవించుమని) ఋగ్వేదం (మండలం-10, సూక్తం-155, మంత్రము-1) ఉపదేశిస్తున్నది కనుక పర్వతరాజమైన శేషాచలం సాక్షాత్తు వేదస్వరూపమని భవిష్యోత్తర పురాణం వర్ణించింది.

భవిష్యోత్తర పురాణ కర్త పద్మావతీ శ్రీనివాసుల ప్రథమ దర్శనమునకు హేతువుగ అడవి యేనుగును ప్రవేశపెట్టినాడు. వేటకై వచ్చిన శ్రీనివాసుడు అడవి యేనుగును వెంటాడుచు, పద్మావతి, చెలులు విహరిస్తున్న ఉద్యాన వనమునకు చేరినాడు. (భవిష్య.7-36) ఇట్లు వారి ప్రథమ సమావేశము జరిగింది. ఇందుకు మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలము నాటకంలో నాయికా నాయకులైన శకుంతలా దుష్యంతుల తొలి దర్శనమునకు ఉపకరణముగా గండు తుమ్మెదను ప్రయోగించుట, ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దన మనుచరిత్రలో వరూధినీ ప్రవరుల తొలి చూపులకు వరూధిని సేవించుచున్న తాంబూలపు వాసనతో వీచిన గాలిని (మగువ పొలుపు దెలుపు గాలి) ప్రయోగించుట ప్రేరణగా ఉన్నవి.

భవిష్యోత్తర పురాణకర్త (అధ్యా:8,9) పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ ఘట్టములో ఎరుకత (ధర్మదేవి) పాత్రను ప్రవేశపెట్టి, ఆమె పద్మావతి భవిష్యత్తును చెప్పినట్లు వర్ణించినాడు. ఈ సందర్భంలో శ్రీనివాసుడే తన వివాహము నెరవేర్చుటకు అనుగుణంగా ఎరుకతగా మారి ధరణీ దేవికి సోదె చెప్పినట్లు వర్ణించినాడు. ఇది కురవంజి (కొరవంజి) అను పేరుగల యక్షగాన నాటకలక్షణంగా ఉంది. కురవంజి (ఎరుక జాతి స్త్రీ) పాత్ర ప్రవేశము గల యక్షగానమునకు కురువంజి (కొరవంజి) అనిపేరు.

దక్షిణ భారతదేశంలో పర్వత ప్రాంత అరణ్యాలలో నివసించు ఆటవికులలో కురువజాతి ఒకటి. ఈ కురువజాతి స్త్రీలకు ఎరుక (సోదె) చెప్పడం వృత్తి. వీరికి కొల్లాపురమ్మ (కొల్హాపురం మహాలక్ష్మి) కుల దేవత. తరిగొండ వెంగమాంబ రచించిన వేంకటాచల మాహాత్మ్యములో ఎరుకత (కురవంజి) 'ఆరు కొండలకు మీదైన కొండ' ఏడుకొండలు మా కాపురము అని చెప్పి

**ఆ కొండ మీద నిక్కము**
**మా కాపుర మెపుడు సెలగ,మరి జీవికకై**
**లోకుల కెరుకలు చెప్పుచు**
**జోకగ బ్రదుకుదుము, నీవు సోదెలడుగు మీ! 5-21**

అని తన వృత్తి ఎరుక చెప్పడం అంటుంది. వృత్తి వాచకమైన ఎరుక పదమే వారికి జాతివాచకంగా పరిణమించింది. యక్షగానములందు నాయికా నాయకుల వివాహ పూర్వరంగమున కురవంజి (ఎరుకత) పాత్ర ప్రవేశించి, నాయకుని గూర్చి విరహవ్యథలో నున్న నాయికకు జోస్యము చెప్పును. శుభ సూచనలు కనిపించుచున్నవని చెప్పి నాయకునితో కలియు సుముహూర్తము త్వరలోనే రాగలదని చెప్పును. ఈ కురవంజి పాత్ర పద్మావతీ శ్రీనివాసులపరిణయ ఘట్టంలో ప్రవేశపెట్టబడింది. కురవజాతి వారు నివసించు ఆ యా పర్వత ప్రాంతముల స్థల మాహాత్మ్య కథలలో కురవంజి పాత్రకు ప్రాధాన్యము ఏర్పడినది. యక్షగానములో కురవంజి (ఎరుకత) వేషము, భాష, సోదె చెప్పు తీరు హాస్యరస స్ఫోరకముగా నుండును.

భవిష్యోత్తర పురాణములో వివాహ పూర్వరంగములో శ్రీనివాసుడు పుణ్యాహవాచనాది వైదిక వివాహాంగ కర్మలు చేసిన అనంతరం 'పాండవులకు, మాకు శమీ వృక్షమే కులదేవత' అని చెప్పి కులదేవతార్చన – శమీవృక్షపూజ – చేసినాడు. నిర్విఘ్నముగా వివాహము నెరవేర్పుమని



శమీవృక్షమును ప్రార్థించినాడు. (అధ్యా:11-69-75 శ్లో॥) 'భగవంతుడు విశ్వమయుడు. స్థావర, జంగమ ప్రాణులందు అంతర్యామిగా ఉన్నాడు' అను విశ్వాసం ప్రతీకాత్మ భావనకు (Totemism) దారి తీసింది. దీని ఫలితంగా ప్రాచీన జాతులు ఒక వృక్షాన్నో, జంతువునో కులదేవతగా ఆరాధించినవి. వివాహ సందర్భంలో శ్రీనివాసుడు శమీవృక్షాన్ని (జమ్మిచెట్టును) కులదేవతగా (Totem) పూజించడం శుభకార్యాలలో Totem చిహ్నాన్ని పూజించడమనే ప్రాచీన జాతుల సంప్రదాయాన్ని సూచిస్తున్నది.

భవిష్యోత్తర పురాణంలో వివాహ అధ్యాయానికి (11) ఫలశ్రుతిని శతానందుడు జనకునికి ఇట్లు తెలిపినాడు.

**కోటి కన్యాప్రదానేన యావద్భూమి ప్రదానతః ।**
**యత్ఫలం లభతే దేహీ తత్ఫలం శ్రవణాదరాత్ ॥ 11-444**

కోటి కన్యాదానములను చేయుట వలన, భూదానము వలన లభించు ఫలము ఈ వివాహాధ్యాయము వినుట వలన లభించును.

**శృణుయా చ్ఛ్రావయే ద్వాపి సర్వాభీష్ట మవాప్నుయాత్॥ 11-446**

శ్రీనివాస కల్యాణ అధ్యాయమును వినినను, వినిపించినను సకల వాంఛలు నెరవేరును.

శ్రీనివాసుని ఆదేశమును పాటించి, తొండమానుడు వేంకటాద్రిపై ఆలయమును నిర్మించి, విమానముపై శ్రీనివాసుని విగ్రహమును ప్రతిష్ఠించినాడు.

**ఆనంద జనకత్వాత్ తం ఆనందనిలయం విదుః ।**
**తత ఆనందనిలయే తొండమాన్ నృపనిర్మితే**
**విమానాగ్రే శ్రీనివాసో రరాజ భగవాన్ హరిః ॥ -13-80**

ఆ భవనము ఆనందమును కలిగించునది అగుటచే దానికి ఆనంద నిలయము అను పేరు గల్గినది. తొండమానుడు నిర్మించిన ఆనందనిలయ విమానముపై శ్రీనివాసుడు విరాజిల్లెను.

భవిష్యోత్తర పురాణంలో శ్రీనివాసునకు ప్రప్రథమంగా బ్రహ్మదేవుడు చేసిన మహోత్సవం వర్ణించబడింది. (అధ్యా. 14-38-66 శ్లో॥)

**తతోఽపరేద్యురుషసి ధ్వజారోహ మహోత్సవమ్ ।**
**ఆరభ్యావభృథాంతం చ పుష్పయాగాంత మేవ చ**
**ఉత్సవం శ్రీనివాసస్య చకార విధివద్విధిః ॥ 14-44,45.**

అంకురార్పణము చేసిన మరునాడు ప్రాతఃకాలమున ధ్వజారోహణ ఉత్సవముతో ఆరంభించి అవభృథ స్నానము వరకు, పుష్పయాగాంతము శ్రీనివాసుని మహోత్సవమును బ్రహ్మ చేయించెను. ప్రస్తుత కాలంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణము ఉదయానికి మారుగా సాయంత్రం జరుపబడుచున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం వారి పరిపాలనలో నున్న ఇతర దేవాలయములలో బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణము ఉదయం జరుపబడుచున్నది. బ్రహ్మ చేసిన మహోత్సవములో

**జపద్భి ర్వైదికాన్ మంత్రాన్ సహితశ్చ ద్విజోత్తమైః ।**
**చకారావభృథస్నానం భగవానాది పూరుషః ॥**
**స్వామిపుష్కరిణీ తీర్థే సర్వలోకైక పావనే ।**
**అవతారదినే తస్మిన్ నక్షత్రే శ్రవణే ప్రగే ॥**

**- భవిష్యోత్తర, 14-63, 64.**

వేదమంత్రములను జపించుచున్న బ్రాహ్మణోత్తములతో కూడి పవిత్రమైన స్వామిపుష్కరిణి తీర్థమున తన అవతార దినమున శ్రవణా నక్షత్రమున ఉషఃకాలమున ఆదిపురుషుడగు శ్రీనివాస భగవానుడు అవభృథ స్నానము (యజ్ఞాంతమున చేయు స్నానము) చేసెనని, భవిష్యోత్తర పురాణము వర్ణించింది. నాడు శ్రీనివాసుడు స్వయముగా బ్రహ్మ చేసిన ఉత్సవాంతమున స్వామి పుష్కరిణిలో అవభృథ స్నానం చేసినాడు. యజ్ఞకర్త, యజమానుడు యజ్ఞము కడపట స్నానము చేయుట సహజము. ప్రస్తుతం జరుగుచున్న బ్రహ్మోత్సవాలలో యజమాని యగు మలయప్పస్వామికి (శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి) బదులుగ చక్రస్నానము పేరుతో సుదర్శన చక్రమునకు బ్రహ్మోత్సవాంతమున స్వామి పుష్కరిణిలో స్నానము జరుగుచున్నది. ఎంత మార్పు!



**తతోఽపరేద్యురభవత్ పుష్పయాగ మహోత్సవః 14-66**

ధ్వజారోహణము జరిగిన మరునాడు పుష్పయాగ మహోత్సవము చేయబడింది. ప్రస్తుతం పుష్పయాగము బ్రహ్మోత్సవములలో గాక విడిగా కార్తికమాసంలో శ్రవణా నక్షత్రంనాడు ఉత్సవముగ జరుపబడుచున్నది.

**నమః శ్రీ వేంకటేశాయ శుద్ధజ్ఞాన స్వరూపిణే ।**
**వాసుదేవాయ శాంతాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥ 80-157**

అని శ్రీనివాస భగవానునకు మంగళాశాసనముతో భవిష్యోత్తర పురాణ పరిశీలనమునకు ముగింపు.

భవిష్యోత్తర పురాణమందలి వేంకటాచల మాహాత్మ్యమును తరిగొండ వెంగమాంబ, తూ.వెం.చూడామణి (వచనం) ఆంధ్రీకరించారు.

* * *

## 8. పద్మపురాణము

సంస్కృత వేంకటాచల మాహాత్మ్య గ్రంథములోని పద్మపురాణ భాగములో వేంకటాద్రి మహిమ 11 అధ్యాయములలో (24-34) వర్ణించబడియున్నది. ఈ పద్మపురాణ భాగములో శుకమహర్షి మేరుపర్వతము నుండి వేంకటాచలమునకు వచ్చుట, వేంకటాచల వర్ణన, శుక మహర్షి వేంకటాద్రి

యందున్న పుణ్యతీర్థములలో స్నానము చేయుట, కుమారస్వామి వృత్తాంతము, కుమారధార మాహాత్మ్యము, పాపనాశన తీర్థ మహిమ, ఆకాశగంగా మహిమ, శుకమహర్షి వేంకటాద్రి నుండి పద్మసరోవరము (నేటి తిరుచానూరు) చేరుట, పద్మసరోవర వర్ణన, శుకమహర్షి ఆశ్రమము, శుకమహర్షి తపస్సు చేయుట, ఇంద్రుడు శుకమహర్షి తపస్సును భంగము చేయుటకు ప్రయత్నించుట, రంభాది అప్సరసలు శుకమహర్షి ఆశ్రమము చేరుట, వారి శృంగార నృత్య విలాసాలు, శుకమహర్షి దృఢదీక్షతో తపస్సు చేయుట, శ్రీనివాసుని ప్రార్థించుట, శ్రీనివాసుని కృపచే అప్సరసలు విఫలురై స్వర్గమునకు వెళ్ళుట, శ్రీనివాసుడు శుకునికి ముక్తిని ప్రసాదించుట, శుకపుర నిర్మాణము, బలభద్ర సహిత కృష్ణుని శుకమహర్షి ప్రతిష్ఠించుట, శుకమహర్షి వేంకటాద్రి చేరుట, స్వామిపుష్కరిణీ వర్ణన, శ్రీనివాసావిర్భావము, శుకమహర్షి శ్రీనివాసుని స్తుతించుట, వరాహావతారము, వరాహ విష్ణుమూర్తి పాతాళమున పడియున్న భూమిని ఉద్ధరించుట, వరాహ విష్ణువు భూదేవితో శేషాచలమున నివసించుట, కిన్నర దంపతుల వృత్తాంతము, వారు దుర్వాసమహర్షి శాపముచే వేంకటాద్రిపై కిరాత దంపతులుగా నివసించుట, కిరాతుడు పొలములో ప్రియంగు ధాన్యమును (కొర్రలను) పండించుట, పంటపొలంలో వరాహమూర్తి ఆగడము, కిరాతుడు తరుమగా వరాహమూర్తి పుట్టలో ప్రవేశించుట. ఆ వృత్తాంతమును కిరాతుడు రాజుకు విన్నవించుట, రాజు వేంకటాద్రికి వచ్చి, పుట్టను పాలధారతో కరగించుట. వరాహమూర్తి దర్శనము, భగవంతుని సందేశము, వరాహమూర్తి దర్శనముచే కిరాత దంపతులకు శాపవిముక్తి, రాజు వరాహమూర్తిని ప్రతిష్ఠించుట వర్ణింపబడినవి.

పద్మపురాణములో సింహాద్రి పైనున్న నీలకంఠాశ్రమ వర్ణన, రుద్రుడు నృసింహమూర్తిని ఆరాధించుట. నీలకంఠాశ్రమ మాహాత్మ్యము, పాండవ తీర్థమహిమ, నారాయణాద్రి మాహాత్మ్యము, స్వామిపుష్కరిణి వర్ణన, శ్రీనివాసుని దర్శించుటకై బ్రహ్మాది దేవతలు శేషాద్రికి వచ్చుట, శ్రీనివాసుడు



దివ్యవిమానమున ప్రత్యక్షమగుట, బ్రహ్మాది దేవతలు శ్రీనివాసుని స్తుతించుట, దేవతలు రాక్షసోపద్రవమును విన్నవించుట, భగవంతుడు దేవతలకు అభయమిచ్చుట, భగవంతుని అంతర్ధానము, శ్రీనివాసావతార దేశకాల నిర్ణయము, పద్మసరోవర మాహాత్మ్యము, భృగుమహర్షి వృత్తాంతము, లక్ష్మీదేవి వైకుంఠమును వీడి కొల్హాపురము చేరుట. విష్ణుమూర్తి లక్ష్మీదేవి అనుగ్రహము కోరి తపస్సు చేయుటకై పద్మసరోవరమును నిర్మించుట, దానికి తూర్పున సూర్యనారాయణుని ప్రతిష్ఠించుట, విష్ణుదేవుడు లక్ష్మినుద్దేశించి 12 సంవత్సరములు తపస్సు చేయుట, తపః ఫలముగా లక్ష్మీదేవి పద్మసరోవరము నుండి ఉద్భవించుట, లక్ష్మీదేవి దర్శనార్థము బ్రహ్మాదిదేవతలు మహర్షులు పద్మసరోవరమునకు వచ్చుట, లక్ష్మీదేవి విష్ణుదేవుని వరించుట, విష్ణుమూర్తి లక్ష్మీదేవిని తన హృదయమున నిలిపికొని శ్రీనివాసుడగుట, నారదాది మహర్షులు పద్మసరోవర మహిమను కీర్తించుట, శుకమహర్షి చరిత్ర, ఛాయా శుకుని జననము విస్తృతంగా వర్ణింపబడినవి. పద్మపురాణములోని వేంకటాచల మాహాత్మ్య మంతయు దేవ దర్శనుడు దేవలునికి బోధించినాడు.

పద్మపురాణంలోని కుమారధారా మాహాత్మ్యములో కుమారస్వామి కుమారధారా తీర్థ తీరమున స్నానము చేయుటచే, శక్తి అను ఆయుధమును పొందినట్లు వర్ణించబడింది. పరమశివుని పొందుటకై పార్వతి తపస్సు చేసి కృతార్థురాలయింది. విష్ణుదేవుడు మహాలక్ష్మిని పొందుటకై తపస్సుచేసి, కృతార్థుడై శ్రీనివాసుడయినాడు. పురుషుడు గృహలక్ష్మిని సంపాదించుటకు ఎంత, ఎట్లు కృషి చేయవలెనో? విష్ణుదేవుడు మార్గదర్శకుడైనాడు. తపస్సుచే సాధ్యముకాని కార్యములుండునా?

పద్మపురాణంలో శ్రీనివాసుని గూర్చి తపస్సు చేస్తున్న శుకమహర్షి తపస్సును భంగము చేయుటకు వచ్చిన రంభాది అప్సరసలు పల్కిన సూక్తి యిట్లున్నది –

**విద్యానా మార్జనం బాల్యే యౌవనే విషయైషితా,**
**వృద్ధత్వే తపసాం వృత్తిః ఇత్యుశంతి మనీషిణః - పద్మ, 25-52**

బాల్యమున విద్యను సంపాదించుట, యౌవనమున భోగములను అనుభవించుట, వృద్ధాప్యమున తపస్సు చేయుట మానవుని కర్తవ్యమని పండితులు చెప్పుదురు. ఈ సూక్తికి మూలమనదగిన కాళిదాసుని శ్లోకము ఇట్లున్నది -

**శైశవేఽభ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణామ్ ।**
**వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజామ్ ॥**
**- రఘువంశము, 1-8**

మహాకవి కాళిదాసు రఘు వంశపు రాజుల ఉత్తమ గుణములను వర్ణిస్తూ వారు బాల్యమున చదువు నేర్చెడివారు, యౌవనమున ఇంద్రియ సుఖములను అనుభవించువారు, ముసలితనమున తపస్సు చేసెడివారు (మునివృత్తి) అవసాన దశలో యోగాభ్యాసముచే శరీరమును విడిచిపెట్టువారు అని వర్ణించినాడు.

శుక యోగి తపస్సును భంగము చేయుటకు వచ్చిన రంభాది అప్సరసలు తాము దేవతా స్త్రీలమని, పూజనీయలమని చెప్పుచు ఈ సూక్తిని పలికినారు-

**పూజ్య పూజా విపర్యాసః శ్రేయో హంతీత్యుశంతి హి - పద్మ,25-56**

పూజింపదగిన వారిని పూజింపకుండుట, పూజింపదగని వారిని పూజించుట అనర్థ హేతువని పెద్దలు పలుకుదురు. ఇది కాళిదాసు యొక్క

**ప్రతి బధ్నాతి హి శ్రేయః పూజ్యపూజా వ్యతిక్రమః**
**- రఘువంశము, 1-79**

అను అర్థాంతరన్యాసమును స్మరింపజేస్తున్నది.

పద్మపురాణంలో రంభాది అప్సరసల ఆగడములను జూచి పరితపించుచు శుకమహర్షి ఇట్లు భావించినాడు.



**తితీర్షుం దుస్తరం ఘోరం మహాసంసార సాగరమ్ - పద్మ, 25-67**

దాటుటకు శక్యము కాని, భయంకరమైన సంసార సముద్రమును దాటగోరు (చున్నాడు) ఈ ప్రయోగము కాళిదాసు రచించిన రఘువంశము లోని ప్రవేశికలో తనను గూర్చి చెప్పిన **"తితీర్షు ర్దుస్తరం మోహా దుడుపేనాస్మి సాగరమ్" (1-2)**

అను భావమును తలపింపజేస్తున్నది. ఇట్లు పద్మపురాణం కర్త మహాకవి కాళిదాసుని ప్రయోగములకు అనువాద ప్రయోగములు, అనుసరణలు చేసియున్నాడు. దీనికి పురాణ కర్తకు మహాకవిపై ఉన్న గౌరవాదరములు కారణంగా ఉన్నవి. భవతు, వేంకటాచల మాహాత్మ్యము గల పురాణ భాగములు వ్యాసమహర్షి కృతములు కావని స్పష్టమగుచున్నది.

శ్రీ వేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథములోని పద్మపురాణ భాగము (11 అధ్యాయాలు) గాక పద్మపురాణం ఉత్తర ఖండములోని అధ్యాయము 60 లో భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన వృత్తాంతము వసిష్ఠ దిలీప సంవాద రూపమున విపులముగా 140 శ్లోకములలో వర్ణించబడింది. అధ్యాయం చివర ఫలశ్రుతి చెప్పబడింది. త్రిమూర్తులలో సత్త్వగుణ ప్రధానుడగుటచే విష్ణుమూర్తి శ్రేష్ఠుడని నిర్ణయించింది. శ్రీహరిని పూజించుట కర్తవ్యమని, మోక్షప్రదమని ఉపదేశించింది.

పద్మపురాణమును కామినేని మల్లారెడ్డి, మడికి సింగన్న, త్రిపురాన తమ్మయదొర, పిశుపాటి చిదంబరశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి ఆంధ్రీకరించారు. కల్లూరి వేంకటసుబ్రహ్మణ్య దీక్షితులు పద్మపురాణమును వచనములో తెనిగించారు! ఈ పద్మపురాణ అనువాదములలో భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన వృత్తాంతము గలదు.

* * *

# 9. మార్కండేయ పురాణము

వేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథములోని మార్కండేయ పురాణ భాగములో అయిదు అధ్యాయములలో (1-5) వేంకటాచల మాహాత్మ్యము వర్ణింపబడింది. శౌనకాది మహర్షులకు సూతుడు వేంకటాచల మాహాత్మ్యమును బోధించినాడు.

మార్కండేయ పురాణములో తండ్రి అనుజ్ఞ గైకొని మార్కండేయుడు తీర్థయాత్రలకు బయలుదేరుట, గరుత్మంతుడు మార్కండేయునికి వేంకటాచల మాహాత్మ్యమును బోధించుట, మార్కండేయుడు అగస్త్యమహర్షి శిష్యుడు శుద్ధుడనువానితో వేంకటాద్రికి వచ్చుట, స్వామిపుష్కరిణీ స్నానం, వరాహ స్వామి దర్శనం, శ్రీనివాసుని దర్శించుట, మార్కండేయుడు శ్రీనివాసుని స్తుతించుట, శ్రీనివాసుడు మార్కండేయునికి అనవరత భక్తి యుండునట్లు వరమిచ్చుట, శుద్ధుని వృత్తాంతం, మార్కండేయుడు శుద్ధునితో కూడ అగస్త్య మహర్షిని దర్శించుట, అగస్త్యుడు వేంకటాచల వైభవమును వర్ణించుట, భగవంతుని దర్శించుటకు బ్రహ్మ రుద్రాది దేవతలు, మహర్షులు వేంకటాచలమునకు వచ్చుట, భగవంతుడు అవతరించుట, బ్రహ్మాది దేవతలు శ్రీనివాసుని స్తుతించుట, అగస్త్యుడు స్వామిపుష్కరిణి మహిమను, ఉత్సవ వైభవాన్ని వర్ణించుట, కుమారధార మాహాత్మ్యము, కుమారధార యందు స్నానము చేయుటచే వృద్ధుడు కుమారుడగుట, కుమారస్వామి (స్కందుడు) కుమారధారా తీరమున తపస్సు చేయుటచే తారకాసుర సంహారముచే గల్గిన బ్రహ్మహత్యాపాపము నశించుట, కుమారస్వామి తపస్సునకు మెచ్చి భగవంతుడు సాక్షాత్కరించుట, కుమారస్వామి శ్రీనివాసుని స్తుతించుట, కుమారధార తీర్థస్నాన కాలాది నిర్ణయము, అగస్త్యాది మహర్షులు కుమారధార తీర్థమున స్నానము చేయుటకు వేంకటాద్రికి వచ్చుట, వారందరు కుమార ధారాతీర్థమున స్నానము చేసి భగవంతుని స్తుతించుట, శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమగుట, మార్కండేయునికి, శుద్ధునికి భగవంతుడు వరములను ప్రసాదించుట వర్ణింపబడినవి.



మార్కండేయుడు తీర్థయాత్ర చేయుటకు తల్లిదండ్రుల అనుమతి కోరుచు, తీర్థయాత్ర వలన ప్రయోజనాలను ఇట్లు వర్ణించాడు –

**పుణ్య క్షేత్రాభిగమనే పుణ్యతీర్థావ గాహనే ।**
**యత్పుణ్యం తత్కులం సర్వం పావయే దితి హి శ్రుతమ్ ॥**

**– మార్కండేయ, 1-18**

పుణ్యక్షేత్రములకు వెళ్ళుట, పుణ్యతీర్థములలో మునుగుట వలన కలుగు పుణ్యము కులము అంతటిని పవిత్రమొనర్చునని విందుము గదా!

**పుణ్యదేశో వేంకటాద్రేః తుల్యో నైవ మహీతలే ।**
**స్వామిపుష్కరిణీ తీర్థ తుల్యం భువి న విద్యతే ॥**

**– మార్కండేయ, 1-36**

'భూలోకమున వేంకటాద్రితో సమానమగు పుణ్యక్షేత్రము కాని, స్వామి పుష్కరిణితో సమానమగు తీర్థము కాని లేనే లేదు' అని గరుత్మంతుడు మార్కండేయునకు వేంకటాచల మాహాత్మ్యమును ఉపదేశించినాడు.

శ్రీమహావిష్ణువు శ్వేతవరాహ కల్పాదిలో పాతాళమున నీట మునిగి యున్న భూమండలమును ఉద్ధరింప దలచి, శ్వేత వరాహ రూపమును ధరించి, హిరణ్యాక్ష రాక్షసుని వధించి, భూమిని యథా స్థితిలో నిల్పినాడు. ఆ వరాహ విష్ణుమూర్తి లోకహితము కోరి, భూమిపై నివసింపదలచి, వైకుంఠములో ఉన్న తన క్రీడాద్రిని వేంకటమను పర్వతాన్ని గరుడునిచే తెప్పించి, సువర్ణముఖీ నది సమీపంలో ఉత్తర దిక్కున నెలకొల్పించినాడు. ఈ విషయాన్ని మార్కండేయ పురాణం –

**వైకుంఠలోకాత్ గరుడేన విష్ణోః**
**క్రీడాచలో వేంకట నామధేయః ।**
**ఆనీయ చ స్వర్ణముఖీ సమీపే**
**సంస్థాపితో విష్ణు నివాస హేతోః ॥ 2-67**

అని వర్ణించింది. వరాహ విష్ణుదేవుడు నివసించిన పర్వతం పేరు వేంకటం. దానికి అధిపతియైన శ్రీనివాసుడు వేంకటేశుడు అయినాడు. వేంకటేశం పేరు జన వ్యవహారంలో వేంకటేశ్వరుడుగా మారి ప్రసిద్ధమయింది. "ఓం వేంకటేశాయ నమః" అని అష్టాక్షరి మంత్రము.

మార్కండేయ మహర్షి ప్రప్రథమంగా వేంకటాద్రి తీర్థయాత్ర చేసి స్వామి పుష్కరిణిలో స్నానమాడి వరాహస్వామిని దర్శించినాడు. పిమ్మట మార్కండేయుడు శ్రీనివాసుని దర్శించి, స్తుతించు సందర్భంలో

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**
**హరే! వేంకటేశ! ప్రసీద ప్రసీద**
**ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥**
**అహం దూరతస్తే పదాంభోజ యుగ్మ**
**ప్రణామేచ్ఛయాఽఽగత్య సేవాం కరోమి ।**
**సకృత్సేవయా నిత్య సేవాఫలం త్వం**
**ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో! వేంకటేశ!**
**అజ్ఞానినా మయా దోషా నశేషాన్ విహితాన్ హరే ।**
**క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే ॥**
**- మార్కండేయ, 2-19,20,21 శ్లో॥**

"వేంకటేశుడు తప్ప వేరొక ప్రభువు లేడు. ఎల్లప్పుడు వేంకటేశుని ధ్యానించుచుండును. ఓ వేంకటేశా! అనుగ్రహింపుము. నా అభీష్టమును ప్రసాదించుము. నేను నీ పాద పద్మములకు నమస్కరింపవలెనను కోరికతో దూరము నుండి వచ్చి, నీ సేవ చేయుచున్నాను. ఒకమారు చేసిన సేవకే నీ నిత్యసేవా ఫలమును అనుగ్రహింపుము. అజ్ఞానినైన నేను చేసిన



దోషములన్నింటిని క్షమింపుము. క్షమింపుము" అని ప్రార్థించినాడు. ఈ మూడు శ్లోకములు ప్రతివాది భయంకర అణ్ణన్ (క్రీ.శ.1361-1453) రచించిన 'వేంకటేశ స్తోత్రము' లో చివరి 9,10,11 శ్లోకములుగా గ్రహించ బడినవి.

మార్కండేయ పురాణము వేంకటేశ మాహాత్మ్యము యొక్క ఫలశ్రుతిని ఈ విధంగా చెప్పింది.

**వేంకటేశస్య మాహాత్మ్యం యఃశృణోత్యపి వా సకృత్ ।**
**సర్వపాప వినిర్ముక్తః సర్వశ్రేయో భవిష్యతి ॥ 5-30**

వేంకటేశ మాహాత్మ్యమును ఒక పర్యాయమైన వినిన వారు సమస్త పాపముల నుండి విముక్తులై, సకల శుభములను పొందగలరు.

**కుమారధారికా తీర్థ తీరే పఠతి యస్త్విదమ్,**
**శృణోతి వా తస్య తస్య సర్వాభీష్ట ప్రదో హరిః. 5-32**

కుమారధారా తీర్థ తీరమున కూర్చొని వేంకటేశ మాహాత్మ్యమును (వేంకటాచల మాహాత్మ్యమును) చదువు వారికి, వినువారికి శ్రీనివాసుడు సకలాభీష్టములను అనుగ్రహించును (ఇచ్చును).

మార్కండేయ పురాణమును మారన, పొన్నతోట ఔబళకవి, ఎల్లకర నృసింహ కవి (ద్విపద), మండచిట్టి కామశాస్త్రి, తిమ్మరాజు లక్ష్మణరావు, పర్వతమంత్రి లింగన్న, రాచర్ల రామసూర్యనారాయణశాస్త్రి (వచనం), కల్లూరి వెంకటసుబ్రహ్మణ్య దీక్షితులు (వచనం) అనువదించినారు. ఈ పురాణములో వేంకటాచల మాహాత్మ్యభాగము లేదు.

* * *

# 10. బ్రహ్మాండ పురాణము

శ్రీవేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథములోని బ్రహ్మాండపురాణ భాగములో 12 అధ్యాయములలో వేంకటాచల మాహాత్మ్యము వర్ణింపబడింది. 12 వ అధ్యాయములో శ్రీవేంకటేశ సహస్ర నామావళిస్తోత్రము వసిష్ఠ నారద సంవాద రూపమున చెప్పబడింది. మొదటి 11 అధ్యాయములలో వేంకటాచల మాహాత్మ్యము భృగు నారద సంవాదాత్మకముగ వర్ణించబడింది.

బ్రహ్మాండ పురాణములో వేంకటాద్రికి అనేక నామములు (20) దాని మాహాత్మ్యము, నారదుడు శ్రీమన్నారాయణుని దర్శించుట, భగవంతుడు భూలోకమున అవతరింప దలంచుట, నారదుడు సువర్ణముఖి నదీ తీరము భగవంతుని నివాసమునకు అనువైన ప్రదేశముగా తెలుపుట, అక్కడ ఆదిశేషుని పర్వత రూపమును ధరింపుమని విష్ణుదేవుడు ఆదేశించుట, శేషాచల పర్వత ఆవిర్భావము, శిరోదేశమున శ్రీనివాసుడు నివసించుట, వ్యాఘ్రపాదుని వృత్తాంతము, నారాయణుడను విప్రుని వృత్తాంతము, నారాయణాద్రి, వృషభాసురుని వృత్తాంతము, వృషభాద్రి, అంజనాదేవి వృత్తాంతము, ఆంజనేయుని జననము, అంజనాద్రి, మాధవుని వృత్తాంతము, వేంకటాద్రి, చోళరాజు వృత్తాంతము, తొండమానుని జననము, తొండమాన్ చక్రవర్తికి గోపాలురు వేంకటాద్రియందున్న పుట్టను గూర్చి విన్నవించుట, చక్రవర్తికి స్వప్నమున భగవంతుని దర్శనము, శబరుని వృత్తాంతము, తొండమానుడు వేంకటాద్రికి వచ్చుట, క్షీరాభిషేకముతో పుట్ట కరిగి, శ్రీనివాసుడు సాక్షాత్కరించుట, చక్రవర్తి శ్రీనివాసుని స్తుతించుట, బ్రహ్మ శ్రీనివాసునికి మహోత్సవము చేయుట, కృష్ణశర్మ వృత్తాంతము, అస్థిసరోవర మాహాత్మ్యము, సింహోదుడను రాక్షసుని వృత్తాంతము, భగవంతుడు తొండమాన్ చక్రవర్తికి తన పంచాయుధముల నొసంగుట, తొండమానుడు చక్రాయుధముతో సింహోదుని సంహరించుట, భగవంతుని ఆదేశమున పంచాయుధములు పంచతీర్థములలో ప్రవేశించుట విస్తృతముగా వర్ణింప బడినవి.



బ్రహ్మాండ పురాణములో వేంకటాద్రి

**శ్రీవేంకటగిరిర్నామ క్షేత్రం పుణ్యం మహీతలే ।**
**సర్వపాప ప్రశమనం సర్వపుణ్య వివర్ధనమ్ ॥ 1-18 శ్లో॥**

'భూలోకమున వేంకటాద్రి అను పేరుగల క్షేత్రము పుణ్యప్రదమైనది. సమస్త పాపములను తొలగించునది. సకల పుణ్యములను అభివృద్ధి చేయునది' అని కీర్తింపబడింది. వేంకటాద్రి, వేంకటేశుని వైభవ విశిష్టతను

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన,**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి. 1-24**

అని బ్రహ్మాండపురాణంలో కూడ స్తుతింపబడింది. శేషాద్రి పవిత్రమైనది. కనుక కాలితో త్రొక్కరాదని ఇట్లు ప్రశంసింపబడింది.

**విష్ణో రపర దేహత్వాత్ ఆక్రామన్ న పదైర్గిరిమ్ ।**
**నారాయణాంశ సంభూతః శేషోఽహి గిరిరూపధృక్ ॥ 2-41**

శేషాచలముగా నున్న ఆదిశేషుడు శ్రీమన్నారాయణుని మరియొక శరీరమై యుండుటచే ఈ పర్వతమును పాదములతో త్రొక్కరాదు. శ్రీమన్నారాయణుని అంశమున జన్మించిన ఆదిశేషుడే యీ పర్వతరూపమును ధరించెను గదా!

**అసూత పుత్రం బలినం ఉదయత్యహిమ త్విషి ।**
**శ్రావణే మాసి నక్షత్రే శ్రవణే హరి వాసరే ॥ 5-43**

అంజనాదేవి శ్రావణ మాసమున, శ్రవణా నక్షత్రమున ఉదయించు చున్న సూర్యుని కాంతి వంటి కాంతి గలిగిన పరాక్రమవంతుడయిన పుత్రుని ప్రసవించెను అని ఆంజనేయుని జననం వర్ణించబడింది. ఆంజనేయుడు వైశాఖ బహుళ దశమి శనివారం పూర్వాభాద్ర నక్షత్రమున జన్మించినట్లు అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి రచించిన హనుమత్ కథా మంజరిలో గలదు.

బ్రహ్మాండ పురాణంలో వేంకట శబ్దాన్ని

**సర్వపాపాని వేం ప్రాహుః కట స్తద్దాహ ఉచ్యతే ।**
**సర్వ పాప దహో యస్మాత్ వేంకటాచల ఇత్యభూత్ ॥ 6-43**

పాపములన్నింటికి 'వేం' అని పేరు. కటమనగా దహింపజేయునది అని అర్థము. మాధవుని సకల పాపములను దహించివేసినది గావున ఈ పర్వతమునకు వేంకటాచలము అను పేరు ప్రసిద్ధమయ్యెను అని వేంకటాచలం వ్యుత్పత్తిని వివరించింది.

**శ్రవణే విష్ణు నక్షత్రే ముహూర్తే తు శుభే తదా**
**చక్రం భగవతాఽఽజ్ఞప్తం స్వామిపుష్కరిణీజలే**
**చకారాఽవభృథ స్నానం మఖేఽస్మింశ్చ సమాపితే ॥ 9-45,46**

శ్రీనివాసునకు బ్రహ్మ మహోత్సవమును చేసినాడు. ఈ ఉత్సవము యజ్ఞము వంటిది. కనుక మహోత్సవము అను యజ్ఞము పూర్తి అయిన పిమ్మట భగవంతుని ఆజ్ఞచే చక్రము స్వామి పుష్కరిణీ తీర్థమున అవభృథ స్నానము (యజ్ఞాంతమున యజమాని చేయు స్నానము. దీనితో యజ్ఞదీక్ష ముగియును) చేసెను" అని బ్రహ్మాండ పురాణము చక్రస్నానమును వర్ణించింది.

అస్థిసరోవర మాహాత్మ్యమును వెల్లడించు కథలో బ్రహ్మాండ పురాణమున బ్రాహ్మణుని పేరు కృష్ణశర్మ అని అతని భార్య పేరు సుధర్మిణి అని (10-5) చెప్పబడింది. అయితే వరాహ పురాణం ద్వితీయ భాగమునందలి అస్థి సరోవర మాహాత్మ్య కథలో బ్రాహ్మణుని పేరు వీరశర్మ అని, అతని భార్య పేరు లక్ష్మి అని (10-54,55) చెప్పబడింది.

బ్రహ్మాండ పురాణాన్ని కావూరి ఎల్లయ్య కవి, జనమంచి శేషాద్రిశర్మ, దివాకర్ల రామమూర్తి (వచనం) అనువదించారు. ఇందులో వేంకటాచల మాహాత్మ్యము లేదు.

* * *



# 11. వామన పురాణము

శ్రీవేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథములోని వామన పురాణ భాగములో 25 అధ్యాయములలో (20-44) వేంకటాచల మాహాత్మ్యము వర్ణించబడింది. వామన పురాణములో ప్రయాగ మాహాత్మ్యము, శంకరుడు స్కందునికి బ్రహ్మహత్యా పాపవిముక్తి మార్గమును ఉపదేశించుట, వేంకటాద్రి వర్ణన, వేంకటాద్రిపై స్కందుడు తపస్సు చేయుట, శ్రీనివాసావిర్భావము, స్కందుడు బ్రహ్మ హత్యాపాతకమునుండి విముక్తుడగుట, ఇంద్రుని వృత్తాంతము, విష్వక్సేనుని వృత్తాంతము, చక్రాది సప్తదశ తీర్థ మాహాత్మ్యము, వాయుదేవుడు భగవన్నారాయణుని గూర్చి తపస్సు చేయుట, వాయువు భగవంతుని విశ్వరూపమును స్తుతించుట (ఈ స్తోత్రము భగవద్గీత లోని భగవంతుని విశ్వరూప వర్ణనకు (అధ్యాయం-11) అనుసరణగా ఉంది) భగవంతుడు వాయువునకు స్వసాన్నిధ్యమును అనుగ్రహించుట, అగస్త్య మహర్షి వేంకటాచలం నలువైపులా భగవంతుని అన్వేషించుట, అగస్త్యాది ఋషులు వేంకటాద్రి యందలి పుణ్య తీర్థములలో స్నానము చేయుట, పంచతీర్థ మాహాత్మ్యము, స్వామిపుష్కరిణ్యాది పుణ్యతీర్థ మాహాత్మ్యము, శంఖరాజు వృత్తాంతము, ఉపరిచర వసువు వృత్తాంతము, భగవంతుని దర్శింపగోరి బ్రహ్మరుద్రాది దేవతలు వేంకటాద్రికి వచ్చుట, భగవంతుని ఆవిర్భావము, బ్రహ్మరుద్రాది దేవతలు, అగస్త్యాది మహర్షులు, శంఖరాజాదులు భగవంతుని స్తుతించుట, వారితో భగవంతుని సంభాషణ, భగవన్నారాయణుడు బ్రహ్మరుద్రాది దేవతలకు, అగస్త్యాది మహర్షులకు, శంఖరాజుకు వరములను ప్రసాదించుట, భగవంతుని అంతర్ధానము, బ్రహ్మరుద్రాది దేవతలు స్వస్థానములకు వెడలుట, దేవజిత్తు మొదలగు రాక్షసులు చేసిన లోకోపద్రవ వర్ణన, వారిని సంహరించుటకు విష్వక్సేనుని రాక, విష్వక్సేన రాక్షసుల యుద్ధము, విష్వక్సేనుని విజయము ఆతనిని దేవతలు ప్రశంసించుట, స్వామి పుష్కరిణీ మాహాత్మ్యము, బ్రహ్మదేవుడు శ్రీనివాసునికి మహోత్సవమును

నిర్వహించుట మొదలగు వృత్తాంతములు మనోహరముగ, విపులముగ వర్ణింపబడినవి.

వామన పురాణము –

**యచ్ఛరీరం త్రయో వేదాః యచ్చేష్టాఽఽథర్వణః స్మృతః ।**
**యదంగాని షడంగాని తస్మై వాగాత్మనే నమః ॥**

ఋగ్వేద, యజుర్వేద, సామవేదము లనెడు మూడు వేదములు (త్రయి) శరీరముగా గలవాడు, అథర్వణ వేదము క్రియగా గలవాడు, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను ఆరు వేదాంగములు అవయవములుగా గలవాడు అగు బ్రహ్మకు నమస్కారము అని వాగాత్మకమయిన శబ్దబ్రహ్మకు నమస్కరించుటతో ప్రారంభమైంది. ఈ పురాణంలో వజ్ర తీర్థం (శక్రతీర్థం) వర్ణించు సందర్భంలో శంకరుడు పార్వతికి చెప్పిన

**న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి ।**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ 22–70**

'కోరికలు ఎన్నటికిని అనుభవించుట చేత ఉపశమించవు. నెయ్యి పోసిన కొలది అగ్ని ప్రజ్వరిల్లునట్లు, అనుభవించిన కొలది విషయములందు కోరికలు అభివృద్ధి యగుచుండును' అను శ్లోకము మనుస్మృతి 2–94 నుండి గ్రహింపబడినది.

వామన పురాణములో భగవన్నారాయణుడు వేంకటాద్రికి గల వివిధ నామముల గురించి గరుత్మంతునితో చెప్పుచు

**యుగే యుగే గిరి రయం నామాని వివిధాని వై ।**
**గమిష్యతి వరాణ్యేవ వరదోఽయం వృషాచలః ॥**

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయాం గరుడాచలమ్ ।**
**ద్వాపరే శేష శైలంచ వేంకటాద్రిం కలౌయుగే ॥ 24–105,106**



ఈ వృషాచలము ప్రతియుగమున అనేక నామములను నేను ఒసంగు వరముల కారణముగా పొందుచుండును. కృతయుగమున ఈ పర్వతమునకు వృషాద్రి అనియు, త్రేతాయుగమున గరుడాచలమనియు, ద్వాపరయుగమున శేషాచలమనియు, కలియుగమున వేంకటాచలమనియు నామములు కలుగును అని వివరించినాడు. శ్రీవేంకటాచల మాహాత్మ్య గ్రంథములోని వరాహ పురాణం ద్వితీయ భాగములో యుగభేదము వలన శేషాచలమునకు ఏర్పడిన నామములను

**కృతేఽంజనాద్రిం త్రేతాయాం నారాయణ గిరిం తథా ।**
**ద్వాపరే సింహశైలంచ కలౌ శ్రీ వేంకటాచలమ్ ॥ 1–55**

కృతయుగమున అంజనాద్రి, త్రేతాయుగమున నారాయణాద్రి, ద్వాపర యుగమున సింహాద్రి, కలియుగమున వేంకటాద్రి అని వివరించబడింది.

భవిష్యోత్తర పురాణ భాగము –

**కృతే వృషాద్రి వక్ష్యంతి త్రేతాయా మంజనా చలమ్ ।**
**ద్వాపరే శేష శైలేతి కలౌ శ్రీ వేంకటాచలమ్ ॥ 1–36**

కృతయుగమున వృషాద్రి, త్రేతాయుగమున అంజనాద్రి, ద్వాపర యుగమున శేషాద్రి, కలియుగమున వేంకటాద్రి అనునామములు యుగ భేదములచే గల్గినవి అని వివరించింది. ఇతర యుగములలో ఈ పర్వతమునకు ఏర్పడిన నామములలో అభిప్రాయ భేదము ఉన్నను, మూడు పురాణములు (వామన, వరాహ, భవిష్యోత్తరములు) కలియుగమున వేంకటాద్రి అనుపేరు గలిగెననుటలో ఏకాభిప్రాయము గల్గియున్నవి.

వామనపురాణము వేంకట శబ్దమును

**వేంకారోఽమృత బీజం తు కట మైశ్వర్యముచ్యతే ।**
**అమృతైశ్వర్య సంఘత్వా ద్వేంకటాద్రి రితి స్మృతః ॥ 24–107**

వేం అను అక్షరము అమృత బీజము, కటమనగా ఐశ్వర్యం అని అర్థము. అమృతైశ్వర్యముల కలయిక యగుటచే ఈ పర్వతము వేంకటాచలం అను సార్థక నామము కల్గియున్నది – అని వివరించింది. బ్రహ్మాండ పురాణము

**సర్వపాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే ।**
**సర్వ పాప దహో యస్మాత్ వేంకటాచల ఇత్యభూత్ ॥ 6-43**

పాపములన్నింటికి 'వేం' అనిపేరు. కట మనగా దహింపజేయుట, సర్వ పాపములను దహింపజేయునది కావున శేషాద్రికి వేంకటాద్రి అనుపేరు సార్థకంగా ఉంది అని వేంకటశబ్దాన్ని వివరించింది.

స్వామిపుష్కరిణి లక్ష్మీనారాయణుల సాన్నిధ్యముచేత పవిత్రమైనదని వామన పురాణం

**స్వామితీర్థం మహాపుణ్యం సర్వపాప ప్రణాశనమ్ ।**
**యస్య తీరే జగన్నాథో రమతే రమయా సహ ॥ 30-33**

స్వామిపుష్కరిణి పుణ్యప్రదమైనది. సమస్త పాపములను హరించునది. దీని తీరమున శ్రీనివాసుడు లక్ష్మీదేవితో విహరించుచున్నాడు అని వర్ణించింది.

వామన పురాణంలో కూడ వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రము బ్రహ్మాండములో లేదని, వేంకటేశునికి సాటియగు దేవుడు పూర్వము లేడు. రాబోవు కాలమున ఉండదు అని (37-41) వేంకటాద్రి, వేంకటేశుని లోకోత్తర అతిశయము, అపూర్వ వైభవము ప్రశంసింపబడింది.

వామన పురాణము శ్రీనివాసుని –

**స ఏవ భగవాన్ దేవో ధ్యేయోఽస్మాభి స్సనాతనః ।**
**నాన్యో ధ్యేయః పుమాన్ యస్మాత్ విద్యతే చ న దృశ్యతే ॥ 27-37**



సృష్టి స్థితి లయ కారకుడు, సనాతనుడు, దేవాది దేవుడు అగు నారాయణుడే ధ్యానింప తగినవాడు, ఆ దేవునికంటె ధ్యానింప దగిన పురుషోత్తముడు లేడు – ఎందును కానరాడు అని స్తుతించింది.

వామన పురాణము వేంకటాద్రియందున్న పెక్కు పుణ్యతీర్థములను, వాటి మాహాత్మ్యములను వర్ణించింది. అట్లే వేంకటాద్రి పాదమూలమునగల చక్రతీర్థ (కపిలతీర్థ) మాహాత్మ్యమును వర్ణించింది. వాయుపురాణం చక్రతీర్థానికి నామాంతరంగా కపిల తీర్థమును ప్రశంసించింది. ఇందులో చక్రతీర్థము ప్రాచీన నామమని, కపిలతీర్థము అర్వాచీనమని శాసనముల మూలముగా తెలియుచున్నది. ఈ చక్రతీర్థమను పేరు రామానుజాచార్యుల కాలం నుండి శాసనముల మూలముగా తెలియుచున్నది. శ్రీ గోవిందరాజ స్వామి (తిరుపతి) తీర్థ సేవలన్నియు ఈ తీర్థముననే జరుగుచున్నవి. చక్రతీర్థమునకు కపిల తీర్థమను నామాంతరము తి.తి.దేవస్థానం ప్రాచీన శాసనములలో లేదు. దీనికి చక్రతీర్థం, సుదర్శన చక్రత్తాళ్వారు తీర్థము, ఆళ్వారు తీర్థం అను నామాంతరములు శాసనములలో కనిపించుచున్నవి. విజయనగర చక్రవర్తి అచ్యుతరాయలు 25-06-1531 (సంఖ్య.8, సంపుటి.4, తి.తి.దే.శాసనములు, 1998) నాడు వేయించిన శిలాశాసనములో ఈ తీర్థము "శ్రీ తిరువెంగళనాథ దేవు దివ్యతీర్థం తిరుపతి చక్రతీర్థం" అని వర్ణించబడింది. తి.తి.దే.శాసనములలో సంపుటం 4 లోని సంఖ్య.49, తేది 13-07-1535 నాటి శాసనములో, సంఖ్య 169 తేది 20-01-1542 నాటి శాసనములో, సంపుటం:5 లోని సంఖ్య:34, తేది 19-03-1544 నాటి శాసనములో, సంఖ్య.92 తేది 03-06-1547 నాటి శాసనములో ఈ తీర్థం ఆళ్వారు తీర్థమని వ్యవహరించబడింది. దేవదాసి సెవ్వసాని వేయించిన తేది :30-01-1563 నాటి శాసనం (సంఖ్య.172 సంపుటి.5) లో కపిలేశ్వర దేవాలయం పేర్కొనబడింది. కాని కపిలతీర్థం పేరు గాని, ప్రస్తావన గాని లేదు.

తిరుమల తిరుపతి దేవస్థానముల విచారణ కర్త మహంతు ధర్మదాసు చక్రతీర్థమును పునరుద్ధరించి వేయించిన (జి.టి.209) 18-02-1865 నాటి శాసనములో మొట్టమొదటగా కపిలతీర్థం పేరు కనిపించుచున్నది. ఇట్లు క్రీ.శ.19 శతాబ్దం వరకు చారిత్రకముగా కనిపించని కపిలతీర్థము అను పేరు, చక్రతీర్థమునకు పర్యాయవాచకముగ వామన పురాణంలో అధ్యా:23-42, 50, 24-118 శ్లోకములలో ప్రశంసింపబడుటచేత శ్రీవేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథములోని వామనపురాణ భాగము క్రీ.శ.1865 తర్వాత రచింపబడినదని స్పష్టమగుచున్నది.

వామన పురాణమును పొన్నతోట ఔబళకవి లింగమకుంట రామకవి, ఎలకూచి బాలసరస్వతి, రామావఝుల కొండయ్యశాస్త్రి, కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు (వచనం). ఏలూరుపాటి అనంతరామయ్య (వచనం) అనువదించినారు. ఈ మూల వామన పురాణములో వేంకటాచల మాహాత్మ్య భాగము లేదు.

* * *

## 12. భాగవతము

వ్యాస భాగవతములో దశమస్కంధములో ఒక అధ్యాయములో (10-89) కలియుగమున విష్ణుదేవుడు శ్రీనివాసునిగా వేంకటాద్రి చేరుటకు కారణమైన భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన వృత్తాంతము వర్ణించబడింది. పోతన భాగవతములో దశమ స్కంధము ఉత్తరభాగములో 1260 నుండి 1275 వరకు భృగుమహర్షి వృత్తాంతము వర్ణింపబడింది. బలరాముని తీర్థయాత్రను వర్ణించు సందర్భములో "వేంకటాచలంబు దర్శించి" (10-ఉత్తర-9.4.7 వచనంలో ప్రశంసించబడింది. (సంస్కృత భాగవతం 10-79-13 శ్లో॥).

* * *



## 13. వేంకటాచల మాహాత్మ్య గ్రంథ రచనాకాలము

స్వయంవ్యక్తమయిన, కలియుగ దైవమైన శ్రీనివాస అర్చావతారమునకు పౌరాణిక మూలమును పురాణ ప్రశస్తిని నిరూపించుటకు, పసిండి వేంకటత్తురైవరు అను శ్రీవారి అర్చకస్వామి "ఘనుడగు ప్రౌఢమాలకరి కమ్మని పువ్వులు గూర్చి దండ గట్టిన క్రియ" పంద్రెండు పురాణములలో ఉన్నట్లుగ వేంకటాచలక్షేత్ర, తీర్థ, దైవత మాహాత్మ్యములను వర్ణించి అధ్యాయాలను సంగ్రహించి 'తిరువేంకట మాహాత్మ్యము' అను పేరుతో గ్రంథమును ఘటించినాడు. పసిండి వేంకటత్తురైవరు శ్రీనివాసుని సన్నిధిలో దేవతా ప్రీతికొరకు తిరువేంకట మాహాత్మ్య గ్రంథమును పారాయణము చేయుటకు ఏర్పాటుచేసి క్రీ.శ.27-06-1491 తేదీన శాసనం వేయించినాడు (సంఖ్య:95 సంపుటం:2 తి.తి.దే.శాసనములు, 1998).

శ్రీవేంకటాచల మాహాత్మ్య సంకలన గ్రంథములోని వరాహపురాణం ప్రథమ భాగములో 34 వ అధ్యాయంలో గరుత్మంతుడు వైకుంఠమునుండి భూమికి తెచ్చి సువర్ణముఖి నదికి సమీపమున, ఉత్తర దిక్కున నిలిపిన శ్రీమన్నారాయణుని క్రీడాద్రియగు వేంకటాద్రిపై భగవంతుని ఉనికిని వర్ణించిన సందర్భములో -

**విమానే విమలే దివ్యే కోటిసూర్య సమప్రభే**
**రత్నస్తంభ సమోపేత శ్రీ మహామణి మండపే...**
**...మధ్యే విమానం పద్మాక్షః శ్రీనివాసః పరాత్పరః**
**అతిష్ఠత్ దేవదేవోఽపి శంఖ చక్ర గదా ధరః ॥ 34-25, 26 శ్లో॥**

కోటిసూర్యుల కాంతితో సమానమైన కాంతి గలిగియున్న రత్న స్తంభములచే నిర్మింపబడిన మహామణి మండపము (ఘంటామండపము) గలిగియున్న స్వచ్ఛమైన దివ్యమైన ఆనందనిలయ విమానము నందు పరాత్పరుడగు

శ్రీనివాసుడు శంఖచక్రగదాధారియై దేవదేవుడై నిలిచి యుండెను" అను వర్ణన గలదు. మరొకచోట

**"బహుప్రకాశ సంపన్నం మణిమండప సంయుతమ్"**

**- వరాహ 42-11**

అను ప్రయోగము గలదు.

పై వర్ణనలో మహామణిమండప ప్రశంస, ప్రస్తావన గలదు. తిరుమల శ్రీవేంకటేశ్వరాలయమున గరుడ మందిరమునకు బంగారు వాకిలికి మధ్య ఉన్న ముఖ మండపమునకే మహామణిమండపమని పేరు. ఒకప్పుడు బంగారు వాకిలికి ఇరువైపుల జయవిజయుల విగ్రహములకు ప్రక్కన రెండు పెద్ద ఘంటలు ఉండేవి. ఈ ఘంటలను స్వామికి నైవేద్యము జరుగు సమయములలో మ్రోగించేవారు. ప్రస్తుతం ఈ రెండు పెద్ద ఘంటలు ఒక చోటనే బంగారు వాకిలికి దక్షిణం వైపున ఉన్నవి.

ఈ ఘంటామండపము (మహామణి మండపం)ను విజయగనర చక్రవర్తి రెండవ దేవరాయలకు మంత్రిగా, రాజప్రతినిధిగా చంద్రగిరిలో నివాసం ఉన్న అమాత్య శేఖరమల్లన (మాధవదాసు) నిర్మించి క్రీ.శ.25-08-1417 తేదీన శ్రీవేంకటేశ్వరస్వామికి సమర్పించి, శాసనం వేయించినాడు. (సంఖ్య:196, సంపుటం:1, తి.తి.దే.శాసనాలు, 1998).

ప్రాచీన కాలం నుండి తిరుమల-తిరుపతి ప్రాంతం తెలుగు ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతము. వైష్ణవ మతం తమిళ దేశం నుండి ఈ ప్రాంతానికి వచ్చింది. ఆ మతాన్ని వెంట తీసుకొని వచ్చిన మతాచార్యులు, అర్చకులు, భక్తులు తమిళ భాష, దేశీయ ఆచార సంప్రదాయముల ప్రకారం పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, ఆలయ పరిపాలన నిర్వహించినారు. క్రీ.శ.15 వ శతాబ్దంలో తిరుమల ఆలయ పరిపాలకులుగ, స్థానత్తారులుగ, జియ్యరులుగ



తమిళ వైష్ణవులు ఉండేవారు. ఆకారణంగా తెలుగు దేశంలోని వైష్ణవ ఆలయాలలో తమిళ భాషకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ కారణంగానే తి.తి.దేవస్థానముల శాసనములలో 92 శాతం తమిళ వైష్ణవ పరిభాషతో, తమిళీకరించిన వ్యక్తుల పేర్లతో, గ్రామనామములతో తమిళభాషలో చెక్కబడినాయి. ఈ కారణంగానే తిరుమల దేవాలయ ముఖమండపం రెండు పెద్ద ఘంటలు ఉండడంచేత ఘంటామండపమని తెలుగులో, మహామణి మండపమని తమిళంలో పిలువబడింది. తమిళభాషలో మణి అంటే ఘంట. అందుచేత ఘంటామండపం మణిమండపం అని పిలువబడింది. అందులోని ఘంటలు పెద్దవి అగుటచే ఆ పేరుకు విశేషణం చేరి 'మహామణి మండపం' అయింది. దానికి శ్రీ (తిరు) వాచకం చేరగా 'తిరుమహామణిమండపం' గా పిలువబడింది. ఈ పేరే 25-08-1417 నాటి తమిళ శాసనంలో ఉన్నది. ఈ మహామణిమండపమే వరాహపురాణంలో వర్ణించబడింది. కనుక వేంకటాచల మాహాత్మ్య గ్రంథములో మొట్టమొదటి భాగంగా ఉన్న వరాహపురాణం క్రీ.శ.1417 తర్వాత క్రీ.శ.1491 లోపల రచింపబడి యుండునని స్పష్టమగుచున్నది.

శాసన, చారిత్రక ఆధారములనుబట్టి వేంకటాచల మహాత్మ్య ప్రశంసగల పురాణ భాగములు ఏవియు క్రీ.శ.15 శతాబ్దికి ముందు రచింపబడియుండ లేదని ధ్రువపడుచున్నది.

* * *

# ప్రస్తావన కావ్యములు

## 4.1 ప్రస్తావన కావ్యములు

ప్రాచీనకాలంలో ఆంధ్రులకు ఇలవేల్పు అహోబలనరసింహస్వామి. శ్రీనివాసుడు (వేంకటేశ్వరుడు) కూడ తన వివాహ సందర్భంలో ముందు అహోబలనరసింహస్వామికి నివేదన చేసి, పిమ్మట ఆహూతులకు విందు చేశాడు. భారతకవిత్రయంలో మూడవ వాడైన ఎఱ్ఱన యొక్క తాత ఎరపోత సూరికి అహోబల నరసింహస్వామి ఇష్టదైవం. మధ్యకాలంలో భద్రాచలం శ్రీరామచంద్రుడు ఆంధ్రుల ఇలవేల్పు అయినాడు. ఆధునిక కాలంలో కలియుగదైవం తిరుమల వేంకటేశ్వరస్వామిని ఆంధ్రులు ఇష్టదైవంగా పూజించుచున్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులయిన ఆంధ్రకవులు కొందరు తమ కావ్యాలలో తీర్థయాత్రా వర్ణనలలో వేంకటాచల ప్రశంస, వేంకటేశ్వర స్తుతి చేసినారు. ఈ కావ్యములన్నియు 'శ్రీ వేంకటేశ్వర సాహిత్య సర్వస్వము' లో చేరుతాయి. ఈ అధ్యాయంలో ప్రస్తావ వశమున వేంకటేశ్వరస్వామిని, వేంకటాచలమును ప్రస్తుతించిన కావ్యముల పరిశీలన చేయబడుచున్నది. ఈ కావ్యములలోని స్తుతులు వేంకటేశ్వరస్వామి మహిమలను, వేంకటాచల క్షేత్ర మాహాత్మ్యమును, కవుల భక్తిని వెల్లడించుచున్నవి.

### 1. నృసింహ పురాణము - ఎఱ్ఱన (క్రీ.శ.14 శతాబ్దం)

ఆంధ్రమహాభారతంలో అరణ్యపర్వ శేషమును రచించిన ఎఱ్ఱన ఆపస్తంబసూత్రుడు . శ్రీవత్సగోత్రుడు. శివభక్తుడయిన సూరనార్యునకు, పోతమాంబికకు పుత్రుడు. ఎఱ్ఱన తాత ఎరపోతసూరికి అహోబలనరసింహ స్వామి ఇష్టదైవం. అందువలన ఎఱ్ఱన తాతగారి అభీష్టము నెరవేర్చుటకు అహోబల నరసింహస్వామి అవతార సంస్తవం చేస్తూ ప్రబంధం రచించాడు. ఈ 'నరసింహావతారం బను పురాణకథ' నృసింహపురాణముగా ప్రసిద్ధ మయింది.

ఎఱ్ఱన శివభక్తుడు. ఎఱ్ఱన గురువు శివార్చనా శీలుడైన శంకరస్వామి. ఇతడు ఎఱ్ఱనకు 'శంభుదాసుడు' అను లక్షణాభిధేయాన్ని ప్రసాదించాడు. ఎఱ్ఱన రచించిన నృసింహపురాణంలో అహోబల నరసింహస్వామి ఆ క్షేత్రం పైన ఉండే మమకారాన్ని ఇట్లు వెల్లడించినాడు.

**సీ. క్షీరాబ్ధి భవనంబు, శ్రీపురుషోత్తమం**
**బాది కేశవ మనంతాలయంబు**
**శ్రీ కాంచిపురి హరిక్షేత్రంబు మధుర శ్రీ**
**ద్వారక, శ్రీరంగ భూరి పదము**
**శ్రీ కూర్మ సదనంబు సింహాచలంబును**
**నాది వరాహ సమాశ్రయంబు**
**మాధవాఖ్యంబు గదాధర నిలయంబు**
**బదరీవనము, శార్ఙ్గపాణి గృహము**

**ఆ. మొదలుగా త్రిలోక విదితంబులగు మహా**
**స్థానములును సుజన సంస్తవముల**
**నొప్పుఁగాని, నా కహోబల తీర్థంబు**
**పగిది నధిక వల్లభములు గావు.**

**– నృసింహ పురాణం, 5–169**

పాలకడలి, పురుషోత్తమ క్షేత్రం, కంచి, ద్వారక, శ్రీరంగం, శ్రీకూర్మం, సింహాచలం, ఆదివరాహక్షేత్రం (తిరుమల) బదరీవనం మొదలగు ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రములు నాకు ఆశ్రయములుగ ఉన్నవి. కాని నాకు ఆ పుణ్యక్షేత్రములు అహోబలక్షేత్రమువలె మిక్కిలి ప్రీతిని కల్గించేవి కావు. అని అహోబల నరసింహుడు బ్రహ్మదేవునికి తెలిపినాడు. ఇందులో తిరుమల (వేంకటాచలం) ఆదివరాహక్షేత్రమని పేర్కొనబడింది.

శ్వేతవరాహకల్పాదిలో పాతాళము నుండి భూమండలమును ఉద్ధరించి, యథాస్థానములో నిలిపిన శ్వేత వరాహ విష్ణుమూర్తి వేంకటాద్రిపై ఆది వరాహమూర్తిగా నివసించినాడు. అందుచేత వేంకటాద్రి ఆది వరాహక్షేత్రముగా పిలువబడింది. ఈ క్షేత్రమునే 'ఆది వరాహ సమాశ్రయంబు' అని నృసింహ స్వామి పేర్కొన్నాడు.



మొట్టమొదట తిరుమల క్షేత్రంలో వెలసిన దైవం ఆదివరాహస్వామి. అందువల్లనే స్వామికి ప్రథమ దర్శనం, ప్రథమ పూజ, ప్రథమ నైవేద్యం నేటికీ జరుగుచున్నవి. అందువల్లనే తిరుమల 'ఆదివరాహక్షేత్ర' మని ప్రసిద్ధి పొందింది.

* * *

## 2. సింహగిరి వచనములు : కృష్ణమాచార్యులు

కృష్ణమాచార్యులు (క్రీ.శ.1268–1323) సింహాచలం వరాహ నరసింహస్వామి భక్తుడు. స్వామిని సంబోధిస్తూ గానయోగ్యమైన వచనములను రచించినాడు. వీటికి 'సింహగిరి వచనములు' అనిపేరు. కృష్ణమాచార్యులు వచన రచనా భేదములైన గద్య, బిరుదు గద్య, చూర్ణిక, వచనము, విన్నపము అను అయిదింటిలో చూర్ణిక, వచనము, విన్నపములను రచించినాడు. ఇతడు కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుని చేత పూజింప బడినాడు. కృష్ణమాచార్యులు మొట్టమొదటగా తాను రచించిన సింహగిరి వచనములను తామ్ర పత్రములపై చెక్కించి, వాటితో తీర్థయాత్ర చేసి వైష్ణవ మత ప్రచారము చేసినాడు. ఇతని వలె తమ రచనలను రాగిరేకులపై వ్రాయించారు తాళ్ళపాక కవులు. కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి వచనములలో 21, 43 వచనములలో వేంకటేశుని ప్రస్తావన ప్రశంసలు ఉన్నవి.

"దేవా! ఈ లోకంబున **శేషాచలంబున వెంకట** నామధేయుండ వైతివి. దేవా! లోకంబులోని ధర్మాధర్మంబులకు బరమ భాగవతోత్తముల పాలికి సింహాచలంబున నిలిచితివి" (21 వచనం).

ఈ వచనంలో కృష్ణమాచార్యుడు శేషాచలపతి వేంకటేశ్వరునకు, సింహాచలాధిపతి నృసింహునకు అభేదాన్ని వర్ణించాడు. కృష్ణమాచార్యుల కాలంలో యాత్రికులు శ్రీశైలానికి వెళ్ళి శైవులయ్యేవారని, తిరుపతుల దర్శించి వైష్ణవులయ్యేవారని, "దేవా! (శ్రీ) పర్వతంబునకు బోయి శైవులగుదురు. తిరుపతుల జూచి వైష్ణవులగుదురు" (43 వచనం) అను వచనం మూలంగా తెలుస్తున్నది.

కృష్ణమాచార్యులు తీర్థయాత్రలు చేసి సింహాచలం చేరుతాడు. ఆనాడు స్వామి ఆలయం వాకిళ్ళు మూసి ఉంటాయి. కృష్ణమాచార్యులు ఇది న్యాయమా! స్వామీ అని బాధపడుతాడు". శ్రీ యహోబలమును, శ్రీరంగమును, వేంకటాచలంబును, కాశీ క్షేత్రంబును, ద్వారకంబును, నయోధ్యంబును, శ్రీ పురుషోత్తమును జూచి, దేవా! మీ గృహంబున కరుదెంచిన కవాటంబులు మూయ మీకుదగునా? అని వ్యాకులంపడుతాడు.

* * *

## 3. హరవిలాసము – శ్రీనాథుడు (1370–1460)

కవిసార్వభౌముడను బిరుదుగల శ్రీనాథుడు మహాకవి. ఈశ్వరార్చన కళాశీలుడు. సరస సాహిత్య చక్రవర్తి, కవితా విద్యాధరుడైన కమల నాభామాత్యుని మనుమడు. ఉద్భట ప్రౌఢ వివాదంలో విజయనగర ఆస్థాన కవిపండితుడు కవిసార్వభౌముడను బిరుదముగల గౌడ డిండిమభట్టు (అరుణగిరినాథుడు) ను ఓడించి శ్రీనాథుడు కవిసార్వభౌముడను బిరుదమును గైకొన్నాడు. శ్రీనాథుడు ప్రౌఢ దేవరాయలచేత కనకాభిషేక గౌరవాన్ని పొందాడు.

శ్రీనాథుడు శృంగారనైషధము, హరవిలాసము, భీమఖండము, కాశీఖండము, శివరాత్రి మాహాత్మ్యము, పలనాటి వీరచరిత్ర (ద్విపద) మున్నగు కావ్యములను రచించినాడు. శ్రీనాథుడు హరవిలాసమను స్వతంత్ర కావ్యమును రచించి బాల్యసఖుడైన అవచి తిప్పయ్యసెట్టికి అంకితమిచ్చాడు. హరవిలాసములో వేంకటాచల ప్రస్తావన గలదు.

**అర్ధరాత్రంబున నల్లాడ నాథుండు**
**దానె యెవ్వనికిఁ గైదండ యిచ్చె**
**బదకంపుఁ బచ్చను బైవేయ వచ్చిన**
**దనుజారి నిల్పె నెవ్వని నిజంబు**
**<u>అలిగిపోయిన వేంకటాచలంబున కేగి</u>**
**<u>కొనివచ్చె నెవ్వని కుధర ధరుఁడు</u>**
**వైకుంఠనాథుఁడెవ్వని సేవకును మెచ్చి**
**యాత్మ సత్కార కల్యాణ మొసఁగె**

**నతఁడు భాగవతోత్తముం డతఁడు శుద్ధుఁ**
**డతఁడు వైరాగ్య సంపన్నుఁ డతఁడు ఘనుఁడు**
**పరమ వైష్ణవ సభ నుతింపంగఁ దగఁడె**
**కాంచినగరి కుటుంబి శ్రీ కంచినంబి.** **– హరవిలాసం, 1–14**

ఈ పద్యంలో కీర్తింపబడిన భాగవతోత్తముడు తిరుకంచినంబి. అవచి తిప్పయసెట్టికి పూర్వికుడు. భగవద్రామానుజాచార్యులకు గురువు. శ్రీ కంచి నంబి (కాంచీ పూర్ణులు) కంచి వరదరాజుల భక్తుడు. అంతరంగికుడు. ఒకప్పుడు నంబి వరదరాజుల మీద అలిగి వేంకటాచల క్షేత్రాన్ని చేరినాడు. కంచి వరదరాజస్వామి తిరుకంచినంబి అలుకను దీర్చి కంచి నగరమునకు తీసుకొని వచ్చినాడు.

* * *

## 4. కాశీఖండము – శ్రీనాథుడు

శ్రీనాథుడు భారద్వాజగోత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. విద్యారాజీవ భవుడైన మారయకు, భీమాంబకు పుత్రుడు. శ్రీనాథుడు "ప్రాయమెంతయు

మిగుల గై వ్రాలకుండ కాశికాఖండ మను మహాగ్రంథమేను దెనుగు జేసెద"–నని చెప్పినాడు. కాశీఖండములో రెండు సందర్భములలో వేంకటాద్రి ప్రస్తావన ఉన్నది. నారదుడు తీర్థయాత్ర చేస్తూ వింధ్యపర్వతం చేరినాడు. వింధ్య పర్వతుడు తనకు సుమేరు శైలముతో గల ఆధిపత్య కలహము నారుదునితో చెప్పినాడు. అందుకు నారదుడు "శ్రీశైల **వేంకటా**హోబల శోణాద్రి సాలగ్రామాది పర్వతంబులు మహానుభావంబున మీ యిద్దర కంటె నధికంబులు. మీ గర్వాలాపంబులు విని యోర్వవచ్చునే? మిమ్ము నేమన వచ్చును?" (1-105) అని హెచ్చుకుందాడ నేరక వింధ్యపర్వతుణ్ణి మందలించినాడు. వేంకటాచలము స్కాందపురాణ రచనా కాలమునకే మహాపుణ్య క్షేత్రములలో ఒకటిగా భారతీయులచే పరిగణింపబడింది. అయితే శ్రీనాథుడు వేంకటాద్రి తీర్థయాత్ర చేసినట్లుగా ఆధారం లేదు.

బ్రహ్మదేవుడు దివోదాసుని కాశీనగరము రాజధానిగా సాగరవేష్టిత భూమండలమునకు చక్రవర్తిగా పట్టాభిషేకము చేసి బ్రహ్మలోకమునకు వెళ్ళినాడు. పిమ్మట దివోదాసుడు ధరణిలో నుండక దేవతలు స్వర్గమునకు వెళ్ళాలని, సర్పములు పాతాళమునకు వెళ్ళాలని, భూతములు ఇష్టమైన చోటికి వెళ్ళాలని ఆదేశించాడు. అంతట "దివోదాస దాసులు కాశీ శ్రీశైల కుంభకోణ శోణార్క పుండరీక పుర పాండురంగ మహాకాళీ కాళహస్తి కాంచీ **వేంకట** శ్రీరంగవల్మీక రామేశ్వరాది దివ్యస్థానంబుల ఘంటాపథంబుల ఘంటా డిండిమ ధ్వనుల తోడం గూడం జాటినారు". – కాశీఖండం, 5-275 వచనం.

శ్రీనాథుడు దేశాభిమానం గల జాతీయ కవి. దివోదాసుని ఆనతి ప్రకారం పెద్ద దేవతలందరు భూమిని విడిచి స్వర్గమునకు వెళ్ళగా, కుంటి కుదుపులైన చిన్నదేవతలు దివోదాసుని సేవకులై నిలిచి పోయారంటూ శ్రీనాథుడు **"త్యజింపంగ వచ్చునె జన్మదేశముల్"** (5-291) అని ప్రకటించాడు.

* * *



## 5. ఆంధ్రమహాభాగవతము – బమ్మెర పోతన

సహజ పాండిత్యుడని బిరుదు గల్గిన బమ్మెర పోతన 'శ్రీకైవల్యపదంబు జేరుట' ను కావ్యప్రయోజనంగా ఆశించి, ఆంధ్రమహాభాగవతమును రచించినాడు. భక్తపోతన (క్రీ.శ.15 శతాబ్దం) తల్లిదండ్రులు లక్కమాంబ, కేసనలు.

సహజకవి పోతన భాగవతంలో ప్రధానంగా శ్రీకృష్ణుని లీలలను, మహిమలను వర్ణించాడు. అయితే భాగవతాన్ని తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రునకు అంకితమిచ్చినాడు. కలియుగదైవమైన వేంకటేశ్వరుని (శ్రీనివాసుని) అవతారమునకు కారణమైన భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన వృత్తాంతమును భాగవతంలో, దశమ స్కంధములో, ఉత్తర భాగములో 1261-1275 పద్యముల వరకు పోతన వర్ణించినాడు. ఈ భృగు మహర్షి వృత్తాంతం సంస్కృత భాగవతంలో దశమస్కంధములో 89 అధ్యాయంలో వర్ణింపబడింది.

మహాకవి పోతన భాగవతంలో దశమ స్కంధంలో ఉత్తర భాగములో బలరాముని తీర్థయాత్రలను వర్ణిస్తూ "దేవీ పంపా సరస్సుల జూచి, భీమనది కేగి, యందు కుమారస్వామిని దర్శించి, శ్రీశైలంబునకు జని, **వేంకటాచలంబు దర్శించి,** కామకోటి శక్తిని నిరీక్షించి, కాంచీపురంబు గాంచి, కావేరికిం జని, యమ్మహావాహిని నవగాహనంబు సేసి" (947 వచనం) (సంస్కృత భాగవతం 10-79-13 శ్లోకం) అని బలరాముడు వేంకటాచలమును దర్శించినట్లుగా తెలిపినాడు. ఆ కాలంలో భక్తులు వేంకటాచల పర్వతమునే భగవంతుని స్వరూపంగా భావించి, పూజించినారు.

భాగవతం, పంచమ స్కంధములో పోతన భారతదేశమునకు గల పుణ్య శైలంబులను వర్ణిస్తూ "మలయ పర్వతమును, మంగళ ప్రస్థమును, మైనాకంబును, త్రికూటంబును, ఋషభ పర్వతంబును, గూటరమును,

గోల్లమును, సహ్య పర్వతంబును, వేదగిరియును, ఋష్యమూక పర్వతమును, శ్రీశైలంబును, వేంకటాద్రియును, మహేంద్రంబును, వారి ధరంబును, వింధ్య పర్వతంబును...(54 వచనం) (సంస్కృత భాగవతం, 5-19-16 శ్లో॥ అని వేంకటాచల పర్వతమును పుణ్యపర్వతములలో ఒకటిగా పేర్కొన్నాడు.

ఇట్లు సంస్కృత, ఆంధ్ర భాగవతములలో వేంకటాద్రి పుణ్యశైలముగా, భగవంతుని స్వరూపముగా వర్ణించబడింది.

* * *

## 6. విక్రమార్క చరిత్రము - జక్కన

చక్కని కవిత్వమునకు పేరొందిన జక్కన కవి (క్రీ.శ.15 శతాబ్దం) విక్రమార్క చరిత్రము అను కథా కావ్యమును రచించాడు. ఇతని తండ్రి అన్నయామాత్యుడు తల్లి అక్కమాంబ. జక్కన విక్రమార్క చరిత్రమును సిద్ధన మంత్రికి అంకితమిచ్చాడు.

విక్రమార్క చరిత్రములోని ద్వితీయాశ్వాసములో పురందరుని తీర్థయాత్రను వర్ణించు సందర్భములో అతడు సిద్ధపట్టణమున నున్న సిద్ధేశ్వరుని దర్శించిన తర్వాత "...దక్షిణ కైలాసంబనం బ్రశస్తి వహించిన కాళహస్తి మహాస్థానంబును, **ననంతభోగి కటకోత్కటకంబగు వేంకటాచలంబును,** సర్వలోక లోచన సముత్సేధ సౌధ గోపురం బగు కాంచీ పురంబును, ననవరతపరిస్ఫుట కావేరీ సముత్సంగంబగు శ్రీరంగంబును..." దర్శించినాడు. (2-217 వచనం).

ఇట్లు జక్కన కవి ఆదిశేషుని పడగలే పర్వత శిఖరములుగ, నెత్తములుగా ఏర్పడిన శేషాచల (వేంకటాచల) ముసు ప్రస్తుతించినాడు.

* * *



## 7. జైమిని భారతము - పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు

'వాణి నా రాణి' అని ప్రతిన చేసిన విద్వత్కవి పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు (క్రీ.శ.15 శతాబ్దం) సంస్కృతము నుండి జైమిని భారతాన్ని అనువదించి, విజయనగర ప్రభువైన సాళువ నరసింహరాయలకు (క్రీ.శ.1467-1480) అంకితమిచ్చినాడు. వ్యాసభారతములోని అశ్వమేధపర్వమందలి కథయే జైమిని భారతములోని ఇతివృత్తము. దీనిలో శ్రీకృష్ణుని మహిమలు విశేషముగ వర్ణించబడినవి.

పినవీరభద్రుడు జైమిని భారతములో కృతిపతి అయిన సాళువ నరసింహారాయలను **"శ్రీ వేంకటాద్రినాథ దయా వర్ధిత రాజ్య"** - (5-1) అని సంబోధించి, వేంకటనాథుని దయవలన అభివృద్ధి చెందిన రాజ్యము గలవాడని నరసింహరాయలను సంబోధించినాడు. దీనివలన వేంకటేశ్వరుని మహిమ, నరసింహరాయల భక్తి వెల్లడియగుచున్నది.

మరొకచోట, జైమిని భారతములో - "కాంచీ **వేంకట కాళహస్తి** నగరీ కల్యాణ సౌధాంచల ప్రాంచచ్చాసన సాళ్వ శంకిత శశ ప్రాలేయరుఙ్మండలా" (5-238) అని నరసింహరాయలను పినవీరభద్రుడు సంబోధించినాడు.

* * *

## 8. పంచతంత్రము - దూబగుంట నారాయణ కవి

తెలుగుభాషలో లభిస్తున్న మొట్టమొదటి సంపూర్ణ 'పంచతంత్రము' పద్యకావ్యాన్ని రచించిన కవి దూబగుంట నారాయణ కవి (నారయ) (క్రీ.శ.15 శతాబ్దం). పంచతంత్రము ప్రపంచ కథా వాఙ్మయాన్ని ప్రభావితం చేసిన భారతీయ కథాసంపుటి. ప్రధానమైన ప్రపంచ భాషలన్నింటిలోకి విష్ణుశర్మ (క్రీ.శ.3 శతాబ్దం) సంస్కృతంలో రచించిన పంచతంత్రము అనువాదం పొందింది. దూబగుంట నారాయణ కవి తన పంచతంత్ర

పద్యకావ్యాన్ని ఉదయగిరి రాజు బసవరాజుకు అంకితమిచ్చాడు. నాగమాంబ, బ్రహ్మయ మంత్రి నారాయణ కవికి తల్లిదండ్రులు. ఇతడు దూబగుంట పురశాసనుడుగా పనిచేశాడు.

దూబగుంట నారాయణకవి పంచతంత్రమునకు కృతిపతి అయిన బసవరాజును

**లయగ్రాహి.**

**కింకర జనాంబురుహ పంకరుహ మిత్ర**
**రిపు పంకరుహ రాజి హరిణాంక నిభ మూర్తీ**
**శంకర మనోజ్ఞ కరకంకణ వచో విభవ**
**వేంకట గిరీశ కరుణాంకురిత భాగ్యా! - 5-72**

అని కీర్తించాడు. వేంకటేశ్వర స్వామి దయచేత కలిగిన భాగ్యము గలవాడా! అని భావము.

పంచతంత్ర కృతిభర్త బసవరాజు యొక్క తండ్రి తమ్మభూపాలుడు (ఉదయగిరి దుర్గాధిపతి) 15-10-1467న తిరుమల దర్శించి, స్వామిని సేవించినాడు. శాసన సంఖ్య 2-27, తి.తి.దే.శాసనములు, 1998.

* * *

## 9. ఒంటిమిట్ట రఘువీర శతకము- అయ్యలరాజు త్రిపురాంతకుడు

'రఘువీరా! జానకీ నాయకా!' అను మకుటముతో అయ్యలరాజు త్రిపురాంతకుడు (క్రీ.శ.15 శతాబ్దం) ఒక శతకం రచించాడు. ఈ రఘువీరుడు కడప నగర సమీపమున నున్న ఒంటిమిట్టలో వెలసియున్న దైవం. కనుక ఈ శతకం 'ఒంటిమిట్ట రఘువీర శతకం' అని ప్రసిద్ధిని పొందింది.



అయ్యలరాజు త్రిపురాంతకుడు శతకం లోని 87 పద్యంలో "చావుల్ మర్త్యుల కెల్ల గల్గుటలు నిస్సందేహముల్, దేహముల్ చేవల్గల్గిన నాడె, శ్రీగిరి గయా శ్రీవేంకటాహోబిల గ్రావ ప్రాంతములందుఁ జేరవలె" -

'మానవులకు మరణం అనివార్యం. కనుక శరీరంలో చేవ ఉన్నప్పుడె పుణ్యక్షేత్రాలు దర్శించాలి' అని బోధిస్తున్నాడు.

త్రిపురాంతకుడు వైష్ణవ క్షేత్రములలో - 108 దివ్యతిరుపతులలో - ఆంధ్రదేశములో నున్న తిరుమలను, అహోబిలాన్ని పేర్కొన్నాడు.

* * *

## 10. మనుచరిత్ర - అల్లసానిపెద్దన

ఆంధ్రసాహిత్యములో ప్రబంధశాఖకు ఆద్యుడు మార్గదర్శి అయిన అల్లసాని పెద్దన 'స్వారోచిష మనుసంభవము' అను ప్రబంధాన్ని రచించి శ్రీకృష్ణదేవరాయలకు (క్రీ.శ.1509-1530) అంకిత మిచ్చాడు. అల్లసాని పెద్దన 'ఆంధ్రకవితా పితామహ' బిరుదముతో గౌరవింపబడినాడు. ఈ ప్రబంధం 'మనుచరిత్ర' అను సంక్షిప్త నామముతో ప్రసిద్ధమైంది. పెద్దన కావ్యరచన 'అల్లసాని వాని అల్లిక జిగిబిగి' అని కీర్తించబడింది. విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల భువనవిజయమను సభలో కొలువు దీరిన అష్టదిగ్గజ కవులలో మొదటివాడు అల్లసాని పెద్దన.

అల్లసాని పెద్దన మనుచరిత్రలో కృతిపతి అయిన శ్రీకృష్ణదేవరాయలను

**<u>కరుణాకర వేంకట విభు</u>**
**<u>చరణ స్మరణ ప్రసంగ సంగతి మతి</u> కీ**
**శ్వర నరసింహ మహీ భృ**
**ద్వర నందన కృష్ణరాయ ధరణీపతికిన్ 1-47**

అని– **శ్రీవేంకటేశ పదప**

**ద్మావేశిత సదయ హృదయ!** అని (3–1) లో ప్రస్తుతించినాడు".

**భోగీంద్ర శయాన పురుష పూజా ప్రవణా! (5–106)** అని కీర్తించినాడు. రాయలకు వేంకటేశ్వరస్వామి పై గల అనన్యభక్తిని ప్రకటించినాడు.

* * *

## 11. పారిజాతాపహరణము – నంది తిమ్మన

నంది తిమ్మన కౌశికగోత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. తిమ్మాంబ, నందిసింగయ తల్లిదండ్రులు. నంది తిమ్మన శ్రీకృష్ణదేవరాయల వారి అష్టదిగ్గజ కవులలో రెండవవాడు. ఇతడు పారిజాతాపహరణము అను ప్రబంధాన్ని రచించి రాయలకు అంకితమిచ్చాడు. ఈ కావ్యంలో అపూర్వంగా ముక్కును వర్ణించడం చేత నంది తిమ్మన ముక్కు తిమ్మనగా ప్రసిద్ధుడయినాడు. ఇతని కవిత్వము 'ముక్కు తిమ్మనార్యు ముద్దు పలుకు' అని ప్రసిద్ధమైంది.

నంది తిమ్మన పారిజాతాపహరణం కృత్యాదిలో –

**శ్రీమదికింబ్రియం బెసఁగఁ జేర్చిన యుయ్యెల లీల వైజయం**
**తీ మిళితాచ్ఛకౌస్తుభము నిద్దపుఁగాంతి దనర్చి యాత్మ వ**
**క్షోమణి వేది ఁబొల్పెసఁగఁ జూడ్కుల పండువుసేయు వేంకట**
**స్వామి కృతార్థుఁజేయు నరసక్షితినాథుని కృష్ణరాయనిన్! 1–1**

అని వేంకటేశ్వరస్వామిని ప్రశంసించినాడు. మరొక చోట కృష్ణదేవ రాయలను **"శ్రీవేంకటగిరి వల్లభ సేవా పరతంత్ర హృదయ!..."** 4–1 అని కీర్తించినాడు.

* * *



## 12. రామాభ్యుదయం – అయ్యలరాజు రామభద్రుడు

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల వారి అష్టదిగ్గజ కవులలో అయ్యలరాజు రామభద్రుడు ఒకడు. ఇతడు రామాభ్యుదయము అను కావ్యమును రచించి గొబ్బూరి నరసరాజు (క్రీ.శ.1550–70) కు అంకితమిచ్చాడు. రామభద్రుని జన్మస్థలం ఒంటిమిట్ట. ముందు పేర్కొనబడిన అయ్యలరాజు త్రిపురాంతకుడు రామభద్రునికి పూర్వీకుడు. రామభద్రుడు రామాభ్యుదయం కృత్యాదిలో ఇష్టదేవతా ప్రార్థనలో వేంకటాచలపతిని ఇట్లు ప్రార్థించినాడు.

**శ్రీరామా కుచహార నాయకమణిశ్రీఁ జేయుసాకార శృం**
**గారంబై తగు మచ్చ వక్షమున భూకాంతస్థితిన్ దెల్ప సౌ**
**ఖ్యారూఢి న్విలసిల్లు వేంకటనగాధ్యక్షుండు రక్షించు గొ**
**బ్బూరీ తిమ్మనృపాల సింహు నరసింహోర్వీశ చూడామణిన్ ॥ – 1–1**

* * *

## 13. రాజశేఖర చరిత్రము – మాదయగారి మల్లన

శ్రీకృష్ణదేవరాయల వారి అష్టదిగ్గజ కవులలో మాదయగారి మల్లన ఒకడు. ఇతడు రాజశేఖర చరిత్రము అను కావ్యమును రచించి నాదెండ్ల అప్పమంత్రికి అంకితమిచ్చాడు. నాదెండ్ల అప్పమంత్రి శ్రీకృష్ణదేవరాయల ప్రధానమంత్రి తిమ్మరుసుకు మేనల్లుడు. క్రీ.శ.1516–25 ప్రాంతంలో అప్పమంత్రి వినుకొండ, గుత్తిసీమలకు పరిపాలకుడుగా ఉన్నాడు.

మల్లన రాజశేఖరచరిత్రము కృత్యాదిలో –

**శ్రీవక్షోరుహ శాతకుంభ కలశ శ్రీవిభ్రమా పాదన**
**ప్రావీణ్య స్థితి మించు వేంకటగిరి గ్రావ ద్వయాగ్రంబునం**

**దావిర్భూత జనానురాగమునఁ బ్రత్యక్షాకృతిం బొల్చు న**
**ద్దేవోత్తంసుఁడు బ్రోచుగాత, మన నాదిండ్లప్ప దండాధిపున్. 1-1**

అని ఇష్టదేవతా ప్రార్థనలో వేంకటాధిపతిని ప్రార్థించినాడు. మల్లన శంకరపాద సంసేవాసక్తుడు. కృతి భర్త నాదిండ్ల అప్పమంత్రిని 'హరిచరణ పయోజ ధ్యాన సంధాన మార్గా!' (1-93) అని సంబోధించియున్నాడు.

* * *

## 14. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - ధూర్జటి

విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయల వారి అష్టదిగ్గజ కవులలో ఒకడు. ధూర్జటి కవిత్వమందలి మాధుర్యమును గుర్తించి రాయలు

**స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కుల కేలగల్గె నీ**
**యతులిత మాధురీ మహిమ**

అని ఆశ్చర్యపడి ప్రశ్నించినాడు. దానికి తెనాలి రామకృష్ణుడు ఉచిత రీతిని సమాధానం చెప్పాడు.

ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో సువర్ణముఖరీనదిని ప్రశంసిస్తూ, **"వేంకటాచలాలంకారంబై** పరశురామేశ్వర క్రీడారంగంబునకు రంగవల్లికయై, కాళహస్తి పురలక్ష్మీ బాలికామణికి మణిమాలికయై, యోంకారపుట భేదన భాగ్యదేవతా లలామంబై పరస్పర వీచీకరోక్షిప్త శీకర మౌక్తికాక్షత జాలంబుల వారాకరవరుం బరిణయంబయ్యె" అని వర్ణించినాడు.

సువర్ణముఖినది వేంకటాచలమునకు పడమర, దక్షిణ దిశలలో ప్రవహిస్తున్నది. సువర్ణముఖి నది తూర్పు తీరమున పరశురామేశ్వరాలయం గుడిమల్లం అను గ్రామంలో ఉన్నది.

* * *



## 15. ఘటికాచల మాహాత్మ్యము - తెనాలి రామకృష్ణుడు

కృష్ణదేవరాయల వారి అష్టదిగ్గజ కవులలో ప్రసిద్ధుడైన తెనాలి రామకృష్ణుడు వృద్ధాప్యంలో 'ఘటికాచలమాహాత్మ్యము' అను క్షేత్రమాహాత్మ్య కావ్యాన్ని రచించాడు. ఈ మహాప్రబంధమును రామకృష్ణుని అనంతరం ఆతని వంశీకుడు ఖండోజీకి అంకితమిచ్చినాడు. వేంకటగిరి కవీంద్రుడు అవతారికను రచించాడు.

తెనాలి రామకృష్ణుడు తెనాలి అగ్రహార నిర్ణేతగా జీవించాడు. ఇతని తల్లిదండ్రులు గార్లపాటి లక్కమాంబ, రామయ్యలు. రామకృష్ణుడు సరస కవితా సనాధుడని కీర్తింపబడినాడు.

ఘటికాచలమాహాత్మ్యంలో సప్తఋషులు ఘటికాచలము (నేటి షోలింగరు-నరసింహక్షేత్రము) తీర్థయాత్ర చేయుచు, మార్గమధ్యములో నున్న వేంకటాచలమును, వేంకటేశ్వరస్వామిని దర్శించినట్లు వర్ణించబడింది. (ఘటికాచలమాహాత్మ్యము, 2-171-195).

సప్తర్షులు తీర్థయాత్ర చేస్తూ శ్రీకాకుళ ఆంధ్రవిష్ణుదేవుని దర్శించి, కృష్ణానదిలో తీర్థమాడి 'వెన్నునికి దివాణమగు **వేంకటశైలము** జూచు వేడుకతో ప్రయాణం చేశారు. వారు శేష శైలము చేరినారు. తెనాలి రామకృష్ణుడు శేష శైల వర్ణన మనోహరముగా చేశాడు (2-172). ఈ వర్ణన అల్లసాని పెద్దన మనుచరిత్రలో వర్ణించిన హిమాలయ వర్ణనను (2-2) స్మరింప జేస్తున్నది.

తెనాలి రామకృష్ణుడు శేష శైలాధిపతిని వేంకటేశుని విలక్షణంగా ఏడు సీస పద్యాలలో ఇట్లు ప్రస్తుతించాడు (2-175-182).

**ఘటికాచల మాహాత్మ్యము - ద్వితీయాశ్వాసము**

**ఉ. అన్నదిచెన్ను కన్నులకు నామని సేయఁ గృతావగాహనో**
**త్పన్న మహాప్రబోధరసపారగులై మతి వార్ధిపొందుఁగై**

కొన్న యనేకవాహినులఁ గోరిక లీరికలెత్తఁ గ్రుంకుచున్
వెన్నునికిం దివాణమగు వేంకటశైలముఁజూచువేఁడుకన్. 171

చ. చనిచనికాంచి రా దివిజసంయములందఱు ముందఱన్ గన
త్కనక మణిప్రభాజనకధాతు గుహాతటశృంగసాలమున్
జనజని బంధనేంధనధనంజయదంచిత తీర్థజాలమున్
సనకసనందనాది మునిసంస్తుతశీలము శేషశైలమున్. 172

వ. కాంచి తదుదంచితస్థితికి హర్షించి యమందానందకందళితహృదయార విందులై మునిపురందరులందఱందంద వందనంబులాచరింపుచు తత్క్షధరా రోహణంబుగావించి చనిచని ముందఱ నరవిందబృందతుందిల మకరంద కణాసార సంభూత సౌరభోద్వేలంబును తాలహింతాల తమాల రసాల సాల తిలక తిందుక ఘనసార ఖర్జూర జంబీర కర్పూర కదళికా కదంబ కుంద చందన మందార పున్నాగ పూగ నాగకేసర సరళ మన్మథ మధూక పనస పాటల పారిభద్ర భిల్ల బిల్వాది సలలితోద్యానవనవిశాలంబును నుత్ఫుల్ల హల్లక కుముద కువలయ వలయవీథికాసంచరన్మధుకర మధు కరీఝంకారానుకారి ఘుమఘుమారావ తుములకల్లోలమాలికా కేళికాలోల మరాళ గరుత్పుటలజానిలోద్ధూత శీకర శరాసారస్థగిత మార్తాండమండల ప్రభాజాలంబును ద్రవిడ విలాసినీకుచ లికుచద్వయన్యస్త నిస్తుల నవ హరిద్రాలేపనవిభా జనిత చంచత్కాంచన కంచుకభ్రమాలవాలంబును నంత తాంచితారామసీమాంత రోద్దామ మాధవీ మాలతీ మల్లికామతల్లికా కుసుమ విసర కేసరోజ్జ్వలపార్శ్వతలోత్తాలంబును నగు స్వామిపుష్కరిణీ కూలంబున నిలిచి సౌగంధిక బంధురసుగంధగంధిలంబులగు తత్క బంధం బులఁగృతావగాహనులై కాల్యకరణీయంబులు నివర్తించి కాంచన శైలశంకాకారిప్రాకారంబగు తత్ప్రాకారంబుఁజేరంజని. 173



సీ. భేరీ మృదంగ గంభీర రావాటోప
వారిత వారిధివారి రవము
అవిరళధూప ధూమాంబుదాలోకన
తాండవితాహిభుజ్మండలంబు
కేతు పటాంచల కింకిణీ కలకలా
కులిత భాను శతాంగ ఘోటకంబు
ప్రాకారమణివిభాపటల సిందూరిత
కకుబంత దంతీంద్ర గండతలము

ననుదిన నటన్నటీపాద హంసక స్వ
నాకులిత బలి కాంక్షా సమాగతాంబు
జాత సంభవ హంసకంబై తనర్చు
నిందిరాజాని కాంచన మందిరంబు. - ఆనందనిలయం 174

వ. ప్రవేశించి తత్పురోభాగంబున. - వేంకటేశ్వరుని వర్ణన, 175

సీ. పొదుపుగుబ్బలి మీఁదఁబొడుచు భానుని లీలఁ
గల కిరీటము తలఁగలుగు వాని
నఱచందురుని వెన్నుఁజఱచు నెన్నుదిటిపై
ముత్యాల తిరుమణి మురువు వాని
మొసలివా మించుల మిసమిసల్ దీపించు
నొసపరి కుండలయుగము వాని
సెలవుల తుదికెక్కు చిఱునవ్వు డాల్టెక్కు
తళుకు లేఁజెక్కుల కులుకు వాని

కలువ తామర కొలముల వలవఁజేయు
చూపులను చలి వేడియుఁ జూపువాని
విమల లావణ్యజలనిధి వేలఁ బొడము
పగడ మననొప్పు వాతెర సొగసు వాని. 176

సీ. కరశంఖమునకు నేక గ్రీవమనుతేవ
గల గ్రీవ చెలువునఁజెలఁగువాని
తనువెత్తు కీర్తి ప్రతాపంబులన మించు
కరగత శంఖచక్రములవాని
నాకల్పఫలమిచ్చు నా కల్పశాఖల
దాయాదులౌ కేలుదోయివాని
నలకనిర్జితభృంగయౌ నలమేల్మంగ
కిరవైన పచ్చని యురమువాని
కోరి యరుదుగ మొగముల కుట్టి గన్న
యమ్మ నాఁజను పొక్కిటి తమ్మివాని
ఘోర దానవవిపిన కుఠారమైన
బలు కటారంబు కటి తటి గలుగువాని.

సీ. బంగారువ్రాత చెరంగుల రంగారు
పట్టు దుప్పటి కటిఁగట్టు వాని
పద్మ పద్మప్రభాస్పద పాద వేదమం
జీరమ్ములను విలసిల్లు వాని
నతుల చిరత్నరత్నాంశుజాలముల మిం
చుల మించు భూషల నలరు వాని
శృంగార రసరుచిశ్రీలకు నెల వైన
మెఱుఁగు చామనచాయ మేనివాని
సర్వ గీర్వాణ సముదయ సార్వభౌమ
బిరుదకలనాతివిఖ్యాతి వెలయువాని
శుభగుణావాలు నిర్జరస్తుతివిశాలు
వితత కరుణానిధీశు శ్రీవేంకటేశు. 178



సీ. మొల కటారపుఁడెక్కుగలవానిఁ గలవాని
నెనరువానిఁబొగడఁదనరువాని
దయతోడ కూడి చేతనవాని తనవాని
తనయంతవానిగా నునుచు వాని
పదములఁ బొదలు నాపగ వాని పగవాని
పగవాని బురుకను బిరుదు వాని
నెమ్మోము నగవువెన్నెలవాని నెల వాని
చెలి కన్నుదోయిగాఁజెలఁగు వాని

నంబుదపు డంబుమీఱు గాత్రంబువాని
కొండనని కోర్కికొండను కొండవాని
నిలువుగల పైఁడిచెలువుల వలువవాని
మేలుసమకూర్పు నలమేలు మేలువాని. 179

సీ. తల నిల్లుగట్టువ్రతంబుల రాయని
తోమని పళ్యాల నేమగాని
చేరుడుబియ్యాల యోరెముల్ దినువాని
కోణంగి సేవల నాణెగాని
కానుకలకు వడ్డికాసులు గొను వాని
ముక్కోటి తీర్థపు టెక్కులాని
అడుగడ్గునకు మ్రొక్కు లందుకొనెడువాని
కూకటి మాడల గుత్తవాని

శుక్రవారపు సేవల సొగసువాని
మానినులఁ గోరి వలపించు మాయలాని
తిండిమెండయగారిని, దిగళగురుని (ద్రావిడుల దేవుడు)
కాంచి సేవించి సంతోషకలితు లగుచు. 180

సీ. అభివాదనము వృషభాఖ్యమహాహార్య
దివ్యకూటాగ్రవాస్తవ్యునకును
దండంబు గరుడాభిధాన శైలమణీ వి
భాసమానానూనభవనభర్త
కంజలి శేషనామాదికధరణీధ
రాధిత్యకాగృహమేధిమణికి
వినతి శ్రీవేంకటవిఖ్యాతనామధే
యాచలహేమగేహకులపతికి

చిన్నిపూ వంజనాద్రిప్రసిద్ధ నిధికి
శరణు గుహసరసీకేళిసక్త మతికి
మోడ్పుఁగేలు త్రిమూర్తుల మొదలిదొరకు
వెండియుజొహారు వినతవేదండునకును. 181

సీ. సర్వేశ! సర్వాత్మ! సర్వగుణాతీత!
సర్వజనావన సదయహృదయ!
గోపాల గోపాలగోపనధౌరేయ!
గోగోపగోపికా భాగధేయ!
వారణదైన్యనివారణ! వారణ
శిక్షణదక్షిణ సింహశౌర్య!
శేషాచలేశ! యశేషలోకనివేశ!
శేషశరీర విశేషతల్ప!

నీలనీరదనీల వినీలగాత్ర!
తీర్థతీర్థ మహాతీర్థ తీర్థపాద!
నందనందన! సనకసనందననుత!
శరణు శరణయ్య శరణార్థి శరణచరణ. 182



మ. సవరక్షాచణ సామగేయపద భాస్వత్పీతకౌశేయరూ
పవరేణ్యా సుచరిత్ర సూరిజనభావ్యా సేవనాసక్త వా
సవ ముఖ్యామరసైంధవత్పతగరాజా సోమ వాణీశ సం
స్తవ సౌమ్యాత్మక సంగదూరతర సర్వప్రాణిసంరక్షకా. 183

సీ. భువనముల్ పుట్టింప పోషింప నణఁగింప
కర్తయైన ప్రధానమూర్తి వీవ
మస్తకముఖ్యసమస్తాంగ బహులత
లక్షింపఁదగు జగత్కుక్షి వీవ
కొలుచువారలకును గోరికల్దయసేసి
రాజిల్లు వేల్పుల రాజ వీవ
అజుఁడు రుద్రుఁడు నింద్రుఁడాదియౌ దేవతల్
నిజ మెఱుంగని బోధనిధివి నీవ

తలఁపుపండని తాపసావలికిఁజూడ
నలవిగానట్టి బ్రహ్మపదార్థమీవ
శంఖ చక్ర గదా ఖడ్గ శార్ఙ్గ చాప
భూరి విస్ఫూర్తి కీర్తిత భుజుఁడ వీవ. 184

క. విబుధులకు విబుధభూజము
విబుధారిసమూహములకు విషభూజమునై
యబలులకెల్లను బలమై
ప్రబలు మహామహుఁడవీవ పంకజనాభా! 185

సీ. తులసిఁతేకులనైన దూర్వల నైన ను
జలములనైన కంజములనైన
పూని నిన్నీశ్వరుఁబూజించునామహా
మహులకుఁ జేకూరు నిహ పరములు

నీ మహామహిమము నెఱిఁగినవారలు
ధన్యులై వర్తింత్రు ధరణియందు
కంజాసనాదులు గనలేని వేదమం
జీరుని నిన్ను వీక్షింపఁగలిగెఁ

గాన భవవార్ధి దాటఁగాఁగంటి మభవ
మా భవములెల్ల నీడేరె మా జపంబు
లలరె మా మఖముల ఫలములు ఫలించె
వినుతతారాచలాధీశ! వేంకటేశ! 186

క. అనుచుం గొనియాడి పునః
పునరాచరిత ప్రణామముల నెంతయు నిం
పొనరించుచుఁదదనుగ్రహ
వనితామోదానుభావపరవశులగుచున్ 187

వ. ఎట్టకేలకుఁదన్మందిరంబువెలువడి యాగట్టుతేనిం గనుంగొని. 188

గీ. భానుకోటిప్రభల దీలుపఱుచు తఱుచు
జేగురులుగల శిఖరముల్ చెంతనున్న
యంబరంబును కాయమానంబు దాల్చు
మణిమయ స్తంభములువోలె మలయు నిచట. 189

గీ. ఇన్నగము మిన్ను మోచినశృంగములు ఫ
ణాసహస్రముకరణిఁగన్పట్ట ధాతు
రాగయుత తారకలు త దగ్ర మణులౌచుఁ
దనరఁదన శేష సంజ్ఞ సార్థముగఁదెలుపు. 190

గీ. కుసుమ కోరక రాజి నింపెసఁగు భూ జ
శాఖ లలరారు మిగుల నీ శైలభర్త
కదిసియుండెడు గగనంబు కడకు నెత్తఁ
బూను మౌక్తికభూషణభుజములట్లు. 191



గీ. అచల మిది ముక్తి సతిచేతి యలరు బంతి
పాప కదళుల నిలఁగూల్చు భద్రదంతి
యీప్సితార్థ రసమ్ములనీను సురభి
సంయమీంద్రకులా వనీజాతసురభి. 192

క. ఈ శైలవైభవం బీ
దేశికసౌభాగ్య మీసుతీర్థ మహత్త్వం
బీశౌరికరుణ గురు వా
గీశ ఫణీశులకు నైన నెన్నందరమే? 193

ఉ. ఏమితపంబొనర్చితిమొ యేసుకృతంబొనరించినామొ యే
నోములునోచినారమొ మనోరథముల్ మది దైలువారఁగాఁ
గామిత దానపాటవముఁ గల్గిన తండ్రిని వేంకటాచల
స్వామినిఁజూడఁగంటిమి శుభమ్ములుగూడ నఘమ్ము లూడఁగన్. 194

సీ. అనుచు లోననుచుమహానురాగమ్మునఁ
దనిసిపల్కుచు గిరీంద్రమ్ము డిగ్గి
తద్దక్షిణమున విధాత కమండలు
నాళంబు వెడలు స్వర్ణది తెఱంగు
భూరి తటోద్గతిఁబొలుపొంది యఘహర
వారియౌ నయ్యాళువారి తీర్థ
మటఁగాంచి స్నానములాడి కౌశికదిక్త
టాంచల వసదనలాక్షుఁగొలిచి

భక్తి గోవిందరాజులఁబ్రణుతిఁదేల్చి
యా యచలసార్వభౌమునిఁబాయలేకఁ
బెనఁగునాలోకనముల నొయ్యన మఱల్చి
మినుకుటందియదోయిసామినిఁదలఁపుచు. 195

తెనాలి రామకృష్ణుడు వేంకటేశ్వరస్వామిని 'అలమేలు మేలువాని' (అలమేలుమంగ భర్త) అని, 'తోమనిపళ్యాల నేమగాని' (ఎల్లప్పుడు 'ఓడు' అను క్రొత్త కుండపెంకులలో నైవేద్యం స్వీకరించువాడు) అని, 'తిండి మిండయగారిని' (అధికముగా నైవేద్యం స్వీకరించువాడని, 'తిగుళగురుసి' (తమిళుల దేవుడని - కర్ణాటక దేశం లోకి వలస వచ్చి, నిలిచిపోయిన తమిళులను కన్నడిగులు తిగళలని వ్యవహరించేవారు. 'జగళవల్లి తిగళర యేకాంత' (జగడము కాదు- తిగళల యేకాంతము) అను సామెత కర్ణాటకభాషలో గలదు అని విలక్షణమైన విశేషణములతో చమత్కారంగా, భావస్ఫోరకంగా వర్ణించాడు.

నేడు ఆంధ్రుల ఇలవేల్పు తిరుమల వేంకటేశ్వరస్వామి. కాని తెనాలి రామకృష్ణుడు క్రీ.శ.16 శతాబ్దంలో వేంకటేశ్వరుడు తమిళులదేవుడని వర్ణించాడు. (వరాహ) స్వామి పుష్కరిణిని 'గుహసరసి' (కుమారస్వామి పుష్కరిణి) అని వర్ణించాడు. స్వామిని 'వినుత తారాచలాధీశ' (ప్రసిద్ధమైన చుక్కల పర్వతమునకు అధిపతి) అని ప్రస్తుతించాడు. నేడు కపిలతీర్థమని పిలువబడుచున్న పుష్కరిణిని తెనాలి రామకృష్ణుడు 'ఆళువారి తీర్థము' అని వర్ణించాడు. వేంకటేశ్వరస్వామిని తెనాలి రామకృష్ణుడు 'శృంగారరసరుచి శ్రీలకు నెలవైన మెఱుగు చామనిచాయ మేనివాని' (2-178) గా చిత్రించాడు.

* * *

## 16. పాండురంగ మాహాత్మ్యము - తెనాలి రామకృష్ణుడు

తెనాలి రామకృష్ణుని రచనలలో పాండురంగ మాహాత్మ్యము ఉదాత్తమైనది. నవ్యకవిత్వ కళకు ఆలవాలము. రామకృష్ణుడు సరసార్థబోధ ఘటనా హేలా పరిష్కార శారద స్వరూపుడు. పాండురంగ విభుని పదగుంభనం ప్రసిద్ధి చెందింది. తెనాలి రామకృష్ణుడు తన పాండురంగ మాహాత్మ్య కావ్యాన్ని విజయనగర రాజు సదాశివరాయలకు సామంతుడైన



మంగయ సంగరాజు ఆస్థానంలో రాయసం చేయుచున్న విరూరి వేదాద్రికి అంకితమిచ్చాడు.

పాండురంగ మాహాత్మ్యములో అయుతుని తపస్సు మాన్పుటకు కృత్రిమ మునిగా వచ్చిన ఇంద్రుడు తన తీర్థయాత్రలను వర్ణించు మాటలలో శేషగిరి ప్రస్తావన ఉంది.

**కంచి భజించి, శేషగిరి గన్గొని, యాదిము రంగధాము గీ**
**ర్తించి, ప్రయాగ మాధవు నుతించి, గయా ప్రియు శ్రీగదాధరున్**
**గాంచి, కరిద్విష న్నగశిఖామణికిం బ్రణమిల్లి వార్ధినే**
**తెంచిన కొయ్యవేల్పు గని, దిక్కుల తీర్థము లెల్లనాడుచున్॥-5-196**

* * *

## 17. వాసిష్ఠ రామాయణము - మడికి సింగన

మడికి సింగన (క్రీ.శ.15 శతాబ్దం) పద్మపురాణ ఉత్తర ఖండము, భాగవతం దశమ స్కంధము (ద్విపదకావ్యం) వాసిష్ఠ రామాయణము, సకలనీతి సమ్మతము (సంకలన కావ్యం) రచించాడు. వాసిష్ఠ రామాయణము అహోబల నరసింహస్వామికి అంకితమీయబడింది.

మడికి సింగన వాసిష్ఠ రామాయణము అవతారికలో తన గురువులకు నమస్కారము చేస్తూ, వారు తిరువేంగడనాథుని పాదసేవకులని వర్ణించాడు.

**తిరువేంకటనాయక పద**
**సరసిజ మధుకరుల నఖిల సమయజ్ఞుల మం**
**త్రరహస్య విదుల నఘ సం**
**హరులను మద్గురుల ఘనుల నార్యులఁ గొల్తున్ ॥ 1-8**

* * *

## 18. కళాపూర్ణోదయము - పింగళి సూరన

కళాపూర్ణోదయము ఆంధ్రభాషలో అద్వితీయ ప్రబంధము. ఇది పింగళి సూరన (క్రీ.శ.16 శతాబ్ది) యొక్క స్వసృష్టి. నవల రూపంలో ఉన్న పద్యకావ్యం. ప్రబంధకవులలో ఎవ్వరి యందు కనబడని ప్రతిభ, భావనాశక్తి, సందర్భ శుద్ధి, పాత్రోచిత పద్యరచన, అపూర్వ కథా సంవిధాన శిల్పం, దృశ్యకావ్య రీతులు కళాపూర్ణోదయమున సమృద్ధిగా ఉన్నవి. 'అచ్చపు బుద్ధికి లేవగమ్యముల్' అను నానుడికి కళాపూర్ణోదయము పరమ ఉదాహరణంగా ఉంది. ఈ ప్రబంధం నంద్యాల కృష్ణమరాజుకు అంకితము. కళాపూర్ణోదయములో మణికంధరుడు తీర్థయాత్ర చేస్తూ వివిధ క్షేత్రములతో పాటు వేంకటాద్రినిగూడ దర్శించినాడు. పింగళి సూరన విశిష్టాద్వైతి. శ్రీవేంకటేశ్వరుని మనోహర దివ్యరూపమును అద్భుతంగా వర్ణించినాడు. (2-132).

శ్రీకృష్ణదేవరాయల యుగములో వెలువడిన ఆంధ్రసాహిత్యములో వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ రూపమును (విగ్రహమును) సమగ్రముగ వర్ణించిన కవులలో పింగళి సూరన ప్రథముడు. స్వామి స్వరూపమును ఆరోహణ క్రమమున సంప్రదాయము అనుసరించి సూరన వర్ణించాడు.

**కళాపూర్ణోదయము - ద్వితీయాశ్వాసము - 126-137.**

సీ. ఇత్తెఱంగునఁ బురుషోత్తమ శ్రీజగ
న్నాథుని సంసేవనమునఁదనరి
శ్రీకూర్మవిభునియంఘ్రి సరోరుహంబులు
గనుఁదమ్ములకు విందుగా నొనర్చి
సింహాచలాధీశ సేవావిశేషలీ
లలను జన్మంబు నలంకరించి
శ్రీమదహోబలస్వామిపాదనఖోదు
జాలసంఘము ఫాలశశికి నొసఁగి



గీ. వేంకటేశ్వరచరణారవిందగంధ
నందదిందిందిర శ్రేణినైల్యమునను
నిజశిఖాకాంతికిని బుష్టి నిర్వహింపఁ
జనియె నాదరమేదురస్వాంతుఁడగుచు. **126**

మ. కమనీయోజ్జ్వలశీలశాలి యగు నా గంధర్వుఁడంతన్ ఘన
ప్రమదప్రేమవిశేషసంభృతపరీరంభ క్రియాసంభ్రమ
భ్రమకారాభిముఖ ప్రసారలహరీ బాహాసమూహాసమా
నమనోజ్ఞం బగుస్వామి పుష్కరిణికి న్వచ్చెం గడున్వేడుకన్ **127**

తే. అంత హరిసంతతాశ్రితస్వాంత మైన
స్వామిపుష్కరిణియును నా శౌరిభక్తు
తనువు నన్యోన్యపావనత్వము భజించె
మిగుల మజ్జనసమయ సమ్మేళనమున. **128**

ఉత్సాహ. అంత నిత్యనియమములు సమస్తమును నొనర్చి యా
చెంతఁజెలువు మీఱుచున్న క్షితివరాహమూర్తి శ్రీ
కాంతుఁగొలిచి భక్తివినయకౌతుక ప్రమోదసం
క్రాంతిబలతావిశేషకలితచిత్తవృత్తియై **129**

సీ. మణిమయ ప్రాకార మండప గోపురో
దీర్ణకాంతులచేతఁదేజమునకుఁ
జారునదీహస్త చామరవీజన
వ్యాపారములచేత వాయువునకు
నారాధనార్థయాతాయాతజన విభూ
షారజోవృష్టిచే ధారుణికిని
హృద్యచతుర్విధవాద్యస్వనోపయో
గప్రవర్తనముచే గగనమునకు

గీ. నిజ నవాగరు ధూపజ నీరవాహ
జనన సంబంధ మహిమచే సలిలమునకుఁ
బావనత్వంబు గలుగంగఁబరఁగు వేంక
టేశునగరుఁ దాఁజేరి యిం పెసక మెసఁగ 130

క. మునుపు పరివారదేవత
లను దగ సేవించి నిర్మల ప్రేమభరం
బున మేను గగురుపొడువఁగ
ననఘుఁడతఁడు లోని కరిగి యగ్రమునందున్. 131

సీ. మృదుపదాంబుజములు మెఱుఁగుటం దెలు బైఁడి
దుప్పటియును మొలముప్పిడియును
మణిమేఖలయు దొడ్డమానికలంబును వైజ
యంతియు నురమున నలరుసిరియు
వరదహస్తముఁగటి వర్తిల్లు కేలు శం
ఖముఁజక్రమును దాల్చుకరయుగంబుఁ
దారహారంబులుఁజారుకంతంబు ని
ద్దపుఁజెక్కులును నవ్వుదళుకుపసలు

గీ. మకరకుండలములును దామరలఁదెగడు
కన్నులు మనోజ్ఞనాసయుఁగలికిబొమలు
ముత్తియపు నామమును రత్నముకుటవరము
నెసఁగఁగనుపట్టు శ్రీవేంకటేశుఁజూచె. 132

వ. ఇట్లుచూచి 133

శా. ప్రత్యంగంబును మిక్కిలిం దడవుగా భావించి భావించి యా
దైత్యారాతితనూవిలాసము సమస్తంబున్ విలోకించెఁదా
నత్యంతంబును వేడ్క బొంగుచు నితాంతాశ్చర్యముం బొందుచుం
గృత్యం బేమియుఁగొంతప్రొద్దెఱుఁగ కక్షీణప్రమోదంబుతోన్. 134



వ. పదంపడి నిజానుభవంబిట్టని యుగ్గడింపం దొడంగి. 135

సీ. పదపద్మములఁజిక్కి పాయదు నాదృష్టి
కనకాంబరమున కేకరణిఁదెత్తుఁ
గనకాంబరమునఁగీల్కొనినఁజలింపదే
నుదరబంధమున నెట్లొనరఁగూర్తు?
నుదరబంధమున నిం పొంది భేదిల్లదు
శ్రీవత్సమున కెట్లుచేరఁదిగుతు?
శ్రీవత్సమునఁదారసిలిని రానేరదు
కేలుఁదామరల కేక్రియ మరల్తుఁ?

గీ. గేలుఁదామరలను గళశ్రీల మోవి
మకరకుండలముల గండమండలముల
నాసఁగనుఁగవ బొమలఁగుంతములయందు
నెందుఁబర్విన విడఁజాల దేమి చెప్ప? 136

అని పరమానందంబున నితర ప్రపంచంబు సర్వంబును మఱచి కొంత తడవు నిరీక్షించి తదనంతరంబ దండప్రణామంబులనేకంబులుగావించి విపంచీసమంచితమృదుమధురనినదంబును గంతస్వరంబును నేకంబగుచు లోకుల నస్తోకసమ్మదాశ్చర్య సంభృతస్తంభభావులఁగావింపనద్దేవుని దివ్యమంగళ గుణగానంబు లొనరించె నివ్విధంబున మూఁడహోరాత్రములు సేవించి వేంకటనగంబు డిగ్గి చని చని ముందట. 137

మణికంధరుడు తన దృష్టి ఎలా స్వామిపై ప్రసరించిందో, తన దృష్టి స్వామి ప్రత్యంగముపై నిలిచి ఎలా మరల లేదో, మరలిన తన దృష్టి స్వామిపై మరల ఎలా నిలిచిందో, నిలిచినప్పుడు తన మనోగత భావం ఎలా ఉన్నదో రమణీయంగా, అద్భుతంగా వర్ణించాడు (2-136). ఈ వర్ణనలో పింగళి సూరన 'ఏమి చెప్ప?' ఊతపదంగా ప్రయోగించినాడు.

శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుచున్నప్పుడు ఆనాటి మణికంధరుని (పింగళి సూరన) స్థితినే ఈ నాటి భక్తులు కూడ అనుభవిస్తున్నారు. మణికంధరుడు వేంకటేశ్వరస్వామి దర్శనంతో సమస్తమూ మరిచిపోయాడు. తన్మయత్వాన్ని పొందాడు. కళాపూర్ణోదయంలో పింగళి సూరన భక్తుని మనస్సులో చిరకాలం, స్థిరంగా నిలిచిపోయే వేంకటేశ్వరస్వామి వర్ణన చేసి ధన్యుడయినాడు.

పింగళి సూరన కళాపూర్ణుని వివాహమును "దేవరపెండ్లి"గా భావించి నట్లు సమగ్రముగ, సాంగోపాంగముగ వర్ణించినాడు (7-57 - 7-84), తి.తి.దేవస్థాన శాసనములలో సంపుటం 5-71 శాసనం - తేది 17.07.1546 తాళ్ళపాక అన్నమాచార్యుల మనుమడు, పెదతిరుమలాచార్యుల పుత్రుడు తాళ్ళపాక చిన్నన్న వేంకటేశ్వరస్వామిపెండ్లితిరునాళ్ళ సందర్భంగా వేయించిన శాసనము గలదు. ఈ శాసనములో అయిదు దినములు స్వామివారి పెండ్లి వేడుకలు, విశేషములు విపులముగా వివరించబడినవి. పింగళి సూరన "దేవరపెండ్లి" వర్ణనకు తాళ్ళపాక చిన్నన్న వేయించిన శాసనములోని వేంకటేశ్వరస్వామి "పెండ్లి తిరునాళ్ళ" వర్ణనకు చాల పోలికలు ఉన్నవి. పెండ్లి అయిన తర్వాత వధూవరులచే అరుంధతీ దర్శనముతోపాటు ధ్రువ నక్షత్ర దర్శనము చేయించు సంప్రదాయము కళాపూర్ణోదయమున (7-79,80) వర్ణించి నట్లుగనే తాళ్ళపాక చిన్నన్న శాసనము (17-7-1546) నందు గలదు. (శాసనం 5-71, తి.తి.దే. శాసనములు, 1998).

మణికంధరుడు వేంకటాచలమున (తిరుమలలో) మూడు అహో రాత్రములు ఉండి వేంకటేశ్వరుని దివ్యమంగళ గుణ గానంబుచేసి, కృతార్థుడైనాడు. ఈ వర్ణన మూలమున పింగళి సూరన భక్తులు తమ కోరికలు ఈడేరుటకు వేంకటాచలమున మూడు పగళ్ళు, మూడు రాత్రులు నివసించి స్వామిని సేవించవలెను అను సంప్రదాయాన్ని తెలియజేసినాడు. నేడు భక్తులకు ఈ పాటి వేంకటేశ్వరస్వామి వారి సేవాభాగ్యము కలిగేనా?



కళాపూర్ణోదయములో లక్ష్మీనారాయణ సంవాదములో నారాయణుడు "...లోకానుగ్రహార్థంబుగా నేను నిత్య సన్నిధాన స్థానంబులుగా నంగీకరించిన శ్రీరంగ కాంచీ వేంకటాచలాహోబల పురుషోత్తమాది దివ్యస్థలంబుల కరిగి..." (8-251) అని లక్ష్మీదేవితో చెప్పినాడు. వేంకటాచలం శ్రీహరి నిత్యసన్నిధాన దివ్యస్థలమని చాటినాడు.

* * *

## 19. రాఘవ పాండవీయము - పింగళి సూరన

శ్రీలలాక్షేణ భక్తిశీలుడైన, నానా మహిత ప్రబంధ రచనా ఘన విశ్రుతి గలిగిన పింగళి సూరన తెలుగుభాషలో రామాయణ, భారత కథలను జోడించి 'రాఘవ పాండవీయము' అను తొలి ద్వ్యర్థి కావ్యాన్ని రచించాడు. ఇది ఆకువీటి పెదవెంకటరాజుకు అంకితమీయబడింది. కృతిభర్త తమ్ముడైన పిన వేంకటాద్రిని పింగళి సూరన ఇట్లు వర్ణించినాడు.

**అమరవరభూమి భృన్మస్తకముల గ్రిందు**
**పరచు నిజ పాద కటక సత్రౌఢి చేత**
**విమలధృతి గేశవ ప్రాయణమున వెలయు**
**<u>వేంకటాద్రియు</u> యన చిన వేంకటాద్రి**
**- రాఘవ పాండవీయం, పీఠిక-33 పద్యం**

దేవతల నివాసమైన మేరు పర్వతము యొక్క శిఖరములను క్రిందుపరచు చున్న తన కటకసీమ ఔన్నత్యము చేత శత్రురాజుల తలలను కింది పరచుచున్న తన పాద కటకాభరణము యొక్క ధ్వనుల చేత, నిర్మలమైన ధైర్యముచే వేంకటేశ్వరునికి నివాసస్థానమగుట చేత - చిన వేంకటాద్రి తిరుమల వేంకటేశ్వరుని అనన్యభక్తిచే ధ్యానించుచుండుట వలన వేంకటేశ్వరస్వామి చినవేంకటాద్రి హృదయ మందే నివసించు చుండెనని తాత్పర్యము - వేంకటాచలము అనునట్లుగా చిన వెంకటాద్రి యుండెను. పింగళి సూరన చక్కని శ్లేష చేత వేంకటేశ్వరుడు చినవేంకటాద్రి హృదయంలో

స్థిరంగా ఉన్నాడని, మేరు పర్వతం కంటె వేంకటాద్రి గొప్పదని, వేంకటాద్రి కాలి ఆభరణము చూచి (గండపెండేరము) శత్రురాజులు అవమానముతో తలవంచుదురని వర్ణించినాడు. రాఘవ పాండవీయం శ్రీవిరూపాక్ష దేవునకు అంకితము.

* * *

## 20. వసుచరిత్ర - రామరాజ భూషణుడు

ప్రబంధాంకం భట్టుమూర్తి (రామరాజభూషణుడు) వసుచరిత్ర ప్రబంధమును రచించి తిరుమలదేవరాయలకు (అళియరామరాయల సోదరుడు) అంకితమిచ్చినాడు. భట్టుమూర్తి తండ్రి సూరపరాజు అచ్యుత దేవరాయల (1531-1542) కుమారుడు వేంకటపతి దేవరాయల ఆస్థానంలో ఉన్నాడు. అతనికి వేంకటరాయభూషణుడని బిరుదము గలదు. భట్టుమూర్తి అళియరామరాయల ఆస్థానంలో కవిగా ఉన్నందున రామరాజభూషణుడు అని ప్రసిద్ధుడైనాడు. వసుచరిత్ర శ్లేషమయ ప్రబంధము. రామరాజభూషణుడు చంద్రగిరి రాజయిన వేంకటపతిరాయలను శ్లేషతో వేంకటేశ్వరునితో పోలిక చెప్పి ఇట్లు కీర్తించినాడు.

**హరుఁడా తారక శైల దుర్గమున నధ్యాసీనుఁడై రాజశే**
**ఖర విఖ్యాతి వహించు చంద్రగిరి దుర్గంబందు శ్రీవేంకటే**
**శ్వరుఁడొప్పెన్ బహురాజశేఖర సదాసంసేవ్యుఁడై యౌర యి**
**ద్ధర బంటేలిక వాసి తద్గిరులకుం దద్వల్లభశ్రీలకున్॥**

**- వసుచరిత్ర, 1-81**

శివుడు కైలాసము (వెండికొండ) పై రాజశేఖరుడను పేరుతో ఉన్నాడు. వేంకటపతిరాయలను వేంకటేశ్వరుడు చంద్రగిరి (బంగారుకొండ) పై అనేక రాజశేఖరులచే సేవింపబడుచున్నాడు. కావున శివునకు వేంకటేశ్వరునకు (వేంకటపతిరాయలకు) బంటునకు, రాజునకు గల యంత వ్యత్యాసము గలదు. సిరిసంపదలలో హరిహరులకు గల భేదము సుస్పష్టము గదా!

* * *



## 21. శ్రీరంగమాహాత్మ్యము - భైరవకవి

సాహిత్య లక్షణ చక్రవర్తిగా ప్రసిద్ధి పొందిన, హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథచరిత్ర ద్విపద కావ్యాల కర్తయగు మహాకవి గౌరన కుమారుడు భైరవకవి. ఇతడు 'శ్రీరంగ మాహాత్మ్యము' అను క్షేత్రమాహాత్మ్య కావ్యమును రచించి, చాగయ రామదేవ పండితునకు అంకితమిచ్చాడు.

ఈ శ్రీరంగమాహాత్మ్య కావ్యంలో భరద్వాజ మహర్షి తన శిష్యులతో కూడ తీర్థయాత్రలు చేసినాడు. ఆ సందర్భంలో భరద్వాజుడు దర్శించిన క్షేత్రముల వర్ణనలో వేంకటాచలము గలదు (4-9).

**గీ॥ సన్నుతించె నహోబలస్వామిఁ బ్రణతి**
**సేసి శ్రీవేంకటాచల వాసి నెలమి**
**నర్చగావించె హస్తి శైలాధిపతిని**
**దీర్చెపూజ జగన్నాథ దేవునకును.**

"అర్చావతారంబులు స్వయంవ్యక్త దివ్యసైద్ధ మానుషంబులన జతుర్విధంబుల మెరయు నందు శ్రీరంగ, శ్రీముష్ణ, **శ్రీవేంకటాచల,** సాలగ్రామ, నైమిశ, తోతాద్రి, పుష్కర, నారాయణా శ్రమంబులను నీ యెనిమిది స్థలంబులం గల మదీయమూర్తులు స్వయంవ్యక్తంబులు" (1-206) అని శ్రీమన్నారాయణుడు బ్రహ్మదేవునకు తెలిపినాడు. వేంకటాచలం శ్రీమన్నారాయణ దేవుని స్వయంవ్యక్త దివ్యస్థలమని స్పష్టమగుచున్నది.

* * *

## 22. ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధము - బొద్దుచెర్ల చినతిమ్మయ

సంస్కృతములో 'పీయూషవర్ష' బిరుదాంచితుడైన జయదేవుడురచించిన ప్రసన్న రాఘవ నాటకమును బొద్దుచెర్ల చిన్నతిమ్మయ (16 శతాబ్దం) ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధముగా (క్రీడాభిరామము వలె) రచించినాడు. ఈ నాట్య ప్రబంధమున తెలుగులో తక్కిన పద్య ప్రబంధము లందువలె

ఆశ్వాస విభజనము గాక సంస్కృత నాటకములందున్న అంక విభజనము పాటింపబడినది. సంస్కృత నాటకములో గల సప్తమాంకములు తెలుగు నాట్య ప్రబంధ పద్యకావ్యములో సప్తమాంకములుగ ఉన్నవి. ఈ ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధము నంద్యాల తిమ్మరాజుకు అంకితమీయ బడింది.

**నిజవక్త్ర శారదాంబుజ నర్తిత రమాక్షి**
**భంజనుండు మునీంద్ర రంజనుండు**
**గండస్థలీ రంగ తాండవితాండజ**
**కుండలుం దానతాఖండలుండు**
**వక్షో నట త్ఫుల్ల వైజయంతీ దామ**
**భూషణుండు నిశాట భీషణుండు**
**భూత లాస్యక్రియా హేతు మాయాసూత్ర**
**ధారకుండు భవాబ్ధి తారకుండు**

**గురువిలాస నాభీసరోవర భవప్ర**
**భూత భువనాంబుజాతుండునై తనర్చు**
**నంజనాద్రీశు తీర్థయాత్రాను రక్తి**
**గూడె నీ పారిషదుల పెన్గూట మిచట** **1-5**

**"వ॥ ఇందు నందేల తిరుమల ధరావరుండును తిరుమల కొండ నేలు జేజేల రాజుఁ బూజించు వాఁడై..." (1-6)**

అని "నంద్యాలను తిరుమలరాయలు (తిమ్మరాజు) పాలించుచుండగా అంజనాద్రీశుడైన వేంకటేశ్వరుని దర్శించుటకై తీర్థయాత్రానురక్తితో పారిషదులు రాజసభలో కూడినారు" అని వర్ణించబడింది నంద్యాల తిమ్మరాజు తిరుమల వేంకటేశ్వరుని భక్తుడని తెలుపబడింది. ఇట్లు బొద్దుచెర్ల చినతిమ్మయ రచించిన 'ప్రసన్న రాఘవ నాట్యప్రబంధము' లో తిరుమలేశుని ప్రస్తావన ఉన్నది.

* * *



## 23. దశరథరాజనందన చరిత్ర - (నిరోష్ఠ్య రామాయణము)
### - మరింగంటి సింగరాచార్యులు

ఆసూరి మరింగంటి సింగరాచార్యులు (16 శతాబ్దం) మొట్టమొదట తెలుగులో నిరోష్ఠ్య కావ్యం - రామాయణము - దశరథరాజనందన చరిత్ర రచించినాడు. ఇతని మరో రచన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణము. రెండు కావ్యములు దైవాంకితములు. సింగరాచార్యులు గోల్కొండ నవాబు అగు మల్కిభరాం అను నామాంతరం గల ఇబ్రహీం కుతుబ్‌షా (క్రీ.శ. 1550-80) ఆస్థానకవులలో ఒకడు. సింగరాచార్యులతో పాటు తొలి అచ్చతెనుగు కావ్యం యయాతి చరిత్ర రచించిన పొన్నికంటి తెలగన్న కూడ మల్కిభరాం ఆస్థానంలో ఉన్నాడు.

మరింగంటి సింగరాచార్యులు రామాయణములోని మకారము ఓష్ఠ్యము గనుక తన రామాయణానికి దశరథరాజనందన చరిత్ర అని నిరోష్ఠ్యంగా నామకరణం చేశాడు. సింగరాచార్యులు దశరథరాజనందన చరిత్రలో స్వీయవంశ వర్ణనలో తనను గూర్చి

**వరవందారు జనావళీ హృదయ సద్వాంఛార్థకృద్వేంకటే**
**శ్వర సంపూర్ణ కృపాసుధామిళిత వీక్షా మాధురీ మార్గవి**
**స్ఫురితై కైక దినప్రబంధ రచనా స్ఫూర్జ ద్వచశ్శ్రీకుఁడన్**
**నరనాగాశ్వ నృపాల సభ్య గణితుండన్ సింగరాచార్యుఁడన్ ॥ -1-33**

అని చెప్పుకున్నాడు.

సింగరాచార్యులు దశరథరాజనందన చరిత్ర ఆశ్వాసాంత గద్యలో-

**"ఇది శ్రీమత్కర్పరాచల లక్ష్మీనృసింహ వేంకటేశ్వర వర ప్రసాద లబ్ధ సకలైశ్వర్య ధురీణ... సంస్కృతాంధ్ర నిరోష్ఠ్యోష్ఠ్యాది వింశతి ప్రబంధ నిర్మాణ ధురీణ..."** అని చెప్పుకున్నాడు. సింగరాచార్యులు మౌద్గల్యమహర్షి గోత్రుడు.

తిరువేంగళార్యుల పుత్రుడు. కవిరాజు అను బిరుదము గలవాడు. సింగరాచార్యుల రచనలలో దశరథరాజనందన చరిత్ర, శుద్ధాంధ్రనిరోష్ఠ్య సీతాకల్యాణములు మాత్రమే లభించినవి. మౌద్గల్య గోత్రులు లక్ష్మీనృసింహ వేంకటేశ్వర భక్తులు. నల్గొండ జిల్లాలో దేవరకొండ తాలూకాలో పణ్కరాజు పల్లి వద్ద ఒక గుట్ట గలదు. అందు నరసింహస్వామి ఆలయము గలదు. ఆ గుట్టనే సింగరాచార్యులు సంస్కృతీకరించి కర్పరాచలమని చెప్పినాడు.

సింగరాచార్యులు తన ఇష్టదైవం కలలో కనపడి నిరోష్ఠ్యకావ్యరచన చేయుమని ఆదేశించగా తాను దశరథరాజనందన చరిత్ర రచించుచున్నట్లు ఇట్లు చెప్పినాడు.

**సముదీర్ణస్థితి వేంకటేశ్వరుఁడు నా స్వప్నంబునన్ షోడశా**
**బ్దములన్ మాణవకాకృతిన్నిలిచి, 'వత్సా! యాంధ్రభాషానిరో**
**ష్ఠ్యమహాకావ్యమొనర్చుమీ' యనిన నత్యారూఢి మేల్కాంచి మో**
**దమునం జెప్పితి భూమిపై కవిజనాధ్యక్షుల్ ప్రశంసింపఁగన్ ॥**
**– దశరథరాజనందన చరిత్ర – 1-31**

ఈ కావ్యములో కథా భాగమునందు మాత్రమే నిరోష్ఠ్య నియమము పాటింపబడింది.

* * *

## 24. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణము – మరింగంటి సింగరాచార్యులు

ఆసూరి మరింగంటి సింగరాచార్యులు శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కల్యాణమును రచించి కర్పూరాద్రి నృసింహదేవునికి అంకితమిచ్చాడు. ఈ కావ్యరచనకు ప్రేరణ వేంకటేశ్వరుడు సింగరాచార్యులకు స్వప్నములో కనిపించి కల్గించినాడు. సింగరాచార్యులు తనకు కలలో కన్పించిన వేంకటేశ్వరుని ఇట్లు వర్ణించాడు.



**నల్లని మేను తెల్ల తిరునామము ముంజి పసిండి జందెమున్**
**జల్లని గన్నులున్ గరుణఁజల్లెడు చూపులు లేతనవ్వు భా**
**సిల్లఁగ కర్పరాద్రి నరసింహుఁడు తానగు వేంకటేశ్వరుం**
**డల్లన బ్రహ్మచారి గతి నగ్రమహీస్థలి నిల్చి వేఁడుకన్ ॥ 1-11**

సింగరాచార్యులు కర్పూరాద్రి నృసింహునకు తిరుమల వేంకటేశ్వరునకు అభేదము పలికినాడు. సీతాకల్యాణ కావ్యము అంకితమిమ్మని వేంకటేశ్వరుడు ఆశపడుటను సింగరాచార్యులు

**శ్రుతులకసాధ్యుఁడు వేంకట**
**పతి నా కావ్యమున కాసపడుటల్ దెలిసెన్**
**క్షితిసుతుని దొౘ్రుపల్కుల**
**కతిమోదము దాల్చు తండ్రియందంబయ్యెన్ ॥ 1-25**

అని రమణీయముగ సమర్థించినాడు. సింగరాచార్యులు సీతాకల్యాణము యొక్క ఆశ్వాసాంత గద్యలో

**"ఇది శ్రీమత్కర్పరాచల లక్ష్మీనృసింహావతార వేంకటేశ్వర వరప్రసాదలబ్ధ సకలైశ్వర్యధురీణ..."** అని లక్ష్మీనరసింహావతారమే వేంకటేశ్వరుడని వారికి అభేదం పల్కినాడు.

* * *

## 25. పంచతంత్ర – భానుకవి

భానుకవి (క్రీ.శ. 16 శతాబ్దం) పంచతంత్ర అను నీతికావ్యాన్ని రచించి భండారు లక్ష్మీనారాయణకు అంకితమిచ్చాడు. ఈ లక్ష్మీనారాయణ శ్రీకృష్ణదేవరాయల అంతఃపురంలో నాట్య, సంగీత విద్యలకు ఆచార్యుడుగ ఉన్నాడు. భానుకవి దూబగుంట నారాయణకవి రచించిన పంచతంత్రాన్ని అనుసరించి అయిదు ఆశ్వాసములలో అయిదు తంత్రములను వివరించాడు.

భానుకవి కృతిపతిని "లక్ష్మామాత్యుడు శేషాద్రీశ్వర పాదయుగళీ చింతారత స్వాంతుడని (3-135) ప్రశంసించాడు. భానుకవి కృత్యాదిని వేంకటేశ్వరుడు కృతిపతిని రక్షించాలని ఇట్లు ప్రార్థించాడు.

**శ్రీరామాకుచ కుంకుమచ్ఛవి, లసచ్ఛ్రీ కౌస్తుభ స్ఫూర్తి కా**
**ధారంబై యురమంతయుం బ్రథమ సంధ్యారాగ బాలార్క కాం**
**త్యారూఢోదయ శైలరీతి దనరన్ దాసన్నుతుండైన శృం**
**గారాధీశుఁడు వేంకటేశ్వరుఁడు లక్ష్మామాత్యుఁ బ్రోచుందగన్॥1-11**

భానుకవి ఇష్టదేవతా ప్రార్థనలో వేంకటేశ్వరుని శృంగారాధీశుడుగ ప్రశంసించాడు.

* * *

## 26. వల్లభాభ్యుదయం - భట్టపెనుమర్తి కోదండరామకవి

ఆంధ్రుల ఆదిదైవం ఆంధ్రవిష్ణువు వెలసిన శ్రీకాకుళ క్షేత్రమాహాత్మ్యాన్ని వర్ణించిన కావ్యం "వల్లభాభ్యుదయము. ఆంధ్రవిష్ణువుకే ఆంధ్రవల్లభుడని పేరు. ఈ కావ్యాన్ని భట్లపెనుమర్తి కోదండరామకవి (క్రీ.శ.17 శతాబ్దం) రచించాడు. ఈ కావ్యానికి సంస్కృతమూలం బ్రహ్మాండపురాణంలోని ఉత్తరఖండం. ఆంధ్రవిష్ణువే శ్రీకృష్ణదేవరాయలకు కలలో కనిపించి, ఆముక్త మాల్యదను రచించి వేంకటేశ్వరునకు అంకితమివ్వమని ఆదేశించినాడు. కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదను రచించి, వేంకటనాథునకు అంకిత మిచ్చి కృతార్థుడైనాడు. ఈ కావ్యంలో కోదండరామకవి వేంకటాచలక్షేత్రాన్ని (1-12) మనోహరంగా వర్ణించాడు. కోదండరామయ్య ఈ కృతిని

**"వల్లభ స్వామి వరప్రసాద విభవం బిది సత్కృతిగా దలంపుఁడీ" (1-9)**

అని పాఠకులను వేడుకొన్నాడు. వల్లభాభ్యుదయంలో 593 గద్యపద్యాలున్నాయి.

* * *



## 27. రామరాజీయం - అందుగుల వెంకయ్య

అందుగుల వెంకయ్య (16 శతాబ్దం) రామరాజీయము అను చారిత్రక కావ్యాన్ని రచించి ఆరవీటి కోదండరామరాజుకు అంకితమిచ్చాడు. రామరాజీయమునకే నరపతి విజయము అని నామాంతరము కలదు.

అందుగుల వెంకయ్య ఆరవీటి బుక్కరాజు బిరుదు గద్యలో "శ్రీ సంతత వేంకటాచలపతి చరణారవింద సేవా కందళిత సామ్రాజ్య సుఖోప భోగుఁడు" అని వర్ణించాడు (1-203).

* * *

## 28. వైజయంతీ విలాసము - సారంగు తమ్మయ్య

సారంగు తమ్మయ్య (క్రీ.శ.16 శతాబ్దం) వైజయంతీవిలాసమును నాల్గాశ్వాసముల పద్యకావ్యమును రచించి శ్రీరామచంద్రునకు అంకితము చేసినాడు. వైజయంతీవిలాసము ద్వాదశఆళ్వారులో ఒకడైన విప్రనారాయణుని చరిత్ర. సారంగు తమ్మయ్య గోలకొండ నవాబు మహమ్మదు షాహీ (1581-1611) కాలమున గోలకొండ కరణముగా పనిచేశాడు.

దేవదేవి వైరాగ్యము అభినయిస్తూ విప్రనారాయణునితో ఇట్లు చెప్పింది.

**ఆ వేశ్య నాకు గురువుగ**
**నే వేశ్యాత్వంబు మాని యేకాకినినై**
**<u>శ్రీవేంకట పురుషోత్తమ</u>**
**దేవాయతనాది దివ్య దేశములందున్॥ - 2-92**

ఇట్లు సారంగు తమ్మయ్య వేంకట దేవాలయం దివ్యదేశమని ప్రశంసించాడు. వేంకటేశ్వరునికి 'వేంకట' అను నామాంతరం గలదు. పర్వతమునకు, స్వామికి అభేదము. వేంకటేశ్వరుని 108 నామావళిలో 'వేంకటాయ నమః' (22) అను నామము గలదు.

* * *

## 29. రాయవాచకం - విశ్వనాథుని స్థానాపతి

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల అనుమతితో మధుర నాయక రాజ్యస్థాపకుడైన విశ్వనాథ నాయకుని (క్రీ.శ.1528–1564) ప్రతినిధిగా రాయల ఆస్థానంలో ఉన్న స్థానాపతి (క్రీ.శ.16 శతాబ్దం) తన రాజుకు శ్రీకృష్ణదేవరాయలను గూర్చి అందజేసిన సమాచార వచన గ్రంథమే రాయవాచకము. ఈ చారిత్రక గ్రంథములో వేంకటేశ్వరుని ప్రశంస గలదు. రాయవాచకాన్ని కృష్ణరాయవిజయము అను పేరుతో పద్యకావ్యంగా కుమారధూర్జటి రచించారు.

రాయవాచకంలో అష్టస్వయంవ్యక్త దివ్యస్థలములలో వెంక్కటాచలం (ఆనాటి వ్రాత) పేర్కొనబడింది. (పుట:2) రాయల రాజ్యంలో విష్ణువు ప్రత్యక్షమై వెంకటాచలాన ఉన్నాడు. (పుట:33). శ్రీకృష్ణదేవరాయలు కలుబరగకోట స్వాధీనం చేసికొని, తన ప్రతినిధిగా కల్యాణరావును నియమించి, తిరుపతికి వచ్చి అలమేలుమంగా సమేతులైన కల్యాణ వేంకటేశ్వరుల దర్శనంబు చేసినాడు (పు.77).

* * *

## 30. చంద్రభాను చరిత్రము - తరిగొప్పుల మల్లన

తరిగొప్పుల మల్లన చంద్రభాను చరిత్రము అను అయిదు ఆశ్వాసముల పద్యకావ్యం రచించి, తన యిష్టదైవమగు దత్తాత్రేయమూర్తికి అంకితము చేశాడు. ఇతడు నరసనామాత్య తిప్పమాంబలకు పుత్రుడు. దత్తాత్రేయ యోగీంద్రుని శిష్యుడు. తరిగొప్పుల మల్లన వసుచరిత్ర కృతిపతి యగు తిరుమలరాయని కుమారుడైన వేంకటపతిరాయల (1586–1613) ఆస్థానములో రాయసము వ్రాయు లేఖరిగను, కవిగా ఉండి గౌరవాదరములు పొందినాడు.



శ్రీకృష్ణునకు సత్యభామ యందు కలిగిన చంద్రభానునకు, రుక్మిణీ సోదరుడైన రుక్మబాహుని కుమార్తె కుముదినికి జరిగిన వివాహకథ ‘చంద్రభాను చరిత్రము’ లో వర్ణింపబడింది.

చంద్రభానుడు విజయలోలుడు మంచి మిత్రులు. ఇద్దరు కుండిన పురమునకు వెళ్లుచు దారిలో దుర్వాసుని శాపంవల్ల విడిపోయారు. తర్వాత చాలాకాలానికి చంద్రభానుడు, స్నేహితుడు విజయలోలుడు కలుసుకొంటారు. ఆ కాలంలో విజయలోలుడు తిరుమల యాత్ర చేశాడు. విజయలోలుడు తాను చేసిన తిరుమలయాత్రను ఇట్లు వర్ణించాడు.

### తిరుమలయాత్రా వర్ణనము

**గీ. వార్షికదినంబు లిట్లు దుర్వార లీల,**
**ధర విజృంభించు వేళఁబాంథప్రతాన**
**సహితముగ నేను బెక్కు దేశములు గడచి,**
**యంతఁబోవంగమార్గమధ్యంబునందు.** 40

**సీ. అనశనవ్రతముచే నతులకార్శ్యంబునఁ**
**గనుపట్టునోరిబీగములవారు**
**మ్రొక్కుఁదీర్చుటకు నై మూఁకమూఁకలుగూడి**
**యేతెంచుతలమోపుటిండ్లవారు**
**ప్రాణముల్ పిడికిటఁబట్టుకయిట్టట్టు**
**దెమలని శిరసుకోడములవారు**
**దైహికాయాసంబు దలఁపక దొర్లుచు**
**నడతెంచుపొరలుదండములవారు**

**గీ. నామటామటమ్రొక్కువారడుగునడుగు**
**దండములవారుమిగులసందడి యొనర్ప**
**నడరి పన్నగసార్వభౌమాచలేంద్రుఁ**
**గొలువఁ గోటానకోట్లు పెన్గూటమరుగ.** 41

గీ. ఏను వారలతోఁగూడి యెలమి దిగువ
తిరుపతికి నేగి యాళ్వారితీర్థవారిఁ
దానములు సల్పి యుచితకృత్యములు దీర్చి
సంతసంబున నప్పురాభ్యంతరమున. **42**

సీ. పైఁబొల్చుతొలుద్రాఁచుపడఁగయూరుపుఁబొగ
ల్నాభిపంకజమిళిందములు గాఁగ
ఘనతటగ్రావభాగంబున రాజాను
ఘటితహస్తం బజగరము గాఁగ
మలఁచి తలాడగా నిలపిననల కేలి
నఖరుచు ల్మౌళికుందములు గాఁగ
నోరగాఁగుడివంక కొఱగుకౌస్తుభరుచి
శ్రీవత్సఘనతటిద్రేఖ గాఁగ

గీ. రాత్రిఁబవలును జారునేత్రద్వయంబు
పాదసంవాహనక్రియాపరవశ కమ
లోరుతలకుముదాబ్జధీకారి గాఁగ
వేడ్కఁ బవళించియున్న గోవిందుఁగొలిచి. **43**

క. చకచకలు గలుగు నలి మే
చకకచ లిరుగడలఁ గలుగు సౌధశిఖావీ
థికలు గనుఁగొనుచుఁదత్పుర
నికటోర్వికి వచ్చి యుపవనీభాగమునన్. **44**

సీ. చేమాకుతాళముల్చెలఁగరొండులఁజేతు
లుంచియందఱవెక్కిరించికొనుచుఁ
బజ్జధూపమున దీపపుఁగోల రాఁజ హ
స్తముసాఁచి జేగంట చఱచికొనుచుఁ



దల యోరగిలఁగ్రుంగి తప్పెట గతికి వా
యించి గంగెద్ల నాడించుకొనుచుఁ
దిరువడిసానుల బెరసి గంటలు మ్రోయ
బోడచప్పరముల నాడికొనుచుఁ

ద్రోవఁగూర్చుండి బొంతలు మ్రోలఁబఱచి
ముదురుటెండల కోరగా ముసుఁగుఁజేర్చి
పట్టెదండలు మొఱయించి పాడుకొనుచు
నలరు దాసర్ల వీక్షించి యాక్షణమున. **45**

గీ. పంకజేక్షణు మురవైరి భక్తసులభు
వేంకటస్వామి వీక్షించు వేడ్క హృదయ
పద్మమునఁదొంగలింప సంభ్రమము మెఱసి
యా మహీధర మెక్కితి నట్టివేళ. **46**

సీ. చెక్కుల మకరికాచిత్రము ల్గరఁగంగఁ
గలయనూర్చుచు సారె నిలిచి నిలిచి
కటులభారమున వెన్కకువీఁగి యందంద
పతులయంసము లూఁతపట్టిపట్టి
తరులనీడలు చేర నరిగి నెచ్చెలివీచు
సురటి తెమ్మెరలకుఁ జొక్కిచొక్కి
పాదాబ్జములు తొట్రుపడఁగజానువులూఁది
యెక్కుడుదగ మెట్టు లెక్కి యెక్కి

గీ. వలుదగుబ్బలఁజెమటలు వడియఁబయట
లుబ్బనొత్తుచు నుస్సని యూర్చి యూర్చి
యలఁతఁదూలుచు వ్రాలుచు నలఘుహర్ష
జలధిఁదేలుచు సోలుచు జలజముఖులు. **47**

ఉ. మందలుగూడి యెక్కి రతిమంజులనంజులకుంజమంజరీ
బృందమరందబిందులహరీబహురీతిసగీతినందదిం
దిందిరవందితుందిలనుతిప్రతికూజదళిందకందరా
మందసరఝ్ఝరీఘుమఘుమధ్వనిజాలము శేషశైలమున్ 48

క. తళతళన వెలుఁగు నిందూ
పలఫలకవనీపతత్రబలబహులహరీ
నలయఝరీవలయదరీ
నిలయసరీసృపఫణామణిద్యుతు లచటన్. 49

గీ. శబరకాంతాకుచాగ్రసంసక్తగైరి
కాంకనంబులు జనుల నట్టాఁచు నచట
ధాతుకృత్యంబులౌట చిత్రంబె వాని
కతనుభావ్యారకర్మశక్యప్రవృత్తి. 50

సీ. నాళీక కాసార కేళీకలితసార
నాళీకనత్తీరనాళికేర
మాలీనమకరందధూళీనతమిళింద
కేళీ నవానంద శాలికుంద
మేలాలతాలోలదోలాలసమరాళ
బాలాలఘుముదాలవాలసాల
మాలాపయుగనంగ ఖేలాపరవశాంగ
లీలాపరవిహంగజాలరంగ

గీ. మమరవరతనుకరతనునమితసుమిత,
ముదితకలరవకులరవముఖరశిఖర
తిలకసురుచిరతరుచరగళితలలిత
మధురమధురసపాళి యాకుధరమౌళి. 51



చ. ఉరుతరకందరానిపతితోత్పతదంబుఝరీలవంబులం
బరఁగు నుదగ్రఘోషమయి పాపవినాశన మానగంబు సొం
పరయఁగఁ గోరి యే పతితులైన జడాకృతు లేగుదెంచినన్
సరసత నూరర్ధ్వలోకము లొసంగుదు నేనని తెల్పుకైవడిన్. 52

సీ. కమలాకరతఁదామ యమరు నింతియకాని
క్రుంకువారికి సిరు ల్పూర్పఁగల వె
కువలయోద్ధతిఁదామకొఅలు నింతియకాని
చేరువారికి ధరఁజేర్పఁగలవె
యుత్కళికలఁదామ యొప్పు నింతియకాని
కనువారికి ముదంబు లునుపఁగలవె
యమృతసంగతిఁదామయలరునింతియ కాని
తలఁచువారికి ముక్తిఁదార్పఁగలవె

గీ. యితరతీర్థంబు లెందైన నీసరంబు
పగిది నని విశ్వభూజను ల్పొగడ నన్న
గమునఁజెన్నొందు స్వామిపుష్కరిణి యచటఁ
దాన మొనరించి యుచితకృత్యములఁదీర్చి. 53

క. వారాహమూర్తికి నమ స్కారం
బొనరించి సంతసంబునఁదత్కా
సారంబు వెడలి మురహరు
నారాధింపంగఁ దలఁచి యటఁజన నెదుటన్. 54

సీ. ప్రాకారఖచితహీరప్రభాచయదేవతాధునీబుద్బుదత్తారకంబు
గోపురేంద్రోపలాంకూరవిభాజలాయమునారథాంగదహస్కరంబు
కేతుగోమేధికద్యోతనరస్వతీహ్రాదినీశైవలదభ్రతలము
శిఖరాబ్జరాగరోచిః ప్రతానహిరణ్యవాహోత్పలస్నీలవారిదంబు

భక్తలోకైకభరణంబు పరమమౌని
కలుషసంతానహరంబు ఘటితసుజన
నిచయసంస్మృతితరణంబు నిర్జరశర
ణంబు వేంకటపతిశరణంబు దనరె. **55**

గీ. అట్టిమురవైరినగరికి నరుగుదెంచి
వితతభక్తిఁబ్రదక్షిణవిధు లొనర్చి
యావరణ దేవతలనెల్ల ననుసరించి
గర్భగృహమునకేగి యుత్కంఠ మెఱయ. **56**

సీ. ఇలఁజూపువలచేయి వెలిదమ్మికనుబోయిఁ

జెలఁగువానిఁబయోధిఁమెలఁగువాని
దట్టిఁజేర్చిన వంకిగట్టుమీఁదటిటెంకిఁ
దనరువానిఁబురారి నెనరువాని
నెదమపెందొడఁగేలునెడఁజేరిచినయాలు
నెసఁగువానిశుభంబులొసఁగువాని
నిండుబంగరుపట్టు కొండవంచినమెట్టు
వెలయువాని శుకాత్మ నొలయు వాని

గీ. చికిలిజిగిచుట్టుకత్తి జేజేలుబత్తి
నెఱపువాని సురారులఁ బఱపువాని
వేంకటస్వామిఁగనుఁగొని వినయవినమి
తాంగవైఖరి మెఱయ సాష్టాంగ మెఱఁగి **57**

శా. కాల న్మత్తెగజాలు వేఁడిచలువల్ గ్రమ్మించుకన్దాలు కెం
గేలం బట్టినచుట్టువాలు నెడచక్కిం గల్మిప్రోయాలు నే
వేళన్ భక్తులఁబ్రోచుమేలు తెలిదీవిం బొల్చు పెన్ర్పోలు ని
ర్మేలం బాయని వేల్పుచాలు గలసామిన్ వెన్నునిం గొల్చెదన్. **58**



శా. ఆర్తత్రాణపరాయణాయ భువనైకాధారభూతాయ సం
వర్తాంభోనిధిమగ్నభూభరణకృద్వారాహరూపాయ దో
ర్వార్తాభీతమహీసుతాయ శిశుతావ్యాపారనశ్యత్తృణా
వర్తక్రూరనిశాచరాయ దివిషద్వంద్యాయ తుభ్యం నమః. **59**

చ. అని కొనియాడి తత్పదయుగాబ్జపవిత్రితతీర్థవారిలోఁ
గొని గతకల్మ షుండనయి కోల్మవెల వెల్వడి బిల్వపాండవా
దినిఖిలతీర్థపంక్తుల క్షితిత్రిదశోదితరీతి భక్తి మ
జ్జన మొనరించి యర్థవిధి సల్పి క్రమంబున నేగి చెంగటన్. **60**

సీ. రేరిక్కరాఱాల నూరిననీ రేఱు
లై తూఱు నీరికలైన చోటఁ
గ్రేళ్లుబ్బి సెలలు దాఁకిననుర్లునెత్తాల
నలరుకానలఁదారు తలిరుఁగత్తి
తేని బాబాలేఁతతెక్క సోఁకులసారెఁ
దలఁకునీరంబుల నొలుకు తెలిసి
రంబుతోఁదనరనొరలుకన్నె క్రొన్నన
తేనెసోనల ననలైన నేలఁ

దొలఁకుకొలఁకులకెలఁకులఁదళుకుగులుకు
నున్నతిన్నెలఁదరలకనూలుకొనిన
కిన్నెరకలకలంబుల కేకికరుతు
లూనుచుండెడు తుంబురుకోనదాసి. **61**

**– చంద్రభానుచరిత్ర, 5-40-61**

తరిగొప్పుల మల్లన ఈ తిరుమలయాత్రా వర్ణనలో ఆనాటి భక్తుల యొక్క మ్రొక్కుబడుల వివరములను వర్ణించాడు (5-41). ఆనాడు

కపిలతీర్థమునకు ఆళ్వారి తీర్థమనుపేరు ఉండేది (5-42). శేషాచల పర్వతాలను ఎక్కేటప్పుడు పడే శ్రమను - ముఖ్యంగా స్త్రీలు పడే శ్రమను ఆయాసమును స్వభావోక్తిలో మల్లన వర్ణించాడు (5-47). మల్లన రామరాజభూషణుని అనుసరించి "లలనాజనాపాంగ..." (వసుచరిత్ర 1-126) రచనాశైలిలో శేషశైలమును (5-48-51) వర్ణించాడు. ఆనాడు తిరుమల దేవాలయంలో దేవదాసీల వ్యవస్థ ఉండేది. మల్లన తిరువడిసానుల ఆటపాటలను (5-45) వర్ణించాడు. విజయనగర చక్రవర్తి అచ్యుత దేవరాయలు (క్రీ.శ.1529-1542) ముద్దుకుప్పాయి అను నాట్యకళా విశారదను దేవదాసిగా విజయనగరం నుండి తిరుమల దేవాలయమునకు వేంకటేశ్వరస్వామిని సేవించుటకు పంపించినట్లుగ తి.తి.దేవస్థానంలో శాసనం (సంఖ్య 4-11 తేది 6-6-1531) కలదు.

మల్లన స్వామిపుష్కరిణిలో స్నానం చేయడం, దానములు చేయడం, మొదట వరాహమూర్తిని దర్శించడం పిమ్మట వేంకటపతిని దర్శించడం సంప్రదాయానుగుణంగా వర్ణించాడు. (5-53-57). వేంకటేశుని లీలలను సంస్కృతభాషలో శార్దూల వృత్తములో కొనియాడినాడు (5-59). ఇట్లు తరిగొప్పుల మల్లన తిరుమల తీర్థయాత్రను వేంకటపతి దర్శనాన్ని సంప్రదాయనుగుణంగా వర్ణించినాడు.

* * *



## 31. సుదక్షిణా పరిణయం - తెనాలి అన్నయ్య

తెనాలి అన్నయ్య (క్రీ.శ.16 శతాబ్దం) రామయ్య మంత్రి కుమారుడు. ఇతడు పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యములను రచించిన తెనాలి రామకృష్ణకవికి, శ్రీశైలమాహాత్మ్యమును రచించిన తెనాలి శ్రీగిరి కవికి తమ్ముడు. తెనాలి అన్నయ్య సుదక్షిణా పరిణయమను అయిదాశ్వాసముల ప్రబంధమును రచించి, పులిజాల సోమయామాత్యునకు అంకితమిచ్చాడు.

ఇక్ష్వాకు వంశమున జన్మించిన దిలీప మహారాజు చరిత్ర, అతడు రత్నచూడుడను రాక్షసుని సంహరించి, సురథుడను వాని పుత్రిక సుదక్షిణ యను కన్యను వివాహమాడుట యీ కావ్యమందలి ఇతివృత్తము.

తెనాలి అన్నయ్య సుదక్షిణాపరిణయం కృత్యాదిలో కృతిపతిని వేంకటేశుడు రక్షించాలని ఇట్లు ఇష్టదేవతాప్రార్థన చేసినాడు.

**శ్రీలీలా హరినీల పీఠరుచిర శ్రీవత్స సంపన్న వ**
**క్షోలాలిత్యుఁడు వేంకటేశుఁడు కృపన్ గోనేటిరాయక్షమా**
**పాలస్వామి సమస్తరాజ్యభరణోపాయాధికున్ హృద్యవి**
**ద్యాలోలుం బులిజాల రామవిభు సోమామాత్యునిం బ్రోవుతన్॥ 1-1**

తెనాలి అన్నయ్య దిలీపుని శేషాచల యాత్రను ఇట్లు వర్ణించినాడు. (5-62-5-70)

### దిలీపుడు శేషశైలమును జేరుట

**చ. చని చని ముందఱం గనియె సారసమిత్రకులుండు లోకలో**
**చనశతకోటిదీప్తిమణిసానువిభాసిదిగంతరాళమున్,**
**సనకసనందనాదిమునిసంస్తుతవిస్తృతపుణ్యశీలమున్,**
**జనజనికర్మనిర్మథనసౌఖ్యవిశాలము <u>శేషశైలమున్.</u> 62**

తే. పుష్పకళికలఁజెన్నొందుభూరుహంబు
లలమి దీపించు నచ్చట నచలభర్త
కదిసియుండినగగనంబుకడకు నెత్తఁ
బూనుముక్తావిభూషణభుజము లనఁగ. **63**

చ. పిడికిటఁబట్టి పంచెఁబుభేది యొకానొకకొండ, మింటికిన్
గొడుగుగ నెత్తిఁదాల్చె యదుకుంజరుఁడొండొకకొండ; వేల్మిడిన్
బుడమి నడంగఁజేసె ఘటపుత్త్రుఁడు వేఱొక కొండ; నున్న యీ
వెడవెడకొండ లీ దగునె? వేంకటభర్త వసించుకొండకున్! **64**

వ. అప్పుడు ప్రధాననందనుండు రాజసంక్రందనుం గనుంగొని "ప్రతాప నిటలనయన, నయసుధాస్యందం బగునిందుబింబవదన మదనసంతాప సంజీవనియుంబోలెఁగైవసంబయ్యు దుర్దమశార్దూలభయంబున నిజమందిర కందరంబునకుంజనియె, రత్నచూడ విజయశుల్క యగునాచిల్కపల్కులాఁ డి నిన్నుఁజెందు; సందియంబు వల; దేతత్కుధరకూటాగ్రహాటకవిమానాంతర చరిష్ణుం దగువిష్ణుండు భవదీయ మనోరథంబు నవితథంబుగం జేయుఁ; దదీయపాదరాజీవ సందర్శనం బవశ్యకర్తవ్యం". బనుదు సౌగంధికబంధురంబు లగు స్వామిపుష్కరిణి బంధంబులంగాలోచితకృత్యంబులు నిర్వర్తించి సాకారకనకగిరిశంకాకారిప్రాకారపరివృతంబును ఘనఘనాఘణచ్ఛటాను మేయధూపధూమవిలోకనతాండవత్కుండలిపరిపంథిమండలంబును సముత్తంభితచంచత్కేతు పటాంచలకాంచనకింకిణీకలకలాకులితజలజహిత రథఘోటకంబును నగునద్దేవదేవుదివ్యభవనంబు ప్రవేశించి పురోభాగంబున:

సీ. వెలిదామరలనవ్వు వెడఁదకన్నులవానిఁ,
గౌస్తుభగ్రైవేయకంబువానిఁ,
జిగురుఁగెమ్మోవిపైఁజిన్ని నవ్వులవానిఁ,
గమనీయరత్న శేఖరమువాని,



రంగైన మొసలివాపోగంట్లు గలవాని,
శంఖచక్రాంకహస్తములవానిఁ,
బసిమి మీఱినపచ్చపట్టు గట్టినవాని,
నిగమనూపురధగద్ధగలవానిఁ,

తే. బాలసంద్రంబు గాంచినవాలుగంటి,
నిజభుజామధ్యపీఠిక నిలుపువాని,
వేడ్క దైవాఱఁగఁతిమేనివేల్పుఁగాంచి
వందనము చేసి రాజసంక్రందనుండు: **66**

## దిలీపుఁడు శేషాచలపతిని సందర్శించి స్తోత్రము చేయుట

సీ. "గోవింద, గోరూప, గోపికావల్లభ,
శౌరి, శార్ఙ్గాయుధ, శంఖహస్త,
పరమేశ, పరమాత్మ, పరమపదాధీశ,
కల్యాణకరకాంతికలితకాయ,
లావణ్యలీలావిలాస, లాలితలోక,
యక్షీణకరుణాకటాక్షవీక్ష,
తీర్థాంఘ్రి, తీర్థేశ, తీర్థఫలోదయ,
త్రిగుణాత్మ, త్రిదశేంద్ర, త్రివిధరూప,

తే. నిఖిల, నిష్కామ, నిష్కల, నిత్య, నిరఘ,
భద్ర, భవభావభంజన, భక్తసులభ,
యాద్య, యాద్యంతరహిత, విద్యానవద్య,
నిన్నుఁబొడగంటి, మిక్కిలి వన్నెగంటి. **67**

సరసిజవృత్తము –
వేదాధారా, నాదవినోదా,
విషధిమథన, కరవిధృతకుతల, ప్ర

హ్లాదాధీనా, యాదృతమాయా
యతన, యహితహర, యతిమతిసదనా,
శ్రీదోల్లాసా; మేదురశౌర్యా,
జితవరమతభర, శ్రితగతిఫలదా,
పాదానమ్రాహ్లాదనదక్షా,
భవభయపరిహృతిపరిచితకరుణా! 68

అక్షరగుణితము – సకారము

మ. సనకప్రస్తుత, సారరూప, సితహాసా, సీరహస్తాప్త, సు
స్వనవేదస్తుతపాద, సూర్యనయనాబ్జా, సేతుబంధక్రియా
జనితోత్సాహధురీణ, సైంధవవిలాసా, సోమకప్రాణభం
జన, సౌజన్యవిలోల, సంగరహితా, సర్వప్రియంభావుకా!" 69

## దిలీపుఁడు శేషాచలపతి యనుగ్రహమును బడసి పుష్పకముపైఁదనసైన్యమును జేరఁబోవుట

వ. అని కొనియాడి పునఃపునఃప్రణామంబు లాచరించురాజకంఠీరవు నకుంఠితోత్కంఠానుకంపాసంప దధ్యక్షితంబు లగు కటాక్షాంచలంబుల నిరీక్షించి పుండరీకాక్షుం డలభ్య వాల్లభ్యకల్యం బగునిజకంధరామందార మాల్యంబు ననుగ్రహించి "దిలీపా, యాఖేటక క్రీడావ్యాజంబున వెడలి దనుజులం బడలుపడఁజేసి చతుర్ముఖదత్తం బై రాక్షసాయత్తం బగు నత్యుత్తమ విమానంబు గైకొని యిటకుం జనుదెంచితి; వింక నీయభీప్సితంబు లెవ్వియైన సఫలంబులగు; నశ్రమంబున రత్నచూడునిం దునిమి విజయకాంతా కరగ్రహంబుతోడన సుదక్షిణాకరగ్రహం బొనరింపు; సురథుండు నీక్షణం బునఁబక్షిరాజదక్షత్వంబున సపురంబుగ నిజక్ష్మామండలంబున కరుగు; నీ వరుగు" మని యానతిచ్చి యంపుటయు... 70

– సుదక్షిణా పరిణయం, 5-62-70.



తెనాలి అన్నయ్య తిరుమల వేంకటేశుని భక్తుడు. కనుక సంస్కృత మూలములో లేని దిలీపుని శేషాచల యాత్రచేయుట, అతడు వేంకటాద్రి క్షేత్రాన్ని, స్వామి పుష్కరిణి తీర్థాన్ని, వేంకటేశ్వరస్వామిని ప్రస్తుతించుట సుదక్షిణా పరిణయ కావ్యంలో వర్ణించి, తనకు గల వేంకటేశ భక్తిని వెల్లడించినాడు.

ప్రస్తుతం తిరుమల క్షేత్రంలో వేంకటేశ్వర స్వామివారికి సమర్పించిన తులసి, పూలు, పూలమాలలను ఎవరికి ప్రసాదంగా ఇచ్చే సంప్రదాయం లేదు. అందువల్ల ఆ పవిత్ర నిర్మాల్యాన్ని ఎవ్వరూ ఉపయోగించకుండా పూలబావిలో పడవేసేవారు. ఇప్పుడు అగమ్యమైన, అగాధమైన లోయలో పడవేస్తున్నారు. ఇది ఈనాటి సంప్రదాయం. కాని తెనాలి అన్నయ్య సుదక్షిణా పరిణయ కావ్యంలో దిలీపునకు "పుండరీకాక్షుండలభ్య వాల్లభ్య కల్యంబగు నిజకంధరా మందార మాల్యంబు ననుగ్రహించి" నట్లు (5-70) వర్ణించినాడు. దిలీపుని స్తోత్రమునకు ప్రీతుడై వేంకటేశ్వరస్వామి తను మెడలో ధరించిన మందారమాలను దిలీపునకు అనుగ్రహించినాడు. ఇది ఆనాటి (క్రీ.శ.16 శతాబ్దం) సంప్రదాయం. కాలగమనంలో ఆచార సంప్రదాయాలూ మారుతుంటాయి!

* * *

## 32. ఇందుమతీ పరిణయం – తెనాలి రామభద్రుడు

పుంభావ సరస్వతి అయిన తెనాలి రామకృష్ణుని తమ్ముని మనుమడు అయిన రామభద్రుడు ఇందుమతీ పరిణయము అను నాలుగు ఆశ్వాసముల కావ్యం రచించి, పాలచూరి కృష్ణ నృపాలునకు అంకితమిచ్చాడు.

దశరథమహారాజు తండ్రి, రఘుమహారాజు పుత్రుడు అయిన అజుడు స్వయంవరమున ఎల్లరాజులను జయించి, విదర్భరాజు కూతురగు ఇందుమతిని వివాహమాడుట ఈ కావ్యమందలి ఇతివృత్తము.

తెనాలి రామభద్రకవి కావ్యారంభములో ఇష్టదేవతాస్తుతిలో వేంకటాచలపతి పాలచూరి కృష్ణభూపాలుని రక్షించాలని ఇట్లు ప్రార్థించాడు.

**శ్రీ లలితాంగి వక్షమునఁ జెన్నుగఁ గెంపుల తాళి లీలనే**
**వేళ బొసంగ రంగలరు వేంకటభూమి ధరాధినేతయా**
**నీల ఘనాఘన ప్రతిమ నిర్మలదేహుఁడు శౌరి నిత్యమున్**
**బాలచురీ కులాబ్ధి హిమభానునిఁ గృష్ణనృపాలుఁ బ్రోవుతన్॥ - 1-1**

* * *

## 33. బహుళాశ్వచరిత్ర - దామెర్ల వేంగళనాయకుడు

దామెరల వెంగళరాజు (17 శతాబ్దం) 'బహుళాశ్వచరిత్ర' అను అయిదాశ్వాసముల పద్యకావ్యమును రచించి, తన తండ్రికే అంకిత మిచ్చినాడు. ఇతని పితృభక్తి ఆదర్శప్రాయము. వెంగళరాజు వెంకటాద్రి గురవమాంబల పుత్రుడు. దామెర్లవారు యుద్ధవీరులు, దండనాథులు. చెన్నప్ప నాయకుడు వెంగళరాజుకు సవతి సోదరుడు. ఈ చెన్నప్ప పేరనే చెన్నపట్టణము (నాటి మద్రాసు - నేటి చెన్నై) నిర్మింపబడింది. దామెర్లవారికి వెలుగోటివారికి సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. వెలుగోటి యాచమ నాయకుడు బహుళాశ్వ చరిత్ర కర్త వెంగళరాజుకు మేనత్త కొడుకు.

యాచమనాయకుని శౌర్య పరాక్రమాలను వెంగళరాజు ఇట్లు ప్రశంసించినాడు.

**ఉత్తర మల్లూరి యొద్ద దావలపాద**
**విభుని గొట్టిన నాటి విజయ కలన**
**తిరుమలచేరి ధాత్రిని మన్నెరాజులఁ**
**బారఁద్రోలిన నాటి బాహు బలము**
**- బహుళాశ్వ చరిత్ర, 1-37.**

* * *



## 34. వాల్మీకి చరిత్రము - రఘునాథ నాయకుడు

దక్షిణ దేశీయ ఆంధ్రవాఙ్మయ చరిత్రలో స్వర్ణయుగమును సృష్టించిన సాహితీ చక్రవర్తి రఘునాథ నాయకుడు (క్రీ.శ.17 శతాబ్దం). రఘునాథ నాయకుడు క్రీ.శ.1600-1631 మధ్య తంజావూరు నాయక రాజ్యాన్ని పరిపాలించాడు. ఇతడు అచ్యుతప్పనాయకుని పుత్రుడు.

రఘునాథనాయకుడు వాల్మీకి చరిత్రము అను మూడు ఆశ్వాసముల పద్యకావ్యాన్ని రచించి శ్రీరామచంద్రునకు అంకితమిచ్చాడు. రఘునాథుడు శ్రీరామభక్తుడు. అందువల్లనే రఘునాథుడు వాల్మీకి చరిత్రముతో పాటు రామాయణాన్ని కూడ రచించి శ్రీరామునకు అంకితమిచ్చాడు. సప్తఋషులు సేతువు నుండి తీర్థయాత్ర చేస్తూ తిరుమల క్షేత్రాన్ని, వేంకటేశ్వరుని దర్శించారు.

రఘునాథనాయకుని శేషశైలవర్ణన (2-51) అల్లసానిపెద్దన హిమశైల వర్ణనకు అనుసరణగా ఉంది. (మనుచరిత్ర, 2-3). రఘునాథుడు వేంకటాచలవిభుని ఉచితశృంగారపురుషునిగా, "ఇట్టి చక్కని తండ్రి యెందేని గలడె?" (2-54) అని ఆశ్చర్యచకితులయ్యేటట్లుగ వేంకటేశ్వర స్వామిని వర్ణించాడు. సప్తఋషుల శేషాచల యాత్రను (2-51-2-58) రఘునాథ నాయకుడు ఇట్లు రమణీయముగా వర్ణించాడు.

### వాల్మీకి చరిత్రము - ద్వితీయాశ్వాసము

**చ. చనిచని కాంచి రంత హరిచందనభూరుహచారు వాటికా**
**వని వనితాసహాయసురవైణికతల్లజపాణివల్లకీ**
**ఘననినదానుకారి మణికందరజాలముఁబంచవర్ణకాం**
**చనకలవింకచంక్రమ లసద్ధ్వనిశీలము శేషశైలమున్ 51**

**వ. కనుంగొని యవ్వేంకటమహీధరంబున విశంకటమణితటంబులం దముకు బ్రోసినగతి దుముకు నాకాశగంగాతరంగిణి సంగంబులు దొలంచి,**

యభంగభంగతాండవంబులం బెరయు పాండవతీర్థంబునం దానంబులు గావించి, తటమహీరుహకదంబకప్రసవడంబరంబులం గదంబించు తుంబురు తీర్థంబునం గ్రుంకులిడి మఱియు సఘాపనోదనసమర్థంబులగు ననేకతీర్థంబులాడుచు వచ్చి మజ్జనపరనమజ్జనపుష్కలాయుష్కలా యుష్కారిణి యుఁబాపిజనపాపకళంకదుష్క్రియాపంకజకరిణియునగు స్వామి పుష్కరిణిఁ తీర్థంబులాడి. **52**

గీ. కువలయంబున నిదియ వైకుంఠ మనుచుఁ
గరముఁజూపుచు భక్తనికరముఁబ్రోవ
స్వామిపుష్కరిణీతీరభూమి నలరు
వేంకటాచలనాథు సేవించి నిలిచి. **53**

సీ. మణికిరీటంబు సంపద లేమి యనవచ్చు
నమ్మ ముత్తియపు నామమ్ము దంబు
మందహాసంబుల యందంబు హైసరే
సరిలేదు మెడ కంటసరికి నెందు
నుదరబంధము సొంపు లోహోహొ యెచ్చుల
మెచ్చునో బంగారు పచ్చడంబు
కటిఁబసిండి కటారి కాంతి యెంతటి వింత
మంజీరముల మంజిమంబు మేలు

గీ. ఉచితశృంగార మితనికి నొప్పుఁజూడుఁ
డిట్టి చక్కని తండ్రి యెందేని గలఁడె?
వలతు రీ వేంకటాచలవల్లభునకు
యోగిపురుషులు మదియంద యునిచి చాల. **54**

వ. ఇక్కరణి నక్కంజాక్షుని చక్కందనంబునకు మిక్కిలి చొక్కి మఱియును.
**55**



లయగ్రాహి:

పంకజకరాకుచ విశంకటతటీరచిత
కుంకుమపటీరరుచి సంకలితవక్షో
లంకరణకౌస్తుభ! శశాంకరవిలోచన! ప్రి
యంకరగుణప్రకర కింకరదమర్త్యా
శంకర మతానతశివంకర సురాహిత భ
యంకర శరాగతకళంక భువనక్షే
మంకర మునీంద్రగణ సంకథితపావన ని
రంకుశ మహామహిమ! వేంకటగిరీశా! **56**

క. సంకటము లెల్లఁదొలఁగె వి
శంకట భవదీయ వితతసతత ఘనఘృణా
కంకటము గలుగ మాకున్
వేంకటగిరినిలయ కాంతివిజితకువలయా. **57**

'అనుచు నవ్వేంకటాద్రీశు నభినుతించి' సప్తర్షులు అహోబలమునకు ప్రయాణమైనారు.

* * *

## 35. విజయ విలాసము - చేమకూర వేంకటకవి

ప్రతి పద్యములో చమత్కృతి గలుగ రచించు చేమకూర వేంకటకవి 'విజయవిలాసము' అను ప్రబంధమును రచించి, తంజావూరు రఘునాథ నాయకునకు అంకితమిచ్చాడు.

విజయవిలాసం కావ్య అవతారికలో చేమకూర వేంకటకవి రఘునాథ భూపాలుని వేంకటేశ్వరుడు పూర్ణదృష్టితో రక్షించాలని ఇట్లు ప్రార్థించాడు. (1-3)

**"శ్రీ రుచిరాంగి నీ భవనసీమ ధ్రువంబుగ నిల్చు, నేలు దీ**
**ధారుణి నీవ" యన్నక్రియ దక్షిణపాణి నెఱుంగఁజేయు శృం**
**గారరసాబ్ధి వేంకటనగస్థిరవాసుఁడు పూర్ణదృష్టి నెం**
**తే రఘునాథ భూరమణదేవు గుణంబుల ప్రోవుఁ బ్రోవుతన్ ॥**

రఘునాథనాయకుని నగరిలో అతని నివాసమందిరం పేరు 'ఇందిరా మందిరం'. ఆ భవనం నామమాత్రంగా కాకుండా, యధార్థంగా లక్ష్మికి శాశ్వత నిలయం అవుతుందని వేంకటేశ్వరుని ఆశీర్వచనం. వేంకటకవి వేంకటేశ్వరుని శృంగారరసాబ్ధి అని వర్ణించాడు. స్వామి నిత్యకల్యాణ శృంగార పురుషుడు గదా!

అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ శ్రీశైలము, అహోబల క్షేత్రములను దర్శించి, "నిజభజనరత ప్రతిపాదిత ధనేశ్వర పదంబులగు శ్రీవేంకటేశ్వర పదంబులకు నమస్కృతులు విస్తరించి"నాడు. (1-193)

* * *

## 36. కవి చౌడప్ప శతకము - కుందవరపు కవి చౌడప్ప

కవి చౌడప్ప తంజావూరు రఘునాథ నాయకునికి, మట్ల అనంతరాజుకు సమకాలికుడు. చౌడప్ప హాస్యకవి. 'కవిచౌడప్పా' అను మకుటముతో రెండువందల పద్యములు రచించాడు. ఇది కంద పద్యశతకము. దేనికేది పస? అను ప్రశ్నకు సమాధానం చెబుతూ చౌడప్ప 'తిరుపతి కేకాంగుల పస' (50) అని చెప్పాడు. బ్రహ్మచారులు, విరక్తులైన విష్ణుభక్తులను ఏకాంగులంటారు. ఏకాంగులు వేంకటేశ్వరస్వామి వారి సేవలో ఉన్నారు.

* * *



## 37. భానుమతీ పరిణయము - రేటూరి రంగరాజు

రేటూరి రంగరాజు 'భానుమతీ పరిణయము' అను నాలుగు ఆశ్వాసముల ప్రబంధమును రచించి వేంకటగిరి సంస్థానాధిపతి యగు వెలుగోటి రాయశౌరికి అంకితమిచ్చాడు. రంగరాజు తిరుమల శ్రీవేంకటేశ్వర దేవాలయంలో ఆచార్య పురుషుడుగ ఉన్న కందాళ శ్రీరంగదేశికాచార్యుల శిష్యుడు (16 శతాబ్దం).

రేటూరి రంగరాజు భానుమతీ పరిణయము కావ్యాదిలో ఇష్టదేవతా ప్రార్థనలో

**శ్రీలఁ జెలంగు సత్త్వగుణశీలత నిర్మల మూర్తి వయ్యు మై**
**నీల రుచుల్వహించితివి నీ మదిలోపల నీలకాంతు లీ**
**లీలఁ బ్రకాశమయ్యెను భళీయను శ్రీయలమేలుమంగకాం**
**తాళమరీచి రొమ్మునను దాల్చిన వేంకటభర్తఁ గొల్చెదన్॥ - 1-1**

అని ప్రార్థించాడు.

* * *

## 38. మూర్తిత్రయోపాఖ్యానం - దంతులూరి బాపకవి

దంతులూరి బాపరాజుకవి (17 శతాబ్దం) మూర్తి త్రయోపాఖ్యానం రచించినాడు. ఈ గ్రంథములో ఆరు ఆశ్వాసములు ఉన్నవి. ఈ పద్య కావ్యంలో బ్రహ్మ విష్ణు ఈశ్వరుల మహిమలు, లీలలు రసవత్తరంగా వర్ణించబడినవి. ఇది యే సంస్కృత పురాణానికి గాని, కావ్యమునకు గాని అనువాదము కాదు. అనుకరణము కాదు. ఇది ఒక స్వతంత్ర కావ్యం. ఈ కావ్యమును దంతులూరి బాపరాజు తన కులదైవమైన శ్రీమదనగోపాల స్వామికి అంకితమిచ్చాడు.

కవిబాపరాజు స్వీయ వంశమును వర్ణిస్తూ దంతులూరి రామరాజు హరిభక్తిని గూర్చి

**స్మరియింపఁ దన్యంబు జలధికన్యా మనో**
**వల్లభ శ్రీపదద్వయము కన్న....**
**భరియింపఁ దన్యంబు ఫణ కులోత్తమ శిరః**
**పరిధృత శేషభూధరముకన్న** - 1-93

అని ప్రశంసించాడు. రామరాజు వేంకటేశ్వరుని నివాసమైన శేషాచల పర్వతమునకు దప్ప మరెవ్వరికి తలవంచడని కీర్తించాడు.

క్రొత్తలంక మృత్యుంజయకవి మూర్తి త్రయోపాఖ్యానమును రచించి, బాపరాజకవికి ఇచ్చి అతని పేరుతో మదనగోపాలస్వామికి అంకితమిచ్చి లోకానికి చాటినాడని సాహిత్యవిమర్శకులు నిర్ణయించారు.

* * *

## 39. శుకసప్తతి - పాలవేకరి కదిరీపతి

పాలవేకరి (తాడిగోళ్ళ) కదిరీపతి (17 శతాబ్దం) శుకసప్తతి అను శృంగార కథాకావ్యమును రచించి శ్రీరామచంద్రునకు అంకితమిచ్చాడు. ఈ కావ్యంలో నాలుగు ఆశ్వాసములు, ముప్పది కథలు ఉన్నవి. శుక సప్తతి నామ సార్థకముగ డెబ్బది కథలు ఉండాలి. విచారించగా ఈ కావ్యంలో డెబ్బది రాత్రులలో చిలుక చెప్పిన ముప్పది కథలు ఉన్నవని తెలియుచున్నది.

ఈ సాంఘిక, శృంగార కథా కావ్యంలో తిరుపతి శేషశైలముల ప్రస్తావన, ప్రశంసలు కలవు. పదునాల్గవ కథలో కృష్ణానదీ తీరమున తామ్రపురము అను కాపుటూరు ఉంది. ఆ ఊర్లో హాలంకుడనెడి రెడ్డికి రెండో భార్య గుణవతి ఉంది. ఆ ఎమ్మెలాడి కూనలమ్మ చీర కట్టుకుని



**తిరునాళ్ళకై పోయి తిరుపతిలో గొన్న**
**నొక్కుపూసల పేరు టెక్కుసూప (2-411)**

అలంకరించుకుని తిరుగుచుండేది.

18వ కథలో ఒక చిలుక వేశ్య నొకతెను గర్వం పోగొట్టి, దరిద్రను జేసి, అవమానం పాల్జేస్తానని ప్రతిన జేసి నెరవేర్చుకుంటుంది. కామసిద్ధి కోసం వేశ్య, ఆమె కూతురు గుండు కొట్టించుకుంటారు. ఆ సందర్భంలో కదిరీపతి **"తిరుపతి కొప్పులందముగ దీర్చిన బూడిద బొట్లు..." (3-91)** ధరించియున్నారని వర్ణించాడు. కదిరీపతి గుండు కొట్టుకొనుటను, తిరుపతి కొప్పు పెట్టుకొనుట అని చమత్కారంగా వర్ణించాడు.

పందొమ్మిదివ కథలో ఒక మాస్టీని ఇల్లాలు దృఢబాహుడనే బాటసారిని పేరూ, ఊరు అడుగుతుంది. వాడు

**"మధురాపురంబు నా కాణయాచి కాపురంబు తామర తంపర మదీయ గృహంబు శ్రీ ధాన్య కటశీకంబు మదన్వయంబున కాకరంబు కంబుధర పాదాంబు రుహంబు వేదలతాలవాలంబునగు శేషశైలంబున** కరిగి క్రమ్మరి **వచ్చువాడ"** నని (3-187) సమాధానం చెబుతాడు.

* * *

## 40. కృష్ణరాయవిజయము - కుమార ధూర్జటి

కుమార ధూర్జటి (17 శతాబ్దం) 'కృష్ణరాయ విజయము' అను చారిత్రక కావ్యమును రచించి, ఆరవీటి చినవెంకటరాయలకు అంకితమిచ్చాడు. ఈ పద్యకావ్యం విశ్వనాథనాయకుని స్థానాపతి రచించిన 'రాయవాచకము' (వచనగ్రంథం) నకు పద్యానుసరణముగా ఉన్నది.

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు -

**శ్రీరంగస్థల శేషశైలముఖ లక్ష్మీనాథ దివ్యస్థల**
**శ్రీరంజిల్లగ వైభవోన్నతులచే జెన్నొప్పునే?... (2-8)**

అని విష్ణుభక్తులను ప్రశ్నించాడు.

శ్రీకృష్ణదేవరాయలు దక్షిణదేశ యాత్రలో –

**శ్రీశైల కాళహస్తి చిదంబరాదిక**
**రమణీయ శైవస్థలములఁ జూచి**
**శ్రీరంగకాంచికా శేషాచల ప్రము**
**ఖములైన విష్ణు స్థలములఁ జూచి...** నాడు.

ఇట్లు కృష్ణరాయ విజయములో –4–141 శేషాచల ప్రస్తావన ఉంది.

* * *

## 41. హంసవింశతి – అయ్యలరాజు నారాయణామాత్యుడు

నిస్సహాయ కవితా నిర్మాణ చాతుర్య ధురీణుడైన అయ్యలరాజు నారాయణామాత్యుడు హంసవింశతి అనే కథాకావ్యాన్ని రచించి శ్రీరామచంద్రునకు అంకితం ఇచ్చాడు. హంసవింశతిలో దేశంలోగల పర్వతముల పేర్లు, నదులపేర్లు, ఊర్లపేర్లు, 108 దివ్యక్షేత్రముల, దైవతముల పేర్లు, నృత్యాలు రాగాలు, చౌశీతి బంధాలు, పిండివంటలు, వశీకరణ ఔషధాలు మున్నగువాటిని పట్టికలుగా ఇచ్చినాడు. ఇట్లు అయ్యలరాజు నారాయణుడు తన హంసవింశతి కావ్యాన్ని విజ్ఞాన సర్వస్వంగా రూపొందించాడు. ఈ అయిదు ఆశ్వాసముల, ఇరువది రాత్రుల కథాకావ్యాన్ని నారాయణామాత్యుడు శుకసప్తతిని అనుకరించి రచించాడు.

అయిదవ రాత్రి కథలో విజయుడు, మంజుల అనుగొల్ల దంపతులు సంతానమునకొరకు –

**తిరుమల కంచి పుష్పగిరి తీర్థములుంజని కొంగుముళ్లతో**
**వరములు దంపతుల్వడి యవారిగ గాన్కలు వైచి** నారు (2–86)



కాని వారి పుత్రవాంఛ నెరవేరలేదు.

పదునారవ రాత్రి కథలో దేశములో గల పుణ్యతీర్థములను వర్ణించే సందర్భములో –

**స్వామి పుష్కరిణిలో స్నానంబు గావించి**
**శశిపుష్కరిణి నీళ్లు చల్లులాడి** **4–208**

అని వర్ణించబడింది.

పదునారవరాత్రి కథలో నూట ఎనిమిది తిరుపతుల గూర్చి చెప్పు సందర్భంలో నారాయణామాత్యుడు –

**శ్రీకాకుళమున సిస్తుగ నిలిచిన**
**యాంధ్రనాయకునకర్చన మనుచును**
**ఘనత నహోబల గరుడాద్రి**
**హిరణ్యాసుర వధునకు నతిజోబిళ్లని**
**వేంకటగిరిపై వెలసిన తిరువేంగడ**
**ముడియానుల గని వందనమని**
**యాదవపర్వతమందలి నారాయణునకు**
**జయజయలావర్తింపుచు** **4–214**

అని 108 పుణ్యక్షేత్రములలో గల దేవతామూర్తులను మంజుల గతిరగడలో వర్ణించాడు. (110 పద్యపాదములు)

ఇట్లు హంసవింశతిలో తిరుమల, స్వామి పుష్కరిణి, తిరువెంగడనాథుల ప్రస్తావనలు ఉన్నవి.

* * *

## 42. క్షేత్రయ్య పదములు - క్షేత్రయ్య

మువ్వ వరదయ్య (17 శతాబ్దం) అనేక పుణ్యక్షేత్రములను దర్శించి కీర్తించడం చేత క్షేత్రయ్యగా ప్రసిద్ధుడైనాడు. క్షేత్రయ్య పెక్కు దేవతామూర్తులపై శృంగార రసభరితమైన అభినయానుకూలమైన మువ్వగోపాల ముద్రతో పదములను రచించి ధన్యుడైనాడు.

క్షేత్రయ్య బిలహరిరాగంలో "ఎటువంటి స్త్రీల పొందైన - హితవై యుండునా" అను పల్లవి గల పదములో (97) -

**"చెలువ! మువ్వగోపాలుడైన - శ్రీ వేంకటరమణా యని**
**కిలకిల నగవుల నాయెద గుబ్బల గుమ్ముచు"**

అని స్వామి మధుర లీలలను, శృంగార అనుభవాన్ని వర్ణించాడు.

క్షేత్రయ్య పంతువరాళి రాగంలో **"ఏమోమాయ వలపాలాగున చలము జేసేనే"** అను పదములో (130)

**"చెలియ! (మా) మువ్వగోపాలుడైన శ్రీవేంకటేశుని కలిసిన వగలెల్ల కల్లలాయె నేడు"** అని వర్ణించాడు.

ఇట్లు మువ్వగోపాలునికి వేంకటేశునికి అభేదం కల్పించి చెప్పిన పదములు (208, 215, 236) మరో మూడు ఉన్నవి.

క్షేత్రయ్య ఏ దేవుని కీర్తించినా, వారికి మువ్వగోపాలునికి అభేదం చెప్పి మువ్వగోపాలముద్రతో పదం ముగిస్తాడు.

* * *

## 43. పరమయోగి విలాసము - సిద్ధిరాజు తిమ్మరాజు

కొండవీటి ప్రభువైన సిద్ధిరాజు తిమ్మరాజు పరమయోగి విలాసము అను పద్యకావ్యమును రచించి మంగళగిరి నృసింహస్వామికి అంకిత మిచ్చాడు. ఇతని తండ్రి ఓబలరాజు, తల్లి కోనమాంబ. తిమ్మరాజు



(16 శతాబ్దం) శ్రీకృష్ణదేవరాయల అల్లుడైన అళియ రామరాయలకు, వసుచరిత్ర కృతినొందిన తిరుమలరాయలకు మేనల్లుడు. ఈ రాజకవికి సమకాలికుడైన తాళ్ళపాక తిరువెంగళనాథుడు (చిన్నన్న) పరమయోగి విలాసమును ద్విపదకావ్యంగా రచించాడు.

పరమయోగి విలాసమున అయిదు ఆశ్వాసములు గలవు. తిమ్మరాజు వైష్ణవుడు. ఈ కావ్యంలో విష్ణుభక్తులైన ద్వాదశ ఆళ్వారుల చరిత్ర, వైష్ణవ మతోద్ధారకులగు నాథముని, యామునాచార్యులు, రామానుజాచార్యులు చరిత్ర వర్ణింపబడింది. ఈ పరమయోగి విలాసమున ఆళ్వారాచార్యుల వర్ణన సందర్భములో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రస్తుతి ఇట్లున్నది -

**వినతుల కొనగ దాల్చిన శాంత రసమన**
**నడుగుల గటకహీరాంశు లమర**
**గటినిద్ద కేల్దమ్మి గడురాలి క్రమ్మువు**
**ప్పొడి వోలె బసిడి పచ్చడము దనర**
**దార్తుల కిదియ దిక్కని తన పాద ద్వ**
**యము చూపుగతి పరహస్తమమర**
**గడు దయాదృష్టి దెల్పెడు తటిల్లత రీతి**
**హృదయస్థలిని లక్ష్మియింపు నెరప**
**నాననేందు సుధాధారలనగ దార**
**హార వల్లుల నురమున నలరుచుండ**
**జారుమకుటాభి శోభియు శంఖ చక్ర**
**హృద్యపార్శ్వుడు మా వేంకటేశ్వరుడు ॥**

సిద్ధరాజు తిమ్మరాజు, తాళ్ళపాక తిరువెంగళనాథుడు - వీరికి ఆళ్వారుల ఆచార్యుల చరిత్రమును దెలుపు ద్రావిడ గ్రంథములు ఆధారములయి యుండును. సిద్ధిరాజు తిమ్మరాజు 'మా వేంకటేశ్వరుండు' అని వర్ణించుటలో ఆతని భక్తి వైశిష్ట్యము, అతనికి స్వామి వారితో గల ఆత్మీయత స్పష్టమగు చున్నది. అనన్యభక్తులకు స్వామిని 'మా వేంకటేశ్వరుడ' నుట గర్వకారణము.

## 44. కకుత్స్థ విజయము - మట్ల అనంతభూపాలుడు

మట్ల అనంతభూపాలుడు కకుత్స్థవిజయము అను అయిదు ఆశ్వాసముల కావ్యమును రచించి తన తండ్రియగు ఎల్లభూపాలునకు అంకితం చేశాడు. ఎల్లరాజు సిద్ధవటం సీమకు సామంతరాజు. అనంతుని తల్లి రంగాంబ. ఇతడు సూర్యవంశక్షత్రియుడు. తిరుమల తోళప్పాచార్యుని శిష్యుడు. కృష్ణదేవరాయల తర్వాత కావ్యములు రచించిన రాజకవులలో అనంతుడు ఒకడు.

కకుత్స్థ విజయము అయిదు ఆశ్వాసముల పద్యకావ్యం. ఇందులో 936 గద్యపద్యములు ఉన్నాయి. మట్ల అనంతరాజు కకుత్స్థ విజయము కావ్యప్రారంభములో

**శా॥ శ్రీపాదాంబురుహ ద్వయం బిది మదిన్ సేవించు వాఁడెవ్వఁడో**
**యాపుణ్యుండరచేతి రత్నమగు మాకన్నట్లుగాఁ దాదృశ**
**వ్యాపారోన్ముఖ రత్న హస్తమగు తత్త్వం బాయురారోగ్యలీ**
**లాపూర్తుల్దయ గావ్యకర్త <u>కలమేల్మంగావరుండీవుతన్</u> ॥**

అని వేంకటేశ్వరుని ప్రార్థించాడు. ఈ కావ్యంలో ఇక్ష్వాకు వికుక్షి, కకుత్స్థుని విజయములు వర్ణింపబడినవి. ఈ కావ్యమునకు మూలము విష్ణుపురాణము, భాగవతములలోని కకుత్స్థ విజయములు. అనంతరాజు ఈ కావ్యంలో యక్షగానములలో ఉండే కొరవంజి పాత్రను ఇక్ష్వాకు కర్పూర తిలక ప్రణయ ఘట్టములో ప్రవేశపెట్టినాడు. ఈ కావ్యం క్రీ.శ.1904లో సరస్వతీ పత్రికలో కొ.రా.వేం.కృష్ణ రావుచే ప్రచురించబడింది.

* * *



## 45. విష్ణుభజనానందము - బమ్మెర కేశకవి, మల్లకవి

బమ్మెర కేశకవి, బమ్మెర మల్లకవి సోదరులు మహాభాగవత కర్త మహాకవి పోతన (బమ్మెర) యొక్క ప్రపౌత్రులు. వీరు ప్రౌఢ సరస్వతి యొక్క కుమారులు. వీరు విష్ణుసేవా మాహాత్మ్యమును వెల్లడించు విష్ణుభజ నానందము అను అయిదు ఆశ్వాసములుగల పద్యకావ్యమును రచించారు. ఈ సోదరకవులు విష్ణుభజనానందము అవతారికలో తమ గురువైన తిరుమల వెంగళాచార్యుని **"<u>శ్రీవేంకటేశ</u> రాజిత పాదరాజీవ మానితాను ధ్యాన మానసుండు"** అని కీర్తించియున్నారు.

* * *

## 46. పంచతంత్రము-రాజనీతి రత్నాకరము -నేబతి కృష్ణమాచార్యులు

నేబతి కృష్ణమాచార్యులు (క్రీ.శ.17 శతాబ్దం) పంచతంత్రమును వైష్ణవ ప్రబంధముగా మార్చి రచించాడు. దీనికి రాజనీతి రత్నాకరము అను పేరు పెట్టినాడు. ఇతడు గోల్కొండ సుల్తాను ఖులీకుతుబ్‌షా (1580-1612) మంత్రిమండలిలో ఒకడు. కృష్ణమాచార్యుల గురువు కందాళ రంగాచార్యులు. ఈ పంచతంత్రము ఆంధ్రదేశీయము, వైష్ణవీయము అగుట దీని ప్రత్యేకత.

కృష్ణమాచార్యుల వంశములో ఒక పూర్వ పురుషుడు బెడందకోట సుల్తాన్‌షా వద్ద 'నౌబతి' పదవిలో ఉన్నాడు. నౌబతి అనేమాట 'నియాబత్' అను ఉర్దూపదానికి తెలుగురూపం. దీనికి రాయబారి, స్థానాపతి అని అర్థము. కృష్ణమాచార్యుల తండ్రి కమల మంత్రి. పానుగంటి పురాధ్యక్షుడు.

ఈ పంచతంత్రం కథ శ్రీరంగంలో మొదలవుతుంది. విష్ణుశర్మ శ్రీరంగం రాజకుమారులకు రాజ-నీతి కథలు బోధిస్తాడు. కాంచీపురం వ్యాపారి

విష్ణువర్ధనుడు తిరుపతికి యాత్రకు వచ్చాడు. ఆళ్వారు తీర్థమున స్నానం చేసి, తిరుమణి, తిరుచూర్ణములను ధరించి, పన్నిద్దరాళ్వారులను పూజించి, స్తుతించి గోవిందరాజులను కొలిచినాడు. పిమ్మట తిరుమల చేరి స్వామి పుష్కరిణిలో స్నానం చేసి పవిత్రుడై గరుడస్తంభమునకు (ధ్వజస్తంభమునకు) ప్రదక్షిణము చేసి వేంకటేశ్వరస్వామిని దర్శించాడు. స్వామి ఆదేశమున వ్యాపారి విష్ణువర్ధనుడు సంజీవకమును (ఎద్దు) స్వామికి సమర్పించాడు. అది ఇట్లున్నది –

**దినదినము నరవ పిల్లలు**
**పనుపడగా నానపాల పాసెపు ముద్దల్**
**దినుపింప వృషభ మెచ్చెన్**
**మినమిన మని మేనిచాయ మించులజూపన్. ॥**

సీ. **కోనేరు తీర్థంబు గ్రోలి వచ్చుటలచే**
**వేంకటేశ ముఖాబ్జ వీక్షణమున**
**సతత వైష్ణవ దివ్య సల్లాప కథలచే**
**ద్రవిడ ప్రబంధార్థ తతుల చేత**
**శ్రీ భాగవత భుక్త శేషంబు గొనుటచే**
**సజ్జనోత్తమ వికస్పర్శనమున**
**కల్పకారామ సంగతి జనించుటచే**
**వివిధ మున్యాశ్రమ విహరణముల**

గీ॥ **గాంచె సుజ్ఞాన విభవంబు గాంచె యుక్తి**
**గాంచె రామాయణాది భాగవత పురాణ**
**వేద వేదాంత శాస్త్రార్థ విశద బుద్ధి**
**భళిర సంజీవకుడు కళాప్రౌఢి మమున. ॥**

ఈ విధముగ పంచతంత్రముపై వైష్ణవ ముద్ర వేసి రాజనీతి రత్నాకరమును రచించినా – నేబతి కృష్ణమాచార్యులు



ఈ రాజనీతి రత్నాకరము – పంచతంత్రములో క్షీరాబ్ధి వర్ణన, శ్వేత ద్వీప వర్ణన, శ్రీమన్నారాయణుని సాక్షాత్కారము మొదలగు వర్ణనలు గలవు. సంజీవ పింగళకుల పోరులో వేంకటేశ్వరుడు ప్రత్యక్షమై సంజీవకుని రక్షించుట తృతీయాశ్వాసములో వర్ణించబడింది.

రాజనీతి రత్నాకరము అముద్రితము. దీని తాళపత్ర ప్రతి ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత అకాడమీ లిఖిత పుస్తక భాండాగారములో వున్నది. (చూడు MS.188.)

* * *

## 47. నారసింహపురాణం – ఉత్తరభాగము – హరిభట్టు

హరిభట్టు (క్రీ.శ.16 శతాబ్దము) వరాహ పురాణము, మత్స్యపురాణము, భాగవతము షష్ఠ, ఏకాదశ, ద్వాదశ స్కంధములు, నరసింహపురాణము ఉత్తరభాగమును రచించాడు. హరిభట్టు కీర్తి శేషుడైన పిదప అతని కుమారుడు రాఘవభట్టు నారసింహపురాణ ఉత్తరభాగమును అవతారికను రచించి ప్రోలుగంటి రంగన మంత్రికి అంకితమిచ్చాడు.

నారసింహ పురాణము ఉత్తరభాగమున కృత్యాది పద్యమిట్లున్నది–

**శ్రీమహిళాంతరంగ సరసీజనభోమణి యాదవాన్వయ**
**గ్రామణి సర్వదైవత శిఖామణి యాశ్రితభక్తలోకవాం**
**ఛామణి శాంబరీ మృగదృశామణి వేంకటశైలరాజర**
**క్షామణి ప్రోలుగంటి నరసప్రభు రంగనఁ బ్రోచుఁగావుతన్॥**

కృతిపతియైన రంగన మంత్రి ప్రోలుగంటిపుర వాస్తవ్యుడు. నంద్యాల చినయోబళరాజుకు మంత్రిగా ఉండెను. ప్రోలుగల్లు తుంగభద్రా నదీ తీరమున ఉన్నది. నారసింహ పురాణోత్తరభాగమునకు కృతిపతియైన ప్రోలుగంటి రంగన మంత్రి కందాళ శ్రీరంగాచార్యుల శిష్యుడు అతడు వేంకటాచల విభుని అపరమూర్తిగా స్తుతింపబడినాడు.

**గురుతర వాధూల గోత్రాన్వయాంభోధి**
**పూర్ణిమాచంద్రుఁడై పొలుపుమీరె**
**జైనచార్వాకాది సకల దుర్మత ఘోర**
**గహన ధూమాంకుఁడై కణకమించె**
**శిష్యకదంబక చిరతర సంపత్తి**
**వితరణ ఖ్యాతియై వృద్ధిఁబొందె**
**శ్రీ వేంకటాచల శిఖర మందిర దేవ**
**తాపరమూర్తియై యవతరించె**

**జగతి కందాళ భావనాచార్య వర్య**
**తనయు డయ్యె గురుస్వామి ఘనత కెక్కె**
**నట్టి శ్రీరంగ గురునాథుఁ డాత్మగురుఁడు**
**గాఁగ సన్నుతి వడసె రంగప్రభుండు.**

* * *

## 48. వామనపురాణము - పొన్నతోట ఔబళకవి

పొన్నతోట ఔబళకవి (క్రీ.శ.16 శతాబ్దం) వామనపురాణమును రచించి రాణా జగదేవభూపతికి అంకితమిచ్చాడు. జగదేవభూపతి (తిమ్మరాజు) కూడ కవి. ఇతడు అధ్యాత్మ రామాయణాన్ని తెనిగించాడు.

వామనపురాణం పది ఆశ్వాసముల కావ్యం. అముద్రితం. దీని ప్రతి మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో (GOMSL-No.R607) ఉన్నది.

వామనపురాణమున గద్య ఇట్లున్నది -

"ఇది శ్రీమద్వేంకటరమణ పరిచరణ ధురంధర హృదయ నిఖిలకవి రాజ వర్ణణీయాంధ్ర కవితావిశేష సర్వంకషభాషా నిరాఘాట పొన్నతోట



కులపాథోనిధి రాకానిశారాజరాజ ఔబళార్య తనూభవ ఔబళకవి ప్రణీతంబైన వామనపురాణంబునందు సర్వంబును దశమాశ్వాసము".

పొన్నతోట ఔబళకవి కందాళ శ్రీరంగ గురుని శిష్యుడైనట్లు ఈ క్రింది పద్యములో చెప్పినాడు.

గీ. **శ్రీనివాసపదాంభోజ సేవనా ని**
**రూఢ మానసఘనజాతరూప కుధర**
**ధైర్యుఁ గందాళ భావనాచార్య తనయు**
**గురు శిఖామణి శ్రీరంగగురునిఁ దలఁతు ॥**

ఔబళకవి, తెనాలి అన్నయ్య (సుదక్షిణా పరిణయ కర్త) కలిదిండి భావనారాయణ (విష్ణుపురాణకర్త) శ్రీరంగాచార్యుల శిష్యులు. కందాళ శ్రీరంగ గురువు (శ్రీరంగాచార్యులు) తిరుమల శ్రీవేంకటేశ్వర దేవాలయమున ఆచార్య పురుషుడు. ఇతడు భావనాచార్యుని కుమారుడు. ఈ శ్రీరంగాచార్యులు వేంకటేశ్వరస్వామి శ్రీభండారమునకు 1500 పణములు సమర్పించి తన పేర ముప్పది దోసెపడులను స్వామికి, ఉత్సవమూర్తులకు పర్వదినములలో నివేదన చేయుటకు ఏర్పాటుచేసి తేది 05-07-1545న శిలాశాసనము వేయించాడు. (శాసన సంఖ్య.48, సంపుటం5, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1998)

* * *

## 49. దశావతారచరిత్రము - ధరణిదేవుల రామయ

ధరణిదేవుల రామయమంత్రి (క్రీ.శ.17 శతాబ్దం) దశావతారచరిత్రము అనే పద్యకావ్యాన్ని రచించినాడు. ఈ కావ్యంలో పది ఆశ్వాసములు, 2,477 గద్యపద్యాలు ఉన్నాయి. దీనికి కవి పెట్టిన పేరు 'రసిక జన కంఠాభరణ శ్రీకృష్ణ దశావతార చరిత్రము'. ఈ కావ్యం ముగదల కృష్ణయమంత్రికి

అంకితమివ్వబడింది. ఈ కృష్ణమంత్రి క్రీ.శ.17 శతాబ్దంలో దచ్చివారికి నెల్లూరు మండలములోని ప్రళయ కావేరి పట్టణములో (నేటి పులికాట్) ద్విభాషిగా పనిచేశాడు.

ధరణిదేవుల రామయ మంత్రి తండ్రి నాగయ మంత్రి, తల్లి ఫణియమ్మ, రామయ మంత్రికి పుష్పగిరితిమ్మన, కంకంటిపాపరాజు, టేకుమళ్ళ రంగశాయి సమకాలికులు. రామయమంత్రి దశావతార చరిత్ర కృత్యాదిలో ఇట్లు వేంకటేశుని ప్రార్థించాడు –

**శ్రీకర మత్స్య కూర్మ కిటిసింహ వటూత్తమ రామ బుద్ధ క**
**ల్క్యాకృతుల న్వచో౽మరధరార్భక వాసవ సంశ్రవార్క కా**
**మాకుముదాప్త భృజ్జయకృతావనుఁడై తగు వేంకటేశుఁ డెం**
**తే గృపఁ బద్మనాభసచివేశ్వరు కృష్ణసుధీంద్రు బ్రోవుతన్ ॥ – 1-1**

రామయ మంత్రి అష్టభాషా కవిత్వ తత్వసంవేది, రామయ మంత్రి ఈ కావ్యాన్ని రసిక జన కంఠాభరణ శ్రీకృష్ణ దశావతార చరిత్ర మహాప్రబంధ పవిత్ర ముక్తాదామమని, విచిత్ర కథాసూత్రము గలదని ప్రశంసించాడు. తర్వాత ధరణి దేవుల రామయ మంత్రి దశావతార చరిత్రములో బలరాముని తీర్థయాత్రావర్ణనలో బలరాముడు దర్శించిన వేంకటేశ్వర వైభవము ఇట్లున్నది. (చూడు MS.192).

**సీ॥ జాతి కిరీటి పచ్చని కిరీటము డాలు**
**ఖంజ కిరీటంబుల పుంజి తెలుప**
**మకర కుండల మరీచిక గండ మండలి**
**మండలీ నాట్య సంభ్రమము జూప**
**గర శంఖ చక్రముల్ వర చక్ర తిమర వా**
**రణ చక్రరిప్ర హిత ప్రౌఢి మెరయ**



**రమణీయ పీతాంబర ప్రభాడంబర**
**మంబరంబునకు హేమంబు నెరప**

**గీ॥ వక్షమున గౌస్తుంబు శ్రీవత్స తులసి**
**దామముల కాంతియును సముద్దామ లీల**
**గలిసి కుంకుమ కస్తూరికల ఘటింప**
**మెరసి కొలువుండు వేంకటేశ్వరుని గాంచి ॥ 1-153**

* * *

## 50. నల్లందిగళ్ వంశము వారి ప్రశంస – అజ్ఞాత కవి

పాండ్య దేశాధిపతి విజయరంగ చొక్కనాథుని (క్రీ.శ.1659–1682) ఆస్థాన కవులు, అధికారులయిన నల్లందిగళ్ వంశము వారయిన తిరుమలాచార్యుని పుత్రులయిన అయ్యవారయ్య, ఇతని అనుజులు శేషాచార్యులు, వేంకటరాఘవాచార్యులు, కస్తూరి మంత్రి సోదరులను ప్రశంసిస్తూ అయ్యవారయ్య పేరగల సీసమాలికలో వేంకటేశ్వరుని ప్రశంస గలదు. ఈ సీసమాలిక అజ్ఞాత కర్తృత్వము.

**శ్రీయలమేలు మంగాయతోర స్తట**
**శస్త కస్తూరికా సారమిళిత**
**పరిమళలహరీ విభాస్వర కౌస్తుభ**
**హార విశాలరమ్య తర వక్ష**
**ఫణి నగాధ్యక్ష దీవ్యత్కరుణా కటా**
**క్షార్జిత ధనకనకాశ్వమత్త**
**దంతావళ భటప్రతాన ముఖ్య సమస్త**
**వస్తు వైభవధుర్య ప్రకటశౌర్య**

**వనరాశి గాంభీర్య వైష్ణవ కులవర్య**
**ధరణీధ్ర ధైర్య ప్రతాప సూర్య**
**యాలకింపుము భవదన్వయ సంజాత**
**విఖ్యాత పౌరుష వృత్తు లెల్ల**

అని సీసమాలిక ప్రారంభమైంది. నల్లందిగళ్ వంశీయులు వేంకటేశ్వరుని దివ్య కృపా కటాక్షములచే ధన కనకములను, అశ్వగజ, భటాది వస్తు వైభవాన్ని పొందినారని ప్రశంస. ఈ సీసమాలిక మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయములో (GOMS Library) D2629 సంఖ్యతో ఉన్నది.

* * *

## 51. వైశ్యపురాణము - గురు భాస్కరాచార్యులు

భాస్కర పంతులని పిలువబడుచున్న గురు భాస్కరాచార్యులు వైశ్య పురాణమును రచించి వైశ్య యువకులకు అంకితం చేశాడు. వైశ్య పురాణము ఎనిమిది ఆశ్వాసముల పద్యకావ్యం. దీనికి కన్యకా పురాణమని, వాసవీ మాహాత్మ్యము అని నామాంతరములు ఉన్నవి. విష్ణువర్ధనుడను రాజు దిగ్విజయం చేయు సందర్భములో వేంకటేశ్వరస్వామిని దర్శించినట్లు భాస్కరాచార్యులు ఇట్లు వర్ణించాడు.

**రూపగాంభీర్య సద్గుణ రూఢ మహిమ**
**నెమ్మికాంౘైన శ్రీ వేంకటేశుఁ జూచి**
**శరణు శరణని మ్రొక్కి సాష్టాంగ మపుడు**
**నిడుచు నవ్విష్ణు వర్ధనుఁ డెలమితోడ ॥**

## 52. పరిశీలన

ఈ ప్రస్తావన, ప్రస్తుతుల పరిశీలన వలన క్రీ.శ.14 శతాబ్దం నుండి వేంకటాచలము, దివ్యస్థలంగా వేంకటేశుడు ఇష్టదేవతగా పరిగణింపబడి



భక్తులు శ్రమతో కొండను ఎక్కి స్వామిని దర్శించుచుండిరని తెలియుచున్నది. విజయనగరరాజులు వేంకటనాథుని దయవలన రాజ్యాభివృద్ధిని పొంది కృతజ్ఞతాభక్తితో వేంకటాద్రిని ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేసినారని వెల్లడి యౌతున్నది. ముఖ్యంగా కృష్ణదేవరాయలకు వేంకటనాథునిపై గల భక్తి అపురూపము, ఆదర్శప్రాయము.

క్రీ.శ. 16 శతాబ్దములో కూడ వేంకటనాథునితో తోమనిపళ్ళాల వానిగా, తిండిమెండయగారిని గా, తిగళుల గురువు (ద్రావిడుల దైవము)గా భావించేవారు. కపిలతీర్థమును ఆళ్వారు తీర్థమని పిలిచేవారు. తిరుమలలో భక్తులు స్వామిపుష్కరిణిలో స్నానము చేసి, మొదట వరాహస్వామిని దర్శించి, పిమ్మట వేంగడనాథుని దర్శించేవారు. భక్తులు కోరికలు నెరవేరుటకు, వరసిద్ధికి వెంకటనాథుని మూడు అహోరాత్రములు సేవించేవారు. క్రీ.శ.16 శతాబ్దం నుండి, అచ్యుత దేవరాయల కాలంనుండి తిరుమల దేవాలయములో దేవదాసీ వ్యవస్థ ఉండేది.

పూర్వం ప్రముఖులైన భక్తులకు వేంకటేశుడు ధరించిన పూలమాలలను అనుగ్రహించేవారు. ప్రస్తుతం వేంకటేశుని నిర్మాల్యము భక్తులకు అనుగ్రహించు సంప్రదాయం లేదు. కవులు వేంకట వల్లభుని శృంగార రసాబ్ధిగా వర్ణించారు. పూర్వం తిరుమలకు, తిరుపతికి అభేదం పాటించి తిరుమలను ఎగువ తిరుపతిగా పిలుస్తుండేవారు. అందువలన తిరుమలలో మ్రొక్కుబడిగా గుండు కొట్టించుకొనుటను 'తిరుపతి కొప్పు' అని చమత్కారంగా పరిహసిస్తుండే వారు 'తిరుపతి కొప్పు' పెట్టడం అంటే గుండు కొట్టించడం అని అర్థం. ఇదొక జాతీయముగా స్థిరపడి ప్రసిద్ధమైంది.

* * *

# అంకిత కావ్యములు

## 4.2 అంకిత కావ్యములు

శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులయిన ప్రాచీననాంధ్ర కవీశ్వరులు కొందరు వేంకటేశ్వరస్తుతి, మాహాత్మ్య కావ్యములను రచించక పోయినను తాము రచించిన కావ్యములను వేంకటేశ్వరునకు అంకితము చేసినారు. ఆ విధంగా అవకాశము కల్పించుకొని వేంకటేశ్వర భక్తులయిన కవులు ఇష్టదైవమగు వేంకటేశ్వరస్వామిని స్తుతించినారు. ఈ స్తుతులు స్వామివారి మహిమలను, లీలలను, కవుల భక్తిని వెల్లడించుచున్నవి.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో శ్రీకృష్ణదేవరాయల యుగము (క్రీ.శ. 1500–1600) ప్రబంధ యుగముగా పరిగణింపబడింది. ఈ యుగములో మహాకావ్యలక్షణోపేతమైన, రసబంధురమైన స్వతంత్ర కావ్యములు రచింపబడినవి. ఈ ప్రబంధ ప్రక్రియ ఆంధ్రుల ప్రత్యేక సారస్వత సిద్ధిగా, సాహిత్య చరిత్రలో ప్రథమ నవ్య కవితోద్యమంగా చెప్పదగియున్నది.

కావ్యమును తన ఇష్టదైవమునకు అంకితము చేయుటను ''పుణ్య ప్రబంధములు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధనా విశేషంబు" (తిక్కన భారతము, విరాట, 1–31) అని కవి బ్రహ్మ వాక్కు. కావ్యములో ఆశ్వాస ఆద్యంతములలో, షష్ఠ్యంతములలో కృతిపతి అయిన ఇష్టదైవాన్ని స్తుతిస్తూ సంబోధిస్తూ కావ్యరచనసాగిస్తూ ప్రధాన శ్రోత అయిన ఇష్టదైవానికి కావ్యం వినిపిస్తుంటాడు కవి. ఇదీ ఒక భగవదారాధనా విశేషమని తిక్కన సోమయాజి ప్రవచించినారు[1].

శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమీయబడిన మహాకావ్యములలో – ప్రబంధములలో – శ్రీ కృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద' – విష్ణు చిత్తీయం – అను ప్రబంధం ప్రథమగణ్యమైనది. శ్రీ వేంకటేశ్వరాంధ్ర

1. అచ్యుతదేవరాయలు (1530–1542) ప్రతి సంవత్సరం ఒక కావ్యం రచింపజేసి తిరుమల వేంకటేశ్వర స్వామికి సత్కావ్య పుష్పాంజలి సమర్పించేవాడు.

సాహిత్యము తాళ్ళపాక అన్నమాచార్యుల రచనలతో (క్రీ.శ. 1408–1503) ప్రారంభమైనది. తాళ్ళపాకవారి కృతులన్నియు లఘుకావ్యములే, ఆముక్తమాల్యద ప్రౌఢప్రబంధము. ఆంధ్ర పంచకావ్యములలో ఒకటిగా గౌరవింపబడింది.

ఈ అధ్యాయములో శ్రీ వేంకటేశ్వరాంకిత కావ్యములలోని వేంకటేశ్వర ప్రస్తుతులు, మహిమల వర్ణనలు ఆముక్తమాల్యద ప్రబంధముతో ప్రారంభించి పరిశీలింపబడుచున్నవి.

## 1. ఆముక్తమాల్యద - శ్రీకృష్ణదేవరాయలు

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదను భగవంతునికి ఆదేశానుసారము రచించి, తన ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరనాథునకు అంకితమిచ్చి, ధన్యుడైనాడు. రాయలు ఆముక్తమాల్యదను రచించుటకు, వేంకటవిభునకు అంకితమిచ్చుటకు కారణమైన సంఘటన ఇట్లున్నది.

స్వస్తి శ్రీ శాలివాహనశకం 1438 సంవత్సరంలో (క్రీ.శ. 1516లో) శ్రీకృష్ణదేవరాయలు విజయనగరంనుండి కళింగదేశ జైత్రయాత్రకు వెళ్ళుచూ, మార్గమాధ్యంలో బెజవాడ (విజయవాడ)లో కొన్ని దినములు విడిది చేశాడు. ఆ కాలంలో ఒక హరివాసరం (ఏకాదశి)నాడు రాయలు బెజవాడనుండి కృష్ణానదీ తీరమున ఉన్న శ్రీకాకుళ క్షేత్రములో వెలిసియున్న ఆంధ్ర విష్ణుదేవుని దర్శించినాడు. ఆ ఏకాదశినాడు రాయలు ఉపవాసం ఉన్నాడు. ఆ రాత్రి వేకువజామున రాయలుకలగన్నాడు. ఆ కలలో ఆంధ్రవిష్ణుదేవుడు కనిపించి ఇట్లు పలికినాడు.

"కృష్ణరాయా! నీవు సంస్కృత భాషలో మదాలస చరిత్ర, సత్యావధూ ప్రీణనము (పారిజాతాపహరణము) సకల కథాసార సంగ్రహము, జ్ఞాన చింతామణి, రసమంజరి మున్నగు కావ్యములు రచించినావు. కనుక ఆంధ్రభాషలో కావ్యరచన చేయడం అసాధ్యంకాదు. కనుక మాకు ప్రీతి గలుగునట్లుగా తెలుగు భాషలో ఒక కావ్యం రచించుము."



**"ఎన్నిను గూర్తునన్న, విను, మేమును దాల్చిన మాల్యమిచ్చున**
**పిన్నది రంగమందయిన పెండిలి సెప్పుము; మున్నుఁగొంటి నే**
**వన్నన దండయొక్క మగవాఁడిడ, నేను దెలుంగు రాయఁడన్**
**గన్నడ రాయ, యక్కొదువ గప్పు ప్రియాపరిభుక్త భాక్కథన్॥**

**- ఆముక్త మాల్యద, 1-14**

నిన్ను గురించి పురాణకథలు అనేకం ఉన్నాయి. వాటిలో ఏ కథను కావ్యంగా రచించాలి? అని నీవు అడిగితే పూర్వం తన తలపై ధరించి, తొలగించిన పూలదండను నా అలంకరణకు సమర్పించిన చిన్నదానిని (గోదాదేవిని) శ్రీరంగంలో పెండ్లియాడిన కథను కావ్యంగా రచింపుము. పూర్వం నేను కృష్ణావతారంలో ఒకమగవాడు - సుదాముడు ఇచ్చిన పూలదండను ఏవగింపుతో స్వీకరించాను. ఆ కొదువ తొలగించుటకు ప్రియాపరిభుక్తభా క్కథను తెలుగు భాషలో కావ్యంగా రచించుము. నేను తెలుగు రాయడను. నీవు కన్నడ రాయడవు. 'దేశభాషలందు తెలుగు లెస్స' అనుట నీకు తెలియును కదా! కనుక ఆముక్తమాల్యద - గోదాదేవి - కథను తెలుగు భాషలో కావ్యంగా రచించుము". అని ఆంధ్ర విష్ణువు రాయలను కోరినాడు. పిమ్మట శ్రీకాకుళాంధ్రవల్లభుడు.

**"అంకితమో యన, నీ కల**
**వేంకటపతి యిష్టమైన వేల్పగుటఁ దదీ**
**యాంకితము సేయు; మొక్కొక**
**సంకేతముగాకతడ రసన్నే గానే"** **- ఆముక్తమాల్యద, 1-16**

ఆముక్తమాల్యద కావ్యాన్ని ఎవరికి అంకితము చేయాలి? అంటే కృష్ణరాయా! నీకు వేంకటాచలపతి ఇష్టదైవం. కనుక ఆముక్తమాల్యద కావ్యాన్ని వేంకటపతికి అంకితం చేయుము. మేము ఇరువురుగా కన్పించడం కేవలం సంకేతం. యధార్థమునకు అతడే నేను. నేనే అతడు. మాకు భేదం లేదు."అని

వివరించినాడు. ఈ సంఘటన వలన శ్రీకాకుళ ఆంధ్రవిష్ణువే తిరుమల వేంకటేశ్వరుడని, ఇరువురికి భేదం లేదని, ఇరువురు శ్రీమన్నారాయణుని అవతారములే అని స్పష్టమగుచున్నది.

కృష్ణదేవరాయలు కళింగజైత్రయాత్ర ముగిసిన తర్వాత తెలుగు భాషలో గోదాదేవి కల్యాణం కథను 'ఆముక్తమాల్యద' అను పేరుతో రచించి తన ఇష్టదైవమైన తిరుమల వేంకటేశ్వరునకు అంకితమిచ్చినాడు. ఇట్లు రాయలు ఆంధ్ర విష్ణుదేవుని ఆదేశాన్ని నెరవేర్చినాడు.

శ్రీ విలుబుత్తూరు నివాసి అయిన విష్ణుచిత్తునకు (గోదాదేవి తండ్రికి) భగవంతుడైన వనమాలికి (విష్ణుదేవునకు) పుష్పమాలా కైంకర్యం చేయడం నిత్యకృత్యంగా ఉంది. ప్రతిరోజు చెంగలువ దండలను కట్టి, పూల సెజ్జలోపెట్టి అనుష్ఠానానంతరం గుడికిపోయి స్వామికి సమర్పించడం అతని దినచర్య. ఆ కట్టిపెట్టిన పూలదండలను గోదాదేవి తలదువ్వుకొని ఎడమ ప్రక్కకు ముడిచినముడి క్రింద అలంకరించుకొని, కోరిక తీరునట్లుగా బావి నీళ్ళలో తనరూపం చూసుకొని, పూలదండలను తిరిగి పూలసెజ్జలో పెట్టేది. ఆ ఆముక్తమాలలను తెలియక విష్ణుచిత్తుడు భగవంతుని అలంకరణకు సమర్పించేవాడు. భగవంతుడు వనమాలి. వాటిని ప్రీతితో స్వీకరించి ధరించేవాడు. తర్వాత కొంతకాలానికి గోదాదేవి శ్రీరంగనాథుని వివాహమాడింది. స్వామిలో లీనమైంది. ఈ కథను శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్త మాల్యద' ప్రబంధంగా రచించి వేంకటవిభునకు అంకితమిచ్చి ధన్యుడయినాడు.

ఈ విధంగా కృష్ణదేవరాయలు శ్రీకాకుళ ఆంధ్ర విష్ణువుయొక్క అభిలాషను నెరవేర్చినాడు. అంతేగాక రాయలు దక్షిణాపథ చక్రవర్తి. రాయల సామ్రాజ్యములో తమిళదేశము, గోదాదేవి జన్మస్థలం అయిన శ్రీ విలుబుత్తూరు ఉన్నది. శ్రీ విలిబుత్తూరులో గోదాదేవి (ఆండాళ్) ఆలయం ఉంది. అక్కడనుండి గోదాదేవికి అలంకరించి, తొలగించిన పూలమాలలను



తిరుమలకు తెప్పించి, శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవములలో ప్రధానమైన గరుడోత్సవంనాడు వేంకటేశ్వరస్వామికి అలంకరించి ఊరేగించునట్లు ఏర్పాటు చేసినాడు. ఇట్లు శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్ర విష్ణుదేవుని కోరికను ప్రియా పరిభుక్త భాక్కథను – యథార్థం చేసి నెరవేర్చినాడు. ఆనాటినుండి ఈ సంప్రదాయం–వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలలో గరుడసేవనాడు శ్రీవిలుబుత్తూరు నుండి వచ్చిన గోదాదేవికి అలంకరించి, తొలగించిన పూలమాలలను అలంకరించి ఉత్సవం జరపడం – అవిచ్ఛిన్నంగా నేటికిని తిరుమలలో జరుగుచున్నది.

ఈ యథార్థమైన కథవలన శ్రీకాకుళ ఆంధ్ర విష్ణుదేవుడే తిరుమల వేంకటేశ్వరుడని, ఆంధ్ర విష్ణువు అభిలాషను వేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవములలో గరుడసేవనాడు గోదాదేవి పంపిన ఆముక్తమాలను ధరించి నెరవేర్చుచున్నాడని స్పష్టమగుచున్నది. దీనికి కృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధము సాక్ష్యముగా ఉంది.

ప్రాచీనాంధ్రుల ఇలవేల్పు అయిన శ్రీకాకుళాంధ్ర విష్ణువు – తెలుగు వల్లభుడు – కలియుగములో వేంకటాచలమునకు అధిపతియై వేంకటేశ – వేంకటేశ్వర నామముతో పిలువబడుచు, ఆంధ్రులకు ఇష్టదైవమై వారి కోరికలను తీర్చుచున్నాడను విషయమును తెలుగు ప్రజలకు ఆముక్తమాల్యద ప్రబంధము ద్వార తెలియజేసినవాడు కృష్ణదేవరాయలే. తన ఇష్టదైవమైన వేంకటేశ్వరుని కృతిపతిగా జేసి ప్రౌఢ ప్రబంధమును రచించి, అంకితము చేసిన తెలుగు కవులలో కృష్ణదేవరాయలే మొదటివాడు. విష్ణుభక్తునిచే, వైష్ణవమత ప్రశస్తికై – విష్ణుభక్తుల కథలను ఇతివృత్తముగా గ్రహించి తెలుగున రచింపబడిన కావ్యములలో (ఆముక్తమాల్యద) విష్ణుచిత్తీయమే మొదటిది. ఇట్లు విష్ణుచిత్తీయము – ఆముక్తమాల్యద ఆంధ్ర వైష్ణవ సాహిత్యములో మొట్టమొదటి ప్రబంధము.

కావ్యారంభములో కృష్ణదేవరాయలు ఇట్లు వేంకటేశ్వరుని ప్రార్థించాడు.

**“శ్రీ కమనీయ హారమణిఁ జెన్నుగదాను, గౌస్తుభంబునం**
**దా కమలావధూటియు నుదారతఁ దోపఁ బరస్పరాత్మలం**
**దాకలితంబులైన తమ యాకృతు లచ్ఛతఁ బైకిఁదోప, న**
**స్తోకతనందుఁదోచెనన, శోభిలు వేంకటభర్త గొల్చెదన్ ॥**

**– ఆముక్తమాల్యద, 1-1**

లక్ష్మీ వేంకటేశ్వరులు ఒకరికొకరు ఎదురుగా కూర్చొని యున్నప్పుడు, లక్ష్మియొక్క ముత్యాలహారనాయకమణి యందు వేంకటేశ్వరుడు స్ఫుటముగా ప్రతిబింబించెను. అట్లే వేంకటేశ్వరుని హృదయమందలి కౌస్తుభమణి యందు లక్ష్మీదేవి చక్కగా ప్రతిబింబించినది. ఆ ప్రతిబింబించుట ఎట్లుండె ననగా – లక్ష్మీదేవి హృదయమందున్న వేంకటభర్త ఆ హృదయము స్వచ్ఛము కావున బయటికి కన్పించుచు, హృదయము వెలుపల ఉన్న హారనాయక మణియందు ప్రతిబింబించుచున్నాడు – కనిపించుచున్నాడు. అట్లే వేంకటపతి హృదయమందున్న లక్ష్మీదేవి స్వచ్ఛతచేత బయటికి కనిపించుచు, కౌస్తుభమణియందు ప్రతిబింబించుచున్నది – కనిపించుచున్నది. ఇట్లు లక్ష్మియుతుడైన వేంకటపతిని సకలమంగళ ప్రాప్త్యర్థము సేవించెదను.”

వేంకట శబ్దమునకు వేం= పాపం, కటతి= ఆ వృణోతి, హరతి ఇతి వేంకటః అని వ్యుత్పత్తి. పాపములను హరించునది అని ఆపదమునకు అర్థము. తిరుమలకు వేంకటము, వేంకటాద్రి అని పేరు. ఆ పర్వతమునకు అధిపతి కావున వేంకటభర్తయని విష్ణుదేవునికి పేరు.

**“వైకుంఠలోకాత్ గరుడేన విష్ణోః**
**క్రీడాచలో వేంకటనామధేయః।**
**ఆనీయ చ స్వర్ణముఖీసమీపే**
**సంస్థాపితో విష్ణునివాసహేతోః॥ – మార్కండేయపురాణం, 2-67**



వైకుంఠమున ఉన్న వేంకట మను పేరుగల విష్ణుదేవుని క్రీడాద్రిని గరుత్మంతుడు భూలోకమునకు తెచ్చి సువర్ణముఖినది సమీపమున విష్ణుదేవుని నివాసమునకై స్థాపించినాడు” అని మార్కండేయపురాణము పేర్కొన్నది.” “సర్వపాపాని వేంప్రాహుః కటః తద్దాహ ఉచ్యతే” – భవిష్యోత్తరపురాణం (1-220)– సమస్తపాపములకు వేం అనిపేరు. వాటిని దహించుటను కటశబ్దము తెలుపుచున్నది అని వేంకటశబ్దమును వివరించింది.

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద ప్రబంధములో ఎక్కడను వేంకటేశ్వర (వేంకట+ఈశ్వర) అను సమాసమును ప్రయోగించలేదు. ఈశ్వర శబ్దమునకు బదులుగా రాయలు వేంకటపదముతో భర్త, పతి, రమణ, రాయ, విభుడు వల్లభుడు అనుపదములనే ప్రయోగించినాడు. అంతటి అనన్య విష్ణుభక్తి నిష్ఠగలవాడు రాయలు. అయితే నిజజీవితంలో చక్రవర్తిగా శ్రీకృష్ణదేవరాయలు శ్రీకాళహస్తి, చిదంబరము మొదలగు శైవక్షేత్రముల అభివృద్ధికి దానములు చేశాడు. మతసామరస్యం పాటించాడు.

ఆముక్తమాల్యదలోని ఆశ్వాసాద్యంతములందున్న పద్యములలోని వర్ణనలు వేంకటేశ్వరస్తుతి సుందరములుగా ఉన్నవి. కొన్ని పద్యములలో భాగవత, విష్ణుపురాణములలోని వైష్ణవ గాథలు స్మరింపబడినవి. కొన్ని పద్యములలో వేంకటేశ్వరుని అనంత కల్యాణ గుణములు వర్ణించబడినవి. (2-99) “లీలా వార్ధుషికా” (2-99) అని విలాసార్థముగా వడ్డీవలన జీవించే వాడా! (వడ్డికాసులవాడా) అని వేంకటేశ్వరుని జీవనవిధానం వర్ణించబడింది. వేంకటేశ్వరుని ‘అకుంఠభక్తవరద’ (6-1) అనర్గళంగా భక్తులకు వరములు ఇచ్చేవాడా! అని వర్ణించాడు రాయలు. “సామిహర్యక్షునకున్” (1-46), ‘సింహాచల దంభకేసరి’ (4-289), ‘శేషనగహర్యక్షా’ (5-1) అని రాయలు వేంకటేశ్వరునికి నృసింహునకు అభేదము వర్ణించాడు. సింహముతో పోల్చినాడు.

తిరుమలలో ఉన్న స్వామిపుష్కరిణికి ఆ పేరు కుమారస్వామి మూలంగా వచ్చిందని కృష్ణదేవరాయలు వర్ణించారు. "గుహ పుష్కరిణి"– కుమారస్వామి యొక్క కోనేరు (1–48) "స్కందసరస్తటీ"–కుమారస్వామి (స్కంద)యొక్క కోనేటి తీరమున (7–72). వేంకటేశ్వరుని భక్త ప్రియత్వాన్ని "కృపా వీక్షాదృత బాహులేయ వేంకటరాయా" (3–1)– దయతోడి చూపులచే ఆదరింపబడిన కుమారస్వామి (బాహులేయ) కలవాడా. కుమారస్వామి విష్ణుభక్తుడని పురాణములు వర్ణించినవి. "హరార్భక దుర్భర పక్వతపః కుహనార్భక" (5–160) శివుని కుమారుడైన కుమారస్వామియొక్క దుర్భరమైన తపస్సుయొక్క ఫలమైన కపటబాలుడా! (కుమారస్వామి చేసిన తీవ్రమైన తపస్సునకు ఫలముగా శ్రీమన్నారాయణుడు బాలుడుగా జన్మించినాడు) అని వర్ణించాడు. రాయలు వేంకటేశ్వరస్వామిని "కృకవాకు ధ్వజ దీర్ఘికాప్లవ తపః క్రీడోత్సవాద్యుత్సుకా" (3–90) కుక్కుటము (కోడి) ధ్వజముగా గల కుమారస్వామి పుష్కరిణియందు తెప్ప (ప్లవ) ఉత్సవము అను వేసవి ఆటలయందు ఉత్సాహము గలవాడా! అని వర్ణించాడు. ఈ వర్ణనవలన కృష్ణదేవరాయల కాలములో (క్రీ.శ. 16 శతాబ్దం) వేంకటేశ్వరస్వామికి తెప్పోత్సవములు (ప్లవోత్సవములు) వేసవికాలములో (వైశాఖపూర్ణిమకు) జరుపబడేవి అని తెలియుచున్నది. ప్రస్తుతం శ్రీవారికి వేసవిలో తెప్పోత్సవములు – చల్లదనమునకై – జరుగుటలేదు. తిరుమలలో ఫాల్గుణపూర్ణిమకు ప్రస్తుతం తెప్పోత్సవములు జరుపబడుచున్నవి. సంప్రదాయము మారుటకు తిరుమలలో ఏర్పడు నీటి యెద్దడి కారణమై యుండును.

కృష్ణదేవరాయలు వేంకట విభుని ముఖ సౌందర్యాన్ని "అనూన జ్యోత్స్నాయిత స్మితోజ్జ్వలముఖ" (2–1) పండువెన్నెలవలె విస్తరించుచున్న చిరునవ్వుచే ప్రకాశించు ముఖము గలవాడా అని వర్ణించినాడు. ఆ నగుమోము కనలేని వారి జన్మవ్యర్థం! కృష్ణదేవరాయలు "బాలార్కాంశు విజృంభితామల శరత్పద్మాక్ష! (1–86) బాలసూర్యుని కిరణములచే వికసించిన స్వచ్ఛమైన శరత్కాలమందలి పద్మములవంటి నేత్రములు గలవాడా! అని వేంకటేశ్వరుని నేత్ర సౌందర్యమును వర్ణించినాడు. వేంకటేశ్వరుని దయా గుణమును, భక్తులయందున్న అత్యంతప్రీతిని వెల్లడిస్తూ రాయలు "కరధృతదరారి వితరణ, పరిపాలిత తొండమాన్నృపాలక" (4–287) చేతులలో ధరించబడిన శంఖచక్రములను దానము చేయుట వలన రక్షింపబడిన తొండమాన్ రాజు గలవాడా! అని వర్ణించినాడు. ఈ వృత్తాంతమును "తొండమాన్నృపతేర్దివ్యే శంఖచక్రే దదౌ హరిః" వేంకటేశ్వరుడు దివ్యమైన శంఖచక్రములను తొండమాన్‌రాజుకు ఇచ్చినట్లుగా భవిష్యోత్తరపురాణము (12–65) వర్ణించింది. శత్రురాజులను సంహరించుటకై వేంకటేశ్వరుడు తొండమాన్ రాజుకు శంఖచక్రములను ఇచ్చినట్లు "మాభైషీ పుత్ర భద్రంతే చక్రశంఖౌ దదామితే" (7–62) అని బ్రహ్మపురాణం వర్ణించింది.

రాయలు వేంకటేశ్వరుని "కాకోదర నగోదయస్థ పతంగా" (6–1) శేషాచల పర్వతమను ఉదయ పర్వతముపై ఉన్న సూర్యుడా! అని వర్ణించాడు. వేంకటేశ్వరస్వామి శేషాద్రిపై సూర్యబింబము వలె ఉన్నాడని వర్ణించుట అద్భుతమైన దర్శనం! రాయలు వెంకటపతిని ఎచ్చట వర్ణించినను లోహితాక్షునిగ వర్ణించినాడు. "దొడ్డకెందమ్మి కందోయివాని" (3–85) ఎఱ్ఱజీరలు గలకన్నులు మహాపురుషలక్షణమని సాముద్రిక శాస్త్రము చెప్పుచున్నది. రాయలు వేంకటాచలపతిని బ్రహ్మ, శివుడు సేవించినట్లు వర్ణించినాడు. "కపర్దభృదజ బింబితాచ్ఛ నఖపద ఘృణికిన్" (1–47) శివుడు, బ్రహ్మ తనపాదములకు నమస్కరించుటచే వేంకటపతివారి ప్రతిబింబములు గల కాలిగోళ్ళకాంతి గలవాడైనాడు. "నల ముఖాది చక్రవర్తినాథనవ సమర్పితాత్యలఘుమకుట ముఖ్యహార్యపాయనా" (6–69) నలుడు మొదలగు చక్రవర్తులు క్రొత్తగా సమర్పించిన, అమూల్యములైన, మనోహరములైన కిరీటము మొదలగు కానుకలు గలవాడా! అని వేంకటపతిని

రాయలు సంబోధించినాడు. రాయలు తనవలె వేంకటపతిని సేవించి, తరించిన నలుడు మొదలగు భాగవత చక్రవర్తులను స్మరించినాడు.

రాయలు దశావతారస్తోత్రములో శ్రీమన్నారాయణుని విభవావతార తత్వమును కీర్తించి, వైష్ణవ సంప్రదాయమును పాటించినాడు. రాయలు ప్రకృతి వర్ణనలలో సుందర సన్నివేశములను భగవంతుని స్వరూపములుగ వర్ణించినాడు. (4–105, 4–101, 4–144) ప్రకృతి సౌందర్యమంతయు సర్వాంతర్యామియగు శ్రీహరి సౌందర్యలక్షణమే యని రాయలు వర్ణించినాడు.

రాయలు స్వామిపుష్కరిణికి కుమారస్వామి సంబంధమును వర్ణించగా, వేంకటాచల మహాత్మ్య గ్రంథములోని వరాహపురాణములో–

**"స్వామిపుష్కరిణీ పుణ్యా సర్వపాప ప్రణాశినీ**
**వైకుంఠాద్భగవత్క్రీడావాపి శ్రీభూమిలాలితా**
**అప్రాకృత జలౌఘా చ సుగంధాసుమనోహరా**
**ఆనీతా వైనతేయేన క్రీడార్థం తత్ర తిష్ఠతి ॥ -35-16-18.**

స్వామిపుష్కరిణి పుణ్యప్రదము, సర్వపాపములను నశింపజేయునది. వైకుంఠమున విష్ణుభగవానునికి క్రీడాసరస్సుగా ఉండి శ్రీదేవి, భూదేవులచే ఉపయోగింపబడినది. అప్రాకృతమగు విస్తారమగు నీరు కలది. మంచి సువాసనగల నీరుకలది. మనోహరమైనది. గరుత్మంతునిచే వైకుంఠమునుండి తెచ్చి సువర్ణముఖి నది సమీపమున ప్రతిష్ఠింపబడిన క్రీడాద్రి వేంకట పర్వతముతో కూడ తీసికొనిరాబడి భగవంతుని క్రీడకై నిర్ణయింపబడినది" అని వర్ణింపబడింది. ఆ సరోవరమునకు స్వామి పుష్కరిణి యను పేరు సార్థకము. ఆ సరస్సు అన్ని తీర్థములకు స్వామినియగుటచే 'స్వామినీ చాసౌపుష్కరిణీచ' అను వ్యుత్పత్తిచే ఈ పేరు సార్థకము (వరాహ–38–41) ఈ సరస్సునందు స్నానము చేసినవారికి స్వామిత్వము లభించుటచేత ఈ



సరస్సు స్వామిపుష్కరిణి అయినది. "స్వామినం కరోతి పుష్కరిణీతి–స్వామి పుష్కరిణీ అని వ్యుత్పత్తిని (వరాహ 38–43) చెప్పవలెనని వరాహపురాణము దృఢపరచింది. కనుక స్వామి పుష్కరిణికి కుమారస్వామి సంబంధము చెప్పుట భ్రాంతి మూలకమని స్పష్టమగుచున్నది.

కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో విలుబుత్తూరును వర్ణించుచు

**"మలయపుగాలి రేలు వనమాలి విమాన పతాక ఘల్లుమం**
**చులియఁ బసిండి మువ్వగమి నొక్కొకమాటు గదల్ప, నుల్కి మి**
**న్నలము తదీయ హేమ వరణాంచల చంపక శాఖలందుఁ బ**
**క్షులు రొదసేయు" నని చెప్పినాడు. (1–74)**

–విలుబుత్తూరిలో రాత్రిపూట మలయమారుతం మన్నారుస్వామి ఆలయ ధ్వజస్తంభమును తాకి, దానికి వ్రేలాడుచున్న బంగారు మువ్వలను కదలించగా, అవి కలకలమని ధ్వనిస్తాయి. ఆ ధ్వనులకు దేవాలయం ప్రహరిగోడ వెంబడి పెరిగియున్న చంపక వృక్షముల (సంపంగిచెట్ల) కొమ్మలలో ఉన్న పక్షులు ఉలిక్కిపడి, లేచి సవ్వడి చేస్తాయి అని రాయలు వర్ణించినాడు. ఈ వర్ణనకు మూలము తిరుమల వేంకటేశుని దేవాలయమే. తిరుమలలో శ్రీవారి ఆలయంలో మహాద్వార గోపుర ప్రాకారానికి మధ్య ఉన్న ప్రదక్షిణ మార్గమును సంపంగె (సంపంగి) ప్రదక్షిణం అంటారు. ఈ ప్రదక్షిణ స్థలంలో పూర్వం స్వామివారి పూజకు ఉపయోగపడే చంపక వృక్షములు (సంపెంగిచెట్లు) ఉండేవి. అందువల్ల ఈ ప్రదక్షిణమార్గానికి చంపక ప్రదక్షిణమని, సంపెంగ ప్రదక్షిణమని పిలిచేవారు. తిరుమల దేవాలయంలో వెండి వాకిలి గోపురం ప్రాకారం చుట్టూ సంపెంగ చెట్లు ఉన్న స్థితిని రాయలు వర్ణించి, సంపంగి ప్రదక్షిణ మార్గమనుటను సార్థకం చేసినాడు, చారిత్రక సత్యాన్ని వెల్లడించాడు.

రాయలు శృంగారభూయిష్ఠమైన ప్రబంధములు రచింపబడుచున్న కాలమున విశిష్టాద్వైత ప్రతిపాదకమైన, భక్తిరస ప్రధానమైన భాగవతుల చరిత్రమును ప్రబంధముగా రచించినాడు. ప్రాచీనాంధ్ర కావ్యములలో నాయిక పేరుతో వెలసిన ప్రబంధము 'ఆముక్త మాల్యద' ఒక్కటే!

* * *

## 2. తత్త్వదీపిక - మారేపల్లి వేంకటయోగి

మారేపల్లి వేంకటయోగి (16 శతాబ్దం) తత్త్వదీపిక అను ద్విపదకావ్యమును రచించి అలమేలుమంగాసమేత వేంకటేశ్వరునకు అంకితమిచ్చాడు.

తత్త్వదీపిక వేదాంత గ్రంథము. అలమేలుమంగమ్మ ప్రార్థించగా వేంకటేశ్వరస్వామి బోధించిన వేదాంతమే ఈ కావ్యంలోని ఇతివృత్తము. ఇది అముద్రితము. దీని వ్రాత ప్రతి ఆంధ్రసాహిత్య పరిషత్తు, కాకినాడవారి గ్రంథాలయములో ఉంది.

తననుగూర్చి వేంకటకవి కావ్యాదిలో ఇట్లు చెప్పుకున్నాడు.

**"......వేంకటయోగి వరుఁడు**
**సారత వేంకటాచలపతి పేర**
**నారూఢు లెంచగా నంకితంబైన**
**ధీరత నీ తత్త్వ దీపికాబోధ."**

వేంకటకవి **" శ్రీ వేంకటేశరాజిత పాదరాజీవ**
**మానిత ధ్యాన మానసుండు"**

వేంకటయోగి తండ్రి వేంకటభట్టు. తల్లి నర్యాంబ. ఇతడు ముమ్మడి మల్లనయోగి శిష్యుడు. మల్లన ద్వారకానగరంలో రుక్మిణీదేవికోరగా శ్రీకృష్ణుడు అద్వైతమార్గం బోధించిన ఇతివృత్తముతో తత్త్వ చంద్రోదయం అను ద్విపద కావ్యాన్ని రచించాడు. మల్లన ఈ వేదాంత కావ్యాన్ని శ్రీరామునకు అంకితమిచ్చాడు.



## 3. సకల నీతి కథా నిధానము - కూచిరాజు ఎఱ్ఱన

తెలుగు సాహిత్యములో గల నీతి బోధకములగు కావ్యములలో సకలనీతి కథావిధానము ఒకటి. ఈ కావ్యకర్త కూచిరాజు ఎఱ్ఱన్న. ఇతడు కూచనామాత్యుని పుత్రుడు. ఎఱ్ఱన్నకు అష్టభాషాకవితా ప్రవీణ, నవఘంటా సురత్రాణ అను బిరుదములు గలవు. కూచిరాజు ఎఱ్ఱన క్రీ.శ.15 శతాబ్దం ఉత్తరార్థంలో జీవించాడు. ఈ సకల నీతి కథా నిధానము అయిదు ఆశ్వాసముల పద్యకావ్యము. ఇందులో 1662 గద్యపద్యాలు 150 కథలు ఉన్నాయి. ఈ నీతి కథలన్నీ నారదుడు బలి చక్రవర్తికి చెప్పినట్లు ఎఱ్ఱన్న ఒక కల్పన చేశాడు. ఈ నీతి కావ్యంలో బృహత్కథ, దశకుమారచరిత్ర, కాదంబరి మొదలగు ప్రసిద్ధకావ్యాలలోని కథలతోపాటు కలియుగంలోని రాజుల కథలు ఉన్నాయి. అను ప్రసక్తములుగా చిన్న చిన్న నీతికథలు, నీతి శ్లోకములకు అనువాదములు ఉన్నాయి.

కొండపల్లి దుర్గాధిపతి కుంటముక్కల పినభైరవ మంత్రి ప్రేరణమున కూచిరాజు ఎఱ్ఱన సకలనీతికథా నిధానమును రచించి శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చాడు. కృతిప్రోత్సాహకుడు పినభైరవమంత్రి ఎఱ్ఱనతో

**మాకిష్ట దైవమగు నా**
**శ్రీకాంతుఁడు వేంకటాద్రి శిఖరావాసుం**
**డాకృష్ణున కర్పణముగ**
**నీకవితా కథా నిధాన మిమ్ము సభక్తిన్॥** **1-22**

అని పలికినాడు.

సకల నీతికథా నిధానము కావ్యారంభమున కూచిరాజు ఎఱ్ఱన వేంకటేశ్వరుని ఇట్లు ప్రార్థించాడు.

**"శ్రీలలనాధినాథుఁ డతసీకుసుమాంచిత మూర్తి యష్టది**
**క్పాల కిరీట రత్నరుచిభాసి పదాబ్జుఁడు మిత్ర సర్వభూ**
**పాలునిఁ గుంటముక్ల పినభైరవ పాత్రుని నేలు సత్కృపా**
**లోలుఁడు వేంకటేశ్వరుఁడు లోకము లెప్పుడు బ్రోచుఁ గావుతన్.**

కూచిరాజు ఎర్రన కావ్యరచన ప్రారంభించినపుడు "నా మృదు కావ్యకన్య కధినాథుడు వేంకటభర్త యౌటకున్" (1-24) అని కృతిపతి వేంకటేశ్వరుడయినందులకు సంతోషించాడు. ఎర్రన్న వేంకటాద్రిని ఇట్లు ప్రశంసించాడు.

**ఆదికాలమున నారాయణాచల మను**
**నామంబు దాల్చె నే నగవరము**
**త్రేతాయుగంబున శ్వేతాచలంబను**
**ప్రఖ్యాతి గాంచె నే పర్వతంబు**
**ద్వాపరంబున శేష ధాత్రీ ధరంబను**
**పొగడిత గాంచె నే భూధరంబు**
**కలియుగ వేళ వేంకట శైలమనుపేరు**
**ధరియించె నే వసుధాధరంబు**

**దేశభాషల నేగిరి తిరుమలనఁగ**
**కోరికల నిచ్చుజనుల, కే కొండతేఁడు**
**గరుడనామంబు దాల్చె నే గిరులరాజు**
**తగదె ప్రస్తుతి సేయ నయ్యగకులేంద్రు.** **1-26**

ఈ పర్వతము యుగయుగమున వేరు వేరు పేర్లు గలిగియున్నది. వరాహపురాణము, ద్వితీయ భాగంలో

**కృతేఽ౦జనాద్రిం త్రేతాయాం నారాయణ గిరిం తథా**
**ద్వాపరే సింహ శైలం చ కలౌ శ్రీ వేంకటాచలమ్॥** **1-55**



కృతయుగమున అంజనాద్రి, త్రేతాయుగమున నారాయణాద్రి, ద్వాపరయుగమున సింహాద్రి కలియుగమున వేంకటాద్రి శ్రీమన్నారాయణుని నివాస పర్వతములుగా ప్రసిద్ధమైనవి అని వర్ణించింది. వామన పురాణము-

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయాం గరుడాచలమ్**
**ద్వాపరే శేషశైలం చ వేంకటాద్రిం కలౌయుగే ॥** **24-106**

కృతయుగమున వృషాద్రి అని, త్రేతాయుగమున గరుడాచలమని, ద్వాపరయుగమున శేషశైలమని కలియుగమున వేంకటాచలమని ఈ పర్వతం ప్రసిద్ధమైంది అని వర్ణించింది. భవిష్యోత్తరపురాణము.

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయాం అంజనాచలమ్**
**ద్వాపరే శేషశైలేతి కలౌ శ్రీ వేంకటాచలమ్ ॥** **1-36**

ఈ పర్వతమునకు కృతయుగమున వృషాద్రి, త్రేతాయుగమున అంజనాద్రి, ద్వాపరయుగమున శేషాద్రి, కలియుగమున వేంకటాద్రి అను నామములు యుగభేదములచే కల్గినవి అని వర్ణించింది.

కూచిరాజు ఎర్రన సకలనీతి కథా నిధానములో ఈ పర్వతమునకు కృతయుగమున నారాయణాచలము, త్రేతాయుగమున శ్వేతాచలము, ద్వాపరయుగమున శేషాచలము, కలియుగమున వేంకటాచలము అను పేర్లు గలిగినట్లు వర్ణించాడు. దేశభాషలలో ఈ పర్వతం తిరుమలగా పిలువబడు చున్నదని ప్రస్తుతించాడు. ఎర్రన వేంకటాద్రిని త్రేతాయుగములో శ్వేతాచల మని వ్యవహరించేవారు అని వర్ణించడం విశేషం. వేంకటాచల మాహాత్మ్యములో ద్వాదశపురాణములు ఈ విషయం చెప్పలేదు. ఇక వేంకటాచలాధీశ్వరుని ఇట్లు వర్ణించాడు.

**శరభశార్దూల కేసరి మృగంబుల వేట**
**లాడుచో చెంచులఁగూడి యాడు**
**వాసంత విభవోత్సవంబుల సతులతోఁ**
**దెప్పలఁ గోనేటఁ దేలియాడు**

**కలిత కన్యామాస కల్యాణ దర్శనా**
**మర్త్యమర్త్యులతోడ మాటలాడు**
**సతత సేవాసమాగత దేశికులు చూడ**
**తేరెక్కి పురవీథి దిరిగియాడు**
**కొలుచు వారికిఁ గొలువంగ దలపు గలిగి**
**వచ్చువారికిఁ గోరిన వరము లిచ్చి**
**యాదరంబున ముచ్చటలాడువాఁడు**
**నగును వేంకటశైల రమాధివరుఁడు** **1-28**

కూచిరాజు ఎఱ్రనార్యుడు వేంకటేశ్వరునకు వసంత ఋతువులో జరిగే ఉత్సవాలలో స్వామిపుష్కరిణిలో తెప్పోత్సవం జరిగేదని, కన్యామాసంలో జరిగే బ్రహ్మోత్సవాలలో కల్యాణోత్సవం జరిగేదని వర్ణించడం విశేషం. తీర్థములలో స్వామిపుష్కరిణిని, పాపవినాశనం, ఆకాశగంగా తీర్థములను వర్ణించాడు. తొండమాన్ చక్రవర్తి కథను 1-44 నుండి 1-55 వరకు గల పద్యగద్యములలో వర్ణించాడు ఎఱ్రన. తనకు ప్రత్యక్షంబైన శ్రీనివాసుని తొండమానుడు ఇట్లు స్తుతించాడు.

**నమో గదాబ్జ శంఖచక్రనవ్యబాహు పంకజా!**
**నమః కృపాకటాక్షలబ్ధి నాకరాజ్యవైభవా!**
**నమః సమస్తలోక పాలన ప్రశస్త మానసా!**
**నమో రమాధరాంగనాధినాథ! వేంకటేశ్వరా!** **1-50**

కూచిరాజు ఎఱ్రన వేంకట శబ్దమునకు ఇట్లు వ్యుత్పత్తిని చెప్పినాడు.

**కట మనంగ బాపకాష్ఠంబు వెంబన**
**దహన నామమయ్యె ద్రవిడభాషఁ**
**బాపకటము వెంబ భస్మంబు సేయుట**
**వెంకటాద్రియనఁగ వెలసెఁ బేరు.** **1-53**



ఎఱ్రన పాపమను కట్టెలకు కటమని పేరు. వేం అనగా దహించుట. పాపమలను దహించునట్టి పర్వతము వేంకటాద్రి అనబడుచున్నదని చెప్పినాడు. కాని ఈ వ్యుత్పత్తికి విరుద్ధముగా భవిష్యోత్తరపురాణము.

**సర్వపాపాని వేం ప్రాహుః కటః తద్దాహ ఉచ్యతే ।**
**తస్మాద్వేంకట శైలోఽయం లోకే విఖ్యాత కీర్తిమాన్ ॥** **1-220**

పాపములన్నింటికి 'వేం' అని పేరు. 'కటమనగా దహింపజేయునది. సమస్తపాపములను దహింపజేయు మహిమగల ఈ పర్వతమునకు వేంకటాద్రి అనుప్రసిద్ధి గలిగింది అని వివరించింది తరిగొండ వెంగమాంబ.

**విను వేమ్మను పాపేంధన**
**మును గట యుగళాక్షరాగ్ని ముఖ్యంబై కా**
**ల్చెను గావున, వేంకటగిరి**
**యను పేరా యద్రి కొప్పె నవనీనాథా!** **4-87**

పాపములనే కట్టెలకు 'వేం' అని పేరు. 'కట' మనగా అగ్నిచే దహించుట. సకల పాపములను దహించి వేసినది కావున ఈ పర్వతమునకు వేంకటగిరి అను నామము ప్రసిద్ధమైనదని వేంకటాచలమాహాత్మ్యములో వర్ణించింది. ఎఱ్రనార్యుడు ద్రావిడభాష ననుసరించి వేంకటపదమునకు వ్యుత్పత్తిని చెప్పగా పురాణకర్త, వెంగమాంబలు సంస్కృతమును అనుసరించి వేంకట శబ్దవ్యుత్పత్తిని చెప్పినారు. ఈ రెండు వ్యుత్పత్తులు పరస్పరం విరుద్ధముగా ఉండుట భాషావిశేషం.

ఈ కృతి ప్రేరకుడు కుంటముక్కల పిన భైరవుడు తిరుమలలోని పాపవినాశ తీర్థమున నొక గండశైలమును ప్రతిష్ఠించినట్లు కూచిరాజు ఎఱ్రనార్యుడు

**పాపవినాశనతీర్థ**
**వ్యాపార నిదర్శితాఘ వారణ లీలా**

**టోప ఘన గండశైల**
**స్థాపిత వేంకట గిరీంద్ర సదన స్థితికిన్॥** **1-31**

అని సకలనీతి కథానిధానములో చెప్పినాడు.

కూచిరాజు ఎఱ్రన సంస్కృతమున వైన్యదత్తుదు రచించిన కొక్కోమను రతి కళాశాస్త్రమును అనువదించాడు.

* * *

## 4. శ్రీకృష్ణ కర్ణామృతము - వెలగపూడి వెంగనార్యుడు

వెలగపూడి వెంగన (క్రీ.శ. 16వ శతాబ్దం) సంస్కృతములో లీలాశుకుడు రచించిన శ్రీకృష్ణకర్ణామృతమును తెనిగించి, తన యిష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చాడు. ఇందులో మూడు ఆశ్వాసములు ఉన్నాయి. ఈ గ్రంథముయొక్క కృత్యాది లభించలేదు. అంకిత పద్యము ఇట్లున్నది.

**ఈ మహనీయ మూర్తికి ద్రయీ గృహవర్తికి శేషభూధర**
**స్వామికిఁ దార్క్ష్యగామికి భుజంగమశాయికి నిష్టదాయికిన్**
**మామక వాఙ్మరందరసమాధురికిన్ మది సొంపు నింపు క**
**ర్ణామృత మాంధ్రవైఖరి సమర్పణ మేనొనరింతు వేడుకన్.**

వేంకటాచలపతికిన్ అను మకుటముతో మూడు షష్ఠ్యంత పద్యములు కలవు. వేంకటాహార్యగేహా, వేంకటాహార్యధామా, వేంకటాహార్యవాసా అను సంబోధనలతో మూడు ఆశ్వాసాంత పద్యములు గలవు. కావ్యాది పద్యము ఇట్లున్నది.

**హృద్యానవద్య కిన్నర**
**విద్యాధర వాద్యమాన వీణాధ్వృతికిన్**
**ఖద్యోత సమద్యుతి చ**
**క్రాద్యాయుధ తతికి వేంకటాచలపతికిన్.**



## 5. లక్ష్మీవిలాసము - రాయసం వెంకటపతి

పెనుగొండ రాజధానిగా తెలుగుదేశమును క్రీ.శ. 1574-1581 మధ్య పరిపాలించిన శ్రీరంగరాయల ఆస్థానకవి, కార్యదర్శి రాయసం వేంకటపతి. రాయసం అనగా కార్యదర్శిచేయు పని అని అర్థము. ఆ పనిని చేయువారు రాయసం వారైనారు. వేంకటపతి లక్ష్మీవిలాసము అను అయిదాశ్వాసముల ప్రబంధమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితము చేసినాడు. వేంకటపతి తను 'రసిక జన హృదయం గమ సంగీత సాహిత్య కళాధౌరం ధర్య' అని ఆశ్వాసాంత గద్యలో చెప్పుకున్నాడు.

రాయసం వేంకటపతి ఈ ప్రబంధమును రచింపబూని కృతిపతిని అన్వేషించుచుండగా శ్రీ వేంకటేశ్వరస్వామి అతనికి కలలో కనిపించి-

**"వరమతి నుదయించితి మ**
**ద్వరమున నటుగాన నీవు వర్ణించు కృతీ**
**శ్వరుడ నయి వరము లొసఁగెద**
**గరిమన్ లక్ష్మీవిలాస కథఁ జెప్పఁదగున్.** **1-14**

అని స్వామివారే వేంకటపతిని లక్ష్మీవిలాసమను కావ్యమును రచించుమని, దానిని తనకు అంకితమొసగుమని కోరినాడు. అందుకు వేంకటపతి సంతోషించి శ్రీ వేంకటేశ్వరాంకితముగా లక్ష్మీవిలాస ప్రబంధమును రచించినాడు.

వేంకటపతి వశిష్ఠ గోత్రుడు. అక్కయామాత్య పుత్రుడు. శ్రీనివాసమంత్రి, రామప్రధాని ఇతనికి సోదరులు. వేంకటపతి రచించిన లక్ష్మీవిలాసము వేంకటేశ్వరస్వామి స్వయముగా భక్తునికి స్వప్నములో కనిపించి, కృతి పతిత్వమును కోరిన కావ్యములలో మొట్టమొదటిది.

ఈ కావ్యంలో క్షీరసాగరమథనం, హాలాహలం, అమృతము లభించడం, విష్ణువు మోహినీ రూపంలో రాక్షసులను వంచించడం, లక్ష్మి ఆవిర్భావము,

సముద్రుడు లక్ష్మిని విష్ణువునకిచ్చి వివాహంచేయడం రసవత్తరంగా వర్ణించబడినాయి.

తను సేవించుజనాళికిన్ గరుణ నిద్ధాత్రిన్ మనోవాంఛ లె
ల్లను బూరింతు నటంచు లోకులకు నెల్లందెల్పఁ బ్రత్యక్షమై
జనసంఘంబుల నిందు రమ్మనుచు నోజం బిల్చునట్లా శ్రితా
వనహస్తాబ్జముఁ జూపు వేంకటనగస్వామిం బ్రశంసించెదన్.

శ్రీలన్ మించు రమా విలాసమతి మైత్రిన్ జిత్తకంజంబునన్
దాలేఖ్యాకృతి గాంచి చొక్కురుచి బాహ్యం బందె నా బేరెదన్
లాలిత్వంబులు చూపు సింధుజనవేల క్రీడలం దన్ను నా
లీలా బ్రహ్మము శేష శైలపతి బాళింబ్రోచు మమ్మెప్పుడున్.

భాస్వదుత్పల హీర ప్రకట దృగ్గరిమతో
  దృఢ తటిద్ఘన దేహదీప్తి తోడ
గురుజీవనగ్రహ కుండల రుచులతోఁ
  బటుసువర్ణ విచిత్ర పటముతోడ
విమలముక్తాహార వీక్ష్య మండనముతో
  శ్రీవరనామ సంసిద్ధి తోడఁ
దత సహస్రారాబ్జయుత కరక్రీడతో
  విపులాభరణ కళావృత్తి తోడ

నాత్మవిలసనమతి రూఢి నతిశయిల్లు
నిందిరాదేవి హృదయారవింద పీఠి
దిరముకొనఁ జొక్కు వేంకటాధిపుఁడు మమ్ముఁ
బూర్ణసకలేష్టదాయియై బ్రోచుఁగాత॥

ఈ లీల నెసగి విభవా
వాలంబగు వెంకటాద్రి వల్లభు కరుణన్



శ్రీలం జెల్వొందుచు ధర
నాలక్ష్మీ రమణు గుణము లభివర్ణింతున్.

చంగత్తుంగపతజ్ఝరీ తటనటచ్చక్రాంగ రంగద్గరు
ద్గాంగేయ ద్యుతి పుంజ రంజిత ధరీధాతు ప్రభామ్రేడితే
శృంగేపన్నగ రాణ్ణగస్య రమయా క్రీడంత ముద్వాంఛయా
శృంగారాంగద సంగతాంగ మనిశం శ్రీ వేంకటేశం భజే॥

వికచ పంకజ గళన్మకరందలీలఁ బూ
  ర్ణకటాక్షములఁ గృపారసము జెంద
మృదుల ప్రవాళ బింబిత సమద్యుతి వోలి
  యధరంబుపై మందహాస మమర
హృదయ నిర్యత్సంగ తేందు బింబ విభూతి
  సుభగ వక్షమునఁ గౌస్తుభ మెసంగఁ
దతకోకనద సమీకృత రథాంగ స్ఫూర్తి
  చరణాప్తరత్న హంసమ్ము లొలయ

సరస సంజాత సురనదీ ఝురి వికాస
పూరితాంగుష్ఠ నఖకాంతి ధార నిగుడ
శ్రీసమాహితమూర్తియై సిరులఁదనరు
వాని శ్రీ వేంకటాచలస్వామి దలతు.

శ్రీనయనోత్పల సితకర
దానవ నిగృహీత భూత ధాత్రీ పునరా
దానవల చరణ చరణా
బ్జానత మహి వలయ వేంకటాచలనిలయా.

శ్రీరమణీ రమణీయ వి
హారోచిత హారయుత భుజాంతర! పవనా

**హారిఫణా ఫణ వర్తన**
**హారి పదక్రమణ! వేంకటాచల రమణా!**

**శ్రీకర! రిపు భీకర! సుగు**
**ణాకర! వత్సాపహరణ హాహాంచిత మా**
**యాకలన చతురతర ర**
**త్నాకర వినివేశ? వేంకటాఖ్య గిరీశా!**

**శ్రీవనితా కుచకుంభ**
**ప్రావృత మృగనాభి సౌరభాసక్త మనో**
**భావుక! శుభదాయక! క్రీ**
**డావిపుల కటాక్ష! వేంకట నగాధ్యక్షా!**

ఈ విధంగా రాయసం వేంకటపతి వేంకటేశ్వరస్వామికి కవితా నీరాజనం సమర్పించాడు.

* * *

## 6. కనక రంజిత శిఖామణి పరిణయము

**- గూళికల్లు వేంకటరమణ కవి**

గూళికల్లు వేంకటరమణకవి (క్రీ.శ.16 శతాబ్దం). రమణకవి వేంకటేశ్వరస్వామి భక్తుడు. ఒకనాడు వేంకటేశ్వరస్వామి వెంకటరమణకవికి స్వప్నములో కనిపించి,

**నీ యిష్టదైవంబు నినుఁబ్రోచుచుండెను**
**శ్రీవేంకటేశుండు నీవెఱుంగు**
**మోవత్స! యిపుడు నీ భావంబు తెలిసి వ**
**చ్చితి గూళికల్వంశ శేఖరుఁడవు**



**వేంకటామాత్యుఁడై వెలయు మంత్రికి జిక్క**
**లేటి వంశజయౌ వధూటి రంగ**
**మాంబకు జనియించి మా పేరు గొన్నట్టి**
**వేంకటరమణ సత్కవివి మాకు**

**మునుపు హరివంశమంతయుఁ దెనుఁగు చేసి**
**యంకిత మొనర్చితివి విక్రమార్కచరిత**
**మిఁక ప్రబంధ మొనర్చి మాకిమ్ము సిరులు**
**శుభము లొసఁగెదమని పల్కి సుముఖుఁడగుచు॥ 2-431**

విక్రమార్కుని చరిత్రకు సంబంధించిన కథను కావ్యంగా రచించుమని ఆదేశించినాడు. స్వామివారి ఆదేశం ప్రకారం రమణకవి 'కనక రంజిత శిఖామణి పరిణయము' అను వాక్యమును రచించి వేంకటేశ్వరస్వామికి అంకిత మిచ్చినారు. ఇంతకు పూర్వము గూళికల్లు వేంకటరమణకవి హరివంశమును పూర్తిగా తెనిగించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినట్లు పై పద్యము వలన తెలియుచున్నది. ఈ హరివంశ కావ్యము అలభ్యము. కనకరంజిత శిఖామణి పరిణయము అముద్రితము.

వేంకటరమణకవి తండ్రి వేంకటామాత్యుడు. తల్లి రంగమాంబ. ఇతడు వేంకటేశ్వరస్వామి కావ్యవస్తువును నిర్దేశించగా కనకరంజిత శిఖామణి పరిణయమును రచించినాడు. ఇది ఆరు ఆశ్వాసముల ప్రబంధము. విక్రమార్కుని సోదరుడు భట్టి కనకరంజిత శిఖామణిని వివాహమాడిన కథ ఈ కావ్యంలోని ఇతివృత్తము. కావ్యం సంపూర్ణంగా లభించలేదు. రమణకవి సుమతీంద్రమునికి ప్రియశిష్యుడు. శ్రీ వేంకటేశ్వరస్తుతి పద్యములు కొన్ని కనకరంజిత శిఖామణి పరిణయకావ్యంలో కలవు.

* * *

## 7. రాజవాహన విజయము - కాకుమాని మూర్తికవి

**"అల్లసాని వాని యల్లిక జిగిబిగి**
**ముక్కు తిమ్మనార్యు ముద్దుపలుకు**
**పాండురంగవిభుని పదగుంభనంబును**
**కాకుమానిరాయ నీకె కలదు."**

అని ప్రశంసింపబడిన మహాకవి కాకుమాని మూర్తికవి 'రాజవాహనవిజయము' అను అయిదు ఆశ్వాసముల ప్రబంధమును రచించాడు. ఈ కావ్యరచన సాగుచున్నప్పుడు శ్రీ వేంకటేశ్వరస్వామి మూర్తికవి కలలో కనిపించి

**కృతిలో ప్రతిపద్యచమ**
**త్కృతి గలుగcగcబలుక నేర్చుకృతి నీవు మహా**
**కృతి మా కొసcగుము భాషా**
**కృతి భారవి కాకమాని శ్రీమూర్తికవీ!**

అని పలికి అదృశ్యమైనాడు. తర్వాత మూర్తికవి 'కొండమీది తిమ్మప్పనివంటి కావ్యపతి యబ్బుట జన్మసాఫల్యమని నిర్ణయించి రాజవాహన విజయమును శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. ఇది అముద్రితం. R.No. 273 & GOMS Library Chennai.

రాజవాహనుడు మగధ దేశమందలి కుసుమ పురమును పాలించు రాజహంసుని కుమారుడు. ఇతడు మనసార మహీపాలుని కుమారుడగు దర్పసారుని యుద్ధమున జయించి, మానసారుని కుమార్తెయగు అవంతిసుందరిని వివాహమాడుట ఈ కావ్యమందలి ఇతివృత్తము. దీనికి మూలము సంస్కృతమున దండిమహాకవి రచించిన దశకుమార చరిత్ర.

కాకుమానిమూర్తికవి (క్రీ.శ. 16 శతాబ్దము) తండ్రి రామలింగభట్టు. తల్లి తిమ్మాంబిక. స్వగ్రామము కాకుమాను. మూర్తికవి రాజవాహన విజయము, పాంచాలీ పరిణయము, బహుళాశ్వచరిత్రము అను మూడు కావ్యములను రచించినాడు.



కాకుమాని మూర్తికవి రాజవాహన విజయములో "శేషశైల వల్లభుని వంటి దాతదైవంబు గలడె" అని ప్రకటించినాడు. ఈ కావ్యానికి మూలమైన దండి రచించిన దశకుమారచరిత్రలో వేంకటేశ్వరస్వామి ప్రశంస లేదు. ఇది మూర్తికవి ఆంధ్రాభిమానాన్ని, వేంకటేశ్వరస్వామిపై గల అనన్యభక్తిని వెల్లడించుచున్నది.

కాకుమాను మూర్తికవి రాజవాహన విజయంలో వేంకటేశ్వరస్వామిని 'కొండమీది తిమ్మప్ప' అని, 'తోమని పళ్లేల దొర' అని పేర్కొన్నాడు. స్వామివారి శుక్రవారాభిషేక విశిష్టతను వర్ణించాడు. వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవ వైభవాన్ని రమణీయంగా వర్ణించాడు. స్వామివారికి తెప్పతిరునాళ్లు (ప్లవోత్సవం) వైశాఖమాసంలో జరుగుచున్నట్లు వర్ణించాడు. ప్రస్తుతం స్వామివారి తెప్పతిరునాళ్లు ఫాల్గుణ పూర్ణిమకు జరుగుచున్నది. స్వామిని సేవిస్తే "దొలుచుజన్మాంతరానంత దుష్కృతములు" అని మూర్తికవి భక్తులకు హామీ ఇచ్చాడు. మూర్తికవి చేసిన శ్రీ వేంకటేశ్వరస్తుతి పద్యములు కొన్ని.

**ఉ. శ్రీయధరోపరిం గుచగిరిం గబరిం దరహాసవీటికా**
**చ్ఛాయల యింపుసొంపులయి చందన కుంకుమపత్రరేఖలై**
**యాయతకుందచంపకములై తగcగన్గొను వేంకటేశ్వరుం**
**డా యిరుగంటిచూడ్కి భజనార్థితమమ్ము నదల్చుc గావుతన్.**

**సీ. ఇందిరామదిరాక్షి కీడాపు నీలంపు**
**మేడచుట్టు ప్రహరి గోడ యనcగc**
**దనచేతి కెల్లప్పుడును లోనుగా రమా**
**తరుణి వైచిన వలత్రా దనంగ**
**నలమేలుమంగ సయ్యాటంబునకు వైవc**
**దాల్చిన పొగడపూదండ యనcగ**
**మున్నీటి కన్నెయన్ పెన్నిధానంబు దూ**
**గుటకు వైచిన యట్టి గొొలు సనంగ**

గీ. భరితకౌస్తుభ దినమణిపరిధి యనఁగఁ
దనుఘనాశ్రిత మఘవకోదండ మనఁగ
వెంకటాధీశు నురముపై వినుతిఁగనిన
వైజయంతిక మాకిచ్చు వైభవములు.

సీ. తన తనూరుచిపైనిఁ దగ నుల్లసిలు గుల్ల
కావి నాఁగనకాంశుకంబు దనరఁ
గరముల శంఖచక్రంబులు భుజముల
వ్రాలిన హంసచక్రములఁ దెలుప
మును మ్రింగిన దవాగ్నినన వచ్చెనా నురోం
గణమునఁ గౌస్తుభమణి వెలుంగ
నలిక పత్రాంత్యద్వయ లిఖితశ్రీల క్రిం
దటి పూలన శ్రుతికుండలము లమరఁ

గీ. జల్లచూపుల కాంతామతల్లి నాదు
తల్లి యలమేలుమంగ కైదండఁ గొనుచుఁ
బన్నగనగాధ్యుఁ దేనింత కన్నుమోడ్పు
తతినిఁగలలోన నెదుటఁ బ్రత్యక్షమయ్యె.

సీ. ఏ దేవు కనుదోయి హిమధామసోదరీ
కుటికాకవాటంబు కుంచెకోల
యే దేవు చరణాబ్జ మిందిరాపుత్రికా
కాకోదరాంగద కూకుదంబు
ఏ దేవు చేకత్తి ఋభురాజపౌత్రుభా
మకుఁజల్లచేతుల మంత్రసాని
యే దేవు నాభి పూవిగురు జేజేబువ్వ
క్రొవ్వెదఁగలయయ్య కవ్వగాద



గీ. సేవకేదేవుఁడొందె నర్చావతార
మట్టి శ్రీవేంకటాచలాధ్యక్షునకును
బరమమూర్తికి మామకభవ్యకావ్య
కన్య కల్యాణ మొనరింతు గౌరవమున.

ఉ. ఈ క్షితిమున్న సత్కవులనేకులు హా! కవితాలతాంగులన్
లక్షలొసంగి యున్కియధునాతన కావ్యవధూటి వేంకటా
ధ్యక్షుఁడు పాటి సేయఁడుగదా! యన నేటికిఁ నెట్టి వానికిన్
బక్షము పిన్న భార్యపయిఁ బాయకయుండుట యెంత యెంతయున్.

అని కాకుమాని మూర్తికవి తనకంటె ముందు కవులనేకులు తమ కావ్య కన్యలను వేంకటేశునికి (అంకితము) ఇచ్చినారు. కనుక క్రొత్త కావ్యవధూటిని (రాజవాహన విజయమును) వేంకటేశుడు ఆదరించడని అనరాదు. ఎందుకనగా లోకంలో ఎవరికైనా చిన్నభార్యపై పక్షపాతము ఉండుట యథార్థము గదా! అన్నాడు.

కం. ప్రతిపద్య ప్రతి వాక్యో
న్నతి కావ్యము రాజవాహన విజయమట యీ
కృతికింబతి శేషాచల
పతియట యెందింత కంటె భాగ్యము గలదే?

కం. జటిధూర్జటి భరణ విశం
కట మతికిన్ ద్రుటిత జటిలకరటీశ్వర సం
కట గతికిన్ మా తిరు వేం
కట పతికిన్ దళిత దైత్యకంటక తతికిన్.

ఉ. చెప్పినపద్యమెల్లఁ జెవిఁజేర్చివిను న్వినదొంకు గల్గినం
దప్పులు గిప్పులెన్నఁడొకనాఁడును నాఁడును నేఁడు వేడుచో
నప్పన నెట్టిపో డఁడిగినన్ని వరాలిడుఁ గొండమీఁది తి
మ్మప్పని వంటి కావ్యపతి యబ్బుట యబ్బుర మిబ్బుధాళికిన్.

చ. పలికిన పల్కులెల్లఁ బరిపాకము దప్పఁగ ఖండ శర్కరల్
ఫలములు జున్ను లుక్కెరలు పక్వములింక మనోహరంబు లే
దలఁచిన పద్యమంతయు సుధారసమౌనఁట వేంకటాద్రి రా
ణ్నిలయుని కింకిటం గృతి ఘటింపక మానుట మాకు నేటికన్.

సీ. శ్రీఖండ నగ పటీరాఖండసౌరభ
  వ్రజదాయి యేగట్టువంటచెఱకు
నాసత్య సుఖనర్తనాసత్య భైషజ్య
  జీవాతు వేగట్టు చేదుచెట్టు
రమణీయతర శచీరమణీ రమణమణి
  కుట్టాక మేగట్టు చట్టుఱాయి
ధూర్జటి స్ఫుటిజటాంతర్జటీవాటి సిం
  ధుస్పర్థి యేగట్టు దొనలనీరు

గీ. వ్యాసవాల్మీకశాండిల్యవాలఖిల్య
దేశికుల కెల్ల మంత్రోపదేశకర్త
లరయ నే శైలమున నుంకు లవగఁ దనరు
నట్టివేంకటగిరికొనియాడఁ దగదె?

ఉ. సంకలితాంబతామరససానుగభీరకుమారధారికా
భ్రంకషనిష్కళంకఝురపాపవినాశనతీర్థసేవనా
ధ్యంకరణాత్మభూభువనయౌవతకల్పరసాల కేళిడో
లాంకటసద్విశంకటతరైలము వేంకటశైల మొప్పగున్.

సీ. ఏ చెట్టు చూచిన హితగంధచందనం
  బేరాలు గనుఁగొన్న నింద్రమణులె
యే జంతు వీక్షింప మృగనాభి మృగరాజ
  మేదొనఁగన్న గంగోదకంబె



యే తీర్థ మరసిన వృజినద్రుమకుఠార
  మే చఱియను గన హీరమయమె
యే మండపముఁజూడ హేమాచలోపమం
  బేబుషి దర్శింప భృగునిభుండె

గీ. భోగములకండ యలవేల్పు బువ్వదండ
పతితులకు బొండ పేదలపైఁడికుండ
తమము రేయెండ విభుదామృతంపుటుండ
కొండమాత్రంబె తిమ్మప్పఁ దుండుకొండ.

సీ. తన పైడిగోపురం బనుదినసేవార్థి
  గడికి సుమేరు శంకాప్రదంబు
తన బలిపీఠ మార్ద్రదుకూల పతితాంధ
  బధిరవంధ్యాపంగు పరివృతంబు
తన మహానసము నూతనఘృతాత్తాలంబ
  సౌరభ్యవాసి తాశావలయము
తన గర్భగృహము చందనచంద్రసాంకవ
  కుంకుమమృగనాభి పంకిలంబు

గీ. గాన నేదవళంబు వేంకట నగమున
వెలయఁగనుపట్టునట్టి కోవెల వసించు
దేవుఁ డలమేలుమంగా మనోవిభుండు
దొలఁచు జన్మాంతరానంత దుష్కృతములు.

క. అప్పప్ప చూడవలదా
యప్పని కోవెలపటీరహైమజలంబుల్
కప్పురము పునుఁగు మృగమద
మెప్పట్టున తావిగల్గు భృగుదివసమునన్.

సీ. జన్మజన్మార్జితచటుల పంకంబు గో
రాడఁడే వృషభాచలాగ్రవాసి
పక్షంబున దరిద్రభావాహి ద్రుంపఁడే
గరుడవసుంధరాధరవిహారి
యౌషధాసాధ్య వాతాదిరోగంబులఁ
దూలింపఁడే శేషశైలభర్త
భూతాది శంకానిరాతంక గహనంబు
హరియింపఁడే వేంకటాద్రినాథుఁ

గీ. డమృతనిధిఁ జూపఁడే యంజనాగవిభుఁడు
భద్రమూర్తి యమృతహారి భవ్యకీర్తి
చక్రి శుచినామధేయుండు జడమరీచి
కంకణముఁ గట్టినాఁడు రక్షణము కొఱకు.

సీ. అఱుగునోయనక కట్టాని యొంట్లడియెఁగాఁ
జేరెఁడు బియ్యాలజియ్య చెలియ
సమయనోయనక కాంచనశాటిఁగట్టెఁగాఁ
దోమని పళ్లేలదొర లతాంగి
ధనమెంత దఱుగునోయనఁ డింతవెచ్చమా
వడ్డికాసుల వెరవడికిఁగలికి
కానుకసొమ్ములోఁగలఁ డన్నిఁటశిఖలో
యామటామటుమ్రొక్కులయ్యయబల

గీ. యనుచు నగి మ్రొక్కుదురు వేంకటాధినాథు
నక్కడికి నల్లుహరిదమ యన్నుమగని
చక్రికుధరోత్తమమునడుచక్కి కెక్కి
చక్క ముక్కోటి కరుదెంచు సౌరసతులు



సీ. ప్రజలగాననివానిపాయసంబగు సుద్ది
తునుమవా దృష్టియంధునకు నిచ్చి
గొడ్రాలెఱుంగునే బిడ్డకుట్టనుట మా
న్పింపవా వంధ్యకు నిసువొసంగి
తూలింపవా యెద్దుఁద్రోచిన పిచ్చుగుం
టను పల్కుపరువు పంగునకు నొసఁగి
పాపవా చెవిఁటికిఁబట్టిన సంకను
నానుడి బధిరు వినంగఁ జేసి

గీ. యనుచుఁజను వేంకటాచలాధ్యక్షు జలరు
హాక్షు లక్ష్మీవిశుద్ధశుద్ధాంతవక్షు
బ్రహ్మోతిరునాళ్ల కరుదెంచి ఫలముఁగాంచి
కటక కళ్యాణ డిల్లా నికటజనంబు

సీ. ఎటువంటిదోచూడ మెట మంచిగంధంబు
జిడ్డంచుఁ గౌఁగిట జేర్చి చేర్చి
కనమెన్నఁ డిదిగదా యనుచుఁ గన్నులఁగది
యఁగ బారిజాతంబు నత్తియత్తి
తలఁపుకెం పిటువంటిదా యంచుఁదుఱుమునఁ
గొన జుట్టునను మేనఁగూర్చి కూర్చి
వినువాఁక యిదిగదా యనుచు నాకాశగం
గావారి నంగముల్ గడిగి కడిగి

గీ. శేషగిరిఁజేరి యారామసీమఁగోరి
శైత్యకృత్యంబు నిత్యంబు సల్పు వేంక
టేశ వైశాఖతీర్థనిరీక్ష కరుగు
దెంచు నాసేతు కాశితైర్థిక జనంబు

**సీ. కొడుకు మన్మథుఁ డాఁడుఁబడుచు భాగీరథి**
**యిల్లాలు భూకాంత యిల్లు కొండ**
**యన్న దా బలభద్రుఁ డగ్రసూనుఁడు బ్రహ్మ**
**కోడలు శారద కొలములోన**
**మఱఁది కల్వలతేఁడు మామ సముద్రుండు**
**మఱియును రెండవమామ భోజుఁ**
**దలరు పేరెదసొమ్మువెలలేని మాణిక్య**
**మచ్చబంగారు పై పచ్చడంబు**

**గీ. నన్న మెచ్చంబు ముక్కంటి కెన్న నరిది**
**జగము లీరేడు గర్భవాసమున నిముడు**
**సిరియొడయఁ డెంతసంసారి శేషశైల**
**వల్లభునివంటి దాత దైవంబు గలఁడె**

* * *

## 8. వాణీ విలాస వనమాలిక - టేకుమళ్ళ రంగశాయి

టేకుమళ్ళ రంగశాయి (17వ శతాబ్దం) వాణీవిలాస వనమాలిక అను నాలుగు ఆశ్వాసముల కావ్యమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితం చేసినాడు. ఈ కావ్యం సర్వవిషయం సంగ్రహముగా - విజ్ఞాన సర్వస్వముగా - ఉన్నది. కావ్యావతారికలో రంగశాయి తనకు వేంకటేశ్వరుడు కలలో కనిపించి కావ్యమును అంకితం చేయమని కోరినట్లు స్వప్నవృత్తాంతమును వర్ణించినాడు. రంగశాయి ఆశ్వాసాంత గద్యలలో "శ్రీ మదలమేలుమంగా వేంకటేశ్వర వరప్రసాదాశు కవి"ని అని చెప్పుకొన్నాడు. రంగశాయి వాణీవిలాస వనమాలిక, భాగవతము (ద్విపద), కృష్ణదండకము, తిరువళ్ళూరు వీరరాఘవ శతకము, జానకీ పరిణయము అను కావ్యములను రచించాడు. రంగశాయి, పుష్పగిరి తిమ్మన, కంకంటి పాపరాజులు సహాధ్యాయులు. వీరు రామభద్రయ్యగారి శిష్యులు.



వాణీవిలాస వనమాలిక వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, స్మృతులు, ఆయుర్వేదం, వాస్తుశాస్త్రం మొదలగువాటి సారాన్ని సేకరించి క్రోడీకరించి విజ్ఞాన సర్వస్వంవలె రచించబడింది. ఇందులో నాలుగు ఆశ్వాసాలు, 2574 గద్యపద్యాలు ఉన్నాయి. ఈ కావ్యం రంగశాయి శ్రీ వేంకటేశ్వరస్వామికి సమర్పించిన వనమాల. వనమాల లక్షణం ఇట్లున్నది-

**"ఆజానులంబినీ మాలా సర్వర్తు కుసుమోజ్జ్వలా**
**మధ్యస్థూల కదంబాఢ్యా వనమాలేతి కథ్యతే॥"**

వనమాల మెడనుండి మోకాలివరకు వ్రేలాడుతూ పొడవుగా ఉండాలి. ఈ మాలలో అన్ని ఋతువులలో లభించే పుష్పములు ఉండాలి. మాలమధ్యలో స్థూలంగా ఉండి గోపుచ్ఛాకారంలో (ఆవు తోకవలె) ఉండాలి. రంగశాయి తనసాహిత్య సేవ భగవత్ పర్యవసాయి యగుటకు సంకల్పించి వాణీ విలాసములనదగిన సమస్త విద్యాస్థానములను సంశోధించి, మనుష్య జీవితమునకు ప్రధాన ఆవశక్యములైన లౌకిక, పారలౌకిక విషయ సారాంశములను సేకరించి, క్రోడీకరించి వనమాలావిరచనమునకు పూనుకొన్నాడు. ఈ కావ్యంలో వనమాల లక్షణాలు ఉన్నాయి. రంగశాయి కలలో కనిపించిన వేంకటేశ్వరుడు "నీవు రచించే కృతి వాణీ విలాసమాలిక యన మధ్యనమాలి భాతి మెరయుచు నాకు అలంకారంగా ఉండాలి" అన్నాడు. (విష్ణువుకు వనమాలి అనుపేరు గలదు). అందుచే ఈ కావ్యం - వాణీవిలాసవవనమాలిక - వేంకటేశ్వరస్వామిపేర వాఙ్మయ రూపమగు వనమాలగా రచించబడింది. ఈ కావ్యంలో మహాకవి బమ్మెరపోతనవలె రంగశాయి కూడ కైవల్య సంసిద్ధిని కోరుచు వేంకటేశ్వరస్వామిని ఇట్లు ప్రార్థించాడు.

**శా. శ్రీవిశ్వంభర లాత్మపాదసదురస్సీమోరు పీఠంబులన్**
**ఠీవుల్ మీరఁగ శంఖచక్రముని వాణీనాథముఖ్యుల్ నతుల్**

గావింపన్ శుభదాధిక ప్రభలచేఁ గల్యాణ వద్వేంకట
గ్రావాధ్యక్షతఁ బొల్చువేల్పుఁగొలుతున్ గైవల్యసంసిద్ధికిన్.

సీ. వరనీలచికుర శైవాలజాలంబున
నిందితవదన పూర్ణేందు విభవ,
మతుల విశాలతరాక్షిమీనంబులు
కమనీయదంత ముక్తాఫలములు,
సులలిత దరహాస శుభ్రడిండీరంబు
మధురాధరామృత మహితసుధయ,
కలితత్రిరేఖా ప్రకాశిత గళధర
మామోద పృథులకుచాచలములు

తే. మానితోజ్జ్వల జంఘికామకరములను
లీలఁదళుకొత్తు పాదప్రవాళలతిక
లమరగాంభీర్య గతిజనకానురూప
మహిమ నుప్పొంగు నలమేలుమంగఁ గొలుతు.

చ. తనుభజియించు శేషునిలధారుణి భృథ్వరరూపమొందఁగా
ననిలునివాదుచే నొదవునట్టు లొనర్చి రమీసఖుండు శ్రీ
వనిత తపంబుమెచ్చి నుతవైఖరి వక్షమునం భరించె భ
క్తనికర సౌఖ్యదాయి యనఁగాఁదగు వెంకటనాథుఁ దయ్యెదన్.

సీ. అంజనాధర గరుడాహార్య వృషశైల
నారాయణాద్రి కనకశిఖరులు,
నీలాద్రి చింతామణిగిరి వైకుంఠాద్రి
వారాహ వృషశైల మేరుగిరులు
సింహాద్రితీర్థాద్రి శేషాద్రి పుష్కరా
చల వేంకటాద్రులు నెలమి శ్రీని



వాసాద్రి శ్రీశైల వాసుని జ్జలగుణ్య
కృతనామములు (గల్గు) కోట్లకొలఁది

తే. కడఁగి పాతకచయములు గ్రాఁచు కతన
నమృతమైశ్వర్యమైనొసగు నందువలన
వెంకటాచలనామంబు వెలసె మిగుల
నచటఁగల్గు ప్రధానతీర్థాళివినుఁడు.

ఆ. స్వామిపుష్కరిణియు స్కందధార దేవ
తీర్థ పాపహరణ తీర్థములను
దురితదూరమైన తుంబురుతీర్థమా
కాశగంగయనఁ బ్రకాశకములు

క. ఇవిమొదలుగ శుభతరవా
ర్యవిరళ సార్థత్రికోటి యగుతీర్థములన్
నవకాంచన తరుకుసుమో
ద్భవగరిమన్ మేరుసమతఁదద్గిరి యమరున్.

క. విరివియు నిడివియుఁ బొడవును
తిరమొప్పఁగ నేడు నెనబదియునాలుగు రెం
డురుతర యోజనములచే
నిరవొందున్ దత్ప్రభావ మెన్నఁగ వశమే!!

క. శ్రీవేంకటగిరి మహిమం
బావేలుపుఁ బెద్దయైన నభినుతిసేయన్
గావెరవెఱుంగఁడెంతయు
శ్రీ వైకుంఠంబె యదివి శేషఫలదమై!!

సీ. మున్ను శ్రీవైకుంఠమున కేగి నారదుం
డటనుండి క్రమ్మర నరుగుదెంచి,

తన కెదురైనట్టి మునికదంబముఁ జూచి,
వినుఁడు రమాసఖుం డనఘమూర్తి
దేవుఁడు వైకుంఠ దివ్యవిమానాధి
రూఢుఁడై విరజయె రుచిరసరసి
గతిఁదన్ను భజియింపఁగా శేషగిరిమీఁద
నున్నవాఁడని తెల్పవిన్నయట్టి

తే. సనక శుక వామదేవాది సంయమీంద్రు
లుత్సవంబున నటకేగి యుచితరీతి
నా జనార్దను భజియించిరట్టి విష్ణు
సేవ లిహపర సౌఖ్యశుభావహములు.

క. గంగాది దివ్యతీర్థము
లంగజహరముఖ్య దేవతావళితచ్చై
లాంగణమున వసియించు సు
సంగతి హరిపాదభజనఁ జరితార్థకమై!!

శా. క్షీరాంభోధి జనించి యంచిత తప శ్రీవేంకటాధీశ్వరున్
గారాబంబునఁ బెండ్లియాడుటకునై కల్యాణపద్మాకరో
దారాంచత్తట కుంజపుంజవిలసత్పాటీర వాటీకుటీ
వారాధారసు గంధబంధురతనువ్యాపారహేలాగతిన్.

క. వలనగు నలమేల్మంగన్
కలుముల చెలిఁ బెండ్లియాడి కంజదళాక్షుం
డలరుం జెలువగు సొబగున
నిలపై కల్యాణ వేంకటేశ్వరుఁడనఁగన్.

పంచ.
విరించి వాసవాది వంద్య వేదవేద్యభూవరా
చరాచర ప్రపంచ గర్భసర్వలోకసాదరా



కరారవిందకీలిత ప్రకాశకాండ సుందరా
పరాపరేశ వాసితాహి పర్వతాగ్రకందరా!

తోటకం.
జనకామిత కామితకారణకా
ననవారణ వాగవనాదరణా
అనపాయకృపాసునయాతినయా
వినతాజనతాధిపవెంకటపా!

తరల.
కలశసంభవ సత్తపోఫల కారణార్తి నివారణా
విలసితాననపద్మపద్మనివేశి నీప్సితపూరణా
బలరిపుస్తుత నిత్యసేవిత పన్నగామరచారణా
జలజలోచన వేంకటాచలసద్మసంస్థిరభారణా

మ. శరదంభోరుహపత్రనేత్ర కలుషాచారామరారీశవి
స్తరసైన్యాటవివీతిహోత్ర దివిషత్పాదామల జ్యేష్ఠ శం
కరయక్షోరగసిద్ధసాధ్యముని సంఘస్తోత్ర దారిద్ర్యశం
బరసుశ్యామలవర్ణగాత్ర యలమేల్మంగాకళత్రా! హరీ!

వాణీ విలాసవనమాలికలో ఏడుకొండల నామములు, అందున్న పుణ్యతీర్థముల వర్ణన గలదు. టేకుమళ్ళ రంగశాయి శ్రీ వేంకటేశ్వర, అలమేల్మంగా స్తుతులు, ఆశ్వాసాంతములందు వేంకటేశ్వరస్తుతులు భక్తితో చేశాడు. రంగశాయి 'విద్యానిబోధన సింధు' అని ప్రసిద్ధిగాంచినవాడు. ఈ కావ్యంలో బ్రహ్మస్వరూపము, లోకోద్భవ స్థితిలయగతులు, షోడశకర్మలు, స్త్రీ పుంసలక్షణములు విష్ణుకైంకర్య తద్భక్తి ఫలములు. వ్యవహార ధర్మకాండ, పారమార్థిక విషయములు తెలుపబడినవి.

చం. కృతమున బ్రహ్మనందనులు, త్రేత రఘూద్వహముఖ్యభూపతుల్
తతమతి బాండవాదులల ద్వాపర వేళలఁ బూజ సల్పఁగా

**హితమతిఁ దన్మనోరథము లిచ్చిన వేంకటభర్త యిప్పుడ**
**ట్లతులిత లీల నాశ్రిత జనాళికి నిచ్చు నభీష్ట సంపదల్॥**

అని రంగశాయి వేంకటేశ్వరుని ఆశ్రితవాత్సల్యాన్ని కీర్తించాడు.

**అంబురాశి తరగ లవని రేణువు లుడు**
**గణము లమిత వర్షకణములైన**
**నెన్నవచ్చుఁగాక యీ వేంకటేశ్వరు**
**భవ్య గుణములెన్న బ్రహ్మ వశమె?**

అని వేంకటేశ్వరుని కల్యాణగుణసంపదను పొగడినాడు.

**శ్రీమదలమేలుమంగా**
**రామా హృదయాంబుజాత రమ్య వికసన**
**ప్రేమాస్పదమిత్ర! వ్యా**
**యామక్షణ కరణ! వేంకటాచలరమణా!**

**శరచరకచ్ఛప కిటి నర**
**హరి వామన రామరామ హలధర బుద్ధో**
**ద్ధుర తురగ వరారోహక**
**హరహరి విధివినుతి పాత్ర! హరిహర నేత్రా!**

అని రంగశాయి దశావతారవర్ణన చేశాడు. వీటిలో కృష్ణావతార వర్ణన లేదు!

రంగశాయి తిరుమలకు వేంకటాద్రియని పేరు గలుగుటను "కడగి పాతకచయములుగ్రాచు కతన, అమృతమైశ్వర్యము నొసంగునందు వలన వేంకటాచలనామంబు వెలసె" నని చెప్పినాడు. ఈ నిర్వచనములు భవిష్యోత్తరపురాణం, 1-20, వరాహపురాణం, 36-31 శ్లోకములను అనుసరించి చెప్పబడినవి. టేకుమళ్ళ రంగశాయి వేంకటాచలమాహాత్మ్యం చదివినాడు.



టేకుమళ్ళ రంగశాయి వాణీవిలాసవనమాలికను రచించాలని సంకల్పించినప్పుడు వేంకటేశ్వరుడు అతనికి కలలో కనిపించి నాభక్తుడొకడు కావ్యరచనలో సాయపడతాడని చెప్పాడు. "అగణిత సుగుణుందును ప్రబంధ కల్పనా ధురంధరుందును నగు మద్దాసుఁడొకరుండు సహాయుండుగా" రచించిన కృతిని తనకు అంకితమిమ్మని చెప్పాడు. (వాణీవిలాసవనమాలిక, 1-17) ఈ కలసంగతిని రంగశాయి బంధువులకు చెప్పినపుడు వారు మహంకాళి వేంకటపతి సహాయం స్వీకరించుమని చెప్పి, అతనిని గురించి

**వరకవి బహుశ్రుతుఁడు శేషగిరి నివాస**
**భక్తుఁడు వివేకియు బహుప్రబంధకర్త**
**విశదమతి శ్రీమహంకాళి వేంకటపతి**
**చెలిమికాఁడౌటఁ దగు కార్యసిద్ధి నీకు. 1-28**

అని ప్రోత్సహించారు. రంగశాయి వేంకటపతి సహాయాన్ని స్వీకరించి, అతనికి కృతజ్ఞతలు ప్రతి ఆశ్వాసాంత గద్యలో చెప్పినాడు. రంగశాయి నిజాయితీ, కృతజ్ఞతా గుణము ప్రశంసనీయము గదా!

* * *

## 9. విష్ణుమాయావిలాసము - ఎఱ్ఱగుడిపాటి వేంకటకవి

ఎఱ్ఱగుడిపాటి వేంకటకవి (క్రీ.శ.17 శతాబ్దం విష్ణుమాయా విలాసము అను కావ్యమును రచించినాడు. ఉదయగిరి రాజ్యపాలకుడగు నరసింహరాజు కొమార్తె గౌరమాంబ తిరుమల వేంకటేశ్వరస్వామి అనన్య భక్తురాలు. ఈమె తండ్రివలన నెల్లూరు రాజ్యమునకు పాలకురాలై తిరుమలేశుని తీర్థప్రసాదములను అంచెలమీద ప్రతిదినము తెప్పించుకొని స్వీకరించేది. వేంకటేశ్వరస్వామి గౌరమాంబను పరీక్షింపదలంచి మహోత్పాతముతో ఆమె నివసించియున్న పట్టణములో వారము రోజులు కుంభవృష్టి కురిపించినాడు. ఆ ఏడు దినములు గౌరమాంబ ఉపవాసముండి, దీక్షతో వేంకటేశ్వరస్వామిని సేవించింది. అంత వేంకటేశ్వరుడు ఆమె అనన్యభక్తికి మెచ్చి సాక్షాత్కరించాడు.

ఆమె స్వామిని బిట్రగుంట వేంకటేశ్వరుడు అను పేరుతో తన పట్టణములోనే వెలయునట్లు ప్రార్థించింది. తిరుమల వేంకటేశ్వరస్వామి గౌరమాంబ ప్రార్థనను అంగీకరించి బిట్రగుంటలో వెలసినాడు. ఎర్రగుడిపాటి వేంకటకవి విష్ణుమాయా విలాసమును బిట్రగుంట వేంకటేశ్వరస్వామికి అంకిత మిచ్చినాడు. తిరుమల వేంకటేశ్వరునకు బిట్రగుంట వేంకటేశ్వరులకు అభేదము. కనుక విష్ణుమాయా విలాసము పరిశీలించబడింది.

వేంకటకవి వర్ణనలు అన్నియు తిరుమల వేంకటేశ్వరునివే! విష్ణుమాయా విలాసములో విష్ణుదేవుడు తన విలాసములచే బ్రహ్మ, శివ, నారదులను మోహింపజేసిన కథలు చమత్కారంగా వర్ణింపబడినవి. విష్ణుమాయ అనుల్లంఘనీయమని ఫలశ్రుతి.

ఆంధ్రసాహిత్యంలో విష్ణుదేవుమాయలను వర్ణిస్తూ, దేవతలలో విష్ణువొక్కడే సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడని బోధిస్తూ చింతలపూడి ఎల్లన-రాధామాధవ కవి-'విష్ణుమాయానాటకము' అను అయిదు ఆశ్వాసముల పద్యకావ్యాన్ని మొట్టమొదట రచించాడు. అందులోని కథను గ్రహించి కంకంటి పాపరాజు 'విష్ణుమాయా విలాసం' అను యక్షగానమును రచించాడు. కంకంటి పాపరాజు తమ్ముడు నరసింహరాజు 'విష్ణుమాయా విలాసము'ను ద్విపద కావ్యంగా రచించాడు. తర్వాత రోసనూరి వేంకటపతి విష్ణుమాయా విలాసము అను మూడు ఆశ్వాసముల పద్యకావ్యాన్ని రచించాడు. ఎర్రగుడిపాటి వేంకటకవి రచించిన విష్ణుమాయా విలాసము అను పద్యకావ్యంలోని వేంకటేశ్వరస్వామి వర్ణనలను పరిశీలించుదాము.

**ఉ. శ్రీయలమేలు మంగ నెదఁ జెన్నుగఁ దాల్చి మహానురక్తిచేఁ**
**బాయక భక్తలోకముఁ గృపారసవీక్షణ సంప్లుతాత్ములన్**
**జేయుచు బిట్రగుంట నివసించిన వేంకటభర్త నవ్య కా**
**వ్యాయత వాగ్విలాస మహిమాతిశయంబులఁ బ్రోచుఁగావుతన్.**



**సీ. ఇచ్చలో శ్రీవేంకటేశ్వర పాదార**
**వింద సందర్శనావేశ గరిమ**
**సతతంబు హరినామ సంస్మరణానంద**
**పరిపూర్ణమానస పరవశతయు**
**ననవరతంబు నారాయణ శుభకథా**
**కర్ణనోత్పాదిత కౌతుకంబు**
**నిరతంబు వైష్ణవ నియత సంతర్పణా**
**పరిమితోత్సాహ సంభరితహృదయ**

**తే. మలర నిత్యంబు వేంకటాచలమునందు**
**నుంచి తీర్థప్రసాదంబు లంచె లంచె**
**లాని కొనితేరఁ గైకొను టాత్మనియతి**
**గాఁగ గౌరమహాదేవి ఘనత మెఱసె.**

**సీ. బాల భాస్కరశత ప్రభగల మకుటంబు**
**నవరత్న మకరకుండల యుగంబు**
**ఖండేందునిభఫాల కస్తూరితిలకంబు**
**దరహాసకలిత సుందరముఖంబు**
**రంగైన యలమేలుమంగ యొప్పెడుతాళి**
**గ్రైవేయభాసుర కౌస్తుభంబు**
**కటి దాన శంఖచక్రముల హస్తంబులు**
**నతులితకాంతి పీతాంబరంబు**

**తే. చకిత నవరత్న మంజీర చరణయుగము**
**హార కేయూర మణి నూపురాది భూష**
**ణాంచితంబైన నీల నీలాంబురాగ**
**మలర నిల్చెను వేంకటాచలవిభుండు.**

తే. వేదములునాల్గు మూర్తీభవించి చేరి
సన్నుతింపంగ, వేల్పులు చదలఁ బుష్ప
వృష్టి కురియంగ సన్మునుల్ వినుతిసేయుఁ
దూర్ణముగ మింట దేవ దుందుభులు మ్రోయ.

వ. కని యద్భుతానంద కందళిత హృదయారవిందయై సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి, పులకాంకురిత శరీరిణియై, కరకమలంబులు ముకుళించి, యిట్లని స్తుతియించె.

సీ. అలమేలు మంగాంగనాత్మాంబుజానంద!
యబ్జాక్ష! శ్రీధర! హరి! ముకుంద!
కృష్ణ! దామోదర! కేశవ! గోవింద,
నుతపద్మజాది సన్మౌనిబృంద!
రాజీవలోచన! రక్షితముచికుంద!
సంతతకల్యాణ నందితపద!
విహగేంద్రవాహన! వేదలతాకంద!
యభయప్రదాన! హస్తారవింద!

తే. దేవదేవ! జగన్నాథ! దీనమంద
భాగ్యహరః పుత్రవత్సల భావనంద!
దశన నిర్జితశృంగార తరుణకుంద!
సతత నివసిత వేంకటశైలకంద!

సీ. పరమాత్మ! సర్వేశ! వరద! హృషీకేశ!
కరుణా రసాపాంగ! కలుషభంగ!
సద్భక్త మందార! సాధుజనాధార!
నిరుపమాలంకార! నిగమసార!



గోవర్ధనోద్ధార! గోపికాజనజార!
సర్వాంతరావాస! సద్విలాస!
స్మరకోటిలావణ్య! సర్వలోకశరణ్య!
నిఖిలమాయాతీత! నిరతపూత!

తే. తామరసపత్రనేత్ర! సంతతపవిత్ర!
భువన నిర్మాణసంకల్ప! భోగితల్ప
సర్వసుందర సుఖరూప! శార్ఙ్గచాప!
సరసదరహాస! వేంకటశైలవాస!

ఉ. కంటిని మత్తపఃఫలము, గంటిని ముంగిటి కామధేనువున్;
గంటిని మూలపెన్నిధిని, గంటిని గేళివనీ మరాళమున్;
గంటిని కొంగుమేల్పసిఁడిఁ; గంటిని తంగెటిజున్ను నిన్ను నే
గంటిని వేంకటాధిపతిఁ గన్నులపండువుగాను సమ్మతిన్.

మ. నినువర్ణింపగలేరు బ్రహ్మముఖరుల్ నే నెంతయున్ మానినిన్
ఘనకామాది నిషేధదుర్గుణ గణాక్రాంతన్ మదస్వాంతఁ, గాం
తను, నేనీకరుణాకటాక్షరస సద్ధారాళధారాభిషే
చనఁ బూతాత్మక నైతిఁ జాలదఁటె నిచ్చున్ గోర్కులింకేటికిన్.

కం. భవదీయపాద భజనో
త్సవ మింతియెకాని, వేరె సత్ఫల మొకటిన్
వివరింప మదినిఁదోచద
యవిరళమగు కరుణ నొసఁగుమయ్య ముకుందా!

సీ. అనవిని శ్రీ వేంకటాధీశుఁ డిట్లనె
మంచిది మగువ! నీమానసంబు;
నీభక్తి మెచ్చితి నీవుగోరినకోర్కె
కరుణనిచ్చితిని నిక్కంబు వినుము

నావచనముఁ గొన్నినాళ్లిటఁ బతిఁగూడి
బహుభోగభాగ్య సంపదలఁ బొదలి
యంతట నపవర్గ మందెడు నందాక
మద్భక్తి నతిలోక మాన్య వగుచు

తే॥ వర్తిలుము నిందుఁ గేశవమూర్తియందు
బూర్ణముగ నాదు నిర్ణయంబుగను నుందు
సంతతంబును దీర్థప్రసాదములను
గైకొనుచునుండు నాదుకైంకర్యనియతి.

మ. అని యిట్లానతియిచ్చి వేంకటవిభుం డక్కేశవస్వామి యం
దనుమోదంబున నావహించె భువనవ్యాపార పారీణతన్,
దనుదివ్యుల్ మనుజేశ్వరుల్ ముదముతోనన్ గొల్వఁ ద్రైలోక్యమో
హనలీలన్ దగి వేంకటేశుఁడును విఖ్యాతిన్ జగద్భర్తయై.

శా. పూర్వుండెల్ల మహాప్రపంచములకున్ బుట్టింప రక్షింపఁదా
సర్వంబున్ విలయింపఁగర్త యితఁడే సంకల్పమాత్రంబునన్
నిర్వాణ స్థితుఁడాద్యుఁడచ్యుతుఁడు వానింగాని దొడ్డుండునే
సర్వం విష్ణుమయం జగత్తనెడి శాస్త్రంబుల్ వినన్ గ్రొత్తలే

క. సకలమును విష్ణుమయమగు
సకలమయుండగును విష్ణుసర్వజ్ఞత వే
రొక వేల్పునందుఁ గలదే
ప్రకటింపఁగ సర్వలోకపాలురయందున్

విష్ణుమాయా విలాసమున ఆశ్వాసాంత గద్య ఇట్లున్నది–

"ఇది శ్రీమద్వేంకటేశ్వర వరలబ్ధ కవిత్వరచనా చమత్కార సుజన భజనాచార భారద్వాజ గోత్రపవిత్ర నరసనామాత్యపుత్ర సకల సుకవిజన సఖ్య వేంకటాఖ్య ప్రణీతంబైన విష్ణుమాయా విలాసంబను మహా ప్రబంధమునందు సర్వంబును పంచమాశ్వాసము."

* * *



## 10. శ్రీ వేంకటేశాంధ్రము (నిఘంటువు) – గణపవరపు వేంకటకవి

గణపవరపు వేంకటకవి (క్రీ.శ.1630–1720) 'సర్వలక్షణ శిరోమణి' అను ఆంధ్రనిఘంటువును రచించాడు. ఈ పద్యనిఘంటువు శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితమీయబడింది. అందుచే ఈ నిఘంటువు 'వేంకటేశాంధ్రము' అను పేరుతో ప్రసిద్ధమైంది. వేంకటకవి అమరకోశాన్ని అనుసరించి తన పద్యనిఘంటువును వర్ణములుగా విభజించినాడు. ఈ నిఘంటువును దేవతాప్రకరణం, మానవ ప్రశంస స్థావర నిర్ణయం, తిర్యగ్జాతి భేదం, నానార్థ వర్ణనిరూపణం అను విభాగములతో ఏకోల్లాసంగా వేంకటకవి రచించాడు. ఇరవైనాలుగు పుటల ఈ నిఘంటువులో 129 సీసపద్యములున్నాయి[1]. గణపవరపు వేంకటకవి ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము మొదలగు గ్రంథములను రచించినాడు. వేంకటకవి శ్రీవేంకటేశాంధ్ర నిఘంటువును–

**శ్రీభామా నర్మోక్తిక**
**ధాభవ నిజమందహాసధాగధగ శ్రీ**
**శోభాంచిత తత్కుచ కుం**
**భాభోగవిలాస! వేంకటాచలవాసా! –1**

1. శ్రీ వేంకటేశాంధ్రము – గణపవరపు వేంకటకవి, సుజన రంజనీ ముద్రాక్షరశాల, కాకినాడ, 1898. ఆ రోజులలో శ్రీ వేంకటేశాంధ్రమును వైష్ణవనిఘంటువుగ, కస్తూరి రంగకవి (క్రీ.శ. 19 శతాబ్దం) రచించిన 'సాంబ నిఘంటువు' అను సీసపద్య నిఘంటువును–శివునికి అంకితమీయబడిన కారణంగా శైవనిఘంటువుగ పలువురు పండితులు వ్యవహరించేవారు–అచ్చతెలుగు కృతులు– పరిశీలన – డా॥ కె.వి. సుందరాచార్యులు, 1989, P: 305. మద్రాసులోని సెయింట్ జార్జికోట కాలేజి బోర్డువారికి సి.పి. బ్రౌనుదొర (క్రీ.శ. 1798–1884) తన సంకలన గ్రంథాలనుండి 1828లో రు॥500–00లకు అమ్మజూపిన తెలుగు గ్రంథాలలో నిఘంటువులయిన (6) శివాంధ్రము రు॥ 28–00 (7) విష్ణుఆంధ్రము లేక వేంకటేశాంధ్రము రు॥ 21–00 ఉన్నాయి.

అని ఇష్టదైవమును ప్రార్థించి రచన మొదలుపెట్టినాడు. దేవవర్గులో వేంకటకవి–

**శ్రీకరంబుగను దేశీయముల్ తద్భవ**
**ములు తెనుగుపదములు గలయ జేర్చి**
**దైవత మానవ స్థావర తిర్యగా**
**ఖ్యల నాల్గు వర్గువులలరఁ గూర్చి**
**నానార్థవర్గువులో నూట యిరువది**
**యెనిమిది పద్యములనువు మీఱ**
**సీసములుగ వివరించి యాహ్వయముల**
**తుదలందు సంస్కృత పదము లునిచి**

**యమరసింహ సమానమై యమర సకల**
**కవులు బొగడంగ లోకోపకారముగను**
**క్షితిని నాంధ్ర నిఘంటుగాఁ జేసినాఁడ**
**నంకితంబుగ నీ పేర వేంకటేశ!** **–3**

అని తన నిఘంటువును శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. అచ్చతెనుగులో చేరిన దేశ్యతద్భవనామములను ఒకచోట కూర్చి, వాటిచివర సంస్కృత సమపదములను వివరిస్తానని, దానివలన లోకోపకారము కలుగుతుందని వేంకటకవి ఆశయంగా ఉంది.

గణపవరపు వేంకటకవి వేంకటేశాంధ్రములో మొదటి పద్యంలో వేంకటేశ్వరుని పేర్లను ఇట్లు చెప్పినాడు.

**పెరుమాళ్ళు నల్లదేవర కర్రి సంగాతి**
**వెడవిల్తు నయమచ్చు యెడదమేటి**
**యడుగు చెమ్మటలాడు గుడుసు వాల్నెరజోదు**
**బూరగొమ్ము తుపాకి పొట్టి వడుగు**



**పంటవలతి నంటుపాప పానుపు దంట**
**తరిగట్టు మోపరి గరుడి రౌతు**
**జిడ్డు సంద్రపుటల్లుడుద్దకేల్ దొరబిడ్డ**
**వేకంటి సైదోదు వెన్నదొంగ**

**తాత తండ్రి సిరిమగఁడు తమ్మికంటి**
**మొసలిదాయొంట్లదారి క్రొంబసవుడాలు**
**సాలు నాదాల్పు వెలదీవి పాలెగాఁడు**
**వెన్నుఁడన నీదు పేళ్ళు శ్రీ వేంకటేశ!**

తెలుగులో ఉన్న పద్య నిఘంటువులలో వేంకటేశ్వరాంధ్రము మొట్ట మొదటిది. దీనిని వేంకటకవి 'సర్వలక్షణ శిరోమణి' అను ఆంధ్రనిఘంటువు నందు అని గద్యలో పేర్కొన్నాడు. కాని వేంకటేశాంధ్రము గణపవరపు వేంకటకవి రచించిన 'సర్వలక్షణ శిరోమణి' అను లక్షణ గ్రంథములో ద్వితీయోల్లాసంగా ఉంది. ఇది ముద్రితమై (1898) ప్రచారంలో ఉన్న తెలుగు పద్య నిఘంటువు.

గణపవరపు వెంకటకవి తండ్రి అప్పయార్యుడు. తల్లి మంగమాంబ. ఇతని స్వగ్రామము గణపవరము. ఇతడు శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుడు. వేంకటకవి విశిష్టాద్వైత మత సంప్రదాయములందు అభినివేశము గలవాడు. సంస్కృతాంధ్రభాషలయందేగాక అష్టవిధ ప్రాకృత భాషలయందు (ప్రాకృతము, శౌరసేని, మాగధి, పైశాచి, చూళికా పైశాచి, అపభ్రంశము, అవంతీ, సార్వదేశీ (ప్రాచీ) గొప్ప పండితుడు. లాక్షణికుడు. వేంకటకవి ఈ నిఘంటువునే గాక 'ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసము' అను ఏకాశ్వాస లక్షణ గ్రంథమును రచించి వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. ఈ గ్రంథంలో వేంకటకవి "వేంకటనాథ వరప్రసాద ప్రసాదిత కవితా విలాసుడ" అని చెప్పుకొన్నాడు. ఈతని గురువు పెరుంబూరి రామానుజాచార్యులు. వెంకటకవి వాసిష్ఠగోత్రుడు. ఆశ్వలాయన సూత్రుడు.

**నిఘంటువు గద్య :** "ఇది శ్రీమత్పెరుంబూదూరి యతిరాజాచార్యవర్య కరుణా కటాక్ష సంప్రాప్తాంధ్రకవితా సామ్రాజ్యధురంధర నీతియుగంధర నందవరకుల కలశజలధి పూర్ణిమాచంద్ర సత్యహరిశ్చంద్ర వాసిష్ఠ గోత్రపవిత్రాశ్వలాయన సూత్ర కార్యఖడ్గప్రవీణ కామినీజన పంచబాణ కర్ణాటతుండీరపాండ్య మండలాధీశ ప్రముఖాఖిల మహీమండలాఖండల దత్త మత్త సింధుర సైంధవాందోళికాచిరత్న రత్నాంబరాది వస్తు ప్రశస్తమందిర నిరంతర వసంతేందిర సకల కలావిచక్షణ నిఖిలశుభలక్షణ లక్షణకవి వేంకట పత్యమాత్యవర విరచితంబును మంగమాంబా సమేత గణవరాప్పయ మంత్రిమణి విఖ్యాత మజ్జనక రూపాల్మేల్మంగాసనాథ తిరువేంగళ నాథాంకితంబును నగు వేంకటేశ్వర నిఘంటువు."

ఈ వేంకటేశాంధ్రమును అనుసరించి పైడిపాటి లక్ష్మణకవి 'ఆంధ్రనామ సంగ్రహము' అను నిఘంటువును రచించాడు.

* * *

## 11. మధురవాణీ విలాసము - చింతలపల్లి వీరరాఘవకవి

చింతలపల్లి వీరరాఘవకవి (17వ శతాబ్దం) వేంకటేశ్వర వర ప్రసాదలబ్ధ కవితాచాతురి గలవాడు. వీరరాఘవకవి 'మధురవాణీ విలాసము' అను అయిదు ఆశ్వాసముల ప్రబంధమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు.

మధురవాణీ విలాసములో వేంకటేశ్వరస్వామి సుదర్శనాంశమున (చక్రముయొక్క అంశమున) జన్మించిన కార్తవీర్యార్జునుని కథ వర్ణింపబడింది. ఇందు పాంచాలరాజు వర్ధమానపుర నివాసి అగు విక్రమశాలి కుమార్తె మధురవాణికి, హైహయరాజు మహిష్మతి పురనివాసి అగు కృతవీర్యుని కుమారుడు. కార్తవీర్యార్జునునికి జరిగిన వివాహమే ఇతివృత్తము. శ్రీ వేంకటేశ్వరస్వామి తనకు కలలో కనిపించి, క్లిష్ట కల్పనలు లేకుండ ఒక



ప్రబంధమును తనకు అంకితముగ రచింపుమని కోరినట్లు వీరరాఘవ కవి తెలిపినాడు. ఈ సంఘటనను తెలుసుకున్న బంధుమిత్రులు వీరరాఘవ కవిని ఇట్లు ప్రశంసించారు.

**సాహిత్యంబు గవిత్వమున్ వివిధ శాస్త్ర ప్రజ్ఞ సత్కర్మతా**
**సాహిత్యంబును, దత్త్వబోధమును ద్రిస్కంధాత్మక జ్యౌతిషం**
**బూహాచాతురి దేవభక్తియును నీకొప్పున్ స్వభావంబులై**
**యాహా! చింతలపల్లి రాఘవ కవీ! యాధ్యుండ వీ వన్నిటన్.**

**అవధానంబు లనేకముల్నెరపి రాజాస్థానముల్ చేరి వా**
**దవిధిన్ ధీరుఁడవై చతుర్విధ కవిత్వ ప్రౌఢిమల్ చూపి భూ**
**ధవ దత్త ద్విపఘోటకాది బహుసత్కారంబు కైకొన్న మి**
**న్నవు నీకబ్రమె వేంకటేశ్వరుఁడు స్వప్నంబుం బ్రసాదించుటల్.**

**జాములో శతకంబు సంధించి కంకణా**
**దులు గొంటి వలరాయ దుర్గమునను**
**బహుళావధానముల్ నెఱపి నాలుగు నగల్**
**తేజినందితి మల్లధీరు వల్ల**
**వాగ్ధాటి సంప్రీతి దిగ్ధరాధిప దత్త**
**వస్తువాహనముల వార్తగంటి**
**కూపవాపీతటాకోపవనుల్సేసి**
**స్థిరకీర్తిఁ జెందితి పురుతరముగ**
**సకల భూపాల సంస్థాన శంసనీయ**
**నిజచతుర్విధ కవితాభినేయ పొంది**
**తీ సమాధేకనాపూర్ణ దిక్ప్రదేశ**
**వీరరాఘవ! నీ సరి విప్రులేరి?**

ఈ పద్యములవలన వీరరాఘవకవి పాండిత్యము, నిరర్గళ కవితాధార గలవాడని తెలియుచున్నది.

మధురవాణి విలాసము కేవలము కల్పిత కథ దీనికి 'పిల్లవసుచరిత్ర' అను నామాంతరం గలదు. వసుచరిత్రలో ఉన్నట్లు సంగీత సాహిత్య సమ్మేళనము లేదుగాని ఈ కావ్యంలో శ్లేషానుకరణము, పద్యానుకరణము, శబ్దచమత్కారము, చిత్రగర్భబంధ కవిత్వములు విశేషంగా గలవు. కృత్యాదిలో వీరరాఘవకవి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఇట్లు ప్రార్థించినాడు.

**చ. శ్రీ కల్యాణి సురత్నభూషలు తనుం జేర్పందదాకారితా**
**నేక శ్రీల వరించు భ్రాంతికయిలన్నీగోరు భావంబు దా**
**నాకాంక్షించి నిరంతరాయముగఁ దత్ప్రాణేశ వక్షఃస్థలిన్**
**జేకోనౌ సలమేల్దొరన్ గొలిచెదన్ శ్రీవేంకటాద్రి ప్రభున్.**

**ఉ. లేమికి మేలుసంపద లలిన్ సిరికన్ననుమేలు ప్రాభవం**
**బామహిమాప్తికన్న భువనాధిపతిత్వము మేలు దా కనన్**
**సామిభజింప మే; ల్భజనసల్పగ మే; లలమేలునిచ్చిదా**
**నామహితాఖ్యుఁగొల్చు సతి కంజలి య య్యలమేలుమంగకున్.**

**క. శ్రీవేంకటేశ! నీలా**
**దేవీహృదయేశ! సకలదితి సుతయాద**
**స్థావర దాశపురోనలి**
**నావృత సురవేశ త్రిభువనైక నివేశా**

**క. భూమీ నీళావిభ్రమ**
**కామీ! బృందావనైక గామీ! క్రీడా**
**గోమీ! జీమూతనిభ**
**శ్యామీ! శివసామి వేంకటాద్రిస్వామీ!**



**మాలిని.**

**ముద్రమా పరిముద్రితాత్మసముద్రజా హృదయాధిపా!**
**భద్రదంతిప భద్రదానిరుపద్రవామృత దాయకా!**
**ఛిద్రవర్జిత ఛిద్రసాప్తరుచిద్రవైక మనోహరా!**
**నిద్రితాతివినిద్ర శేషఫణీంద్ర వద్దనుజాంతకా!**

**క॥ శంకరషణ్ముఖ పవిభృ**
**త్పంకజభవముఖ సమస్తబర్హిర్ముఖరా**
**ట్సంకల్పకల్పసాధన**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!**

**క. ఓంకారనిలయ మణిమయ**
**కంకణనవరత్నఖచితగ్రైవేయముఖా**
**లంకరణ గణవిభూషిత**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!!**

**క. అంకుశ కులిశ శరాసన**
**పంకజశరశంఖచక్ర పదచిహ్నితప**
**త్పంకజయుగళోజ్జ్వల శ్రీ**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!!**

**క. పంకయుత దనుజగజలస**
**దంకుశనిశితాస్త్రగణనిరంకుశ ఫణిప**
**ర్యంకపరేశపరాంకుశ**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!**

**క. హంకారహరణ! కరుణా**
**లంకార శుభప్రదానలక్షణ! శశ్వ**
**ల్లంకారివినుతపదయుగ!**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!**

క. **సంకర్షణాదిరూప వి**
**శంకటశృంగార విభవసర్వంకష దా**
**మాంకనిజభక్తపోషక!**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!**

క. **శంకరశరపన్నగహరి**
**ణాంకరథాంగాంగ శారదాభ్రాభ్రధునీ**
**ఝంకారకృద్యశస్తుత!**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!**

క. **పంకజశరజననీకుచ**
**కుంకుమముఖ గంధసారకోమలసంప**
**త్సంకలిత తతభుజాంతర!**
**వేంకటనాథాభిధాన! విశ్వనిదానా!**

అలమేల్మంగాంగనారత్నంబు మాధవుని స్తుతించుట

ఉ. **దండము పన్నగేంద్రవసుధాధరనాథ! గతాపరాధ, వే**
**దండకులేంద్రరక్షణవిధాననిదాన! కృపార్ణవేంద్ర!! నీ**
**దండను జేర్చి ప్రోవు జగదండనివాసవిలాస నన్నుఁ బూ**
**దండగ నేలుకో నవసుధామధురాధర! భార్గవీధరా!!**

వీరరాఘవకవి మధురవాణి నామధేయములో శబ్దచమత్కారము ఇట్లు ప్రకాశింపజేశాడు.

**"అనిన నరపతి పల్కునో యార్య నీదు**
**మధురవాణీ ప్రశంస సమ్మదము నిడియె**
**ననిన భావజ్ఞుఁడర్థమౌ నా మదీయ**
**మధురవాణీ ప్రశంస సమ్మదము నిడదె॥"** **-2-93**

నరపతి పలుకులోని మధురవాణి మధురవాక్కు. భావజ్ఞుని సమాధానము లోని మధురవాణి విక్రమశాలి కుమార్తె మధురవాణి. మధురవాణీ



విలాసములో మంత్ర, స్వప్న, శకున, సాముద్రిక, జ్యోతిష, రత్న ప్రభృతి శాస్త్రములలోని అంశములు చోటుచేసుకున్నవి. దీని వ్రాత ప్రతి మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో-డి. 372-ఉన్నది.

మధురవాణీ విలాసము నందలి గద్య ఇట్లున్నది-

**"ఇది శ్రీమద్వేంకటేశ్వర వరప్రసాద పాత్ర చరిత్రా**
**శ్వలాయన సూత్ర పవిత్ర వీరరాఘవ పౌత్ర**
**వేంకటార్యపుత్ర చిత్ర విచిత్ర కవితాభినీత**
**నానా విధావధాన లాఘవ శ్రీ చింతలపల్లి వీర**
**రాఘవ కవి ప్రణీతంబైన మధురవాణీ విలాసం**
**బను మహా ప్రబంధంబునందు పంచమాశ్వాసము."**

* * *

## 12. పరమభాగవత చరిత్ర - కట్టా వరదరాజు

కట్టా వరదరాజు (క్రీ.శ. 17 శతాబ్దం) 'పరమభాగవత చరిత్రము' అను ఎనిమిది ఆశ్వాసముల కావ్యమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చాడు. కట్టా వరదరాజు కరికాలచోళుని (5వ శతాబ్దం) వంశీయుడు. ఇతని తండ్రి రామరాజు. వరదరాజు సూర్యవంశ క్షత్రియుడు. కరికాలచోళుడు కావేరీనదికి ఆనకట్ట కట్టించుటచే ఆ వంశీయులకు 'కట్ట' గృహనామము అయింది. కట్టా వరదరాజు తాను 'సాహితీభోజుడ'నని చెప్పుకొన్నాడు. తన చాటుధార నిరాఘాటంగా సాగుతుందని, సరసచతుర్విధ కవిత్వాలు చెప్పగలనని, తనలో రచనా చమత్కారం ఉందని చాటుకొన్నాడు.

కట్టా వరదరాజు తొలిరచన 'పరమ భాగవతచరిత్ర' ఇది ఎనిమిది ఆశ్వాసముల కావ్యం. వరదరాజు ఈ కావ్యంలో 114 మంది పరమ భాగవతుల చరిత్ర వర్ణించాడు. మన సంప్రదాయం ప్రకారం పరమ భాగవతులు -

**"ప్రహ్లాద నారద పరాశర పుండరీక**
**వ్యాసాంబరీష శుక శౌనక భీష్మదాల్భ్యాన్,**
**రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీన్**
**పుణ్యానిమాన్ పరమభాగవతాన్ స్మరామి."**

1) ప్రహ్లాదుడు 2) నారదుడు 3) పరాశరుడు 4) పుండరీకుడు 5) వ్యాసుడు 6) అంబరీషుడు 7) శుకుడు 8) శౌనకుడు 9) భీష్ముడు 10) దాల్భ్యాయనుడు 11) రుక్మాంగదుడు 12) అర్జునుడు 13) వసిష్ఠుడు 14) విభీషణుడు. ఈ పరమభాగవతుల కథలను వరదరాజు సంగ్రహంగా రచించాడు. ఈ కావ్యం సంపూర్ణంగా లభించలేదు. రెండు ఆశ్వాసములు మాత్రమే లభించాయి. ఈ కావ్యం తాశపత్రప్రతి తంజావూరు సరస్వతీమహల్ గ్రంథాలయంలో (సంఖ్య: 188) ఉన్నది. జనమేజయునకు వైశంపాయనుడు పరమభాగవతుల చరిత్రను చెప్పినట్లు వరదరాజు రచించాడు.

**"నినుబోలన్ రచియింప నొక్కఘనుఁడేండే కంటిమే కా**
**జ్జననంబున్ సఫలంబు సేయుమన వైశంపాయనుం డిట్లనున్**
**వినిపింతున్ ఘనుఁడమ్మహారథుని సద్వృత్తంబు నానా సభా**
**జనసంభావన మిష్టకామితము లీజాలున్ విశేషించియున్."**

జనులచేత నానా సభలలో సంభావనమయ్యే పరమ భాగవతుల చరిత్రలో ఎనిమిదవ ఆశ్వాసంలో రుక్మాంగద చరిత్ర ఉంది.

పరమభాగవతుల చరిత్రను కట్టావరదరాజు తర్వాత గణపవరపు వేంకటకవి, ఆలూరి కుప్పన్న, శృంగార కవి తిరుమలనాథుడు అను ముగ్గురు కవులు రచించారు. దురదృష్టవశాత్తు వీరి కావ్యాలలోకూడ ఏ ఒక్కటీ లభించలేదు.



కావ్యప్రారంభమిట్లున్నది–

**శ్రీగంధ గంధిత సమ**
**స్తాగ శిఖా సంవృతాశి తాగ నిజగుణో**
**పాగమ వర పరిమళ శే**
**షాగమ నిలయ వేంకటాచలనిలయా!**

**గద్య:**

ఇది శ్రీ మదలమేల్మంగాసనాథ తిరువేంగళనాథ కరుణాకటాక్ష రక్షిత సకల సామ్రాజ్యవైభవ కట్టాహరిదాసరాజ తనూభవ సాహితీభోజ వరదరాజ ప్రణీతంబైన పరమభాగవత చరిత్రంబను మహాప్రబంధమున అష్టమాశ్వాసము.

* * *

## 13. శ్రీరంగ మాహాత్మ్యము – కట్టా వరదరాజు

కట్టా వరదరాజు పరమభాగవతుల చరిత్ర రచించిన తర్వాత ఇంకొక కావ్యం రచింపదలంచినప్పుడు వేంకటేశ్వరస్వామి కలలో కనబడి

**"మున్ను నా పేర నంకితంబుగ నొనర్చి**
**తవని బొగడొంద బరమభాగవత చరిత**
**మిపుడొనర్చు ప్రబంధమ్ము నిమ్ము నాకు**
**నంకితంబుగ నే వేంకటాధిపతిని.**

**నీకవిత విన్న వీనుల**
**కాకడ బెరకవుల కృతుల నరుచి జనించున్**
**మాకు మరి మరియు యుష్మ**
**చ్ఛ్రీకర వాక్యంబులందుఁ జిత్తము వొడమెన్.**

**కృతిసేయుము గారుడ సం**
**హిత హితమది మాకు గారుడేలాదరమూ**

**ర్జిత నిజధామంబగుటం**
**బ్రతిపత్తి విశేషమగుచుఁ బాటిలునందున్.**

**చేయరె తొల్లి సత్కవు లశేషపురాణములుం దెనుంగులో**
**నీయితిహాసమెందు రచియింపమి తావకపుణ్యమింతెయా**
**మ్నాయ చతుష్కసారము సనాతన గారుడ సంహితా శతా**
**ధ్యాయము తెనుంగుసేయ నొక దర్శు డె నేటి కవీంద్ర కోటిలోన్.**

అని ఆనతి ఇచ్చినాడు. వేంకటేశ్వరస్వామికి వరదరాజు కవిత్వం విన్నాక పెరకవుల కావ్యములందు అరుచి కలిగిందట! అందుకే వరదరాజును చూచి 'యుష్మత్ప్రీకర వాక్యంబులందు జిత్తము వొడమెన్' అని అన్నాడు. గారుడ సంహితలోని శతాధ్యాయమైన శ్రీరంగమాహాత్మ్యాన్ని తెనిగించమన్నాడు. కట్టా వరదరాజు వేంకటేశ్వరస్వామి ఆనతిని శిరసావహించి గరుడపురాణంలో నూరు అధ్యాయములలో ఉన్న శ్రీరంగమాహాత్మ్యాన్ని తెనిగించి శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చాడు. ఇది పది ఆశ్వాసముల పద్యకావ్యం. వరదరాజు తానే తొలిసారిగా శ్రీరంగమాహాత్మ్యాన్ని తెనిగించానని చాటుకొన్నాడు.

కాని వరదరాజుకు ముందు చెన్నమల్లు శ్రీగిరన్న, భైరవకవి అను కవులు ఇద్దరు పద్యకావ్యాలుగా శ్రీరంగ మాహాత్మ్యాన్ని రచించారు. ముకుంద యోగి ద్విపదకావ్యంగా రచించాడు.

కట్టా వరదరాజు తిరుమల వేంకటేశ్వరుని రంగనివాసునిగా ఇట్లు వర్ణించినాడు.

**పడగలు వేయుగల్గు నునుపానుపుపైఁ బవళించి పద్మపై**
**నడుగులు నిల్పియొక్క కరమల్లన సాచి కరంబొకండు పెం**
**పడర దలాడగా నునిచి యబ్జ విలాస విలోకనంబులన్**
**బొడము దయారస స్ఫురణఁ బోల్చిన రంగనివాసునీశ్వరున్॥**

* * *



## 14. రామాయణము (ద్విపదకావ్యం) - కట్టా వరదరాజు

కట్టా వరదరాజు పరమభాగవత చరిత్రను, శ్రీరంగమాహాత్మ్యమును రచించాక, యథావాల్మీకంగా ద్విపద ఛందములో రామాయణాన్ని రచించి, వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. ఈసారికూడ వేంకటేశ్వరస్వామి వరదరాజుకు కలలో కనబడి పాతకావ్యములను జ్ఞాపకం చేసి రామాయణ ద్విపద కావ్యాన్ని రచించుమని ఇట్లు ఆదేశించాడు.

**"సుఖనిద్రితుఁడనైనచోఁ బూర్వ పుణ్య**
**సఖమైన యొక సుఖస్వప్నంబు నందు**
**కలకల నవ్వు చక్కని నెమ్మొగంబు**
**యొక దివ్యమూర్తి నాయొద్దఁ జూపట్టి**
**నిను మెచ్చి వచ్చితి నీతలం పెఱిఁగి**
**ననుఁ దిరువెంగళనాథుగాఁ దెలియు**
**పద్యకావ్యము చేసి పరమభాగవత**
**హృద్యచరిత్రంబు నిచ్చితి మాకు**
**మంగళప్రదమ సామ్యము శతాధ్యాయి**
**రంగమాహాత్మ్యంబు రచియించినావు**
**మాపేర నిపుడు రామాయణద్విపద**
**యేపుమీఱఁగ రచియింపు మింపలర**
**ద్విపద కావింపుము తేటతెల్లముగ**
**నిపుణత శ్రీరాముని కథాక్రమంబు**
**వాలాయమిది యథా వాల్మీకముగను."**

ఈ కలసంగతి మరునాడు తనకొలువులో ఉన్నవారితో వరదరాజు చెప్పాడు. వాల్మీకి రామాయణముతో సంతోషించక వేంకటేశ్వరుడు వరదరాజును ద్విపదరామాయణాన్ని రచించమని ఎందుకు ఆదేశించినట్టు?

కట్టా వరదరాజు వారి ఆశ్రితులు ఇట్లు అభిప్రాయపడి, వారి అభిప్రాయాన్ని వరదరాజుకు ఇట్లు విన్నవించారు.

**"ఇనకులంబున వేంకటేశుండు మున్ను**
**జనియించి తన పుణ్యచారిత్రమెల్ల**
**బోయ కులంబునఁ బుట్టు వాల్మీకి**
**సేయ నందుఁ బ్రమోద చిత్తుండు గాక**
**అర్కవంశంబున నీవై జనించి**
**తార్కాణగాఁగ నేతత్కథా విధము**
**రచియింపు మనియె...... -బాలకాండ 151-157**

ఈ ద్విపద రామాయణాన్ని తేట తెలుగులో జల్లిమాటలు, అపశబ్దాలు మొదలగు దోషాలులేకుండా, లక్షణ సమ్మతముగా, రసభరితంగా కర్పూరం వెదజల్లినట్లు ధ్వనులు, వ్యంగ్యాలు, జాతి వార్తలు, ఉపమలు గుప్పిస్తూ వరదరాజు రచించాడు. వరదరాజు రామాయణం ఆరుకాండలు సంపూర్తిగా 23,570 ద్విపదలలో రచించాడు. ఈ రామాయణాన్ని తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయంవారు నాలుగు సంపుటాలుగా ప్రచురించారు. వరదరాజు రామాయణంలోని కొన్ని ద్విపదలను లేఖకులు రంగనాథ రామాయణంలో చేర్చి వ్రాసుకున్నారు.

వరదరాజు సుప్రసిద్ధమైన "కౌసల్యా సుప్రజారామ..." అను సుప్రభాత శ్లోకాన్ని ఇరవైనాలుగు ద్విపదలలో (బాలకాండ-2075-2101) రచించాడు.

ఆంధ్రసాహిత్యంలో ద్విపద రామాయణాలలో వరదరాజు రామాయణం ద్వితీయమైనా, యథావాల్మీకమై అద్వితీయంగా ఉంది. (రంగనాథ రామాయణం మొదటి ద్విపద రామాయణం)

* * *



## 15. శేషశైల విహారశతకం - పుష్పగిరి తిమ్మన

పుష్పగిరి తిమ్మన కవి శేషశైల విహార శతకమును రచించి శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చాడు. తిమ్మన అప్పనార్యునకు, జాబళాంబకును పుత్రుడు. తిమ్మన హనుమంతుని భక్తుడు. పుష్పగిరి తిమ్మన క్రీ.శ. 17వ శతాబ్దములో సాహిత్యపీఠముగా వర్ధిల్లి కంకంటి పాపరాజు (ఉత్తర రామాయణము) టేకుమళ్ళ రంగశాయి (వాణీవిలాసవనమాలిక) కంకంటి నరసింహరాజు (విష్ణుమాయా విలాసము) (ద్విపద) ప్రభృతులకు కావ్య రచనలో సహాయపడినాడు.

పుష్పగిరి తిమ్మన శేషశైల విహారశతకంలో హనుమంతుని వేంకటేశ్వరుని బంటుగా కీర్తించాడు.

**శాంతుని మతిమంతుని హను**
**మంతుని నీ బంటు నెంతు మన్నింపు దృఢ**
**స్వాంత తపశ్చింతిత పద**
**సంతత గంభీర! శేషశైల విహారా! (55)**

ఈ శతకంలో105 కందపద్యములున్నాయి. శేషశైలవిహారుడైన వేంకటేశునికి అంకితము. శేషశైలవిహార శతకము ఆత్మాశ్రయకవిత్వమునకు ఉదాహరణముగా ఉన్నది.

పుష్పగిరి తిమ్మన శేషశైలవిహార శతకమును వార్ధక్యంలో రచించాడు. ఈ శతకంలో 105 కందపద్యములు ఉన్నాయి. శేషశైల విహారా! అని మకుటము.

ఈ కంద పద్యములలో పూర్వార్ధమున స్వీయస్థితి వర్ణన, ఉత్తరార్ధములో దైవస్తుతి ఉన్నవి.

**శ్రీరాజిల నీరాజిల**
**ధీరాజి లసత్కటాక్షదృష్టి మనిచె ము**

**న్నారాముఁడ వీవే కద**
**సారనయాచార! శేషశైల విహారా!** – అను పద్యముతో శతకము ప్రారంభమైంది.

**రమ్మా! చే కొమ్మా కృతి,**
**యిమ్మా! మతిగోరు కోర్కులిఁక తడవేలా**
**నమ్మితి నిను సమ్యగ్విధి**
**సమ్మానిత ధీర! శేషశైల విహారా (72)** – అను పద్యములో అంకిత విషయము చెప్పబడింది.

**చలమేలన్నేలవె న**
**న్నలమేల్మంగాంగనా స్తనాలింగిత ని**
**స్తుల కౌస్తుభయుత వక్ష**
**స్థల గతకాశ్మీర! శేషశైల విహారా! (12)** – అని వేంకటేశ్వరుని వర్ణన.

**దిగవిడువక నను నీ యూ**
**డిగములలోఁ గూర్పుమిఁక దటిత్కోటి ధగ**
**ద్ధగితోజ్జ్వల హేమపట**
**స్థగితోరుకటీర! శేషశైల విహారా! (47)** – అని ప్రార్థన.

**మతకరి లోభి గులాముల**
**స్తుతినగు నఘమణఁగ, నిన్ను స్తుతియింతు నధీ**
**రతర పృథాసుత రక్షణ**
**చతుర వ్యాహార! శేషశైల విహారా! (79)** – అని స్వీయస్థితి. చివరకు పుష్పగిరి తిమ్మన

**నా తలపులు, నా యలపులు**
**నీతో వివరింప నేల, నీకే తెలియున్ (104)** – అని శేషశైలాధిపతిని ప్రపత్తి చేసినాడు.



## 16. రాఘవ యాదవ పాండవీయము

**– ఎలకూచి బాలసరస్వతి (వేంకటకృష్ణయ్య)**

ఎలకూచి బాలసరస్వతి రాఘవ యాదవ పాండవీయము అను త్ర్యర్థి కావ్యమును రచించి వేంకటేశ్వరస్వామికి అంకితం చేసినాడు. ఇందులో నాలుగు ఆశ్వాసములు గలవు. ఈ కావ్యము ప్రతి పద్యములో రామాయణ, భాగవత, భారతార్థములు వచ్చునట్లు త్ర్యర్థి కావ్యముగా రచింపబడింది. ఇట్టి కావ్యరచన కవి ప్రజ్ఞను వెల్లడించుననియు, తాను త్ర్యర్థికావ్యమును మిక్కిలి సమర్థతతో రచించినానని చెప్పుకొన్నాడు ఇట్లు :–

**ప్రజ్ఞకును సాక్షి యరయఁ గబ్బంబ కాన**
**నద్భుతంబైన నా ప్రజ్ఞ కనుగుణంబు**
**గా నితర దుష్కరంబైన కబ్బమెద్ది**
**సేయువాఁడనొ యంచు యోజించి మదిని.**

శా. **మెండైనట్టి విచిత్ర వైఖరులచే మీదౌ మహాకావ్యముల్**
**దండిం దొల్లియు చేసిరాదిములు తత్కావ్యాధిక శ్లాఘమై**
**నుండన్ రాఘవ కృష్ణ పాండవ కథా యుక్త ప్రబంధంబు వా**
**క్పాండిత్యం బలరార శ్లేషరచనైకప్రౌఢినేఁ జెసెదన్.**

అని ప్రతినపూని తన త్ర్యర్థికావ్యం "సరసులకు ప్రతిపద్యం విస్మయ మొసంగునట్లు రచించినాడు బాలసరస్వతి.

తెలుగు సాహిత్యంలో మొదటి కవి మహా మహోపాధ్యాయుడు ఎలకూచి బాలసరస్వతి. ఇతని అసలు పేరు. వేంకటకృష్ణయ్య. బాలసరస్వతి బిరుద నామము. బాలసరస్వతి కౌండిన్య గోత్రుడు. కృష్ణదేవుని కుమారుడు. రాఘవయాదవ పాండవీయం. అముద్రితం. సమగ్రప్రతి ఒకటి మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయములో (GOMS Library) ఉన్నది (D 687)

బాలసరస్వతి ఈ త్ర్యర్థి కావ్యాన్నేగాక ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్య, సుభాషిత రత్నావళి, కార్తికేయాభ్యుదయము, షడ్భాషావివరణము, చంద్రికాపరిణయము, వామన పురాణము, రంగ కౌముది, మున్నగు గ్రంథములను రచించినాడు.

రాఘవ యాదవ పాండవీయ కృత్యాది పద్యమిట్లున్నది.

శా. **శ్రీమద్వేంకట శైలమాళిగ శిఖాసీమన్ సుఖాసీనుఁడై**
**వ్యామోహ ప్రవికార సంభవ భవ వ్యాళాళిఁ బోదోలుచున్**
**భూమింగల్గు ప్రపన్న సస్యనికరంబుంబ్రోచి తత్సంభృతా**
**సామాన్యేష్టఫలౌఘుఁడై యలరు విశ్వక్షేత్రి గీర్తించెదన్.**

కం. **అంగజగురునకు మణిఖచి**
**తాంగ ధరునకున్ భవార్తి హరునకు నలమే**
**ల్మంగావరునకు సదయా**
**పాంగ ప్రవరునకు సర్వభావ పరునకున్.** అని షష్ఠ్యంతము.

**సుగంధి వృత్తం:**

**పంకజాక్ష మోక్షద ప్రపత్తి యోగ మందహా**
**సాంకురాభిశోభితాననాబ్జ యబ్జసంభవా**
**తంక కృత్పురాణ దైత్య దండ కైతవజ్ఞ శ్రీ**
**వేంకటాద్రధిత్యకా నివిష్ట శిష్టరక్షణా!** అని ఆశ్వాసాంత పద్యము గలదు.

* * *

## 17. జయ విజయాభ్యుదయము - రాజవోలు సుబ్బరాయకవి

రాజవోలు సుబ్బరాయకవి (క్రీ.శ. 17వ శతాబ్దం) జయ విజయాభ్యుదయము అను ప్రబంధమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితము చేసినాడు. ఈ కావ్యంలో ఆరు ఆశ్వాసములు ఉన్నాయి.



సుబ్బరాయకవి తన కావ్యమును నరులకు అంకితం చేయుటకు ఇష్టంలేనివాడై శ్రీ వేంకటేశ్వరునకు అంకితం చేసినట్లు చెప్పియున్నాడు.

**విమలమతిన్ మహాకృతులు వేడుకతో రచియించి మూఢభూ**
**రమణుల కిచ్చి వారు సుకరంబుగఁ బ్రోవకయున్నఁ గూటికై**
**శ్రమపడి చచ్చి దుర్గతి నజస్రసము బొందుటకన్నఁ బక్షిరా**
**డ్గమనునకున్ సమర్పణముగా నొనరించినఁ గల్గుసౌఖ్యముల్.**

జయ విజయాభ్యుదయము ఒక కల్పనాకథ. పింగళిసూరన రచించిన కళాపూర్ణోదయమువలె ఉండవలెనను ఉద్దేశముతో ఈ కావ్యమును రచించితినని ఇట్లు చెప్పినాడు.

**ఘనుడా పింగళి సూరపాఖ్యకవి లోకశ్రేష్ఠు డెంతో రహిన్**
**మును జెప్పెన్ విదితాంధ్రభాషను గళాపూర్ణోదయగ్రంథమున్**
**వనవీథిన్ గజబృందము ల్చనిన త్రోవం జాయలిచ్చారతిం**
**జను నేతద్గతి నే నొనర్తుఁ గృతి శేషాద్రీశు కారుణ్యతన్.**

సుబ్బరాయకవి కథాకల్పనము నందు పేర్లు పెట్టుటలో కళాపూర్ణోదయమును అనుకరించాడు. కాని కవితాచాతుర్యములో, ఇతివృత్త కల్పనలో జయ విజయాభ్యుదయము పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయమునకు సరిరాదు.

* * *

## 18. ఆనందకానన మాహాత్మ్యము - లింగమకుంట రామకవి

లింగమకుంట రామకవి (క్రీ.శ.16వశతాబ్దం) ఆనందకానన మాహాత్మ్యము అను స్థలపురాణమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితం చేసినాడు. ఆనందకాననము అంటే కాశీ క్షేత్రము. రామకవి వైష్ణవుడు కనుక కాశీని విష్ణుక్షేత్రంగా వర్ణించినాడు. స్కందపురాణములోని

కాశీఖండముకాక వాయుపురాణంలోని లక్ష్మీసంహితలో ఉన్న ఆనందకానన మాహాత్మ్యానికి ఇది అనువాదము. ఈ ఆనందకానన మాహాత్మ్యము అయిదు ఆశ్వాసముల కావ్యం.

లింగమకుంట రామకవి ఆనందకానన మాహాత్మ్యమును కలవకూరి కోనమంత్రి ప్రేరణచే రచించి వేంకటేశ్వరునకు అంకితమిచ్చినాడు. కోనమంత్రి రామయ్యతో ఇట్లన్నాడు. "నీవు పురాణంబులు తెలుంగు సేయ సమర్థుండవు. వాయుపురాణంబునందలి లక్ష్మీ సంహితోక్తానంద కానన మాహాత్మ్యం బాంధ్రభాషా విశేషంబున రచియించి వేంకటేశ్వర పూజాంకితంబు సేయుమని యానతిచ్చిన నియ్యకొని..."

రామకవి తెనాలి రామకృష్ణునికి అల్లుడు. కాశ్యపసగోత్రుడు. లక్ష్మయామాత్య తిరుమలాంబలల కుమారుడు. సులక్షణ సారమును రచించిన లింగమకుంట తిమ్మకవి అగ్రజుడు. లింగమకుంటరామకవి ఆనందకానన మాహాత్మ్యమునకు పూర్వము మత్స్యపురాణము, వామన పురాణము వేంకటమాహాత్మ్యము, చతుర్వాటికా మహత్త్వమును రచించినాడు. ఆనందకానన మాహాత్మ్యము అముద్రితము. దీని తాళపత్రప్రతి మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం (GOMS Library)లో ఉన్నది. (R 677) రామకవి భట్టరు చిక్కాచార్యుల శిష్యుడు.

లింగమకుంట రామకవి కృత్యారంభమున వేంకటేశ్వరుని ఇట్లు ప్రార్థించాడు.

**శ్రీలక్ష్మీభవనంబు వక్షము దయాశ్లిష్టంబు చిత్తంబులో**
**కాలోకోత్సవ తోరణంబులు సమస్తాంగంబు నీకే తగున్**
**శ్రీలీజాలు కటాక్ష వీక్షణములన్ చెల్వొందుచున్ సర్వమున్**
**బాలింపంగల వేంకటేశ్వరుఁడు మాపాలం బ్రసన్నుండగున్.**

అలమేలుమంగాదేవిని కవి ఇట్లు ప్రార్థించాడు.



**అలఘూదారుఁడు వేంకటేశ్వరుఁడు మర్త్యశ్రేణికిన్ సద్వరం**
**బుల నీగా నిజనాథవక్షము పయిన్ బొల్పొందుచున్ జూపులన్**
**కలుము ల్సేయుచు తాను నీ జగము వీకన్ బ్రోచుచున్నట్టియ**
**య్యలమేల్మంగ మ దీప్సితంబులు ముదాయత్తాత్మయై యీవుతన్.**

షష్ఠ్యంతపద్యము ఇట్లున్నది.

**అలమేల్మంగా నాయక**
**జలరుహభవ వినుత రుద్రసాయక, భక్తా**
**వలికామిత ఫలదాయక**
**కలసుస్వన సామవేదగాయక వరదా!**

ఆనందకానన మాహాత్మ్యము వ్రాతప్రతి సమగ్రము తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయ గ్రంథాలయములో భద్రముగా ఉన్నది. (R 1049)

* * *

## 19. ద్రౌపదీ కల్యాణము - బోయనపల్లి కుమార వేంకటరాయలు

బోయనపల్లి కుమార వేంకటరాయలు "ద్రౌపదీ కల్యాణము"ను రచించి వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. అముద్రితము. కుమార వేంకటరాయలు పానగల్లు దుర్గాధిపతి. కాలము క్రీ.శ. 17వ శతాబ్ది మధ్యభాగము.

ద్రౌపదీ కల్యాణము అయిదు ఆశ్వాసముల పద్య ప్రబంధము. కృత్యాది వేంకటేశ్వరస్తుతి ఇట్లున్నది–

**"శ్రీవత్సాంకము భూమిభామయును దృష్టిం జేష్టలందత్సమీ**
**క్షావృత్తిన్ దన దివ్యకౌస్తుభమణీచ్ఛాయ న్నిరోధించి లీ**
**లా వైముఖ్యము దోపకుండ నలమేల్మంగం బరీరంభ సౌ**
**ఖ్యావిర్భూతి నలర్చు వెంకట నగాధ్యక్షుండు మమ్మేలుతన్.**

బోయన పల్లి కుమార వేంకటరాయలు పద్మనాయక ప్రభువు. ఈతని తల్లిరామాంబ. తండ్రి వేంకటరాయలు. కుమార వేంకటరాయల గురువు సముద్రాల వేంకటాచార్యుని కుమారుడు కోనపాచార్యుడు. కుమార వేంకటరాయలు ఒక శరన్నవరాత్రి ఉత్సవములందు దుర్గా, సరస్వతీ, లక్ష్మీ పూజలు చేసి, హరికథాగోష్ఠినుండి తాను రచింపదలంచిన కావ్యమునకు కృతినాయకు డెవరాయని ఆలోచించుచుండ ఆ రాత్రి నాల్గవ జామున "కలుము లీనెడు కేలుగల నలమేలుమంగ ముంగలను బెనయగా వేంకటేశ్వరుడు కలలో కనిపించి, తనకు అంకితముగా కావ్యరచన చేయుమని కోరినాడు".

కవి తన స్వప్న వృత్తాంతమును సాహిత్యగురువైన బోరవెల్లి నారసింహ కవికి చెప్పినాడు. అతడు సంతోషముతో కుమార వెంకటరాయల సాహితీ వైభవమును కీర్తించి కృతిరచనమునకు ప్రోత్సహించినాడు. వేంకటరాయలు ద్రౌపదీకల్యాణ కావ్య అవతారికలో వేంకటేశ్వరస్వామిని స్తోత్రము చేసినాడు. ప్రథమాశ్వాసాంత గద్య ఇట్లున్నది–

"ఇది శ్రీమద్వేంకటేశ్వర ప్రసాదోపలక్షిత లక్ష్మీకళావిరాజమాన సకల సుకవిజన జేగీయమాన పెన్పాలగోత్ర పవిత్రబోయనపల్లి కలశ పారావార కైరవమిత్ర రామమాంబా గర్భనిర్భర శుక్తి ముక్తావతార యనవద్య విద్యా విశంకట వేంకటరాయకుమార గండభేరుండ బిరుదాభిధేయ కుమార వెంకటరాయ ప్రణీతంబైన ద్రౌపదీ కల్యాణంబను మహాప్రబంధమునందు ప్రథమాశ్వాసము."

పంచమాశ్వాసాంతమున గల ఒక పద్యము–

**"అతులంబై యకలంకమై ప్రభుసమాజా కర్ణ్యమై వర్ణ్యమై**
**యతి పాపావహమై శుభావహమునై యాచంద్ర తారర్కసు**
**స్థితమై యుండెడుఁగాక వెంకటనగాధిస్వామి యుష్మద్గుణాం**
**కిత మేతత్కృతి యీ క్షితిన్ కవిజనాంగీకార సారోన్నతిన్."**



# 20. సకలజీవ సంజీవనము (శ్రీరామానుజాచార్యులచరిత్ర)

**– సాయపనేని వెంకటాద్రినాయకుడు**

సాయపనేని వెంకటాద్రినాయకుడు (క్రీ.శ. 17వ శతాబ్దం) రాయలసీమ లోని దూపాటిసీమను పాలించినాడు. ఈ రాజకవి గొప్ప భక్తుడు. "సకలజీవ సంజీవనము" అను అయిదు ఆశ్వాసముల వైష్ణవ ప్రబంధమును రచించి, తిరుమల వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. వేంకటాద్రినాయకుడు విశిష్టాద్వైత మతప్రవక్త అయిన భగవద్రామానుజాచార్యుల (క్రీ.శ. 1017–1137) దివ్యజీవిత చరిత్రను సకలజీవసంజీవన మను పేరుతో రచించినాడు.

ఈ ప్రబంధ రచనలో వెంకటాద్రినాయకునకు రఘుపతి అనే పండితకవి సహాయపడినాడు (1–74). గురువు ఆజ్ఞను ఉల్లంఘించి, అష్టాక్షరీ మంత్రాన్ని జాతి కులభేదములను పాటించక లోకులందరికి చాటి చెప్పిన శ్రీమద్రామానుజాచార్యుల జీవిత చరిత్రకు వేంకటాద్రి నాయకుడు 'సకలజీవ సంజీవనము' అని పేరుపెట్టడం సార్థకంగా, సముచితంగా ఉంది.

వేంకటాద్రినాయకుడు సనాతన మతాచార్యులలో అత్యంత దయాంతః కరణుడు, మానవతావాది, సమతావాది అయిన రామానుజాచార్యుల జీవిత చరిత్రమును ఆంధ్రప్రబంధముగా రచింపబూనియున్న సమయమున ఒకనాడు కలలో–

**"నిండు చందురు నేలు నెమ్మోము జిగివాఁడు**
**నవరత్న మకుట గౌరవమువాఁడు**
**విరిదమ్ముల హసించు వెడఁద కన్నులవాఁడు**
**మొసలిబాగుల పోగు లెసఁగువాఁడు**
**తళుకుచుట్టలగు చిందముల కేల్గవవాఁడు**
**సిరి చెల్వు మీరు పేరురమువాఁడు**
**హరినీలముల గేరు తిరుమేని రహివాఁడు**
**జాళువా జిలుఁగు పచ్చడమువాఁడు**

**శుభవిభాదీప్యమాన కౌస్తుభమువాఁడు**
**మంజు మంజీర పాదపద్మములవాఁడు**
**వేంకటగిరీంద్రమున నుండు వేల్పుఱేఁడు**
**పలికెఁ దనసేవ కృపసేసి లలిత ఫణితి. -1-10**

**"నీవు రచియింపఁ దలఁచిన యీ యతీంద్ర**
**చరిత భరితాంధ్రకృతి ప్రస్ఫురిత భక్తి**
**నంకిత మొనర్పు నాపేర బ్రౌఢిమీర. -1-13**

అని తిరుమల వేంకటేశ్వరస్వామి వేంకటాద్రినాయకుని ఆదేశించి,

**"అతులిత గతి నేతత్కృతి**
**సతతంబును భవదభీష్ట సంధాయకమై**
**నుతికెక్కు"....నని చెప్పి అంతర్హితుడయినాడు (1-14)**

వేంకటాద్రినాయకుడు వేంకటేశ్వరస్వామి ఆదేశాన్ని శిరసావహించి సకల జీవ సంజీవనము అను రామానుజాచార్యుల జీవిత చరిత్రను కావ్యంగా రచించి, వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చి ధన్యుడయినాడు. సకలజీవ సంజీవనము అయిదు ఆశ్వాసములు, 995 గద్య పద్యములతో అలరారు చున్నది. కవి రాజులను పోషించిన వేంకటాద్రినాయకుడు కృతికర్తకాగా సర్వభూపాలురను పోషించిన వేంకటేశ్వరుడు కృతిభర్త అయిన సకలజన సంజీవనమను ప్రబంధము డా॥ బి. రామరాజు పరిష్కరణలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు క్రీ.శ. 1983లో ప్రచురించినారు.

సాయపనేని వేంకటాద్రి నాయకుడు తన కావ్యమును-సకలజన సంజీవనమును - ఇట్లు ప్రారంభించినాడు.

**"శ్రీరామాంగరుచుల్ పయిన్ నిజభుజాశ్లేషోన్నతిం బర్వి లీ**
**లారూఢిం జిదచిత్ప్రపంచ రచనాయత్నోరరీ కృన్నిరీ**



**క్షారజ్యత్తదవాప్త నూత్న కనక స్నానంబుగాఁ గౌతుక**
**శ్రీ రాజిల్లుచునుండు వేంకట విభున్ సేవింతు నశ్రాంతమున్॥-1-1**

సకలజీవ సంజీవనములో పంచమాశ్వాస గద్య ఈ తీరున ఉన్నది. "ఇది శ్రీమద్వేంకటేశ్వర కృపాలబ్ధ శాశ్వతైశ్వర్యధుర్య నిరంతర భాగవత కైంకర్యధుర్య సాయపాన్వయ సుధానిధాన పరిపూర్ణ పూర్ణిమారాజ రంగనాథ మహీనాథ తనూజ సుధీజన విధేయ వేంకటాద్రినాయక నామధేయ ప్రణీతంబైన సకలజీవ సంజీవనంబను మహా ప్రబంధంబునందు సర్వంబును బంచమాశ్వాసము."

వేంకటాద్రి నాయకుని భక్తి రచనా శక్తి తెలియుటకై కావ్యమందలి కొన్ని పద్యములు ఉదాహరించుచున్నాను.

**తన కరంబుల నిరంతరము శ్రీకరములై**
**చెలువొంది చక్రాబ్జములు రహింపఁ**
**దనమండలాగ్రంపు ధళధళ ద్యుతి కలంగ**
**మూకలు విచ్చు మొగ్గై కలంగ**
**దన రమణీయ మధ్య ప్రదేశంబునఁ**
**బీతాంబర స్థితి పెంపుమీఱ**
**దనడెందమునఁ జెంది పెనుపొందు కళలచే**
**శ్రీసహోదరమణి భాసిలంగఁ**

**దన జగద్ధిత విహరణంబున వృషావ**
**నీధరేంద్రంబు మిగుల వన్నియకు నెక్కి**
**వెలయు ఘన విభాకరమూర్తి లలితకీర్తి**
**వార్ధిజాకామి వేంకటస్వామి నెన్ని. -1-77**

**నత మహిత మానసాబ్జా**
**యిత పాదాలంకృత త్రయీ పద్ధతికిన్**

**నుతిసేవన కృతపావన**
**యతిపావన మతికి వేంకటాచలపతికిన్. -1-82**

**శ్రీరామానుజదత్త**
**శ్రీరామామహిత వక్ష! శ్రితజనరక్షా**
**ప్రారంభవీక్ష! వినమది**
**రారమణ గిరీశ! భుజగరాజ గిరీశా! -2-1**

వేంకటేశ్వరస్వామి మూలబేరము (విగ్రహములో) శ్రీవత్సచిహ్నముపైన పద్మాసనాసీనయైన వక్షఃస్థల లక్ష్మి (అలమేలుమంగ) విగ్రహం ఉన్నది. అది భక్తులకు స్పష్టంగా కనిపించుటకై శ్రీమద్రామానుజాచార్యులు (క్రీ.శ. 1017-1137) ఈ వక్షఃస్థల లక్ష్మీ విగ్రహాన్ని బంగారు తొడుగుతో అలంకరించినాడు. ఈ సంఘటనను "శ్రీరామానుజదత్త శ్రీరామా మహితవక్ష!" అని వేంకటాద్రి నాయకుడు పైపద్యంలో స్మరించినాడు. వేంకటేశ్వరస్వామిని స్తుతించినాడు.

**శ్రీ మహిత బాహుమధ్య**
**శ్రీమహిళా కేళిధుత కుశేశయజరజో**
**భూమావృతి శంకావహ**
**హైమలసద్వాస వేంకటాచలవాసా! -3-1**

రామానుజాచార్యులు శ్రీరంగనాథుని సేవించిన సందర్భములో సుదర్శన చక్రత్తాళ్వారును స్తుతించినారు. వేంకటాద్రినాయకుడు ఈ సందర్భంలో "మత్తవిరోధికర్షణ విమర్శన దర్శన శ్రీసుదర్శనా" అను మకుటముతో తొమ్మిది పద్యములలో (3-43-51) స్తుతించినాడు.

**అటజని కాంచె నమ్ముని యనంగ శతాంగ తురంగ రంగదు**
**ద్భట కిటితుంగ శృంగ కృత భంగ కురంగ పదాంగనానట**
**చ్చటుల సుధా సరిల్లహరి సంఘవిశృంఖల విభ్రమభ్రమీ**
**ఘటక తటీ నటజ్ఝరనికాయ దుకూలము శేషశైలమున్ -3-157**



అని శ్రీరామానుజాచార్యులు దర్శించిన శేషశైలమును వేంకటాద్రి నాయకుడు వర్ణించినాడు. ఈ శేషశైల వర్ణన అల్లసాని పెద్దన మనుచరిత్రలో వర్ణించిన హిమశైల వర్ణనకు అనుకరణముగా ఉన్నది. పెద్దన మనుచరిత్రలో

**అటజనికాంచె భూమిసురుఁడంబరచుంబి శిరస్సరజ్ఝరీ**
**పటలముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ నిస్స్వన**
**స్ఫుటనటనానుకూల పరిఫుల్ల కలాప కలాపిజాలమున్**
**గటకచరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్. -2-3**

అని హిమశైలమును ఉదారతా (వికటత్వము) గుణభరితంగా అర్థరస స్ఫోరకంగా దృశ్యమానంగా వర్ణించినాడు.

**శ్రీపద్మాకుచ మహిభృ**
**త్ప్రాపిత కస్తూరి కాయిత శ్రీ వత్సో**
**ద్దీపిత వక్ష దయా ఘం**
**టాపథ సద్వీక్ష వేంకటనగాధ్యక్షా! -4-1**

రామానుజాచార్యులు వేంకటేశ్వరస్వామిని దర్శించి,

**ఇన్నిడువాలు గన్నుగవ యీ మకరాకృతికుండలంబు లీ**
**చిన్ని మొగంబు నీ తళుకుఁ జెక్కులు నీ దయ జూపుచూపు లీ**
**యన్నువ మోవి కెందలిరు నందము నీ యుర మీభుజంబు లీ**
**వెన్నెలగాయు నవ్వుగల వేంకటనాథుఁడు మమ్ముఁ బ్రోవుతన్ -4-54**

అని ప్రార్థించినాడు.

రామానుజాచార్యులు వక్షఃస్థల లక్ష్మిని (అలమేలుమంగను) దర్శించి,

**జగముల్ కూర్మి సపత్నితోఁ బ్రియుఁడు మెచ్చం దోడుగాఁ గోడలుం**
**దగుపట్లం బనిపాటలందు నెదుగం దాఁబల్కుబూబోణి పెం**

**పుగనం గోత్రికమూని ముమ్మనుమరాల్ ముద్దుల్ ఘటింపన్ దయా**
**లగితాపాంగములన్ భరించు నలమేల్మంగం బ్రశంసించెదన్ -4-90**

అని స్తుతించినాడు.

**శ్రీదర కంఠీపరిరం**
**భాదర నేత్రీ కృత ప్రియాసోదర శ్రీ**
**పాద ప్రణిపత దబ్జ భ**
**వాది సుధాహార! వేంకటాద్రి విహారా! -5-1**

## 21. దివ్యదేశమాహాత్మ్యదీపిక (ద్విపదకావ్యం)

**-నాడగేడు ముష్టిపల్లి వేంకటభూపాలుడు**

నాడగేడు ముష్టిపల్లి వేంకటభూపాలుడు (క్రీ.శ.17వ శతాబ్దం) దివ్యదేశ మాహాత్మ్యదీపిక అను ద్విపద కావ్యమును రచించి వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చినాడు. ఇతడు గద్వాల సంస్థానములో తుంగభద్రానది పాయలలో ఉన్న లంకగ్రామము రాజవోలు (రాజోళి) రాజధానిగా ఈ ప్రాంతమును పరిపాలించిన రెడ్డిరాజు, గద్వాలరెడ్డి ప్రభువులు ముష్టిపల్లి వారుజ్ఞాతులు. క్రీ.శ. 18 శతాబ్దములో వీరి రాజ్యము గద్వాల సంస్థానములో చేరిపోయినది.

"దివ్యదేశమాహాత్మ్యదీపిక' నూట ఎనిమిది వైష్ణవ పుణ్యక్షేత్రములను, వాటి మాహాత్మ్యములను వర్ణించిన ద్విపద కావ్యం. కావ్యాంతమున వేంకటభూపాలుడు

**"అని చెప్పి శ్రీ వేంకటాధిపు పేర**
**వనజ నేత్రుని పేర వరదుని పేర"**

భక్తితో అంకితమిచ్చినట్లు వర్ణించినాడు.



ఈ రాజకవి "శ్రీ వేంకటేశభూరికటాక్షలబ్ధ పావన కవితానుభావుడు." వేంకట భూపాలుడు

**"మున్ను నే చేసిన పుణ్యఫలమున**
**వెన్నున కిచ్చితి ద్విపద గావించి**
**దివ్యదేశ మహత్మ్య దీపికా కావ్య**
**మవ్యయ సౌఖ్యదమై రాజ సభల**
**పూచిన సంపెంగ పోఁడిమి దాల్చి**
**యాచంద్రతారార్కమైయొప్పుఁ గాత"**

అని ఆశిస్తూ, గ్రంథమును ముగించినాడు.

* * *

## 22. ఆంధ్ర ప్రయోగ రత్నాకరము - గణపవరపు వేంకటకవి

గణపవరపు వేంకటకవి 'ఆంధ్రప్రయోగ రత్నాకరము' అను ఛందోగ్రంథమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. ఈ ఛందో గ్రంథమున పూర్వలాక్షణికులు యతిప్రాసల విషయమై నిర్వచించిన లక్షణములు, వేంకటకవి నూతనముగా చెప్పిన కొన్ని లక్షణములు, అందులకు ప్రాచీన కవుల రచనలనుండి వేర్వేరు లక్ష్యములు చూపినాడు.

ఈ ఛందో గ్రంథము ఇట్లు ప్రారంభమైంది,

**కం. శ్రీ భామా నర్మోక్తి క**
**థా భవ నిజ మందహాస ధాగధగ శ్రీ**
**శోభిత శుభ తత్కుచ కుం**
**భాభోగ విలాస! వేంకటాచలవాసా!**

సీ. శ్రీమదాదిమ కవి శేఖరుల్ చెప్పిన
మునుపటి లక్షణమ్ములను ఛంద
ములు చూచి యందుల గలయన్నియును మతి
వారుగానని కొన్ని వగలు గూర్చి
బాగుగా నాంధ్ర ప్రయోగ రత్నాకర
మను కృతిసేసె దేనను మునుపటి
కావ్యాళి సంప్రయోగము లెన్ని గలవన్ని
యరసి ప్రామాణిక మౌట కతన

గీ. సత్కవుల కెల్ల నుపకార సరణిగాఁగ
వరుస వ్రాసితి నివి మది వాంఛ దెలియ
నాతఁడె మహాకవి యనంగ నవనిఁ బరఁగు
<u>పంకజాతాప్తనీకాశ! వేంకటేశ!</u>

* * *

## 23. వేంకటాచలపతి శతకము - ఉడుమూడి సూరపరాజు

ఉడుమూడి సూరపరాజు (క్రీ.శ.17వ శతాబ్దం) వేంకటాచలపతి శతకమును వేంకటేశ్వరాంకితముగ రచించాడు. శతకములలో సంఖ్యా నియమము, మకుట నియమము ఉంటాయి. ఉడుమూడి సూరపరాజు శతకమంతా ఒకే ప్రాసతో రచించే నియమాన్ని పాటించారు. సూరపరాజు రకార ప్రాసతో వేంకటాచలపతి శతకాన్ని రచించాడు. ఏకప్రాస శతకం వ్రాస్తున్నట్లు చెప్పాడు.

వరయతి లక్షణజ్ఞులగు వందిత సత్కవు లెల్ల మెచ్చఁగా
గరిమను నేకప్రాస శతకం బొనగూర్చి సుపుష్పమాలగా



నరహరి మీకొనర్చెదను నారదగాన విలోల! ద్వారకా
తిరుపతి వేంకటాచలపతీ! ననుఁ బ్రోవుము వేగ శ్రీపతీ॥

తిరుమల తిరుపతి వేంకటేశ్వరునకు ద్వారకా తిరుమల (తిరుపతి) వేంకటేశ్వరునకు సూరపరాజు అభేదం పాటించాడు.

* * *

## 24. కరియావుల కాటమరాజు చరిత్రము (పద్యకావ్యం)
### - గుఱ్ఱంకొండ భక్తవత్సలుడు

కవిసార్వభౌముడు శ్రీనాథుడు ద్విపదకావ్యంగా రచించిన కాటమరాజు చరిత్రమును గుఱ్ఱంకొండ భక్తవత్సలుడు పద్యకావ్యంగా రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. తిరుపతి వేంకటేశ్వరుడు కవికి కలలో కనిపించి ఈ కావ్యరచనకు ప్రేరేపించెనని భక్తవత్సలుడు చెప్పినాడు. ఈ కాటమరాజు చరిత్రమున ప్రారంభపద్యమున శ్రీ కృష్ణస్తుతి చేయబడింది.

శ్రీమద్వల్లవ సుందరీస్తనము లుత్సేకంబు నొందన్ శివా
స్తోమంబుల్ గరగంగ దారువుల మోసుల్ పుట్ట గోపంక్తి ని
స్సీమాహ్లాదమునన్ వినంబొదివి గాసింబొంద వైరుల్ స్వర
గ్రామాప్తిన్ బొరి వేణువూదు హరి తా రక్షించు మత్కావ్యమున్

అయితే ఈ కావ్యమున షష్ఠ్యంతపద్యములు వేంకటేశ్వరాంకితములుగా ఉన్నవి.

శాశ్వత కరుణాకరునకు
విశ్వనియంతకును నిత్యవిభవాఢ్యునకున్
శశ్వద్గుణునకు సకలా
ధీశ్వరునకు శేషకుధర ధృత వాసునకున్.

**శేషాచలాధిపతికిని**
**భాషాపతి వందితునకుఁ బద్మాపతికిన్**
**దోషాపహారునకు ని**
**ర్దోషాన్వయ సుజనవినుతి తుష్టాత్మునకున్.**

సమర్పణంబుగా నొనర్పం బూనిన కరియావుల కాటమరాజు చరిత్రంబు గథా ప్రారంభం బెట్టిదనిన" అని కాటమరాజుకథ ప్రారంభమైనది. ఆశ్వాసాంత పద్యము ఇట్లున్నది-

**వేంకట శైల నివాసా!**
**పంకజతనయా నివాస! భాసుర హాసా!**
**సంకట హరణ ప్రాసా**
**కింకర జన హృ న్నివాస కృత ఘన రాపా ॥**

**ఆశ్వాసాంత గద్య ఇట్లున్నది-**

"ఇది శ్రీమద్వేంకటాచలనివాస లక్ష్మీమానసోల్లాస శ్రీనివాసకరుణా కటాక్ష వీక్షా విశేష సంలబ్ధ సమస్తాభీష్ట సద్గుణ గరిష్ఠ. విశిష్ట శ్రీమదాసూరి రామానుజాచార్య చరణారవింద మరంద రసాస్వాదనతుందిల మిళింద ప్రాయ హృదయ వాహోర్వీధర వంశ పవిత్ర నారాయణస్వామి పుత్ర సకలజన విధేయ భక్తవత్సల నామధేయ విరచితంబగు కరియావుల కాటమరాజు చరిత్రంబునందు ద్వితీయాశ్వాసము సంపూర్ణము." ఈ కావ్యముయొక్క వ్రాతప్రతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధన సంస్థ గ్రంథాలయమున ఉన్నది (6702) భక్తవత్సలుడు తన యింటిపేరు గుర్రంకొండను సంస్కృతీకరించి 'వాహోర్వీధర' అని చెప్పినాడు (వాహ= గుర్రము, ఉర్వీధర= కొండ)

* * *



## 25. దేశ్యనామార్థ కోశము (నిఘంటువు) - హయణం కృష్ణయ

దేశ్యనామార్థకోశము అను పద్యనిఘంటువు ఏకాశ్వాస పరిమితము. ఇందులో 128 పద్యములు గలవు. ఈ పద్య దేశ్యపద నిఘంటువును హయణం కృష్ణయ రచించి, శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. ప్రతి పద్యమున వేంకటేశ్వరుని గూర్చిన ఏదో ఒక సంబోధన నియతముగా కూర్చబడియున్నది. వెంకటపట్టభద్రా, వెంకటాచల విహార, వేంకటాచల నివాసా!, శేషశైలాధిపతీ, వెంకటనగ నివేశా - అనే సంబోధనలు ఉన్నవి. ముద్రితము. నేడు ప్రతులు లభింపవు.

ఈ దేశ్యనామార్థకోశమున గద్య ఇట్లున్నది "ఇది శ్రీమన్నందవర వంశపావన వనజబాంధవ ప్రసాద లబ్ధ చతుర్విధ కవితా చమత్కార భారద్వాజ గోత్రపవిత్ర హయణం గంగయామాత్యపౌత్ర పాపయమంత్రి పుత్ర సకల సుకవిజనవిధేయ కృష్ణయనామధేయ ప్రణీతంబైన దేశ్యనామార్థ కోశంబను నా నిఘంటు లక్షణ గ్రంథమందు సర్వమున్ను ఏకాశ్వాసము సమాప్తము."

**సకల సురగణమస్తక...మకుట**
**ఘటిత నవరత్న కాంతి ప్రకాశమాన**
**తరుణ చరణారవింద సౌందర్యవిజిత**
**శతరతీశ్వర! వెంకటాచల విహార!**

**మలమీఁది కాలి తోవకు**
**నలరున్ పేరొకటి కురువయన నంగడికిం**
**గలదుపచారంబనియెదు**
**సలలిత నామంబు శేషశైలాధిపతీ!**

**అకరులన కేసరములు చొక్కొకనాగ**
**పంటిరాలెడి యాకులఁ బరఁగు పేరు**
**వీలపకొమ్మలకు పేరు వేకలనఁగ**
**వెలయులక్ష్మీశ! వేంకటాచల నివేశ!॥**

**వానజడి వట్టు కురిసి యవ్వాన వెలిచి**
**చూరు వెంటను పిదపను జారు నీరు**
**బొట్లు వంగుడు నాగ నీట్లొట్లనాగ**
**నామములు దాల్చు వేంకట నగనివేశ!॥**

**గరిమ విలసిల్లు కందనగాయ యనఁగ**
**గుండెకాయకు నామమై యుండునంట**
**కరకజ యనంగుడను పేరుధరణిలోన**
**నీరజోద్భవ గేయ కోనేటిరాయ!॥**

**బింగులు బోరననంగా**
**కుంగలు బారంగ ననుట సూరెలనంగన్**
**సంగతియగు పార్శ్వంబుల**
**కుంగుడు నామంబు శేషకుధరాధీశా!॥**

ఈ నిఘంటువుయొక్క వ్రాతప్రతి శ్రీ వేంకటేశ విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థలో ఉన్నది. సంఖ్య: 7296.

* * *

## 4.3 శ్రీ వేంకటేశ్వరసాహిత్యము

**- తాళ్ళపాక కవుల పరివస్య**

శ్రీ వేంకటేశ్వర సాహిత్యమున ప్రస్తావన వశమున భక్తితో వేంకటేశ్వరుని స్తుతించిన కావ్యములు, స్వామికలలో కనిపించి కోరగా రచింపబడిన కావ్యములు, ఇష్టదైవముగా భావించి భక్తితో స్వామికి అంకితమీయబడిన కావ్యములు, వేంకటేశ్వరుని లీలలు, మహిమలు, కథా వర్ణనలతో కూడిన కావ్యములు చేరుచున్నవి.

తాళ్ళపాక కవులలో అన్నమాచార్యులు ప్రథముడు. అన్నమయ్య సంకీర్తనలతో, దేశిరచనలతో ఆంధ్రవాఙ్మయమున శ్రీ వేంకటేశ్వర సాహిత్యము క్రీ.శ. 15వ శతాబ్దమున ప్రారంభమైనది. అన్నమయ్య విష్ణుదేవుని ఆయుధమగు నందకము (ఖడ్గము) అంశమున జన్మించినాడు. సంకీర్తనాచార్యుడు, పదకవితా పితామహుడు అయిన అన్నమాచార్యులు క్షేత్ర, దైవత, తీర్థమహిమలను వర్ణించుచు సంస్కృత భాషలో 'వేంకటాద్రి మాహాత్మ్యము'ను రచించినాడు. ఇది అలభ్యము.

తాళ్ళపాకవారు నందవర వంశీకులు. వైదిక బ్రాహ్మణులు. ఋగ్వేదులు. ఆశ్వలాయన సూత్రులు. భారద్వాజస గోత్రులు. పొత్తపినాడు (నేటి కడప జిల్లా)లో తాళ్ళపాక అనుగ్రామమున ఉండినారు. తాళ్ళపాక అన్నమాచార్యులు, అతని సంతతివారు తమ సంకీర్తనలతో ఆంధ్ర దేశమంతటా తిరిగి, వేంకటేశ్వర భక్తిని, సాత్త్వికమతమగు శ్రీ వైష్ణవ మతమును ప్రచారము చేసినారు. మత ప్రచారమునకు శివకవులవలె దేశి సాహిత్యమును సాధనముగా చేసుకున్నారు. సంకీర్తన, వచనము, మంజరీ ద్విపద, ద్విపద దండకము, ఉదాహరణము, శతకము మున్నగు సాహిత్య ప్రక్రియలలో, కొంగ్రొత్త రీతులలో వేంకటేశ్వర సాహిత్యమును సృష్టించినారు. ప్రచారము చేసినారు. కృతార్థులైనారు.

ఆంధ్ర సాహిత్యములో తాళ్ళపాక కవులకు విశిష్టస్థానమున్నది. శ్రీ వేంకటేశ్వర సాహిత్యములో తాళ్ళపాక వారిది సింహభాగము. మూల పురుషుడగు తాళ్ళపాక అన్నమాచార్యులు, అతని భార్య, పుత్రులు, పౌత్రులు, దౌహిత్రులు వేంకటేశ్వరసాహిత్యమును సృష్టించి, స్వామివారి సేవ చేసి తరించినారు. వీరందరు 150 సంవత్సరముల కాలము శ్రీ వైష్ణవ మతమునకు, ఆంధ్రసాహిత్యమునకు, శ్రీ వేంకటేశ్వర సాహిత్యమునకు నిరుపమానమగు సేవచేసి ధన్యులయినారు.

## 4.3.0. తాళ్ళపాకవారి శ్రీ వేంకటేశ్వర సాహిత్యము

**1. తాళ్ళపాక అన్నమాచార్యులు (మూలపురుషుడు)**

1. శృంగార సంకీర్తనలు } మొత్తము ముప్పది రెండువేలు.
2. అధ్యాత్మ సంకీర్తనములు }
3. శృంగారమంజరి
4. వేంకటేశ్వర శతకము
5. వేంకటాద్రిమాహాత్మ్యము (సంస్కృతము) అలభ్యము.
6. సంకీర్తనలక్షణము (సంస్కృతము) అలభ్యము.

**2. తాళ్ళపాక తిమ్మక్క (అన్నమాచార్యుల మొదటిభార్య)**

1. సుభద్రా కల్యాణము (మంజరీ ద్విపద)

**3. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు (అన్నమాచార్యుల రెండవభార్య అక్కలమ్మ కుమారుడు)**

1. శృంగార సంకీర్తనలు 2. ఆధ్యాత్మిక కీర్తనలు
3. వేంకటేశ్వర వచనములు (వచన మాలికా గీతాలు)
4. శృంగార దండకము (దండకం)
5. చక్రవాళ మంజరి (మంజరీ ద్విపద)
6. శృంగారవృత్త శతకం (శతకం)



7. వేంకటేశ్వరోదాహరణం (ఉదాహరణం)
8. నీతి సీస శతకం (శతకం)
9. సుదర్శన రగడ (రగడ)
10. రేఫఱకార నిర్ణయము (లక్షణ గ్రంథము)
11. శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము (ద్విపద)

**4. తాళ్ళపాక చిన తిరుమలాచార్యులు (పెదతిరుమలాచార్యుల పెద్దకుమారుడు)**

1. శృంగార సంకీర్తనలు 2. ఆధ్యాత్మిక సంకీర్తనలు
3. అష్టభాషాదండకము (దండకము)
4. సంకీర్తన లక్షణము (లక్షణ గ్రంథం)

**5. తాళ్ళపాక తిరువేంగళనాథుడు (చిన్నన్న) పెదతిరుమలాచార్యుల నాలుగవ కుమారుడు**

1. అన్నమాచార్య చరిత్రము (జీవితచరిత్ర - ద్విపద కావ్యం)
2. పరమయోగి విలాసము (ద్విపద)
3. అష్టమహిషీ కల్యాణము (ద్విపద)

**6. తాళ్ళపాక తిరువేంగళప్ప (చిన తిరుమలాచార్యుని కుమారుడు)**

1. అమరుకము (అనువాద శతకము)
2. గురుబాల ప్రబోధిక (అమరకోశమునకు తెలుగువ్యాఖ్య)
3. సుధానిధి (మమ్మటుని కావ్యప్రకాశికకు వ్యాఖ్య) అముద్రితం.

**7. రేవణూరి వేంకటాచార్యుడు (అన్నమాచార్యులు దౌహిత్రుడు, రేవణూరి కొండయార్యుడు, తిరుమలాంబల కుమారుడు)**

1. శకుంతలా పరిణయము (ప్రబంధము) అముద్రితం
2. శ్రీపాదరేణు మాహాత్మ్యము (కావ్యము)

వీటిని బట్టి చూడ తాళ్ళపాక కవులు సాహితీ ప్రక్రియలలో వైవిధ్యము చూపినారు. కృతి బాహుళ్యము సాధించినారు అని స్పష్టమగుచున్నది.

శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహమువలన తాళ్ళపాకవారికి పేరు ప్రఖ్యాతులు, సంపదలు అతిశయించినట్లే, వీరి మూలమున వేంకటేశ్వరస్వామికి ప్రశస్తి, వైభవము అధికమైనది. అవినాభావ సంబంధమున వీరికి పరస్పరము కీర్తి ప్రతిష్ఠలు అతిశయించినవి. అందుకే అన్నమాచార్యులు

**"నేనొక్కడ లేకుండితే నీ కృపకు బాత్రమేది**
**పూని నావల్లనే కీర్తి బొందేవు నీవు**
**.......................................**
**భావించి నావంటి నీచు బట్టి కాచినప్పుడుగా**
**యేవంక నీ కీర్తి గడు నెంతురు భువి**
**నా వల్ల నీకు బుణ్యము నీ వల్ల నే బ్రదుకుదు**
**శ్రీ వేంకటేశుడ యింత చేరె జుమ్మీ మేలు॥"** అని పలికినాడు.

**- అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం: 8 సంకీర్తన-48, 1960**

* * *

## 4.3.1. తాళ్ళపాక వారి ప్రస్తావన కావ్యములు

### 1) సుభద్రా కల్యాణము (మంజరీ ద్విపదకావ్యం) - తాళ్ళపాక తిమ్మక్క

తాళ్ళపాక అన్నమాచార్యుల మొదటి భార్య తిమ్మక్క మంచి సంగీత సాహిత్యవేత్త. ఈమె సుభద్రా కల్యాణమును మంజరీ ద్విపదలో రచించింది. కాలమునుబట్టి తిమ్మక్క తొలి తెలుగు కవయిత్రి గౌరవమును పొందుచున్నది. ఈ సుభద్రా కల్యాణమున కృత్యాది అవతారిక లభించలేదు.

**"శ్రీ రమా వల్లభులు శ్రీ కృష్ణ లెలమి**
**ద్వారకా పట్టణము తమరేలుచుండ"**

అను ద్విపదతో ప్రారంభమైంది. ఈ ద్విపద కావ్యం పాడుటకు అనుకూలముగ ఒక పెండ్లిపాట వలె రచింపబడింది. ఈ కావ్యములో సుభద్రార్జునుల



వివాహమే వర్ణింపబడింది. కృత్యాది లభించనందున ఇది ఎవరికి అంకితమో తెలియుటలేదు.

సమయభంగము చేసిన అర్జునుడు ఒక సంవత్సరంపాటు తీర్థయాత్రలు చేయవలసి వచ్చినది. అర్జునుడు ఇంద్ర ప్రస్థమునుండి బయలుదేరి, తీర్థయాత్రచేయుచు ఆంధ్రదేశములో నున్న వేంకటాద్రిని కూడ దర్శించినాడు.

**"అమర నహోబలం బా వేంకటాద్రి**
**వరుస నాపై కంచి వరదులఁ గొలిచె"** **-పుట.6**

అని తిమ్మక్కమూలములో లేని వేంకటాద్రిని పేర్కొన్నది. ఈ పాట నన్నయ భారత కథను అనుసరించినను ఇందులో వేంగి దేశవర్ణనలేదు. వేంకటాద్రి వర్ణన గలదు. ఇందుకు తిమ్మక్క వేంకటాద్రినాథుని భక్తురాలు కావడం కారణమైయున్నది. వేంకటాచలమాహాత్మ్యములో పద్మావతీ శ్రీనివాసుల కల్యాణకథలో పద్మావతి పెంపుడు చిలుక శ్రీనివాసునితో రాయబారము చేసింది. సుభద్రా కల్యాణములో తిమ్మక్క "కమలాక్షి పెంచిన కదుముద్దుచిలుక" ఒకటి సుభద్రార్జునుల మనస్సులు కలియునట్లు రాయబారము చేసినట్లు వర్ణించింది.

కావ్యాంతములో తిమ్మక్క తనను గూర్చి

**"అవనిలో తాళ్ళపాకాన్నయ్యగారి**
**తరుణి తిమ్మక చెప్పి - దాను సుభద్ర**
**కల్యాణమను పాట - కదుమంచితేట**
**పలుకుల, నీ పాట పాడినా విన్న**
**శ్రీహరి వారికి చేరువైయుండు**
**నానాట పాపములు నాశనంబౌను**
**ఆప్తులు బంధువు లను వొందగలరు**
**సప్త సంతానముల్ సమకూర గలవు."** **- పుట-56**

అని చెప్పింది. ఫలశ్రుతితో పాటను ముగించింది. సుభద్రా కల్యాణము చక్కని శైలిలో మనోహరముగా రచింపబడింది. తిమ్మక్క పాటనుండి కొన్ని కథాంశములు, వర్ణనలు చేమకూర వేంకటకవి తన విజయ విలాసమున అనుసరించాడు.

తిమ్మక్క సుభద్రా కల్యాణములో అర్జునుని ఇట్లు వర్ణించింది.

**"ఎగుభుజంబులవాడు మృగరాజు నడుము**
**నడచి పుచ్చుకొను నెన్నడుము గలవాడు**
**గరగరనివాడు చక్కనివాడు నతడు**
**గొప్పకన్నులవాడు కోదండ గుణకి**
**ణాంకంబుతా బహు లమరినవాడు**
**వెన్నున మచ్చగల విభవంబువాడు**
**బవిరి గడ్డమువాడు పన్నిదంబిడిన**
**వెన్నుపగడసాల వెసనాడవచ్చు"** **- పుట:32**

ఈ వర్ణనను చేమకూర వేంకటకవి తన విజయవిలాసములో ఇట్లు అనుసరించాడు.

**సీ. ఎగుభుజంబులవాడు మృగరాజ మధ్యంబుఁ**
**బుడికి పుచ్చుకొను నెన్నడుమువాఁడు**
**గొప్పకన్నులవాఁడు కోదండ గుణకిణాం**
**కములైన ముంజేతు లమరువాఁడు**
**బవిరి గడ్డమువాఁడు పన్నిదంబిడి డాగ**
**వచ్చునందపు వెన్నుమచ్చవాఁడు**
**గరగరనివాఁడు నవ్వుమొగంబువాఁడు**
**చూడఁగలవాఁడు మేలైనసొబగువాఁడు"**

**- విజయ విలాసము, 2-164 పద్యం**



ఈ అనుసరణ చేమకూర వేంకటకవి (క్రీ.శ. 17వశతాబ్దం) తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక అన్నమాచార్యుల భార్య తిమ్మక్క (క్రీ.శ. 15వ శతాబ్దం) యెడ చూపిన గౌరవాదరములకు జేగంటగా ఉంది.

* * *

## 2) అష్టమహిషీ కల్యాణము (ద్విపదకావ్యం)

**- తా॥ తిరువేంగళనాథుడు (చిన్నన్న)**

తాళ్ళపాక అన్నమాచార్యుల మనుమడు, పెదతిరుమలాచార్యుల నాల్గవకుమారుడు అయిన తిరువేంగళనాథుడు (చిన్నన్న) అష్టమహిషీ కల్యాణము అను ద్విపదకావ్యమును రచించి శ్రీ వేంకటేశ్వరుని పత్నియగు అలమేలుమంగాదేవికి అంకితమిచ్చినాడు.

చిన్నన్న ఇష్టదేవతా ప్రార్థనలో వేంకటేశుని

**"శ్రీ వేంకటేశుడై చేలప్రకాశు**
**దేవాది దేవును ధీర ప్రభావు"**

అని స్తుతించినాడు. అవతారికలో

**"యెనలేని వేంకటేశు మెప్పించి**
**సకలంబు నెఱుగ నసాధరణాంక**
**మకర కుండలము లిమ్మహి గొన్నవాడ"**

అని స్వామి అనుగ్రహమును వివరించినాడు, తనను గూర్చి చెప్పుచు చిన్నన్న "....వేంకటేశ్వర పాదపద్మ వాసనాలోలువ స్వాంతషట్పదుడ" అని చెప్పుకొన్నాడు.

ఆశ్వాసాంతములలో "శ్రీ వేంకటాధీశ దత్త మకర కుండల యుగ్మ మండిత కర్ణు"డని చెప్పినాడు.

* * *

### 3) గురుబాలప్రబోధిక (అమరకోశమునకు) వ్యాఖ్య

**- తా॥ తిరువేంగళప్ప (క్రీ.శ.16వ శతాబ్ది)**

తాళ్ళపాక పెద తిరుమలాచార్యుల మనుమడు, చిన తిరుమలాచార్యుల కుమారుడు అయిన తిరువేంగళప్పగా పిలువబడే తిరువేంకటాచార్యులు సంస్కృతములో ప్రాచీనమైన, సుప్రసిద్ధమయిన అమరకోశమునకు 'గురుబాలప్రబోధిక' అను పేరుతో తెలుగులో వ్యాఖ్య రచించాడు. ఇది ముద్రితమై ప్రచారములో ఉన్నది.

గురుబాల ప్రబోధిక వ్యాఖ్యానమున కృత్యవతరణిక ఇట్లున్నది.

**శ్రీ వేంకటేశేన సరోజ జాతా**
**సేయం సరోజాలయ లాలనీయా।**
**ఇతీవసత్యం హృదయారవిందే**
**నివేశితా మాం కమలాలయా వ్యాత్॥**

**ఆ సీదాసేతునీహార గిరి విఖ్యాత నామవాన్।**
**తాళ్ళపాకాన్నమాచార్యః వేంకటేశ పదాంచితః॥**

ఇట్లు తన వ్యాఖ్యాన గ్రంథమున తా॥ తిరువేంగళప్ప ఇష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రస్తావించాడు.

* * *

### 4) సుధానిధి (కావ్యప్రకాశకు) వ్యాఖ్య

**- తా॥ తిరువేంగళప్ప (క్రీ.శ.16వ శతాబ్ది)**

తిరువేంగళప్ప సంస్కృతములో మమ్మటాచార్యుడు రచించిన కావ్యప్రకాశిక అను అలంకార శాస్త్రమునకు సంస్కృతములో సుధానిధి అనుపేరుతో వ్యాఖ్య రచించాడు. ఈ గ్రంథమున అవతారిక ఇట్లున్నది.



**శ్రీవేంకటేశేన సరోజజాతా**
**సేయం సరోజాసన లాలనీయా**
**ఇతీవ నిత్యం హృదయారవిందే**
**నివేశితా మాం కమలాలయాఽవ్యాత్**
**ఆసీదాసేతునీహారగిరి విఖ్యాత నామవాన్,**
**తాళ్ళపాకాన్నమాచార్యః వేంకటేశ వరాంచితః.**

'గురుబాల ప్రబోధిక'లోని గ్రంథ అవతరణికా శ్లోకములే 'సుధానిధి' వ్యాఖ్యాన గ్రంథమున కూడ కొలది మార్పులతో ఉన్నవి.

* * *

## 4.3.2. తాళ్ళపాక వారి అంకిత కావ్యములు

### 1) సంకీర్తన లక్షణము - తాళ్ళపాక అన్నమాచార్యులు

పదకవితా పితామహుదు తాళ్ళపాక అన్నమాచార్యులు (క్రీ.శ.1408–1503) సంకీర్తనా పరిశుద్ధి ఏర్పరచుటకై 'సంకీర్తన లక్షణము' అను లక్షణ గ్రంథమును సంస్కృతభాషలో రచించాడు. ఇది వేంకటేశ్వరాంకితం. ఈ సంకీర్తన లక్షణ గ్రంథము అలభ్యము. అన్నమాచార్యుల సంస్కృత సంకీర్తన లక్షణమునకు అన్నమాచార్యుల కుమారుడగు పెద తిరుమలాచార్యులు (క్రీ.శ. 15వ శతాబ్దం) ఒక లఘువ్యాఖ్యను రచించాడు. ఇదీ అలభ్యము.

అన్నమాచార్యుల మనుమడు, పెదతిరుమలాచార్యుల కుమారుడగు చినతిరుమలాచార్యులు (క్రీ.శ. 16వ శతాబ్దం) అన్నమాచార్యులు రచించిన సంస్కృత సంకీర్తన లక్షణమును, పెద తిరుమలాచార్యులు రచించిన లఘు వ్యాఖ్యతో కలిపి తెనిగించినాడు. ఈ సంకీర్తన లక్షణము (తెలుగు) లభించింది. ముద్రితముకూడ (1935) ఈ అంశములను చినతిరుమలాచార్యులు ఇట్లు వర్ణించాడు.

**భరతాదుల గ్రంథంబుల**
**విరచించిన లక్షణములు వేంకటభూమీ**
**ధరవర కీర్తన లక్ష్యము**
**లురు పదకవితా పితామహుం డేర్పఱచెన్.**

**-సంకీర్తన లక్షణము-13 పద్యం.**

చిన తిరుమలాచార్యులు అన్నమాచార్యుల సంకీర్తనములను ఇట్లు వివరించినారు. వాటి విశిష్టతను కీర్తించాడు.

**పావనములు హరిభక్తి వి**
**భావనములు సర్వమంత్ర పరమరహస్యో**
**ద్భావనములు గాయకనిక**
**రావనములు తాళ్ళపాక యన్నయ పదముల్. -సం.ల-3**

**వేదంబులు పౌరాణిక**
**వాదంబులు వర కవిత్వవాణీ వీణా**
**నాదంబులు కృత సుజనా**
**హ్లాదంబులు తాళ్ళపాక యన్నయ పదముల్. -సం.ల-6**

**లక్షణములు పదకవితా**
**రక్షణములు వివిధ కుకవిరాజీ మద స**
**మ్మోక్షణములు వేంకటపతి**
**వీక్షణములు తాళ్ళపాక విభుసత్కవితల్. -సం.ల-7**

**మది దాళ్లపాకయన్నయ**
**పదములపై భక్తి కలిగి పాడిన విభవా**
**స్పదములగు వివిధ సంప**
**త్పదములు శ్రీవేంకటేశు పదములు దెలియున్. -సం.ల-9**



**శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమ వీథులై వివిధ మంత్రార్థంబులై నీతులై**
**కృతులై వేంకటశైలవల్లభ రతిక్రీడా రహస్యంబులై**
**నుతులై తాళులపాకయన్నయ వచోనూత్న క్రియల్ చెనగున్॥**

**-సం.ల-12**

**అట్టి యన్నయార్యుఁడానతిచ్చిన పద**
**లక్ష్యలక్షణముల లాగు దెలిసి**
**పలుక నేర్చెనేని బాలుండు ప్రోడయౌ**
**దత్ర్పబంధ మమృతధారఁబోలు॥ -సం.ల-14**

**ధరలో దాళులపాకయన్నయ గురూత్తంసుండు సంకీర్తనా**
**పరిశుద్ధిన్ మునుఁజేయఁబూని తగ నుత్పాదించెఁ దల్లక్షణం**
**బరుదై మించిన సంస్కృతంబునఁ గవీంద్రానంద సంధాయియై**
**పరిపూర్ణాఖిల శాస్త్ర సమ్మతముగా భావజ్ఞు లౌ నేననన్. -సం.ల-15**

**పరమామ్నాయ సమానమై వెలయు మత్పైతామహ గ్రంథమున్**
**వరచాటూక్తి మదీయపుణ్యజనక వ్యాఖ్యాతమున్ వేడ్కఁదా**
**చరణాంభోరుహముల్ మదిం దలచి సచ్ఛాస్త్రజ్ఞు లింపొందగా**
**వరుసం జెప్పెదఁబద్యరూపమునఁ దద్వాక్యాను సారంబునన్.॥**

**-సం.ల-17**

ఇట్లు వేంకటేశ్వరాంకితమైన సంకీర్తనమను పదసంప్రదాయమును వివరించుచు అన్నమాచార్యులు రచించిన సంకీర్తన లక్షణమను గ్రంథమును చిన తిరుమలాచార్యులు తెలుగున అనువదించాడు.

ఈ సంకీర్తన లక్షణగ్రంథము (తెలుగు) ఇట్లు వేంకటేశ్వర ప్రియ సంస్తుతితో ప్రారంభమైంది.

**శ్రీ వేంకటేశ్వర ప్రియ**
**పావన చారిత్ర పూర్వపద కవిమణి తే**

**జోవర హారంబునకుఁ బ్ర**
**భావహ కవినాయకత్వమలవడు చుండున్.** 1

**వరకవితాగుణ చతురత**
**లరుదారగఁ దాళ్ళపాక యన్నయ ధరలో**
**దిరు వేంకటాద్రి పతిపై**
**దొరకొని చెప్పంగ పదము తుదిపదమయెన్.** 2

చిన తిరుమలాచార్యులు సత్కవితా వైభవమును సత్కవిత వేదమంత్రసమమని ఇట్లు కొనియాడినాడు.

**సంప్రదాయాగత జ్ఞానసహితుఁడైన**
**మనుజు సత్కవితయు వేదమంత్రసమము**
**అదియచాలదె శ్రీ వేంకటాచలేశు**
**చరణములు గనుమను పునశ్చరణ మేల?** 23

ఈ మాటలు జాను తెనుగులో, ద్విపదలలో కావ్యరచన ప్రారంభిస్తూ పాల్కురికి సోమనాథుడు చెప్పిన

**"తెలుగు మాటలనంగ వలదు వేదముల**
**కొలఁదియకాఁ జూడుఁడిల నెట్టు లనిన" -బసవపురాణం, 1-69,70**

అను మాటలను స్మరింప జేస్తున్నది.

ఈ సంకీర్తన లక్షణ గ్రంథము 71 పద్యములలో సంపూర్తి అయినది. ఈ గ్రంథమును తి.తి.దేవస్థానంవారు "వాల్యూం-1, దిమైనర్ వర్క్స్ ఆఫ్ తాళ్ళపాకం పొయట్స్" అను ఇంగ్లీషుపేరుతో (తాళ్ళపాకవారి లఘుకృతులు - సంపుటం.1) 1935 సం॥ములో మద్రాసునుండి ప్రకటించారు. ఈ సంకీర్తన లక్షణమునకు లక్ష్యముగా సరిగమాది సర్వవిన్యాసముతో సంస్కృత సంకీర్తనలు కొన్ని తిరుమల వేంకటేశ్వరాలయంలోని సంపెంగ ప్రదక్షిణ ప్రారంభమున 4 అడుగుల వెడల్పు, 7 అడుగుల ఎత్తుగల



శిలాఫలకములపై చినతిరుమలాచార్యులచేత చెక్కించబడియుండెను. వీటిలో రెండింటిని జూచినట్లు అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు శృంగార సంకీర్తనలు, సంపుటం-15 పీఠికలో తెలిపియున్నారు (తి.తి.దే ప్రచురణ, 1961). నేడు అవి అదృశ్యములు. అవి ఏమైనవో వేంకటేశ్వరునికే ఎరుక!

తాళ్ళపాక చినతిరుమలాచార్యులు అనువదించిన సంకీర్తన లక్షణమును తెలుగు వ్యాఖ్యానముతో ఇంగ్లీషు అనువాదము, వ్యాఖ్యానములతో డా॥ సాళ్వ కృష్ణమూర్తి రచించారు. ("The Tunes of Divinity" (సంకీర్తన లక్షణము) A Treatise on Hymondy is Telugu by Tallapaka Cina Tirumalacharya, Translation & Commentary by Dr. Salva Krishna Murthy, 1990)

* * *

## 2. సుదర్శన రగడ - పెదతిరుమలాచార్యులు.

ఆద్యంతములందు ప్రాసనియము గలిగి సంగీత ప్రాధాన్యముతో గానయోగ్యంగా రచింపబడిన విశిష్ట సాహిత్య ప్రక్రియ రగడ. ఇది దేశి ఛందము. రగడ కావ్యాంతర్భాగమున స్తుతి, పుష్పాపచయాది సందర్భముల లోను, ప్రత్యేక లఘుకావ్యముగను (బసవ, నమశ్శివాయ రగడలు) తెలుగు సాహిత్యములో రచింపబడి, వర్ధిల్లింది.

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు (క్రీ.శ. 1456-1554) శ్రీ వైష్ణవ మత ప్రచారమునకై సాహిత్యమును సాధనముగా గైకొని అనేక ప్రక్రియలలో కావ్యములను రచించినాడు. అందులో సుదర్శనరగడ ఒకటి. ఇది వేంకటేశ్వ రాంకితము. ఇది నవవిధరగడలలో- హయప్రచారము, తురగవల్గనము, విజయమంగళము, ద్విరదగతి, విజయభద్రము, మధురగతి, హరిగతి, హరిణగతి, వృషభగతి-మధురగతి రగడకు (చతురస్రగతి-ఏకతాళము-నాలుగుమాత్రల గణములునాలుగు ప్రతిపాదమున గలది) చెందినది.

సుదర్శన రగడలో 59 రగడలు, 108 పాదములు గలవు. ఈ సుదర్శన రగడ–

**"ఓంకారాక్షరయుక్తము చక్రము**
**సాంక మధ్యవలయాంతర చక్రము"**

అని ప్రారంభమైంది.

**నానావిధ హరినామపు జక్రము**
**వేయివిధంబుల వెలసినచక్రము**
**వేయంచులు గల విశ్వపుజక్రము**
**భావించు సుజన పాలన చక్రము**
**శ్రీవేంకటపతి చేతిది చక్రము॥**

అని వేంకటపతి నామముద్రతో అంతమైనది.

తెలుగు సాహిత్యములో సుదర్శన రగడకు పూర్వపు కృతులు శ్రీకారముతో ప్రారంభమై, అంకితాంకముతో ముగిసినవి. సుదర్శన రగడ ఓంకారముతో ప్రారంభమై 'వేంకటపతి చేతిది చక్రము' అని నామముద్రతో అంతమగుట దీని ప్రత్యేకతను తెలుపుచున్నది.

శ్రీవైష్ణవులు శంఖచక్రముద్రాంకితులగుటచే వారు విష్ణుదేవునితోపాటు, వారి పంచాయుధములను కూడ సేవింతురు. ముఖ్యముగా చక్రోపాసన చేయుదురు. సుదర్శన చక్రమహిమ భాగవత, హరివంశాది పురాణములందు కీర్తింపబడియున్నది. మహాకవి పోతన భాగవతములో

**"…..స్వరితా కంపిత భూమిచక్రము, మహోదృద్విస్ఫులింగచ్ఛటా**
**ఇపరిభూతాంబర శుక్రమున్, బహువిధ బ్రహ్మాండ భాండచ్ఛటాం**
**తర నిర్వక్రము బాలితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్॥"**

**- భాగ-8-109**



పరమభాగవతుడైన, వేంకటనాథుని అనుంగు భక్తుడైన శ్రీకృష్ణదేవ రాయలు ఆముక్తమాల్యదలో–

**"అదరు గళాస్రధారలు మహాముఖవాంత సుధాంబు ధారలు**
**న్నొదవగు వహ్ని కీలములు పొంగునుగాఁ బెరదైత్యకోటికి**
**న్చెడిదపుఁ గిన్కతో నెసరుబెట్టిన పెద్దవనంటివోలె నె**
**క్కుడు విసరాహుమస్తకము గొన్న సుదర్శనదేవుఁగొల్చెదన్॥"**

**ఆముక్త-1-9**

తాళ్ళపాక అన్నమాచార్యులు ఒక సంకీర్తనలో

**రవిచంద్రకోటి తేజోరాశియైన చక్రమా**
**దివిజ సేవితమైన దివ్యచక్రమా**
**తవిలి శ్రీ వేంకటేశు దక్షిణ కర చక్రమా**
**యివల నీ దాసులము యేలుకోవె చక్రమా॥"** **- 8-282**

ఈ వర్ణన స్ఫూర్తిచే సుదర్శన రగడ "శ్రీ వేంకటపతి చేతిది చక్రము" అని అంతమైనది. ప్రతిపాదముచివర చక్రము అనుపదము అంత్యప్రాసగా ఉంది. ఈ రగడ సుదర్శన చక్రమహిమను వర్ణించింది.

ఈ సుదర్శన రగడ రచనను బట్టి పెదతిరుమలాచార్యులు సుదర్శన చక్రోపాసన చేయువాడని తెలియుచున్నది. వేదాంత దేశికులు సుదర్శన చక్రమును స్తుతించుచు రచించిన శ్లోకములను శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుమంజన సమయములో చదివేవారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవములలో శ్రవణా నక్షత్రం నాడు చక్రస్నానము అను ఉత్సవము సుదర్శన చక్రమునకు జరుగుచున్నది. ఇది విష్ణుదేవుని పంచాయుధములలో సుదర్శన చక్రముయొక్క ప్రాధాన్యమును వెల్లడించుచున్నది.

* * *

## 3. రేఫ, ఱకారముల నిర్ణయము (శ్రీకృష్ణ శతకము)

**- పెదతిరుమలాచార్యులు**

పెదతిరుమలాచార్యులు సంకీర్తనాచార్యుడేగాక లాక్షణికుడు కూడ. ఇతడు కవిత్రయము మొదలైన పూర్వకవుల కావ్యములలో ప్రయోగింపబడిన పదములలోని సాధురేఫ (ర), శకట రేఫ (ఱ)ములను వేర్పరచి, అకారాది క్రమమున కృష్ణా! యను మకుటముతో 100 కందపద్యములుగల శతకమును రచించినాడు. 108 వ పద్యము తేటగీతి. ఈ శతకము వేంకటేశ్వరాంకితము. ఈ విషయమును పెదతిరుమలాచార్యులే కావ్యారంభమున ఇట్లు చెప్పినాడు.

**"శ్రీ వేంకటేశ నీకుం**
**గావించెద నంకితంబుగా ఊ రేఫల్**
**వావిరి నేర్పుఱచినకృతి**
**శ్రీవనితానాథ రామ చేకొను కృష్ణా! 1**

**అచ్చులు హల్లులు వరుసనె**
**వచ్చిన రేఫలును ఱాలు వర్ణించెద మున్**
**మెచ్చుగ నాదికవీశ్వరు**
**లచ్చుపడం గృతులు చెప్పినటువలెఁ గృష్ణా! 2**

ఈ కృష్ణ శతకములో అవతారిక పద్యములు-5, సాధురేఫ (ర) పద్యములు-50, శకట రేఫ (ఱ) పద్యములు-52, కావ్యాంతమున గీత పద్యము-1 కలిసి మొత్తము 108 పద్యములు గలవు.

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు పెద్దతనమున కవిత్రయము మొదలైన పూర్వకవులు తమ ప్రబంధములలో ప్రయోగించిన సాధురేఫ, శకట రేఫములను వేర్పరచి, అకారాది క్రమమున లక్షణ గ్రంథముగా రచించినాడు. ఈ సంగతిని పెదతిరుమలాచార్యులు కావ్యాంతమున-



**"క్షీరనీర విభేదంబు చేసినట్లు**
**ధరణి రేఫ ఱకారముల్ తాళ్ళపాక**
**తిరుమలార్యుండు వేర్వేరఁ దేట పఱచె**
**నుచితమిది గాదె పరమహంసోత్తమునకు॥" 108**

అని చెప్పబడింది. ఈ శతకమున పెదతిరుమలాచార్యులు తననుగూర్చి 'పరమహంసోత్తముడ'నని చెప్పికొనుటచే, ఆంధ్రవేదాంతమనబడిన భగవద్గీత వచన టీకయందు వెంకటపతి యోగినని తెలుపుటచే అతడు జీవిత చరమ దశలో సన్యాసాశ్రమము స్వీకరించి యుండునని స్పష్టమగుచున్నది.

ఈ శతకమున పెదతిరుమలాచార్యులు రేఫ, ఱకారములను వర్ణ క్రమమున వేర్పరచుటతో పాటు అక్కడక్కడ ఆయాపదములకు గల అర్థవిశేషములను కూడ వివరించినాడు.

ఇట్లు రేఫ ఱకారములను వేర్పరచిన లక్షణ గ్రంథాలలో పెదతిరుమ లాచార్యుల కృష్ణశతకము మొట్టమొదటిది. ఈ విషయమున పెదతిరుమ లాచార్యులే మొదటి లాక్షణికుడు. అప్పకవి, తిమ్మకవి ప్రభృతులు తర్వాతి వారు. పదములను అకారాదిక్రమంగా పేర్కొన్న మొదటి లాక్షణికుడు పెదతిరుమలాచార్యులు.

* * *

## 4. నీతిసీస శతకము - తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు

లోకనీతిని ఉపదేశించుచు పెదతిరుమలాచార్యులు సీసపద్యములలో ఒక శతకమును రచించినాడు. ఇది వేంకటేశ్వరాంకితము. ఇందులో మొత్తం 100 పద్యములున్నవి.

**"కలిత లక్ష్మీశ సర్వజగన్నివేశ**
**విమల రవికోటి సంకాశ వేంకటేశ"**

అను రెండుపాదముల మకుటము గలదు. ఈ మకుటాంతమును బట్టి ఈ సీస శతకమునకు 'వేంకటేశ శతకము' అను నామాంతరము కలిగింది. కృతి ప్రారంభములో పెదతిరుమలాచార్యులు వేంకటేశ్వరుని ఇట్లు స్తుతించినాడు.

**శ్రీదేవి యురమున, శిరసునఁ దులసి, భూ**
**కాంత వీపునఁ బదాగ్రమున గంగ**
**కమలాసనుఁడు నాభిఁ గాముండు మనసున**
**సవ్యవామాక్షుల శశియు రవియు**
**ధ్వజమున గరుడుండు తపసులు కాంతుల**
**సకల వాయువులు నాసాపుటముల**
**జగములు కుక్షిని జలధులు తరులందు**
**ఘనరోమముల దేవగణము లెల్లఁ**

**గలిగి శోభిల్లు నీమూర్తిఁ దలచి నీకు**
**సీసశతకంబుఁ జెప్పెదఁ జిత్తగించు**
**కలితలక్ష్మీశ! సర్వజగన్నివేశ!**
**విమలరవికోటిసంకాశ! వేంకటేశ!** **1**

చివరి పద్యములో పెదతిరుమలాచార్యులు వేంకటేశ్వరుని దివ్యమూర్తిని సహజ సుందరముగా ఇట్లు చిత్రించినాడు.

**"కాంచన పాదముల్ గజ్జెలు నందియల్**
**గడు మించు మొలఁ జంద్రకావి దట్టి**
**పీతాంబరము మీఁదఁ బిల్లల మొలనూళ్ళు**
**బిగియించి కట్టిన పెనుకటారి**
**వరదాన కరము నుజ్జ్వల కటిహస్తంబు**
**పటుశంఖ చక్రోరు బాహుయుగము**



**నొఱపైన నాభియు నుదరబంధమురంబు**
**నలమేలుమంగతో హారములును**

**శిరసు మకుటంబు దిరుమణి చిత్రమకర**
**కుండలంబులు గల మిమ్ముఁగోరి తలఁతు**
**కలిత లక్ష్మీశ! సర్వజగన్నివేశ!**
**విమలరవికోటిసంకాశ! వేంకటేశ!"** **99**

నేఁడూ, వేంకటేశ్వరస్వామి దివ్యమూర్తి అలంకారము ఇట్లే ఉండుట సంప్రదాయ బలమును తెలియజేస్తున్నది. అంకితాంకపద్యము ఇట్లున్నది–

**"మాధవ గోవింద మధుసూదనాచ్యుత**
**వామన ప్రద్యుమ్న వాసుదేవ**
**కృష్ణ దామోదర కేశవ శ్రీధర**
**హరి విష్ణు పురుషోత్తమానిరుద్ధ**
**సంకర్షణాధోక్షజ త్రివిక్రమ పద్మ**
**నాభ జనార్దన నారసింహ**
**శౌరి హృషీకేశ నారాయణోపేంద్ర**
**తాలాంకముఖనామ తాళ్ళపాక**

**యన్నమాచార్యసుత తిమ్మయాహ్వయుండఁ**
**బ్రణతి చేసితిఁ జేకొమ్ము పద్యశత కము**
**కలితలక్ష్మీశ! సర్వజగన్నివేశ!**
**విమలరవికోటిసంకాశ! వేంకటేశ!"** **100**

పెదతిరుమలాచార్యులు రచించిన నీతి సీసశతకమున పైమూడు పద్యములు పోగా మిగిలిన శతకమంతయు లోకనీతిని బోధించుచున్నది. శతకములో చెప్పిన నీతిని రాజనీతి, సంఘనీతి అను రెండు విభాగములు చేయవచ్చును. లోకనీతిని బోధించుటకై శతకము రచించుటను పెదతిరుమలాచార్యులే

ప్రారంభించినాడు. ఈ విషయమున ఈ శతకమే తర్వాతి వేమన, వేణుగోపాల, కుక్కుటేశ్వర, నారసింహ శతకాదులకు మార్గదర్శకమైనది.

పెదతిరుమలాచార్యుల దృష్టిలో 'అఖిలంబు రక్షించు నాతఁడె రాజు', 'రాజు చేసినదె ధర్మంబై ప్రవర్తిల్లు'ను. కనుక రాజు చర్యలు ధర్మబద్ధముగా నుండవలెను.

**"తనకాప్తులగువారి దండ నున్పగ దగు**
**నధిక శూరుల దండులంపదగును**
**మరి ధనాఢ్యులకును మణివంబు లీదగు**
**హితుల వాకిలి గావ నిడగదగును**
**ఘనకార్యపరుల దుర్గములఁ బెట్టగ దగు**
**నిపుణుల నుడిగల నిలుపఁదగును**
**సముచితజ్ఞులు వ్రాయసము వ్రాయుఁడనదగు**
**మాయావుల దలార్లఁ జేయఁదగును**

**మఱచి యల్పులఁ దా నమ్మి మనుప వలదు**
**గరిమ ధరయెల్ల నేలెదు ఘనుసకెపుడు**
**కలితలక్ష్మీశ! సర్వజగన్నివేశ!**
**విమలరవికోటిసంకాశ! వేంకటేశ!"** **55**

పెదతిరుమలాచార్యులకు సమకాలికుడగు విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద' ప్రబంధములో యామున ప్రభు రాజనీతిని వివరించు ఘట్టములో (4 ఆశ్వాసం) రాజనీతులు పెక్కులు ఈ శతకమందలి నీతులతో సరిపోలుచున్నవి. కవి ఈ శతకములో వివరించిన రాజనీతి నాటి (క్రీ.శ.16వ శతాబ్దం) రాజులు పాటించిన రాజనీతి విధానమునే వెల్లడించుచున్నది.



ఈ శతకములో పెదతిరుమలాచార్యులు సంఘనీతిని బహువిధములుగ వెల్లడించినాడు. కవి అనుభవము అపారమని వెల్లడించుచున్నవి. ఈ శతకములోని సంఘనీతులు సత్యసుందరములుగా ఉన్నవి. సప్తవ్యసనములను, వాటివలన గలుగు దుష్ఫలితములను ఇట్లు సోదాహరణముగా పెదతిరుమలాచార్యులు వివరించాడు.

**"పరకాంతకై సింహబలుఁడట్లు మృతుఁడయ్యె**
**రాజ్యలోభమునఁ గౌరవుఁడు వొలిసెఁ**
**బరుషోక్తులను శిశుపాలుఁడు హతుఁడయ్యె**
**మహినిఁ జూదమున ధర్మజుఁడు నొగిలె**
**నలపాండురాజు వేటాడి శాపముఁనొందె**
**మును రావణుఁడు చలమ్ముననుఁసమసె**
**గ్రూర దండంబునఁ గూలెను వేనుండు**
**జడిసెఁ బానమున రాక్షసగురుండు**

**ఘనవివేకులు వీరల గతులు దెలిసి**
**వ్యసనములు మాని నడవంగ వలయు నిలను**
**గలితలక్ష్మీశ! సర్వజగన్నివేశ!**
**విమలరవికోటిసంకాశ! వేంకటేశ!"** **17**

ఇట్లు ఈ నీతి శతకము లోకనీతులకు నిలయముగా ఉన్నది.

* * *

## 5. అన్నమాచార్యచరిత్రము (ద్విపదకావ్యం)
### – తాళ్ళపాక తిరువేంగళనాథుడు (చిన్నన్న)

కథావస్తువునుబట్టి, ఛందస్సునుబట్టి మార్గదేశి సంప్రదాయములుగా వర్ధిల్లిన తెలుగు సాహిత్యములో ద్విపదకావ్యాలు దేశిరచనా సంప్రదాయానికి చెందియున్నవి. ఈ ద్విపద గేయాంశము కలిగియుండుటచే ద్విపదకావ్యాలు

మధురకవితాశాఖలో చేరియున్నవి. పాల్కురికి సోమనాథాది వీరశైవ కవులు మతప్రచారమునకై జానపదులకు అనువుగా వున్న ద్విపదను స్వీకరించి బసవపురాణము, పండితారాధ్యచరిత్ర మున్నగు కావ్యములను ద్విపద ఛందములో రచించారు. ఈ శివకవులను అనుసరించి వైష్ణవకవులు కూడా సామాన్య జనులలో తమ మత ప్రచారమునకై రామాయణము భాగవతము మున్నగు కావ్యములను రచించి ద్విపదవాఙ్మయాభివృద్ధిని కొనసాగించారు. క్రీ.శ. 15 శతాబ్దములో తాళ్ళపాకవారు కూడ ద్విపదఛందములో పెక్కు కావ్యములను రచించి ద్విపద సాహిత్యమునకు పరిపుష్టి చేకూర్చినారు.

తాళ్ళపాక తిరువేంగళనాథుడు (చిన్నన్న) ద్విపదలో అష్టమహిషీ కల్యాణము, ఉషాపరిణయము, పరమయోగి విలాసము, అన్నమాచార్య చరిత్రములను సులక్షణముగా రచించినాడు. అందువలన "చిన్నన్న ద్విపద కెఱగును" అని ప్రశస్తిని పొందినాడు. చిన్నన్న "రత్నశుభదనుపమ శ్రీ వేంకటాధీశ దత్త మకరకుండల యుగ్మమండితకర్ణుడు'. చిన్నన్న, పదకవితా పితామహుడగు తాళ్ళపాక అన్నమాచార్యుల మనుమడు. పెదతిరుమలాచార్యుల నాల్గవ కుమారుడు. పేరు తిరువెంగళనాథుడు. చిన్నన్నగా ప్రసిద్ధుడు. ఇతడు తాతగారైన అన్నమాచార్యుల జీవితచరిత్రను ద్విపదకావ్యంగా రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. కథాపురుషుని మనుమడే రచించినది యగుటచే ఇది ప్రామాణిక జీవిత చరిత్రగా గౌరవింపబడుచున్నది. అన్నమాచార్యచరిత్ర అవతారికలో చిన్నన్న

**"అఱలేక, యీ యన్నమాచార్యచరిత**
**వెఱవక నీకు నే విన్నవించెదను**
**మన్నించి యలమేలు మంగతో నీవు**
**నిన్నుఁబాయని భక్త నికరంబుతోడ**
**నవధారు శ్రీ వేంకటాచలాధీశ!**
**అవధరింపుఁడు గురు హరిభక్తులార!"**



అని విన్నవించుకొన్నాడు. కావ్యాంతరములో చిన్నన్న

**"అని యలమేలు మంగాధీశు పేర**
**నినమండలాంతరాహిత మూర్తి పేర**
**హరిపేర దరచక్రహస్తుని పేర**
**ధరనెన్ను మాకులదైవంబు పేర**
**నాలీలఁ దాళ్ళపాకాన్నమాచార్యు**
**నేలిన శ్రీ వేంకటేశ్వరు పేర**
**నంకితంబుగను"**

అని అంకిత విషయమును వర్ణించినాడు.

చిన్నన్న "జలజాతవాసిని చనుబాల పుష్టి"చే ఈ కావ్యరచనకు పూనుకున్నాడు. కనుక కావ్యారంభమున

**"శ్రీయలమేల్మంగఁ జిరకృపాపాంగఁ**
**గాయజుఁ గనతల్లిఁ గాంతామతల్లి**
**శ్రీవేంకటేశుఁ బోషిత పద్మకోశు**
**సేవకపరతంత్రు జితదైత్య తంత్రు"** అని అలమేలుమంగమ్మ తల్లిని, వేంకటేశ్వరుని స్తుతించినాడు.

అన్నమాచార్యచరిత్రలో కథా ప్రారంభమున తాళ్ళపాకవారి జన్మస్థాన మగు పొత్తపినాడు, అందలి తాళ్ళపాక గ్రామము వర్ణింపబడింది. పిమ్మట అన్నమయ్య వంశము, అన్నమయ్య జననము, బాల్యము, అన్నమయ్య తిరుమలయాత్ర, అతనికి అలమేలుమంగాదేవి ప్రత్యక్షమగుట, అన్నమయ్య దేవిపై శతకము చెప్పుట, అన్నమయ్య వేంకటేశ్వరస్వామిని దర్శించుట, స్వామిపై శతకమును చెప్పుట, అన్నమయ్య వైష్ణవుడగుట, అన్నమయ్య వివాహము అన్నమాచార్యులు స్వామిపై సంకీర్తనలు పాడుట, అన్నమయ్య మహిమలు అన్నమాచార్యుల రచనలు, అన్నమాచార్యసంతతి అంకితము

వర్ణింపబడినవి. అన్నమాచార్య చరిత్రలో చిన్నన్న ఆనాటి చారిత్రక, సాంఘిక పరిస్థితులు, తిరుమల తిరుపతులు, వాటి పరిసరములు కనులకు కట్టినట్లుగ వర్ణించాడు. అన్నమయ్య తిరుమల చేరిన పిమ్మట, స్వామిపుష్కరిణిలో పవిత్ర స్నానముచేసి, సంప్రదాయానుగుణముగ శ్రీభూవరాహస్వామిని మొట్ట మొదట దర్శించినాడు. ఆదివరాహస్వామి వర్ణన చిన్నన్న ఇట్లు చేసినాడు.

**"ఉరగేంద్రు శిరసుపై నొకపాదమూది**
**చరణమొక్కటి రసాస్థలి మోవఁ జాచి**
**దాకేలు పుడమి పదంతుక నలమి**
**యాఁకేలు కటినూది యనురక్తి జక్క**
**బంటవలంతి గుబ్బలతావి మోవి**
**పంటి తేనియ లొకపరి యాను తమిని**
**మోము దామరఁజూచి మొగసిరి కేలి**
**తామరలను శ్రుతిద్వయము నిక్కించి**
**సంకుచక్రముల హస్తమ్ముల రెంట**
**బొంకించి కరుణ చూపుల జొబ్బిలంగ**
**నాదరిఁ బెంపొందు నాదివరాహు**
**నాదరంబునఁ గొనియాడి సేవించి"**

పిమ్మట అన్నమయ్య వేంకటేశ్వర స్వామిని దర్శించినాడు. స్వామి దివ్యమంగళ విగ్రహము ఇట్లు వర్ణింపబడింది.

**"ధళ ధళల్ తులకించు దరచక్రహస్త**
**ములు బొడ్డు మానికమును గతారమును**
**మంజీర కింకిణీ మంజుల పాద**
**కంజ ద్వయంబును గాంచనాంబరము**



**కటిమీఁదఁ జేర్చిన కరపంకజంబు**
**తటుకున వరమిచ్చు తమ్మికెంగేలు**
**కులికెడు మణిమయ కుండలద్యుతులు**
**కలకలనగు ముద్దుగారు నెమ్మొగము**
**మంచి ముత్యాల నామంబుపైఁ గాను**
**పించు రత్నాంశు దీపిత కిరీటంబు**
**తట్టు పునుంగు పూతయుఁ గిరీటాదిఁ**
**జుట్టిన చెంగల్వ చౌళ్ళెంపు దండ**
**వనమాలికయును శ్రీవత్సకౌస్తుభము**
**అనుపమ దివ్యభూషాది వైఖరులు**
**గలిగిన దివ్యమంగళ విగ్రహంబు"**

అన్నమాచార్య చరిత్రలో అన్నమయ్య రచనలు ఇట్లు వర్ణింపబడినవి.

**"యోగమార్గంబున నొక కొన్ని బుధులు**
**రాగిల్ల శృంగార రసరీతి గొన్ని**
**వైరాగ్య రచనతో వాసింపఁ గొన్ని**
**సారసనేత్రుపై సంకీర్తనములు**
**సరసత్వమునఁ దాళసముఖముల్ గాఁగ**
**పరమమంత్రములు ముప్పది రెండువేలు**
**ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున**
**నవముగా రామాయణము, దివ్యభాష**
**నా వేంకటాద్రి మాహాత్మ్యమంతయును**
**గావించి, రుచుల శృంగార మంజరియు**
**శతకముల్ పదిరెండు సకలభాషలను**
**ప్రతిలేని నానా ప్రబంధముల్ చేసి."**

తాళ్ళపాక అన్నమాచార్యులు శృంగార, వైరాగ్య (ఆధ్యాత్మ) సంకీర్తనములు ముప్పది రెండు వేలు, ద్విపదరామాయణము, సంస్కృతభాషలో వేంకటాద్రి మాహాత్మ్యము, శృంగారమంజరి, పండ్రెండు శతకములు రచించినాడు. ఇవి అన్నియు వేంకటేశ్వరాంకితములే!

తిరుమల శ్రీ వేంకటేశ్వరాలయంలో విమాన ప్రదక్షిణమార్గంలో ఆగ్నేయ మూలలో ప్రధాన వంటశాల (పోటు) ఉంది. ఇందులో స్వామివారికి నివేదించే అన్నప్రసాదాలు తయారుచేస్తారు. ఈ వంటశాలలో వాయువ్య మూలలో చిన్నమందిరం ఉంది. ఇందులో తూర్పుముఖంగా ప్రతిష్ఠింపబడి యున్న దేవీ విగ్రహం ఉంది. ఈమెకు శ్రీ మహాలక్ష్మి విగ్రహమునకు ఉన్నట్లుగ నాలుగు చేతులు ఉన్నవి. పై రెండు చేతులలో పద్మములు ఉన్నాయి. క్రింది కుడి చేయి అభయ ముద్రతోను, ఎడమచేయి వరదముద్ర తోను ఉన్నాయి. ప్రస్తుతం ఈమెను <u>వకుళమాతగా, వకుళాదేవిగా</u> పిలుస్తున్నారు.

ఈ అన్నమయ్య చరిత్రలో అన్నమయ్య తిరుమల దర్శించినపుడు వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం విమాన ప్రదక్షిణ మార్గంలో

**"శ్రీనివాసుని నమస్కృతి చేసి దండ**
**గానుపించిన భాష్యకారులఁ బొగడి**
**శ్రీనరసింహుని సేవ గావించి**
**దానవాంతకు జనార్దను సన్నుతించి**
**<u>అలమేలుమంగకు</u> నభివందనములు**
**సలిపి చెంగటి యాగశాలఁ గీర్తించి"** **- పుట: 23,24**

**అన్నమయ్యచరిత్ర, 2001**

అని యాగశాలకు ముందున్న మందిరంలో ఉన్న దేవత అలమేలు మంగాదేవి అని చిన్నన్న వర్ణించాడు. కనుక వంటశాలలో పర్యవేక్షిస్తున్నట్లున్న దేవి



శ్రీనివాసుని తల్లియగు వకుళాదేవి కాదు. వేంకటేశ్వరుని దేవేరియగు అలమేలుమంగ అని స్పష్టమగుచున్నది. ఈ విషయమును అన్నమాచార్యుల కుమారుడు, చిన్నన్న తండ్రియగు పెదతిరుమలాచార్యులు ఇట్లు వర్ణించి యున్నాడు.

**"అదె వంటశాలలోన అలమేలుమంగ నాంచా**
**రెదుట శ్రీ వేంకటేశు కితవైనయట్లు** **॥పల్లవి॥**

**వెండి పైడిచట్లలో వేరె వేరె కూరలెల్ల**
**వండించి, దొంతి వెట్టించి వద్దనుండి**
**కొండల పొడవుగాగ కోటి బోనాలపరంజి**
**కుండల గుమ్మరింపించి కొలువై కూచుండీ** **॥అదె॥**

**పానకాలు శిఖరులు పటికంపు గొప్పెరల**
**పూని వాసనలుగాగ పువ్వు గట్టించి**
**వానినే నీలవు జుట్టువములనే నించి నించి**
**ఆనించుకొని వడ్డించ నాయత్తపడీని** **॥అదె॥**

**అందెలు గల్లురనగా నడుగులు వెట్టివెట్టి**
**విందులలమేలుమంగ వేళ వేళను**
**చెంది శ్రీ వేంకటపతికి చేతులకు గడిగడి**
**అంది యిచ్చిపొత్తున దా నారగించి నదివో"** **॥అదె॥**

**- తాళ్ళపాక పదసాహిత్యం,**
**సంపుటం-17-సంకీర్తన-316. 1998 ప్రతి**

వైష్ణవ దేవాలయాలలో విష్ణుదేవుని, అవతారమూర్తుల దేవేరులు మాత్రమే పూజింపబడుచున్నారు. అవతారమూర్తుల తల్లుల విగ్రహాలు పూజింపబడుట లేదు. కనుక వంటశాల మందిరములో ఉన్నదేవి విగ్రహ స్వరూప లక్షణములనుబట్టి, సంప్రదాయమునుబట్టి, పెదతిరుమలాచార్యుల, చిన్నన్న

వర్ణనలను బట్టి వకుళమాతకాదు, అలమేలుమంగాదేవి అని ధ్రువపడు చున్నది. ఈ పొరపాటును సరిదిద్దువారెవరో? వేంకటేశ్వరుడే!

* * *

## 6. పరమయోగి విలాసము (ద్విపదకావ్యం)

**– తాళ్ళపాక తిరువేంగళనాథుడు (చిన్నన్న)**

తాళ్ళపాక తిరువేంగళనాథుడు (చిన్నన్న) క్రీ.శ. 1490–1561 విష్ణుభక్తులయిన పన్నిద్దరాళ్వారుల, నాథముని, యమునాచార్యుల, రామానుజాచార్యుల దివ్యజీవిత చరిత్రలను 'పరమయోగివిలాసము' అను పేరుతో రచించి దివ్యదంపతులగు అలమేలుమంగా వేంకటనాథులకు అంకితమిచ్చినాడు. పరమయోగి విలాసము ఎనిమిది ఆశ్వాసముల ద్విపదకావ్యము.

చిన్నన్న ఒక కావ్యమును రచించుటకు తలపోయుచున్న సమయమున

**"కలలోన వైష్ణవా కారంబు దాల్చి**
**యేతెంచి శ్రీ వేంకటేశుండు తనదు**
**చేతఁ దానారగించిన ప్రసాదంబు**
**గృపచేసి పరమయోగి విలాస మనఁగ**
**నిపుడు కాసార యోగీంద్రాది కథలు**
**జానుగ సిరికిని సపరివారుండ**
**నైనట్టి తనకు నీ వంకితంబుగను**
**బనుపడ ద్రవిడ ప్రబంధంబు చూచి**
**తెనుఁగున రచియింపు ద్విపద రూపమున"**

**–1 ఆ–62–70 పంక్తులు**

అని వేంకటేశ్వరుడు కోరినాడు. చిన్నన్న మేలుకొని



**"శ్రీయలమేల్మంగఁ జిరకృపాపాంగఁ**
**దోయజదళనేత్రిఁ దోయధిపుత్రి** **ఆ–1, 1–3 పంక్తులు**
**శ్రీవేంకటేశ సంశ్రిత కుచదేశ" ను**

**...................................**

**"శ్రీ వేంకటాధీశుఁ జిరకృపావేశు**
**దేవాధి దేవు సందీప్త ప్రభావు"**ను **ఆ–1, 9–10 పంక్తులు**

దలచి కావ్యరచన ప్రారంభించినాడు. చిన్నన్న పరమయోగి విలాసమను ద్విపదకావ్యమును

**"అలమేలుమంగకు నమలాంతరంగ**
**కలినీల వేణికి నబ్జపాణికిని**
**అతిలోకమతికి శేషాచలరాజ**
**పతికి సరోముఖ్య భక్త సంతతికిఁ**
**గనక చేలునకు శృంగారలోలునకు**
**వినమితేశునకు శ్రీవేంకటేశునకు**
**నంకితంబుగ"......**రచించినాడు. **ఆ–1, 97–103 పంక్తులు**

ద్రావిడ వైష్ణవ గురుపరంపర చరిత్రను, వారి ప్రభావమును విపులముగ వర్ణించిన మొట్టమొదటి కావ్యము పరమయోగివిలాసము. చిన్నన్న ఈ కావ్యమున ఆళ్వారుల, ఆచార్యుల జీవిత విశేషములతోబాటు వారివారి రచనలను సందేశములను, సందర్భానుసారముగ వారిరచనలకు అనువాదాలను రచించినాడు. ఇట్లు పరమయోగివిలాసము వైష్ణవమత ప్రచారక గ్రంథముగ, పాడుకొనుటకు అనుకూలమగు దేశి ఛందమగు ద్విపదలలో రచింపబడింది.

ద్వాదశ ఆళ్వారుల చరిత్రలు కులగోత్రములకు కాక విష్ణుభక్తికే ప్రాధాన్యతను ఇచ్చుచున్నవి. భగవంతుని భక్తికి, గురుభక్తికి నమ్మాళ్వారుల, మధురకవి యాళ్వారుల జీవితములు ఉదాహరణములుగా ఉన్నవి.

కులశేఖరాళ్వారు 'పెరుమాళ్ తిరుమొళి' అను ద్రావిడ ప్రబంధమునే గాక సుప్రసిద్ధమైన 'ముకుందమాల'యను దివ్యస్తోత్రమును సంస్కృతభాషలో రచించినాడు. చిన్నన్న ద్రావిడ ప్రబంధ విషయమునే ప్రశంసించినాడు కాని కులశేఖరుల చరిత్రలో ముకుందమాలను గూర్చి వ్రాయలేదు. ఒక్కమాట చెప్పలేదు.

చిన్నన్న పరమయోగి విలాసములో వేంకటేశ్వరస్వామి వర్ణనము పాదములతో ప్రారంభించి ఆరోహణక్రమమున కిరీట వర్ణనతో పూర్తిచేశాడు.

**"బంగారు గజ్జెలు బసిఁడి యందియలుఁ**
**జెంగావి చాయ మించిన పైడివలువ**
**మొగపుల మొలనూలు ముత్యాలకుచ్చు**
**బిగిసి చూపట్టు ముప్పిడి కటారంబుఁ**
**గటి సంఘటించిన కరపల్లవంబుఁ**
**బటువరంబుల నిచ్చు పాణి పద్మంబు**
**వలమురి నెఱవాడి వలయపుఁ గత్తి**
**బలిసి చూపట్టెడు పాణియుగ్మమును**
**బొడ్డు మానికము కెంపుల బిటారించు**
**నొడ్డాణమును మించు నుదరబంధంబు**
**భుజకీర్తులును బాహుపురులు తాయతులు**
**భుజగ భూషల తట్టు పుణుగు మైపూఁత**
**యక్కున నెలకొన్న యలమేలుమంగ**
**యక్కజంబగు వైజయంతి సరంబు**
**దారహారములుఁ బుత్తడి జన్నిదములుఁ**
**జారుమౌక్తిక కంఠసరముఁ బేరురముఁ**
**గంబు కంధరమును గౌస్తుభమణియు**
**బింబాధరంబు నొప్పెడి కపోలముల**



**మందస్మితంబును మకర కుండలము**
**లిందుబింబము హసియించు నెమ్మోముఁ**
**దెలిదమ్మి కన్నులుఁ దిలనాసికంబు**
**వెలిమించు నాణిముత్తియపునామంబుఁ**
**గనక పిప్పల దళ కలితపట్టంబు**
**ననుపమ మణిమయంబగు కిరీటంబు**
**గలుగు శ్రీ వేంకటగ్రావాధినాథు"** ని **ఆ-2, 1835-1859** పంక్తులు పాదాది కిరీటమువరకు గల దివ్య సౌందర్యమును, భూషణాదులను సహజసుందరముగా వర్ణించాడు చిన్నన్న.

తిరుమంగయాళ్వారు వేంకటాచలమునకు తీర్థయాత్రగా వచ్చి "శ్రీనివాసుని కరణిఁ జూపట్టు" శేషాద్రి నధిరోహించుటకు సందేహించి, మూడు దినములు అలిపిరి వద్దనేయుండగా శేషాచలేశ్వరుడు ఆళ్వారుకు పొడకట్టినాడు. ఆ దివ్య స్వరూపమును చిన్నన్న ఇట్లు వర్ణించాడు.

**"కనకాంఘ్రి కింకిణీ కనక జాలుండు**
**ఘనతరోజ్జ్వల దివ్య కనక చేలుండు**
**ధృత రత్నఝల్లరీ దీపిత హేతి**
**తత చిత్ర మేఖలా ధామాళి ధారి**
**వరదాన కటిదేశ వర్ణిత కరుఁడు**
**కరపల్లవాగ్ర సంగత చక్రధరుఁడు**
**హారకేయూర భూషాది ధరుండు**
**చారుమౌక్తిక కంఠ సరసకంధరుఁడు**
**తులసికా దామ కౌస్తుభ విభాసితుఁడు**
**వలిత విగ్రహుఁడు శ్రీవత్సలాంఛనుఁడు**
**ఘటితాలమేలుమంగా వక్షతలుఁడు**
**కుటిల నీలాయత కుంతలోజ్జ్వలుఁడు**

**సరసిజపత్ర విశాల లోచనుఁడు**
**నిరుపమ సాంకవనీర సేచనుఁడు**
**వరదరస్మిత శోభి వదన మండలుఁడు**
**మరకత మాణిక్య మకర కుండలుఁడు**
**ధారిత రత్న చిత్రకలలాటుండు**
**నీరజమిత్ర సన్నిభ కిరీటుండు**
**నగునట్టి శ్రీ వేంకటాద్రి నాయకుఁడు"**

**- ఆ.7,-10,143-10,161 పంక్తులు**

వైష్ణవ మత ప్రచారమునకు, దాని సుస్థిరతకు కృషిచేసిన ఆచార్యులలో రామానుజాచార్యులు ప్రముఖుడు. విశిష్టాద్వైత ప్రవక్త అయిన రామానుజాచార్యులు తిరుమల యాత్రచేసి వేంకటేశ్వరులను దర్శించి, ఆలయపరిపాలనను కట్టు దిట్టము చేసినాడు. రామానుజాచార్యులు సంప్రదాయానుగుణముగ స్వామిపుష్కరిణిలో స్నానము చేసి

**"భూనళినాక్షి సొంపున గౌఁగిలించి**
**ఫణిరాజుపై నొక్క పదమూది దివ్య**
**మణిమయ భూషణ మండితుండగుచు**
**దైవారు పుడమి పైదలి మోముదమ్మి**
**తావులు గ్రోలెడు ధరణీవరాహు"ను**

మొట్టమొదట సేవించినాడు. పిమ్మట వేంకటేశ్వరాలయంలో ప్రవేశించి,

**"పసిఁడి, గజ్జలు నందియల్ కనకాంబరంబు**
**గొజ్జంగి ముత్యాల కుచ్చు కటారి**
**బెడఁగుగా గటిమీఁద బెరసినకేల**
**నుడుగక వరముల నొసఁగు కెంగేలు**
**నుదరబంధంబు కేయూరహారములు**



**చొదవు తావుల తట్టు పునుఁగు మైపూత**
**కుడిరొమ్ము మచ్చ యక్కున నెలకొన్న**
**కడలి కన్నియ దివ్యకంఠసరంబు**
**ధళధళ దుళగించు దరము, చక్రంబు**
**బలసి చూపట్టెడు పాణి పద్మములు**
**బింబాధరమ్ము నొప్పెడు కపోలములు**
**కంబు పోతంబు నెక్కసమాడు గళము**
**మకరకుండలములు మణి కిరీటంబు**
**వికసిత ధవళారవింద నేత్రములు**
**చల్లని చూపును జారునాసికయు**
**దెల్లని మెరుఁగు ముత్తియపు నామమును**
**గలిగి యెంతయును శృంగార భావంబు**
**మలయు నయ్యలమేలుమంగా మనోజ్ఞు"ని**

**- ఆ-8,-12483-12500 పంక్తులు**

సేవించినాడు. ఇట్లు చిన్నన్న అలమేలుమంగావిభుని దివ్యశరీర సౌందర్యమును పలుతావుల వర్ణించి, ధన్యుడైనాడు.

తిరువేంగళప్పకు సమకాలికుడగు సిద్ధరాజు తిమ్మరాజు పరమయోగి విలాసమును అయిదు ఆశ్వాసముల పద్యకావ్యముగ రచించి మంగళగిరి నృసింహస్వామికి అంకితము చేసినాడు.

* * *

## 7. ఆంధ్రామరుకము (అనువాద శతకము) - తాళ్ళపాక తిరువేంగళప్ప

సంస్కృతభాషలో శృంగార రసమయ శతకమయిన అమరుకమును తాళ్ళపాక తిరువేంగళప్ప (చిన తిరుమలాచార్యుని కుమారుడు, పెదతిరుమ లాచార్యుల మనుమడు) ఆంధ్రీకరించి శృంగార రసాధిపతి అయిన

వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు. శతకాంతమునందలి పద్యము ఈ విషయమును తెలుపుచున్నది.

**"క్షితిపై నా చంద్రార్క**
**స్థితి మించగఁ దాళ్ళపాక తిరువేంగళదీ**
**క్షితుఁ డమరుకమున్ వేంకట**
**పతికి సమర్పణము గాఁగఁ బరువడిఁ జేసెన్॥"**

ఈ తిరువేంగళప్ప కావ్యప్రకాశకకు వ్యాఖ్యానమును, నామలింగాను శాసనమునకు (అమరమునకు) తెలుగు వ్యాఖ్యను రచించినాడు.

**'అమర కవే రేకః శ్లోకః ప్రబంధ శతాయతే'** (అమరుక శతకము నందలి ఒక శ్లోకము నూరు ప్రబంధముల పెట్టు) అని ప్రాచీనులు ప్రశంసించినారు. ఇందలి శ్లోకములను అలంకార శాస్త్రకారులు ధ్వని విభాగములకు లక్ష్యములుగ ఉదాహరించియున్నారు. అమరుకమునకు తెలుగులో చాలా అనువాదములున్నవి. వాటిలో తిరువేంగళప్ప అనువాదము ప్రాచీనమైనది. అనువాదము మూలానుగుణముగ రమణీయముగా ఉన్నది.

సంస్కృత అమరు శతకమున 101 శ్లోకములు ఉన్నవి. కాని తిరువెంగళప్ప రచించిన, లభ్యమైన, ముద్రించబడిన ఆంధ్రామరు శతకములో 90 శ్లోకములకు అనువాదమే గలదు. వీటితో కృత్యాద్యంత పద్యములతో కలిసి మొత్తం 94 పద్యములు ఆంధ్రామరుశతకమున గలవు.

సంస్కృత అమరు శతకము రమణీయ శృంగార రసమయము. అందువలన తిరువేంగళప్ప శృంగార రసాధిదేవతయగు వేంకటేశ్వరుని కృతిపతినిచేసి శతకారంభమున ఇట్లు ప్రార్థించినాడు.

**"శ్రీరుచిరాంగనాశ్రయ విచిత్ర విభూషణ సూన చందనో**
**దార విలాస దీపితము నై యసితోత్పల కాంతి మించి శృం**



**గారరసంబు దోచెననఁ గన్నుల పండువ యైన మేని యొ**
**య్యారముఁ జూపు వేంకటనగాధిపుఁ డీవుత మాకుఁ గోరికల్॥"**

ఆంధ్రామరుశతకమున మూలశ్లోకములకు అనువాదము మాత్రమేగాక పాఠకులకు ఉపకారకముగ ప్రతిపద్యమునకు వ్యాఖ్యాన ప్రాయమగు లఘువివరణమును తిరువేంగళప్ప చేర్చినాడు. ఈ లఘు వివరణము జానుతెనుగులో సరళమైన శైలిలో వ్యావహారిక భాషలో రచింపబడింది.

తిరువేంగళప్ప మూల గ్రంథమున ఒక క్రమములేక కలగాపులగముగా వర్ణింపబడిన విషయములను యథాశక్తి శ్లోకములను విషయభాగముగ సమకూర్చి యొక క్రమపద్ధతిలో అనువాదము చేసినాడు.

శతకాంతము ఇట్లున్నది–

నాయికా పాదతాడితుడైన నాయకుడు మదన దేవునకు ప్రియుడని కవీశ్వరుడు (అమరుడు) మంగళాచరణము చేస్తున్నాడు.

**శ్లో॥ సాలక్తకేన నవపల్లవ కోమలేన**
**పాదేన నూపురవతా మదలాలసేన,**
**యస్తాడ్యతే దయితయా ప్రణయాపరాధా**
**ద్సంగీకృతో భగవతా మకర ధ్వజేన॥ 101**

ఈ శ్లోకమును తిరువేంగళప్ప ఇట్లు అనువదించాడు–

**యావరసార్ద్రమున్ గిసలయారుణ కోమలమున్ వినూత్నర**
**త్నావళి నూపురంబును మదాలసభావమునే పదంబుచే**
**నేవరపూరుషుండు ప్రణయేర్ష్యఁ బ్రియాంగన చేతఁదాడితుం**
**డైవిలసిల్లు వాఁడు కుసుమాయుధ దేవునకుం బ్రియుండగున్॥ 91**

* * *

## 8. శకుంతలాపరిణయము - రేవణూరి వేంకటార్యుడు

తాళ్ళపాక అన్నమాచార్యుల దేహిత్రుడు, తిరుమలాంబ, కొండయార్యుల పుత్రుడు అగు రేవణూరి వేంకటార్యుడు 'శకుంతలా పరిణయము' అను మూడు ఆశ్వాసముల శృంగార ప్రబంధమును రచించి శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చినాడు.

రేవణూరి వేంకటాచార్యుని ఒక ప్రభువు శకుంతలా పరిణయమును రచియించి తనకు అంకితము చేయుమని కోరియుండెను. వేంకటార్యుడు అందులకు అంగీకరించి శకుంతలా పరిణయమును రచించినాడు. అయితే కృతిపతియగు ప్రభువు (ఇంద్రకీలాద్రి యందున్న మల్లేశ్వరస్వామి భక్తుడు) ఈ కావ్యమును పరిగ్రహింపకుండ ఒక కరణము విఘ్నము కలుగజేసినాడు. అందుపై వేంకటాచార్యుడు శకుంతలా పరిణయమును వేంకటరమణునకు అంకితము చేసినాడు. ఈ విషయమును వేంకటార్యుడే కావ్యావతారికలో చెప్పినాడు.

కశ్చిత్ ప్రభువు వేంకటాచార్యుని ఇట్లు పొగడినాడు. "....నీవు శ్రీనివాసుని యలమేలుమంగకృప చొక్కిన దిక్కవివాంధ్రభూమి రాడ్వినుత సభాస్థలీవన నవీన పికంబవు కాకలీకృతిన్॥......నిశ్శంక బిరుదాంక సంకల్పంబుతో నెంచి సంకీర్తనాచార్య దౌహిత్ర సంప్రదాయంబునగు మత్సంప్రదాయంబునకు సకల ఖల నరాధిపాధమ గుణగణ స్తోత్రంబపవిత్రం బగుట యధార్థమని తలంచి.....శ్రీ వేంకట రమణునకు....సమర్పణంబుగా సమర్పించెద."

**శకుంతలా పరిణయములోని గద్య ఇట్లున్నది-**

"ఇది శ్రీమత్తిరువేంగళనాథ శ్రీపాదరేణుప్రభావ కావ్యకల్పన నంద పురార్యవృత్తి ప్రవీణ, రేవణూరి వంశ పయంపాథోధి సుధాధామ రామచంద్రోపాఖ్యాన ప్రబంధ సంధాన విద్వత్ప్రచండ తిరుమలకొండయాభిధ



బుధాగ్రణితనూభవ, భూభుజాస్థాన నిరాతంకచర్య వేంకటార్య ప్రణీతంబైన శకుంతలా పరిణయంబను మహాప్రబంధంబు." ఇది అముద్రితం. R.No:140 GOMS Library Chennai.

శకుంతలా పరిణయము అముద్రితము. వేంకటాచార్యుని తండ్రి కొండయార్యుడు రామచంద్రోపాఖ్యానమను కావ్యమును రచించినాడు. ఇది అలభ్యము.

శకుంతలాపరిణయ కావ్యారంభము ఇట్లున్నది-

**శ్రీలక్ష్మీపతి నూత్నకేళి స్వకుచాద్రి ద్వంద్వమున్ భర్తృదం**
**భోళిత్వాంచిత పాణికై పొదువఁ గర్పూరాజ కృల్లేపనో**
**ద్వేలవ్యాజిత చిత్రపత్రపటు పంక్తిన్ మేలు గల్పించు నా**
**శ్రీలక్ష్మీరమణీ విభుండు నను సుశ్రీయుక్తుగాఁ జేయుతన్॥**

**పరఁగన్ భారత కల్పనా పరులు శబ్దస్ఫూర్తి సంధింప ని**
**ర్భర వృత్తిన్ పరమేశ పోతనలలంకారముం గూర్పఁజూ**
**పరులైనట్టి పితామహాదులు నుతుల్ పాటింప నర్తించు నీ**
**సరసాంధ్రోక్తివధూటి కేను సుమనస్సంపూర్తి గావించెదన్॥**

అని ప్రతిజ్ఞ చేసినాడు. పిదప స్వవిషయమును కొద్దిగా వివరించి శ్రీ వేంకటాచలపతికి అంకితముగా షష్ఠ్యంతములను రచించినాడు.

**స్థిరమతి నంకితం బొనరఁజేసి విభాసిల నమ్మహాకవీ**
**శ్వరుఁడు రస ప్రబంధపదశయ్యల నుయ్యేలలూపి నెయ్యపున్**
**గరగరఁ జెప్పఁబూనిన జగద్ధితకాంతలసచ్ఛకుంతలా**
**పరిణయ నవ్యకావ్య పరిపాక కథాక్రమ మెట్టులన్నచోన్॥**

అని కథ ప్రారంభించినాడు.

కృతిగైకొన నిరాకరించిన ప్రభువును వేంకటాచార్యుడు కశ్చిత్ప్రభుండని చెప్పెనే కాని పేరు చెప్పలేదు. ఉదారాశయులైన సజ్జనులు తమకు అపకారం చేసినవారి పేరును వెల్లడించుటకు ఇష్టపడరు గదా! ఆ ప్రభువు ఇంద్రకీలాద్రి మీదనున్న మల్లేశ్వరుని భక్తుడని మాత్రము వెల్లడించినాడు.

రేవణూరి వేంకటాచార్యుడు శకుంతలాపరిణయ కృత్యాదియందు పదకవితా పితామహుడు సంకీర్తనాచార్యుడు అయిన తాళ్ళపాక అన్నమాచార్యుల గురించి, ఆతని పుత్రపౌత్రులగూర్చి మరియు నమ్మహా దేవుండు మదీయ మాతామహ వంశశిఖారత్నంబగు నన్నమాచార్యునకు జామాతరుండనిపించు కొని భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించె. దత్తనూజుండగు పెద్దతిరుమలాచార్య బిడౌజునకున్ ద్రిపురుష పర్యంతంబుగా బ్రత్యక్షంబును సప్తపురుష పర్యంతంబుగా మోక్షంబు నొసంగెదనని వరమిచ్చె.

సచ్చరిత్రులగు తదీయపౌత్రులకు జిన తిరుమల దీక్షితాన్నయాచార్య తిరువేంగళనాథ కోనేటి తిరువెంగళనాథ వెంగళాచార్యులకు విచిత్ర ముక్తాత పత్రరత్న కదాట ముద్రికా ప్రచండ మణిమండిత మకర కుండలోత్కరాహః కరదీపికా ప్రపాదుకాది బహూకరణంబుల గరుణించె. విశేషించియు నత్తిరువెంగళనాథుండు సంకీర్తనంబు బాడిన నాడదొడంగె" అని వర్ణించి యున్నాడు.

రేవణూరి వేంకటాచార్యుడు శకుంతలా పరిణయకావ్యమునకు ముందు 'శ్రీపాదరేణుప్రభావము' అను కావ్యమును రచించి తిరుమల వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చినాడు. వేంకటాచార్యుడు శకుంతలా పరిణయమున ఆంధ్రమహాభారతమందలి శకుంతలోపాఖ్యానమందలి కథను అనుసరించి-నాడు.

* * *



### 9. లక్ష్మీవేంకటేశ్వర సీసపద్య శతకము - తాళ్ళపాక శ్రీనివాసులు

తాళ్ళపాక వంశీయుడొకడు శ్రీనివాసుడు అను కవి

**'కమల వసుధేశ! సర్వయుగాధిపేశ!**
**విమల శశికోటి సంకాశ! వేంకటేశ!'**

అను మకుటముతో సీస పద్యశతకమును రచించి, శ్రీవేంకటేశ్వరునికి అంకితమిచ్చినాడు. ఇది అముద్రితం. ఈ శతకం వ్రాతప్రతి తాళ్ళపాక శేషాచార్యులు (తిరుపతి) జయంతి రామయ్యపంతులకు ఇచ్చినాడు. నేడు ఈ శతకం కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు గ్రంథాలయంలో ఉన్నది. (సంఖ్య: 3998) ఈ శతకంలో ఛందో వ్యాకరణదోషాలు ఉన్నట్లు శతకకవుల చరిత్రకారుడు వంగూరి సుబ్బారావు తెలిపినాడు.

* * *

## 4.3.3. తాళ్ళపాకవారి వేంకటేశ్వరాత్మక కావ్యములు

భగవంతుని సాక్షాత్కరించు కొనుటకు, భగవదనుగ్రహము పొందుటకుగల నవవిధ భక్తి మార్గములలో సులభమైనది. సొగసైనది, ఆహ్లాదకరమైనది సంకీర్తన. తాళ్ళపాక అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామికి అనన్యభక్తుడై స్వామివారి మహిమలను లీలలును నోరార సంకీర్తనచేసి కృతార్థుడైనాడు.

భగవంతుని సన్నిధి చేరుటకు సంకీర్తన చక్కని మార్గమని భాగవతుల విశ్వాసము. సంగీత కృతులతో మనస్సు కరుగునట్లు యజ్ఞయాగాది క్రతువులచే తన మనస్సు కరుగదని విష్ణుదేవుడే నారదమునితో చెప్పినట్లు హరిభట్టు తన మత్స్యపురాణంలో ఇట్లు ఉట్టంకించినాడు-

**సంగీతామృత ధారల**
**నంగీకృతమైన యట్లు యజ్ఞాదులచే**

**తంగరుగదు సంతోష త**
**రంగితమై మన్మనంబు రమ్యచరిత్రా॥ - 5-110**

విష్ణుభగవానుడు సంకీర్తన విశిష్టతను గూర్చి ఇట్లు చెప్పినాడు.

**జననుత సామవేదమున సంభవమయ్యెను గానవిద్య త**
**జ్జనితములైన రాగములు చక్కఁగఁగూర్చి మదీయ సద్గుణా**
**భినవములైన గీతములు ప్రేమ దలిర్పఁగఁ బాడ నేర్చుస**
**జ్జనుఁడు మదీయుఁడాతనికిఁ జక్కన యిత్తును వాంఛితార్థముల్॥**
**-మత్స్యపురాణం, 5-11**

తన (భగవంతుని) కల్యాణగుణములను సంకీర్తన చేసిన భక్తుడు నావాడు. కనుక అతని మనోభీష్టములను తప్పక తీర్చెదనని విష్ణుదేవుడు నారదునితో చెప్పినాడు.

**శ్లో॥ ధ్యాయన్ కృతే, యజన్ యజ్ఞైః**
**త్రేతాయాం ద్వాపరేఽర్చయన్।**
**యదాప్నోతి, తదాప్నోతి**
**కలౌ సంకీర్త్య కేశవమ్॥ -విష్ణుపురాణం, 6-2-17**

అని విష్ణుపురాణము కలియుగములో సంకీర్తనయొక్క విశిష్టతను వెల్లడించింది.

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణగుణములను మహిమలను కీర్తించిన తాళ్ళపాక అన్నమాచార్యులు, అతని కుమారుడు మనుమలు పొందిన వాంఛితార్థములను గూర్చి అన్నమాచార్యుల దౌహిత్రుడు రేవణూరి వేంకటాచార్యుడు శకుంతలా పరిణయ ప్రబంధములోని అవతారికలో వివరించినాడు. చూడు ఈ గ్రంథము పుట:267



**సంకీర్తన బహుపాప వి**
**శంకట చిత్తులకు నైన సర్వేశ్వరుపై**
**సంకీర్తనములు పాడిన**
**శంకాతంకములు వలదు శమనుని వలనన్॥ - 10 పద్యం**

అని తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు (అన్నమాచార్యుల మనుమడు, పెదతిరుమలాచార్యుల పెద్దకుమారుడు) సంకీర్తన లక్షణగ్రంథమున భగవంతుని సంకీర్తించుటవలన లభించు ఫలమును వివరించినాడు.

శ్రీవేంకటేశ్వర సాహిత్య సంపదలో సంకీర్తన సాహిత్యము ప్రధాన భాగముగ ఉన్నది. ఈ సంకీర్తన సాహిత్యము ఇతర సాహిత్య ప్రక్రియలకంటె రాశియందును వాసియందును ప్రశస్తముగ ఉన్నది. ఈ సంకీర్తన వాఙ్మయకర్తలలో తాళ్ళపాక కవులు అగ్రగణ్యులు.

తాళ్ళపాక అన్నమాచార్యులు 32,000 సంకీర్తనలను రచించినాడు. దురదృష్టవశాత్తు మనకు 13,719 కీర్తనలు మాత్రమే లభించినవి. శ్రీవైష్ణవులు దేవాలయాలలో పాడే నాలాయిర దివ్యప్రబంధము (తమిళము) పన్నిద్దరాళ్వారులు రచించిన, పాడిన 4000 పాశురముల సంకలన గ్రంథము. ద్రవిడ వేదమని కీర్తింపబడుచున్న నాలాయిర దివ్యప్రబంధమునకు ప్రతిగా తెలుగులో సంకీర్తనాచార్యుడు, పదకవితా పితామహుడు అయిన తాళ్ళపాక అన్నమాచార్యులు వేంకటేశ్వరాంకితములుగ, వేంకటేశ్వర ముద్రతో వేలకొలది సంకీర్తనలను రచించినాడు. సంకీర్తనములకే 'పదము' లను నామాంతరము గలదు. అన్నమాచార్యులు సంకీర్తన లక్షణమును సంస్కృతములో రచించినాడు. ఇది అలభ్యము. అయితే అన్నమాచార్యుల మనుమడు చినతిరుమలాచార్యులు అనువదించిన సంకీర్తన లక్షణము (తెలుగు) లభించినది. దీనిని 1935లో "తాళ్ళపాకవారి లఘుకృతులు" అను సంకలన గ్రంథములో తి.తి.దేవస్థానంవారు ముద్రించినారు.

అన్నమాచార్యుల సంకీర్తన పల్లవి, అనుపల్లవి, చరణములు కల్గి ఉంటుంది. యతిప్రాసల నియమము ఉంది. పల్లవి సుబోధకంగా చోదనరూపంలో ఉంటుంది. పల్లవిలోని అభిప్రాయమే అనుపల్లవిలోను, చరణములలోను విస్తరించబడి ఉంటుంది. పల్లవియొక్క ఆవృత్తితో చరణములలోని భావాలు, వాక్యాలు సంపూర్ణమవుతుంటాయి. వేంకటేశ్వర ముద్రతో సంకీర్తన సంపూర్ణమవుతుంది.

క్రీ.శ. 15 శతాబ్ది ప్రారంభమున తాళ్ళపాక అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వరభక్తిని, వేంకటేశ్వర తత్త్వమును, విశిష్టాద్వైతమతమును ప్రచారము చేయుటకై సంకీర్తనలు రచించి గానం చేసినాడు. తరించినాడు. అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలాచార్యులు 1,013 సంకీర్తనలను రచించాడు. వీరిని అనుసరించి పెదతిరుమలాచార్యుల పెద్ద కుమారుడు చినతిరుమలాచార్యులు 179 వేంకటేశ్వరాంకితముగ సంకీర్తనలు రచించాడు. మనకు లభించిన మొత్తము సంకీర్తనలు 14,911. (13, 719+1, 013+ 179) పెదతిరుమలాచార్యులు అన్నమయ్య సంకీర్తనలను రాగిరేకులపై చెక్కించినాడు. తిరుమల దేవాలయమున 'సంకీర్తన భాండారము'ను ఏర్పరచి సంకీర్తనలను భద్రపరచినాడు. తర్వాత పెదతిరుమలాచార్యుల సంకీర్తనలు, చినతిరుమలాచార్యుల సంకీర్తనలు, ఇతర రచనలు రాగిరేకులపై చెక్కబడి సంకీర్తన భాండారమున భద్రపరచ బడినవి. నిత్యము వేంకటేశ్వరస్వామికి జరిగే సేవలలో అన్నమాచార్య సంకీర్తనలను గానం చేసేవారు.

## 1. అన్నమాచార్యుల సంకీర్తనలు

తాళ్ళపాక అన్నమాచార్యులు వేంకటేశ్వరాంకితములుగ, వేంకటేశ్వర ముద్రతో 32000 సంకీర్తనలు రచించినాడు. ఇవి వస్తువిభేదము ననుసరించి రెండు విధములుగ ఉన్నవి. శృంగార భావానుబంధియగు సంకీర్తనలు



శృంగార సంకీర్తనలు. వైరాగ్య హేతువులగు సంకీర్తనలు ఆధ్యాత్మిక సంకీర్తనలు. అన్నమాచార్యులే వీటి లక్షణములను ఇట్లు వివరించాడు–

**పదములు శృంగార వధూ**
**మృదుమధుర మనోజ్ఞవాక్యమిశ్రములైనన్**
**విదితార్థ గ్రామ్యోక్తులు**
**పదిలముగాఁ బొంకమెరిగి పలుకగఁ జెల్లున్॥**

**– సంకీర్తన లక్షణము–56 పద్యం**

దూతి, నాయకానాయిక, సపత్నీ వ్యవహారములతో కూడి విభావానుభావ సంచారి భావములతో నిండిన సంయోగ, వియోగశృంగార వర్ణనలుగల కీర్తనలు శృంగార సంకీర్తనలు. ఇవి నాయిక యొక్క మృదు మధుర మనోహర వాక్యములతో కూడియున్నచో సమర్థమైన, సముచితమైన గ్రామ్యవాక్యములు చేర్చి స్పష్టముగా పలుకవచ్చును.

**దేహాత్మేశ వివేకో**
**త్సాహంబును లోకవేద ధర్మాధర్మా**
**ద్యూహాపోహంబుల గల**
**యా హరిసంకీర్తనంబు లధ్యాత్మంబుల్॥**

**– సంకీర్తనలక్షణము, 61 పద్యం**

దేహము, ఆత్మ, పరమాత్మలకు సంబంధించి లోకమునందు, వేదములందు కనిపించెడి ధర్మాధర్మముల బలాబలములను వర్ణించు కీర్తనలు ఆధ్యాత్మ సంకీర్తనలు.

అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు ఆపాత మధురమగు విషయ సుఖమును కలిగించును. ఆధ్యాత్మిక కీర్తనలు విషయ సుఖములయొక్క అనిత్యతను దెలిపి ఆత్మానాత్మ వివేకమును గలిగించును.

## 1. అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

శృంగార రసమునకు రతి స్థాయిభావము. రతి స్త్రీ పురుషుల అన్యోన్యాలంబమైన 'ప్రేమ' అను మనోవ్యాపార విశేషము. విభావానుభావ సంచారి భావములచే పరిపుష్టమై, ఆస్వాద్యమైన స్థాయిభావము-రతి-శృంగార రసముగా పరిణమించును. శృంగార రసము రెండువిధములు. స్వాత్మానుభవరూపమైన శృంగారము ఒకటి. పరచేష్టా దర్శన, శ్రవణ రూపమైన శృంగారము ఒకటి. అన్నమయ్య సంకీర్తనలలోని శృంగారము పై రెండు విధములుగా ఉన్నది. ఒకవర్గం అన్నమయ్య తానే నాయిక స్త్రీ అయి భగవంతుని-వేంకటేశ్వరుని-నాయకునిగా (పురుషునిగా) భావించి సంభోగ విప్రలంభ శృంగారముల వివిధ భేదములను వర్ణించిన సంకీర్తనలు. అలమేల్మంగ వేంకటేశ్వరుల శృంగారలీలలను అన్నమయ్య దర్శించి వర్ణించిన కీర్తనలు మరొక వర్గము. ఇందులో మొదటి వర్గమునకు 'మధురభక్తి' అను పేరు గలదు. ఈ మధుర భక్తి పరమాత్మ దర్శనమును గల్గించి, మోక్షము సాధింపగల శృంగార విశేషమని దివ్యసూరులు (ఆళ్వారులు) బోధించారు. ఈ మధురభక్తి భక్తునికి భగవంతునితో ఏకత్వానుభూతిని ప్రసాదించును.

**"శృంగార ఏవ మధురః పరప్రహ్లాదనో రసః"** అని ఆనంద వర్ధనాచార్యులు శృంగార రసవిశిష్టతను కీర్తించాడు. మధురము, ఆనందజనకమగు శృంగారము ఆలంబనభేదమువలన లౌకికము, అలౌకికము అని రెండు విధములుగ ఉన్నది. కాంతా విషయికమగు రతి లౌకిక శృంగారము. భగవద్విషయమగు రతి అలౌకిక శృంగారము. దీనికే దివ్యశృంగారమని మరొక పేరు గలదు. అన్నమాచార్యులు తన శృంగార సంకీర్తనలలో అలౌకిక తత్త్వమునకే ప్రాధాన్యము ఇచ్చినాడు.

జయదేవుని గీతగోవిందము దివ్య శృంగారమును వర్ణించింది. దానిని అనుసరించియే వైష్ణవాలంకారికులగు రూపగోస్వామి 'ఉజ్జ్వల నీలమణి' యందు, మధుసూదన సరస్వతి **'భగవద్భక్తి రసాయనము'** నందు భక్తి



రసవిషయమై చర్చించుచు ప్రకృతిమార్గమునసాగు శృంగారముతోపాటు నివృత్తి రూపమగు భక్తి గూడ రసమేయని సిద్ధాంతము చేశారు. అన్నమాచార్యుల సంకీర్తనలు దివ్యశృంగార, భక్తి రసభరితములు.

శృంగార రసమునకు అధిదేవత విష్ణువు- వేంకటేశ్వరుడు. అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలలో వేంకటేశ్వరుడే నాయకుడు. అలమేల్మంగనాయిక. కొన్ని సంకీర్తనలలో అన్నమాచార్యులే నాయికయగును. విరహబాధ పొందును. ఆనందించును. జీవాత్మకూడ ఇట్లే పరమాత్ముని సంసర్గమునకై పరితపించి, పరవశమొందవలెనని సందేశము.

అన్నమయ్య దివ్య శృంగార సంకీర్తనకు ఒక ఉదాహరణము-

**పలుకు దేనెల తల్లి పవళించెను**
**కలికి తనముల విభుని గలసినదిగాన ॥పల్లవి॥**

**నిగనిగని మోముపై నెరులు గెలకుల జెదర**
**పగలైన దాక జెలి పవళించెను**
**తెగని పరిణతులతో దెల్లవారినదాక**
**జగదేకపతి మనసు జట్టిగొనెగాన ॥పలు॥**

**కొంగుజారిన మెరుగు గుబ్బలొలయగ దరుణి**
**బంగారు మేడపై బవళించెను**
**చెంగలువ కనుగొనల సింగారములు దొలక**
**నంగజగురుని తోడ నలసినది కాన ॥పలు॥**

**మురిపెంపు నటనతో ముత్యాల మలగుపై**
**పరవశంబున దరుణి పవళించెను**
**తిరువెంకటాచలాధిపుని కౌగిట గలసి**
**యరవిరై నునుజెమట నంటినది కాన ॥పలు॥**

**శృంగార సంకీర్తనలు, 6-74 (1998)**

ఇందు దివ్యదంపతుల–అలమేల్మంగా వేంకటేశ్వరుల–రత్యనంతర స్థితివర్ణన ద్వారా సంభోగ శృంగారము మనోహరముగ వ్యంజితమైనది. విశిష్టాద్వైతము జీవాత్మపరమాత్మలకు భేదమును–ద్వైతమును – అంగీకరించినను, సంభోగ సమయమున ఏకత్వానుభూతిని–అద్వైతమును– గుర్తించినది. అన్నమాచార్యులు విశిష్టాద్వైతి.

భగవంతుని సంభోగ శృంగారమును వ్యంజితము చేస్తూ అన్నమాచార్యులు వేంకటేశ్వరుని సుప్రభాతం పలికినాడు ఇట్లు–

**రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో**
**రీతిగాదు హరి నెచ్చరికె సేయరే ॥పల్లవి॥**

**పైపై బొద్దువొడచి పంకజములు విరిసె**
**గోప గోవిందుని మేలుకొనుమనరే**
**దీపములు దెల్లబారె తిమిరమింతయు జారె**
**శ్రీపురుషోత్తముని జేయంటి లెమ్మనరే ॥రాతి॥**

**కలువలు ముకుళించీ కలవింక లెలుగించీ**
**నెలతలు దేవదేవు నిద్ర దెల్పరే**
**జలనిధి పొంగణగె చాయల చుక్కలుమాసె**
**వలరాచగురు నుప్పవడము గమ్మనరే ॥రాతి॥**

**జీవులు మేలుకొనిరి చెంగలించె దరువులు**
**భావించి యచ్యుతు నిట్టె పలికించరే**
**కావిరింతయు విరిసె కదు సంధ్యకు బొద్దాయె**
**శ్రీవేంకటేశుని విచ్చేయుమనరే॥ ॥రాతి॥**

**– ఆధ్యాత్మ సంకీర్తనలు, 4–130 (1998)**

శృంగార రసము వస్తువునుబట్టి వియోగ, సంయోగ రూపమున రెండు విధములు. అన్నమాచార్యుల కీర్తనలందు శృంగార రసభేదములన్నింటికి



లక్ష్యములు గలవు. సామాన్యముగా విరహ వర్ణనలలో చంద్ర, మన్మథ, మలయానిలముల దూషణము ఉండును. కాని అన్నమాచార్యుల శృంగార పదములందు నాయిక నాయకుల సౌందర్యమును వర్ణింపబడుట విశిష్టత, ప్రత్యేకత. ఉదా॥

**కటకటా యిట్లాయగా పనులు చెలిపలుకు**
**కిటుకు గీరములు మును కిందు వడిగెలిచె ॥పల్లవి॥**

**ఇంతి ముఖచందురుడు నీ కుముద బాంధవుడు**
**నింత చలమున బోరి రిన్నాళ్లును**
**కాంతుడవు నీ వలుగగా జెలికి నీ విరహ**
**సంతాపములు రేచి జలజారి గెలిచె ॥కట॥**

**వనజాక్షిచూపులును వలరాజు తూపులును**
**యెనయకే జగడించె నిన్నాళ్లును**
**కినిసి నీవీ యతివ కెలన దిరుగగ విరుల**
**ననలె కదువాండ్లై నలుగడల గెలిచె ॥కట॥**

**లతలు పూలతావిలంచములు చెలిమేన**
**యితవుగా వడినొసగె నిన్నాళ్లును**
**సతి గెలిచె వేంకేటశ్వరుడ నీ కరుణ నిపుదు**
**ధృతి బూని జవరాలు తిరుగ దాగెలిచె ॥కట॥**

**– శృంగారసంకీర్తనలు, 5–36 (1998)**

అన్నమయ్య నాయిక సుందర స్వరూపమును మొదట వర్ణించలేదు. కాని విరహముకారణంగా కృశించిన నాయికను ఈ శృంగార సంకీర్తనలో మనోహరముగ వర్ణించినాడు. నాయిక చంద్రవదన అని తొలుత అన్నమయ్య వర్ణించలేదు. చంద్రునికి నాయిక ముఖమునకు పోటీయుండెనని ఇంతకాలము వేంకటేశ్వరుని (నాయకుని) అనురాగము పొందిన నాయికను చంద్రుడు

ఓడించలేకపోయెను. ఇప్పుడు నాయకునివలన గలిగిన విరహము కారణముగ నాయిక దైన్యమును పొందగా ఆమె ముఖము కళావిహీనము కాగా చంద్రుడుగెలిచెనని అన్నమాచార్యులు చమత్కరించినాడు. ఇట్లే నాయిక చూపులను, నాయిక శరీరమును అన్నమయ్య చమత్కారముగ వర్ణించినాడు. ఇది నాయికా విరహ వర్ణన.

అన్నమాచార్యులు నాయక విరహమును అలమేలుమంగవలన వేంకటేశ్వరుడు పొందిన విరహమును–మనోహరముగ, చమత్కారముగ వర్ణించినాడు.

**నిన్నుగూడిన విభుని నిలువెల్ల సొంపాయ**
**నిన్నియును నొనగూడె నింతలోపలనె ॥పల్లవి॥**

**సొలపు నీ కడగంటి చూపు హృదయముగాడి**
**లలినితడు శ్రీవత్సలాంఛనుండాయ**
**వెలదినిను బెడబాసి విరహంపు మెయికాక**
**వలన నీతడు నీలవర్ణుడైనాడు ॥నిన్ను॥**

**అదన నీ చనుగుబ్బలను చక్రములచేత**
**బదిలపరపుచు చక్రపాణియైనాడు**
**సుదతి నీ దేహమున సొబగు కుంకుమపూత**
**లెదిగి పీతాంబరం బీతనికి నాయ ॥నిన్ను॥**

**ఆలింగనాపేక్ష ననయంబు నినుగూడ**
**లోలుడటుగాన నాలుగు చేతులాయ**
**శ్రీలలిత మూర్తియగు శ్రీ వేంకటేశ్వరుడు**
**పాలించె నిను నీకు బరితోషమాయ॥ ॥నిన్ను॥**

**– శృంగార సంకీర్తనలు, 5-376 (1998)**



అన్నమయ్య మరొక శృంగార సంకీర్తనలో నాయిక సౌందర్యసంపదను విలక్షణముగా ఇట్లు వర్ణించినాడు.

**చెప్పరాదీ యింతి సిరులు–దీని**
**వొప్పు లిన్నియు జూడ వొరపులోకాని ॥పల్లవి॥**

**ముదిత జఘనము మీది మొలనూలి గంటలవి**
**కదలు రవమెట్లుండె గంటిరే చెలులు**
**మదనుడుండెడి హేమ మందిరము దిరిగిరా**
**గదిసి మ్రోసెడి పారిఘంటలో కాని ॥చెప్ప॥**

**కొమ్మ పయ్యెదలోని కుచమూలరుచి వెలికి**
**జిమ్ముటది యెట్లుండె జెప్పరే చెలులు**
**యిమ్మై మరుధనము లెల్ల రాసులు వోసి**
**కమ్ముకొని చెంగావి గప్పిరో కాని ॥చెప్ప॥**

**నెలత కంఠమునందు నీలమణిహారములు**
**అలరుటెట్లుండు కొనియాడరే చెలులు**
**లలితాంగి ప్రాణవల్లభుడు వేంకటవిభుడు**
**నెలకొన్న కౌగిటనె నిలిచెనో కాని ॥చెప్ప॥**

**– శృంగార సంకీర్తనలు, 5-259 (1998)**

వేంకటేశ్వరుడు శృంగారరాయడు. అతనిలో శృంగార రసధుని పరవళ్ళు తొక్కుతుంది. అప్పుడతడు బరితెగించి ప్రవర్తిస్తాడు. ఇది దోషము, నీచము అనే పట్టింపులుండవు. రతి తమకముతో సభ్యతా హద్దుమీరిన వేంకటేశ్వరుని పరకీయనాయిక ఇట్లు ప్రశ్నిస్తుంది–

**ఇన్నిటా దొరవు నీవు యింత సేతురా**
**చన్నులంటే విదె నీకు చలమాయగా ॥పల్లవి॥**

**చెరగుమాసిన వేళ చేరి ముట్ట వచ్చేవు**
**కొరతంటా వద్దంటే గోపగించేవు**
**మెరసీ తొల్లిటి దోసమె నే గురియ గాను**
**నెరినిది యిప్పుడే నీకు చాతాయగా ॥ఇన్ని॥**

**యింటనే భోంచేసే వేళ యెంగిలి ముట్ట వచ్చేవు**
**అంటకు మన్నంతలోనె అలిగేవు**
**వెంటనె నా నోట నుండి వేమారు జిందగాను**
**జంటల నీకదియును సరకాయగా ॥ఇన్ని॥**

**జలకమాడేటి వేళ సంగడికి వచ్చేవు**
**తొలగమంటే కౌగిలించి దొమ్మి సేసేవు**
**మలసి శ్రీ వేంకటేశ మలినము బాయగాను**
**తిలకించే వది నీకు దిష్టమాయగా॥ ॥ఇన్ని॥**

**- శృంగార సంకీర్తనలు, 11-262 (1998)**

అన్నమాచార్యుల ఈ సంకీర్తనను అనుసరించి, క్షేత్రయ్య **"చెరగుమాసి ఉన్నానని యోచన సేయవద్దురసామి! దొరయైన మువ్వగోపాల, పరసతులకు దోసమెన్నడు లేదురా"** అని పరకీయనాయిక మువ్వగోపాలునికి హితోపదేశం చేసినట్లు శృంగార పదమును రచించాడు.

శ్రీ వేంకటేశ్వరుని దివ్యస్వరూపమును సహజత్వముట్టిపడునట్లుగా ఇట్లు అన్నమయ్య వర్ణించాడు.

**వాడివో కంటి రటరే వన్నెలవాడు**
**పైడి మోలము కటారు పరజులవాడు ॥పల్లవి॥**

**పెద్ద కిరీటమువాడు పీతాంబరమువాడు**
**వొద్దిక గౌస్తుభమణి వురమువాడు**
**ముద్దుల మొగమువాడు ముత్తేల నామమువాడు**
**అద్దిగో శంఖచక్రాల హస్తాలవాడు ॥వాడి॥**

**అందిన కటి హస్తము నభయహస్తమువాడు**
**అందెల గజ్జల బాదాలమరువాడు**
**కుందనంపు మకరకుండలములవాడు**
**కందువ బాహుపురుల కడియాలవాడు ॥వాడి॥**

**నగవుజూపులవాడు నాభికమలమువాడు**
**మొగపుల మొలనూళ్ళ మొలవాడు**
**చిగురుమోవివాడు శ్రీ వేంకటేశుడు వాడు**
**తగునలమేలుమంగ తాళి మెడవాడు॥ ॥వాడి॥**

**- శృంగార సంకీర్తనలు, 7-116 (1998)**



వయస్సు తొందరించగ రతి తమకము హెచ్చిన ఒక నాయిక వేంకటేశ్వరునితో ఎన్ని విధముల సంభోగ సౌఖ్యము అనుభవించదలంచినదో అన్నమాచార్యులు ఇట్లు వర్ణించాడు.

**మదము దొలకెడి యట్టి మంచి వయసున మనకు**
**తుదలేని వేడుకలు దొరకుటెన్నడురా ॥పల్లవి॥**

**ఉదటు జనుదోయి నీవురముపై దనివార**
**నదిమి మోమును మోము నలమి యలమి**
**వదలైన నీవితో వాలుగన్నుల జంకె-**
**లొదవ నీ మీద నే నొరగుటెన్నడురా ॥మద॥**

**కలికితనమున నాదు కప్పురపు దమ్ములము**
**కులికి నీ వదనమున గుమ్మరించి**
**పలచనగు గోళ్ళ నీ పగడ వాతెర నొక్కి**
**చెలువమగు నునుగంటి సేయుటెన్నడురా ॥మద॥**

గరగరని కురులతో కస్తూరి వాసనలు
విరితావుల తోడ విసరగాను
తిరువేంకటాచలాధిపుడ నినుగూడి నే-
నరమరచి సదమదములౌట యెన్నడురా ॥మద॥

- శృంగార సంకీర్తనలు, 12-54 (1976)

స్తుతి వేళను రతి వేళను
అతి ప్రేమను రార పోరయన్నను నెగ్గల్
మతి దలప వలదు ప్రియమగు
చతురానన ముఖ్యరుద్ర శార్జ్ఞలకైనన్॥

అని, పై శృంగార సంకీర్తనలో నాయిక వేంకటేశ్వరుని రాకొట్టి పిలవడాన్ని ఒక శృంగారకవి గట్టిగా సమర్థించాడు.

చక్కదనంచేత, యౌవనభారంచేత అధికమైన విరహబాధపడుతున్న ఒక శృంగార నాయికస్థితిని ఆమె చెలులు వర్ణించిన తీరును అన్నమయ్య ఇట్లు వర్ణించాడు.

చక్కదనములచేత జవ్వన భారము చేత
యెక్కడౌటా గానదిక నేమి సేత మే ॥పల్లవి॥

ఒయ్యనె బంగారు తూగుటుయ్యాల మంచము మీద
పయ్యద చెరగు జార బవ్వళించి
ముయ్యక మూసిన రెప్పమూయుచు దెరచుగాని
నెయ్యమున జూడ నేరదేమి సేతమే ॥చక్క॥

ముత్తేల గద్దియమీద ముద్దుల కురులు దూల
నొత్తిలి యొకతె మీద నొరగుండి
చిత్తగించి చేతనున్న చెంగలువ బంతి జెక్కు-
లొత్తుగాని మాటలొల్లదేమి సేతమే ॥చక్క॥



కమ్మని తావులతోడ కన్నుల నవ్వులతోడ
చిమ్ము జెమటలతోడ జెలువొంది
కొమ్మకు నేడుగలిగె కోనేటిరాయని పొందు
నెమ్మనము దాచ నేరదేమి సేతమే ॥చక్క॥

- శృంగార సంకీర్తనలు, 12-68 (1976)

నాయిక చిగురుటధరము నాయకుడు ముద్దులు పెట్టుటచే ఏర్పడిన కస్తూరి ముద్రలతో ఆమె చెలికానికి వ్రాసిన ప్రేమలేఖవలె ఉన్నదని అన్నమాచార్యులు నాయికా నాయకుల-అలమేలుమంగా వేంకటేశుల శృంగారానుభవాన్ని విలక్షణంగా రసభరితంగా వర్ణించాడు.

## నాదరామక్రియ

ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁగస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా ॥పల్లవి॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొన చూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదు గదా ॥ఏమొ॥

పడఁతికి చనుఁగవ మెఱుఁగులు పైపైఁబయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ బ్రియుఁడొత్తిన నఖ శశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెల గాదు గదా ॥ఏమొ॥

ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁజెమటల అందము గాదు గదా ॥ఏమొ॥

- అన్నమయ్య శృంగార సంకీర్తనలు 5-82 (1998)

ఈ శృంగార సంకీర్తన విశిష్టతను గుర్తించి డా॥ వెల్చేరునారాయణ రావు, డా॥ డేవిడ్‌షుమన్‌లు"God On The Hill"(Temple Poems from Tirupati) అను గ్రంథములో ఇంగ్లీషులోకి అనువదించారు. (Oxford University Press, New Delhi, 2006) ఆ ఆంగ్లానువాదము ఇట్లున్నది–

## Her Friends Tease the Women in Love

These marks of black musk
on her lips
red as buds,
what are they
but letters of love
sent by our lady to her lord?

Her eyes the eyes of a cakora bird,
why are they red in the corners?

Think it over, my friends:
what is it but the blood
still staining the long glances
that pierced her beloved
after she drew them from his body
back to her eyes?

What are they but letters of love?

How is it that this woman's breasts
show so bright through her sari?

Can't you guess, my friends?
What are they but rays from the crescents



left by the nails of her lover
pressing her in his passion,

rays now luminous as the moonlight
of a summer night?

What are they but letters of love?

What are these graces, these pearls
raining down your cheeks?

Can't you imagine, friends?
what could they be but the beads of sweat
left on her lotus-face
by the Lord of the Hills
When he pressed hard,
frantic in love?

What are they but letters of love?

- Annamayya, 5-82 (1998)

ఇట్లు అన్నమాచార్యులు అలమేలుమంగ, వేంకటేశుల శృంగారానుభవము నందలి తమకమును అప్రతిమభావనాపటిమతో, శృంగార రసాభిజ్ఞతతో విలక్షణంగా, వైవిధ్యంగా, మనోహరముగా వర్ణించాడు.

శ్రీ వేంకటేశుని విచ్చలవిడి శృంగారానుభవమును వర్ణించిన శృంగార సంకీర్తన ఇట్లున్నది–

**ఆహిరి**

**లంజకాఁడవౌదువురా**
**లంజకాఁడవౌదువు నీ లాగులెల్లఁ గానవచ్చె**
**ముంజేతఁ బెట్టిన సొమ్ములకద్దమేలరా ॥పల్లవి॥**

కొంకక యెవ్వతో కాని కోరి నీ బుజము మీఁద
కంకణాల చేయి వేసి కౌఁగిలించఁ బోలును
వంకలైన వొత్తులెల్ల వడిఁ గానవచ్చె నింక
బొంక నేమిటికిరా నీ బూమెలెల్లఁ గంటిమి ॥లంజ॥

ఒద్దిక నెవ్వతో గాని వోరి నీవురము మీఁద
నిద్దిరించఁ గంటమాల నీలములొత్తినది
తిద్దిన జాణవుగాన తిరిగి తిరిగి మాతో
బద్దనేఁటికిరా నేఁబచ్చి సేయఁజాలను ॥లంజ॥

వేడుక నెవ్వతో తిరువేంకటేశ్వర నిన్ను
కూడిన నీమేనితావి కొల్లవట్టుకొన్నది
తోడనె నాకౌఁగిటిలో దొరకొంటి వింక నిన్ను-
నాడ నేమిటికిరా నా యలపెల్లఁ దీరెను ॥లంజ॥ 84

- అన్నమయ్య శృంగార సంకీర్తనలు 5-84 (1998)

ఈ సంకీర్తనలో ఇతర నాయికలతోడి సంభోగ చిహ్నములతో కనిపించిన వేంకటేశుని నాయిక లంజకాడ వౌదువురా అని నిలదీస్తున్నది. ముంజేతికి పెట్టిన సొమ్ములు చూచుటకు అద్దమేలరా? అని నిష్ఠురములాడుచున్నది. ఈ విశిష్టసంకీర్తనను డా॥ వెల్చేరునారాయణరావు, డా॥ డేవిడ్ షుమన్‌లు ఇంగ్లీషులోకి అనువదించారు. ("When God is a Customer", Oxford University Press, New Delhi, 1995.)

## A Woman to Her Lover

O you lover of whores:
I know your ways,
I can see them all.
Why do you need a mirror to see
the jewel on your wrist?

Some woman has tried to hug you hard
with her hand covered with bracelets
I can still see the print of their curves
on your shoulder. why tell me lies?
I know your tricks.

Your lover of whores, why do you need a mirror?

Some woman has comfortably slept
on your chest and the sapphires
of her necklace have left a print
on your skin. Why contest it over and over?
O you love expert, I can't be harsh.

Your lover of whores, why do you need a mirror?

Some woman has made love to you,
Lord of Venkata hill,
plundered your body's perfumes.
Soon after, you come into my arms.
How can I blame you? My weariness is gone.

Your lover of whores, why do you need a mirror?

- Annamayya, 5-84 (1998)

నాయిక (అలమేలుమంగ) చెలులు వేంకటేశుని దర్శించి, ప్రార్థించి, నాయిక అవస్థను వివరించి, నాయిక అధరామృతమును అందించునని ఆశపెట్టి, తమయజమానురాలిని కూడమని విన్నవించుటను అన్నమాచార్యులు పరమ రమణీయముగ ఇట్లు వర్ణించాడు.

దయ గలవాడవు వుత్తమనాయకుడవు
ప్రియములు నీకు జెప్పి పిలువ వచ్చితిమి ॥పల్లవి॥

చిత్తము లోపలి రూపు చిత్తరు పటాన వ్రాసి
హత్తి కౌగలించుకొను నంగన నిన్ను
బత్తిగా నిన్ను దలచి బయలుతో మాటలాడు
ఇత్తల నీపై వలపు లేమని చెప్పేమయ్యా ॥దయ॥

పాటమైన నీ పేరు పదములలోన బెట్టి
కూటువ నిన్ను నంకించు కోమలి నిన్ను
నీటున బానుపుమీద నీవున్నాడవని పొందు
యేటవెట్టి నీపై తమి ఇక నెంతో అయ్యా ॥దయ॥

కౌగిటిలో నిరతులు కలవరింతల బెట్టి
మాగిన మోవి యందిచ్చు మగువ నీకు
తోగి చూచింతలో నీవే తుదముట్ట గూడితివి
యేగక శ్రీవేంకటేశ ఇట్టే వుండవయ్యా ॥దయ॥

**- శృంగార సంకీర్తనలు, 16-284 (1998)**

అలమేలుమంగ చెలికత్తెలు తమచెలిని వలపుకావరముతో కూడి గాసిబెట్టిన వేంకటేశుని మందలించుటను అన్నమాచార్యులు ఇట్లు మనోహరముగ, శృంగార రసభరితముగా వర్ణించాడు.

పువ్వువలె గౌగలించి భోగించవలె గాక
కావరాన చెలి నింత గాసిగా జేతురా ॥పల్లవి॥

చక్కని రమణి నీ సంగడికి వచ్చితేను
చెక్కులు గిల్లుదురా చెల్లబో నీవు
జక్కవ చన్నులు నీకు సరిమొన చూపె నంటా
కిక్కిరియ జేతబట్టి గిజిగిజి సేతురా ॥పువ్వు॥



కడు గోమలపు సతి కదిసి పాదాలొత్తితే
వొడివట్టి తీతురా వోహో నీవు
అదరి మాని పండు నీ కటు నోరూరించెనంటా
పిడిచి యధరమింత పిప్పి సేతురా ॥పువ్వు॥

సింగారించుకొని లేమ సేస నీపై బెట్టితేను
అంగమింత బిగింతురా ఆహా నీవు
అంగజుని దీము లాచీ ననుచు శ్రీ వేంకటేశ
వుంగిట రతులగూడి వుమ్మగిల సేతురా ॥పువ్వు॥

**- శృంగార సంకీర్తనలు, 16-590 (1998)**

అలమేలుమంగా వేంకటేశులు తమపొందునుగూర్చి బొంకుచుండగా, చెలికత్తెలు గుర్తులుచూపి వారిని ఎగతాళిచేయుటను అన్నమాచార్యులు కడు రమణీయముగ, చమత్కారభరితంగా ఇట్లు వర్ణించాడు-

ఎవ్వరునెరుంగరంటా యేల బొంకేరు
నవ్వేరు మిముజూచి నలినాక్షు లెల్లను ॥పల్లవి॥

చెలియనుదుటి మీది చిన్నారి కస్తూరి బొట్టు
చెలువు మీరగ నీ చెక్కుల నంటె
నిలువునామము నీది నెలత నుదుట నంటె
తలకొన్న గురుతులు తారుమారులాయను ॥పల్లవి॥

కాంత కన్నుల బెట్టిన కాటుకెల్లా నీ మోవి
వింత బాగులై నేడు వెలశున్నది
రంతుల నీ బాహుపురి రమణి సందిట జిక్కె
యింతలోనే మీ చేత లివ్వలవ్వలాయను ॥ఎవ్వ॥

సరి నలమేల్మంగ చరణముల లత్తుక
సొరిది నీవురమున జూపట్టెను

గరిమ శ్రీ వేంకటేశ కౌస్తుభమింతికి సొమ్మై
దొరసె మీ వలపులు తోడునీడలాయను ॥ఎవ్వ॥

**- శృంగార సంకీర్తనలు, 18-477 (1998)**

అన్నమయ్య శృంగార వర్ణనములలో వైవిధ్యమున్నది. అలమేలుమంగ దేహమును దివ్యరథముతో పోల్చి, ఇద్దరు కలిసి వలపుల విజయయాత్ర చేయుడని వేంకటేశునికి ఇట్లు విన్నవించాడు-

అలమేలుమంగ యాకె ఆనుక వద్దనుండది
చెలరేగి కందువలు చిత్తగించవయ్యా ॥పల్లవి॥

తరుణి దేహమే నీకు తగు దివ్యరథము
గరుడధ్వజం బాపె కప్పు పయ్యద
తురగములు రతుల దోలెడు కోరికలు
సరినెక్కి వలపులు జయించవయ్యా ॥అల॥

దిండుకల పిరుదులు తేరుబండి కండ్లు
అండనే పువ్వుల గుత్తులాపె చన్నులు
కొండవంటి శృంగారము కోపున గలసొబగు
నిండుకొని దిక్కులెల్లా నీవే గెలువవయ్యా ॥అల॥

వెలది కంఠము నీకు విజయ శంఖ మదివో
నిలువెల్ల సాధనాలు నీకు నాపె
యెలమి శ్రీ వేంకటేశ యిద్దరును గూడితిరి
పలుజయములు నిట్టే పరగవయ్యా ॥అల॥

**- శృంగార సంకీర్తనలు, 8-90 (1998)**

అలమేలుమంగ వేంకటేశ్వరుల దాంపత్య జీవనాన్ని రాజ్యపట్టాభిషేకముగా అపూర్వవూహలతో భావుకతతో అన్నమయ్య ఇట్లు వర్ణించాడు-



ఇట్టి భాగ్యము గంటిమి యిద్దరూ బదుకరయ్యా
పట్టము గట్టుకొంటివి పచ్చిదేరనయ్యా ॥పల్లవి॥

చెలియ తోడే నీకు సింహాసనపు గద్దె
అలరు జూపులే రత్నాభిషేకము
చలువైన నవ్వులే ఛత్ర చామరములు
కలిగె నీకింక నేమి గావలె నయ్యా ॥యిట్టి॥

చనుగవలే నీకు సామ్రాజ్యదుర్గములు
నినుపు మోవితేనెలు నిచ్చ బోనాలు
వొనరిన కాగిలే వుండెడి నీ నగరు
యెనయ నబ్బె నీ భాగ్య మీడేరెనయ్యా ॥యిట్టి॥

రతిచెనకులే నీకు రవణపు సొమ్ములు
సతతపు గూటమే సర్వసంపద
యితవై శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
సతమాయ మమ్ము నేలి జాణవైతివయ్యా ॥యిట్టి॥

**-శృంగార సంకీర్తనలు, 12-76**

అన్నమాచార్యులు వేంకటేశ్వరుని అభిషేకానంతర అలంకారమును వర్ణించుచూ, దశావతారవర్ణన కూడ జాను తెలుగు నుడికారముతో, పదప్రయోగ వైచిత్రితో చమత్కారముగా ఇట్లు చేసినాడు-

శ్రీవేంకటేశ్వరుని చెలి యలమేల్మంగ
వోవరిగా నెలకొని వురముపై నున్నది ॥పల్లవి॥

పొంచి మచ్చమైన నాటి పొలసుకంపులు వాయ
సంచల పన్నీట మజ్జన మార్చరే
అంచె గూర్మవరాహములైనట్టి సొగటు దీర
మించు గప్పురధూళి మెత్తరే మేనను ॥శ్రీవేం॥

**నరసింహపు గదరునాటి వామనపు జిడ్డు**
**పరశురాముని గబ్బు పచ్చి వీడను**
**పరిమళము గట్టిన బంగారు గిన్నె దెచ్చి**
**పొరి దిరుమేన దట్టపునుగిట్టే నించరే ॥శ్రీవేం॥**

**గొల్లముంజు రాచజిడ్డు కోరి బుద్ధదైన సిగ్గు**
**చొల్లు గుర్రపు నూగు రొచ్చులు మానగా**
**ఇల్లిదె శ్రీ వేంకటేశు డీరూపై తానున్నవాడు**
**యెల్ల పూదండలు సొమ్ము లెక్కించరే ॥శ్రీవేం॥**

**- శృంగార సంకీర్తనలు, 7-198**

శ్రీవేంకటేశుడు శృంగారరాయడు. నాయికలహెచ్చు తగ్గులు పాటించడు. వేంకటేశుడు అలమేలుమంగ పరిచారికతో శృంగారం సాగించడాన్ని దూతీ శృంగారమును - అన్నమాచార్యులు రసరమణీయంగా, సహజ సౌందర్య భావనలతో ఇట్లు వర్ణించాడు.

**వలపు కొలదిగాదు వద్దువద్దయ్యా**
**చెలి కోపగించుకొంటే సేసేదేమయ్యా ॥పల్లవి॥**

**వూడిగపుదాన నన్ను నొడివట్టి తీసేవు**
**యీడ నీపట్టపుదేవి యేమి సేసునో**
**వేడుక యీ వేళనైతే వెనక నాపె చిక్కించు**
**కేడ నైనా బరచగ నేమి సేసేవయ్యా ॥వలపు॥**

**దూతిక నింతే నేను తొడికేవు నా చన్నులు**
**కాతరించి నన్నెంత నీ కాంత దూరునో**
**యేతు లిప్పుడు సేసితే నింటికాడ వచ్చీ యాపె**
**చేతులు చాచవచ్చితే చేరి యేమందునయ్యా ॥వలపు॥**



**పరిచారకపుదాన బైకొని నన్నేలితివి**
**యిరవైన మగువ నన్నెట్టు నవ్వునో**
**సరుస శ్రీవేంకటేశ చలివాసి యిక నాపె**
**గరిసించితే మరి గతి నీవే అయ్యా ॥వలపు॥**

**- శృంగార సంకీర్తనలు, 14-25**

చక్కదనంచేత, జాణతనంచేత వేంకటేశుడు అందరి ప్రేమకు పాత్రుడుగ ఉన్నాడు. అందువలన నిన్ను చూచిన వనితలు వలవకుండుదురా? అంటూ ఒక నాయిక తన మనస్సును వెల్లడించడాన్ని అన్నమయ్య స్త్రీ స్వభావానుగుణంగా, సహజసుందరంగా ఇట్లు వర్ణించాడు-

**అంత చక్కనివాడవు అన్నిటా జాణవు నీవు**
**సంతోసాన నుప్పంగీ సారెకు నా మనసు ॥పల్లవి॥**

**పొలసి నిన్నొకమారు పూచి తప్పక చూచితే**
**వలవక వుండుదురా వనితలు**
**నిలువున నెప్పుడైనా నీ రూపు దలచుకొంటే**
**వులివచ్చి చెమటలు నోలలాడకుందురా ॥అంత॥**

**సముకాన నీతోను సంగతాలు సేసితే**
**తమ కించ కుండుదురా తరుణులు**
**జమళి మేనులు సోక సరసము లాడితేను**
**మమతల నిన్ను నిట్టె మరుగక వుండుదురా ॥అంత॥**

**యీడుజోడై నిన్నుగూడి యెడవాయ కుండితే**
**వేడుక జొక్కకుందురా వెలదులు**
**యీడనె శ్రీ వేంకటేశ యేలితిని నిన్ను నిట్టె**
**యేడవారూ నీ పొందుల కేకరక వుందురా ॥అంత॥**

**- శృంగార సంకీర్తనలు, 28-146 (1999)**

అలమేలుమంగా శ్రీ వేంకటేశుల సరసమును, అన్యోన్యతను 'సరిబేసులాయ' అంటూ చెలులు మెచ్చుకొనడాన్ని అన్నమయ్య రసభరితంగా వైవిధ్యంగా వర్ణించాడు.

**సరిబేసులాయను మీ సరసము నిద్దరికి**
**మొరసిన మీ చేతులు మెచ్చితి మిందరము ॥పల్లవి॥**

**చెలి నీ యెదుట నుండి సేసిన సన్నలకు**
**అలరుల దండ వేసి తాకె మీదను**
**సొలసి కమ్మటి నిన్ను సోకగ జూచినందుకు**
**తలకొని మర్మములు దగుల నాడితివి ॥సరి॥**

**ఆపె నీకు మొక్కు మొక్కి యాసలు రేచినందుకు**
**తీపులమోవి చూపి తేలించితివి**
**రాపున నిన్నంటబట్టి రతికి దీసినందుకు**
**యేపున జనవిచ్చి నీవిట్టె ఇయ్యకొంటివి ॥సరి॥**

**మరిగించుక నిన్నాపె మతి చొక్కించి నందుకు**
**బెరసి నీవురమున బెట్టుకొంటివి**
**యిరవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ**
**సరగున గూడి సంతోసములు నించితివి ॥సరి॥**

**- శృంగార సంకీర్తనలు, 28-413 (1999)**

ఒక నాయిక వేంకటేశుడు తనకు వినయాలు చేయడాన్ని చమత్కారంగా వర్ణిస్తూ, స్వామితో వివాహాన్ని కోరుతున్న వైనాన్ని అన్నమయ్య జానపద బాణిలో తేటతెలుగులో రసభరితంగా ఇట్లు వర్ణించాడు.

**వినయాలు సేసేవు వేంకటేశుడ**
**వెనువెంట బాయక వేంకటేశుడ ॥పల్లవి॥**



**విరుల వేసేవదేమో వేంకటేశుడ**
**వెరగయ్యీ నీ చేతకు వేంకటేశుడ**
**విరివాయ నీ సుద్దులు వేంకటేశుడ**
**అరుదుగ వింటిమోయి అన్నీ వేంకటేశుడ ॥విన॥**

**వేడుక కాడవౌదువు వేంకటేశుడ**
**వీడుదోడాడేవు మాతో వేంకటేశుడ**
**వీడెపు మోవి నవ్వేవు వేంకటేశుడ**
**జాడలెల్లా గంటిమోయి సారె వేంకటేశుడ ॥విన॥**

**వేసాల వాడవు గదో వేంకటేశుడ**
**వేసారపు రతులను వేంకటేశుడ**
**వేసేవు నాపై జేయి వేంకటేశుడా నన్ను**
**సేసవెట్టి పెండ్లాడేవు శ్రీ వేంకటేశుడా ॥విన॥**

**- శృంగార సంకీర్తనలు, 28-494**

శ్రీ వేంకటేశుడు ఒక నాయిక పొందుకోసం చెలికత్తె ద్వారా వీడెము, గంధము, కప్పురము పంపినాడు. ఆ చెలికత్తె నాయికకు స్వామి సౌందర్యాన్ని వైభవాన్ని వర్ణించి స్వామికి లోబడమని బోధిస్తున్న వైనాన్ని అన్నమయ్య సహజ సుందరంగా ఇట్లు ఆవిష్కరించాడు.

**చక్కని వాడాతడు జాణవు నీవు**
**అక్కరతో నాతని యానతి వినవమ్మా ॥పల్లవి॥**

**వల్లెవాటు వేసుకొని వాడె నిలుచున్నవాడు**
**యిల్లిదె వీడెమంపె నీ కిందవమ్మా**
**చొల్లెపు జుత్తులతోడ జూచీ నిన్నప్పటనుండి**
**యెల్లచందాలా దగు మీ యిద్దరికి నమ్మా ॥చక్క॥**

నెత్తికొప్పువాడు మంచి నీలపుగాంతులవాడు
బత్తితో గందమంపెను పట్టవమ్మా
చిత్తము నీపై బెట్టి సెలవుల నవ్వీవాడె
హత్తి యాతనితో మాటలాడవమ్మా

కుప్పెకటారము తోడి కోడెవయసు వాడు
కప్పురము నీకు నంపె గైకొనవమ్మా
అప్పుడు శ్రీ వేంకటేశు డదె వచ్చి నిన్ను నేలె
చిప్పిల విన్నపాలెల్లా జేసుకోవమ్మా ॥చక్క॥

**– శృంగార సంకీర్తనలు, 29–80 (1999)**

పూర్వం తెలుగునాట పున్నమరాత్రులలో జాజర ఆట, పాట ప్రసిద్ధిగా ఉంది. అన్నమాచార్యులు జాజర ఆటను ఆడుదువు రావయ్యా అంటూ ఒక నాయిక చెలికత్తెలు శ్రీవేంకటేశుని ఆహ్వానించడాన్ని చమత్కారంగా, రసవత్తరంగా ఇట్లు వర్ణించాడు.

పొదలె నిండుగళల పున్నమనేడు
అదను దప్పక జాజ రాడుదువు రావయ్యా ॥పల్లవి॥

జలజాక్షి మోముసను చంద్రోదయమాయ
నెలకొన్న నవ్వుల వెన్నెల గాసెను
కలికి కన్నుల నల్లగలువలు వికసించె
అలరి యీకెతో జాజరాడుదువు రావయ్యా ॥పొద॥

యెనసి జవ్వనమున నేతెంచె వసంతకాల
మొనరి మోవి జిగురు లుప్పతిలెను
గొనకొన్న తురుమున గూడె తుమ్మిదమూక
అనుమానించక జాజరాడుదువు రావయ్యా ॥పొద॥



కుంకుమ చెమట చనుగొప్పెరల నిండుకొనె
కొంకక గోళ్ళ బుర్రట కొమ్ములాయెను
లంకెలై శ్రీ వేంకటేశ లలనతో గూడితివి
అంకెల నే పొద్దూ జాజరాడుదువు రావయ్యా ॥పొద॥

**– శృంగార సంకీర్తనలు, 29–434 (1999)**

తిరుమల దేవాలయంలో శ్రీవారి కల్యాణోత్సవమును తాళ్ళపాక అన్నమాచార్యులు ప్రారంభించినట్లు, కన్యాదాతగా వ్యవహరించినట్లు శాసన, సాహిత్య ప్రమాణములు గలవు. కల్యాణోత్సవ సందర్భంలో పాడదగిన సంకీర్తనను అన్నమయ్య రసభరితంగా, సహజ సుందరంగా ఇట్లు వర్ణించాడు.

మొక్కరమ్మ చెలులాల మోహనాకారుడు వీడె
వెక్కసపు చేతల శ్రీ వేంకటేశుడు ॥పల్లవి॥

సంతోసాన వాడె పెండ్లి చవికెలో గూచున్నాడు
మంతనము లాడుకొంటా మగువలతో
పొంతనే సరసాలాడీ భూపతి చెరువుదండ
వింత సింగారాలతో శ్రీ వేంకటేశుడు ॥మొక్క॥

జోడైన రత్నాల సొమ్ములు వెట్టుకున్నాడు
వాడికైన వూడిగపు వారితో గూడి
వీడెములు వేసుకొంటా వికవిక నవ్వుకొంటా
వేడుకకాడైనవాడు శ్రీ వేంకటేశుడు ॥మొక్క॥

తలకొన్న కమ్మపూవు దండలతో నున్నవాడు
లలిబూసిన పరిమళాలు మించగా
పలురతుల దనిసి బాగుగా దేవుళ్ల దాను
విలసిల్లీ నిదిగో శ్రీ వేంకటేశుడు ॥మొక్క॥

**– శృంగార సంకీర్తనలు, 29–480 (1999)**

ఇట్లు అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు శ్రీ వేంకటేశుని విచ్చలవిడి శృంగారాన్ని విశేషభావుకతతో, పదప్రయోగ వైచిత్రితో, రసరమణీయకతతో, తెలుగు నుడికారముతో వైవిధ్యభరితంగా వర్ణించాడు. అన్నమయ్య శృంగార సంకీర్తనలు "వేంకటశైలవల్లభు రతి క్రీడా రహస్యంబులై' యున్నవి. తాళ్ళపాక చినతిరుమలాచార్యులు సంకీర్తన లక్షణములో ఇట్లు ప్రస్తుతించాడు-

**శ్రుతులై శాస్త్రములై పురాణ కథలై సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమవీథులై వివిధ మంత్రార్థంబులై నీతులై**
**కృతులై వేంకటశైలవల్లభు రతిక్రీడా రహస్యంబులై**
**నుతులై తాళులపాక యన్నయ వచోనూత్నక్రియల్ చెన్నగున్‌॥ 12**

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో నాయకుడు వేంకటేశ్వరుడు. నాయిక అన్నమయ్య. అతడే అలమేలుమంగగా, రాధగా, గోపికగా, ఇతర నాయికగా మారినాడు. ఈ అలౌకిక శృంగారమే మధురభక్తి. **'కామి గాక మోక్షగామి కాదు'** అన్నట్లు కామాన్ని అనుభవించిన పురుషుడే వైరాగ్యవంతు డవుతాడు. వైరాగ్యానికి పూర్వరంగం శృంగారం. అన్నమయ్య వైరాగ్యాన్ని అలవరచుకోడానికి ముందు శృంగార కీర్తనలు పిదప అధ్యాత్మ కీర్తనలు రచించాడు.

## 2. అన్నమాచార్యుల అధ్యాత్మ కీర్తనలు

భగవద్విషయికమగు రతియే పరిపుష్టిని పొంది భక్తియగుచున్నది. ఈ అలౌకికమగు ప్రేమయే ఇహపరముక్తి సాధనమగుచున్నది. పరమ ప్రేమ స్వరూపమైన భక్తితత్త్వమును, ఆధ్యాత్మిక తత్త్వమును ప్రబోధించు గేయరచనలే ఆధ్యాత్మిక సంకీర్తనలు.

తిరుమల దేవాలయమున స్వయంవ్యక్త మూర్తిగ వెలసిన శ్రీ వేంకటేశుని దివ్యమంగళ స్వరూపమును భక్తులకు కనులకు కట్టునట్లు రమ్యముగా అన్నమాచార్యులు ఇట్లు వర్ణించాడు.



**చేరికొల్వరో యీతడు దేవుడు**
**యీరీతి శ్రీ వేంకటాద్రి నిరవైన దేవుడు ॥చేరి॥**

**అలమేలుమంగ నురమందిడుకొన్న దేవుడు**
**చెలగి శంఖ చక్రాల చేతి దేవుడు**
**కలవరద హస్తము కటిహస్తపు దేవుడు**
**తులసి శ్రీవత్స వనమాలికల దేవుడు ॥చేరి॥**

**ఘన మకర కుండల కర్ణముల దేవుడు**
**కనకపీతాంబర శృంగార దేవుడు**
**ననిచి బ్రహ్మాదుల నాభిగన్న దేవుడు**
**జనించె బాదాల గంగ సంగతైన దేవుడు**

**కోటి మన్మథాకార సంకులమైన దేవుడు**
**జూటపు గిరీటపు మించుల దేవుడు**
**వాటపు సొమ్ములతోడి వసుధాధిపతి దేవుడు**
**యీటులేని శ్రీ వేంకటేశుడైన దేవుడు.**

**- ఆధ్యాత్మిక సంకీర్తనలు-4-1 (1998)**

శ్రీనివాసునకు నిలయమైన వేంకటాద్రిని ఆదిశేషుని స్వరూపమని, కైవల్యపద మని అన్నమయ్య ఇట్లు సహజసుందరంగా పవిత్రమైన పర్వతంగా వర్ణించాడు.

**అదివో అల్లదివో హరివాసము**
**పదివేలు శేషుల పడగలమయము ॥పల్లవి॥**

**అదె వేంకటాచల మఖిలోన్నతము**
**అదివో బ్రహ్మాదుల కపురూపము**
**అదివో నిత్యనివాస మఖిలమునులకు**
**నదె చూడు డదె మ్రొక్కు డానందమయము ॥అది॥**

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥అది॥

కైవల్యపదము వేంకటనగమదివో
శ్రీ వేంకటపతికి సిరులయినది
భావింప సకలసంపద రూపమదివో
పావనముల కెల్ల బావనమయము ॥అది॥

**– ఆధ్యాత్మిక సంకీర్తనలు, 1-23 (1998)**

తిరుమల శ్రీవేంకటేశుని భక్తపరాయణత, దయార్ద్రత, వరదాన శీలతలను అన్నమాచార్యులు ఇట్లు ప్రశంసించాడు.

కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు
కొండలంత వరములు గుప్పించెడువాడు ॥పల్లవి॥

కుమ్మరదాసుడైన కురువరతినంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాడు ॥కొండ॥

అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక దిరుమలనంబి తోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాడు ॥కొండ॥

కంచిలోన నుండ దిరుక్కచ్చినంబి మీదగరు
ణించి తన యెడకు రప్పించినవాడు



యెంచి నెక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ బాలించినవాడు ॥కొండ॥

**– అధ్యాత్మ సంకీర్తనలు, 1-151 (1998)**

భక్తులు కుమ్మరి భీముడు (కురవనంబి), తొండమాన్ చక్రవర్తి కథలు శ్రీ వేంకటాచల మాహాత్మ్యములో ఉన్నాయి. భక్తులు అనంతాళ్వారు, తిరుమల నంబి, తిరుక్కంచినంబి కథలు శ్రీ వేంకటాచల ఇతిహాసమాలలో ఉన్నవి. శ్రీనాథ మహాకవి హరవిలాసములో

"అర్ధరాత్రంబున నల్లాడ నాథుండు
దానె యెవ్వనికి గైదండయిచ్చె
బదకంపు బచ్చను బైవేయ వచ్చిన
దనుజారి నిల్పె నెవ్వని నిజంబు
అలిగిపోయిన వేంకటాచలంబున కేగి
కొనివచ్చె నెవ్వని కుధరధరుడు
వైకుంతనాథుడెవ్వని సేవకును మెచ్చి
యాత్మసత్కార కల్యాణమొసగె

అతఁడు భాగవతోత్తముం డతఁడు శుద్ధుఁ
డతఁడు వైరాగ్యసంపన్నుఁ డతఁడు ఘనుఁడు
పరమవైష్ణవ సభ నుతింపంగఁ దగదె
కాంచినగరి కుటుంబి శ్రీ కంచి నంబి" **– 1-14**

అని ప్రస్తుతించాడు. ఈ పద్యంలో కీర్తింపబడిన భాగవతోత్తముడు తిరుకంచినంబి (తిరుక్కచ్చినంబి) హరవిలాసమునకు కృతిభర్త, శ్రీనాథునకు బాల్యసఖుడు అగు అవచి తిప్పయ శెట్టికి పూర్వీకుడు. ఇతడు భగవద్రామానుజాచార్యులకు గురువు. శ్రీ కంచినంబి (కాంచీపూర్ణులు) కంచివరదరాజస్వామి భక్తుడు. ఆంతరంగికుడు. ఒకప్పుడు నంబి వరద రాజులమీద అలిగి వేంకటాద్రి చేరి వేంకటేశుని సేవించినాడు.

అన్నమాచార్యులు శ్రీ వేంకటేశునిపై పెక్కు మేలుకొలుపు సంకీర్తనలు రచించాడు. వీటిలో చాలా సంకీర్తనలు శ్రీకృష్ణుని సంబోధనలుగ, మేలుకొలుపులుగ ఉన్నాయి. అన్నమయ్య నరసింహుడు, శ్రీరాముడు శ్రీకృష్ణుడు, శ్రీవేంకటేశుడు అందరికి అభేదమును పాటించి కీర్తించినాడు.

**మిన్నక వేషాలు మాని మేలుకోవయ్యా**
**సన్నల నీయోగ నిద్ర చాలు మేలుకోవయ్యా ॥పల్లవి॥**

**ఆవులు పేయలకుగా నరచీ బిదుకవలె**
**గోవిందుడ యింక మేలుకొనవయ్యా**
**ఆవలీవలి పడుచు లాటలు మరిగివచ్చి**
**త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా ॥మిన్న॥**

**వాడల గోపిక లెల్లా వచ్చి నిన్ను ముద్దాడ**
**గూడి యున్నారిదే మేలుకొనవయ్యా**
**తోడనే యశోద గిన్నెతో బెరుగువంటకము**
**యీడకు దెచ్చిపెట్టె నిక మేలుకోవయ్యా ॥మిన్న॥**

**పిలిచీ నందగోపుడు పేరుకొని యదె కన్ను**
**గొలుకులు విచ్చి మేలుకొనవయ్యా**
**అలరిన శ్రీ వేంకటాద్రి మీది బాలకృష్ణ**
**యిల మా మాటలు వింటి విక మేలుకోవయ్యా ॥మిన్న॥**

**- అధ్యాత్మ కీర్తనలు, 1-374 (1998)**

పూర్వకాలంలో తల్లి ఉదయముననే కుమారునకు పెరుగు వంటకములను తినబెట్టుట అలవాటుగా ఉండేది. ఈ ప్రభాత భోజనాన్ని శ్రీనాథుడు (క్రీ.శ. 1370-1480) కాశీఖండములో గుణనిధి కథలో ఇట్లు వర్ణించాడు.

**చం. అరుణ గభస్తిబింబ ముదయాద్రి పయిం బొడతేర గిన్నెలో**
**బెరుగును వంటకంబు వడపిందియలున్ గుడువంగబెట్టుని**



**ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే**
**హరహర యెవ్వరింక గడుపారఁగఁ బెట్టెద రీప్సితాన్నముల్॥**

**- కాశీఖండము, 4-114**

పైరెండు ఉదాహరణములు అన్నమాచార్యులు (క్రీ.శ.1408-1503) శ్రీనాథుని కావ్యములను శ్రద్ధగా పఠించియున్నాడని తెలియజేయుచున్నవి. ఇవి అన్నమాచార్యుల సాహితీ వైభవమును నిరూపించుచున్నవి.

శ్రీవేంకటేశుని సుప్రభాత సంకీర్తననుకూడ శృంగార దృష్టితో రస మయంగా ఇట్లు అన్నమాచార్యులు వర్ణించాడు.

**రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో**
**రీతిగాదు హరి నెచ్చరికె సేయరే ॥పల్లవి॥**

**పైపై బొద్దు వొడచి పంకజములు విరిసె**
**గోప గోవిందుని మేలుకొనుమనరే**
**దీపములు దెల్లబారె తిమిరమింతయు జారె**
**శ్రీపురుషోత్తముని జేయంటి లెమ్మనరె ॥రాతి॥**

**కలువలు ముకుళించీ కలవింక లెలుగించీ**
**నెలతలు దేవదేవు నిద్రదెల్పరే**
**జలనిధి పొంగణగె చాయలచుక్కలు మాసె**
**వలరాచ గురు నుప్పవడము గమ్మనరే ॥రాతి॥**

**జీవులు మేలుకొనిరి చెంగలించె దరువులు**
**భావించి యచ్యుతు నిట్టె పలికించరే**
**కావిరింతయు విరిసె కడుసంధ్యకు బొద్దాయె**
**శ్రీ వేంకటేశుని విచ్చేయుమనరే ॥రాతి॥**

**- అధ్యాత్మ కీర్తనలు, 4-130 (1998)**

వేంకటాద్రి విభునకు శ్రీమన్నారాయణునికి అభేదము దెలుపుచు అన్నమయ్య వేంకటేశ్వరుని వైభవమును ఇట్లు కీర్తించినాడు.

**ఆదిమ పూరుషు దచ్యుతు డచలు డనంతుం డమలుదు**
**ఆ దేవు డితడె పో హరి వేంకట విభుడు ॥పల్లవి॥**

**ఏకార్ణవమై ఉదకము లేచిన బ్రహ్మాండములో**
**బైకొని యుండగ నొక వటపత్రము లోపలను**
**చేకొని పవళింపుచు నొక శిశువై వడి దేలాడిన**
**శ్రీకాంతు డీతడేపో శ్రీ వేంకట విభుడు ॥ఆది॥**

**అరుదుగ బలిమదమడపగ నాకసమంటిన రూపము**
**సరగున భూమింతయు నొక చరణంబున గొలిచి**
**పరగిన పాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన**
**పరమాత్ము డీతడేపో పతి వేంకట విభుడు ॥ఆది॥**

**క్షీరపయోనిధి లోపల శేషుడు పర్యంకముగా**
**ధారుణియును సిరియును బాదములొత్తగను**
**చేరువ దను బ్రహ్మాదులు సేవింపగ జెలువొందెడి**
**నారాయణు డితడే వున్నత వేంకట విభుడు ॥ఆది॥**

**- ఆధ్యాత్మ సంకీర్తనలు, 1-80 (1998)**

ఆదిమ పురుషుడు, అచ్యుతుడు, వటపత్రశాయి, త్రివిక్రముడు, శేషశాయి యగు శ్రీమన్నారాయణుడే వేంకటేశ్వరుడని ప్రస్తుతించాడు అన్నమయ్య.

శ్రీ వేంకటేశుడు శ్రీపతి ఒక్కరే అని, భాగవత, బ్రహ్మాండ, వామనాది పురాణములు కొనియాడిన దైవము వేంకటేశ్వరుడే అని, బ్రహ్మాది దేవతలు కొలచియున్న పరతత్వము వేంకటాద్రి నిలయుడే అని అన్నమాచార్యులు కీర్తించినాడు ఇట్లు-



**శ్రీ వేంకటేశుడు శ్రీపతియు నితడే**
**పావనపు వైకుంఠ పతియును నితడే ॥పల్లవి॥**

**భాగవతములో జెప్పె బలరాము తీర్థయాత్ర**
**నాగమోక్తమైన దైవ మాతడీతడే**
**బాగుగా బ్రహ్మాండ పురాణ పద్ధతి యాతడీతడే**
**యోగమై వామన పురాణోక్త దైవమీతడే ॥శ్రీవేం॥**
**వెలియ సప్తరుషులు వెదకి ప్రదక్షిణము**
**లలర జేసిన దేవుడాతడీతడే**
**నెలవై కోనేటి పొంత నిత్యము గుమారస్వామి**
**కలిమి దపముసేసి కన్న దేవుడీతడే ॥శ్రీవేం॥**

**యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు**
**తక్కక కొలిచియున్న తత్వమీతడే**
**చక్కనారదాదుల సంకీర్తనకు జొక్కి**
**నిక్కిన శ్రీ వేంకటాద్రి నిలయుడు నీతడే ॥శ్రీవేం॥**

**- అధ్యాత్మ సంకీర్తనలు 1-425**

భక్తులకు వేంకటవిభుడు సులభసాధ్యుడు. అభీష్టవరదాయి. శరణువేడిన వారికి ఇహపరఫలదాత అని అన్నమయ్య ఇట్లు కీర్తించినాడు.

**ఏ రీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను**
**వారివారి పాలికి వరదుడ వౌదువు ॥పల్లవి॥**

**చేరి కొల్చినవారికి జేపట్టు గుంచమవు**
**కోరి నుతించిన వారి కొంగు పైడివి**
**మేరతో దలచువారి మేటి నిధానమవు**
**సారపు వివేకులకు సచ్చిదానందుడవు ॥ఏరీతి॥**

**కావలెననే వారికి కామధేనువవు మరి**
**సేవసేసేవారికి చింతామణివి**
**నీ వే గతెన్నవారికి నిఖిల రక్షకుడవు**
**వావిరి శరణు వేదేవారి భాగ్యరాశివి ॥ఏ రీతి॥**

**నిన్ను బూజించేవారి నిజపరతత్వమవు**
**యిన్నిటా నీదాసులకు నేలికెవు**
**యెన్నగ శ్రీ వేంకటేశ యిహపరములకును**
**పన్నికాచుకున్న వారి ఫలదాయకుడవు ॥ఏ రీతి॥**

**– అధ్యాతసంకీర్తనము–2–173 (1998)**

అన్నమాచార్యులు వేంకటేశ్వరుని సర్వదేవతామయునిగా వర్ణించినాడని పండితులు ఈ సంకీర్తనను ఉదాహరిస్తుంటారు. ఆ సంకీర్తన–

**ఎంత మాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు**
**అంతరాంతరము లెంచిచూడ బిండంతే నిప్పటియన్నట్లు ॥పల్లవి॥**

**కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని**
**పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు**
**తలతురు మిము శైవులు తగిన భక్తులను శివుడనుచు**
**అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుడనుచు ॥ఎంత॥**

**సరినెన్నుదురు శాక్తేయులు శక్తిరూపునీవనుచు**
**దరిశనములు మిము నానా విధులను తలపుల కొలదుల భజింతురు**
**సిరుల మిమ్మునే యల్పబుద్ధి దలచినవారికి నల్పంబవుదువు**
**గరిమల మిమునే ఘనమని తలచిన ఘన బుద్ధులకు ఘనుడవు॥ఎంత॥**

**నీవలన గొరతే లేదు మరి నీరుకొలది తామెరవు**
**ఆవల భాగీరథి దరిబావుల ఆ జలమే వూరినయట్లు**



**శ్రీ వేంకటపతి నీవైతే మము జేకొనివున్న దైవమని**
**యీవల నే నీ శరణనియెదను యిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥**

**– అధ్యాత్మ సంకీర్తనలు, 2–393**

వేంకటేశ్వరుని వైష్ణవులు మాత్రమే పూజిస్తున్నారు. (క్రియ). మిగతా వారు మాట్లాడుతున్నారు. తలంచుచున్నారు. స్వామిని దర్శించి అంధగజ న్యాయమురీతిలో తమ ఇష్టదైవాన్ని ఊహిస్తున్నారు. పొగడుతున్నారు. ఇవన్నీ వాచారూపములు. మాటలే; చేతలు కావు అని అన్నమయ్య ప్రయోగించిన క్రియా వాచకములు తెలియజేస్తున్నవి. అన్నమాచార్యులు వేంకటేశుడే విష్ణుదేవుడని పూజించినాడు. అతడే పరతత్వమని, తనను రక్షించే దైవమని శరణుజొచ్చినాడు. కనుక అన్నమాచార్యులు వేంకటేశుని సర్వదేవతామూర్తిగా వర్ణించలేదు. విష్ణుదేవుడే వేంకటేశుడని కీర్తించినాడని నిష్కర్ష.

అన్నమాచార్యులు అలమేలుమంగా వేంకటేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఇట్లు కమనీయంగా వర్ణించాడు.

**పసిడి యక్షంతలివె పట్టరో వేగమే రారో**
**దెసల బేరటాండ్లు దేవుని పెండ్లికిని ॥పల్లవి॥**

**శ్రీ వేంకటేశ్వరునికి శ్రీ మహాలక్ష్మికి**
**దైవికపు బెండ్లి ముహూర్తము నేడు**
**కావించి భేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె**
**దేవతలు రారో దేవుని పెండ్లికిని ॥పసి॥**

**కందర్ప జనకునికి గమలాదేవికి బెండ్లి**
**పందిలిలోపల దలబాలు నేడు**
**గందమూ విడమిచ్చేరు కలువదాలు గట్టిరి**
**అందుక మునులు రారో హరిపెండ్లికిని ॥పసి॥**

**అదె శ్రీవేంకటపతి కలమేలు మంగకును**
**మొదలి తిరునాళ్ళకు మొక్కేము నేడు**
**యెదుట నేగేరు వీరె. యిచ్చేరు వరములివె**
**కదలిరారో పరుషఘనుల పెండ్లికిని. ॥పసి॥**

**- అధ్యాత్మ కీర్తనలు, 3-194**

తిరుమల ఆలయంలో చైత్రపూర్ణిమకు జరిగే వైవాహికోత్సవమును (పెండ్లి తిరునాళ్ళు) - మొదలి తిరునాళ్ళను - అన్నమాచార్యులే ప్రారంభించినాడు. ఈ కల్యాణోత్సవములో అన్నమాచార్యుడే కన్యాదాత రేవణూరి వేంకటార్యుడు (అన్నమాచార్యుల దౌహిత్రుడు) శకుంతలా పరిణయ కృత్యాదియందు పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడయిన తాళ్ళపాక అన్నమాచార్యుల గురించి “.....అమ్మహాదేవుండు మదీయ మాతా మహవంశ శిఖారత్నంబగు నన్నమాచార్యునకు జామాతరుండనిపించుకొని, భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించె” అని వర్ణించియున్నాడు.

వేంకటాచల వైభవమును అన్నమాచార్యులు ఇట్లు కీర్తించినాడు.

**కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ**
**తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ ॥పల్లవి॥**

**వేదములే శిలలై వెలసినది కొండ**
**యే దెస బుణ్యరాసులే యేరులైనది కొండ**
**గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ**
**శ్రీదేవు డుండేటి శేషాద్రి యీ కొండ ॥కట్టె॥**

**సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ**
**నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ**
**వుర్వి దపసులే తరువులై నిలిచిన కొండ**
**పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ ॥కట్టె॥**



**వరములు కొటారుగా వక్కణించి పెంచే కొండ**
**పరగు లక్ష్మీకాంతు సోబనపు గొండ**
**కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ**
**విరివైన దిదివో శ్రీ వేంకటపు గొండ ॥కట్టె॥**

**- అధ్యాత్మ కీర్తనలు, 3-471**

పూరీజగన్నాథుని రథయాత్రలో మూడు రథములు పాల్గొన్నట్లుగా ఒకప్పుడు తిరుమలలో కూడ మూడు రథముల ఉత్సవము జరుగుచుండినట్లు అన్నమాచార్యులు వర్ణించాడు ఇట్లు-

**కోనేటి దరుల గనుగొనరో మూడు దేరులు**
**నానా దేవతలార నరులార మీరు ॥పల్లవి॥**

**తెంకిగా ముందర నొక్క తేరెక్కె శ్రీకృష్ణుడు**
**వేంకటేశు డెక్కినదె వేరొక్క తేరు**
**లంకెలై శ్రీ భూసతులు లలి నొక్క తేరెక్కిరి**
**కొంకక వీథుల నడగొండలో యనగను ॥కోనే॥**

**యిరవై శ్రీకృష్ణునిది యిదె వానర ధ్వజము**
**గరుడ ధ్వజము శ్రీ వేంకటపతిది**
**కరిలాంఛన ధ్వజము కమలకు మేదినికి**
**అలరి చూపట్టెను బ్రహ్మాండాల వలెను ॥కోనే॥**

**చెలగి చెరుకు విల్లు చేతబట్టె శ్రీకృష్ణుడు**
**బలు శ్రీవేంకటేశుడు పట్టె జక్రము**
**అలమేలుమంగ భూమి యంబుజాలు చేబట్టిరి**
**కలిసి మెలసేరు బంగారు మేడలనగ ॥కోనే॥**

**- అధ్యాత్మ కీర్తనలు, 3-517**

మూడురథాల ఉత్సవము - ధ్వజము - ఆయుధము

**1. శ్రీకృష్ణుని తేరు - హనుమధ్వజము - చెరకువిల్లు**
**2. వేంకటేశుని తేరు - గరుడధ్వజము - చక్రము**
**3. శ్రీభూదేవుల తేరు - గజధ్వజము - పద్మములు**

అన్నమాచార్యుల దృష్టిలో వేంకటేశుడు విష్ణుదేవుడు. త్రిమూర్తులేకమైన మూర్తి. పరమాత్మ. తిరువేంకటాద్రి విభుని స్వరూప, స్వభావములను, తత్త్వాన్ని వైభవాన్ని ఇట్లు కీర్తించాడు.

**నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు**
**సత్యాత్ముడైయుండి సత్యమై తానుండు**
**ప్రత్యక్షమైయుండి బ్రహ్మమైయుండు సం**
**స్తుత్యుడీ తిరువేంకటాద్రి విభుడు ॥పల్లవి॥**

**ఏమూర్తిలోకంబు లెల్ల నేలెడు - నాత**
**దేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడు - నాత**
**దేమూర్తి నిజమోక్షమియ్యజాలెడు నాత**
**దేమూర్తి లోకైక హితుడు**

**యేమూర్తి నిజమూర్తి యేమూర్తియును గాడు**
**యేమూర్తి త్రైమూర్తులేకమైన యాత**
**దేమూర్తి సర్వాత్ము దేమూర్తి పరమాత్ము**
**డామూర్తి తిరువేంకటాద్రి విభుడు ॥నిత్యా॥**

**యేదేవు దేహమున నన్నియును జన్మించె**
**నే దేవు దేహమున నన్నియును నణగె మరి**
**యేదేవు విగ్రహం బీ సకలమింతయును**
**యేదేవు నేత్రంబు లినచంద్రులు**



**యేదేవుడీ జీవులన్నింటిలోనుండు**
**నేదేవు చైతన్య మిన్నిటికి నాధార**
**మేదేవు డవ్యక్తు దేదేవు డద్వంద్యు**
**డా దేవుడీ వేంకటాద్రి విభుడు ॥నిత్యా॥**

**యే వేల్పు పాదయుగమిలయు నాకాశంబు**
**యే వేల్పు పాదకేశాంతంబనంతంబు**
**యే వేల్పు నిశ్వాస మీమహామారుతము**
**యే వేల్పు నిజదాసులౌ పుణ్యులు**
**యే వేల్పు సర్వేశు డే వేల్పు పరమేశు**
**డే వేల్పు భువనైకహిత మనోభావకుడు**
**యే వేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము**
**ఆ వేల్పు తిరువేంకటాద్రి విభుడు ॥నిత్యా॥**

**- అధ్యాత్మకీర్తనలు,1-75 (1998)**

అన్నమాచార్యుల ఆధ్యాత్మక కీర్తనలలో భక్తిగీతములేగాక, తత్త్వములను బోధించు సంకీర్తనలు కూడ ఉన్నవి. జీవుడు వేంకటేశుని మాయలదగిలి ఎన్ని జన్మలు ఎత్తినాడో, ఎన్ని సంబంధాలను గల్గియున్నాడో, ఎందరికి కొడుకుగా, ఎందరికి తోబుట్టువుగా జన్మించినాడో, ఇకమీదట ఎన్ని జన్మలు పొందగలడో, ఎన్ని పదవులను పొందినాడో అంటూ జీవుని సంసార చక్రమును విశ్లేషించి, వర్ణించినాడు ఇట్లు-

**ఎవ్వరెవ్వరివాడొ యీ జీవుడు చూడ**
**నెవ్వరికి నేమౌనొ యీ జీవుడు ॥పల్లవి॥**

**ఎందరికి గొడుకుగా డీ జీవుడు వెనక**
**కెందరికి దోబుట్ట డీ జీవుడు**
**యెందరిని భ్రమయించ డీ జీవుడు దుఃఖ**
**మెందరికి గావింప డీ జీవుడు ॥ఎవ్వ॥**

యెక్కడెక్కడ దిరుగ డీ జీవుడు వెనక
కెక్కడో తనజన్మ మీ జీవుడు
యెక్కడి చుట్టము దనకు నీ జీవుడు యెప్పు
దెక్కడికి నేగునో యీ జీవుడు ॥ఎవ్వ॥

ఎన్నడును జేటులే నీ జీవుడు వెనక
కెన్ని దనువులు మోవడీ జీవుడు
యెన్నగల తిరువేంకటేశు మాయల దగిలి
యెన్నిపదవుల బొంద డీ జీవుడు ॥ఎవ్వ॥

– అధ్యాత్మ కీర్తనలు, 1-97 (1998)

తన సంకీర్తనల విశిష్టతను గూర్చి అన్నమయ్య ఇట్లు పలికినాడు.

దాచుకో నీ పాదాలకు దగ నే జేసిన పూజలివి
పూచి నీ కీరితి రూపపుష్పము లివి యయ్యా ॥పల్లవి॥

వొక్కసంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించగ
తక్కినవి భండారాన దాచి వుండనీ
వెక్కసమగు నీ నామము వెల సులభము ఫల మధికము
దిక్కై నన్నేలితి విక నవి తీరని నా ధనమయ్యా ॥దాచు॥

నానాలికపైనుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్ను బొగడించితివి
వేనామాల వెన్నుడా వినుతించ నెంతవాడ
కానిమ్మని నా కీ పుణ్యము గట్టితి వింతేయయ్యా ॥దాచు॥

యీమాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితి గాని
చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాడగాను
నేమాన బాడే వాడను నేరము లెంచకుమీ
శ్రీమాధవ నీ దాసుడ శ్రీ వేంకటేశుడవయ్యా ॥దాచు॥

– అధ్యాత్మ సంకీర్తనలు 2-338



తాళ్ళపాక అన్నమయ్య, అహోబల పీఠాధిపతి ఆదివన్ శఠగోపయతిచే వైష్ణవునిగా సంస్కారము పొందినపుడు 32 అక్షరములుగల నృసింహ మంత్రము ఉపదేశించబడినాడు, అన్నమయ్య ఆ మంత్రమును జపించి సిద్ధిపొంది వేంకటేశునిపై 32,000 సంకీర్తనలను రచించాడు. వాల్మీకి మహర్షి 24 అక్షరములుగల గాయత్రిని జపించి 24,000 శ్లోకములలో రామాయణమును రచించినాడు గదా! ఈ సంకీర్తనలన్నీ వేంకటేశ్వరస్వామి అన్నమయ్యచే పలికించినవే. ఈ సంకీర్తనలన్నింటిని అన్నమయ్య వేంకటేశ్వర స్వామిపాదాలకు సమర్పించిన స్వామికీర్తి రూప పూజాపుష్పములు. కనుక అన్నమయ్య తనను సంసారబంధమునుండి రక్షించుటకు ఒక్క సంకీర్తనే చాలునని భావించినాడు. ఇది తన సంకీర్తనా విశిష్టతపై అన్నమయ్యకుగల దృఢ విశ్వాసము. కనుకనే అన్నమాచార్యులు తక్కిన సంకీర్తనలు భండారాన దాచి వుంచనీ అని పలికినాడు. ఈ మాట అన్నమయ్య కాలానికే తిరుమల ఆలయంలో సంకీర్తనా భండారము కలదని స్పష్టము చేయుచున్నది. తన విశ్వాసము గర్వము కాదని, భగవంతుడే స్వతంత్రుడు. భక్తుడైన తాను ఎల్లప్పుడు దాసుడనని అన్నమయ్య విన్నవించుచున్నాడు.

భక్తుడు భగవంతునికి దాసుడగుటే కాదు. భక్తులకు–భాగవతులకు– కూడ దాసుడగుచున్నాడు. ఇదియే దాస్యభక్తి. ఇది నవవిధ భక్తి మార్గములలో ఒకటి. అన్నమయ్య శ్రీహరికి, వారి భక్తులకు, వారి సేవకులకు తాను దాసుడనని ఇట్లు ప్రకటించుచున్నాడు దాస్యభక్తిని.

అచ్యుత మిమ్ము దలచేయంతపని వలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరాలియ్యగా ॥పల్లవి॥

మిమ్ము నెరిగినయట్టి మీ దాసుల నెరిగే
సమ్మతి విజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీ సేవ సేసుకుండేటి వైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥అచ్యు॥

నిరతి నీకు మొక్కే నీ డింగరీలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్ను బూజించే ప్రపన్నుల బూజించే
సరిలేని భాగ్యము చాలదా నాకు ॥అచ్యు॥

అంది నీకు భక్తులైన యల మహానుభావుల
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీ వేంకటేశ కడు నీ బంటు బంటుకు
సందడి బంట నవుటే చాలదా నాకు ॥అచ్యు॥

– అధ్యాత్మ సంకీర్తనలు, 3-23

అన్నమయ్య దాసభక్తికి కులశేఖరాళ్వారు రచించిన 'ముకుందమాల' కావ్యంలోని ఈ క్రింది శ్లోకం ప్రేరణ ఇచ్చినట్లున్నది.

శ్లో॥ మజ్జన్మనః ఫలమిదం మధుకైట భారే!
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్యభృత్య
భృత్యస్య భృత్య ఇతి మాం స్మరలోకనాథ॥ – 27

ఓ మధుకైటభార! లోకనాథ! నా జన్మమునకు ఇదియే ఫలము. నాయందు నీవు చేయవలసిన అనుగ్రహము ఇదియే. నన్ను నీ యొక్క దాసదాస దాసదాస దాసదాస దాసుడని తలంచుము.

ఇట్లు కులశేఖరాళ్వారు, అన్నమాచార్యులు భగవంతుని సేవించుట కంటె భాగవతులను (భగవంతుని భక్తులను) సేవించుట, వారి అనుగ్రహము సంపాదించుట జీవితమునకు సాఫల్యమని భావించినారు. భగవంతునికి భక్తునికి గల సంబంధములో సేవ్యసేవక సంబంధము మిన్న.

అన్నమాచార్యులు తన భక్తిమీద, సంకీర్తనలమీద విశ్వాసంతో, సముచిత గర్వంతో నావల్లనే నీవు కీర్తిపొందేవు, నా వంటివానిని రక్షించినపుడే నీకు కీర్తిగలుగునని అతిచనువుతో వేంకటేశుని ఇట్లు హెచ్చరించాడు.



నేనొక్కడ లేకుండితే నీ కృపకు బాత్రమేది
పూని నా వల్లనే కీర్తి బొందేవు నీవు ॥పల్లవి॥

అతిమూఢులలోన నగ్రేసరుడ నేను
ప్రతిలేని ఘన గర్వపర్వతమను
తతి బంచేంద్రియముల ధనవంతుడ నేను
వెతకి నావంటి వాని విడువగ జెల్లునా ॥నేనొ॥

మహిలో సంసారపు సామ్రాజ్య మేలేవాడ నేను
యిహమున గర్మవహి కెక్కితి నేను
బహు యోని కూప సంపద దేలేవాడ నేను
వహించక నావంటివాని దే నోపేవా ॥నేనొ॥

భావించి నావంటి నీచుబట్టి కాచినప్పుడుగా
యేవంక నీకీర్తి గడు నెంతురు భువి
నావల్ల నీకు బుణ్యము నీ వల్ల నే బ్రదుకుదు
శ్రీ వేంకటేశుడ యింత చేరె జుమ్మీ మేలు ॥నేనొ॥

– అధ్యాత్మకీర్తనలు, 3-48

తుదకు అన్నమాచార్యులు హరిభక్తియే చాలు, హరి దాస్యమే చాలు, హరిసేవా పరుడౌటయే చాలు, నీ శరణమే చాలు అని శ్రీహరిని– వేంకటేశుని – ఇట్లు శరణు వేడుచున్నాడు.

ఇహమే కాని పరమే కాని
బహుళమై హరి నీపై భక్తే చాలు ॥పల్లవి॥

యెందు జనించిన నేమి యెచ్చోట నున్న నేమి
కందువ నీ దాస్యము గలిగితే జాలు
అందిన స్వర్గమే కాని అల నరకమే కాని
అందపు నీ నామము నా కబ్బుటే చాలు ॥ఇహ॥

**దొరయైన జాలు గడు దుచ్ఛపు బంటైన జాలు**
**కరగి నిన్ను దలచ గలిగితే జాలు**
**పరులు మెచ్చిన మేలు పమ్మి దూషించిన మేలు**
**హరి నీ సేవాపరు డౌటే చాలు ॥ఇహ॥**

**యిల జదువులు రానీ యిటు రాక మాననీ**
**తలపు నీ పాదముల తగులే చాలు**
**యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె**
**చలపట్టి నాకు నీ శరణమే చాలు ॥ఇహ॥**

**– అధ్యాత్మకీర్తనలు, 2-131**

ఒకనాడు రాజసభలో అన్నమయ్య పాడిన “ఏమొకో చిగురుటధరమున గస్తురి నిండెను, భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా” (5-82) అను శృంగార సంకీర్తనను విని, టంగుటూరు ప్రభువు సాళువ నరసింహ రాయడు గర్వముతో మైమరచి వేంకటవిభుని మీద చెప్పిన పదములవంటి శృంగార పదములు నా మీద చెప్పుమని అన్నమయ్యను కోరినాడు. అన్నమాచార్యుడు “హరి ముకుందుని గొనియాడు నా జిహ్వా, నిను గొనియాడ నేర”దని చెప్పి తిరస్కరించాడు. అన్నమయ్య తిరస్కారానికి కోపించి, సాళువ నరసింహరాయడు”.. .రాయరగండ” మను పేరుగల సంకెల వేయించి, చెరసాలలో పెట్టించినాడు. అప్పుడు అన్నమయ్య “సంకెలలిడువేళ జంపెడువేళ నంకిలి ఋణదాత లాగెడు వేళ” ఇత్యాదిగా సంకీర్తనను చెప్పి, వేంకటేశుని కృపచేత సంకెల వదలించుకొన్నాడు. ఆ మహిమగల కీర్తన ఇట్లున్నది-

**ఆకటి వేళల నలపైన వేళలను**
**తేకువ హరినామమే దిక్కు మరి లేదు ॥పల్లవి॥**

**కొరమాలివున్న వేళ కులము చెడిన వేళ**
**చెరవడి వొరుల చే జిక్కిన వేళ**



**వొరపైన హరినామ మొక్కటే గతిగాక**
**మరచి తప్పిన నైన మరి లేదు తెఱగు ॥ఆక॥**

**ఆపద వచ్చిన వేళ యారడిబడిన వేళ**
**పాపపు వేళల భయపడిన వేళ**
**వోపినంత హరినామ మొక్కటే గతి గాక**
**మాపుదాకా బొరలిన మరిలేదు తెఱగు ॥ఆక॥**

**సంకెల బెట్టిన వేళ చంపబిలిచిన వేళ**
**అంకిలిగా నప్పులవా రాగిన వేళ**
**వేంకటేశు నామమే విడిపించ గతిగాక**
**మంకుబుద్ధి బొరలిన మరిలేదు తెఱగు ॥ఆక॥**

**– అధ్యాత్మిక కీర్తనలు, 1-158**

ఈ మహిమాన్వితమైన సంకీర్తనను వేంకటదాస అను పాశ్చాత్య విద్వాంసుడు ఇట్లు ఆంగ్లీకరించినాడు (1997)

## "THE ONLY WAY"

-1997, Venkatadasa

*a Transcomposition based on:*

**AKATIVELALA** *by Annamacharya*

CHORUS REFRAIN

In Strife's Loss, or Plenty's Stress Play,
The Saving Holy Name's d'Only Way...

VERSE ONE

If Spoiled Hopeless, in Bad Caste Times...
Or Shackled, Prisoned n'Tortured.....('bout what's fine..)

The Sweet Smooth and Easy Holy Name....
Do Save Your Damn-Soul, All The Same....

VERSE TWO

If Come Danger, Victim of Hell,
If Crying Fear, Falls Beyond The Well,
The Consummate Lord's Holy Name
Do Cradle You, to Win the Game....

VERSE THREE

(If/When'z) You'z Tied for the Butchers' Knife
A Yelling Edge on Credit's Life,
There (on) Yonder Resound, Only His Name,
As Your (Freak'n/Rotten) Life's, (Done/All) Been Framed.....

దాస్యభక్తితో దాసోహమనుట, ఆత్మదోషప్రకటన, దీనత్వము, వినయము మున్నగునవి అంగములుగా ఉన్నవి. అన్నమాచార్యులు తన దీనస్థితిని ఇట్లు వెల్లడించుచున్నాడు.

**దీనుడ నేను దేవుడవు నీవు**
**నీ నిజ మహిమే నెరపుట గాకా ॥పల్లవి॥**

**మతి జననమెరుగ మరణం బెరుగను**
**ఇతవుగ నిను నిక నెరిగేనా**
**క్షితి బుట్టించిన శ్రీపతివి నీవే**
**తతి నాపై దయ దలతువు గాకా ॥దీను॥**



**తలచ బాపమని తలచ బుణ్యమని**
**తలపున ఇక నిను దలచేనా**
**అలరిన నాలో యంతర్యామివి**
**కలుష మెడయ నను గాతువు గాకా ॥దీను॥**

**తడవ నా హేయము తడవ నా మలినము**
**తడయక నీ మేలు దడవేనా**
**విడువలేని శ్రీ వేంకట విభుడవు**
**కడదాకా నిక గాతువు గాకా ॥దీను॥**

**– ఆధ్యాత్మ కీర్తనలు, 3–474**

అన్నమయ్య దాస్యభక్తిని సూచించుచున్న ఈ సంకీర్తనను వేంకటదాస అను పాశ్చాత్య విద్వాంసుడు ఇట్లు ఆంగ్లీకరించినాడు (1997)

**"I'M HELPLESS, YOU'RE ALMIGHTY!"**

-1997, Venkatadasa

*a Transcomposition based on:*

***DINUNDA NENU** by Annamacharya*

GROUP CHORUS

Helpless Am I.....You're Almighty.....
You Lord Prevade Infinity...

VERSE ONE

This Birth's Beyond All Unknown Deaths,
At Best Could I er'Serve To Test.....
Stuck "*Bhu-ed*" on Earth....*Sri Venkata*....
Do Bless.....Do Care For Me, Hari *!!!*

VERSE TWO

Some Say Sin, Or Sacred, Partly Be....
Now See All.....You'r Infinity....
Essence....Resilient Ecstasy...
Oh Save Me....From Dire Impiety....

VERSE THREE

Let's Spare Count of My Sinful Lives,
To Slide Alight Your Lotus Feet.....
O'*Sri Venkata* !!! I Beg Abide.....
Your Worst Saved Soul Eternally !!!

పొడుపు కథలు శ్రోతలలో జిజ్ఞాసను, ఉత్సుకతను రేకెత్తించి, ఆలోచనాశక్తిని పెంపొందింపజేస్తాయి. అన్నమయ్య పొడుపుకథల పద్ధతిలో దశావతారములను ఇట్లు చమత్కారంగా వర్ణించాడు.

**ఎవ్వడో కాని యెరుగరాదు కడు**
**దవ్వులనే వుండు తలపులో నుండు** ॥పల్లవి॥

**ఎడయవు తన రెక్కలెగసి పోలేదు**
**కడు దాగు గాని దొంగయు గాడు**
**వడి గిందుపడును సేవకుడును గాడు**
**వెడగు గోళ్ళవెంచు విటుడును గాడు** ॥ఎవ్వ॥

**మిగులా బొట్టివాడు మింటికిని బొడవు**
**జగడాలు, తపసి వేషము**
**మగువకై పోరాడు మరి విరక్తుడును**
**తగు గాపుబనులు నెంతయు దెల్లదనము** ॥ఎవ్వ॥



**తరుణుల వలపించు తగిలి పైకొనడు**
**తురగము దోలు రౌతును గాడు**
**తిరువేంకటాద్రిపై దిరుగు నెప్పుడును**
**పరమ మూర్తియై పరగు నీ ఘనుడు** ॥ఎవ్వ॥

**- అధ్యాత్మ కీర్తనలు, 4-8 (1998)**

వేంకటాద్రిపై వెలసిన ఘనుడే శ్రీమన్నారాయణుడని, ధర్మసంస్థాపనకు ఆ స్వామి ధరించిన దశావతారములను-మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, బుద్ధ, కల్కి అవతారములను-క్రమముగా, విలక్షణంగా వర్ణించాడు.

* * *

## 3. అన్నమయ్య పదముల ప్రశంసలు

తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు అన్నమాచార్యుల సంకీర్తనములను ఇట్లు సన్నుతించాడు.

**సురలకు నరులకు సొరిది విన విన**
**అరుదు తాళ్ళపాక అన్నమయ్య పదములు** ॥పల్లవి॥

**చక్కెరై చవి చూపీ జాలై తావి చల్లీ**
**నక్కజపు మాతు వజ్రాలై మెరసీని**
**నిక్కుటద్దములై మా నిలువు నీడలు చూపీ**
**నక్కర తాళ్ళపాకాన్నమయ్య పదములు** ॥సుర॥

**పన్నీరై పైబూసీ గప్రంబై చలువ రేచీ**
**మిన్నగల ముత్యములై మెయి నిండీని**
**వెన్నుబలములై మా వెంట వెంట దిరిగీని**
**అన్నిట తాళ్ళపాక అన్నమయ్య పదములు** ॥సుర॥

**నెట్టన వేదాంతములై నిత్యములై పొడచూపీ**
**పుట్టు తోనె గురువులై బోధించీని**
**గట్టి వరాలిచ్చే శ్రీ వేంకటనాథుని మెప్పించీ**
**నట్టె తాళ్ళపాక అన్నమయ్య పదములు. ॥సుర॥**

**- శేషాచార్యుల వ్రాతప్రతి**

తాళ్ళపాక చినతిరుమలాచార్యులు సంకీర్తన లక్షణములో అన్నమాచార్యుల సంకీర్తనల విశిష్టతను ఇట్లు కొనియాడినాడు-

**శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమ వీథులై వివిధమంత్రార్థంబులై నీతులై**
**కృతులై వేంకటశైలవల్లభరతిక్రీడా రహస్యంబులై**
**నుతులై తాళులపాకయన్నయ వచోనూత్న క్రియల్ చెన్నగున్.**

ఇట్లు అన్నమయ్య సంకీర్తనలు వైవిధ్యభరితములై విలక్షణములై విజ్ఞాన సర్వస్వములై వేంకటేశుని మెప్పు పొందినవి. అన్నమాచార్యోదాహరణ కావ్యమును తిమ్మావఝుల కోదండరామయ్య (1955) రచించారు.

* * *

## 4. తోదయ మంగళం

తాళ్ళపాక అన్నమాచార్యుల, వారి వంశీయుల కీర్తనలు కొన్ని కావేరి తీరప్రాంతంలో నేటికీ సజీవంగా నిలిచి ఉన్నాయి. మేలట్టూరు భాగవతమేళా వారు ప్రతిసంవత్సరం ప్రదర్శించే నాట్యనాటక కార్యక్రమంలో ప్రతిరోజూ తాళ్ళపాకవారు రచించిన అయిదు సంకీర్తనలను విడిగా జతులతో కలిపి గానం చేస్తారు. అవి

**1) జయ జానకీ రమణ జయ విభీషణ శరణ**
**జయ సరోరుహచరణ జయ దనుజ హరణ ॥పల్లవి॥**



**2) శరణు శరణు సురేంద్ర సన్నుత**
**శరణు శ్రీపతి వల్లభా**
**శరణు రాక్షస గర్వ సంహర**
**శరణు వేంకటనాయకా ॥పల్లవి॥**

**3) మురహర భవహర ముకుంద మాధవ......**
**వేదోద్ధర శ్రీ వేంకటనాయక**
**నారదప్రియతే నమో నమో॥**

ఈ సంకీర్తన మొదటి చరణంతో ప్రారంభమవుతుంది. ఈ కీర్తన ప్రారంభం-

**నారాయణ తే నమో నమో**
**నారద సన్నుత నమో నమో ॥పల్లవి॥**

ఇది భజన సంప్రదాయంలో కలిగిన మార్పు.

**4) దేవేశ గణారాధిత దివ్యాంబుజ పాదా**
**శ్రీవేంకటగిరినాయక శ్రీశ హెచ్చరికా! ॥పల్లవి॥**

**5) మాధవ భవతు తే జయ మంగళం**
**మధు మురహర తే జయ మంగళం ॥పల్లవి॥**

ఈ అయిదు సంకీర్తనలను ఉమ్మడిగా తోదయమంగళం అంటారు. దీనికి తొలుతటిమంగళం (మంగళాదిని) అని అర్థం. ఈ తోదయమంగళం అయిదు సంకీర్తనలు మేలట్టూరు భాగవతమేళా ప్రదర్శనలకు ముందు మాత్రమేగాక తమిళనాడులోని భజనకూటాలలో కూడ ఈ అయిదు తాళ్ళపాకవారి సంకీర్తనలను కార్యక్రమం మొదట్లో పాడుతారు. ఈ భజన సంప్రదాయ ప్రవర్తకుడు అన్నమాచార్యుల మనుమడు, పెద తిరుమలాచార్యుల నాల్గవకుమారుడగు చిన్నన్న. తాళ్ళపాకవారి సంకీర్తనలు భజన సంప్రదాయం నాయకరాజుల కాలంలో దక్షిణదేశంలో వ్యాపించి, నేటికీ సజీవంగా నిలిచి

ఉన్నాయి. తమిళనాడులో 300 సంవత్సరముల క్రిందట దక్షిణ సంప్రదాయ భజనపద్ధతిని శ్రీ బుద్ధేంద్రస్వామి, శ్రీధర వేంకటేశ, శ్రీ సద్గురుస్వామి అను గురుత్రయము నెలకొల్పినారు. ప్రచారము చేసినారు.

* * *

## 5. శృంగారమంజరి

మంజరీ ద్విపద ఛందములో తాళ్లపాక అన్నమాచార్యుడు శృంగారమంజరి అను లఘుకావ్యమును రచించి వేంకటనాథునకు అంకితమిచ్చినాడు. ఈ లఘుకావ్యమున 520 ద్విపదపాదములు గలవు. ఇతివృత్తము వేంకటాద్రీశుని శృంగార సంబంధమగుటచే ఈ కావ్యమునకు శృంగారమంజరి అనుపేరు. సార్థకముగ ఉన్నది.

కావ్యము శ్రీకారముతో ప్రారంభమై మంగళమహాశ్రీలతో అంతమగుచున్నది. వేంకటనాథుని వర్ణనతో కావ్యము ప్రారంభమైనది.

**"శ్రీ కామినీవక్షు జిత హిరణ్యాక్షు**
**భువన పాలనదక్షు బుండరీకాక్షు.....**
**వివిధ లోకాధీశు వేంకటాద్రీశు**
**నధిక తేజోమూర్తి నలరెడువాని**
**గంగానదీ జన్మకారణం బనగ**
**బొగడొందు తన పదాంభోజముల్ సూపి**
**యింపొంద వైకుంతమిదియ సుమ్మనుచు**
**సొంపొంద వలకేల జూపెడువాని**
**ఘనదైత్య గర్వాంధకారంబు లెల్ల**
**మానుప దేదీప్యమానమై వెలుగు**
**చక్రగదా శంఖశార్ఙ్గంబు లెపుడు**
**తలకొని యిరువంక దాల్చినవాని"**



వేంకటపతి శృంగార పురుషుడు. స్త్రీల నాకర్షించు సోయగముగల వాడు. సమస్త కల్యాణ గుణాభిరాముడు. అందుచే ఎందరో యువతులు శ్రీనివాసుని వరించి, కృతార్థలయినారు. ఒకబాల (పద్మావతి) వేంకటనాథుని గుణగణములువిని అతనిపై మనసు నిలిపింది. విరహము ప్రాప్తమయింది. చెలికత్తెలు ఆమెను ఉద్యానవన విహారమునకు తీసుకొని వెళ్ళారు. వసంతశోభ, ప్రశాంత శీతలవాతావరణము ఆమె తాపమును అధికం చేశాయి. అప్పుడు సఖులు ఆమె ప్రేమను వేంకటేశునికి విన్నవించారు. స్వామి దయతో వనమునకు విచ్చేసినాడు. ఆ భువన మోహనాకారుని చూడగనే ఆమె విరహము అగ్గలమైనది. స్వామి స్వస్థానము చేరినాడు. నాయిక తాపము అతిశయించింది. చెలులు ఆమెను రక్షింపుమని వేంకటేశుని పలుమార్లు ప్రార్థించారు. వేంకటేశుడు కరుణతో నాయికను చేరదీసి, సాంత్వనపరచినాడు. నాయిక ధన్యురాలయింది. చెలులు సంతోషించారు.

అన్నమయ్య ఈ కావ్యంలో వేంకటనాథుని "మగువల వయసు లామని కొల్లకాడుగ, అఖిల శృంగారాబ్ధి కధిపతిగా" వర్ణించాడు. ఈ శృంగార మంజరిలో అన్నమయ్య వియోగ, సంయోగ శృంగారములను పరిపోషించాడు. వియోగ శృంగారమునకు తగినట్లు నాయిక విరహతాపమును, దానికి ఉద్దీపనముగా వనవిహారమును, వసంతశోభను, ప్రకృతి రామణీయకమును వర్ణించాడు. సంయోగ శృంగారమును రమణీయముగ వర్ణించాడు. వసంతశోభను శృంగారరస పరిపోషకముగా ఇట్లు వర్ణించాడు.

**"వనలక్ష్మి పూర్ణయౌవనవీధియందుఁ**
**గడగి మాధవుఁడు వేడ్కలఁ గ్రొత్తగాఁగ**
**నొత్తిన నఖపంక్తు లున్నచందమునఁ**
**గింశుకంబులు గోరగించి మోదించె**
**గురువింద లిగిరించె గుత్తులు నించె**
**మాకంద తరు లేచె మల్లెలు పూచె"** **పుట:3**

శృంగారమంజరి ముగింపు ఇట్లున్నది.

**"వందిమాగధుల కైవారంబుఁ తోడ**
**సిద్ధ విద్యాధర శ్రేణులఁ తోడ**
**దనతోడఁగూడిన తన్వంగితోడ**
**వృషభాద్రినాథుఁ దుర్వీపతి ప్రియుఁడు**
**వేడ్కతో నగర ప్రవేశంబు చేసె**
**నని భక్తిఁ దిరువేంకటాద్రీశు పేరఁ**
**గారుణ్య లక్ష్మీప్రకాశుని పేర**
**.................................**
**గురుభరద్వాజైక గోత్రపావనుఁడు**
**నందాపురీవంశ నాయకోత్తముఁడు**
**అనఘుఁడు తాళ్ళపాకాన్నయార్యుండు**
**మధురంపు శృంగార మంజరి చెప్పె**
**ధరమీఁద నా చంద్రతారకం బగుచుఁ**
**గడిమిఁ బెంపొందు మంగళ మహాశ్రీల"**

**శ్రీకృష్ణార్పణమస్తు మంగళ మహాశ్రీ శ్రీఁ జేయున్**
**- శృంగారమంజరి, పుట: 14 (1935)**

ఈ కావ్యమున వర్ణింపబడిన విషయము పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవము వేంకటాచలమాహాత్మ్యములోనిదే. అన్నమాచార్యుడే తిరుమలలో వేంకటేశ్వర స్వామివారికి కల్యాణోత్సవమును ప్రారంభించి, తాను కన్యాదాతగా వ్యవహరించినాడు. అన్నమయ్య సంకీర్తనలలో వేంకటేశుని పెండ్లిపాటలు గలవు. (అధ్యా: 3-194).

* * *



## 6. వేంకటేశ్వర శతకము

అన్నమాచార్యులు రచించిన పదిరెండు శతకములలో మనకు లభించిన ఒక్క శతకము వేంకటేశ్వరశతకము. ఇది వేంకటేశ్వరా! అను మకుటముతో ఉత్పలమాల, చంపకమాల వృత్తములలో రచింపబడిన వృత్తశతకము. ఇందు 100 పద్యములు ఉన్నవి. శతకమున ప్రారంభపద్యమిట్లున్నది.

**శ్రీసతి నీల జాంబవతి శ్రీయమునా సతి సత్యభామ ధా**
**త్రీసతిరుక్మిణీరమణి దేవి యిలాసతి వీరలందరున్**
**జేసినసేవ చేసెదను జేకొను శ్రీయలమేలుమంగ నీ**
**మూసిన ముత్యమై యురము ముంగిటఁ జెంగట వేంకటేశ్వరా!**

ఇందు అన్నమయ్య శ్రీసతినుండి ఇళాసతి వరకుగల వారుచేసిన సేవలకు తక్కువకాని మూసిన ముత్యమై యురము ముంగిట చెంగట చేర్చుకొమ్మని వేంకటేశ్వరుని ప్రార్థించినాడు. అన్నమయ్యకు అలమేలుమంగపైగల భక్తిప్రపత్తులు మొదటి పద్యములోనే వెల్లడౌచున్నవి.

బ్రహ్మాది దేవతలే అలమేలుమంగను శ్రీవారి కటాక్షమును ప్రసాదింపుమని ప్రార్థించుచున్నారు. అన్నమయ్యకూడ అలమేలుమంగను పొగడుతూ, ఆ తల్లిని నీ విభున కించుక మాదెస జూపు మంచు ప్రార్థించినాడు. (5) ఈ శతకంలోని భావాలు అన్నమయ్య చెప్పబోవు శృంగార ప్రధానమైన, భక్తిభావములుగల కీర్తనలకు నాందిగా కనిపించుచున్నవి. ఈ శతకములో అన్నమయ్య వేంకటేశ్వరుని సంబోధిస్తూ, అలమేలుమంగకే ప్రాధాన్యతనిచ్చి వర్ణించినాడు. అలమేలుమంగకు వేంకటేశ్వరునిపైగల ప్రేమ, పలుకుబడులను ఉపయోగించి దైవసాన్నిధ్యము చేర తలపెట్టిన సాధకుడు అన్నమయ్య. ఆమె మరుగుజొచ్చి, కరుణా కటాక్షముల వేడుటలో అన్నమయ్య భక్తియుక్తులు, గడుసుదనం వెల్లడౌచున్నవి.

**చొచ్చితి దల్లి నీ మఱుఁగు సొంపుగ నీ కరుణాకటాక్ష మె**
**ట్లిచ్చెదొ నాకు నేఁడు పరమేశ్వరి! యో యలమేలుమంగ! నీ**
**మచ్చిక నందు నీ తరుణి మన్నన నే నినుఁగంటి నీకు నా**
**బచ్చెన మాట లేమిటికి భ్రాంతిని చూడఁగ వేంకటేశ్వరా! -55**

అన్నమయ్య కవిత్వము పోతన కవిత్వమువలె అంత్యానుప్రాసములతో కర్ణపేయముగ ఉన్నది.

**చక్కని తల్లికిన్ నవరసంబుల వెల్లికిఁ బుష్పవల్లికిం**
**జక్కని మోవి ముత్తియపు జల్లికి శ్రీయలమేలుమంగకున్**
**జెక్కులు మించుటద్దములు చేతులు క్రొత్తమెఱుంగుదీగ లా**
**క్రిక్కిరి గుబ్బలే పసిడిఁ కిన్నరకాయలు వేంకటేశ్వరా! (49)**

అన్నమయ్య వేంకటేశ్వరుని ఇట్లు కొనియాడినాడు.

**ఇతఁడలమేలుమంగ విభుఁడీతఁడె వో కలశాబ్ధికన్యకున్**
**సతతము జిత్తమిచ్చిన రసజ్ఞుఁడు ప్రాజ్ఞుఁడు సర్వవైభవో**
**న్నతుఁడు రమాసతీ ప్రియుఁడు నందకశార్ఙ్గధరుంఁ డటంచు ని**
**న్నతివలు మెచ్చిమెచ్చి కొనియాడుదు రెప్పుడు వేంకటేశ్వరా! -77**

అలమేలుమంగా వేంకటేశ్వరుల విహారములను, శృంగార విలాసములను అన్నమయ్య ఇట్లు వర్ణించాడు.

**ఒక్కొక నాటి రాత్రి సకలోన్నతు డైన ఖగేంద్రమూర్తిపై**
**నెక్కి వినోదలీలఁ జరియించుచు నయ్యలమేలుమంగఁమో**
**మక్కునఁ జేర్చుచున్ బహువిహారములన్ వనవీథులం బ్రియం**
**బెక్కువఁగాఁ జెలంగు విధమేమని చెప్పుదు వేంకటేశ్వరా! -24**

అన్నమయ్య ఈ శతకమున అలమేలుమంగా వేంకటేశ్వరుల దివ్యదాంపత్య శృంగారలీలలను అనేక సన్నివేశాలలో ఊహించాడు. ఇతరులకు తెలియని



దేవరహస్యాలు తనకు తెలియుననుచు అలమేలుమంగను ఖండితనాయికగా ఇట్లు చిత్రించాడు.

**ఎక్కడి కేగి వచ్చితి రమేశ్వర నీతను దివ్యగంధ మే**
**చక్కని యింతి మేని దని సారెకు నీ యలమేలుమంగ నీ**
**చెక్కు గళంబు గోళ్ళవడిఁ జేర్చుచు నీయలపార్చివేడుటల్**
**మక్కువ గల్గుకాంతలకు మర్మరహస్యము వేంకటేశ్వరా! -43**

అలమేలుమంగతోడి శృంగార విహారమున వేంకటేశ్వరుడు తన్మయము పొందుటను చిత్రముగా అన్నమయ్య ఇట్లు వర్ణించాడు.

**గీసినగోళ్ళచే బసిఁడి కిన్నర కంపితముల్ కదల్చుచున్**
**రాసెడి గుబ్బచన్నుల భరంబున నయ్యలమేలుమంగతో**
**మూసియు మూయ కక్షు లరమోడ్చుచు రెప్పలదేలఁ జే**
**యగా నాసల నీవు తన్మయము నందుట చిత్రము వేంకటేశ్వరా!-47**
**వాలిక నేత్రపద్మములు వంచిన యావదనంబు పద్మినీ**
**పాల జనింపనందుననె పద్మినియై యలమేలుమంగ గో**
**పాలక చక్రవర్తి నినుఁబాయని కౌఁగిట భోగలీల బాం**
**చాలుని జేసి పుష్పశర శాస్త్రవిదగ్ధుని వేంకటేశ్వరా! -99**

అని అన్నమయ్య వేంకటేశ్వరుని కామశాస్త్రమందలి పాంచాలజాతి పురుషునిగా వర్ణించాడు.

ఈ శతకములో అన్నమయ్య పద్యపుష్పములతో అలమేలుమంగను, వేంకటేశ్వరుని పూజించుచున్నట్లుగా కేవలం ఉత్పలమాల, చంపకమాల ఛందములలోనే రచించినాడు. వేంకటేశ్వరా! అను మకుటముగల ఈ శతకమున అన్నమయ్య అలమేలుమంగా వేంకటేశ్వరుల దివ్యశృంగార విహారములను చిత్రించాడు. ఈ వేంకటేశ్వర శతకమున అలమేలుమంగ గుణగణముల ప్రశంసయే అధికముగా ఉండుటచే అన్నమాచార్యులు ఈ శతకమును అలమేలుమంగకే అంకితమిచ్చినాడు.

**అమ్మకు దాళ్ళపాకఘనుఁడన్నఁడు పద్యశతంబుఁ జెప్పెఁ గో**
**కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలుమంగకున్**
**నెమ్మది నీవు చేకొని యనేకయుగంబులు బ్రహ్మకల్పముల్**
**సమ్మదమంది వర్ధిలుము జవ్వనలీలల వేంకటేశ్వరా! -100**

ఈ వేంకటేశ్వర శతకము దివ్యదంపతుల భవ్యశృంగార విహారములను ఆలంకారికముగ, రసికజన మనోహరముగ వర్ణించింది. వ్యంగముగా ఈ శతకము జీవపరమాత్మల సంయోగమును, విశిష్టాద్వైత సిద్ధాంత సారమును ప్రతిపద్యమున వెల్లివిరియించినది. ఇట్టి విశిష్ట శతకమును రచించిన అన్నమాచార్యులు ధన్యజీవి. అన్నమాచార్య జీవిత చరిత్రను పొన్నారి దస్తగిరి “సంకీర్తనాచార్య అన్నమయ్య” అను నాటకముగా రచించాడు. దుత్తలూరి రామారావు” అన్నమయ్య చరిత్ర’ అను పద్యకావ్యం రచించాడు.

* * *

## 2. తాళ్లపాక పెద తిరుమలాచార్యులు

సంకీర్తనాచార్యుడు, పదకవితా పితామహుడు అయిన తాళ్ళపాక అన్నమాచార్యులు తన అవసాన కాలమున తన కుమారుడైన పెదతిరుమలాచార్యులను తన వలెనే దినమున కొక కీర్తన చెప్పి వేంకటేశ్వరుని పూజించుమని చెప్పినాడు. ఆనాటి నుండి పెదతిరుమలాచార్యులు (క్రీ.శ. 1450-1547) వేంకటేశ్వరాంకితముగ సంకీర్తనలను రచించి, గానము చేసి, స్వామిని మెప్పించినాడు. వేంకటేశ్వరస్వామి పెదతిరుమలాచార్యులకు త్రిపురుషపర్యంతముగా ప్రత్యక్షంబును, సప్తపురుష పర్యంతముగా మోక్షము అనుగ్రహించినాడు.

పెదతిరుమలాచార్యులు శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనలు, వేంకటేశ్వర వచనములు, శృంగార దండకము, చక్రవాళమంజరి, శృంగార వృత్త



శతకము, వేంకటేశ్వరోదాహరణము, శ్రీ వేంకటేశ్వర ప్రభాత స్తవము అను వేంకటేశ్వరాత్మక సాహిత్యమును సృష్టించినాడు. సంకీర్తనలలో 469 అధ్యాత్మ సంకీర్తనలు, 544 శృంగార సంకీర్తనలు మొత్తము 1,013 లభించినవి. పైన పేర్కొనబడిన వివిధ సాహిత్య ప్రక్రియలు లభించినవి. వేంకటేశ్వరాంకిత కావ్యములు ముందే పరిశీలించబడినవి.

పెదతిరుమలాచార్యులు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో విమానప్రదక్షిణ మార్గములో ఉత్తరదిక్కున సంకీర్తన భండారమును నెలకొల్పినాడు. అందు అన్నమయ్య సంకీర్తనలను, తన సంకీర్తనలను రాగిరేకులపై చెక్కించి, భద్రపరచినాడు. ప్రతి నిత్యము స్వామి సన్నిధిలో మేలుకొలుపు, పవళింపు సేవలందు తిరుమంజన వేళలందు. ఉత్సవ సమయములలో తమ సంకీర్తనలను గానము చేయుటకు సంగీత విద్వాంసులను ఇద్దరిని నియమించినాడు.

### 7. అధ్యాత్మిక సంకీర్తనలు - పెదతిరుమలాచార్యులు

పెదతిరుమలాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలన్నియు విశిష్టాద్వైత సిద్ధాంతములతో, వైష్ణవ తత్త్వములతో నిండియున్నవి. జ్ఞానులకు, ప్రపన్నులకు శ్రీ మన్నారాయణునిపై మనస్సు లగ్నమైయుండాలని పెక్కు ఉదాహరణములతో ఇట్లు వివరించాడు.

**పరమ సుజ్ఞానులకు ప్రపన్నులకు**
**మరుగురుని మీదట మనసుండ వలదా ॥పల్లవి॥**

**ఆకలిగొన్నవానికి నన్నముపై నుండినట్టు**
**యేకట నుండవలదా యీశ్వరుని పై**
**కాకల విటుల చూపు కాంతలపై నుండినట్టు**
**తేకువ నుండవలదా దేవుని మీదటను ॥పర॥**

పసిబిడ్డలకు నాస పాలచంటిపై నున్నట్లు
కొసరే భక్తి వలదా గోవిందునిపై
వెసదెరువరి తమి విడిదలపై నున్నట్టు
వసియించవలదా శ్రీవల్లభు మీదను ॥పర॥

నెప్పున ధనవంతుడు నిధి గాచియుండి నట్టు
తప్పక శ్రీ వేంకటేశు దగుల వద్దా
అప్పన మైన భ్రమ ఆలజాలాల కున్నట్టు
యిప్పుడే వుండవలదా యీతని మీదనూ ॥పర॥

**- అధ్యాత్మ కీర్తనలు, 15-46 (1998)**

శ్రీహరి విశ్వమయుడు అను విషయమును వివరించుటకు, విష్ణు స్వరూపులైన వైష్ణవులను కొలువుడని పెదతిరుమలాచార్యులు ఇట్లు ఉద్బోధించుచున్నాడు.

హరి విశ్వాత్మకుడు అందరిలో నున్నవాడు
దరిసించి బ్రదుకరో తప్పు లేదు యింకను ॥పల్లవి॥

దారు పాషాణములందు దైవముగా భావించి
కూరిమితో మీకు మీకె కొలిచేవారా
చేరి ప్రాణ ప్రతిష్ఠలు సేసే వాడు దేవుడే
కోరిక వైష్ణవులందు కొలువరో మీరు ॥హరి॥

వేదపురాణార్థమందు విశ్వాసము పెట్టుకొని
సోదించి తెలుసుకొనే సుగుడులాల
వేదమె మాటలుగాను వివరించే వైష్ణవులు
ఆది గురువులు వీరి నడుగరో మీరు ॥హరి॥

దేవుడే పెక్కు రూపులై తేరి యెదుటనుండగా
ఆవల వెదక బొయ్యే అసక్తులాల



శ్రీ వేంకటేశుడె మతి జిక్కినాడు దాసులకు
తావుకొని హరి నాత్మ దలచరో మీరు ॥హరి॥

పెదతిరుమలాచార్యులు సిరిని ఉరమున మోస్తూ వేంకటాద్రి మీద నున్న వేంకటేశుని శృంగారరాయలుగా చిత్రిస్తూ, మేలుకొలుపును ఇట్లు పాడినాడు.

మేలుకో శృంగారరాయ మేటి మదనగోపాలా
మేలుకోవే నాపాల మించిన నిధానమా ॥పల్లవి॥

సందడించే గోపికల జవ్వన వనములోన
కందువ దిరిగే మదగజమవు
యిందుముఖి సత్యభామ హృదయ పద్మములోని
గంధము మరిగినట్టి గండు తుమ్మెదా ॥మేలు॥

గతిగూడి రుకిమిణి కౌగిట పంజరములో
రతిముద్దు గురిసేటి రా చిలుకా
సతుల పదారువేల జంటకన్నుగలువల
కితవై పొడమిన నా యిందు బింబమా ॥మేలు॥

వరుస గొలనిలోని వారి చన్నుగొండలపై
నిరతి వాలిన నా నీలమేఘమా
సిరి నురమున మోచి శ్రీ వేంకటాద్రి మీద
గరిమ వరము లిచ్చే కల్ప తరువా ॥మేలు॥

**- అధ్యాత్మ కీర్తనలు, 15-215 (1998)**

వేంకటేశ్వరుడు ఎవరితో ఎటువంటి బంధుత్వము గల్గియున్నాడో వివరిస్తూ పెదతిరుమలాచార్యులు వేంకటాచలరమణుడే పరతత్వమని, వరదుడని ఇట్లు వర్ణించాడు.

తలచిచూడ పరతత్వంబితడు
వలసిన వారికి వరదుడితడు ॥పల్లవి॥

సిరికి మగ దమృత సింధువునకు నల్లుడు
సరుస పార్వతికి సయిదోడు
గరిమెల బ్రహ్మకు గన్నతండ్రి యితడు
పరగి శివునకు బావ యితడు ॥తల॥

అల దేవేంద్రుని యనుజుడితడు
మలసి చంద్రుని మరదితడు
కులమున నదితికి కొడుకూ నితడు
తలప సురాసురుల తాతయునితడు ॥తల॥

ప్రాణులకెల్లా బంధుడితడు
వాణికి మామగు వావి యితడు
జాణ శ్రీ వేంకటాచల రమణుడితడు
మాణికపు మన్మథుడితడు- ॥తల॥

**- అధ్యాత్మ సంకీర్తనలు, 15-234 (1998)**

పెదతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వరుడే బహురూపములలో ఉన్నాడనీ, అన్నింటికి అతడే సాక్షి అనీ, అంతరాత్మ అనీ వేంకటేశుని సాకార నిరాకార సగుణ నిర్గుణ రూపములను ఇట్లు వర్ణించాడు.

భావింప నీ వొక్కడవే బహురూపాల నుండుదువు
దేవదేవ నీ మహిమ దెలియగ వశమా ॥పల్లవి॥

నిన్నుదలచేవారిలో నిజరూపుతో నుండుదువు
అన్నిజంతువులలోన నంతరాత్మవై వుండుదువు
పన్ని పంచభూతముల లోపల నాధారమై వుండుదువు
వున్నమూఢులలో మాయనొనగూడి వుండుదువు ॥భావిం॥

సరస తరువులలో చైతన్యమవై వుండుదువు
గరిమె రాక్షసులలోన కానరాక వుండుదువు



సురలందు యీశ్వర సూచనతో నుండుదువు
అరయముక్తులలోన ఆనందమవై వుండుదువు ॥భావిం॥

జగములన్నిటిలోన సాక్షివై వుండుదువు
తగిలి వేదములలోన అర్థమై వుండుదు
జిగిమించ సర్వదాను శ్రీ వేంకటగిరి నుండుదు
సగుణమై దాసులకు సాకారమవై వుండుదువు ॥భావిం॥

**- అధ్యాత్మ సంకీర్తనలు, 15-345 (1998)**

వేంకటేశ్వరుని స్వరూపమును గూర్చి వెదవిచారాలు చేయవద్దు, విష్ణుదేవుడే వేంకటేశ్వరుడని పెదతిరుమలాచార్యులు ఇట్లు నిష్కర్ష చేసినాడు.

వెద విచారాలు వద్దు విష్ణుడితడే
యెదయని వరము లిచ్చీ నీ దేవుడే ॥పల్లవి॥

మున్ను బలభద్రునికి మూర్తియై నిల్చినవాడు
సన్నిధై మునులచే బూజ గొన్నవాడు
చెన్నుమీరు శేషాద్రి శిఖరమై యున్నవాడు
యిన్నిటి కెక్కుడైన వాడీ దేవుడే ॥వెద॥

చదువులలో జెప్పి స్వయం వ్యక్తమైన వాడు
కదిసి గుహునీ సేవ గైకొన్న వాడు
వెదకగా సురలకు విశ్వరూపై యున్నవాడు
యెదుట గానవచ్చీ నీ దేవుడే ॥వెద॥

తొండమాం జక్రవర్తితో మాటలాడిన వాడు
నిండుకొని పెద్దలకు నిధైన వాడు
అండనే శ్రీ వేంకటేశు డలమేలుమంగతోడ
యెండ నీడ కన్నుల వాడీ దేవుడే ॥వెద॥

### శ్రీకృష్ణుడు భగవద్గీతలో

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 18-66**

సమస్త ధర్మములను విడిచిపెట్టి నన్నొకని మాత్రమే శరణుపొందుము. నేను సమస్తపాపముల నుండి విముక్తునిగ జేసెదను" అని ఉపదేశించినాడు. ఈ శ్లోకము విశిష్టాద్వైతమున చరమశ్లోకముగా, మంత్రరాజముగా గౌరవింపబడుచున్నది. ఈ గీతా సారమును పెద తిరుమలాచార్యులు సంకీర్తనలో ఇట్లు వివరించినాడు.

**ఇదియే కామనిధాన మిదియే మూలధనము**
**యిదియే నమ్ముటగాక యితరము లేలా? ॥పల్లవి॥**

**'నమేభక్తః ప్రణశ్యతి' యనుమాట**
**అమోఘమై నీవానతియ్యగా**
**రమారమణుడ రతి నీ దాసులకెల్ల**
**సమో హి నితర విచారము లేలా? ॥ఇది॥**

**నాడు 'మామేకం శరణంవ్రజ' యనుమాట**
**పోడిమి దిక్కుల నీవెప్పుడు చాటగా**
**నేడు నీ దాసులమై నెరవేరితిమిగాక**
**వేడి వేడి కర్మపు విధులిడనేలా? ॥ఇది॥**

**అల 'యోగక్షేమం వహామ్యహ' మ్మనుమాట**
**అలరుచు తుదిపదమై వుండగా**
**నెలవై శ్రీ వేంకటేశ నిన్ను గొలిచిన మాకు**
**గలిగె నీకరుణ యే కథలు నేలా? ॥ఇది॥**

**- అధ్యాత్మ సంకీర్తనలు, 15-45 (1998)**

* * *



## 8. శృంగార సంకీర్తనలు - పెదతిరుమలాచార్యులు

అలమేలుమంగపై వలపుచేత వేంకటేశుడు ఆమె అవయవములను, నడతను స్వీకరించాడు. మిక్కిలి మోహముతో అలమేలుమంగను ఎదపై ధరించాడు. ఇట్లు వేంకటేశుని మోహమును వివరిస్తూ పెదతిరుమలాచార్యులు అలమేలుమంగ సౌందర్యమును చమత్కారముగా ఇట్లు వర్ణించాడు. కాము మాయల ఎవ్వారు ఏమిగారు?

**ఎటువంటిమోహమో యింతి నీపై నతనికి**
**తటుకున నురమున ధరియించె నిన్నును ॥పల్లవి॥**

**కామిని నీ నడపులు గజగమనములని**
**కామించి నీ పతి కరిగాచెను**
**కోమలపు నీ పిరుదు చక్రభావమని**
**నేమమై చక్రము చేత నిలిపినాడతడు ॥ఎటు॥**

**నెలత నీ నిలయము నీరజమనుచు బ్రియ**
**మలరి జలజనాభుడాయ నతడు**
**కలికి నీ గళము శంఖము బోలునని తా**
**దలచి పాంచజన్య ధరుడాయ నతడు ॥ఎటు॥**

**నిరతి నలమేల్మంగ నీ కురులు నలుపని**
**అరుదార నీలవర్ణుడాయ నతడు**
**గిరికుచవని నిన్ను గెరలి కౌగిట గూడె**
**పరగ శ్రీ వేంకటపతి యాయ నతడు ॥ఎటు॥**

**- శృంగార సంకీర్తనలు, 17-1**

ఒక ఖండితనాయిక వేంకటేశుని ప్రీతితో రాకొట్టుచూ సందెకాడ రమ్మంటే జామురాతిరి వచ్చావంటు, వలపుమాటలు చెబుతున్న వైనాన్ని పెదతిరుమలాచార్యులు ఇట్లు మనోహరంగా వర్ణించాడు.

తప్పక చెప్పరా వోరి దాచక నీవు
యెప్పుడు నీ వద్దగాక యెడసి వుండెనా ॥పల్లవి॥

సందెకాడ రమ్మనగా జాము వోయి వచ్చితివి
విందువలె నెవ్వతెకు వెచ్చామైతి వో
అందుకు వగవ నే నాపె నంటిన కౌగిలి
యిందు గలపే వంటా యింత లోగేను ॥తప్ప॥

పిలువ నంపిన చెలి బెట్టుకూడితి విందాక
తలపు నీకక్కడనే తమకించెనో
చలము నీతో గాదు చవిదప్పినందు మీద
బలిమి గలయబోతే పసలేవు పనులు ॥తప్ప॥

కప్పురమే యంపుమంటే గందవొడి యంపితివి
అప్పుడెక్కడికి బరాకై వుండితివో
యిప్పుడు శ్రీ వేంకటేశ యిటు నన్ను గూడితివి
నెప్పున నే కడమయినా నీకే నెలవూ ॥తప్ప॥

**- శృంగార సంకీర్తనలు, 17-6**

ఒక నాయిక వేంకటేశుని దక్షిణనాయకత్వాన్ని, నయగారి తనాన్ని దెప్పి పొడుస్తూన్న తీరును పెదతిరుమలాచార్యులు ఇట్లు రమణీయంగా వర్ణించాడు.

నేనెరుగనా విభుడ నీ సుద్దులు
నీ నయగారితనాల నెపాలు సేసేవు ॥పల్లవి॥

ఆనవెట్టి నన్నెక్కించి అట్టే తూగు మంచమూచి
ఆ నడుమ నాసెతో మాటలాడేవు నీవు
పూని యప్పటి నీవు పువ్వు చెందున వేసి
మోనాన నంతలో నాపె మోవి యానితివి ॥నేనె॥



చెక్కునొక్కి వేడుక నా చిక్కుదియ్యుచు
వుక్కు మీర నీ వాపె వొడి పట్టేవు
వెక్కసాన నింటిలోన విందు నాకు బెట్టించి
గక్కున నాపెను నీవు కౌగిలించేవు ॥నేనె॥

పరగ నిద్రించు మని పచ్చడము గప్పిపెట్టి
సరవితో నేలితివి సంగడి దాని
యిరవై శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టే
సరుసనే ఆపె దెచ్చి సంతసము సేసేవు ॥నేనె॥

**- శృంగారసంకీర్తనలు, 17-175**

తిరుమల శ్రీవారి ఆలయమునకు ఆగ్నేయమున ఉన్న వంటశాలలో ఉన్న దేవీ విగ్రహాన్ని ప్రస్తుతం వకుళమాత అని పిలుస్తున్నారు. పూజిస్తున్నారు. ఈ దేవీ విగ్రహానికి అలమేల్మంగకు (లక్ష్మీదేవి) వలెనే నాలుగుభుజాలు ఉన్నాయి. పై రెండు హస్తములలో పద్మాలు ఉండగా, క్రిందికుడిచేయి అభయ ముద్రతో, ఎడమచేయి వరదముద్రతోను ఉన్నాయి. కావున ఆమె అలమేల్మంగ అని పెద తిరుమలాచార్యులు ఇట్లు వర్ణించాడు.

అదె వంటశాలలోన అలమేలుమంగ నాంచా
రెదుట శ్రీ వేంకటేశు కితవైన యట్లు ॥పల్లవి॥

వెండిపైడి చట్లలో వేరె వేరె కూరలెల్ల
వండించి దొంతి వెట్టించి వద్ద నుండి
కొండల పొడవు గాగ కోటి బోనాలపరంజి
కుండల గుమ్మరింపించి కొలువై కూచుండి ॥అదె॥

పానకాలు శిఖరులు పటికంపు గొప్పెరల
పూని వాసనలుగాగ పువ్వు గట్టించి
వానినే నీలపు జట్టువములనే నించి నించి
ఆనించుకొని వడ్డించ నాయత్తపడీని ॥అదె॥

**అందెలు గల్లురనగా నడుగులు పెట్టిపెట్టి**
**విందు అలమేలుమంగ వేళ వేళను**
**చెందు శ్రీ వేంకటపతికి చేతులకు గడిగడి**
**అందియిచ్చి పొత్తున దానారగించి నదివో ॥అదె॥**

**- శృంగారసంకీర్తనలు, 17-316**

వంటశాల పర్యవేక్షణ గృహిణి బాధ్యత. శ్రీరామ, శ్రీకృష్ణుల తల్లులకు దేవాలయాలలో విగ్రహాలు లేవు. పూజలులేవు. పద్మావతీ దేవితో వివాహానంతరము, శ్రీనివాసుడు తపస్సు చేసి లక్ష్మీదేవిని వక్షఃస్థల లక్ష్మి (వ్యూహలక్ష్మి)గా స్వీకరించిన పిదప వేంకటేశ్వరుడుగా, అర్చామూర్తిగా వెలసినాడు. తాళ్ళపాక అన్నమాచార్యులు తొలిసారిగా తిరుమల దర్శించి నప్పుడు శ్రీవారి ఆలయ ప్రాంగణంలో శ్రీవారి దర్శనానంతరము విమాన ప్రదక్షిణ మార్గంలో ప్రదక్షిణం చేస్తూ

**శ్రీనివాసుని నమస్కృతి చేసి దండఁ**
**గానిపించిన భాష్యకారులఁ బొగడి**
**శ్రీనరసింహుని సేవ గావించి**
**దానవాంతకు జనార్దను సన్నుతించి**
**అలమేలుమంగకు నభివందనములు**
**సలిపి చెంగటి యాగశాల వీక్షించి**

అని తాళ్ళపాక చినతిరువెంగళనాథుడు (చిన్నన్న) అన్నమాచార్య జీవితచరిత్రలో (ద్విపదకావ్యం) వర్ణించాడు. కనుక వంటశాలలో ఉన్న దేవి వకుళమాతకాదు అలమేలుమంగ అని నిష్కర్ష.

వేంకటేశుని (పురుష) విరహమును వర్ణిస్తూ పెదతిరుమలాచార్యులు, చమత్కారంగా, రమణీయంగా అలమేలు మంగసౌందర్యమును ఇట్లు వర్ణించినాడు.



**ఎక్కడ నున్నదో యెప్పుడు వచ్చినో చెలి**
**దక్కినాలోచేరి తలపోతాయా ॥పల్లవి॥**

**పడతి పిలిచెనని పలుకబోతే నవి**
**గొడవల కోవిలకూతాయా**
**నడపులు సతివని నంటున గదిసిన**
**నిడివిని యదియొక నెమలాయ ॥ఎక్క॥**

**తరుణి చూపులని తప్పక చూచిన**
**నిరతపు మెరుగుల నిధియాయ**
**సరిజెలి మేనను సరసిలో దొడరిన**
**పొరినది తామెర పువ్వాయా ॥ఎక్క॥**

**కలగి వెరగుతో కాకల బొందిన**
**అలమేల్మంగే అరత నిదే**
**యెలమిని శ్రీ వేంకటేశుడ నేనిదె**
**వొలసి కూడితి నిదెవో దరిలోనా ॥ఎక్క॥**

**- శృంగార సంకీర్తనలు, 17-461**

అలమేలుమంగా వేంకటేశుల అవినాభావ సంబంధమును పెదతిరుమలాచార్యులు మనోహరముగా ఇట్లు వర్ణించినాడు.

**ఒకపరి కొకపరి కొయ్యారమై**
**మొకమున గళలెల్లా మొలచినట్లుండె ॥పల్లవి॥**

**జగదేకపతి మేన జల్లిన కర్పూర ధూళి**
**జిగిగొని నలువంక జిందగాను**
**మొగి జంద్రముఖి నురమున నిలిపె గనుక**
**పొగరు వెన్నెల దీగ బోసి నట్లుండె ॥ఒక॥**

పొరి మెరుగుజెక్కుల బూసిన తట్టుపునుగు
కరగి యిరుదెసల గారగాను
కరిగమన విభుడు గనక మోహ మదము
తొరిగి సామజ సిరి దొలకి నట్లుండె ॥ఒక॥

మెరయ శ్రీ వేంకటేశు మేన సింగారముగాను
తరచయిన సొమ్ములు ధరియించగా
మెరుగుబోణి యలమేలుమంగయు దాను
మెరుపు మేఘము గూడి మెరసి నట్లుండె ॥ఒక॥

**- శృంగార సంకీర్తనలు, 17-485**

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రతి శుక్రవారము జరిగే అభిషేకమును, అప్పటి శ్రీవారి సొబగును పెదతిరుమలాచార్యులు ఇట్లు వర్ణించాడు.

చూదరమ్మ యిదె నేడు సుక్కురారము
వేడుక చక్కదనాలు వేవేలైనాడు ॥పల్లవి॥

చప్పుడుతో బన్నీటి మజ్జనముతో నున్నవాడు
అప్పుడే ఆది నారాయణుని వలె
కప్పురకా పామీద గడు బూసుకొన్నవాడు
ముప్పిరి బులు కడిగే ముత్యము వలె ॥చూద॥

పొసగ నప్పటి దట్టు పుణు గలదు కొన్నాడు
కసుగందని కాలమేఘము వలెను
సుసరాన మేను నిండా సొమ్ము వెట్టుకొన్నవాడు
పసల బదారువన్నె బంగారు వలెను ॥చూద॥

అలమేలుమంగ నురమందు నిడుకొన్నవాడు
యెలమి సంపదలకు నిల్లువలెను



అలరుచు శ్రీ వేంకటాద్రి మీద నున్నవాడు
తలపోసి చూడగ దొంతర కొండ వలెను ॥చూద॥

**- శృంగార సంకీర్తనలు, 17-498**

పెదతిరుమలాచార్యుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు వైవిధ్య భరితములై, చమత్కార భావములతో పరమరమణీయములుగ ఉన్నవి.

* * *

## 9. శృంగార దండకము - పెదతిరుమలాచార్యులు

భక్తి ప్రధానములగు కావ్యప్రక్రియలలో దండకము ఒకటి. పాదనియమరహితమై అఖండ దండాకృతితో ఉండుటచే ఈ లఘు కావ్యమునకు దండకము అను పేరు సార్థకము. స్తుతిరూపమైన గద్యపద్య సమ్మి శ్రితమైన ఛందోవిశేషము దండకము. సంకీర్తనకు అనువైన ప్రక్రియ ఇది. ఆత్మాశ్రయకవితా రీతికి చెందినది.

దండకములందు ప్రధానముగా ఒక్క అక్షర గణమే మొదటినుండి చివరివరకు పునఃపునరావృత్త మగుచుందును. అన్నింటికి చివర గురువు ఉండుట సామాన్య లక్షణం. తెలుగు సాహిత్యములో గురువంతముతో ఉండునట్లుగా తగణ దండకములే అధికము. ఈ తగణము శ్రీకారముతో ప్రారంభించుటకు, ఆ వృత్తియందు శ్రవణ సుభగత్వము గలిగించుటకు అనువైనదగుటచే తగణ దండకములు ఎక్కువగా రచింపబడినవి.

నన్నయాది తెలుగుకవులు తమ కావ్యములలో స్తుతి సందర్భములందు దండకములను రచించారు. పోతన స్తుతిప్రధానమైన దండకమున ఇతివృత్తమును చేర్చి, దానిని ప్రత్యేక ప్రక్రియగా లఘు కావ్యముగా భోగినీ దండకమును శృంగార రసభరితముగ రచించినాడు. ఇట్లు దండకము ఇతివృత్తము, శృంగారరసము గలిగి నూతన కావ్యప్రక్రియగా మారింది. ఈ కోవకు చెందినదే పెదతిరుమలాచార్యుల శృంగార దండకము.

పెదతిరుమలాచార్యులు పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ కథను రసవంతముగా, లఘు కావ్యముగా ఈ శృంగార దండకమును రచించాడు. ఇది వేంకటాచలపతికి అంకితమీయబడింది. ఈ విషయమున పెదతిరుమలాచార్యులే కావ్యాంతమున ఇట్లు చెప్పుకొన్నాడు.

**సన్నుతి దాళ్ళపాక పురశాసనుఁడన్నయ తిమ్మనార్యుఁడ**
**త్యున్నతి చెప్పె దండకము దుగ్ధపయోనిధి కన్యకా రతి**
**స్ఫిన్న మృగీమదాంకునకు వేంకటభర్తకు నవ్యభోగ సం**
**పన్నున కారవీందుకుల పర్వత తారకమై చెలంగ గాన్॥**

ఈ దండకము శ్రీకారముతో ప్రారంభమై తగణములలో సాగి గుర్వంతమై ముగిసింది. దండకము అంకితాంక పద్యముతో ముగియుటను భోగినీ దండకమున పోతన ప్రారంభించినాడు. ఈ పద్ధతిని పెదతిరుమలయ్య అనుసరించాడు. స్వతంత్ర దండక లఘుకావ్యములు అంకితాంక పద్యముతో ముగియుట అనివార్య లక్షణమైంది.

పెదతిరుమలాచార్యులు ఈ శృంగార దండకమున ప్రారంభమున శ్రీ వేంకటేశ్వరుని గుణ విశేషములస్తుతి, రూపవర్ణనము ముక్తపదగ్రస్తాలంకారములో చేసి దండకమంతయు అంత్యానుప్రాసతో కొనసాగించాడు. దండకము **"శ్రీ వేంకటక్ష్మాధరోత్తుంగ శృంగాగ్ర నిత్య స్థిరాగారు, గారుత్మతోదీర్ణ సౌవర్ణభూషా విశేషోజ్జ్వలాకారు, గారుణ్య తారుణ్య లావణ్య సారప్రభాసద్మ పద్మా ధరా ధీర లీలాకరో దారసంసారు, సారూప్యసామీప్య సాలోక్య సంలోక్య సద్భక్త ముక్తవ్రజ స్తోత్ర పాత్రీ కృతాచారు, జారుక్రియా..."** అని ప్రారంభమై **"...శ్రీ వేంకటేశుండు సంప్రాప్త సంతోషుఁడై కామకోటీద్యుతి స్థాపితాశేషుఁడై సౌరతానేక చేష్టాలసద్భూషుఁడై సారనర్మప్రియాచారు సంభాషుఁడై సమ్మతిం గ్రమ్మరం గొమ్మతో గూడి తాముందు పెంపొందు నయ్యిందిరా మందిరంబైన యాత్మీయ గేహంబునందుం బ్రవేశించి యుండెం దగన్"** అని ముగిసింది.



ఇట్లు 150 పంక్తులలో రచింపబడిన శృంగార దండకము ఆద్యంతము రసవంతమైయున్నది. ఇందలి కథ అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు రచించిన శృంగార మంజరి, చక్రవాళమంజరి యందలి ఇతివృత్తము వంటిదే. వేంకటనాథుని గుణగణములను నాగాంగనలు కీర్తింపగా విని ఒక నాయిక మోహించుటయు, మరపించుటకై ఆమెను చెలులు జలక్రీడలకు తీసుకొని వెళ్ళారు. అక్కడ వారు మండలాకారమున క్రీడించుచుండగా కొందరు వేంకటేశుని చేరి అతనికి తగిన వధువు తమనాయికయే యని విన్నవించారు. వేంకటేశుడు సౌధాగ్రమును ఎక్కి నాయికను జూచి కామించినాడు. నాయిక తాను మున్ను విన్న వేంకటేశుడితడే యని భావించి **"గాలి నాడించు కేళీపటంబందు నందంబుగా విన్నపంబుల్ దగం గస్తూరిన్ వ్రాసి సూత్రంబునం గట్టి యాచక్రి సౌధంబు చాయన్ ముదంబార నాడింపగా"** వేంకటేశుడు దానిని పట్టుకున్నాడు. నాయిక ప్రేమలేఖ చదువుకొని వేంకటేశుడు తన ప్రేమ సందేశమును కేళీపటం ద్వారా నాయికకు చేర్చినాడు. పిమ్మట నాయిక విరహావస్థలను అనుభవించుచుండగా శైత్యోపచారములతో స్వస్థత చేకూరనందున చెలులు శ్రీ వేంకటేశునికి తమ చెలి విరహతాపమును విన్నవించి, ఆమెను రక్షింపుమని ప్రార్థించారు. వారి మాటలను విని వేంకటేశుడు దయతో శృంగారపు పూదోటకు వచ్చి నాయికను అనుగ్రహించి శృంగార రసాబ్ధి నోలలాడించి, ఆమెతో కూడి ఇందిరా మందిరంబైన ఆత్మీయ గేహమును చేరినాడు. దండకము ముగిసింది.

ఈ శృంగార దండకమున జలకేళిని వర్ణించుట, నాయికానాయకులు సౌధాగ్రముల మీదినుండి గాలిపటముల (కేళీపటము) ద్వారా ప్రేమ రాయబారములు సాగించుట నూతనాంశములు. దండకమున శృంగార రసాధి దేవతయగు విష్ణుదేవుడు నాయకుడు. ఇతివృత్తము శృంగార రసప్రధానముగ నుండుటచే ఇది శృంగార దండకమనుటకు తగియున్నది.

ఆంధ్రలాక్షణికులు పెక్కుర్రు తగణములతో గుర్వంతముగా రచింపబడిన దండకమును "తాః గౌ కామబాణః" అని కామబాణమను దండక భేదముగా చెప్పినారు. ఈ శృంగార దండకమును కామబాణమనుట సముచితముగా ఉంది. ఇందలి కథ వేంకటాచలమాహాత్మ్యము నందలి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ కథను అనుకరణముగా నుండుటచే ఈ దండకము తిరుమలలో జరిగే వేంకటేశ్వరస్వామివారి వైవాహికోత్సవములందు సంస్తుతి చేయుటకు రచింపబడినట్లున్నది.

* * *

## 10. చక్రవాళమంజరి - పెదతిరుమలాచార్యులు

తాళ్ళపాక పెదతిరుమాలచార్యులు చక్రవాళమంజరి అను లఘు కావ్యమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చాడు. ఇందలి ఇతివృత్తము అన్నమాచార్యులు రచించిన శృంగార మంజరిలోని ఇతివృత్తము వంటిదే. ఈ రెండు కావ్యములు మంజరి ద్విపదలో రచింపబడినాయి. అయితే శృంగార మంజరి విస్తృతమగు రచన కాగా చక్రవాళ మంజరి సంగ్రహ రచనగా ఉంది. ఇందు 226 పాదములు ఉన్నాయి. ఈ కావ్యము చక్రవాళము అను కావ్యభేదము యొక్క రచనా రీతిలో మంజరీ ద్విపద ఛందమున రచింపబడింది. కనుక చక్రవాళ మంజరి అను పేరు సార్థకము. ఇది శృంగార రసమయకావ్యం. చక్రవాళ కావ్యవిశేష లక్షణమును అప్పకవి ఇట్లు చెప్పినాడు.

**"తొలి సమసనాంత్య వర్ణయు**
**గళమే పునరుక్తిగాగ గైకొని సామీ**
**ప్యలసత్సమాసము మొదల**
**నలరించిన జక్రవాళమగు దాశార్హా॥" - అప్పకవీయం, 4-361**



ముక్తపదగ్రస్తము వలె తొలిసమాసము యొక్క అంతము నందున్న రెండు అక్షరములను గ్రహించి మలిసమాసమును రచించుట (అంతాది) చక్రవాళమగుచున్నది. ఈ లక్షణమునకు అనుగుణముగా ఈ కావ్యం ఇట్లు ప్రారంభమైంది.

**శ్రీలలనాధారు జన్మయాకారు**
**గారుణ్యవర్తి వేంకటగిరిమూర్తి**
**మూర్తి త్రయ శరీరు ముని జనోద్ధారు**
**ధారుణీ సంగు నుత్తమ శోభితాంగు**
**నంగుష్ఠ భవసింధు యదలోకబంధు**
**బంధుర బలశూరు భక్తవిచారు**
**జారు చక్రాబ్జాంకు సమరనిశ్శంకు**
**శంకు కర్ణాధ్యక్షు జలజ పత్రాక్షు**
**నక్షుద్రగుణసారు నఖిల సంసారు**
**సారూప్యకృతిసింధు శయనితసింధు"**

ఇట్లు ముక్తపదగ్రస్తమాను అలంకారముతో కొనసాగిన కావ్యము మంగళ మహాశ్రీలతో అంతమయింది.

**"రవికోటి తేజోవిరాజితు పేర**
**బేరగు జవరాలి పెనిమిటి పేర**
**బేర గీర్తన కెక్కి బెరసి నందవర**
**వరముఖ్యుడై భరద్వాజ సంతాన**
**తానకుండన నెన్న దగు తాళ్ళపాక**
**పాకశాసనుడు వైభవముల నొనరు**
**నరులలో బూజ్యుదన్నయవర్య తనయ**
**నయశాలి తిమ్మయ నవచతురతల**

**దలచి మంజరి చెప్పిదద్జ్ఞు లింపార**
**నారవి తారాబ్జమై యొప్పు జగతి**
**గతియైన విష్ణు మంగళమహా శ్రీల ॥**

ఈ చక్రవాళమంజరి శ్రీలతో ప్రారంభమై శ్రీలతో అంతమయింది. చక్రవాళమనగా మండలము, పరివేషము 'ం' అను అర్థములు గలవు, ఈ కావ్యము మండలాకారమున ఉండుటచే చక్రవాళమను పేరు సార్థకము.

ఈ చక్రవాళమంజరిలో వియోగ శృంగారము, వసంతవనవిహారాది వర్ణనలు హృద్యముగా చేయబడినవి. పెదతిరుమలాచార్యులు కావ్యరచనలో నవచతురతలను సమర్థతతో ప్రదర్శించాడు. అన్నమాచార్యులు రచించిన శృంగారమంజరిలోని కథా వస్తువునే చక్రవాళరచనారీతిలో పెదతిరుమలాచార్యులు రచించుటకు కారణము ప్రతిసంవత్సరము జరిగే వేంకటేశ్వరుని వైవాహికోత్సవములో నవ్యతను పాటించదలంచుట తోచుచున్నది.

ఈ కావ్యమున నాయకుడు వేంకటేశ్వరుడు నాయిక పుత్తడిబొమ్మయగు నొక కొమ్మ. కవి నాయిక పేరు చెప్పలేదు. నాయకుని రూపగుణములే విపులముగా వర్ణింపబడినవి. పెదతిరుమలాచార్యులు రచించిన చక్రవాళ మంజరి ఆద్యంతము ముక్తపదగ్రస్త, యమకాది శబ్దాలంకార భూయిష్టమైన చిత్రకావ్యముగా ఉంది.

* * *

## 11. శృంగార వృత్తపద్యాల శతకము – పెదతిరుమలాచార్యులు

వేంకటేశ్వరుని శృంగార విలాసములను లీలను వర్ణించుచు పెదతిరుమలాచార్యులు శృంగార శతకమును రచించాడు, ఇందులో ఉత్పలమాల (52), చంపకమాల (30), మత్తేభము (18), శార్దూలము (3) వృత్తములలో మొత్తము 103 పద్యములున్నవి. కనుక దీనికి శృంగార వృత్తపద్యాల శతకమను పేరు సార్థకము. ఈ శతకము వేంకటేశ్వరాంకితము. వృత్తములకు



అనుగుణముగా వేంకటేశ్వరా, తిరువేంకటేశ్వరా, వేంకటాద్రీశ్వరా, శేష గిరీంద్రనాయకా, వేంకటశైల నాయకా అను మకుటములు (సంబోధనలు) గలవు. శతకాంతమున అంకితాంక పద్యము లేదు.

ఈ శతకము ఉత్పలమాల వృత్తముతో ముక్తపదగ్రస్త అలంకారముతో వేంకటేశ్వరస్తుతితో ఇట్లు ప్రారంభమైనది.

**ఉ॥ శ్రీరమణీమణి ప్రమద జీవన, జీవనవాస, వాసవా**
**ధార విశేష, శేషవసుధా ధర నాథ విహార, హార కే**
**యూరవిరాజి, రాజిత మహోన్నత దేవభుజంగ, జంగమ**
**స్మేర వికల్ప, కల్పకమ మిమ్ము నుతించెద వేంకటేశ్వరా ॥**

ఈ శృంగారశతకమున నాయకుడగు శ్రీ వేంకటేశ్వరుని దక్షిణ నాయకత్వము, దాక్షిణ్యము అనేక విధములుగా వర్ణింపబడింది. వేంకటేశ్వరుడు జగన్నాయకుడగుటచే తనను ప్రేమించిన జీవులందరికి సమముగా సంయోగానుభూతిని అనుగ్రహించును. కాని నాయికలు తమనే ఇతరులకన్న అధికముగా నాయకుడు ప్రేమింపవలెనని కోరుకుంటారు. వారికి స్వామి దక్షిణ నాయకత్వము భరింపరానిది. వేంకటవిభుడు అలమేలుమంగా ప్రియుడు. అయినను స్వామి వలచిన వారికి వశమై ప్రవర్తించుచుండును. అలమేలుమంగ స్వామి సర్వాంతర్యామిత్వము తెలిసినదగుటచే స్వామి దక్షిణనాయకత్వమును గౌరవించుచున్నది. పెదతిరుమలాచార్యులు తనను నాయికగా భావించుకొని స్వామి ఎడబాటును సహించలేక వేదన పొందుచు, ఆ భావావేశమున ఈ శతకమును ఆత్మాశ్రయకావ్యముగా రచించినాడు. ఇందు నాయిక తిరుమలాచార్యుని జీవుడే. నాయకుడు వేంకటేశ్వరుడు. నాయిక విరహవేదనచే, ప్రేమాతిశయముచే, నాయకుని దక్షిణ నాయకత్వమును విమర్శించుటయే ఈ శతకమందలి విషయము. తన్మూలమున జగన్నాయకుని దాక్షిణ్యమును కీర్తించుట శతకరచనా పరమార్థము. తిరుమలాచార్యులు తన భావములను ఇట్లు వెల్లడించాడు.

**ఉ॥ ఆసలఁ బెండ్లియాడి మరియల్గినఁ జెల్లునె యెంత చేసినా**
**వేసర నన్ను నీవు నిక వేరుగఁ జూడక మాటలాడుమీ**
**దోసముగాదు నీగుణము తొల్లి నెరుంగుదు తోడివారిలో**
**వాసికి నేఁ బెనంగెదను వంతలఁ బెట్టకు వేంకటేశ్వరా! -74**

నీవు ఎక్కడవున్నా అనుభూతులు హృదయమున నిలిచియున్నవని వేంకటేశ్వరునికి విన్నవించుచున్నాడు.

**చం॥ మరువకయుండఁ జేసితివి మన్ననతో నుపకారమెప్పుడున్**
**గురుతులు చన్గవన్నిలిపి కోరిక చెల్లెను రాకయుండి నం**
**గౌరతలులేవు పద్మమునకున్ రవికిన్ మరియాదకేడ నీ**
**వరిమురి నెందు నున్న హృదయంబునఁ బాయవు వేంకటేశ్వరా ॥ -72**

వేంకటేశ్వరుడు దాగుడుమూత లాడునెపముతో నాయికను మభ్యపెట్టి తన కోరికను తీర్చుకొనిన శృంగారచేష్టను పెదతిరుమలాచార్యులు ఇట్లు హృద్యముగా వర్ణించాడు.

**చం. వెలఁదులు గొల్వుసేయునెడ వేడుక యొక్కతి మీది నిల్పి ని**
**ట్టలముగ రత్నసౌధమున దాగిలిమూఁతల నాచరింతుమా**
**యలవడ నంచు నేగి చెలి నక్కడఁ గూడితి వెంతనేర్తువో?**
**తెలియదు నీమొరంగని సతీమణులెంచిరి వేంకటేశ్వరా! -79**

పెదతిరుమలాచార్యుల శృంగార శతకము నందలి కొన్ని భావములు అన్నమయ్య శృంగార సంకీర్తనలకును శృంగారామరుకావ్యమునందలి శ్లోకములకు ఛాయ లనదగియున్నవి.

**చం. అలుగుచు గాంత మారుమొగమై యటుచూచిన దర్పణంబునన్**
**బెళకక నీమొగంబు ప్రతిబింబము గానగ వచ్చె నంతలో**



**గలకల నీవు నవ్వితివి కాంతయు నవ్వెను మీకు నద్దమే**
**యలుకలు దేర్చెఁ దోడిచెలు లచ్చెరు వందఁగ వేంకటేశ్వరా ॥-64**

**అడవుల వేటలాడుచు ప్రియం బిగురొత్తగ నీదు కాంతకున్**
**నడుమిది సింహమంచు జఘనం బిభమస్తక మంచు నంచతే**
**నడుపులటంచు జక్కవలు నవ్యకుచంబులటంచు నేయకే**
**విడుతువువాని నీకె పయి వేడుక లెట్టివొ వేంకటేశ్వరా ॥ -54**

ఇట్లు పద్యములందలి భావములు రమణీయములై నాయకుని దాక్షిణ్యమును కీర్తించుచున్నవి.

* * *

## 12. శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము - పెదతిరుమలాచార్యులు

సంస్కృతములో ప్రతివాది భయంకరన్ అణ్ణన్ స్వామి రచించిన శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమును, తమిళములో తొండరప్పడి యళ్వారు (విప్రనారాయణుడు) శ్రీ రంగనాథునికై రచించిన తిరుప్పళి యెళిచ్చిని (10 పాశురములు) ఆధారముగా గొని తెలుగులో పెదతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవమును ద్విపదఛందములో రచించినాడు. ఈ లఘుకావ్యములో 63 ద్విపదలు కలవు. ఈ ద్విపద మేలుకొలుపు

**"శ్రీ గురుం దర్థితో శేషాద్రి యందు**
**యోగనిద్రాకేళి నున్న యత్తతిని**
**వనజాసనాదు లేగుదెంచి**
**వినుతించి రప్పు దవ్విధ మెట్టి దనిన"**

అని శ్రీకృష్ణుని చరిత్రము బాల్యమాదిగా భాగవతములో వర్ణింపబడినట్లు స్తుతిరూపమున వర్ణించుచు శ్రీ వేంకటేశ్వరస్వామికి మేలు కొలుపుగా రచింపబడింది.

ఈ కావ్యమున ప్రతి ద్విపదాంతములో 'మేల్కొనుము' అను ప్రబోధ వాక్యము అనుశ్రుత మగుచుండును.

**"వసుదేవదేవ వరగర్భజాత**
**కిసలయాధర రామకృష్ణ మేల్కొనుము**
**తపము పెంపున యశోదానందులకును**
**గృపతోడ శిశువైన కృష్ణ మేల్కొనుము**
**పూతనా కైతవ స్ఫురిత దుర్వార**
**చైతన్య హరణ ప్రశస్త మేల్కొనుము"**

ఈ మేలుకొలుపులో బాలకృష్ణుని లీలలు – పూతన, శకటాసుర, తృణావర్త, ధేనుకాసుర, బకాసుర సంహారములు, యశోదకు విశ్వరూపమును చూపుట,

**"ఆననంబునఁ దల్లి కఖిలలోకములు**
**పూని చూపిన యాది పురుష! మేల్కొనుము"**

కాళీయమర్దనము,

**"కాళీయ ఫణి ఫణాంగణ నృత్యరంగ**
**లాలిత చరణ విలాస మేల్కొనుము"**

చాణూర మర్దనము,

**"జెట్టిపోరను గిట్టి చీరి చాణూరు**
**చట్టలు వాపిన శౌరి! మేల్కొనుము"**

అర్జునరథ సారథ్యము

**"చండభారతరణ చాతుర్యధుర్య**
**గాండీవి సారథ్యకరణ! మేల్కొనుము"**



కృష్ణరాయబారము,

**"వీర కౌరవసభ విశ్వరూపంబు**
**ధీరత జూపిన దేవ! మేల్కొనుము"**

మొదలగు వృత్తాంతములు వర్ణింపబడినవి. తర్వాత అష్టమహిషుల వర్ణనలు మనోహరముగ శృంగార రసభరితముగా వర్ణింపబడినవి.

**"భోజకన్యాముఖాంభోజ ద్విరేఫ**
**రాజీవనయనాభిరామ! మేల్కొనుము**
**వరరూపవతి జాంబవతి తోడిరతుల**
**నిరతిమై నోలాడు నిపుణ! మేల్కొనుము**
**మంజుల సత్యభామా మనస్సంగ**
**రంజితగాత్ర సరంభ! మేల్కొనుము**
**లలిత కాళిందీ విలాస కల్లోల**
**కలిత కౌళీలోల ఘను డ! మేల్కొనుము**
**సారసుదంతా భుజకుముదహార**
**చారుప్రభాపూర చంద్ర! మేల్కొనుము**
**నేత్రరాగ విశేషనిచిత ప్రతోష**
**మిత్రవిందా రసోన్మేష! మేల్కొనుము**
**భద్రానఖాంకుర బాలచంద్రాంక**
**ముద్రిత భుజతటీమూల! మేల్కొనుము**
**లక్షణా పరిరంభ లక్షితోదార**
**వక్షో విశాల కవాట! మేల్కొనుము"**

తర్వాత వేంకటేశ్వరుడు మేల్కాంచి, నిత్యకృత్యములను తీర్చుకొని, రత్న సింహాసనమున మేరువుమీది యభ్రంబు వోలె కొలువుదీరుట, బ్రాహ్మణుల ఆశీర్వాదములను పొందుట వర్ణింపబడినవి.

నేడు కూడ తిరుమలదేవాలయములో సుప్రభాత సేవానంతరం, స్వామికి ఆగమ శాస్త్రోక్తముగ ఆవాహన అర్ఘ్యపాద్యాచమన తాంబూలా సనములను పంచవిధోపచారములు జరుపబడుచున్నవి. పిమ్మట స్వామివారి కౌతుకమూర్తి విగ్రహమునకు – భోగ శ్రీనివాసమూర్తికి – నిత్యాభిషేకము జరుగును. తర్వాత అలంకరణ, తోమాలసేవ ఆస్థానము జరుగును. స్వామివారికి మహారాజ మర్యాదలు – పంచాంగశ్రవణము, ఆదాయ వ్యయములవిన్నపం జరుగును. స్వామి అర్చకునకు మాత్రాదానము చేయును. అర్చకుడు దానమును స్వీకరించి స్వామివారిని "నిత్యైశ్వర్యోభవ" అని మంగళాసనము చేయును.

అనంతరం,

**"మానవేశులు మహామహులు సేవింప**
**ఘనతర నిత్యభోగంబులు వెలయ**
**జనులకెల్ల మహాప్రసాదంబులొనర**
**గోరినవారికి గోర్కు లీడేర**
**నీరీతి జగముల నేలుచునుండు**
**నని భక్తి దాళ్ళపాకాన్నమాచార్య**
**తనయుండు తిమ్మయ తగఁబ్రస్తుతించె."**

అని మేలుకొలుపు ద్విపద సంపూర్ణమయింది. ఈ చిన్న కావ్యములో భగవస్తుతి పెద్దగ చేయబడింది.

ఈ మేలుకొలుపు ద్విపదను తిరుమలాచార్యులకాలములో (క్రీ.శ. 1458–1554) వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఉషఃకాలసంధి సందర్భమున గానం చేసేవారు. తాళ్ళపాక అన్నమాచార్యులు మేలుకొలుపు సంకీర్తనలను పెక్కు రచించియున్నాడు. ఉదా॥ 2-224, 2-400, 2-403, 5-81, 7-202, 9-254 మొ॥వి.



శ్రీరామ, శ్రీకృష్ణులకు వేంకటేశ్వరునకు (శ్రీనివాసునకు) అభేదము. ముప్వురు విష్ణుంశసంభూతులే. శ్రీమన్నారాయణుని అవతారపురుషులే. అంతే గాక శ్రీనివాసుడు పద్మావతిని దర్శించినప్పుడు తన పేరు కృష్ణుడని చెప్పినట్లు వేంకటాచలమాహాత్మ్యములోని వరాహపురాణం ద్వితీయభాగం (4–44) వర్ణించింది. కనుక మేలుకొలుపు ద్విపదలో కృష్ణస్తుతి, లీలల వర్ణన అధికముగా గలదు.

* * *

## 13. శ్రీ వేంకటేశ్వరోదాహరణము – పెదతిరుమలాచార్యులు

ఆంధ్రసాహిత్యములో విలక్షణమైన శాఖ ఉదాహరణము. భాషయందు గల సప్తవిభక్తులను, సంబోధనాప్రథమా విభక్తిని ఉదాహరించు దేవతాస్తుతి పరమైన లఘుకావ్యము ఉదాహరణము. ఇది మధుర కవితాశాఖకు చెందినది.

ఉదాహరణములో వృత్తములు, కళికలు, ఉత్కళికలు, సార్వవిభక్తిక పద్యము, కవికృత నామాంకిత పద్యము అను అయిదు విభాగములు గలవు. ప్రతి విభక్తికి ఒక వృత్తము, ఒక కళిక, ఒక ఉత్కళిక నియతముగా ఉండును. అందుచేత మొత్తం ఉదాహరణము లోగల కళికోత్కళికా వృత్త సంఖ్య 26 (8×3= 24+1+1=26) కళిక అంటే మాత్రాఛందస్సునకు సంబంధించిన రగడ భేదము. ఉత్కళిక అందులో సగము (అర్ధకళిక) ఎనిమిది పాదములుగల కళికోత్కళికలు పాటలవలె ఉండును. అందుచే వీటిలో ఆదిప్రాసలు, అంత్యప్రాసలు ఉన్నాయి. అందుచేత ఉదాహరణ కావ్యస్వరూపం సంగీత సాహిత్య సమ్మేళనముగా ఉండును. ఈ లఘుకావ్యాన్ని రాగతాళములతో పాడవచ్చును. మహాకావ్యమునందలి నాయకుని వలె ఉదాహరణమందును నాయకుని గుణకీర్తనమే ప్రధానము. ఇట్లుమార్గదేశికవితల రామణీయకాన్ని నిలుపుకున్న దేవతా స్తుతిపరమైన లఘుకావ్యప్రక్రియ ఉదాహరణము.

**"అల్పాక్షరముల ననల్పార్థరచన**
**కల్పించుటయ గాదె కవి వివేకంబు"**

అన్నసూక్తికి ఉదాహరణకావ్యము లక్ష్యముగా ఉన్నది.

తెలుగు సాహిత్యంలో పాల్కురికి సోమనాథుడు (క్రీ.శ.1190-1260) రచించిన 'బసవోదాహరణము' మొట్టమొదటి ఉదాహరణకావ్యం. ఇందు వీరశైవమత ప్రవక్తయగు బసవేశ్వరుని మహిమలు వర్ణింపబడినవి. వైష్ణవవాఙ్మయ శాఖలో తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు రచించిన శ్రీ వేంకటేశ్వరోదాహరణం మొదటి ఉదాహరణ కావ్యం. ఇందు తిరుమలాచార్యులు తన ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరుని మహిమలు కీర్తించినాడు. భగవంతుని మాహాత్మ్యమును ఉదాహరించు స్తుతిపరమైన కావ్యము కనుక ఈ కావ్యభేదమునకు ఉదాహరణమనుపేరు సార్థకంగా ఉంది.

పెదతిరుమలాచార్యులు రచించిన శ్రీ వేంకటేశ్వరోదాహరణము సమగ్రలక్షణోపేతమై మేలుబంతిగా ఉన్నది. ఈ ఉదాహరణము శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమైనది. ఇందలి రచనా ప్రణాళిక ఇట్లున్నది.

| విభక్తి | వృత్తము | కళిక | ఉత్కళిక |
|---|---|---|---|
| 1. ప్రథమ | ఉత్పలమాల | వృషభగతి రగడ | హరిణగతి రగడ |
| 2. ద్వితీయ | ఉత్పలమాల | ద్విరదగతి రగడ | రగడలో సగము |
| 3. తృతీయ | ఉత్పలమాల | హయప్రచారరగడ | ఇందులో సగము |
| 4. చతుర్థి | ఉత్పలమాల | హరిగతి రగడ | మధురగతి రగడ |
| 5. పంచమి | ఉత్పలమాల | ద్విరదగతి రగడ | ఇందులో సగము |
| 6. షష్ఠి | ఉత్పలమాల | తురగవల్గన రగడ | ఇందులో సగము |
| 7. సప్తమి | ఉత్పలమాల | ద్విరదగతి రగడ | ఇందులో సగము |
| 8. సంబోధనాప్రథమ | ఉత్పలమాల | ద్విరదగతి రగడ | ఇందులో సగము |
| 9. సార్వవిభక్తికము | శార్దూలము | | |
| 10. అంకితాంకపద్యం | ఉత్పలమాల | | |



పై వివరములను బట్టి శ్రీ వేంకటేశ్వరోదాహరణము సర్వసమగ్రలక్షణ లక్షితమని విశదమగుచున్నది. పూర్వోదాహరణములగు బసవోదాహరణము, త్రిపురాంతకోదాహరణములందు సమగ్రలక్షణము కనిపించదు. వీటియందు అంకితాంకపద్యము లేదు. పెదతిరుమలాచార్యుల సంప్రదాయమునే తర్వాతి కవులు కొనసాగించినారు.

పెదతిరుమలాచార్యులు శ్రీ తిరువేంగళనాథ దేవునికి విన్నపము చేసిన ఉదాహరణ కావ్యమున సార్వవిభక్తిక పద్యం తర్వాత అంకితాంకపద్యము ఇట్లున్నది-

**ఉ. ఆరవి తారకంబుగ నుదాహరణంబు రచించె భక్తివి**
**స్తారత దాళ్ళపాకపురశాసనుఁ డన్నయ తిమ్మనార్యుఁడిం**
**పారఁగఁ జక్రనందక గదాంబుజ ధారికి శ్రీవధూ మనో**
**హారికి వేంకటాచల విహారికి శౌరికి నంకితంబుగాన్.**

పై పద్యములో కవిపేరు, కృతిపతి పేరు చెప్పబడినవి. వేంకటేశ్వ రోదాహరణ మందలి విషయము విష్ణుభక్తి ప్రతిపాదకమై పురాణములలో వర్ణించబడిన విష్ణుదేవుని దశావతార విశేషములకు, కథలకు సంబంధించినది. వృత్తములలో వేంకటేశ్వరుని గుణగణములు స్తుతింపబడినవి. కళికోత్కళికలలో గజేంద్ర మోక్షము, అహల్యాశాప విమోచనము, కాళీయమర్దనము, గోవర్ధనోద్ధరణము మున్నగు శ్రీహరి లీలలు కీర్తింపబడినవి. కావ్యము శ్రీకారముతో ఇట్లు ప్రారంభమైనది.

**శ్రీ కరుణా కరుండగుచు జీవుల తీవులఁ బ్రోచి కాచుచుం**
**గైకొని లోకముల్ మనిపి కర్తయు భర్తయునై మునుల్ సురా**
**నీకము లోకముం బొగడ నీరజజాతుని తాత యైన సు**
**శ్లోకుఁడు వేంకటేశ్వరుఁడు చూడఁగ నొప్పెడు బ్రహ్మమింతకున్**

పై పద్యమున ప్రథమా విభక్తిలో శ్రీ వేంకటేశ్వరుని పరబ్రహ్మ స్వరూపంగా కీర్తించాడు.

సంబోధనా ప్రథమా విభక్తిలో కళిక ఇట్లు కొనసాగింది.

**మరియు దరచగు సిరులమరుల కొసగెడు దాత**
**కరకు విరినెరి విరుచు ఘన జనకజామాత**
**వెక్కసపు రక్కసుల వేచి కాచినవాడ**
**యక్కరగ నక్కదతయుబ్బుగిచ్చిన రేడ**
**విదురు దెదురుగ జేయు విందు పొందుల జాణ**
**ముదురు వెదురున బాట మూటగట్టిన గాణ**
**లేటి శరకోటి నెడలించి త్రుంచిన రామ**
**యేటి నాగేటి గదియించి చించిన రామ. 23**

తిరుమలాచార్యులు శ్రీమన్నారాయణుని అవతారములగు శ్రీరామ, శ్రీకృష్ణులతో వేంకటేశ్వరునికి అభేదము పాటించి వారి మహిమలను స్తుతించినాడు.

పెద తిరుమలాచార్యులు చతుర్థీ విభక్తి ఉత్కళిక ఇట్లు రచించినాడు.

**ధారుణి భారనివారణ కలకై**
**శౌర విహార విచార మనెడి కై**
**తవమున జవమున బవిరి తిరుగుకై**
**దువుగొని వివిధ సవిధ దానవ కై**
**కసరుధిర సలిల మెసగ విసరికై**
**వసముగ సురవిసరము నేలిన కై**
**లాస నివాససతీ వంద్యున కై**
**హాస సమున్నత బుధ వంద్యునకై ॥ -12**

ఉదాహరణము స్తోత్రరూపమగు కావ్యమగుటచేత, భగవంతుని స్తుతియందు విభక్తి ప్రత్యయములలో చతుర్థివిభక్తి ప్రత్యయమును (కై) పాటించుట సంప్రదాయముగ ఉన్నది. చతుర్థి ఉత్కళికలో ప్రతి చరణాంతమున విభక్తి



రూపమునగాని, తదాభాసరూపమున గాని చతుర్థీ విభక్తి ప్రత్యయము ఉండవలెనను లక్షణము గలదు.

తిక్కన సోమయాజి రచించిన మహాభారతమున శాంతిపర్వమున భీష్మ ధర్మజ సంవాదములో విష్ణుమంత్ర ప్రభావమును గూర్చి చెప్పుచు భీష్ముడు–

**"ప్రణవ పూర్వకమగు నమః పదము పొంత**
**షడ్గుణైశ్వర్య వాచక సర్వ వసన**
**నిర్వచన శబ్దములు క్రమ నిష్ఠమెయి చ**
**తుర్థి గూర్పంగ మంత్రంబు దోచు బెరసి ॥**

**– భారతం, శాంతి, 4–213**

అని చతుర్థిని గూర్చిన సంప్రదాయమును వివరించినాడు.

పెదతిరుమలాచార్యులు ఈ ఉదాహరణ కావ్యములో సర్వవిభక్తులలో వేంకటేశ్వరుని ఇట్లు ప్రార్థించినాడు.

**శా. నీ వీశుండవు నిన్నుఁగొల్తు వరముల్ నీ చేతఁగైకొందు నేఁ**
**గై వారం బొనరింతు నీ కొఱకు సంకల్పింప నీ దేరె మ**
**త్సేవల్ నీ వలనన్ మహాయశము నిల్చెన్ నీకు నీ యందు ల**
**క్ష్మీ వాల్లభ్యము గంటి భక్తవరదా! శ్రీ వేంకటాద్రీశ్వరా! ॥ -25**

* * *

## 14. శ్రీ వేంకటేశ్వర వచనములు – పెదతిరుమలాచార్యులు

స్తుతి ప్రధానములగు స్తోత్రములు, దండకములు, సంకీర్తనలు, వచనములు మున్నగు కావ్యప్రక్రియలు ఆత్మాశ్రయములై కవీశ్వరుని భవ్యావేశమును, భావోద్వేగమును, భగవద్భక్తిని ప్రదర్శించుటచే అనుభూతి ప్రధానములగుటచేత సహృదయపాఠకుల హృదయములనాకర్షించి చిరస్థాయి రచనలగుచున్నవి. ఈ శాఖలో విశిష్టమైనవే పెదతిరుమలాచార్యులు

రచించిన శ్రీవేంకటేశ్వర వచనములు. ఇవి వేంకటేశ్వరస్వామికి అంకితములు. ఇవి 166 మాత్రమే లభించినవి.

తెలుగున లాక్షణికులు వచనరచనలను

**కం. కనుగొనఁ బాద రహితమై**
**పనుపడి హరి గద్దెవోలె బహుముఖ రచనం**
**బున మెరయు గద్యమది దా**
**దెనుఁగుఁ గృతుల వచనమనఁగ దీపించుఁగడున్ ॥**

అని నిర్వచించినారు. ఛందోనియతి గల్గిన పాదరహితమై హరిగద్యవలె బహుముఖరచనతో విలసిల్లు గద్య తెలుగులో వచనమనబడుచున్నది. అన్నమాచార్యులు వచనములను తాళగంధి చూర్ణము అని పేర్కొని ఇట్లు వివరించాడు.

**ధర గృష్ణాచార్యాదిక**
**పరికల్పితపదము తాళ బంధచ్ఛందో**
**విరహితమై చూర్ణాఖ్యం**
**బరగునది నిరుక్త నామభాసిత మగుచున్.**

మరియు దచ్చూర్ణ విధంబెట్టి దనిన

**ఛందో గణముల నియతిం**
**బొందక తాళప్రమాణమున గడుజెలువై**
**కొందరి చెందచ్చూర్ణం**
**బందముగా తాళగంధి యనఁబొగడొందున్.**

**– సంకీర్తనలక్షణము, 54, 55 పద్యములు**

ఛందో గణములనియతి లేక తాళప్రమాణమున నడచునది, స్వయం సంపూర్ణమైన భావము గలది వచనమని అన్నమాచార్యులు చెప్పినాడు. ఉదాహరణముగ కృష్ణమాచార్యుల సింహగిరి వచనములను పేర్కొన్నాడు.



వీటిలో శతకమువలె వచనాంతమున మకుటనియమము గలదు. ఇవి పాడుటకు తగియున్నవి.

ఆంధ్ర సాహిత్యములో వైష్ణవమత సంబంధమైన వచనములలో కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి వచనములు మొదటివి. ఆ తర్వాత తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు రచించిన శ్రీ వేంకటేశ్వర వచనములు పేర్కొనదగినవి. వేంకటేశ్వర వచనములలో ప్రారంభమున ఒక భగవంతుని సంబోధన, అంతమున వేంకటేశ్వరా! అను మకటము తిరుమలాచార్యుడు విధిగా పాటించినాడు. వేంకటగిరిదేవా! అలమేలుమంగాపతీ! కోనేటినిలయా! విష్ణుమూర్తీ! శరణాగతవజ్రపంజరా! ఆనందనిలయా! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! మున్నగు 166 సంబోధనలు గలవు. వస్తువు విషయమున వేంకటేశ్వరవచనములు ఒకదానితో మరొకటి సంబంధములేక వివిక్తములై వున్నవి. ఈ వచన కావ్యమందంతటను వైష్ణవమత సిద్ధాంతములు, శరణాగతి, దాసదాస్యభావము, వేంకటేశ్వరభక్తి నిండియున్నవి. కవి వీటిద్వారా వైష్ణవ ధర్మములను, భక్తిని ప్రచారము చేసినాడు. ఈ వచనములందు రామాయణ, భారత, భాగవతములలోని విషయ ప్రసక్తి గలదు. వేంకటేశ్వర వచనములందు పెదతిరుమలాచార్యులు మోక్షార్థులకు శరణాగతి పరమోపాయమని ప్రకటించినాడు. వచనములలో సత్యబోధకములు కొన్నిగలవు. ఉదా॥ పరుండువానికి భూమి యాధారంబు. నదులకు సాగరంబె గతి. పక్షులకు వృక్షంబె వసియింప జోటు. సస్యంబులకు వర్షంబు. నాకు నీవు. శ్రీ వేంకటేశ్వరా! (24 వచనం) కొన్ని లోకోక్తులు. "--- తాళముచే యొక వంకనుండగా తలపుతో పెనంగగా నేల?" (16 వచనం) "--- ఉల్లివాసన యంటిన పదార్థంబున గస్తూరి పరిమళంబంటనేర్చునే?" (105 వచనం) వేంకటేశ్వర వచనములలో 147 వచనమున దేశమునగల 108 దివ్య తిరుపతుల (వైష్ణవక్షేత్రములు) పేర్లు పేర్కొనబడినవి. 166

వచనమున శ్రీమన్నారాయణుని వైభవమును, ఆ దేవుని దశావతార విశేషములను, అర్చావతార విశిష్టతను పెదతిరుమలాచార్యులు వర్ణించినాడు.

పెదతిరుమలాచార్యులు 99 వచనమున తన కావ్య కన్యకా వివాహమును ఇట్లు వర్ణించాడు–

"సీతావల్లభా! నా కవితాకన్యకు నీవు వరుండవు. దైవమానుషంబులు గణపొంతనములు. నా జిహ్వయే పెండ్లి పీట. నా మనస్సే తెర. నా సంతోషకళలే బాసికంబులు. నా భక్తియే కంకణంబు. అక్షరంబులే తలంబ్రాలు. శబ్దంబులే వాద్యఘోషణంబులు. స్మృతి స్వరంబులే పేరంటాండ్ర పాటలు. చూపులే మంగళహారతులు. నా వాక్యంబులే పువ్వుదండలు. నీ సహస్రనామములే బంధువులు. నీ యాత్మ గుణంబులే శోభనద్రవ్యంబులుగా గైకొని యీ రీతి వివాహం బైతివి. ఇంక నా కర్మబంధంబు లూడె గాదే. నీ విట్లు పాణిగ్రహణంబు చేసికొంటి విక నీ దేవులు నీవును చిరంజీవులై యుండి సంగీతసాహిత్య నానాలంకారాది పుత్రపౌత్రాభివృద్ధి వెలయుచు నీ దాసుల రక్షింపవే, శ్రీ వేంకటేశ్వరా!"

పెదతిరుమలాచార్యులు సంసార తత్త్వమును 110 వచనమున ఇట్లు వర్ణించాడు.

"శ్రీనివాసా! దేహంబులై పొదిగెడిది నీ మాయ యట అందులోని చైతన్యంబు నీవట. కోరికోరి సుఖదుఃఖంబు లనుభవించువారు జీవులట. ఇన్ని చందంబులం గలిగెడు ఫలంబులు స్వర్గనరకంబులట. ఇవి యెన్నటికి దెగని కర్మబంధంబులట. ఈ సంసారంబు చేసి కూడబెట్టంగా మిగిలిన లాభంబులు పుణ్యపాపంబులట. ఇవి నీకు లీలా వినోదంబులట. దీనికి తుద యేది మొదలేది? ఇటువలె ననాదియై సత్యమై జరుగుచున్నది ప్రపంచంబు. ఈ యర్థంబు దెలియదరముగాదు. ఇంక నేమని విన్నవించవచ్చు. మీ చిత్తంబు నా భాగ్యము! శ్రీ వేంకటేశ్వరా!"



వేంకటేశ్వరుడు జగన్నాటక సూత్రధారి, ఈ జగమంతా నాటకశాల. స్త్రీ పురుషులు అందరు పాత్రధారులు. సర్వేశ్వరుని వేడుక ఎంతకాలమో అంతకాలము ఈ నాటకము ప్రదర్శింపబడుచుండునని ఈ జగన్నాటకమును 87 వచనములో తిరుమలాచార్యులు వర్ణించాడు ఇట్లు –

"సర్వేశ్వరా! అవధారు; జగంబు నీ నాటకశాల, నేనెత్తిన తోలు జన్మంబులు నీ ముందర నాడెడి బహురూపంబులు, దారసుత బంధుజనంబులు మేళగాండ్రు, నిన్ను నుతించిన వేద శాస్త్ర పురాణంబులు తూర్యత్రయంబు. మాపాద ప్రచారంబులు నాట్యంబు సేయు చేతలు; ఆడెడిమాటలు క్రియాభాషాంగంబులు; భోగవస్తువులు మీరు మెచ్చి యిచ్చిన యీవులు; ఈ రీతి నెంతగాలంబు మీకు వేడుక యంతగాలంబు నాడెదము. మీ కొలువు నర్తకులైన వారము మీకు వినోదము చేసికొని బ్రతుకవలయుగాని నెమ్మది మోక్షంబున నుండెదమనుట యే సంగతి? మీర దయదలంచి కృపచేసిన నపుడయ్యెడుగాక, యెఱుకగల యేలిక గొల్చినవారికి నడుగ నేదిపని? ఇక నన్నిట నన్నిట మన్నింపవే; శ్రీ వేంకటేశ్వరా!"

పెదతిరుమలాచార్యులకు అనంతరకాలమువాడైన మహాకవి షేక్స్పియర్ "జగంబునాటకశాల" అను భావాన్ని ప్రకటించియున్నాడు ఇట్లు–

Jaques: " All the world's a stage,
And all the men and women merely players,
They have their exists and their entrances;
And one man in his time plays many parts."

- " As you like it"

- william Shakespeare, Act 2, scene 7, The forest lines : 139-142

E.L.B.S. London, 1964

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు క్రీ.శ.1456-1554 మధ్య జీవించాడు. తిరుమల వాసి. విలియం షేక్స్‌పియర్ క్రీ.శ.1560-1616 మధ్య జీవించాడు. లండన్ నగరనివాసి. వీరిద్దరి మధ్య దేశకాలభేదము లున్నాయి. అయిన వీరి కవితావేశంలో భావసామ్యత కనిపించుట ఆశ్చర్యకరము. అద్భుతావహము. వీరిద్దరికి జగమంతా నాటకరంగముగా కనిపించింది. అంతా భగవంతుని లీల!

శ్రీ వేంకటేశ్వరుని అనంత కల్యాణ గుణములను సాక్ష్యములతో పెదతిరుమలాచార్యులు ఇట్లు వర్ణించాడు.

"అనంత కల్యాణ గుణనిధీ! నీవు భక్తవత్సలుడవనుటకు సందేహమేలా? అందులకు బ్రహ్లాదులే సాక్షి! శరణాగత వజ్రపంజర బిరుదుకు సందేహం బేలా? అందుకు విభీషణుండే సాక్షి! దురితదూరుండ వనుటకు దర్కవాదంబుల లేలా? అందు కహల్యయే సాక్షి! నీ యుదార గుణంబున కనుమానంబేల? ఇందుకుఁ బాంచాలియే సాక్షి! ఆర్తజనపరాయణుండ వగుటకు శంకయేలా? ఇందులకుఁ గరిరాజే సాక్షి! అగణితములయిన వేదనల నవసాదించుటకు సత్యంబులేలా? అందుకు ధ్రువుండే సాక్షి! ఇవన్నియు నీ మహిత ప్రభావంబగుట యెరింగి నీ నామోచ్చారణకే శరణు సొచ్చితిని. శ్రీ వేంకటేశ్వరా!-153

వేంకటేశ్వర వచనములకు మూలమనదగిన వచనము ఒకటి పోతన భాగవతములో ఉన్నది. "దేవా! సకల పురుషాంతర్యామి రూపత్వంబువలన బరమ పురుషుండ వయ్యు, నపరిచ్ఛిన్నత్వంబు వలన మహాత్ముండవయ్యు నాకాశాది భూత సమాశ్రయత్వంబువలన భూతవాసుండవయ్యు, భూత మయత్వంబు వలన భూతశబ్దవాచ్యుండవయ్యు, గారణాతీతత్వంబు వలన బరమాత్ముండవయ్యు, జ్ఞానవిజ్ఞాన పరిపూర్ణత్వంబు గలిగి, నిర్గుణత్వ నిర్వికారత్వంబువలన బ్రహ్మంబవయ్యు, బ్రకృతి ప్రవర్తకత్వంబు వలన ననంతశక్తివై యప్రాకృతుండవయ్యును, గాలచక్ర ప్రవర్తకత్వంబున గాలుఁ డవయ్యు, గాలశక్తి సమాశ్రయత్వంబు వలనం గాలనాభుండవయ్యు, జిన్మయత్వంబువలన మహాత్మకుండవయ్యు సృష్టి జీవన సంహారాది దర్శితంబు వలనం గాలావయవ సాక్షివయ్యు, నొప్పు నీకు నమస్కరించెదము."

– దశమస్కంధము, పూర్వభాగం, 678 వచనం

సంస్కృతములో భగవద్రామానుజాచార్యులు రచించిన గద్య త్రయము- శరణాగతిగద్య, శ్రీరంగ గద్య, శ్రీవైకుంఠగద్య – ప్రోత్సాహము కల్గించగా పెదతిరుమలాచార్యులు విశిష్టాద్వైత సిద్ధాంతములను ప్రవర్తింపజేస్తూ శ్రీ వేంకటేశ్వర వచనములను రచించినాడు. వీటికి విన్నపములను నామాంతరము గలదు.

తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల 108 వేంకటేశ్వర వైరాగ్య వచనములకు సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి సంస్కృతీకరణము చేసి భారతి (మాసపత్రిక)లో ప్రచురించారు. (భారతి, 49-10, అక్టోబరు, 1972 P:76)

* * *

## 3. తాళ్ళపాక చినతిరుమలాచార్యులు (16 శతాబ్దం)

పెదతిరుమలాచార్యుల పెద్దకుమారుడు చినతిరుమలాచార్యులు. ఇతడు వేంకటేశ్వరాత్మక సాహిత్యములో తండ్రితాతలవలెనే శృంగార సంకీర్తనలను అధ్యాత్మ సంకీర్తనలను, అష్టభాషా దండకమును రచించాడు, ఇతడు సంస్కృతాంధ్రభాషలలో మహాకవి. మహావిద్వాంసుడు. చినతిరుమలాచార్యులకు 'అష్టభాషాకవి చక్రవర్తి' అను బిరుదము గలదు. ఇతడు శ్రీ వేంకటేశ్వర స్వామికి చాలా కైంకర్యములు చేసినాడు. వాటిని స్మరించిన కీర్తనలు ఉన్నవి. క్రీ.శ.1540 సంవత్సరములో తమ అగ్రహారమైన శ్రీనివాసమంగాపురము నందున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ జీర్ణోద్ధరణము చేసినాడు. (శాసన సంఖ్య : 4-144 తేది : 22-3-1540 తి.తి.దే. శాసన సంపుటాలు, 1998)

## 15. అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు

**- తాళ్ళపాక చినతిరుమలాచార్యులు (క్రీ.శ.1490-1560)**

చిన తిరుమలాచార్యులు రచించిన సంకీర్తనలలో 60 అధ్యాత్మ సంకీర్తనలు, 119 శృంగార సంకీర్తనలు లభించినాయి. వీటిని తి.తి.దేవస్థానము ఒక సంపుటంగా ప్రకటించింది. (తాళ్ళపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు, సంపుటం:10, 1998)

**"మనసె వశమైతేగా మరిమీదటి పనులు**
**తనువు లోపలి హరిదయ యింతె కాకా ॥పల్లవి॥**

**వొద్దనె పుత్రమిత్రాదులువ్విళ్లూరించగాను**
**అద్దొ వైరాగ్యమేమి ఆటపాటలా**
**కొద్ది లేని విషయాలు గుంపుగూడు కుండగాను**
**వద్దని కడకు దోయ వశమవునా? ॥మన॥**

**వొయ్యనె ధనధాన్యాలు వొద్దుకొని వుండగాను**
**అయ్యో సుజ్ఞానము లల్లాడబడెనా**
**గయ్యాళి కోరిక లెల్లా గమిగూడకుండగాను**
**వుయ్యక దూలయాసల బోదలవసమా? ॥మన॥**

**పల్లదపుటాకలిది పాయక వుండగాను**
**చెల్లబో వోరుపులింత చెడబోయనా**
**నల్లని శ్రీ వేంకటనాథుడె యందరికిని**
**తల్లిదండ్రియై కావగా తప్పు వాసెగాకా" ॥మన॥**

**- అధ్యాత్మ సంకీర్తన, 21 సంపుటం : 10**

శ్రీహరి మన శరీరంలో అంతర్యామిగా ఉన్నాడు. హరిదయ ఉండే మనసు వశమౌతుంది. తర్వాత మీదటి పనులు నెరవేరుతాయి అని చినతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వరుని దయవలన ముక్తి లభిస్తుందని వర్ణించాడు.



వేంకటనాథుడా మేలుకో దాసులను పాలించుటకు, బ్రతికించుటకు మేలుకొనవయ్యా అని చినతిరుమలాచార్యులు మేలుకొలుపు సంకీర్తనను ఇట్లు శృంగార రసమిళితంగా రచించినాడు.

**"గోవింద మేల్కొనవయ్యా**
**కావించి భోగము కడమా నీకు ॥పల్లవి॥**

**కమలజ చల్లని కౌగిట దగిలి**
**సమరతి బాయగ జాలవూ**
**కమల భవాదులు కదు నుతియింపగ**
**విమలపు శయనము విడువగ తావు ॥గోవిందా॥**

**భూపతి తోడుత పొందులు మరిగి**
**వేసరవిదె నీ వేడుకలా**
**వాసవ ముఖ్యులు వాకిట నుండగ**
**పాసివుండనని పవళించేవూ ॥గోవిందా॥**

**నీళా మనసిజ లీలల దగిలి**
**నాలితోడ మానగ లేవూ**
**వేళాయను శ్రీ వేంకటనాథుడ**
**పాలించి దాసుల బ్రతికించగనూ ॥గోవిందా॥**

**- అధ్యాత్మ సంకీర్తన, 57 సంపుటం:10**

చినతిరుమలాచార్యులు వేంకటనాథుడు శ్రీ, భూ, నీళలతో కూడియున్నాడని వర్ణించాడు.

**"నీల మేఘమునందు నిలిచిన క్రొక్కారు**
**మెరుపు రీతిని సిరి యురము నందుఁ**
**గుడి భాగమున నీళ, యెడమభాగంబున**
**భూదేవి..."**

**- శ్రీ వేంకటాచల మాహాత్మ్యమున (2-67)**

తరిగొండవెంగమాంబ కూడ వేంకటేశ్వరుడు శ్రీ భూ నీళలతో కూడియున్నాడని వర్ణించింది.

చినతిరుమలాచార్యులు శృంగార సంకీర్తనలలో వేంకటనాథుని 'వగల మగతుమ్మెద'గా వర్ణించాడు.

"వలపుల కలగంప వానికేమె
వలరాజు గన్న తండ్రి వానికేమె ॥పల్లవి॥

వాడికగా దానె యెవ్వతెనైనా వలపించు
వాడని వాసన పువ్వు వానికేమె
వోడడెందరికి నైనా వుత్తరువె చెప్పని
వాడమగువల విందు వానికేమె ॥వల॥

తగిలి యెక్కడనైనా దనమేలెచూచుకొను
వగల మగతుమ్మెద వానికేమె
తగినట్టిందరి తోడ దరిదీపులె సేసు
వగకాడల్లారు ముద్దు వానికేమె ॥వల॥

యెనసి యెక్కడనైనా యిచ్చకమె సేసుకొను
వనితల పెనుబాతి వాని కేమె
ఘనుడు దానె శ్రీ వేంకటనాథుడు వచ్చి
వనజాక్షి నను గూడె వాని కేమె." ॥వల॥

**– శృంగార సంకీర్తనలు, 10-31**

ఒక నాయిక (అలమేలుమంగ) వేంకటేశ్వరుని శృంగారానుభవమున అటమటకాడని (మోసగాడు), ఆచారము లేనివాడని, అతని దూత శృంగారాన్ని అధిక్షేపించుటను చినతిరుమలాచార్యులు సహజరమణీయంగా వర్ణించాడు ఇట్లు–



"ఎటువంటి దొరవైతి వేమయ్య నీవు
అటమటముల నీకు నాచార మేది? ॥పల్లవి॥

వెనక నాయడపమువెలది మోవానితివి
అనువుగ నేగంటి నద్దములోన
తనియక నాకు నిట్టె తమ్ముల మిడ వచ్చేవు
యెనసి వూడిగపు దానెంగిలి కోపుదునా? ॥ఎటు॥

ముచ్చట నాకాళాంజి ముదిత గాగిలించితి
వచ్చుగా నేరత్నపు గోడావల గంటి
యిచ్చకాన నామీద నిట్టె చెయి వేసేవు
చెచ్చెర సేవకురాలి చెమట కోపుదునా? ॥ఎటు॥

వొద్దనె నాకుంచదాని నొగి దోటలో గూడగా
నిద్దపు గౌళాకూళి నీటిలో గంటి
గద్దరివైనన్ను శ్రీ వేంకటనాథ కూడితివి
అద్దో పరిచారకురాలంటుకు నోపుదునా? ॥ఎటు॥

**– శృంగార సంకీర్తనలు, 10-91**

* * *

## 16. అష్టభాషా దండకము – చినతిరుమలాచార్యులు

భవ్య కవితావేశమునకు, భావోద్వేగమునకు అనుగుణమై ఛందముతో శ్రవణసుభగమైన రసోల్లసితమైన రచన దండకము. ఇది ప్రధానముగా భక్తిమయము. ఆత్మాశ్రయ కవితారీతికి చెందిన లఘుకావ్యము దండకము. 'అష్టభాషాకవి చక్రవర్తి' అను సార్థక బిరుదముగల చినతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వరుని స్తుతించుచు అష్టభాషలలో దండకమును రచించినాడు. అందువలన ఇది అష్టభాషాదండకమను సార్థకనామ ధేయముతో ప్రసిద్ధమైంది. 1. సంస్కృతము, 2. ప్రాకృతము, 3. శౌరసేనీ, 4. మాగధీ,

5. పైశాచీ, 6. ప్రాచీ, 7. అవంతీ, 8. సార్వదేశీ అనునవి అష్టభాషలు. ఈ దండకము రాగి రేకులపై లిఖింపబడింది. దండకము చివర రాగిరేకులపై చెక్కిన తిథివారములు చెప్పబడినవి. అది 7-11-1537 తేదీ అగుచున్నది.

ఇట్లు చినతిరుమలాచార్యులు ఈ దండకమును రచించుటకు కారణము ఇట్లున్నది. శ్రీ వేంకటేశ్వరుని మహిమలు భారతదేశమున నానాదిక్కుల నరులనెల్ల ఆకర్షించియుండటచే ఆ భాషలను మాట్లాడు భక్తులు వేంకటేశ్వరుని స్తుతించుటకు అనువుగా అష్టభాషలలో రచింపబడింది. వీటిలో ఆంధ్రభాష లేకుండుట విశేషము.

అష్టభాషా దండకము లక్షణబద్ధమగు రచన. ఇది శ్రీకారముతో ప్రారంభమై తగణములో కొనసాగి గుర్వంతముగా సంపూర్తి అయినది. పెదతిరుమలాచార్యులు రచించిన శృంగార దండకలక్షణమును అనుసరించి చినతిరుమలాచార్యులు దండకాంతమున అంకితాంక శ్లోకము రచించినాడు. అష్టభాషాదండకము వేంకటేశ్వరాంకితము. అంకితాంక శ్లోకము ఇట్లున్నది-

**వాణీ వీణానినాద ప్రతిమచతురవాక్ తాళ్ళపాకాన్నయార్య**
**స్తత్పుత్ర స్తిమ్మయార్యో జితఫణి భణితిం స్తత్సుతేనాష్టభాషః**
**క్లు ప్తోయం తిమ్మయేనా రచిత పదగతి ర్వేంకటాద్రీంద్రభర్తు**
**స్త స్యోద్యత్కీర్తికేతు ర్జగతి విజయతాం దండకం పండితేడ్యః ॥**

చినతిరుమలాచార్యులు దండక ప్రారంభమున ఇష్టదేవతా ప్రార్థనగా వేంకటేశ్వరస్వామిని స్తుతించుచు రెండు స్రగ్ధరా వృత్తములు రచించినాడు. వీటిలో మొదటి వృత్తము సంస్కృతములోను, రెండవృత్తము ప్రాకృతాపభ్రంశములందు రచించినాడు. ఇది దండకము సంస్కృతములోను, షడ్విధ ప్రాకృత భాషలలోను రచింపబడుచున్నదని తెలియజేయుచున్నది. దండకమున ప్రారంభవృత్తము ఇట్లున్నది-

**శ్రీకాంతాకాంత వక్షోమణి ఘృణి రవి సంఫుల్ల కంజాత నాభీ**
**రాకాలోకానుకారిస్మితవికచరమా నేత్ర నీలోత్పల స్రన్**



**సాకం నాకేశ సంఘై ర్నత విధి హర ముఖ్యార్చితాంఘ్రి స్యమంతా**
**దాకంఠోత్కంఠ దాస ప్రియ కరణపటుః పాతునో వేంకటేశః ॥**

దండకమునందు కోటి కందర్పలావణ్య మూర్తియగు వేంకటాద్రీశుని శృంగారవర్ణనము, సంస్తుతి సుందరముగా ఉన్నవి. సంస్కృతమునందు వలెనే మిగిలిన భాషలందు దండకరచన గౌడీరీతిలో, ఓజోగుణ భరితమై వినసొంపుగా ఉన్నది.

సంస్కృతభాషా దండకమిట్లున్నది-

శ్రీ వేంకటాద్రీశ జీమూత నీలాంజన గ్రావబృంద ప్రభాభాసమానాంగ శృంగార శృంగారరూపోల్లసత్కోటి కందర్పలావణ్య వారాన్నిధే మన్నిధే, సన్నుతాశేష శేషాదిభాషా విశేషార్థగంభీర జంభారి శంభుస్వయంభూ ముఖామర్త్య జూట ప్రభాసేవ్య దివ్యాప గాభవ్యపాదాబ్జ కేకారవాపాదకా కీర్ణ...దానవారే హరే కొనువావచ్యతె తే నుతిం మానవః కేన వావచ్యతె తేసుతి ర్జిహ్వయా దైత్య శిక్షాకృతం దాసరక్షారతం మమ్మన స్త్వకం మానసే సర్వదా ॥

ఇట్లు చినతిరుమలాచార్యులు అష్టభాషాదండకములో మార్గ దేశిఛందో రీతులకు (స్రగ్ధరావృత్తములు, దండకము) సమన్వయం చేసినాడు. ఇది అష్టభాషాదండకము విశిష్టత.

* * *

## 4. రేవణూరి వేంకటార్యుడు (16 శతాబ్దం)

రేవణూరి వేంకటాచార్యుడు తాళ్ళపాక అన్నమాచార్యుల దౌహిత్రుడు. అన్నమాచార్యుల పుత్రిక తిరుమలాంబ, రేవణూరి తిరుమల కొండయాచార్యుల పుత్రుడు. ఇతడు శకుంతలాపరిణయమను మూడాశ్వాసముల శృంగార ప్రబంధమును, నాలుగు ఉల్లాసములలో శ్రీపాదరేణువను నిస్సహాయ కావ్యమును రచించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చి కృతారుడయినాడు.

## 17. శ్రీపాదరేణు ప్రభావము - రేవణూరి వేంకటార్యుడు

ఈ కావ్యము వేంకటేశ్వరస్వామివారి పాదరేణు ప్రభావమును చమత్కారంగా వర్ణించింది. శ్రీపాదరేణు ప్రభావమున 1. మన్మథ నారద సంవాదము 2. దత్తిల తుంబుర సంవాదము 3. రంభా ఇంద్రుల సంవాదము 4. సరస్వతీ బ్రహ్మదేవుల సంవాదము అను నాలుగు సంవాదములు నాలుగు ఉల్లాసములలో వర్ణింపబడినవి. ఈ సంవాదములలో మొదటివారు ఒక అంశమును తీసికొని, దానికి ఐహిక సంబంధమైన లౌకిక కారణమును చెప్పగా రెండవారు దాని ఉత్కర్షకు ఆముష్మికమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పాదరేణు ప్రభావము కారణమని చెప్పి, దానిని మొదటివారిచే అంగీకరిపంజేయగా మొదటివారు శ్రీవారి పాదరేణువు ప్రభావమును కొనియాడి తరించినట్లు వర్ణింపబడింది. ఈ కావ్యమున వెంకటార్యుని కవితాశైలి శబ్దరామణీయకంతో, అర్థగాంభీర్యముతో ప్రౌఢముగా మనోహరంగా ఉంది.

మొదటి ఉల్లాసమున మన్మథుడు లౌకిక దృక్పథంగలవాడు. సౌందర్యోపాసకుడు. ప్రపంచంలోని ప్రతి వస్తువును స్త్రీపరంగా చూచేవాడు. నారదుడు నిరంతరం శ్రీహరినామస్మరణతో ప్రపంచమును అలౌకిక దృష్టితో చూచేవాడు. వీరి దృక్పథములు, ఆలోచనాసరళి పరస్పర వ్యతిరేకములు. వీటిని సమన్వయపరచి అన్నింటికి వేంకటేశ్వరస్వామివారి పాదరేణు ప్రభావమే కారణమని వెల్లడించుటలో కవి ప్రతిభ వ్యక్తమౌతుంది. ఆశ్చర్యం కల్గిస్తుంది.

మన్మథుడు కలికిమోవి ద్రాక్షపండువలె తియ్యనైనది అని వర్ణింపగా నారదుడు శ్రీ వేంకటేశ్వరస్వామిపాదతీర్థము అంతకంటె తియ్యన. త్రాగి చూడుమని చెబుతాడు. (1-11) స్త్రీ చెయ్యి తగిలితే శిలలు కూడ పులకించునని మన్మథుడు చెప్పగా నారదుడు వేంకటేశ్వరుని పాదధూళి



సోకిన రాయి స్త్రీ అయింది కదా అని శ్రీరాముని పాదధూళిచే అహల్యా శాపవిమోచనము కలిగెనని ప్రబలకారణాన్ని తెలిపినాడు (1-15) ఇట్లు అనేక విధములుగా నారదుడు శ్రీపాదరేణుప్రభావమును స్తుతించగా ఆ మాటలు విని మన్మథుడు తన లౌకిక దృక్పథమును విడనాడి భక్తితో శ్రీపాదరేణువును ప్రస్తుతించినాడు (1-37-50). నారదుడు శ్రీపాదరేణు ప్రభావమును ఇట్లు ప్రస్తుతించినాడు.

**శ్రీమదలమేలు మంగా**
**భామాలింగనత నొదలి పట్టికలు కురం**
**గీ మదమున నగు వేంకట**
**ధాముని పదరేణువున్ సదా సేవింతున్. - 1-32.**

ద్వితీయోల్లాసములో దత్తిల తుంబుర సంవాదము గలదు. దత్తిలుడు నాట్యాచార్యుడు. లోకజ్ఞానము లేనివాడు. తుంబురుడు సంగీతాచార్యుడు. లోకజ్ఞానము గలవాడు. విష్ణుభక్తుడు. స్వర్గలోకంలో సువాసనలు వ్యాపించుటకు రంభనృత్యము చేయగా వెలువడు పుష్పపరాగము, ఆమె మైపూతలు కారణమని దత్తిలుని అభిప్రాయము. దీనిని ఖండించి, భూలోకమున వేంకటేశ్వరుడు నటింప పైకెగదన్నిన పాదరజః ప్రభావమే దివిలోని సువాసనలకు కారణమని తుంబురుడు చెప్పినాడు. (2-2). ఈ విధముగా దత్తిలుడు ప్రతిసువాసనకు, శృంగార చేష్టకు తనకు తోచిన లౌకిక కారణములు చెప్పగా, తుంబురుడు వాటికి శ్రీవారి పాదరేణు ప్రభావమే కారణమని తెలిపినాడు. తుంబురుడు శ్రీపాదరేణు ప్రభావమును రగడలో, దండకములో ఇట్లు ప్రశంసించినాడు.

**రగడ:- శ్రీమదలమేల్మంగ నిటలపుఁజేరుచుక్కయి నిల్చు రేణువు**
**భూమి నీళాసతుల చన్గవ పూఁతగంధపుఁ దావిరేణువు**
**తాత యార్య సమర్చ్య తులసీ దళమిలద్ఘనసార రేణువు**
**ధాతచేతుల శీతలోదక ధార జారఁగ గడఁగు రేణువు**

**భూతనాథుని కన్నురెప్పల భూతిపూఁతలఁగప్పు రేణువు**
**వాతపోతము జోతలెత్తెడి వాడిచేతులఁగప్పు రేణువు**
**కుండలీంద్రుని పడగలడుగుల కొలఁది యలతగఁదీర్చు రేణువు**
**తొండమాధిపు వదనకమలము దోఁగి మూగి తలిర్చు రేణువు**
**కురువనంబి ఘటించు మృణ్మయ కుసుమవిసరము గసరు రేణువు**
**శిరముమోపిన గోపినాథుని సిగ నిగన్నిగ ముసరు రేణువు**
**మూఁక వాక్పతి గాఁగ రసనిక మోకలాకులఁబెట్టు రేణువు**
**సోకవాకర లుడిగి పాకపు జోకతిమ్మిరి బుట్టు రేణువు**
**గండపెండెపు గండుతావులఁ గ్రాలు ఊలుతలిర్చు రేణువు**
**గండుతుమ్మెద మెండు కదుపుల కడుపులెడపులు దీర్చు రేణువు**
**సున్నపొన్నల చిన్ని వెన్నెల చుట్టుపట్టుల గెంటు రేణువు**
**కన్న కన్నెల కన్ను సన్నల కాపుదూపుల నెట్టు రేణువు**
**గంగగౌరుల కొంగు చుంగుల గట్టిపెట్టిన గట్టి రేణువు**
**రంగుపొంగుల దొట్టు మట్టియరాపురేపుల మట్టి రేణువు**
**శంకలేకయ యస్మదీయపు సంకటంబులఁగొట్టు రేణువు**
**వేంకటేశ్వరు సత్పదంబుల వెల్లదమ్ములఁబుట్టు రేణువు ॥**
**– శ్రీపాదరేణు ప్రభావము, 2-21**

గంగా గౌరులు కూడ శ్రీపాదరేణు ప్రభావమును గుర్తెరింగి కొంగు చుంగుల గట్టినారని తుంబురుడు వర్ణించినాడు. దీనికి కూడ తృప్తి పడని దత్తిలునకు తుంబురుడు శ్రీకృష్ణుని అష్టమహిషుల కష్టములను దీర్చి శ్రీపాదరేణువు కాపాడినట్లు ఒక దండకములో వర్ణించి చెప్పినాడు. ఈ దండకము వేంకటార్యుని బహుముఖ కవితా వైదుష్యమును వెల్లడించుచున్నది.

**దండకము :** శ్రీమన్మహా మంగళం బయ్యె నే రేణువున్ శ్రీ మహాలక్ష్మి సీమంత సీమంతపుం గుంకుమం బయ్యె నే రేణువున్, భూమి దేవీకుచా భ్యంతరన్యస్తకస్తూరికా చందన శ్రీ విభాసింప పాటీర చూర్ణాయతిన్ బొల్చె నే రేణువున్, జాల నీలా కపోలంపు డాల్తేట పన్నీటి మేల్డాల్ బచారించు



వ్రాల్ నీలపై జాలమై కప్పె నే రేణువున్, రుక్మిణీ స్వాదు బింబాధరాత్యంత దంతక్షతుల్ బాపె నే రేణువున్, నిత్యమున్ సత్యభామావిలాసార్థలీలా కళాస్థానపుం జీరలున్ దీరగాఁ ద్రోచెనేరేణువున్, జాంబవత్యక్షి పక్ష్మాంజన స్ఫూర్తి రంజిల్లె నేరేణువున్, చిత్రమై మిత్రవిందాను చుంబద్గతిన్ సారె నోరూర గావించె నే రేణువున్, ముందు కాళిందిమై ఘర్మబిందు క్రాశంబు నొందించె నేరేణువున్, భద్రమౌ భద్రపెన్గొప్పు పుప్పొళ్ళకున్ జల్లు పుట్టించె నే రేణువున్, అంత నంతన్ సుదంతావసంతోత్సవ క్రీడకున్ గోడె జోడయ్యె నే రేణువున్, లక్షణాహ స్తలాక్షానుబంధిన్ ద్రవత్వంబు సంధిల్లె నే రేణువున్, వేద చోరాసురున్ ముచ్చిలిన్ మచ్చగాఁ జేసె నే రేణువున్, మందరా మందమానాహి హాలహలజ్వాలికిన్ బొంగు న ప్పాల పొంగార్చె నే రేణువున్, ధారుణీఖాతసంఘాతగ ర్తచ్చటస్ఫూర్తికిన్ మించె నేరేణువున్, తొల్లి ప్రహ్లాద మై దట్టపున్ గుట్టకున్ జెట్టుకుం బూఁత పుట్టించె నే రేణువున్, శ్రీ బలీంద్రో త్తమాంగస్థ రత్నంపుటున్ మస్తు బోనాడె నే రేణువున్, క్షత్రమస్తోపసోపాన సంధుల్ ప్రబంధించె నే రేణువున్, దుష్కలం కేశలం కేశవంశంబులన్ బూడ్చె నే రేణువున్, నీలనీలాంబర శ్రీల మేల్ డోలికల్ దూఁగె నే రేణువున్, త్రైపురస్త్రీఘనోన్మాద మంత్రానుసంధాన సంసిద్ధ సమ్మోహనానంగభస్మోద్ధతిన్ దెట్టెనేరేణువున్, భూనభోత్థప్రవల్గద్భువిష్వద్భయారట్ట రింఖాసముద్ఘట్టనో ట్టంకితక్షోణిపాంసు ప్రభన్ ప్రింగ నూహించె నే రేణువున్, సర్వమాంగల్య దీక్షానుషంగంబు నై పుట్టె నే నట్టి మంగామనోనాథుఁడై నట్టి శ్రీ వేంకట స్వామి శ్రీపాదరేణున్ బ్రశంసింతు, మజ్జిహ్వికాదివ్య మందారవల్లిన్ మహా భారతీపత్కిసాలప్రసాదప్రసూనాయతై కాక్షరస్వాదు ఘుంఘుంఘుముల్ బల్ గుబాళింప శ్రీ శ్రీనివాసాంఘ్రి రేణుస్ఫురద్వస్తు మస్తంబుపైఁజేర్తు దా నుత్తమాంగంబుగా, భాష శేషాద్రిరాట్పాద విన్యాస భాస్వత్పరాగంబు గాంభీర్య మాహాత్మ్యముల్ జాలగా నాలకింతున్ శ్రుతుల్ నిశ్చయంబౌ శ్రుతుల్ గాగ, నారాయణాహార్యరాట్ చారణంబైన భూరేణువున్ జక్షులన్ నిక్షిపింతున్ జగత్యక్ష్యులై రంజిలన్, అంజనక్ష్మాధర శ్రీశపాదూశలాకాభికర్షంపుఁబ్రాగెంపు

రా పొళ్ళ నా యొళ్ళ నిండింతుఁ బూవిళ్లుగా, గారుడాగస్థలాధ్యక్షపక్షున్ని ధారుణ్యా? ధారాళధూళీక కల్యాణ నాళంబునన్ రక్ష బంధింతు బద్బాహువున్ రాహువై యొప్ప నప్పయ్యరై యద్గు పొందమ్ములన్ బిందు సింధూరపున్ మందు సేవింతునే ముందుగా మందరోగంబులెల్లన్ బటాపంచలై పోవ దేవాదిదేవాంచితా గార సంచారతారాజిత శ్రీ రజోభూతిచే భూతబేతాళ రక్షః పిశాచాదులన్ బారగాఁదోలుదున్ మాలతీపుష్పదామంబులన్ రామ పాదంబు లందున్ దుమారంబు రేపింతు మన్మానసారామ కేళీవిహారంబులన్ శ్రీలు వర్థిల్లగాన్ ॥ - శ్రీ పాదరేణు ప్రభావము, 2-22.

తాళ్లపాక కవులు శ్రీ వేంకటేశ్వరస్వామి అలమేలుమంగల తర్వాత శ్రీకృష్ణునికి, అష్టమహిషులకు ప్రాధాన్యమిచ్చినారు. తాళ్ళపాక చిన్నన్న అష్టమహిషీ కల్యాణమను ద్విపదకావ్యమును రచించాడు. ఆదిశేషుడు వేంకటేశ్వరస్వామికి పవళింపుపానుపై శేషాద్రిగా అవతరించుటలోని పరమార్థము శ్రీపాద రేణువును లెస్సగా పొందుటయే యని వేంకటాచార్యుడు నిశ్చయించినాడు (2-30). ఇది కవి భావనలోని వైచిత్రి. తర్వాత వేంకటాచార్యుడు ఒక రగడలో (2-40) రామాయణ కథనంతయు క్రమముగా స్తుతించి, దత్తిలుడు శ్రీపాదరేణువునకు శరణుజొచ్చినట్లు తరించినట్లు వర్ణించాడు.

వేంకటార్యుడు తృతీయోల్లాసమున రంభా ఇంద్రుల సంవాదమును మనోహరముగా వర్ణించాడు. రంభ సందేహములు, వాటికి ఇంద్రుని సమాధానములు వారి మనస్తత్త్వమునకు తగినట్లు ఉన్నవి. ఇంద్రుని స్త్రీలోలత్వము ప్రసిద్ధము. ఈ సందర్భమున కవి ఇంద్రుని వేంకటేశ్వరస్వామి భక్తునిగా వర్ణించాడు. రంభ అహల్యాసమాగమమును, గౌతముని శాపమును వర్ణించి, అట్టి దోషివైన నీకు యాగఫలభాగము ఎట్లు అబ్బినదని ప్రశ్నించింది. శ్రీపాదరజోదకమును గ్రోలుట చేతనే తనకు గౌతముని శాపము తొలగి, యాగ ఫలభాగము లభించినదని ఇంద్రుడు సమాధానము చెప్పినాడు. (3-10).



పితృఋణము తీర్చుటకు భగీరథుడు దివి నుండి భువికి గంగను తెచ్చిన ఘట్టమును వేంకటాచార్యుడు రమణీయంగా వర్ణించాడు (3-27). గంగ విష్ణుదేవుని పాదమున పుట్టి పవిత్రతనొంది, శివుని శిరస్సున నిలిచింది. ఈశ్వరునికి శిరోధారయైన గంగకు జన్మస్థానమైనది విష్ణుపాదము గనుక ఆ పాదరేణువు పవిత్రమైనదని ఇంద్రుడు ప్రస్తుతించినాడు ఇట్లు-

**శ్రీ వేంకటేశ సత్పద**
**పావన తీర్థంబు మౌళిపైఁ గల శివుఁడే**
**కావలె సర్వజ్ఞుఁడు నే**
**సేవించెద వేంకటేశు శ్రీపద రేణున్. - 3-29**

వేంకటాచార్యుడు వైష్ణవ మతాభిమానముతో దేవేంద్రునిచేత శ్రీపాదరేణువు మహిమను పంటలను పెంచునట్టి ఎరువుతో పోల్చి మనోహరంగా ఇట్లు వర్ణింప చేసినాడు.-

**తిరుమంత్రాఖ్య హలంబుఁ బూని కృషి కృద్ధీమంతుఁడాత్మీయ హృ**
**ద్ధరణిన్ దున్ని ద్వయార్థ బీజములు నిండంజల్ల నంకూరమై**
**పరఁగన్ బూచిన మోక్షశాలికిని బైపై సత్తువల్ నింపు దా**
**నెరువై శేషగిరీంద్రపాదరజ మూహింపంగ నిద్ధారుణిన్. - 3-39**

ధీమంతుడైన కర్షకుడు మోక్షార్థియై అష్టాక్షరీ మంత్రమను (ఓం నమో వేంకటేశాయ లేక ఓం నమో నారాయణాయ) నాగలితో తన హృదయమను భూమిని దున్ని, ద్వయమను మంత్రాక్షరములు (శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయ నమః) చల్లగా మొలకెత్తి, పెరిగి, వెన్ను దొడిగి మోక్షమను పంటను ఇచ్చుటకు వేంకటేశ్వరస్వామి వారి పాదరేణువు మంచి యెరువని, శ్రీపాదరేణు ప్రభావమును ఇంద్రుడు స్తుతించాడు.

ఇంద్రుడు అష్టకమను విశేష ఛందస్సులో శ్రీపాదరేణు ప్రభావమును కీర్తించినాడు. వెంకటాచార్యుడు పదునెనిమిది అష్టకములలో శ్రీపాదరేణు

ప్రభావమును వర్ణించినాడు (3-44) ఈ అష్టక రచనకు వేంకటార్యునికి కందుకూరి రుద్రకవి రచించిన జనార్దనాష్టకము ప్రేరకమైయుండును. ఈ 18 అష్టకములలో పదముల పొందిక, శబ్ద రామణీయకము, భావగంభీరత ప్రశంసనీయంగా ఉన్నవి. కవి ప్రతిభకువేంకటార్యుని యెడ స్వామికి గల వాత్సల్యము, కవికి గల వేంకటేశ్వర భక్తి కారణములుగ ఉన్నవి.

నాల్గవ ఉల్లాసమున సరస్వతీ బ్రహ్మదేవుల సంవాదము వర్ణింపబడింది. ఈ ఉల్లాసము అసంపూర్ణముగా లభించింది. ఇందులో 35 పద్యములే గలవు. ఇందు సరస్వతి స్వాతిశయంతో తన ప్రభావము వల్లనే లోకమున సర్వము సిద్ధించుచున్నదని పలుకగా, బ్రహ్మ ప్రపంచమున శ్రీపాదరేణు ప్రభావము వలననే అన్నియు సిద్ధించుచున్నవని సమాధానం చెప్పినాడు. బ్రహ్మ జిహ్వాలయందు తానుండి పలికించుచుండుటచే అతడు నాలుగు వేదాలను ఉచ్చరించుచున్నాడని సరస్వతి పలుకగా శ్రీనివాసుని పాదరేణువు సేవవలన తన జిహ్వాలతలందు వేదపుష్పములు విరిసెనని బ్రహ్మసమాధానం చెప్పినాడు (4-2). సరస్వతి బ్రహ్మయొక్క రజోగుణ మునకు కారణం తన పాదపద్మములవంటి పద్మమునందు జన్మించుటయే యని వాదించగా బ్రహ్మ తాను వేంకటేశ్వరుని పాదములను పద్మములతో పూజచేయగా, వాటి రజస్కము రజోగుణముగ తన శరీరమును ఆక్రమించెనని శ్రీపాదరేణు ప్రభావమును కీర్తించినాడు (4-24) సరస్వతి శ్రీపాదరేణు ప్రభావమును గూర్చి తనకు గల్గిన అనుమానములను ప్రశ్నల రూపంలో వెల్లడించగా బ్రహ్మ తగిన సమాధానములు చెప్పినాడు. ఇవన్నియు ఉత్కళిక రూపంలో రేవణూరి వెంకటార్యునిచే రచింపబడినవి (4-25-34). సరస్వతి శ్రీపాదరేణు ప్రభావమును తెలిసికొని చూర్ణికలో ప్రశంసించింది. ఈ చూర్ణిక అసంపూర్ణంగా ఉంది. ఇక్కడ నుండి గ్రంథపాతం జరిగింది.

ఇట్లు శ్రీపాదరేణుప్రభావమును అనన్య భక్తితో రసరమ్యంగా ప్రౌఢ ప్రబంధరీతిలో రచించి వేంకటార్యుడు శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకిత మిచ్చి ధన్యజీవి అయినాడు.

* * *

## 4.3.4. శ్రీ వేంకటేశ్వర సాహిత్యము - పరిశిష్ట కావ్యములు

### 1. శ్రీ వేంకటేశ సుప్రభాతము మొదలగుస్తోత్రములు

**- ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి**
**(క్రీ.శ.1361-1454)**

భగవంతుని ఆశ్రయించుటకుగల కర్మ, జ్ఞాన, భక్తి మార్గములలో భక్తి మార్గము అందరికి సులభసాధ్యమైన మోక్షోపాయము. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అను నవవిధ భక్తిమార్గములలో భగవంతుని ప్రసన్నుని చేసికొనుటకు విశిష్టమైన మార్గం కీర్తనం. ఇందుకు భగవన్నామ, గుణమహిమాతి శయములను వర్ణించు స్తోత్రములు పఠించుట ఆవశ్యకము. భగవంతుని కల్యాణ గుణములను మహిమాతిశయములను అనుభవించిన మహాభక్తులు, వారి అనుభూతిని స్తోత్రరూపమున పొందుపరచి ఇతరులకు మార్గ దర్శకులయినారు.

ప్రపంచ వాఙ్మయములలో మొదటి దగు ఋగ్వేదము అంతా ప్రకృతి దేవతల స్తోత్రములతో నిండియున్నది. ఇందు అగ్ని, ఇంద్ర, వరుణ, సవితృ, విష్ణు, రుద్ర, మరుత్తు, ఉషస్సుమున్నగు దేవతాస్తుతులు ఉన్నవి. ఋక్ శబ్దము ఋచస్తుతౌ అను స్తుత్యర్థక ధాతువు నుండి ఏర్పడింది. కనుక ఋక్కు అనగా స్తోత్రము అని అర్థము. కాలక్రమమున ఆగమ, పురాణ వాఙ్మయములలో విష్ణు, శివ, దేవీ పరములగు స్తోత్రములు అనేకములు గలవు. సుప్రసిద్ధమైన విష్ణుసహస్ర నామస్తోత్రమునకు మహాభారతము ఆకరముగ ఉన్నది. భక్తుల అభిరుచిని అనుసరించి వెలువడిన భగవంతుని ద్వాదశనామ స్తోత్రములు, ఏకవింశతినామ స్తోత్రములు, అష్టోత్తర శతనామ స్తోత్రములు, సహస్రనామ స్తోత్రములు పురాణ వాఙ్మయములో అనేకములు గలవు.

భగవంతుని ఆరాధించుటలో ప్రాతః స్మరణీయమైనది సుప్రభాత స్తోత్రము, చివరిది మంగళా శాసనముగా ప్రసిద్ధములు. 'స్తూయతే అనేన ఇతి స్తోత్రమ్' అను వ్యుత్పత్తి వలన స్తోత్రము భగవంతుని స్తుతించుటకు అనువైనదిగ ఉన్నది. స్తుతి, నుతి, స్తవము అనునవి స్తోత్రమునకు పర్యాయ పదములు భక్తుడు అభీష్ట దైవమును ప్రసన్నుని చేసికొనుటకు, స్వామి అనుగ్రహమును పొంది తన కోరికలను నెరవేర్చుకొనుటకు భక్తితో, ఆర్తితో భగవంతుని కల్యాణ గుణములను, స్వామి దయాకటాక్ష వైభవమును వర్ణించు నామములు/వాక్యములు స్తోత్రము అని పిలువబడుచున్నవి.

ఋగ్వేదమునుండి ప్రారంభమైన సంస్కృత స్తోత్ర వాఙ్మయంలో గల వివిధప్రక్రియలలో సుప్రభాత స్తోత్రములకు విశిష్టస్థానమున్నది. యోగ నిద్రలో నున్న భగవంతుని మేలుకొలుపుట సుప్రభాత స్తోత్రము యొక్క ప్రయోజనము. సుప్రభాత స్తోత్రమున భక్తుని హృదయము వాత్సల్యభక్తి పరవశమై బాలరామచంద్రుని ప్రేమతో నిద్రలేపు కౌసల్యాదేవి మాతృ హృదయమువలె భాసించును. ప్రాభాతిక సంధ్యలోని అరుణకాంతులతో ప్రకాశించుచున్న ఆకాశము, ఆ సమయమున వీచు మలయమారుతము, సూర్యకిరణముల ప్రభావముచే ప్రకృతిలో గలుగు మార్పులు మొదలగు ప్రకృతి సౌందర్య వైభవము, పర్యావరణ సన్నివేశ వైభవము సుప్రభాత స్తోత్రములో తప్పక వర్ణింపబడును. అంతేగాక భక్తజనరక్షణ దీక్షతో అవతరించిన భగవంతుడు నిద్రలేచి ఆర్తులగు భక్తులకు యోగక్షేమములను అనుగ్రహించవలసిన అవసరము కలదని స్వామి బాధ్యతను, అవతార ప్రయోజనాన్ని సవినయముగా, భక్తితో జ్ఞాపకము చేయుట సుప్రభాత స్తోత్రములందు ముఖ్యాంశముగ ఉన్నది.

భగవంతుని అద్భుత కల్యాణ గుణములను, అప్రమేయములగు దివ్య కర్మలను ప్రశంసించు స్తోత్రము కూడ సుప్రభాతస్తోత్రములో ఒక భాగముగా ఉన్నది. ప్రపన్న రక్షకుడగు భగవంతుని మేలుకొలిపి 'నేను నీకు ప్రపన్నుడను. నీవే తప్ప నితః పరంబెరుగ మన్నింపదగుం దీనునిన్, శరణార్థిని నన్ను గావవే' అని ప్రార్థించి స్వాత్మార్పణము చేసి, ఆత్మనివేదన రూపమగు భక్తిని ప్రకటించు 'ప్రపత్తి' అను అంశము సుప్రభాత స్తోత్రములో ఒక భాగంగా ఉంది. వాత్సల్య భక్తితో స్వామికి ఎల్లప్పుడు మంగళము కలుగవలెనని ఆశించుట మంగళాశాసనము. ఈ భక్తుని ఆకాంక్ష సుప్రభాత స్తోత్రములో చివరి అంశముగా ఉన్నది. పైన వివరించిన నాలుగు అంశములతో కూడియున్న శ్రీ వేంకటేశ సుప్రభాత స్తోత్రము స్తోత్రవాఙ్మయంలో విశిష్ట స్థానమున విరాజిల్లుచున్నది.



సుప్రభాతమనగా మేలుకొలుపు అనునది సామాన్యార్థము. ప్రభాత మనగా తెల్లవారుటకు ముందు నాలుగు గడియలు గల కాలము, వేకువ అని నిఘంటువు చెప్పుచున్నది. ప్రకృతిలో అంతవరకు గల చీకటిని తొలగించు సూర్యుని వెలుగు ప్రారంభమగుకాలము సుప్రభాతము. భక్తుని హృదయములో ఆవరించియున్న అజ్ఞానాంధకారము భగవంతుని అనుగ్రహము అను జ్ఞానజ్యోతిచే తొలగిపోవుకాలమును సుప్రభాతమన వచ్చును. "శోభనం చ తత్ ప్రభాతం చ సుప్రభాతమ్' అను వ్యుత్పత్తిచే సుందరమైన ప్రభాత (వేకువ) సమయము సుప్రభాతమని తాత్పర్యము.

సాధారణముగా సుప్రభాత స్తోత్రములలో భగవంతుని 'తవ సుప్రభాతమ్' అని స్తుతించుట గలదు. ఇక్కడ శుభోదయము అను సామాన్యార్థము గాక భగవంతుని యెడ ఆసక్తి గలిగిన భక్తుడు, స్వామిని సమీపించి మేలుకొలుపు సమయము శుభోదయము పలుకు సమయము సుప్రభాతమను విశేషార్థము గలదు. తనయందు ఆసక్తి గలిగిన భక్తుడు తనను చేరి కీర్తించు సమయము భగవంతునికి సుప్రభాతమగుచున్నది. భగవంతుడు ఆశ్రితాభిలాషి.

భగవంతుని సేవించి, తరించ దలంచిన భక్తుడు ఆశ్రయించు సేవలలో సుప్రభాతము ప్రథమ గణ్యమైనది. సుప్రభాత స్తోత్రమును పరిశీలించినపుడు క్రింద పేర్కొనిన లక్షణములు కనబడుచున్నవి.

1. ప్రభాత కాలమున ప్రకృతిలో కనిపించు సుందర దృశ్యములను వర్ణించుట.
2. మేల్కాంచిన భగవంతునికి తత్కాలమున చేయదగు కార్యములను జ్ఞాపకము చేయుట.
3. భగవంతునియందు గల షడ్గుణములను ప్రశంసించుచు భక్తరక్షణకు సిద్ధమగునట్లు వేడుకొనుట.
4. అనన్య భక్తితో నీవే తప్ప నాకు వేరు దిక్కు లేదని భగవంతుని ఆశ్రయించి, ప్రపత్తి చేయుట.
5. వాత్సల్య భక్తితో సర్వదా శ్రీవారి వైభవము అభివృద్ధి చెందవలెనని మంగళమును ఆశంసించుట

## శ్రీ వేంకటేశ సుప్రభాత స్తోత్రము

శ్రీ వేంకటేశ సుప్రభాతమును, స్తోత్రమును, ప్రపత్తిని, మంగళా శాసనములను ప్రతివాది భయంకర అణ్ణన్‌స్వామి (1361-1454) రచించినాడు. వీరికి వాదిభీకర మహాగురువు అను నామాంతరము గలదు. ఇతడు శ్రీవైష్ణవాచార్యుడైన (కృష్ణమాచార్యులు) మనవాళ మాముని (క్రీ.శ.1370-1443) శిష్యుడు. మనవాళమాముని తిరుమల వేంకటేశ ఆలయమును దర్శించినపుడు గుర్వాజ్ఞను అనుసరించి అణ్ణన్‌స్వామి సంస్కృత భాషలో ఆశువుగ శ్రీవేంకటేశ సుప్రభాతం, వేంకటేశ స్తోత్రము ప్రపత్తి, మంగళా శాసనములను రచించాడు. నాటినుండి నేటికీ తిరుమల శ్రీవేంకటేశ్వరాలయంలో ప్రతివాది భయంకర అణ్ణన్‌స్వామి రచించిన సంస్కృత సుప్రభాతము మొదలగునవి పఠింపబడుచున్నవి. ఈ సుప్రభాత రచనకు ముందు తిరుమల శ్రీవారిసన్నిధిలో విప్రనారాయణుడు (తొండరడిప్పొడి ఆళ్వారు) రచించిన శ్రీరంగనాథుని ప్రాబోధకీ స్తుతి (తిరుప్పళ్ళి యెళుచ్చి) పదిపాశురములు పఠింపబడుచుండేవి. ఇవి తమిళ భాషలో



ఉన్నవి. ఇప్పుడు శ్రీవారి ఆలయములో ఒక్క ధనుర్మాసమున మాత్రము శ్రీరంగనాథుని ప్రాబోధకీస్తుతి (తిరుప్పళ్ళి యెళుచ్చి) సంపూర్తిగా, పిమ్మట గోదాదేవి (ఆండాళ్) రచించిన తిరుప్పావైలో రోజూ ఒక్క పాశురము చదువబడుటతో శ్రీ వేంకటేశ్వరస్వామివారి సుప్రభాతసేవ జరుగుచున్నది.

ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి రచించిన శ్రీ వేంకటేశ సుప్రభాతము (29 శ్లోకములు) వసంత తిలకా వృత్తమున, స్తోత్రము (11 శ్లోకములు) తోటక వృత్తమున, ప్రపత్తి (16 శ్లోకములు) ఉపజాతివృత్తమున, మంగళాశాసనము (14 శ్లోకములు) అనుష్టుప్ శ్లోకమున మొత్తం డెబ్బది శ్లోకములతో సంపూర్ణమైనది. ఇందు సప్తసంఖ్య సప్తగిరులకు, పూర్ణసంఖ్య సప్తగిరినాథుని తెలియజేయుచున్నవి. శ్రీ వేంకటేశ సుప్రభాతము శ్రీమద్రామాయణములో ఆదికవి వాల్మీకి మహర్షి రచించిన

**"కౌసల్యా సుప్రజారామ పూర్వా సంధ్యా ప్రవర్తతే ।**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్ ॥"**

**- బాలకాండ, 23-2 శ్లోకము**

ప్రాభాతికస్తుతితో ప్రారంభమగుచున్నది. ఈనాడు ప్రచారములో ఉన్న వివిధ దేవతా సుప్రభాతములు శ్రీ వేంకటేశ సుప్రభాతమునకు అనుకరణములుగా నున్నవనుటలో సందేహము లేదు.

* * *

## 2. సమీక్ష

శ్రీ వేంకటేశ సుప్రభాతమందలి మొదటి శ్లోకము వాల్మీకి రామాయణము నుండి గ్రహింపబడింది. శ్రీ వేంకటేశుని సుప్రభాతము శ్రీరాముని మేలుకొలుపుతో ప్రారంభమగుచున్నది. రెండవ శ్లోకము 'ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద!" అని శ్రీకృష్ణుని మేలుకొలుపుగ ఉంది. ఈ రెండు శ్లోకములు వేంకటేశ్వరుడు విష్ణుదేవుని విభవావతారములగు శ్రీరామ (త్రేతాయుగము),

శ్రీకృష్ణ (ద్వాపరయుగము) అవతారములకు తరువాతిదైన అర్చావతారమని తెలియజేయుచున్నవి. "కలౌ వేంకటనాయకః" అను ఆర్యోక్తి ప్రకారము వేంకటపతి కలియుగావతారమని స్పష్టమగుచున్నది. తిరుమల వేంకటేశ్వ రాలయ గర్భగృహములో శ్రీవారి విగ్రహములతో పాటు శ్రీసీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులు. రుక్మిణీ శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులు గలవు. గర్భాలయంలో శ్రీవారితో కూడ శ్రీరామ, శ్రీకృష్ణుల ఉనికి వీరందరు విష్ణుదేవుని అవతారమూర్తులేయని తెలియజేయుచున్నవి. సంవత్సరంలో ప్రతిదినము, ప్రతిరాత్రి ఏకాంతసేవలో 'పవ్వళింపు' సేవ వేంకటేశ్వరుని ధ్రువమూర్తికి ప్రతినిధిగానున్న కౌతుకమూర్తికి – భోగశ్రీనివాసమూర్తికి – జరుగుతుంది. కాని ప్రతిధనుర్మాసంలో మాత్రము ఈ పవళింపుసేవ గర్భాలయంలోనే ఉన్న శ్రీకృష్ణమూర్తికి జరుగుతుంది. ధనుర్మాసంలో శయనబేరముగా శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని ఉపయోగించుట శ్రీవారితో శ్రీకృష్ణునికిగల సన్నిహిత సంబంధాన్ని సూచించుచున్నది. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి జరిగే వసంతోత్సవములలో, ప్లవోత్సవములలో ఒక రోజు శ్రీ కోదండరామునికి, ఒక రోజు కృష్ణునకు కూడ జరుగుచున్నాయి. తిరుమలలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలలో, నవరాత్రి బ్రహ్మోత్సవాలలో శ్రీ వేంకటేశ్వరస్వామి శ్రీరామునిగ, శ్రీకృష్ణునిగ దర్శనమిస్తాడు.

సుప్రభాతమందలి మూడు, నాలుగు శ్లోకములు శ్రీనివాసుని (విష్ణుదేవుని) వక్షఃస్థలము నధిష్ఠించియున్న లక్ష్మీదేవికి మేలుకొలుపుగ ఉన్నవి. ఈ శ్లోకములలో లక్ష్మీదేవి జగన్మాతగా, దివ్యస్వరూపిణిగా, ఆశ్రితుల కోరికలను తీర్చే దానశీలగా దయానిధిగా స్తుతింపబడింది. పిమ్మట 'శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్' అను మకుటముతో ఎనిమిది శ్లోకములు (5–12), శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్' అను మకుటముతో పదునాలుగు శ్లోకములు (13–24, 27, 28) 'వేంకటపతే తవ సుప్రభాతమ్' అనుమకుటముతో ఒక శ్లోకము (25), తవ వేంకటసుప్రభాతమ్' అను



సంబోధనతో ఒక శ్లోకము (26), ఫలశ్రుతి శ్లోకము (29) ఒకటి మొత్తము 29 శ్లోకములతో సుప్రభాతము చెప్పబడింది. 26 శ్లోకమున 'తవ వేంకట సుప్రభాతమ్' అను ప్రయోగముచే వేంకటాచలపతికి వేంకటపర్వతమునకు అభేదము సూచింపబడింది. శ్రీ వేంకటేశ అష్టోత్తర శతనామావళిలో కూడ శ్రీ వేంకటేశాయ నమః (1), శ్రీ వేంకటాయ నమః (22) అని స్వామికి, పర్వతమునకు అభేదము చెప్పబడింది.

శ్రీనివాసుడు వెలసిన పర్వతమునకు కృతయుగమున వృషాద్రి అని, త్రేతాయుగమున అంజనాచలమని, ద్వాపరయుగమున శేషాద్రి అని, కలియుగమున వేంకటాచలము అనే నామములు యుగభేదములచే గల్గినవని భవిష్యోత్తరపురాణము ఇట్లు వర్ణించింది.

**శ్లో॥ కృతే కృషాద్రిం వక్ష్యంతి త్రేతాయాం అంజనాచలమ్ ।**
**ద్వాపరే శేషశైలేతి కలౌ శ్రీ వేంకటాచలమ్ ॥**
**నామాని యుగ భేదేన శైలస్యాస్య భవంతి హి ॥**

**– అధ్యాయం – 36, 37 శ్లో॥**

అణ్ణన్‌స్వామి ఈ పర్వతమునకు గల ద్వాపరయుగ నామ ప్రసిద్ధిని, కలియుగనామ ప్రసిద్ధిని గుర్తించి ఎనిమిది శ్లోకములలో శ్రీనివాసుని శేషాద్రి విభుదని, అందుకు రెట్టింపు (16) శ్లోకములలో వేంకటాచలపతి అని సంబోధించినాడు.

సుప్రభాత స్తోత్రమున ప్రాభాతిక ప్రకృతి సౌందర్యమును వర్ణించుచు భగవంతుని మేలుకొలుపుట సంప్రదాయము. అణ్ణన్‌స్వామి శ్రీ వేంకటేశ సుప్రభాతములో కొద్దిగా వికసించిన పద్మములనుంచి, అరవిచ్చిన కొబ్బరి, పోక మోవుల నుంచి ప్రసరించిన సువాసనలతో కూడి మందమందంగా వీస్తున్న మలయమారుతాన్ని, మకరందము త్రాగి మైమరచిన తుమ్మెదలు స్వామిని సేవించుటకై ఝుంకారగీత ధ్వనులతో సమీపమున ఉన్న సరసీ

కమలాలనుండి వెలువడుటను, పల్లెలోని గొల్లవనితలు పెరుగు చిలుకు తున్నపుడు గలిగిన దధిమంధన ధ్వనులను, సూర్యుడు ఉదయించుటను, కమలములు వికసించుటను, పక్షుల కలకల నినాదములను సుందర మనోహరంగా వర్ణించి వేంకటేశ్వరస్వామికి సుప్రభాతం పలికినాడు.

ఇందు వేంకటాచలపతిని సప్తఋషులు, సకలదేవతలు సేవించుటకై నిరీక్షించుచున్నట్లుగా, వేంకటేశుని సప్తగిరీశునిగా, దయానిధిగా, జగదేక శరణ్యమూర్తిగా, శరణార్థులకు కల్పవృక్షముగా, వేదాంత వేద్య వైభవము గలవానిగా అణ్ణన్‌స్వామి శ్రీనివాసుని వైభవాన్ని వర్ణించాడు.

శ్రీ వేంకటేశ స్తోత్రములో మొదటి ఎనిమిది శ్లోకములను అణ్ణన్‌స్వామి రచించి, చివరి మూడు శ్లోకాలను మార్కండేయ పురాణములో మార్కండేయ మహర్షి తిరుమలయాత్రచేసి, వేంకటేశ్వరుని దర్శించి, చేసిన స్తోత్రమునుండి (అధ్యాయం-2-19, 20, 21 శ్లోకములు) గ్రహించినాడు **"శృంగార ఏవ మధురః పరప్రహ్లాదనో రసః"** అని ధ్వన్యాలోకము శృంగారమే అత్యంత మధురము, ఆనందజనకమగు రసమని నవరసములలో శృంగార రసప్రాముఖ్యాన్ని కీర్తించింది. అంతేగాక శృంగార రసమునకు విష్ణుదేవుడే అధిదేవత. జగత్తులో జనసమూహము యొక్క అవిచ్ఛిన్నతకు, లోకకల్యాణమునకు హేతువైనది శృంగారము. కనుక వేంకటేశ స్తోత్రము లక్ష్మీదేవి కుచములమీది కుంకుమతో అరుణకాంతులతో విరాజిల్లుతున్న నీలదేహము కలవాడా! అని ప్రారంభమైంది. ఉత్తర రామచరిత్ర నాటకకర్త

**"తపస్వీ కాం గతోఽవస్థా మితి స్మేరాననా వివ।**
**గిరిజాయాస్తనౌ వందే భవభూతి సితాననౌ॥"**

అని శివపార్వతుల రమణీయ శృంగారానుభవ విశేషాన్ని దర్శించి, వర్ణించి 'భవభూతి' అనుసార్థక నామధేయాన్ని సంపాదించుకొన్నాడు. ఈ స్తోత్రములో



స్వామి శరణాగతవత్సలుడని, కరుణాసముద్రుడని, పరదైవతమని, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అయిన వేంకటవిభుని తప్ప వేరొక దైవాన్ని ఆశ్రయించనని, వేంకటేశుడు తప్ప వేరొక దైవము లేడని, స్వామినే ఎల్లప్పుడు ప్రార్థిస్తానని ప్రపత్తి చేయబడింది. అజ్ఞానినైన నా అపరాధములను క్షమించి నిత్య సేవాఫలాన్ని అనుగ్రహించమను ప్రార్థన కూడ ఉన్నది.

వేంకటేశ ప్రపత్తిలో మొదటి శ్లోకము జగన్మాతయగు లక్ష్మీదేవిని స్తుతించుచున్నది. మిగిలిన 15 శ్లోకములు 'శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే' అను మకుటముతో రచింపబడినవి. ప్రపత్తిలో వేంకటాచలపతి భక్తవత్సలుడని, సర్వశేషియని, స్వామిపాదములు ధ్వజ, అమృతకలశ, శంఖ, చక్రాది శుభచిహ్నములతో అలంకృతములని, అరుణారుణ కాంతులను వెదజల్లుచున్నవని, సుకుమారములని, అమృతాయమానములని శ్రీవారి పాదముల వైభవము కీర్తించబడింది. అణ్ణన్‌స్వామి తన గురువైన మణవాళమహాముని చూపించినట్టి శ్రీనివాసుని దివ్యపాదములను శరణు వేడినాడు. ప్రపత్తిలో పదవ శ్లోకమున **"విష్ణోఃపదే పరమ మధ్వ ఉత్స"** అను ఋగ్వేద మంత్రమును (1-154-5) సార్థకంగా అణ్ణన్‌స్వామి ఉపయోగించుకున్నాడు. శ్రియఃపతి యగు శ్రీనివాసుడే ఆశ్రితులకు ప్రాప్యము, ప్రాపకుడు. కనుక వేంకటేశ్వరస్వామియే కుడిచేతితో తన పాదములను ఆశ్రయించుడని భక్తజనులకు ఉపదేశించుచున్నాడు. అట్టి పరదేవత దివ్యపాదపద్మాలను ఆశ్రయించుట తప్ప భక్తులకు వేరు మార్గము లేదని అణ్ణన్‌స్వామి ప్రకటించినాడు. పదకొండవ శ్లోకమున భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు ఉపదేశించిన చరమ శ్లోకార్థము (18-66) **స్వచరణౌ శరణం వ్రజ** సంగ్రహముగ బోధింపబడింది. చివరి (16) శ్లోకమున లక్ష్మీదేవి యొక్క పురుషకార స్వరూపము ప్రతిపాదించబడింది. ఇట్లు అణ్ణన్‌స్వామి వేంకటేశుని నీ దాసుడను, అనుగ్రహించమని ప్రపత్తి చేసినాడు.

వేంకటేశ మంగళాశాసనమున సర్వశేషి, నిత్యుడు, సచ్చిదానంద స్వరూపుడు, సమస్త ప్రాణులకు అంతర్యామి, పరబ్రహ్మ, సర్వశక్తి సంపన్నుడు, సర్వసులభుడు, దయామృత కటాక్షములు గలవాడు అని శ్రీనివాసభగవానుని కల్యాణగుణ వైభవము ప్రశంసింపబడింది. కలియుగమున భక్తజనులను అనుగ్రహించుటకై వైకుంఠము మీద విరక్తి చెంది, వేంకటాద్రిపై స్వామిపుష్కరిణీ తీరమున లక్ష్మీదేవితో విహరించుచున్న వేంకటేశ్వరస్వామికి ఎల్లప్పుడు మంగళము కలుగవలెనని ఆశాసించబడింది. అణ్ణన్‌స్వామి **'రమ్యజామాతృముని'** అని ప్రసిద్ధి చెందిన మణవాళమాముని వద్ద ద్రావిడ వేదాంతమును అభ్యసించినాడు. అందుచే అణ్ణన్‌స్వామి సర్వలోకనివాసి యైన శ్రీనివాసభగవానుని **'శ్రీమత్సుందరజామాతృముని మానసవాసి'**గా (13 శ్లోకం) అభివర్ణించినాడు. భగవంతునికి మంగళాశాసనము పలుకుటలో ఆసక్తులైన మా ఆచార్యులు – మనవాళమాముని – మొదలైన పూర్వాచార్యులందరి చేత సత్కృతుడైన వేంకటేశునకు మంగళము కలుగుగాక అని ఆశించుటతో సుప్రభాత స్తోత్రము సుసంపన్నమైనది. ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి అపరవయస్సున తమ గురువులు పరమపదించిన పిమ్మట శ్రీరంగము నుండి తిరుమల చేరి, వేంకటేశ్వరస్వామిని సేవించుచు, 93 సంవత్సరముల వయస్సున పరమపదము చేరినారు. ప్రాచీన సుప్రభాత స్తోత్రగ్రంథములలో

**"శ్రీరమ్యజామాతృమునీంద్ర శాసనాత్**
**యో మంగళాశాసన సౌప్రభాతికే**
**చక్రౌ ప్రపత్తించ వృషాచలేఽ శ్రితః**
**తం వాది భీకృద్గురు మాశ్రయా మ్యహమ్ ॥"**

మంగళాశాసన ప్రారంభమున అణ్ణన్‌స్వామి **'నిత్యతనియ'** శ్లోకము ఉండేది. నేటి సుప్రభాత స్తోత్రములో పై శ్లోకము అదృశ్యమైనది.



సుప్రభాత స్తోత్రమునకు సాంగోపాంగమైన సమగ్ర రూపకల్పన శ్రీ వేంకటేశ సుప్రభాత స్తోత్రముతో ప్రారంభమైంది. భక్తి సాహిత్య శాఖయందు, వివిధ దేవతా సుప్రభాతములకు ప్రతివాది భయంకర అణ్ణన్ రచించిన శ్రీ వేంకటేశ సుప్రభాతస్తోత్రము ఒజ్జబంతిగా గౌరవింపబడింది. ప్రాభాతిక లక్షణముల వర్ణనలో, భాష, వృత్త, మకుట, భావనాదులందు తర్వాత రచింపబడిన సుప్రభాతములు శ్రీవేంకటేశ సుప్రభాత స్తోత్రమునకు అనుకరణములుగ, అనుసృజనలుగా పరిఢవిల్లినవి.

**"బ్రాహ్మేముహూర్తే చోత్థాయ చింతయే దాత్మనో హితమ్"** అన్నట్లు ఉషః కాలమున – బ్రాహ్మ ముహూర్తమున – నిదుర లేచి మానవుడు పరమాత్మ చింతన చేయుట (ఇష్ట దైవమును ప్రార్థించుట) ఆత్మకు హితమైన కార్యము. సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనము అను నాలుగు భాగములు శ్రీనివాసభగవానుని దయకు భక్తులను యోగ్యులుగ జేసి ధర్మ, అర్థ, కామ, మోక్షములను చతుర్విధ పురుషార్థములను ప్రతిపాదించుచున్నవి. సుప్రభాతము భక్తునికి భగవంతుని స్తుతించుట అను ధర్మమును, స్తోత్రము నిత్యసేవారూపమగు అర్థమును, ప్రపత్తి శ్రీవారి సేవవలన ధర్మావిరుద్ధమైన కామమును, మంగళాశాసనము పరతత్త్వాను భవరూపమైన మోక్షమును కలిగించునని శ్రీవైష్ణవాచార్యుల ఉపదేశ సారముగ ఉన్నది.

**'ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్'** అనుటలో నిత్య కర్మానుష్ఠాన రూపమగు ధర్మమును, **'సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం ప్రయచ్ఛ'** అనుటలో జీవిత పరమార్థమగు అర్థమును, **'ఈశానాం జగతోఽస్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం, తద్వక్షస్థల నిత్యవాస రసికాం తత్ క్షాంతి సంవర్ధినీమ్'** అనుటలో ధర్మానపేతమగు కామమును, **'నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్॥'** అని పలుకుటలో నిత్య, నిరవద్య, సత్యానంద చిదాత్మకమైన

పరమాత్మ స్వరూపమగు మోక్షము సూచింపబడినవి. ఈ సుప్రభాత స్తోత్రమును ప్రభాతసమయమున పరమభక్తితో అనుసంధానం చేయువారికి పరార్థ సులభమైన ప్రజ్ఞ (బుద్ధి) గలుగునని ఫలశ్రుతి చెప్పబడింది.

సుప్రభాతకర్త ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదపద్మముల వైభవమును వర్ణిస్తూ శ్రీ వేంకటేశ ప్రపత్తిలో

**"విష్ణోః పదే పరమ" ఇత్యుదిత ప్రశంసౌ**
**యౌ "మధ్వ ఉత్స" ఇతి భోగ్యత యాప్యుపాత్తౌ।**
**భూయ స్తథేతి తవ పాణితల ప్రదిష్టౌ**
**శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే॥ (10)**

అను శ్లోకమున ఖగోళంలోని విష్ణు పదమును వర్ణించిన ఋగ్వేద మంత్రాన్ని ఉపయోగించుకున్నాడు. ఆ మంత్రము ఇట్లునది.

**తదస్య ప్రియ మభి పాథో అశ్యాం**
**నరోయత్ర దేవయవో మదంతి**
**ఉరుక్రమస్య సహి బంధురిత్థా**
**విష్ణోః పదే పరమే మధ్వఉత్సః ॥ - ఋగ్వేదం, 1-154-5**

ఖగోళమున విష్ణుదేవుని పరమపదమునందు తేనె పట్టును బోలు ఒక చక్కని దృశ్యం (నక్షత్రముల గుత్తి) ఉన్నది. ఆకాశమున విష్ణుమండల నిర్ణయమునకు ఈ మధు మక్షిక దృశ్యం చక్కని ఆనవాలుగ ఉన్నది.

**"దివీవ చక్షురాతతం**
**సదా పశ్యంతి సూరయః**
**తద్విష్ణోః పరమం పదమ్" - ఋగ్వేదం, 1-22-20**

అను ఋగ్వేదమంత్రము ఆకాశమున కన్నువంటి ప్రదేశమొకటి గలదు. సూరిజనులు ఎల్లప్పుడు దానినే చూచుచుందురు. అదే విష్ణుదేవుని



**పరమపదము** అని ఖగోళమందలి విష్ణుపదమును వర్ణించింది. ఆకాశమున ఉత్తరభాగమున ధ్రువనక్షత్రమునకు, సప్తఋషి మండలమునకు ఊర్ధ్వోత్తరమున స్వాతి శ్రవణా నక్షత్రములమధ్య **విష్ణుపదము** ఉన్నది. ఈ పరమపదమును

**"ఊర్ధ్వోత్తరాం ఋషిభ్యస్తు**
**ధ్రువోయత్రాస్తి వై స్మృతః ।**
**ఏతద్విష్ణుపదం దివ్యం**
**తృతీయం వ్యోమ్ని భాస్వరమ్ ॥"**

అని విష్ణుపురాణం వర్ణించింది.

శ్రీ వేంకటేశ మంగళాశాసనములో అణ్ణన్ స్వామి

**"శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీ తటే,**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్." (12)**

అని వర్ణించాడు. వేంకటేశుడు వైకుంఠమందలి విరక్తితోస్వామి పుష్కరిణీ తీరమున లక్ష్మీసహితుడై విహరించుచున్నాడు అను శ్లోకభావము శ్రీ వేంకటాచలమాహాత్మ్య గ్రంథమున పలుచోట్ల (పలుపురాణ భాగములలో) వర్ణింపబడియున్నది.

**"మాయావీ పరమానందః త్యక్త్వా వైకుంఠముత్తమమ్ ।**
**స్వామిపుష్కరిణీ తీరే రమయా సహ మోదతే ॥"**

**- హరివంశాంతర్గత శేషధర్మము, 48-14 శ్లో॥**

**"వైకుంఠా త్పరమోహ్యేష వేంకటాఖ్యో నగోత్తమః ।**
**అత్రైవ నివసామ్యేవ శ్రీభూమి సహితో హ్యహమ్ ॥"**

**-వరాహపురాణం, ప్రథమభాగం, 35-12**

అణ్ణన్‌స్వామి సుప్రభాత రచనకు ముందు తిరుమల వేంకటేశుని దేవాలయములో విప్రనారాయణుడు (తొండరడిప్పొడి యాళ్వారు) రచించిన 'తిరుప్పళ్ళి యెళుచ్చి'ని గానం చేసే వారని క్రీ.శ. 1-11-1486 నాటి తిరుమల శిలాశాసనం (2-86) తెలియజేస్తున్నది. విప్రనారాయణుని 'తిరుప్పళ్ళి యెళుచ్చి' (ప్రాబోధకీ స్తుతి) ని తాళ్ళపాక అన్నమాచార్యుల మనుమడు పెదతిరుమలాచార్యుల కుమారుడు చిన్నన్న తను రచించిన **'పరమయోగివిలాసము'** అను ద్విపదకావ్యంలో తెనిగించినాడు. తాళ్ళపాక అన్నమాచార్యులు సుప్రభాత సంకీర్తనలు (మేలుకొలుపు పాటలు)రచించాడు. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు ద్విపదలో మేలుకొలుపు పాటను రచించాడు. దీనిని తిరుమల తిరుపతి దేవస్థానంవారు **"శ్రీ వేంకటేశ్వర సుప్రభాతస్తవము"** అను పేరున ప్రకటించారు. ఇందు శ్రీకృష్ణుని లీలలు అధికముగా వర్ణింపబడియున్నవి.

* * *

## 3. సుప్రభాత అనువాదములు (తెలుగు)

### 1. ప్రతివాది భయంకర వేదాంతాచార్యులు

క్రీ.శ.15 శతాబ్దంలో ప్రతివాది భయంకర అణ్ణన్‌స్వామి సంస్కృత భాషలో రచించిన శ్రీ వేంకటేశ సుప్రభాతమ్, స్తోత్రమ్, ప్రపత్తి, మంగళా శాసనములు అను నాల్గింటిని (70 శ్లోకములు) ప్రతివాది భయంకర వేదాంతాచార్యులు తెలుగు వృత్త పద్యాలలో అనువదించారు. ఈ సుప్రభాతము శ్రీరామానుజ కీర్తి కౌముది గ్రంథమాలలో ఆరవ భాగమున ప్రచురించ బడింది (1985) ఇందు మూల శ్లోకములు లేవు. తెలుగు పద్యాలు మాత్రమున్నవి.

కౌసల్యా సుప్రజారామ... అను శ్లోకమును



**శా॥ కౌసల్యా సుకృతోద్భవా! సకలలోకత్రాణ! రామా! హరీ!**
**ఆసన్నంబు ప్రభాతకాల వరసంధ్యామూర్తి యిప్పట్టునన్**
**వాసిన్ దైవము నాహ్నిక క్రియను సల్పంబూనఁ గర్తవ్య మెం**
**తో; సుప్తిన్విడి లేవయ్య! నరశార్దూలా! మహోత్సాహివై ॥**

అని శార్దూల వృత్తములో అనువదించారు.

భాస్వానుదేతి వికచాని సరోరుహాణి (26) అను శ్లోకమును

**మ॥ అదిగో భానుడు వెల్గుతోడ నుదయంబయ్యెన్ సరోజావళుల్**
**విదితంబాయెఁ బ్రఫుల్లతన్, విహగముల్ నింపెన్నినాదమ్ములన్**
**బది దిక్కుల్, సతతంబు మంగళములన్ బ్రాపింప శ్రీ వైష్ణవుల్**
**మది నాశన్నిలుచున్నవారు దయలెమ్మా! వేంకటాద్రీశ్వరా! (26)**

అని మత్తేభవృత్తములో అనువదించారు.

వేంకటేశ స్తోత్రములో కమలాకుచచూచుక కుంకుమతో అను శ్లోకమును

**తే. లచ్చిచనుమొనకుంకుమ రంగువలన**
**ఎఱుపువారిన నీల దేహాఢ్య, దేవ!**
**సరసిజదళోపమ విశాల చారునేత్ర!**
**వేంకటాద్రీశ్వరా! నీకు విజయ మగుత!**

అని తేటగీతిలో రమ్యంగా తెనిగించారు.

వేంకటేశ ప్రపత్తిలోని ఈశానాం జగతోఽస్య అను శ్లోకమును

**శా. లోకాధీశ్వర వేంకటేశ హరియారూఢ ప్రియార్ధాంగికిన్**
**ఆ కంజాక్షు నురోనివాస రసికన్ వ్యాప్తంబుగా దక్షతన్**
**జేకూర్పంగ వలంతి, సారసకరన్, నీరేజ ధన్యాననన్**
**శ్రీకాంతన్, జగదంబఁ బ్రేమమయ నేఁ జేమోడ్చి సేవించెదన్ ॥**

అని మూలములోని భావములు పొల్లు పోనీయక అనువదించారు.

ప్రపత్తిలోని "విష్ణోః పదే పరమ" ఇత్యాది శ్లోకము

**మ. తొలి వేదానఁ బ్రశంస సేయఁబడె నెంతో విష్ణు పాదమ్ములే**
**అలఘు ప్రాభవమందు నన్నిటికి మిన్నంచున్ దదాస్వాదనా**
**ఫలమే యయ్యెడు దేనె యాడియనియున్ భావ్యంబదే యన్నసీ**
**పలుకుల్ హస్తపునః ప్రదర్శితము తత్పాదంబులే మద్గతుల్.**

అని వేంకటేశ్వరస్వామి కనిపించు తీరును, స్వామివారి పాదముల విశిష్టతను ప్రశంసించారు.

మంగళాశాసనములోని ప్రారంభ శ్లోకమును

**తే. మంగళము శ్రీరమా మనోమందిరునకు**
**సర్వశుభగుణకలిత విశ్వప్రభునకు**
**శరణుగోరిన వారి రక్షక నిధికిని**
**వేంకటాచల శ్రీనివాసునకును.**

అని తేటగీతిలో తెనిగించారు. ప్రతివాది భయంకర వేదాంతాచార్యులు మూలములోని 'శ్రీవైకుంఠ విరక్తాయ' అను శ్లోకమును

**సిరుల విలసిల్లు వైకుంఠపురము వీడి**
**స్వామి పుష్కరిణీ తీరవర్తియగుచు**
**శ్రీరమామణి గూడి క్రీడా రతమున**
**వెలయు వేంకటపతికి నెవ్వేళ శుభము.**

అని మూల విధేయముగా వేదాంతాచార్యులు అనువదించారు. వీరి అనువాదము మూలవిధేయముగా, భావబంధురముగా రమణీయంగా, పఠనీయంగా కొనసాగింది. సంస్కృత సుప్రభాతము, ఆంధ్ర సుప్రభాతముల రచనలు ప్రతివాది భయంకర వంశము వారే రచించుట వేంకటేశుని అనుగ్రహ వైభవ లీలగా వున్నది.



## 2. కాలనాథభట్ట వీరభద్ర శాస్త్రి

సుప్రభాతమును 'శుభోదయము' అను పేర కాలనాథభట్ట వీరభద్ర శాస్త్రి అనువదించారు. వీరు సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళా శాసనములను 70 తేట గీతములలో రచించారు.

సుప్రభాతములోని ప్రథమ శ్లోకమును

**శ్రీ రఘువర కౌసల్య కుమారరత్న**
**తెల్ల వారెను చీకటి తెరలు తొలగె**
**సకల జీవులు మేల్కాంచె సన్నుతింప**
**దైవ పూజలు సలుపగా లేవవయ్య!**

అని తెనిగించారు. మూలములో లేని సకలజీవులు మేల్కాంచె సన్నుతింప అనుభావమును చేర్చినారు.

భాస్వానుదేతి (26) ఇత్యాది శ్లోకమును

**పద్మ బాంధవుడుదయాద్రి భాసిలంగ**
**మధుర శబ్దంబున చిలుక మాటలాడ**
**మంగళము వైష్ణవులు పాడ మాధవుండ**
**లెమ్ము సుప్రభాతంబాయె! లెమ్ము దేవ!**

అని అనువదించారు. ఇందు మూలములో స్వామికి వైష్ణవులు మంగళములు కోరుచుండగా అనువాదములో పాడుచున్నట్లు తెలుపబడింది.

వేంకటేశ స్తోత్రములోని ప్రథమ శ్లోకము

**కమల నేత్రి స్తనాగ్ర కుంకుమము కతన**
**నెరుపు మిళితమై వికసించు నీలవర్ణ**
**పద్మలోచన! శ్రీరమా ప్రభు వరేణ్య**
**వేంకటేశ్వర! నీకగు! విజయమెపుడు**

అని మూలానుగుణంగా తెనిగించారు. వీరభద్రశాస్త్రి ప్రపత్తిలోని ప్రథమ శ్లోకమును

**సర్వలోకాల రాణివి చంద్రవదన**
**విష్ణుదేవుండు వేంకట విభుని హృది ని**
**వాసినీ! దివ్య రూపిణి! భాగ్యలక్ష్మి,**
**నీకు వందనమో! జగతేక మాత!**

అని సరసంగా అనువదించారు. అనువాదకులు వీరభద్రశాస్త్రి విష్ణోఃపదే (10) అను శ్లోకమును

**సకల వేదశాస్త్రములందు**
**విష్ణు దేవుడు గాంచె నుత్కృష్ణ పదము**
**పరమయోగ్యంబు మోక్ష సోపానమంచు**
**వరదహస్తంబు జూపెడి పదమె శరణు ॥**

అని భక్తి భావభరితంగా అనువదించారు.

మంగళాశాసన ప్రారంభ శ్లోకమును

**లక్ష్మివల్లభు దఖిల కల్యాణమయుదు**
**భక్తవత్సలుండు పరమభాగ్యశాలి**
**వేంకటాచలవాసుండు విమలశీలి**
**పార్థసారథీ! మంగళం బగును నీకు!**

అని వీరభద్రశాస్త్రి అనువదించారు.

శ్రీ వైకుంఠవిరక్తాయ... అను శ్లోకమును

**ఎపుడొ వైకుంఠ లోకంబు నిష్టపడక**
**పుష్కరిణి నదీ తీరపు పుణ్యతటిని**
**వేడ్కరమతో వినోదించు వెంకటేశ!**
**మంగళారతి గొనుము మధురమలర**



అని అనువదించారు. ఇందు వీరభద్రశాస్త్రిస్వామి పుష్కరిణిని నదిగా వర్ణించుట పొరపాటు. **"పుష్కరిణి సరస్తీరపు పుణ్యతటిని"** అని సరిదిద్దినచో ఆ పొరపాటు పరిహారమగును.

ఈ విధంగా కాలనాథభట్ట వీరభద్రశాస్త్రి సుప్రభాతమును సంపూర్ణముగా తేటతెలుగులో, తేటగీతి పద్యములలో వర్ణించి కృతార్థులయినారు.

## 3. మద్దులపల్లి పాండురంగం

సుప్రభాతమును మద్దులపల్లి పాండురంగం పద్యాలలో అనువదించారు. సుప్రభాతమందలి ప్రారంభ శ్లోకమును

**రామ కౌసల్యానందనా! రామచంద్ర!**
**తెల్లవారగ వచ్చెను మెల్లగాను**
**మేలుకో పురుషోత్తమ! మేలుకొనుము**
**దేవతార్చన వేళాయె లేవు మింక!**

అని అనువదించారు. **"లేవవయ్య!"** అనుట సమంజసము.

సుప్రభాతములో భాస్వానుదేతి... (26) ఇత్యాది శ్లోకమును

**తూర్పు దిక్కున సూర్యుడు, తొంగిచూచె**
**విచ్చి విచ్చని కమలముల్ విచ్చుకొనియె**
**విహగ కల కల ధ్వని వినువీధి నిండె**
**మంగళము సప్తగిరవాస! మంగళంబు! (27)**

**వైష్ణవోత్తమ బ్రాహ్మణుల్ వచ్చిరదిగొ**
**వేచియున్నారు వాకిట వేంకటేశ!**
**శేష శైల శేఖరవిభో శ్రీనివాస!**
**సుప్రభాతము గోవింద సుప్రసన్న! (28)**

అని అనువదించారు. ఒక శ్లోకమును రెండు తేటగీతులలో తెనిగించారు పాండురంగం. ఇందు పాండురంగం సుప్రభాతములోనే మంగళం చెప్పడం, వైష్ణవోత్తమ బ్రాహ్మణుల్ అని ప్రయోగించుట పాదపూరణకై ప్రయత్నించిన ట్లున్నది. "సుప్రభాతము గోవింద! సుప్రసన్న" అను పాదము మకుటముగా 21, 26, 28, 30 పద్యములలో వుపయోగించియున్నారు.

వేంకటేశ స్తోత్రములోని ప్రథమ శ్లోకమును

**పుట్టు నీలి వానిబట్టి యెఱ్ఱగ చేయు**
**బిఱ్ఱు కౌగలించు వెర్రి లచ్చి**
**ఎంత కౌగిలించ ఎఱ్ఱంగ గావాయె**
**జయము కమలనయన జయము జయము.**

అని పాండురంగం, నల్లనయ్యను ఎర్రనివానిగా చేయు లక్ష్మీదేవి వ్యర్థ ప్రయత్నాన్ని విమర్శించారు.

వేంకటేశ ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకమును

**వేంకటాచలమున వెలసిన శ్రీహరి**
**ఓర్పుగుణము పెంచు నేర్పు గలిగి**
**హరియురంబు నందు నా సక్తి నున్నట్టి**
**సిరిని భక్తితోడ చేరి కొలుతు.** **(1)**

**జగము లేలునట్టి జగదంబ శ్రీదేవి**
**అవతరించినట్టి ఆదిలక్ష్మి**
**భక్తజనులయందు వాత్సల్యమున్నట్టి**
**సిరిని భక్తితోడ చేరికొలుతు.** **(2)**

**పద్మ మధ్య మందు పద్మాసనంబున**
**పద్మహస్త యైన పద్మవదన**
**పద్మనాభురాణి! పద్మినీ! భగవతీ**
**వందనంబుఁ జేతు భక్తితోడ ॥** **(3)**

అని మూడు ఆటవెలది పద్యములలో మూలానుగుణంగా అనువదించారు. మూల శ్లోకములోని భావములను సంపూర్ణంగా తెనిగించారు.

ప్రపత్తిలోని విష్ణోఃపదే ఇత్యాది శ్లోకమును (10)

**విష్ణు పదములే పరమంబు విమలమైన**
**తేనె ఊటగ వేదముల్ తెలియజెప్పి**
**చరణములవైపు కరముంచి సంజ్ఞసేయు**
**శరణు శ్రీవేంకటేశ మీ చరణయుగము.** **(12)**

అని మూలాను గుణముగా పాండురంగం తెనిగించారు.

మంగళాశాసనములో మొదటి శ్లోకమును అనువదించక

**శ్రీరామణామంగళమ్ వేంకటరమణా మంగళమ్**
**భయహరణా మంగళమ్ శుభకరణా మంగళమ్**

అని స్వేచ్ఛగా మంగళము పలికినారు. ఇందులోని శ్రీవైకుంట విరక్తాయ... ఇత్యాది శ్లోకమును

**వైకుంఠమందు విరక్తి కలిగి**
**పుష్కరిణీ తటి వెలసిన ఓస్వామీ**

అని అనువదించారు.

## 4. బండి నాగరాజు 1980

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమును కీ.శే. నా సహాధ్యాయి, మిత్రుడు బండి నాగరాజు గేయకావ్యంగా రచించారు. సుప్రభాతమును ముత్యాల సరముల ఛందస్సులో మనోహరంగా అనువదించారు.

కౌసల్యా సుప్రజారామ ఇత్యాది శ్లోకమును

**రామ! కౌసల్యా సుపుత్రా!**
**తూర్పు తెలతెల వాఋచున్నది**
**మేలుకో పురుషోత్తమా! దై**
**వాహ్నికము దీర్పన్.**

అని సంగ్రహంగా అనువదించారు. భాస్వానుదేతి ఇత్యాది శ్లోకమును నాగరాజు

**ప్రొద్దు పొడుచుచునున్నయది తా**
**మరలు విచ్చుచు నున్నయవి ది**
**క్కులను బక్షులు కలకలలతో**
**నింపుచున్నవి నిరంతరమును**
**మంగళార్థులు - వైష్ణవులు - నీ**
**దివ్యధామము నాశ్రయించిరి**
**వేంకటాచలనాథ! నీ కిదె**
**సుప్రభాతమ్ము.**

అంటూ మూలవిధేయంగా తెనిగించారు. సుప్రభాతమునకు ఫలశ్రుతి చెప్పిన తర్వాత బండినాగరాజు

**ఈ విధమ్ముగ దెలుగుబాసను**
**భక్తితో నీ సుప్రభాతము**
**నాగరాజు రచించి మించెను**
**వేంకటేశుని యనుగ్రహమున**
**దెనుగువారలకై**

అని స్వవిషయమును ఆశ్వాసాంత గద్యవలె పలికినారు.



స్తోత్రములోని ప్రారంభ శ్లోకమును

**శ్రీకుచాగ్ర కుంకుమపూత చేత విడువ**
**కెర్రనై మించు తులలేని కృష్ణ తనుడ**
**అంబు జాయతలోచన! యఖిలనాథ!**
**విజయుడవు గమ్ము స్వామి! శ్రీ వేంకటేశ!**

అని తేటగీతములో నాగరాజు అనువదించారు.

వేంకటేశ ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకమును

**ఈ జగత్తున కీశ్వరియు వేం**
**కటేశుడు విష్ణునకు ముఖ్య**
**ప్రేయసియు, నాతని యురమ్మున**
**నెపుడు నుండెడు రసికురాలును**
**అతని యోర్పును బెంచు నదియును**
**బద్మములచే నలంకృతమగు**
**పాణి పల్లవయుగము బద్మా**
**సనము నందుండునది - వాత్స**
**ల్యాది గుణములఁ బ్రకాశించెడు**
**జగన్మాతకు, భగవతికిఁ, బ**
**ద్మావతికి శ్రీదేవికిదె వం**
**దనముఁ జేసెదను.**

అని ముత్యాల సరములలో నాగరాజు అనువదించారు.

ప్రపత్తిలోని విష్ణోః పదే పరమ (10) ఇత్యాది శ్లోకమును

**విష్ణుపదము పరమముగా ఋ**
**గ్వేద మది కొనియాడుచుండగ ।**
**దేనెయూటని - పరమ భోగ్యము**
**గా గనున్ వర్ణింపబడగా**

**మరల నదియట్లే యటంచును**
**బాణి తలమున నీవు సూపెదు**
**వేంకటేశ్వర! నీ పదమ్ముల**
**శరణు పొందెదను.**

అని ముత్యాల సరములలో మూల విధేయముగా అనువదించారు. మంగళాశాసనములోని ప్రథమ శ్లోకమును.

**శ్రీదేవి కాంతునకు గల్యాణ నిధనునకు**
**నర్థులకు నిధియైన వానికిని శ్రీ వేంక**
**టాచల నివాసునకు శ్రీనివాసునకు మంగళము**

అని స్వచ్ఛంద త్రిపదలలో నాగరాజు అనువదించారు.

శ్రీ వైకుంఠ విరక్తాయ ఇత్యాది శ్లోకమును

**వదలి శ్రీ వైకుంఠమును స్వామిపుష్కరిణి**
**యొడ్డునను శ్రీదేవి తోడ గ్రీడించు చు**
**న్నట్టి వాడగు శ్రీ వేంకటేశ్వరున కగుత మంగళము**

అని మూలభావమును సమగ్రంగా అనువదించారు.

బండినాగరాజు రచించిన శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము తొలుత ప్రజామత (వారపత్రిక)లో జులై 1964 నుండి మార్చి 1965 వరకు ధారావాహికంగా ప్రచురించబడింది. తర్వాత డిసెంబరు 1980 లో నాగరాజు స్వయంగా తి.తి.దే ఆర్థిక సహాయంతో ప్రచురించారు.

## 5. లంకా వేంకప్ప శాస్త్రి, 1980

లంకా వేంకప్పశాస్త్రి **"శ్రీ వేంకటేశ్వర సుప్రభాత మంజరి"** అనుపేరుతో సుప్రభాతమును సంపూర్ణంగా అనువదించారు. ఈ నాలుగు స్తోత్రములు మంజరీ ద్విపదలో భక్తులు పాడుకొనుటకు అనువుగ రచింపబడినాయి.



సుప్రభాతమందలి ప్రారంభ శ్లోకమును

**కౌసల్య వరపుత్ర! కమనీయ గాత్ర**
**శ్రీరామ! తొలిసంధ్య చెన్నారె నయ్య**
**నిత్యాహ్నికాదుల నెరవేర్ప వలయు**
**మేలుకో గోవింద! మేలుకో తండ్రి!**

అని వాత్సల్యము ఉట్టిపడునట్లుగా అనువదించారు.

సుప్రభాతములోని భాస్వానుదేతి ఇత్యాది శ్లోకమును (26)

**పద్మబాంధవుడదె ప్రభవించుచుండె**
**పద్మాలు వికసించి భాసిల్లఁ దొడగె**
**పక్షుల రుతములు ప్రకృతిలో నిండె**
**శ్రీ వైష్ణవోత్తముల్ చిత్తమ్ములందు**
**నిత్యకల్యాణము నీకు నర్థించి**
**ప్రార్థించుచుండిరి ప్రముదాత్ములగుచు**
**మేలుకో గోవింద! మేలుకో తండ్రి!**

అని మూలమందలి భావములను చక్కగా అనువదించారు. స్తోత్రమందలి ప్రారంభ శ్లోకమును

**శ్రీదేవి కుచపాళి చెన్నొందునట్టి**
**కుంకుమ రాగమ్ము కొమరొప్ప సతము**
**ఎట్టినై యెనలేని యెదయొప్పుచుండ**
**నీలమౌ తనుశోభ నెగడొందు చుండ**
**కమలాల సరిపోలు కనులున్న దేవ!**
**జయమౌను వేంకటస్వామి! నీ కెపుడు.**

అని భావానువాదము చక్కగా చేశారు వేంకప్ప శాస్త్రి

వేంకటేశ్వర ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకమును

**సకలలోకాలకు సామ్రాజ్ఞి వగుచు**
**విష్ణుస్వరూపుడౌ వేంకటాద్రీశు**
**వక్షస్థలమ్మున వసియించి సతము**
**ఆ స్వామి కానంద మమరంగఁ జేయ**
**అర్ధాంగివై యొప్పి యా దేవదేవు**
**సక్షమ శీలమ్ము సంవృద్ధి పరచి**
**పల్లవమ్ములఁబోలు వరహస్తయుగళి**
**పద్మాల ధరియించి భాసిల్లు దేవి!**
**పద్మాలయమ్మున పరమానురక్తి**
**ఆసీనురాలవై యలరారు తల్లి!**
**నిండారు సుగుణాలు నెగడొందుచుండ**
**భక్తాళిఁ బ్రోచెడి వరలక్ష్మి! నీకు**
**కైమోడ్తు భక్తితో కరుణింపు నన్ను.**

అని లంకావెంకప్పశాస్త్రి మూలమందలి భావములను విస్తరించి భక్తిరస ప్లావితముగా రచించారు.

విష్ణోః పదే పరమ ఇత్యాది శ్లోకమును (10)

**వేద శాస్త్రాలచే వినుతింపబడుచు**
**ఉత్కృష్ట మహిమతో నొప్పారి సతము**
**తియ్యని తేనెతో దీటైనవగుచు**
**భక్తకోటికి ముక్తి పదమౌచు చెలగి**
**సొంపుగా నీచేత జూపింపబడిన**
**నీ పాద కమలాల నిత్యమ్ము నేను**
**సేవింతు శరణంచు చిత్తమ్ము నందు**
**చేకొని నను బ్రోవు శ్రీ వేంకటేశ!**



అని మూలమందలి భావములను వ్యాఖ్యాప్రాయముగా వెంకప్పశాస్త్రి అనువదించారు–

మంగళా శాసనములోని ప్రారంభ శ్లోకమును

**సకలసౌభాగ్యముల్ సమకూర్చు నట్టి**
**సిరి వల్లభుండవౌ శ్రీ శ్రీనివాస!**
**శుభగుణోద్దీపితా! సుందరాకార!**
**నిజభక్తకోటికి నిధియైన దేవ**
**ఉరు వేంకటాద్రీశ! ఉద్దామ తేజ!**
**మహితాత్మ! నీ కెప్డు మంగళం బగుత!**

అని మూలమందలి భావమును విస్తరించి వర్ణించారు.

వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోకమును

**వైకుంఠమందున వరలక్ష్మిలేమి**
**ఏకాంతవాసమ్ము వృథయంచు నెంచి**
**వైరాగ్యమే రూపు వహియించె ననఁగ**
**ఏకాకియై వచ్చి యేడుకొండలకు**
**దివ్యపుష్కరిణీ ప్రదేశమ్మునందు**
**శ్రీదేవితోఁ గూడి చిత్తముప్పొంగ**
**క్రీడించుచుండెదు శ్రీశ్రీనివాస!**
**వేంకటేశ ప్రభు! వృషభాద్రినాథ!**
**మహితాత్మ! నీ కెప్డు మంగళం బగుత!**

అని వెంకప్ప శాస్త్రి మూలమునకు మెరుగులు దిద్ది అనువదించారు. మూలమున వైకుంఠముపై శ్రీనివాసునకు ఎందుకు విరక్తికలిగినదో పూర్వులు కారణము చెప్పలేదు. వెంకప్పశాస్త్రి వైకుంఠమందున వరలక్ష్మిలేమి, ఏకాంత వాసమ్ము వృధయంచు నెంచుట కారణముగా వర్ణించారు. అందుచే శాస్త్రి అనువాదము హృద్యముగ నున్నది.

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమంజరి యందు మూలము – సంస్కృత శ్లోకములు లేవు. అనువాదము మాత్రము ఉన్నది.

## 6. కారంశెట్టి లక్ష్మీనారాయణ 1975

సంస్కృత వేంకటేశ సుప్రభాతమును కారంశెట్టి లక్ష్మీనారాయణ **"శ్రీ వేంకటేశ్వర సుప్రభాతామృతము"** అనుపేరుతో అనువదించారు. ఇది పద్యకావ్యం.

సుప్రభాత ప్రారంభ శ్లోకమును

**కం॥ శ్రీసతి రమణా! రామా!**
**కౌసల్యాముద్దు తనయ కనులనుదెరుమా**
**మాసెను చీకటు లిప్పుడు**
**మూసిన కనుదెరచి యేలు ముల్లోకములన్ ॥**

అని లక్ష్మీనారాయణ అనువదించారు. శ్లోకమునకు విధేయమగు అనువాదము లేదు. కొన్ని పద్యములు స్వతంత్రముగా రచింపబడినవి. భాస్వానుదేతి ఇత్యాది శ్లోకమునకు (26) అనువాదము లేదు. సుప్రభాతామృత మంతయు కందపద్యములలో (29) రచింపబడింది.

వేంకటేశ స్తోత్ర ప్రారంభ శ్లోకమును

**తే॥ కమల కుచకుంభములమీది కుంకుమంబు**
**నీల కాంతులు విలసిల్లు నీదు యురము**
**తగిలి తళ తళ మెరసెను తామరాక్ష!**
**విజయమగుదేవ! నీ కెప్డు వేంకటేశ!**

అని లక్ష్మీనారాయణ అనువదించారు తేటగీతి పద్యములో, ప్రపత్తియందలి ప్రథమ శ్లోకమును



**ఉ॥ తల్లివినీవు ముజ్జగముల్దప్పక నేలెడి వేల్పురాణివై**
**యుల్లమునందు నిల్చియును యుక్తియు శక్తియు గల్గజేయు శ్రీ**
**వల్లభు ముద్దురాణివగు వారిజలోచని, నీకును మ్రొక్కుచుంటినో**
**చల్లని తల్లి! లక్ష్మి! నను చక్కగ చూడుము భక్త పాలనీ ॥**

అని లక్ష్మీనారాయణ ఉత్పలమాల వృత్తములో స్వేచ్ఛానువాదము చేశారు. ప్రపత్తిలోని **"విష్ణోః పదే పరమ"** అను శ్లోకమునకు (10) అనువాదములేదు. ఈ ప్రపత్తిలో మూలానుసరణముకంటె స్వేచ్ఛారచన, భక్తి చోటుచేసుకున్నది.

మంగళాశాసనములోని ప్రారంభ శ్లోకమును

**ఆ॥ శ్రీనివాస నిన్ను చింతింతు మదిలోన**
**సన్నుతాంగ నిన్ను సన్నుతింతు**
**శుభము లొసగునట్టి సుందరాంగుడవయ్య**
**వేంకటేశ నీకు మంగళంబు**

అని ఆటవెలది పద్యములో అనువదించారు.

**ఆ॥ వదలినావు నీవు వైకుంఠనగరము**
**లక్ష్మిదేవి తోడ లక్షణముగ**
**తిరుమలందు నీవు తిరుగాడుచున్నావు**
**వేంకటేశ నీకు మంగళంబు.**

అని లక్ష్మీనారాయణ వైకుంఠ విరక్తాయ (12) ఇత్యాది శ్లోకమును అనువదించారు.

కారంశెట్టి లక్ష్మీనారాయణ రచించిన శ్రీ వేంకటేశ్వర సుప్రభాతామృతము మూలాతిరిక్తముగ, స్వేచ్ఛగా రచింపబడింది. కావ్యమంతయు భక్తి భావ భరితముగావుంది. ఇందు మూలశ్లోకము లేవు.

## 7. మాసంద్రం కృష్ణ 1982

శ్రీ వేంకటేశ్వర సుప్రభాత సంగీతలహరి అను పేరుతో సుప్రభాత సంస్కృతమూలశ్లోకములకు శాస్త్రీయ సంగీతము సమకూర్చి తెలుగులో గేయానువాదం చేశారు. మూలము, అనువాద గేయాలు పాడుకొనుటకు అనుగుణముగా సరళశైలిలో వున్నవి.

సుప్రభాత ప్రారంభ శ్లోకము

**కౌసల్యాతనయ రామా!**
**తూర్పుగిరిపై సంధ్యకాంతులు**
**అరుణకాంతితో ప్రస్తరించెను**
**దైవకార్యము లాచరింపగ**
**మేలుకోవయ్యా! మేలుకోవయ్యా!**

అని గేయముగా అనువదింపబడింది.

సుప్రభాతములోని భాస్వానుదేతి ఇత్యాది (26) శ్లోకమును

**తూర్పు దిక్కున సూర్యుడుదయించుచుండగా**
**కొలకులంబద్మముల్ వికసించుచుండ**
**పక్షులన్నియు మధుర కూజితమ్ముల తోడ**
**దిక్కులన్నిట శోభ చేకూర్చుచుండె**
**శ్రీవైష్ణవులు సదా మంగళంబులు కోరి**
**నీ దివ్య ధామమును నాశ్రయించినవారు**
**శ్రీ వేంకటేశ! సుప్రభాతము నీకు**
**మేలుకో తండ్రి! మమ్మేలుకోవయ్యా!**

అని మాసంద్రం కృష్ణ మూలానుగుణంగా గేయం రచించారు.

స్తోత్రములోని ప్రథమ శ్లోకమును



**శ్రీదేవి కుచాగ్రకుంకమచే కడు**
**నెఱ్ఱగ మారిన వినీలవర్ణ శరీరము గల్గిన**
**శ్రీనివాసా! సప్తగిరీశా! పద్మపత్రాక్షా! పద్మాక్షా!**
**శ్రీ వేంకటగిరి ప్రభువర్యా!**
**జయము జయమ్మగు జయజగదీశా!**

అని కృష్ణ అనువదించారు.

ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకము

**ఈ జగతి కంతకు యజమానురాలివి**
**శ్రీ వేంకటాచలపతి ప్రేయసివి నీవు**
**అతని వక్షమున విహరించు దేవివి, తల్లి**
**నీ జంట చేతులను జలజ పుష్పమాల**
**అందాల నొలికించు, అరుణపల్లవపాణి**
**పద్మసింహాసనాసీన! భగవతివి నీవు**
**ప్రేమమయివైన ఓ ప్రియ జగన్మాతా!**
**శ్రీలక్ష్మి శుభలక్ష్మి వందనంబులు నీకు**

అని అనువదించబడింది. ఇందులోని విష్ణోః పదే పరమ (10) ఇత్యాది శ్లోకము ఇట్లు గేయముగా రచింపబడింది.

**ఏ దివ్య పదాంబుజంబులు సర్వవేద పురాణములలో**
**పొగడబడెనో, తేనెకన్నను మధురతరమగునట్టి దేదియో**
**అదియె కద నీ అభయ హస్తము, అదియెకద నీ చరణ యుగమును**
**చూపుచున్నదో అట్టిదగు నీ చరణయుగమే నాకు**
**శరణము శ్రీనివాసా! సుప్రకాశా!**

మంగళాశాసనములోని ప్రారంభశ్లోకము

**శ్రీ లక్ష్మీ రమణునకు**
**కల్యాణ గుణాకరునకు**
**నిజ భక్త వత్సలునకున్**
**వేంకటనగనివాసునకు**
**మా శ్రీనివాసునకున్**
**మంగళ మనరే**
**జయ మంగళ మనరే.**

అని గేయరూపం దాల్చింది. వైకుంఠ విరక్తాయ అను శ్లోకము (12)ను

**వైకుంఠపుర నివాసము**
**విసువును కల్గింపగా**
**పుష్కర తీర తటమ్మున**
**వినోదముగ విహరించెడి**
**తిరు వేంకట నగపతికిని**
**శ్రీకర శ్రీనివాసునకు**
**మంగళమనరే జయ జయ**
**మంగళమనరే**

అని మాసంద్రం కృష్ణ గేయముగా, భక్తులు పాడుకొనుటకు అనుగుణంగా అనువదించారు.

ఈ శ్రీ వేంకటేశ్వర సుప్రభాత సంగీతలహరిలో మూలసంస్కృత శ్లోకములు కూడ కలవు. అనువాదము సరళసుందరముగా వుంది.

## 8. చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మ 1978

మహాకవి చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మ **'సచిత్ర శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము'** అను పేరుతో సుప్రభాతము, స్తోత్రములను మాత్రము అనువదించారు. ఈ చిన్న పొత్తములో సంస్కృత శ్లోకములు, వాటి గేయానువాదము, ఆ భావమునకు తగిన చిత్రము లున్నాయి. ఈ బొమ్మలు కుందవరం హెన్రీ సమకూర్చారు. ఈ గ్రంథములో వేంకటేశ ప్రపత్తి, మంగళాశాసనములకు అనువాదము లేదు.



సుప్రభాత ప్రారంభ శ్లోకమును

**కోసలేశ్వరు సుతకు బుట్టిన**
**పుత్రరత్నమ! రామచంద్రమ!**
**తూర్పుదెస తొలిసంజ వెలుతురు**
**సంక్రమించెను నరవరోత్తమ**
**దైవమాహ్నిక మాచరింపగ**
**మేలుకొనవయ్యా! మేలుకో!**

అని సుబ్రహ్మణ్యశర్మ సరళముగా అనువదించారు.

'భాస్వానుదేతి' ఇత్యాది శ్లోకమును (26)

**సూర్యునుదయము తోడ పద్మము**
**లెల్ల విరిసెను దిక్కులందున్**
**విహగనాదము పిక్కటిల్లెను**
**వైష్ణవోత్తము లెల్ల వేళల మంగళంబులు**
**నీకుగోరుచు నీదు ధామము నాశ్రయించిరి**
**వేంకటేశ్వర! సుప్రభాతము**
**మేలుకొనవయ్యా! మేలుకో!**

అని మూలానుగుణము సులభగ్రాహ్యముగా తెనిగించారు.

శ్రీ వేంకటేశ స్తోత్రములోని ప్రారంభ శ్లోకమును చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ

**ఇందిరాకుచ చూచుకోపరి**
**కుంకుమంబుల నెల్లవేళల**
**నరుణితమ్మును నతులితమ్మును**
**నైన నల్లని తనువు దాల్చిన వేంకటేశ్వర**
**విరియు తమ్ముల వలె విశాలము**
**లయిన నయనములలరు వేంకట**
**నాథ! విజయుడవగుము జగముల వందనం బిది**
**అందు కొనుమయ్యా అందుకో!**

అని మూలమందలి భావమును సరళశైలిలో అనువాదము చేశారు.

## 9. ఎం.జె.సీతారామ శాస్త్రి వ్రాతప్రతి

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమును మాత్రము **స్వామి మేలుకొలుపు** అను పేరుతో ఎం.జె.సీతారామ శాస్త్రి గేయములుగా అనువదించారు. ఇది అముద్రితము ప్రథమ శ్లోకమును.

**కౌసలేయా! రామచంద్రా!**
**అరుణకాంతులు దెసల నిండెను**
**దైవ మాహ్నిక విధిని దీర్పగ**
**మనుజసింహా! మేలుకొనుమా!**
**... స్వామీ! మేలుకోవయ్యా!**

అని సీతారామశాస్త్రి సరళసుందరంగా అనువదించారు.

సుప్రభాతములోని భాస్వానుదేతి (26) అను శ్లోకమును సీతారామ శాస్త్రి

**ప్రొద్దు పొడిచెను విరులు విరిసెను**
**విహగనాదము దెసల నిండెను**



**వైష్ణవులు సన్మంగళార్థులు**
**చేరినారిదె నీ సుధామము**
**... స్వామీ! మేలుకోవయ్యా!**

అని మూలానుగుణముగ అనువదించారు. సుప్రభాతము (29) చివర 29 గేయముల తర్వాత

**జయము శ్రీమద్వేంకటేశా!**
**జయము శ్రీ పద్మావతీశా!**
**జయము భక్తుల పాలి పెన్నిధి!**
**జయము నీ పదసన్నిధి!!**

అని వేంకటేశ్వరస్వామికి జయము పలికినారు.

## 10. పొట్లబత్తిని సత్యనారాయణ - 1980

సంస్కృత సుప్రభాతమును పొట్లబత్తిని సత్యనారాయణ 30 తరల వృత్తములలో స్వేచ్ఛగా అనువదించారు. ప్రథమ శ్లోకమును

**తొలగె చీకటి పూర్వ సంధ్యయు దోచె, దుందుభి మ్రోసెడిన్**
**వెలుగువచ్చె ప్రభాతమయ్యె, త్రివిక్రమాది చరిత్రలన్**
**దెలుపుచుండిరి పద్మగర్భుడు దేవతాది గుణంబులున్**
**అలఘు శ్రీ రఘురామ మేల్కొనుమయ్య నిద్దురమానుమా!**

అని స్వతంత్రముగా భావవిస్తారముతో రచించారు. తర్వాతి తరాల వృత్తములన్నింటికి (29) "మేలుకొనుమో వేంకటేశ్వర మేలుకొనవయ్యా" అను మకుటము గలదు. ఈ గ్రంథమున సుప్రభాతమునకు స్వేచ్ఛానువాదము మొదటి భాగముగా ఉంది. **శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమను** పేరుతో 17 హంసగతి వృత్తములు స్వామిని మేల్కొనుమా అని కోరుచూ రచింపబడినవి రెండవ భాగములో చివర కవి గద్యలో స్వవిషయము దెలిపినారు.

## 11. వి. నారాయణ రాజు (1982)

సంస్కృత సుప్రభాతమును అనుసరించి వి.నారాయణ రాజు తేటగీతి పద్యములలో (28) **శ్రీ వేంకటేశ్వర విమల సుప్రభాతము**ను స్వేచ్ఛగా రచించారు. ఈ సుప్రభాతమునకు "విమల సుప్రభాతము వేంకటేశ" అను మకుటము గలదు. దీనికి మొదట శ్రీరాముని మేల్కొలుపు పద్యము లేదు. పద్యములన్నియు సరళమైన శైలిలో సులభగ్రాహ్యముగా నున్నవి. ఇందు స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములు లేవు, నారాయణ రాజు రచించిన విమల సుప్రభాతమున ప్రారంభ పద్యమిట్లున్నది.

**తే. శ్రీనివాస నీ నామము శ్రీకరమగు**
**భక్తకోటి జనులకెల్ల పావనంబు**
**సర్వలోకేశ శ్రీహరి సరసిజాక్ష!**
**విభవ తిరుమల గిరివాస! వేంకటేశ!.**

దీనికి (సుప్రభాతమునకు) అనుబంధముగ శ్రీ వేంకటేశ్వర దశావతారములు విభవ తిరుమల గిరివాస వేంకటేశ అను మకుటములో వర్ణింపబడినాయి.

ప్రభాత వర్ణనలో "చల్ల గాలులు వీచెను మెల్లగాను" (21), "కమలములు వికసించెను కమ్మగాను" (23) "ఉదయగిరిమీద భానుండు ఉదయమాయె" (24) అని ప్రభాత సమయములో ప్రకృతిలో జరుగుచున్న మార్పులను నారాయణరాజు రమణీయముగా వర్ణించారు. ఈ ప్రభాత వర్ణనలో పేర్కొన్న "చల్లగాలులు వీచెను మెల్లగాను" (21) అను ప్రయోగము భక్తకవి పోతన భాగవతములో శ్రీకృష్ణుని జన్మ సందర్భమున వర్ణించిన "కమ్మని చల్లగాలులు మెల్లన వీచె" అను ప్రయోగమును (భాగ. దశమ 1-106) జ్ఞప్తికి తెచ్చుచున్నది.



అణువు బ్రహ్మాండముల నెల్ల నిండి, ఆది మధ్యాంతములు లేని ఆదిదేవుని "నిద్ర లేపెడి వారమా" (25) అని పరమార్థ ప్రతిపాదకముగా ప్రశ్నించుట ఎంతయు సమంజసముగా నున్నది. ఈ ఒక్క వాక్యము సుప్రభాతమునకు కొసమెరుపుగా నున్నది. సుప్రభాతము చివర "సిరుల శుభముల నిమ్ము శ్రీ శ్రీనివాస" (31) అని సిరిసంపదలు కోరుచు ఫలశ్రుతి చెప్పబడింది.

## 12. శ్రీనివాసపురం అనంతాచార్య (1993)

ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి రచించిన సంస్కృత సుప్రభాతమును అనుసరించి సంస్కృత భాషలో శ్రీనివాసపురం అనంతచార్యులు **"శ్రీనివాస సుప్రభాతమ్"**ను రచించారు. వారే దీనికి ఆంధ్ర తాత్పర్యము రచించినారు. ఈ శ్రీనివాస సుప్రభాతము

**శ్రీనివాస! దయాసింధో! ప్రాతస్సంధ్యాప్రవర్తతే ।**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్ ॥**

అని ప్రారంభమగుచున్నది. ఇందు రాముని మేలుకొలుపు స్వీకరింపబడలేదు. వాల్మీకి మహర్షి శ్లోకమును అనుసరించి శ్రీనివాస సుప్రభాతము ప్రారంభమైంది. కొన్ని శ్లోకములు "శ్రీ వేంకటేశ భగవాన్! తవ సుప్రభాతమ్" అను మకుటముతో రచింపబడినవి. శ్రీనివాస సుప్రభాతము వేంకటేశ సుప్రభాత క్రమములోనే 29 శ్లోకములలో రచింపబడింది. ఇందలి భావములు స్వతంత్రములు, భక్తి భావభరితములు. విస్తృతములగను ఉన్నవి. కవి 'అనంత శ్రీ' దీనిని నివేదన నామక శ్రీనివాస సుప్రభాతం అని పేర్కొన్నారు. సంస్కృత శ్లోకములకు కవియే తాత్పర్యము వివరించారు. చివర ఫలశ్రుతితోపాటు కవి స్వవిషయమును తెలిపియున్నారు.

స్తోత్రము ఇట్లు ప్రారంభమైంది.

**బలేర్వంచనే దర్శితాశ్చర్య శక్తిం**
**ఖలానాం సదా శిక్షణే బద్ధదీక్షమ్,**
**కలేర్నాశనే లోలుపం వేంకటేశం**
**హలేనాయుధేన ప్రసిద్ధం నమామి.**

వామన, కల్కి అవతారముల ప్రయోజనములను, వేంకటేశ అవతార ప్రయోజనమును వివరించారు. వేంకటేశ్వరుడు హలాయుధధారి అని వర్ణించుట విశేషము.

ప్రపత్తి ప్రారంభ శ్లోకము

**కందర్ప దర్ప హర శర్వముఖైస్సుపర్వు**
**సంఘైరుపేత్య వరదాన కృతేఽర్థ యద్భిః ।**
**సంసేవ్యమాన మఘకానన పావకం తం**
**శ్రీ వేంకటాద్రి నిలయం శరణం ప్రపద్యే ॥**

అని ప్రారంభమైంది. ఇందున్న తొమ్మిది శ్లోకములు **"శ్రీ వేంకటాద్రి నిలయం శరణం ప్రపద్యే"** అను మకుటము కల్గియున్నవి. విష్ణోః పదే పరమ ఇత్యాది శ్లోక (10) భావమును వదలివేశారు.

మంగళాశాసన ప్రారంభ శ్లోకమున

**శ్రీ పాణిగ్రహణోపాత్త మహావైభవశాలినే ।**
**తులసీదామ భూషాయ శ్రీనివాసాయమంగళమ్ ॥**

అని పద్మావతి (లక్ష్మీదేవి అవతారము) శ్రీనివాసుల వివాహమహోత్సవ వైభవమును కీర్తించారు. శ్రీ వైకుంఠ విరక్తాయ శ్లోకము గ్రహించలేదు. క్రొత్తగా మరొక శ్లోకము రచించలేదు.

శ్రీనివాసపురము అనంతాచార్యులు (అనంత శ్రీ) స్వతంత్రముగా సంస్కృతములో రచించిన శ్రీనివాస సుప్రభాతములో సుప్రభాతమున 29 శ్లోకములు, స్తోత్రమున 9 శ్లోకములు, ప్రపత్తియందు 9 శ్లోకములు, మంగళాశాసనమున 9 శ్లోకములు గలవు. ప్రపత్తికిదక్క మిగిలిన విభాగములకు ఫలశ్రుతి, కవి స్వవిషయము రెండు శ్లోకములలో రచించినారు.



## 13. శిష్లా బాలకోటీశ్వరరావు (1979)

సుప్రభాతమును మేలుకొలుపు పేరుతో శిష్లా బాలకోటీశ్వర రావు తెలుగులో పాటలుగా రచించారు. మొదటిపాటలో

**శ్రీకరా! శుభాకార! పుణ్యాకరా!**
**పురందరాది బృందారక బృందవంద్య!**
**శాశ్వతా! దేవదేవ! విశ్వంభరా!**
**సనాతనా! పావనా!**
**జగన్నాథ దీనబాంధవా!**
**సుజనావన! పద్మనాభ**
**పరమపురుష దామోదర**
**వారిజాక్ష! భక్తసులభ! నారాయణా!**

అని వేంకటేశ్వర స్వామిని కీర్తించారు. ఈ కావ్యంలో 18 పాటలు వున్నాయి. చివరిపాట

**చేయువాడవు నీవు**
**చేయూత ఇచ్చి**
**చేయించు ప్రోడవు నీవు!**
**హితుడవై గుబాళించి**
**నిద్రాణ భారతము కనుమా!**
**జాగృతము ఒనరించవలదా?**
**కలియుగ కల్యాణ చక్రవర్తీ!**

**కృతయుగ ధర్మదేవత**
**రవళించి తనుపు ననుము!**
**మేలుకొనుము! మేలుకొనుము! మేలుకొనుము!**
**మేలుకొనుము! మేలుకొనుము! మేలుకొనుము!**

అని సంపూర్ణమయింది. కావ్యమంతయు వేంకటేశ్వర స్వామిని కీర్తించే, పాటలమయము.

మేలుకొనుము! అను ప్రార్థన ఉంది. మేలుకొలుపు అను పేరు తప్ప ఇందులో సుప్రభాత లక్షణములు లేవు. ఈ కావ్యం నేతిబీరకాయవలె ఉంది.

## 14. కాటూరి వేంకటేశ్వరరావు

కాటూరి వేంకటేశ్వర రావు హరిజన దేవాలయ ప్రవేశ సమస్యపై 'గుడిగంటలు' అను ఖండకావ్యం రచించారు. ఇందులో వేంకటేశ్వర స్వామిని మేలుకో అని ప్రార్థించుచున్న అయిదు పద్యములున్నవి. వీటిలో సుప్రభాతం లక్షణమైన మేలుకోగదే అను సంబోధనతో స్వామిని కాటూరి వేంకటేశ్వర రావు ప్రబోధించారు.

**ఏలికవై జగమ్ములకు నేడుమలల్ పయికొమ్మ మీద శ్రీ**
**నీళలు జోలవాడ శయనించిన దేవర! మేలుకో! కృపా**
**వాల! శ్రితానుకూల! శ్రుతి పారచరత్పదపద్మ! మేలుకో!**
**నీలసరోజపత్ర రమణీయ విలోకన! మేలుకోగదే!** 1

**నైగమ మూలమంత్రములు నాంది ముఖమ్ములు విశ్వసృష్టితో**
**యోగసమాజ మానసగుహోదిత మంగళ దీపికారుచుల్**
**సాగరకన్యకా హృదయ సారస షట్పద గీతికారుతుల్**
**నీ గుడిగంట సవ్వడులు నింగి చెలంగెఁ బ్రబుద్ధలోకముల్.** 2

**తిరుపతి తుంగశృంగ వసతీ! వినవచ్చెను సుప్రభాత గీ**
**తరవము, సౌఖశాయనిక దాసజనుల్ కపురంపుటారతుల్**



**కరములఁ దాల్చినిల్చిరి, జగమ్ములు నీ కనువిప్పు వేచెడిన్**
**సరగున మేలుకో, కొలువుసాలను దర్శనమిచ్చి యేలుకో!** 3

**అరుణ గభస్తి నీ గిరులయంఘ్రులు ముట్టి ప్రదక్షిణించి, గో**
**పుర శిఖరమ్ములంబొదివి పుష్కరిణీ జలజాత కోశముల్**
**విరియగఁజేసి, పుప్పొడులు వేయికరమ్ములఁ దాల్చి నిల్చె దే**
**వరతిరుమజ్జనమ్ము తతివార్చి జగత్పతి! మేలుకోగదే.** 4

**తిరుమలవాస! వేంకటపతీ! తిరుమజ్జనమాడి, భూషణో**
**త్కరములు పైడిపుట్టములు దాలిచి, లోకవిమోహనమ్ముగా**
**దిరుమణిబొట్టు నెన్నొసట దిద్ది సహస్రమయూఖ కోటి భా**
**సురమకుటమ్ముతో భువనసుందర దర్శన భాగ్య మీగదే!** 5

**అలభ్యములు –**

**(15) తాడిపూడి శ్రీరామచంద్రకీర్తి** వేంకటేశ్వర గీతాంజలి (పద్యకావ్యం) అను పేరుతో సుప్రభాతమును అనువదించారు (1962),

**(16) విశ్వనాథ నరసింహము** శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము (1962) ను అనువదించారు,

**(17) బాపట్ల హనుమంతరావు** శ్రీ వేంకటేశ్వర సుప్రభాత గీతములు (పద్యకావ్యం) రచించారు (1997). పై మూడు గ్రంథములు అలభ్యములు. వేంకట మేలుకొలుపులను (1920) లాలాకన్నయ్య దాసు వేంకటేశ్వర మేలుకొలుపులను (1921) కె.చెంగయ్య దాసు ఈ గ్రంథములు అలభ్యములు. వీటి ఆచూకి ఆంధ్రవాఙ్మయ సూచిక (1926) వలన తెలిసింది.

## 18. వెలమకన్ని శ్రీరామమూర్తి (1982)

**శ్రీనివాస వైభవమ్** అను గ్రంథమును వెలమకన్ని శ్రీరామమూర్తి రచించారు. ఇందులో సుప్రభాత వైభవము, పూజావైభవము, తీర్థవైభవము

అను విభాగములు గలవు. సుప్రభాత వైభవములో సుప్రభాత సమీక్ష, తిరుప్పావై పాశురములకు తెలుగులో భావములున్నాయి. వీటితర్వాత సుప్రభాత సంస్కృత శ్లోకములు, వాటికి భావము వివరింపబడింది.

సుప్రభాతమందలి ప్రారంభ శ్లోకమునకు "తూరుపున బలబల తెలవారుతోంది. తొలిసంజ చిరువెలుగు దొంతరలు చిమ్ముతోంది. ఉదయభాను కిరణ సముదాయం ప్రసరిస్తోంది. శుభశ్రీ చెలువొందుతోంది. దేవపూజాది నిత్యనైమిత్తిక కృత్యాలు. పూర్తి కావించుకొనే సమయమైంది. ఓ కౌసల్యా సుప్రజా రామా! ఓ ప్రవిమల పుణ్యధామా! మేలుకో, మేలుకొని మమ్ము యేలుకొనుము స్వామీ!" అని శ్రీరామమూర్తి విస్తృతంగా వివరణ సమకూర్చారు.

భాస్వానుదేతి (26) అను శ్లోకమునకు "ముదమున దినకరుడు ఉదయిస్తున్నాడు. తన శతసహస్ర కిరణసముదాయాన్ని ప్రసరిస్తున్నాడు. సమీప సుందర కాసారాలలోని, రమ్యమైన కోనేళ్ళలోని పద్మాలు వికసిస్తున్నాయి. శకుంత సంతతులు కలకలారావాలు కావిస్తున్నాయి.

**"న చలతి నిజధర్మ వర్ణతో యః**
**సమమతి రాత్మ సుహృద్విపక్ష పక్షే ।**
**న హరతి న చహంతి కించిదుచ్చైః**
**సితమనసం తమ వేహి విష్ణుభక్తమ్ ॥"**

అని శాస్త్రములో విష్ణుభక్త లక్షణము వివరింపబడింది. అట్టి లక్షణము గల వివిధ భాగవతోత్తములు, మహాభక్త శిరోమణులు అయిన శ్రీవైష్ణవ పుంగవులు నీ మంగళనామ సంకీర్తనలు కావిస్తున్నారు. నీ శుభప్రశంసను పఠిస్తున్నారు. ఓ వేంకటేశ్వర స్వామీ! అట్టి యీ సమయంలో నీకు రమణీయమైన అరుణోదయమగుగాక! అని విస్తృతమైన వివరణ యివ్వబడింది.



వేంకటేశ్వర స్తోత్రమునందలి ప్రథమ శ్లోకము "రమాకుచాగ్ర కుంకుమాంకితారుణ విలసిత నీలగాత్రుడవు. నియతారుణితాతుల నీలతనూ విలసితుడవు. శ్యామసుందరుడవు. కమలాయతలోచనుడవు. నీవు జగత్పితవు. జగత్పతివి. నీవు జగన్నాయకుడవు. నీవు జగన్నాథుడవు. అట్టి ఓ వేంకటేశ్వర స్వామీ! నీకు జయము. విజయము. దిగ్విజయము స్వామీ!" అని సులభగ్రాహ్యముకాని భాషలో వివరింపబడింది.

శ్రీ వేంకటేశ ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకము "నీవు సకల లోకాలకు నాయకురాలవు. నీవు వేంకటాచలపతికి పరమప్రియురాలవు. సతతం విష్ణుహృదయంలో కాపురం చేస్తూన్నదానవు. ఆ కారణంగా అతనిలో క్షమాగుణ సంపదను నెలకొల్పడానికి కారణభూతురాలవు నీవు. పద్మాలంకృత పాణిపల్లవ సౌందర్య శోభితురాలవు. పద్మాసన భూషితురాలవు. నీవు వాత్సల్యాది మేలైన గుణాలచేత ప్రకాశించుదానవు. నీవు సుగుణవత్సలవు. నీవు ముల్లోకాలకు తల్లివి. ఎల్ల లోకాలకు రాణివి. నీవు దయామయురాలవు. నీవు పరమపూజ్యురాలవు. అట్టి ఓ మహాలక్ష్మీమాతా! నిన్ను స్తుతించి, ప్రస్తుతించి, అర్థించి, ప్రార్థిస్తున్నాను" అని విస్తారముగా తాత్పర్యము బోధింపబడింది.

ప్రపత్తిలోని 'విష్ణోః పదే పరమ' (10) అను శ్లోకము "ఓ వేంకటేశ్వర స్వామీ! ఋగ్వేదము విష్ణుపాదాలు పరమ ఉత్కృష్టములైనవని ప్రవచిస్తోంది. వైకుంఠమందు విష్ణుపాదములను తేనె ఊటగాను, సుధామధురమైన భోగ్యవస్తువుగాను, ఋగ్వేదం ప్రకటిస్తోంది. ఋగ్వేదం ప్రవచించి, ప్రకటించి, ప్రతిపాదించి పరమప్రమాణభూతమైనవని సూచించినదాన్ని నీ వరదహస్తం నిర్ధారించి, నిర్ణయించి, నీ చరణయుగాన్ని భక్తులను సేవించుకొని తరించుమని నిర్దేశిస్తోంది. అట్టి నీ చరణాలను శరణువేడుతున్నాను" అని శ్రీరామమూర్తి వివరంగా శ్లోకభావాన్ని తెలిపారు.

వేంకటేశ మంగళాశాసనములోని ప్రథమ శ్లోకము "నీవు రమాధవుడవు. శ్రియః కాంతుడవు. శ్రీనివాసప్రభుడవు. కల్యాణగుణ సంపన్నుడవు. సుగుణ భూషణుడవు. పుణ్యవ్రతుడవు. మంగళకారకుడవు. శుభాశ్రితుడవు. అర్థిజనుల ప్రార్థనలు వ్యర్థం కావించక పూరించగల సమర్థుడవు. పేదల పాలిటి పెన్నిధివి. దయానిధివి. శ్రీ వేంకటాచల నివాసివి. అట్టి ఓ శ్రీ వేంకటేశ్వర స్వామీ! నీ కల్యాణ నామసంకీర్తనలలో కల్యాణదాయకమై, నీ దివ్యమంగళరూప సందర్శనం జగన్మంగళప్రదమై చెలువొందుగాక!" అని విపులమైన వివరణ చేయబడింది.

మంగళాశాసనములోని 'వైకుంఠ విరక్తాయ' (12) శ్లోకమును నీవు వైకుంఠ నివాసాన్ని త్యజించావు. కిన్నెర, కింపురుష, యక్షగంధర్వుల సేవలను పరిత్యజించావు. క్షీరసాగరశయనంపై విరక్తిభావం ప్రకటించావు. శేషతల్పాన శయనించి లక్ష్మీదేవి పాదసేవలు విరక్తితో నిరాకరించి, శేషశైలముపైన స్వామిపుష్కరిణీతటాన రక్తితో, అనురక్తితో రమాసతి సేవలను స్వీకరిస్తూ, వినోదంతో, విలాసంతో ఆమెతో విహరిస్తూ క్రీడిస్తున్నావు. అట్టి ఓ శ్రీ వేంకటేశ్వర స్వామీ! నీ కల్యాణ నామసంకీర్తనము, లోకకల్యాణదాయకమై, నీ దివ్యమంగళరూప సందర్శనము జగన్మంగళప్రదమై ఒప్పుగాక! అని వెలమకన్ని శ్రీరామమూర్తి విపులంగా వివరించారు.

## 19. జంధ్యాల పాపయ్య శాస్త్రి

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములకు భావము రచించారు. ఇది సులభగ్రాహ్యమైన శైలిలో ఉంది. ఈ గ్రంథములో తెలుగు లిపిలో సంస్కృత శ్లోకములు, వాటికి భావము గలదు. సుప్రభాతములోని ప్రథమ శ్లోకమునకు "కౌసల్యాదేవి గారాబు కుమారుడవైన శ్రీరామచంద్రా! తూర్పు తెలతెలవారుతూ ఉన్నది. స్నాన సంధ్యాదికములకూ, దైవపూజకూ వేళ ఐనది. ఓ పురుష



పుంగవా! నిద్రలేవవయ్యా!" అని తాత్పర్యము రచించారు. భాస్వానుదేతి (26) అను శ్లోకము "స్వామీ! సూర్యుడు ఉదయిస్తున్నాడు. కమలాలు వికసిస్తున్నవి. పక్షుల కల కల ధ్వనులు నలుదిశలా నిండినవి. శ్రీ వైష్ణవులు సర్వదా మంగళం కాంక్షించినవారై నీ దివ్యసన్నిధిలో నిలిచి ఉన్నారు. వేంకటాచలంపైన వేంచేసి ఉన్న ప్రభూ! నీకు సుప్రభాతం!" అని వివరించ బడింది.

స్తోత్రములోని ప్రథమ శ్లోకమునకు "స్వామీ! శ్యామసుందరా! వేంకటేశ్వరా! లక్ష్మీదేవి కుచాగ్రాలమీది కుంకుమ పూతలు అంటుకోటంచేత నీ నీలశరీరం అరుణారుణ కాంతులతో విరాజిల్లుతున్నది. కమల దళాల లాగా విశాలమైన కందోయి గలవాడా! జగదీశ్వరా! గిరీశ్వరా! విజయీభవ! విజయీభవ!" అని కరుణశ్రీ తాత్పర్యం చెప్పినారు.

శ్రీ వేంకటేశ్వర ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకమునకు జంధ్యాల పాపయ్య శాస్త్రి "ఈ విశ్వానికి అధీశ్వరివి. మహావిష్ణుస్వరూపుడైన వేంకటేశ్వరునకు అత్యంత ప్రియురాలివి. ఆయన వక్షమునందే నిత్యమూ నివసించే రసజ్ఞురాలివి. ఆయన క్షమాగుణాన్ని అనుక్షణమూ పెంపొందిస్తావు. తామరపూలు ధరించిన కరపల్లవములు నీవి. పద్మవాసినివి నీవు. వాత్సల్యం మొదలైన సుగుణాలతో ప్రకాశిస్తుంటావు. జగజ్జననివీ, భగవతివీ అయిన శ్రీ మహాలక్ష్మీ! నీకు నమస్కారం చేస్తున్నాను" అని తాత్పర్యం రచించారు.

ప్రపత్తిలోని విష్ణోః పదే పరమ (10) శ్లోకమునకు "స్వామీ! వేంకటేశ్వరా! నీ పాదాలు వేదాలలో విష్ణోః పదే పరమే" అని అత్యంత పవిత్రములుగా ప్రశంసితములైనాయి. అంతేకాదు "మధ్వ ఉత్స" అని తేనె సోనలవలె పరమభోగ్యములుగా ప్రస్తుతింపబడ్డాయి. ఇవి అటువంటివే అని స్వయంగా నీ చేతితో చూపించబడినాయి. అటువంటి అయ్యవారి శ్రీ చరణాలను శరణుపొందుతున్నాను అనుగ్రహించు' అని తాత్పర్యము చెప్పబడింది.

మంగళాశానములోని ప్రథమ శ్లోకము "శ్రియఃపతియై, సకల శుభాలకూ సన్నిధియై, ప్రపన్నులకు పెన్నిధియై, శ్రీ వేంకటాద్రి మీద వేంచేసి ఉన్న శ్రీనివాసస్వామికి మంగళం అగుగాక! అని వివరించబడింది.

శ్రీ వైకుంఠ విరక్తాయ (12) శ్లోకమునకు "శ్రీ వైకుంఠం మీద విరక్తి చెందినవాడై భూమిమీద ఉన్న స్వామి పుష్కరిణీ తీరాన రమాసమేతుడై విలాసంగా విహరిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామికి మంగళం అగుగాక!" అని జంధ్యాల పాపయ్య శాస్త్రి తాత్పర్యం చెప్పినారు.

## 20. పం. బాలకృష్ణమూర్తి

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమునకు సంపూర్ణంగా తెలుగులో టీకా తాత్పర్యములను పంగనామాల బాలకృష్ణమూర్తి రచించారు. ఈ గ్రంథమును తి.తి. దేవస్థానం ప్రకటించింది. నేటికీ ముద్రిస్తున్నది. (2014)

సుప్రభాతమందలి ప్రారంభ శ్లోకమునకు "కౌసల్యాదేవి సత్సంతానమైన ఓ శ్రీరామా! తూర్పు తెల్లవారుచున్నది. దేవపూజాది దినకృత్యములు నెరవేర్పవలయును. ఓ పురుషోత్తమా! నిద్ర మేల్కొనుము" అని తాత్పర్యం వ్రాయబడింది.

భాస్వానుదేతి (26) అను శ్లోకమునకు "ఓ వేంకటాచలపతీ! సూర్యుదుదయించుచున్నాడు. తామరలు వికసించుచున్నవి. పక్షులు కలకల శబ్దములచే నలుదిక్కులను నింపుచున్నవి. శ్రీ వైష్ణవులు మంగళముల గోరుచు సన్నిధిలో వేచియున్నారు. స్వామీ! నీకు సుప్రభాతమగుగాక! అని బాలకృష్ణమూర్తి తాత్పర్యం చెప్పినారు.

శ్రీ వేంకటేశ స్తోత్రములోని ప్రారంభ శ్లోకమునకు పం. బాలకృష్ణమూర్తి "ఓ వేంకటాచలపతీ! శ్రీదేవి చనుమొనల కుంకుమపూత వలన నెఱ్ఱనైన నీల శరీరము గలవాడవు. తామరపూరేకులవలె నిడుపైన కన్నులు గలవాడవు. ఓ జగన్నాయకా! స్వామీ! నీకు జయము జయము" అని తాత్పర్యం రచించారు.



శ్రీ వేంకటేశ ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకమునకు "ఈ లోకమునకంతటికిని యజమానురాలును, సాక్షాద్విష్ణుమూర్తియైన వేంకటాచలపతికి మిక్కిలి ప్రియురాలును, అతని క్షమాగుణమును (ఓర్పు) పెంపొందింపజేయునదియు, తామరపూవుల నలంకారముగా తన చిగురుకేల దాల్చునదియు, పద్మాసనమున గూర్చుండి యుండునదియు, వాత్సల్యము మొదలగు మేలిగుణములచే నిత్యము ప్రకాశించునదియు, నెల్లలోకములకు దల్లియు భగవతియునగు లక్ష్మీదేవికి నమస్కరించుచున్నాను అని తాత్పర్యమును పం. బాలకృష్ణమూర్తి రచించారు.

విష్ణోః పదే పరమ (10) అను శ్లోకమునకు "ఓ వేంకటేశ్వర స్వామీ! ఋగ్వేదమున 'విష్ణోః పదే పరమే' అని ప్రశంసింపబడినవియు, అందే 'మధ్వ ఉత్సః' తేనె యూట అని పరమభోగ్యములుగా తెలుపబడినవియు మరల అది యట్లేయని నీవు చేతితో చూపుచున్నవియు నగు నీ చరణములను శరణు వేడుచున్నాను" అని తాత్పర్యం చెప్పబడింది.

మంగళాశాసనములోని ప్రథమ శ్లోకము "లక్ష్మీదేవికి పెనిమిటియు, సమస్త శుభములకు గనివంటివాడును, పేదల పాలిటి పెన్నిధియునై శ్రీ వేంకటాచలమున నివసించు శ్రీనివాసునకు మంగళమగుగాక!" అని వివరించబడింది.

"శ్రీ వైకుంఠ విరక్తాయ" (12) శ్లోకమునకు బాలకృష్ణమూర్తి "శ్రీ వైకుంఠముపై రక్తి లేక స్వామి పుష్కరిణి గట్టున లక్ష్మీదేవితో విలాసముగా క్రీడించు శ్రీ వేంకటేశ్వరస్వామికి మంగళమగుగాక" అని తాత్పర్యమును వ్రాసినారు.

## 21. నేదునూరి గంగాధరం (2000)

నేదునూరి గంగాధరం శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములు నాల్గింటికి తాత్పర్యమును రచించారు. సుప్రభాతము

లోని ప్రారంభ శ్లోకమునకు "సాధ్వీశిరోమణియైన కౌసల్యాదేవి గర్భాన జననమయిన ఓ శ్రీరామా! తెల్లవారుతూ వున్నది. దేవతా పూజలనూ, నిత్యకర్మలనూ నెరవేర్చాలి. పరమపురుషా! నిద్ర మేల్కొనుము" అని తాత్పర్యం గంగాధరం రచించారు.

సుప్రభాతములో భాస్వానుదేతి (26) శ్లోకమునకు "సూర్యుడుదయిస్తూ ఉన్నాడు. పద్మములు వికసిస్తున్నాయి. పక్షులు తమ మధుర శబ్దాలతో అన్ని దిశలను నింపుతూ ఉన్నాయి. శ్రీ వైష్ణవులు సదా నీకు మంగళములు, శుభములను ప్రార్థించుచూ నీ దివ్యమగు సన్నిధిని ఆశ్రయిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామీ! నీకు శుభోదయమగుగాక!" అని తాత్పర్యము వ్రాయబడింది.

స్తోత్రములోని ప్రారంభ శ్లోకమును "లక్ష్మీదేవి యొక్క స్తనాగ్రముల యందలి కుంకుమరంగుచే ఎఱ్ఱగా చేయబడిన నీలవర్ణ శరీరము గలవాడా! పద్మపు రేకుల్లాంటి నేత్రాలు గలవాడా! వేంకటాచలపతీ! జయశీలుడవగుదువు గాక! అని తాత్పర్యము వ్రాశారు. ప్రపత్తిలోని మొదటి శ్లోకమును గంగాధరం "ఈ జగత్తునకు యజమానురాలివి, సాక్షాత్ శ్రీహరియొక్క దివ్యరూపుడయిన శ్రీ వేంకటేశ్వర స్వామి హృదయేశ్వరివి. నిత్యము ఆయనయొక్క వక్ష స్థలమందే నివాసము చేయుటయందనురక్తి గలదానవు. శ్రీహరియొక్క ఓర్పును సంవృద్ధి చేసేదానవు. తామర పుష్పాలతో అలంకరింపబడిన చిగురులవంటి చేతులు గల దివ్యస్వరూపిణివి. పద్మాల మధ్యన ఆసీనురాల వైన దేవివి. ప్రీతి, వాత్సల్యము మొదలైన గుణాలతో ప్రకాశిస్తూ ఉన్నటువంటి జగదేక మాతవునూ అయిన శ్రీ లక్ష్మీదేవీ! నేను నీకు నమస్కారము చేయుచున్నాను" అని తాత్పర్యమును వ్రాశారు.

ప్రపత్తిలో విష్ణోః పదే పరమ (10) శ్లోకమునకు "గరుడాద్రినాయకా! సర్వవిధ శాస్త్రాలతోనూ విష్ణువుది మహోన్నత స్థానమనియు, పుట్ట తేనెలాగ



మిక్కిలి ప్రస్తుతింపబడుచున్నటువంటి, నీ చేతితో చూపబడుతూవున్నట్టి నీ పాదపద్మాలను శరణు పొందుతూ వున్నాను" అని తాత్పర్యము వ్రాయబడింది.

మంగళాశాసనములోని ప్రథమ శ్లోకమునకు గంగాధరం "శ్రీ లక్ష్మీశుడునూ, కల్యాణ గుణాన్వితుడునూ, శ్రీ వేంకటాచల నివాసుడునూ యగు శ్రీనివాస మూర్తికి మంగళమగుగాక! అని తాత్పర్యము చెప్పినారు. "శ్రీ వైకుంఠ విరక్తాయ (12) శ్లోకమునకు "వైకుంఠమునందు నివసించుటకు విరక్తినొంది, లక్ష్మీదేవితో స్వామి పుష్కరిణీ తీర్థమందు వినోదముగా గడుపుచున్నట్టి శ్రీ వేంకటేశ్వరా! నీకు మంగళమగుగాక!" అని నేదునూరి గంగాధరం భావమును రచించారు.

## 22. పాలకోడేటి సత్యనారాయణ రావు (2005)

పాలకోడేటి సత్యనారాయణ రావు **'శ్రీవారి సన్నిధి'** అనే గ్రంథం రచించారు. అందులో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములు నాల్గింటికి భావము తెలుగులో రచించారు. గ్రంథములో తెలుగు లిపిలో సంస్కృత శ్లోకము, దానిక్రింద భావము ఈయబడింది.

సుప్రభాత ప్రారంభ శ్లోకమునకు "కౌసల్య తనయుడైన ఓ శ్రీరామా! తూర్పున చీకట్లు తొలగి తెల్లవారుతోంది. దైవపూజలకు వేళ అయింది. కనుక ఓ పురుషోత్తమా! నిద్రలే!" అని భావము చెప్పబడింది.

"భాస్వానుదేతి (26) అను శ్లోకము, సూర్యుడు ఉదయిస్తున్నాడు. సరస్సులో పువ్వులు వికసిస్తున్నాయి. పక్షులు తమ కలకల శబ్దాలతో నాలుగు దిశలను పరిపూర్ణం చేస్తున్నాయి. ఇక శ్రీ వైష్ణవులు సర్వమంగళాలను కోరుతూ నీ సన్నిధిలో వేచి చూస్తున్నారు. నీకిదే సుప్రభాతం" అని అనువదింపబడింది.

స్తోత్రములోని మొదటి శ్లోకము "ఓ వేంకటాచలపతీ! శ్రీదేవి వక్షోజాల మీది కుంకుమ తాకటంవల్ల ఎఱ్ఱనైన శరీరం గలవాడివి. తామరపూల వంటి విశాలమైన కన్నులు గలవాడివి. ఓ పరంధామా! నీకిదే జయము జయము" అని భావము రాశారు.

ప్రపత్తిలోని మొదటి శ్లోకమునకు "ఓ జగన్మాతా! లక్ష్మీదేవీ! నీవే సమస్త ప్రపంచానికి యజమానురాలివి. నీవే సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే అయిన శ్రీ వేంకటేశ్వరుని ఇల్లాలివి. నీవే ఆ వేంకటేశ్వరుని గుండెలలో నివాసం ఉన్న తల్లివి. నీవే ఆ స్వామి యొక్క క్షమాగుణాన్ని నిత్యం పెంపొందింపజేసే తల్లివి. నీవే తామరపువ్వులను చేత ధరించిన తల్లివి. నీవే పద్మాసనంపైన కూర్చున్న మాతవు. నీవే వాత్సల్యం వంటి అనేక గుణాలను కలిగి నిత్యమూ ప్రకాశించే మాతవు. తల్లీ! జగన్మాతా! నీకిదే మా వందనం" అని భావం చెప్పబడింది.

విష్ణోః పదే పరమ (10) అను శ్లోకమును "ఓ వేంకటాచలపతీ! శ్రీ వేంకటేశ, నీ పాదాలె వైకుంఠములోని తేనె ఊటలనీ, అవే పరమ భోగ్యాలనీ ఋగ్వేదమే పేర్కొన్నది. అవును ఆ మాట నిజమేనని నీవే నీ చేతులతోనే సూచిస్తున్న ఆ పాదపద్మాలే మాకు శరణమురణు" అని భావము చెప్పినారు.

మంగళాశాసనములోని ప్రథమ శ్లోకమును "లక్ష్మీదేవి భర్త అయినవాడు, అన్ని కల్యాణములకు మూలమైనవాడు. అర్థులకు కోరినవి ఇచ్చేవాడు. శ్రీ వేంకటాచలమున నివసించేవాడు అయిన శ్రీనివాసునికి మంగళమగుగాక! అని సత్యనారాయణరావు అనువదించారు.

శ్రీ వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోకమును "శ్రీ వైకుంఠము పట్ల ఆసక్తి లేక, శ్రీ వేంకటాచలమందలి స్వామి పుష్కరిణి చెంత లక్ష్మీదేవితో రమణీయమైన క్రీడలలో మునిగిన శ్రీ వేంకటేశునికి మంగళమగుగాక!" అని పా॥ సత్యనారాయణ రావు తెలుగులోకి అనువదించారు.



## 23. తంగిరాల వేంకట నరసింహ కుమార్

తం॥ వేం॥ నరసింహ కుమార్ **శ్రీ నృసింహ నారాయణీయము మరియు శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్** (స్వేచ్ఛానువాదము) అను గ్రంథము రచించారు. ఇందులో సుప్రభాతమును మాత్రము 33 కంద పద్యాలలో స్వేచ్ఛగా రచించారు. సుప్రభాతములోని ప్రారంభ శ్లోకమును

కం. **శ్రీ కౌసల్యారామా**
**వేకువఝామాయె లెమ్ము వేంకట నాథా!**
**నీ కర్తవ్యము విధులను**
**శ్రీకరముగ చేయ లెమ్ము శేషగిరీశా!**

అని అనువదించారు. ఇందు భావములు లేవు.

భాస్వానుదేతి (26) అను శ్లోకమును

కం. **ఉదయించె భాను తేజుడు**
**ముదముగ పద్మములు విరిసె మురహరి! రవళుల్**
**మధురముగ చేసె పక్షులు**
**చదివిరి మంత్రములు ద్విజులు సరుగున లెమ్మా!**

అని తంగిరాల వెంకట నరసింహ కుమార్ కంద పద్యములో స్వేచ్ఛగా అనువదించారు.

* * *

## 4. సుప్రభాత అనువాదములు (ఇంగ్లీషు)

శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులు కొందరు సంస్కృతము, తెలుగు తెలియని వారికోసం శ్రీ వేంకటేశ సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళా శాసనములను ఇంగ్లీషులోకి అనువదించారు. కొందరు సంస్కృత సుప్రభాత శ్లోకములను తెలుగులో, నాగరిలిపిలో ఇచ్చి ఇంగ్లీషులో భావము రచించారు.

కొందరు సంస్కృత సుప్రభాతమును రోమన్ లిపిలో (ఇంగ్లీషు అక్షరాలలో Transcription ఇచ్చి భావము ఇంగ్లీషులో రచించారు. ఒకరు మూలమును ఇంగ్లీషు భాషలో ఇచ్చి, అనువాదము Fnee verse లో రచించారు. ఇట్లు ఆంగ్లానువాదములలో కూడ వైవిధ్యం ఉంది.

## 1. విద్వాన్ పిశిపాటి కృష్ణమూర్తి (1964)

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి మంగళాశాసనము అను నాల్గింటిని విద్వాన్ పిశిపాటి కృష్ణమూర్తి ఆంగ్లానువాదము చేశారు. ఈ గ్రంథములో సంస్కృత మూలము తెలుగు లిపిలో, అనువాదము ఆంగ్లములో ఇయ్యబడింది. ఈ గ్రంథము తెలిసినంతవరకు మొదటి ఆంగ్ల సుప్రభాతముగా వుంది. ఇది 1964 సం॥లో మాడభూషి అనంతశయనం అయ్యంగారి పీఠికతో ప్రచురించబడింది. సుప్రభాతములోని మొదటి శ్లోకము

"O Thou the precious son of Kausalya! O Rama, the blessed and the supreme among men, the day is dawning on the East. The daily ablutions and prayers to God are to be performed. Wakeup, therefore from they slumber" అని ఇంగ్లీషులోకి అనువదింపబడింది.

భాస్వానుదేతి (26) అను శ్లోకము "O Lord Venkateswara" the Sun is rising in the East, the lotuses are bloosoming in the lakes. All around, the sweet sounds of the shipping birds fill the air. Vaishnavaite devotees are awaiting in the holy presence. O Lord Venkateswara, may it be a welcome down to thee?" అని అనువదించబడింది.

స్తోత్రములోని ప్రారంభ శ్లోకము "O Lord Venkateswara, thou hast thy (body made blue by the Vermillion paint on the nipples of Sridevi. Thou hast eyes long like the petals of the lotus flower. Lord of the Universe, may victory be thine! అని ఆంగ్లీకరించబడింది.



శ్రీ వేంకటేశ ప్రపత్తిలోని ప్రథమ శ్లోకమునకు "I offer my salutations to Goddess Laxmi, who is the Queen of all the worlds, the beloved spouse of Lord Venkateswara, Vishnu's incarnation, who is ever anxious to reside on His bosom who contributes and increases His tolerence, who holds in Her tender palm the lotuses as ornaments, who is found seated on the lotus itself, who ever shines with the noble qualities of love and affection and who is the mother of all the worlds" అని ఇంగ్లీషులో భావము వివరించబడింది.

విష్ణోః పదే పరమ (10) శ్లోకభావము "O Lord Venkateswara, I seek refuge in thy feet which are praised in the Rigveda as occupying a place of eminence and supremacy in Vaikuntha and which are referred to therein as the bee - hive worthy of enjoyment and which indicate and assure to be so by thy uplifted palm" అని ఇంగ్లీషులో వివరించబడింది.

శ్రీ వేంకటేశ మంగళాశాసనములోని ప్రారంభ శ్లోకభావము.

"May I offer my reverential salutations and felicitations to Lord Srinivasa, residing on mount Venkatachala, the Lord consort of Lakshmi, who is a mine of blessed and adorable qualities and a treasure trove to the poor and lowly" అని వివరించబడింది.

శ్రీ వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోకము "May this be my salutation and felicitation to Lord Venkateswara, who gracefully, in happy dalliance, sports with His divine consort Laxmi on the banks of the sacred tank not being inclined to prolong His stay in Vaikuntha".

## 2. డా॥ కె. సేతురామేశ్వర దత్తా (1980)

శ్రీ వేంకటేశ సుప్రభాతమును సంపూర్ణముగా కీ.శే. నా సహ అధ్యాపకులు మిత్రులు డా॥ కె. సేతురామేశ్వర దత్తా ఇంగ్లీషులోకి అనువదించారు. ఈ గ్రంథమును తి.తి.దేవస్థానం 1980 సం॥లో ప్రచురించింది. ఇందులో సంస్కృత మూలము దేవనాగరి లిపిలో, రోమన్ లిపిలో (ఇంగ్లీషు Transcription) ఇచ్చి, దానికి అనువాదము ఇంగ్లీషు వచనములో ఇవ్వబడింది. సుప్రభాతములోని ప్రథమ శ్లోకము "O Rama! Kausalya's auspicious child! Twilight is apparing in the East. O best of men! (i.e. Purushottama) wake up, the divine daily rituals have to be performed" అని అనువదించబడింది.

భాస్వానుదేతి (26) అను శ్లోకము "The sun is rising; the lotuses have blossomed. The birds are filling the directions (diks) with their noises. The Sri Vaishnavas, always imploring auspiciousness, are waiting at thy abode. Lord of Venkatachala! May it be an auspicious down to thee" అని ఆంగ్లీకరించబడింది.

స్తోత్రములోని ప్రథమ శ్లోక భావము "Lord of Venkatachala! one whose matchless blue body is ever rendered red by the saffron on the teats of the breasts of Kamala (i.e. Sridevi). One whose eyes are broad like the petals of the lotus! O Lord of the universe! victory to thee, the Lord of Venkatachala!" అని ఇంగ్లీషు వచనములో తెలుపబడింది.



శ్రీ వేంకటేశ ప్రపత్తిలోని మొదటి శ్లోకము "I salute Goddess Lakshmi, who is the Mistress (queen) of the Universe, who is the most beloved of Vishnu, the Lord of Venkatachala, who is fond of ever dwelling on His (Vishnu's) chest, who is the promoter of His forgiveness who has sprout, like hands decorated with lotuses, who is seated on the lotus (or seated in the posture of a lotus (i.e. Padmasana) who shines with virtues as mercy and who is the mother of the universe" అని ఆంగ్లావాదము చేయబడింది.

'విష్ణోః పదే పరమ' (10) అను శ్లోకభావము "Venkatesa! I seek refuge of thy feet which are extolled (in the Rig veda 1-154-5) as 'Vishnoh parama pade" (i.e. in the most extalled abode of Vishnu) which are (again) extolled there in as "madhva utsah" (meaning the fountain of honey) is extremely enjoyable and which are indicated as such by the show of the palm of thy hand" అని ఇంగ్లీషులో ఇచ్చినారు.

శ్రీ వేంకటేశ మంగళాశాసనములోని ప్రారంభ శ్లోకము "May auspiciousness be to Srinivasa, who is the Lord of Lakshmi, (who is) an abode of auspiciousness (who is) a treasure-trove of supplicants and (who) dwells on the Venkatachala!" అని కె.యస్.ఆర్. దత్తా అనువదించారు.

"శ్రీ వైకుంఠ విరక్తాయ" (12) అను శ్లోకము "May auspiciousness be to Sri Venkatesa, who giving up attachment to Sri Vaikuntha, sports gracefully with lakshmi on the banks of the Svami-pushkarini" అని అనువదించబడింది.

## 3. సి. సీతారామమూర్తి (1983)

తిరుమల శ్రీ వేంకటేశ్వరాలయంలో సుప్రభాత పఠనము ప్రభాతసేవగా జరుగుతుంది. సి.సీతారామమూర్తి ఇంగ్లీషులో "Sree Venkateswara swami Tirumala, Prabhata Seva - Early morning worship" అనే గ్రంథం రచించారు. ఇందులో సుప్రభాతం స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములకు ఆంగ్లానువాదము, వ్యాఖ్యానము (English rendering and commentary) ఉన్నవి. ఇందును గూర్చి సీతారామమూర్తి తమ అభిప్రాయమును ఇట్లు వివరించారు.

"The Divine Service begins with prabhatha seva (Early morning worship) with a reverent recital of suprabhatam (the invocatory Matin Hym followed by stotram (panegyric) and prapatti (surrender) and Morgalasasanam (Benediction). An attempt is made here to render the sanskrit slokas into English prose and to bringout their inner meaning and significance in the light vouchsafed to me".

ఈ గ్రంథంలో మొదట నాగరిలిపిలో సుప్రభాతం, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసన శ్లోకములు ఇచ్చారు. పిమ్మట ఇంగ్లీషులో సంస్కృత శ్లోకము (Transcription) తెలుగు లిపిలో మూలము, పిమ్మట ఇంగ్లీషు వచనములో అనువాదము ఈయబడింది. తర్వాత వ్యాఖ్యానము గలదు. సుప్రభాతములోని మొదటి శ్లోకము "O Rama, Thou worthy son of Kausalya. The Estern horizon breakers with the streakes of the rising sun. Awake! Thou, tiger among men! The usual daily obligation, to the deities and to the fellowmen need they attention. Snake off this sleepiness" అని అనువదింపబడింది.



భాస్వానుదేతి (26) అను శ్లోకము "The sun is on the rise. The lotuses bloom in joy. Birds flood all sides with the melody of their songs. The Srivaishnavas cling to they abode always invokings benediction to thee. Arise O Venkatapati, the down is fall of auspiciousness for thee" అని అనువదించబడింది.

స్తోత్రములోని ప్రథమ శ్లోకము "O Lord of Venkatachala! How glorious dost thy matchless dark body look, brightened red with the vermilion covering the nipples of kamala's breasts! O Thou, the lord of the universe! How magnificent art thy wide - spread lotus - petalle's eyes! May victory ever attened on thee! glory, glory, eternal glory into thee" అని ఆంగ్లీకరించబడింది.

ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకము "O Lakshmi! Thou art the Queen of the Universe and its ordainer. Thou art the most beloved of Vishnu, the Lord of Venkatachala. Thou dost fondly cherish to make His bosom they eternal abode. Thou dost foster and intensify His patience tolerance and forgiveness. How graceful dost thou look in the steady posture, seated on a full-blown lotus, with thy slender arms, like tender shoots, holding the lotuses as ornaments in both thy palms! Thou dost beam both with thy loving concern and considerate solicitousness and other glorious attributes. Salutations to thee, O spouse divine and Mother of the Universe" అని ఆంగ్లవచనములోకి అనువదించబడింది.

ప్రపత్తిలోని విష్ణోః పదే పరమ (10) అను శ్లోకం "Lord Venkatesa! Rigveda has enlogised Vishnu's feet as occupying the most exalted position which is in accessible and as providing an

inexhaustible spring of delicious honey which is extremely enjoyable. Thou dost point to thy feet with thy palm only to attest to the truth of this clamant vedic proclamation, let me attain to those feet. O Lord and cling to them for refuge" అని ఇంగ్లీషులోకి తర్జుమా చేయబడింది.

మంగళాశాసనములోని ప్రథమ శ్లోకము "Thou art the beloved Lord of Lakshmi and her abode as well. Thou art an inexhaustible mine of goodness and excellence. Thou art a treasure house for symplicants. Thou dost reside on Venkatachala, the mount that purifies people of their sins. Lord Srinivasa! May auspiciousness were attend on thee" అని ఆంగ్లములో వివరించబడింది.

శ్రీ వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోకమును "O Lord Venkatesa! Thou last given up thy attachment to Sreevaikunta and come down to the banks of Swami - pushkarini, here to sport gracefully with Lakshmi Devi. May auspiciousness were abide with thee" అని సీతారామమూర్తి ఇంగ్లీషులోకి అనువదించారు.

## 4. పిడతల సీతాపతి (1998)

పిడతల సీతాపతి "Sri Venkateswara swamy, Tirumala worship, Utsavams and Festivals" అను గ్రంథాన్ని రచించారు. ఇందులో సుప్రభాత సేవను గురించి మొట్టమొదట పేర్కొనిన గ్రంథం **సవాల్-ఇ-జవాబ్ పట్టి** అని తెలుపబడింది. దీనిని తేది 14-8-1819 నాడు అలబ్దు గోవిందరావు, హుజూరు సిరస్తాదార్, చంద్రగిరి సంకలనం చేశాడు. ఈ సవాల్-ఇ-జవాబ్ గ్రంథంలో "The doors of the temple



were opened at 8.00 O'clock in the morning; meanwhile the suprabhatam was started to be sung by the member of the Tallapaka Annamacharya's descendants" అని సుప్రభాత పఠనం గూర్చి తెలుపబడింది. (Answer to Question 7, **Sawal-E-Jawab patti 14th August 1819 AD** by Alabdu Govinda Rao, Huzur Sheristadar of Taluk Office, Chandragiri). దీని జిరాక్స్ గ్రంథము నా వద్ద వుంది.

ఈ గ్రంథములో సుప్రభాతము సంపూర్ణముగా రోమన్ లిపిలోను, ఆ శ్లోకముల భావము ఇంగ్లీషులోను ఇవ్వబడింది. సుప్రభాతమందలి ప్రథమ శ్లోకము "Kausalya supraja Rama! The day is breaking in the East. Awake Oh! Nara-sardula! for the performance of divine and homa rituals" అని అనువదించబడింది.

భాస్వానుదేతి (26) శ్లోకమును "Oh! Venkateswara swamy! The sun is rising the lotuses are bloomingout in full. The air is full of birdsong. The Sri Vaishnavas yearning for 'mangalams' for ever are seeking the blessing of being in thy Divya sannidhi. Suprabhatam to you" అని వివరించారు.

స్తోత్రములోని ప్రథమ శ్లోకమును "The saffron from the (embracing) nipples on the chest of Kamala Oh! blue chested one! has smeared thy body red. Oh! Lokapati! with the eyes of the Lotus! Vijayeebhava Oh! Sri Venkata Sailapathi!" అని సీతాపతి అనువదించారు.

ప్రపత్తిలోని ప్రథమ శ్లోకమును "The sovereign of the entire world and the beloved of Sri Venkatapathi - Vishnu. Sri Lakshmi

rejoices to reside on the vakshastala of the Lord permanently. She is the one who intensifies the kshama quality of Vishnu. She has two exquisitely beautiful tender hands which Lord lotuses. She is seated on the lotus and glows with several qualities such as vatsalya. I bow down to this Bhagavati, who is Jaganmataram - the mother of the Universe" అని సీతాపతి ఆంగ్లములో వివరించారు.

విష్ణోః పదే పరమ (10) అను శ్లోకము "The feet have been extolled as 'Vishno paday paramay' in the veda and again as "Madhva vutsa' signifying them to be a flowing spring of enjoyable sweet nectar, which thy open varada Hasta confirms. Sri Venkatesa charanau saranam prapady" అని ఆంగ్లీకరించబడింది.

మంగళాశాసనములోని ప్రారంభ శ్లోకము "The consort of Sri Devi. The Kalyananidhi and the treasure house for those who pray into you resident of Sri Venkatam. Oh! Srinivasa! Mangalam to you (all auspiciousness to you) అని అనువదించబడింది.

శ్రీ వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోకమును "Getting tired (weary) of Sri Vaikuntham, Sri Venkatesa is gladly sporting Himself with Sri Ramadevi on the banks of the Swami pushkarini. Sri Venkatesaya Mangalam" అని సీతాపతి ఇంగ్లీషులోకి తర్జుమా చేశారు. ఇట్లు సీతాపతి చేసిన సుప్రభాత అనువాదం మణిప్రవాళశైలిలో ఉండుట విశేషం.

## 5. బి.వి.ఎల్. నారాయణ రావు (1999)

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమును సంపూర్ణముగా బి.వి.ఎల్. నారాయణ రావు ఇంగ్లీషులో Free verse రూపంలో అనువదించారు. ఈ గ్రంథాన్ని



తి.తి. దేవస్థానము 1999లో ప్రచురించింది. ఈ గ్రంథములో సంస్కృత శ్లోకము రోమన్ లిపిలో, అనువాదం Free verse (స్వేచ్ఛాగీతాలు) రూపంలో ఉన్నది. ఇది ఈ అనువాదం యొక్క విశిష్టత.

సుప్రభాతము (Early morning prayer) లోని ప్రథమ శ్లోకము.

**Arise, Rama**

Precious child
of the noble Kausalya
It's twilight in the East
Wake up Rama,
The best among men!
You should perform
Your morning ritual!

అని స్వేచ్ఛానువాదం చేయబడింది.

భాస్వానుదేతి (26) అను శ్లోకమును

**The Scene**

The sun is up. The lotuses
are in full bloom. The birds
are filling the sky
with their Chirping.
Your ardent devotees
seek the auspicious, always,
pray for your presence
Lord Venkateswara
Good morning to you

అని నారాయణ రావు ఇంగ్లీషులో రచించారు.

స్తోత్రము (In praise of the Lord) లోని ప్రథమ శ్లోకము

**Prayer for your triumph**

The red powder on the nipples
of your spouse's bosom is now
smeared on your dark body.
God of wide eyes,
Ruler of all the worlds,
Lord of the hill of Venkata saila
May you always be victorious!

అని ఆంగ్లీకరించబడింది.

శ్రీ వేంకటేశ ప్రపత్తి (Supplication) లోని ప్రథమ శ్లోకమును

**"Controller**

Mother, you are the controller
of this universe,
The supreme lover of Vishnu
You delight in being His Bosom companion
And make Him more tolerent always,
Your two tender hands
Gracefully hold lotuses.
seated in the lotus, Lakshmi,
you show fine qualities
Such as affection, and so on
gloriously, I salute you, Mother!

అని నారాయణరావు అనువదించారు.

ప్రపత్తిలోని శ్రీ వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోకమును



**Scriptural Testimony**

The scriptures proclaim
Your feet the most supreme,
That honey that can be relished
Oozes from them.

Again, your downward palm
indicates that it is inded so,
directing us to you feet
Sri Venkatesa! I fall at your feet!

అని నారాయణరావు అనువదించారు.

శ్రీ వేంకటేశ మంగళాశాసనము (Benediction) లోని ప్రథమ శ్లోకమును

**"Heralding**

For the spouse of Lakshmi, who is
The abode of all that is auspicious
The treasury for the needy
The Resident of Sri Venkatachala
Lord Srinivasa
May it always be glorious!"

అని అనువదించారు.

శ్రీ వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోకము

**"Earth better**

For Venkatesa who is fed up
with Vaikuntha, and has come
to be near the bank of the pond,
and is sporting with His consort,
May it always be glorious!

అని ఇంగ్లీషులోకి అనువదించబడింది.

ఈ ఇంగ్లీషు అనువాదము Free verse లో కొనసాగుట ప్రతి (శ్లోకమునకు) Free verse లకు శీర్షిక వుంచుట విలక్షణంగా ఉంది.

సంస్కృత శ్లోకభావము ఒకటే అయినను అనువాదకులు తమ భాషలో వివరించుటలో, అనువాదము చేయుటలో ప్రత్యేకత, వైవిధ్యము, విశిష్టతలు కనిపిస్తున్నాయి. లోకము వైవిధ్యము, భిన్న రుచిగలది గదా! ఇందుకు కారణం వారి చదువు సంస్కారం, భక్తిప్రపత్తులుగా ఉన్నాయి.

## 6. టి.వేంకటాచార్య

తి.తి.దే. శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థి, ప్రొ॥ టి. వేంకటాచార్య (టొరంటొ విశ్వవిద్యాలయం, కెనడా) శ్రీవేంకటేశ సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములకు ఇంగ్లీషు వచనానువాదము చేశారు. ఈ గ్రంథములో మూల సంస్కృత శ్లోకములు దేవనాగరి లిపిలోను, రోమన్ ట్రాన్స్‌లిటరేషన్‌లోను ఇవ్వబడినాయి. శ్లోకములకు భావము, విశేషాంశములు ఇంగ్లీషులో వివరించబడినాయి. ఈ గ్రంథమునకు అనుబంధముగా తొండరడిప్పొడి ఆళ్వారు (విప్రనారాయణుడు) తమిళములో రచించిన తిరుప్పళి యెళుచ్చికి డా॥ కె.సి.వరదాచారి రచించిన ఇంగ్లీషు అనువాదము ఇవ్వబడింది. (ఈ వ్యాసము శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థ (తిరుపతి) జర్నల్‌లో 7-2-1946 ప్రచురించ బడియున్నది) ఈ గ్రంథమును అడయార్ గ్రంథాలయం పరిశోధనా సంస్థ ప్రకటించింది.

సుప్రభాతములోని ప్రథమ శ్లోకము Dear Rama! Kousalyadevi is a blessed mother, blessed in having you as her son; the morning twilight has already set in. You, the best among humans, please rise, because the divine and other daily duties need to be performed in time-before it is too late అని అనువదింపబడింది. భాస్వానుదేతి (26) శ్లోకము. The sun is rising,



lotuses are blooming; birds are filling the different directions with their calls. The Vaishnavas desiring the good are at your temple. Oh! Lord} we offer our morning salutations to you; please rise and look after us. అని వేంకటాచార్య ఆంగ్లీకరించారు.

స్తోత్రములో ప్రథమ శ్లోకభావము you are the saviour of all (lokapate), you have beautiful eyes, wide and large, like the petals of a lotus (kamalayatalocana) your body is bluish in colour, but appears constantly reddened by the kumkum on the bosom of Lakshmi Devi. Oh! Lord of Venkatachala, we pray for your victory (Vijayibhava) అని ఇంగ్లీషు వచనములో తెలుపబడింది. శ్రీవేంకటేశ్వర ప్రపత్తిలోని మొదటి శ్లోకము Salutations to Goddess Lakshmi Devi, Jaganmata (the mother of the Universe), most beloved of Lord Narayana, (Param preyasim) the ruler, the divine queen (isanam Jagatah). Stationed permanently in the heart of the Lord (tadvaksthala nitya vasa rasikam) she encourages and increases the sympathetic attitude of teh Lord towards the devotee (tatkshanti samvardhanim) అని ఇంగ్లీషులో అనువదించబడింది. విష్ణోపదే పరమ (10) అనుశ్లోక భావము.

The great glory of the feet of Lord Vishnu is proclaimed in the Vedas. There the feet are described as the in comparable source of a unique blissful (bhagyataya) experience. THe description is confirmed atgain now by means of his right palm gesturing down in that directrion. The position of the righthand is a kind of Varada hasta, a type of saranadarsna mudra, a unique feature seen only in the vigraha of Lord Venkateswara

to those unique feet, the author expresses his complete surrender.

శ్రీవేంకటేశ మంగళాశాసనములోని ప్రారంభ శ్లోకభావమును you are the consort of the divine Lakshmi Devi, you are the treasure trove (nidhi) of the best virtue (kalyana guna), you are also the wish-yielding tree (kalpa vrksha) to all devotees. You have chosen to stay on the Venkatadri to facilitate the devotional activities. For looking after devotees, Lakshmi Devi gives a helping hand and is ever present with you. To you Srinivasa we make our devotional offering అని వేంకటాచార్య ఇంగ్లీషులో వివరించారు. శ్రీ వైకుంఠ విరక్తాయ (12) అను శ్లోక భావమును ఇట్లు ఇంగ్లీషులో వివరించబడింది.

Lord Venkateswara found Venkatachala most delightful and pleasing place than vaikuntha, his normal place of residence. And he sports gracefully with his divine consort, Lakshmi Devi (Ramaya ramamanaya) on the banks of sacred pond known as swami pushkarini; May auspiciousness be to Sri Venkatesa.

### 7. టి.వి.అనంతరామశేషన్ హెలన్స్‌భర్గు వేంకటేశ్వర సుప్రభాతము

ఆస్ట్రేలియా దేశంలోని సిడ్నీ నగరం శివారులో నున్న హేలన్స్‌భర్గులో భారతీయులచే ప్రతిష్ఠింపబడిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రభాతసేవకు అనుగుణమైన వేంకటేశ్వర సుప్రభాత స్తోత్రములను సంస్కృతంలో టి.వి.అనంతరామశేషన్ అనుసృజన చేసినాడు. ఈ గ్రంథములో (1) సుప్రభాతము 11 శ్లోకములు (2) ప్రపత్తి 11 శ్లోకములు (3) వేంకటేశ్వర శరణం 11 శ్లోకములు (4) మంగళాశాసనం 11 శ్లోకములు గల్గి మొత్తం 44 సంస్కృత శ్లోకములు వున్నాయి.



**శ్రీ శ్రీనివాసభగవన్ కురు సుప్రభాతమ్** అను మకుటముతో సుప్రభాతం ప్రారంభమైంది. (2) **సిడ్నీ పత్తన భాగ్యదాయక వేంకటేశ్వర మాశ్రయే** అని ప్రపత్తి మకుటం వుంది. (3) **శ్రీవేంకటేశం శరణం ప్రజామి** అను మకుటముతో శరణు పద్యాలు వున్నాయి. (4) **సిడ్నీ పత్తన నివాసాయ వేంకటేశాయ మంగళమ్** అను మకుటముతో మంగళ పద్యాలు వున్నాయి.

ఈ స్తోత్ర గ్రంథములో సంస్కృత శ్లోకములు నాగరి లిపిలోను, రోమన్ లిపిలోను (ఇంగ్లీషు ట్రాన్స్‌క్రిప్షన్) గలవు. శ్లోకములకు భావము ఇంగ్లీషులో వుంది. పిమ్మట తమిళ లిపిలో శ్లోకములు, వాటికి భావము సమకూర్చబడింది.

* * *

## 5. సచిత్ర వేంకటేశ సుప్రభాతములు

### 24. అజ్ఞాత కవి, అజ్ఞాత చిత్రకారుడు

బొమ్మల వేంకటేశ్వర సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి అనువాటికి భావము, అందుకు తగిన బొమ్మలు గలిగిన పుస్తకాన్ని చుక్కల శింగయ్య చెట్టి ప్రచురణ సంస్థ ప్రచురించింది. ఇందు కౌసల్యా సుప్రజా రామ అను శ్లోకమునకు "కౌసల్యాదేవి సంతానమైన ఓ శ్రీరామా! తూర్పున సూర్యుడు ఉదయించుచున్నాడు. దేవపూజ నిత్యకృత్యములు చేయవలయును. పురుషోత్తమా! నిద్ర మేల్కొనుము" అని భావము వ్రాయబడింది. ఈ గ్రంథమున తాత్పర్య రచయిత, బొమ్మల చిత్రకారుల పేర్లు లేవు. ఇందుకు ప్రచురణ కర్తలు గర్హ్యనీయులు.

సుప్రభాతములోని భాస్వానుదేతి (26) అను శ్లోకమునకు "ఓ వేంకటా–చలపతీ! సూర్యుడు ఉదయించుచున్నాడు. పుష్పములు వికసించుచున్నవి. పక్షులు కలకల శబ్దములతో నలుదిక్కులు నింపుచున్నవి. శ్రీ వైష్ణవులు

మంగళముల గోరుచూ నీ సన్నిధిలో వేచియున్నారు. స్వామీ నీకు సుప్రభాతమగు గాక!" అని భావము వివరించబడింది.

స్తోత్రములోని ప్రథమ శ్లోకమునకు "ఓ వేంకటాచలపతీ! శ్రీదేవి, చనుమొనల కుంకుమ పూతవలన నెర్రనైన నీలమేఘము శరీరము గలవాడా! తామరేకులాంటి కన్నులు కలవాడా! ఓ జగన్నాయకా! నీకు జయము జయము" అని భావము చెప్పబడింది.

ప్రపత్తిలోని ప్రారంభ శ్లోకమునకు "సమస్త లోకాలకు తల్లివైన ఓ లక్ష్మీదేవీ, శ్రీ విష్ణుమూర్తియైన వేంకటాచలపతికి మిక్కిలి ప్రియురాలును, అతని విశాల వక్షః స్థలమున విహరిస్తూ, అతని సహన శక్తిని యెక్కువ చేయుచున్నావు. మృదువైన చేతులలో తామర పుష్పములు వుంచుకొని, పద్మములో కూర్చున్న ఓ లక్ష్మీ స్వరూపిణి! జగన్మాతా! నీకు నేను నమస్కరించుచున్నాను అని తాత్పర్యము రచింపబడింది.

ప్రపత్తిలోని విష్ణోః పదే పరమ (10) అను శ్లోకమునకు "వేంకటాద్రి నాయకా! సకల వేదశాస్త్రాలలోను విష్ణువు యొక్క మహోన్నత స్థానమనియు, తేనె వూటలాంటిదని, సకల వేదశాస్త్రాలు కీర్తించాయి. మీరున్నూ యథార్థమని చేతితో చూపుచున్నారు. అనాథరక్షకా! నీ పాదపద్మములే నాకు శరణు" అని తాత్పర్యము చెప్పబడింది.

ఈ గ్రంథములో శ్రీ వేంకటేశ మంగళాశాసనము మూలశ్లోకములు గలవు. వీటికి బొమ్మలు లేవు.

## 25. డి.ఎన్. దీక్షిత్, నీలివేంకట రమణ

డి.ఎన్.దీక్షిత్ వ్యాఖ్యానముతో నీలి వేంకటరమణ రచించిన భావస్ఫోరక రంగుల చిత్రములతో **"సచిత్ర శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములు** ప్రచురింపబడినవి. సుప్రభాతమందలి ప్రారంభ శ్లోకమునకు "కౌసల్యా దేవియొక్క ఉత్తమ సంతానమైన శ్రీరామా! తొలి సంధ్య అగుచున్నది. నిత్యకృత్యమైన దేవపూజ చేయవలయును. పురుషోత్తమా! మేల్కొనవయ్యా!" అని తాత్పర్యమును దీక్షిత్ వ్రాశారు.



భాస్వానుదేతి (26) అను శ్లోకమునకు "వేం= పాపాలను, కట= దహించు స్వామీ! సూర్యుడు ఉదయిస్తున్నాడు. తామరపువ్వులు వికసిస్తున్నవి. పక్షులు కలకల ధ్వనులతో దిక్కులు నింపుతున్నవి. ఎల్లప్పుడు మంగళమును కోరు శ్రీ విష్ణుభక్తులు నీ సన్నిధిని చేరియున్నారు. శ్రీనివాసప్రభూ! నీకు సుప్రభాతమగుగాక!" అని తాత్పర్యం వ్రాయబడింది.

స్తోత్రములోని ప్రథమ శ్లోకమునకు "ఓ వేంకటాధీశా! లక్ష్మీదేవి చనుమొనల కుంకుమపూత వలన ఎర్రనైన, సాటిలేని నల్లని దేహకాంతి కలవాడా! తామరరేకుల వంటి కన్నులు కలవాడా! లోకనాయకా! శ్రీనివాసా! నీకు జయము జయము" అని భావము చెప్పబడింది.

ప్రపత్తిలోని మొదటి శ్లోకమునకు "ఈ జగత్తునకు ఈశ్వరి, శ్రీ విష్ణుస్వరూపుడైన వేంకటాచలపతికి మిక్కిలి ప్రియురాలు, ఆయన వక్షః స్థలమందు నిత్యవిహారముచే ఆనందించునది. అతని సహనశక్తిని వర్ధిల్లజేయునది. మృదువైన రెండు చేతులలో పద్మములను అలంకారములుగా ధరించునది. పద్మమునందు కూర్చుండునది, వాత్సల్యము మున్నగు గుణములచే ప్రకాశించునది, ఐశ్వర్యయుక్త, జగన్మాత అయిన శ్రీమాతకు నమస్కరిస్తున్నాను" అని తాత్పర్యం రచింపబడింది.

విష్ణో పదే పరమ (10) అను శ్లోకమునకు ఓ వేంకటేశా! "విష్ణువు యొక్క పాదములు సర్వోన్నతములు" అని వేద శాస్త్రములచే ప్రశంసింప బడినవి. తేనె ఊటవలె అనుభవైక వేద్యములని కీర్తింపబడినవి. అది

యథార్థమే అన్నట్లు నీ అరిచేతితో చూపబడునవి అయిన నీ పాదములను శరణు వేడుతున్నాను" అని దీక్షిత్ తాత్పర్యమును రచించారు.

శ్రీ వేంకటేశ మంగళాశాసనమునకు చిత్రములు రచింపబడలేదు. మూలము మాత్రము ఇవ్వబడింది. సుప్రభాత, స్తోత్ర, ప్రపత్తులకు సరళంగా తాత్పర్యము, భావమునకు తగిన వర్ణచిత్రాలు ఉన్నాయి ఈ గ్రంథములో. దీనికిముందు శ్రీ వేంకటేశ సుప్రభాతము, స్తోత్రము ప్రపత్తియందు గల శ్లోకములకు, వాటి భావములకు తగిన చిత్రపటములను శ్రీధరస్వామి రంగులలో కనువిందు అయ్యేటట్లు రచించారు. ఇవి తెలుగు వ్యాఖ్యానముతో స్లైడ్లుగా మార్చి ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడినవి.

శ్రీ వేంకటేశ సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనములు నాల్గింటి యందున్న శ్లోకములకు టి.ఏ. కృష్ణమాచార్యులు సరళమైన, ప్రామాణికమైన సంప్రదాయానుగుణమైన వ్యాఖ్యానమును తమిళంలో రచించారు. ఈ తమిళ వ్యాఖ్యానమును ఈ.ఏ. సింగరాచార్యులు తెనిగించారు. వీరి తెలుగు అనువాదము, తమిళమూలము (తెలుగు లిపిలో) రెండూ **'శ్రీ వేంకటేశ స్తోత్రలహరి'** అను గ్రంథముగా (2007) ప్రచురించ బడింది.

శ్రీ వేంకటేశ సుప్రభాతమునకు (సంపూర్ణము) శ్రీనివాస రాఘవాచారియర్ తమిళములో భావము రచించారు. సంస్కృత సుప్రభాతమునకు కె. అప్పణ్ణాచార్య కన్నడములో తాత్పర్యము రచించారు. సుప్రభాత సంస్కృత శ్లోకములకు ముట్నూరి సంగమేశం హిందీలో తాత్పర్యము రచించారు. వీటిని తి.తి. దేవస్థానం ప్రచురించింది.

* * *



# 6. జానపద గేయాలలో సుప్రభాతం

శిష్టసాహిత్యం ఏవిధంగా సుప్రభాతం అనువాదాలు వచ్చాయో అట్లాగే జానపదులు కూడ వేంకటేశ్వరుని భక్తితో మేలుకొలుపులు పాడినారు. మచ్చుకు ఒక జానపద గేయం అజ్ఞాత కవి పలికింది.

జానపదులు శ్రీ వేంకటేశ్వర స్వామిని ఇలా మేలుకొలిపినారు.

**మేలుకో శ్రీరంగానాథా దయనిధే**
**మేఘశ్యామల వర్ణ మేలుకో**
**తూరుపు దిక్కున సూర్యుడు ఉదయించే**
**స్వామి వేంకటరమణా మేలుకో**
**కస్తూరి కల్లాపు చల్లేటి వేళాయె**
**కస్తూరి రంగయ్య మేలుకో**
**తెల్లతెల్లవారా వెలబోయే దీపాలు**
**ఏడుకొండలవాడా మేలుకో**
**కార్వేటి నగరాన రణభేరి వాయించే**
**అయ్యా వేంకటరమణా మేలుకో**
**గాలిగోపురము కాడ ఘోషాయె గుంపులు**
**వడ్డీ తెస్తున్నారు మేలుకో**
**అత్తారు పన్నీరు పునుగు జవాదీతోడ**
**ముడుపు తెస్తున్నారు మేలుకో**
**తుంబూర నారదులు తంబూర మీటేరు**
**వడ్డికాసులవాడా మేలుకో**

ఈ విధంగా జానపదులు శ్రీ వేంకటేశ్వర స్వామిని మేల్కొలిపే వారు. ఇందువారి ముగ్ధభక్తి వెల్లడియగుచున్నది. ఈ మేల్కొలుపులో శిష్ట సాహిత్యమునకు అనుకరణ కనిపించుచున్నది. ఇది సంస్కృత సుప్రభాతమునకు అనువాదముగా లేదు అను సృజన రచనగా వుంది.

* * *

## 7. తిరుప్పళ్ళి యెళుచ్చి – ప్రాబోధకీ స్తుతి

ప్రతివాది భయంకర అణ్ణన్ (కృష్ణమాచార్యులు క్రీ.శ.1361–1454) సంస్కృత సుప్రభాతమును రచించుటకు ముందు తిరుమల శ్రీవేంకటేశ్వ రాలయములో ప్రభాత సేవలో విప్రనారాయణుడు (తొండరడిప్పొడి యాళ్వారు) రచించిన శ్రీరంగనాథుని సుప్రభాతమును (తిరుప్పళి యెళుచ్చి) పది పాశురములను పఠించేవారు. శ్రీరంగముపై తురుష్కుల దండయాత్ర (1310–1320) కారణముగ శ్రీరంగనాథుని ఉత్సవమూర్తి ప్రవాసియై కొంతకాలము (1320–1360 AD) తిరుమలలో నుండుట ఇందుకు కారణము. ఈ తమిళ శ్రీరంగనాథ సుప్రభాతమునకు తెలుగు అనువాదము ఇట్లున్నది.

**పాశురము – 1**

సూర్యుడు తూర్పుదిక్కున ఉదయ పర్వతముపై చేరినాడు. దట్టమైన చీకటి విడిపోవుచున్నది. ఆరాధనకు తగియున్న ప్రాతఃకాలము వచ్చింది. పెద్ద పెద్ద పుష్పములన్నియు వికసించి, మకరందమును కార్చుచున్నవి. దేవతలు, రాజులు గుంపులుగావచ్చి నీ కృపాకటాక్షమునకై ఎదురుచూచుచు నిలిచియున్నారు. వీరితోపాటు వచ్చిన ఏనుగుల ఘీంకారము, భేరీవాద్యముల ధ్వనులు అలలతో ఘోషించుచున్న సముద్రపు ఘోషలవలె ఉన్నవి. ఓ రంగనాథ స్వామీ! పడకనుండి లేచి మమ్ము కటాక్షింపుము.

**పాశురము – 2**

మల్లెపూదోటల నుండి ఆ పూలవాసనలను మోసుకొని చల్లని పిల్లగాలులు తూర్పుదిక్కు నుండి వీచుచున్నవి. పూలపానుపు అను పడకపై సుఖముగా నిదురించిన హంస దంపతులు చల్లని మంచుచే తడిసిన తమ రెక్కలను దులుపుకొని మేల్కొన్నవి. గుహవలె నున్న తెరచిన మొసలి పెద్ద నోటిలోని తెల్లని కోరలతో కొరకగా, ఆ విషముచే బాధ పడుచున్న గజేంద్రుని దుఃఖమును పోగొట్టిన ఓ రంగనాథా! మేల్కొనుము.



**పాశురము – 3**

సూర్యకిరణములు దిక్కులంతటా వ్యాపించినవి. రాత్రి అంతా ఆకాశమున ప్రకాశించిన నక్షత్రములు కాంతివిహీనములయినవి. విస్తృత కాంతి గల్గియున్న చంద్రుడు కూడ వెలవెల పోయినాడు. రాత్రి వ్యాపించిన చీకటి తొలగిపోయింది. తోటలలో గల పోకచెట్ల మట్టలు విప్పారగా, వాటిలోని పోక కాయలగుత్తుల సువాసనలు గలిగి మందమారుతము వీచుచున్నది. తేజోమయమైన చక్రాయుధమును ధరించి యున్న ఓ రంగనాథా! మేలుకొనుము.

**పాశురము – 4**

లేత వయస్సుగల పశువులను మేతకై పచ్చిక బీడులకు తోలుకు పోవుచున్న గొల్లలు ఊదుచున్న పిల్లనగ్రోవి ధ్వనులు, కోడెల మెడలో కట్టిన గంటల ధ్వనులు కలిసిపోయి మధుర సంగీతము వలె నలుదిక్కుల వ్యాపించుచున్నది. చిన్నమడుగులలో గల తామరపూవులలో మధుపానము చేయుచున్న తుమ్మెద గుంపులు ఝుంకార ధ్వనులు చేయుచు లేచిపోవు చున్నవి. లంకలోని రాక్షసుల నందరిని సంహరించిన కోదండమును ధరించిన దేవాధిదేవుడా! విశ్వామిత్ర మహర్షి యాగమును కాపాడి అవభృధ స్నానము చేయించిన మహాపరాక్రమశాలి యగు అయోధ్యా రాముడవై యుండిన మా స్వామీ రంగనాథా! యోగనిద్ర నుండి మేల్కొనుము.

**పాశురము – 5**

పూలతోటలలో నున్న పక్షులు కూడ మేల్కొన్నవి. చీకటి రాత్రి పూర్తిగా తొలగిపోయింది. ఆరాధనా యోగ్యమైన సమయం వచ్చింది. తూర్పు సముద్రపు ఘోష వినబడుచున్నది. మధుపానముచే తృప్తి పొందిన తుమ్మెదలు ఝుంకారము చేయుచుండగా పలురకములయిన పూలతో కూర్చబడిన

తోమాలలను (పూదండలను) చేతబూని దేవతలు మీ పాదపద్మములను పూజించుటకు వచ్చియున్నారు. కావున లంకాధిపతియగు విభీషణుడు నిత్యము సేవించునట్టి శ్రీరంగమందలి మా స్వామి యగు రంగనాథా! మేల్కొనుము.

**పాశురము – 6**

ప్రకాశవంతమైన రథములలో ద్వాదశాదిత్యులు, లోకపాలకులు, వృషభ వాహనులయిన ఏకాదశ రుద్రులు, నెమలి వాహనముగా గల షణ్ముఖుడు, నలభై తొమ్మిది మంది మరుత్తులు, అష్ట వసువులు, అహమహమికతో వచ్చి గుమిగూడియున్నారు. వీరి వాహనములైన అశ్వములు, వృషభములు, రథములు, ఆడుచు పాడుచు కుమారస్వామితో వచ్చిన దేవసైన్యము మేరు పర్వతమును పోలియున్న నీ దేవాలయమునకెదురుగా నిలిచియున్నారు. ఓ రంగనాథా! మేల్కొనుము.

**పాశురము – 7**

మా స్వామివగు రంగనాథా! నీ ఆలయ ప్రాంగణమున ఇంద్రుడు ఐరావతముతో వచ్చినాడు. బ్రహ్మాండములోని దేవతలందరు సపరివారముగా వచ్చియున్నారు. సనకాదిమునులు, మరుద్గణములు, గంధర్వులు, విద్యాధరులు, యక్షులు, వచ్చి నీపాదసేవకై తొందరపడుచున్నారు. ఆకాశమందు, భూమిపై కొంచము కూడ చోటులేదు. ఓ రంగనాథా! మేల్కొనుము, కటాక్షింపుము.

**పాశురము – 8**

నీకు సమర్పించుటకై భక్తులు మంచి సువాసన గల వట్టి వేళ్ళను, శంఖ, పద్మాది నిధులను, దేవతలు కపిలధేనువు, నిలువుటద్దము మొదలైన మంగళకరమగు వస్తువులను మా స్వామివగు నీవు కన్నులు తెరచినంతనే



చూచుటకై తీసుకొని వచ్చియున్నారు. మహర్షులు, తుంబురునారదులు వచ్చియున్నారు. సూర్యుడు తన తేజస్సును సంపూర్తిగా వ్యాపింపజేసి ప్రకాశించుచున్నాడు. చీకటి ఆకాశమునుండి పూర్తిగా తొలగిపోయింది. ఓ రంగనాథా! యోగనిద్ర చాలించి మేల్కొనుము.

**పాశురము – 9**

సలక్షణమైన చిన్నపటహ వాద్యములు, ఒంటితీగ గల వాద్యము, మృదంగము, వీణ, వేణువు ధ్వనులు అన్ని దిక్కులా వ్యాపించినవి. వీటి ధ్వనులతోపాటు కిన్నరులు, గరుడులు పాటలు పాడుచున్నారు. రాత్రినుండి మహర్షులు, దేవతలు, చారణులు, యక్షులు, సిద్ధులు నీ పాదసేవకై ప్రతీక్షించుచున్నారు. కనుక వారికి నీ విశ్వరూపదర్శనము అనుగ్రహించుటకై ఓ రంగనాథా మేల్కొనుము.

**పాశురము – 10**

కావేరీ నది పరివేష్టితమైన ఓ రంగనాథా! సుగంధము గల్గిన తామర పుష్పములు బాగుగా వికసించినవి. సూర్యుడు సముద్రము నుండి ఉదయించి పర్వత శిఖరము చేరినాడు. డమరుకమువలె సన్నని నడుము గల స్త్రీలు తడిసిన వెంట్రుకలు గల తమ కొప్పులను పిండి విదిలించుకొని తడి వస్త్రముల్ ధరించి నదిలో నుండి యొడ్డునకు వచ్చినారు. నీకు అర్పింపదగి నట్లు కూర్చిన తులసి మాలలు గల బుట్టలతో శోభించుచున్న భుజములు గల భక్తాంఘ్రిరేణుదాసుడైన (తొండరడిప్పొడి) నన్ను యోగ్యుడైనవాడు అని దయచూపి నీ దాసులకు దాసునిగా చేయుటకు స్వామీ యోగనిద్ర చాలించి మేల్కొనుము.

తాళ్ళపాక అన్నమాచార్యుల మనుమడు, పెదతిరుమలాచార్యుల నాల్గవ కుమారుడు అయిన తిరువేంగళనాథుడు (చిన్నన్న) చిన్నన్న పరమయోగి విలాసములో తిరుప్పళ్ళి యెళుచ్చిని తెనిగించినాడు.

## ప్రాబోధకీ స్తుతి

ప్రొద్దుసారథిపొడుపులచాయ లెసఁగఁ
దద్దయుఁ బ్రేమనత్తటి నేగుదెంచి
యలపరాంకుశముఖ్యు లగుయోగివర్యు
లలరి గోదాయుక్తుఁ డగురంగవిభుని
సొరిదిఁ బ్రాబోధకీస్తుతిఁ బాడఁదొడఁగి
రరుణబింబం బుదయాద్రిమై నిలిచెఁ
బలపల వేగి వీడ్వడ మబ్బు లడఁగె
నలరుచుఁ బూదేనియలసోన గురిసెఁ
బాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 1

ములముల వికసించు మొల్లక్రొన్ననల
వలపులఁ దూర్పువీవలు లెచ్చరింప
మంచుగుబ్బలుల వేమరును గేలించు
నించురెక్కల మించులెసఁగ జాడించి
నెత్తావియిండ్లలో నిదురించుచున్న
మత్తహంసలు నంచమగలు మేల్కనిరి
పాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 2

చుక్కలరుచి డొంకె సోముండు గ్రుంకె
దిక్కులరవికాంతి దీండ్రింపఁ దొడఁగెఁ
బోఁకపూబాళల బొదిగొన్న తావి
సోఁకులవలిగాలి సొలయంగఁ దొడఁగెఁ
బాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి మేల్కనవె. 3



వ్రేపల్లె గోవుల వేణునాదంబు
లేపారె రవళించి వృషభసంతతుల
గాటంపు మేతల గబ్బులు మీఱెఁ
దేఁటిదాఁటులమ్రోఁత దెసలఁ బెల్లొదవెఁ
బాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కొనవె. 4

రాత్రి దొలంగె నారామభూజములఁ
బత్రులు వికసితపత్రంబు లయ్యె
నలరె నంబుధిఘోష మమరబృందంబు
దళుకొత్తు పెక్కుపూదండకానుకలు
పూని నీపదపద్మములసేవఁ గోరి
యూనినవేడ్కతో నున్నారు వీరిఁ
బాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 5

తేరులనిలిచి యాదిత్యవర్గంబు
లారూఢవృషభేంద్రు లై పశుపతులు
కమనీయశిఖి నెక్కి కార్తికేయుండు
నమరులఁగూడి నృత్యములు సేయుచును
వినుతించి నిన్ను సేవింప నీవేళఁ
జనుదెంచి నీదుమోసలనున్న వారు
పాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 6

యమర గంధర్వ విద్యాధర దైత్య
సముదయయుక్తుఁడై సంక్రందనుండు

కరి నెక్కి ఘనమునిగణమును దాను
దొరసి ద్వారమునఁ దోదోపులాడెదరు
పాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 7

నిధులు నంబుధులును నిర్జర కపిల
బుధులు నచ్చరలుఁ దుంబురునారదులును
మునులు నీముందర మొనసియున్నారు
వనజాప్తుకాంతి తీవలువాఱె దెసలఁ
బాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 8

కరమర్థిఁ గిన్నర గరుడ సిద్ధాదు
లరిది మృదంగవీణాదివాద్యముల
సరవిమై నీమీఁది సంకీర్తనములు
పరిపరిలాగులఁ బాడుచున్నారు
పాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 9

తమ్ములు వికసించె దరణియుం బొడమెఁ
గొమ్మలు పసపాడి కోరి నీరాడి
కట్టిరి పుట్టముల్ కావేరినడుమఁ
బుట్టక పుట్టిన పూసెజ్జ నున్న
నీలనీరదవర్ణ! నీ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె. 10

శ్రీరంగనాథుఁ బూజింపంగవలసి
పూరించియున్న యీపూలకరఁడి



నందంబుగాఁగ భుజాంతరసీమ
యందుఁగైకొన్నభక్తాంఘ్రిరేణుండు
గావించె నీదశగాథలచేత
భూవినుతముగఁ బ్రాబోధకీకృతిని

* * *

## 8. అన్నమయ్య మేలుకొలుపు సంకీర్తనలు

తాళ్ళపాక అన్నమాచార్యులు వేంకటేశ్వర స్వామిని మేలుకొలుపుతు కొన్ని సంకీర్తనలు రచించాడు అని సంపూర్తిగా సంస్కృత సుప్రభాతమునకు అనువాదములు గావు. స్వతంత్రములు. శృంగారరసమయములు.

ఎందాక నిద్ర నీకిదె తెల్లవారగదే
యిందిరా రమణ నీ విటు మేలుకొనవే ॥పల్లవి॥

కమలనాభుడ నీకు గంగాదినదులెల్ల
నమర మొకమజ్జనం బాయితము సేసె
తమితోడ గనకాద్రి తానె సింహాసనము
విమలమై యొప్పె నదే విచ్చేయవే ॥ఎందా॥

హరినీకు నజుడు పంచాంగంబు వినిపించ
నిరతమగు వాకిటను నిలిచినాడు
సురలు నీ యవసరము చూచుకొని కొలువుకూటమున
సరవి నా ఇత్తపడి సందడించేరు ॥ఎందా॥

కామధేనువు వచ్చె కనుగొనుటకై నీకు
శ్రీ మహాదేవి నీ చేలాగు కదివో
యీ మహిమ శ్రీ వేంకటేశ నీకే చెల్లె
కామించి యన్నియును గైకొంటి విపుడు ॥ఎందా॥

– అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 2,
సంకీర్తన 436 (1998)

హరికృష్ణ మేలకొను ఆదిపురుషా
తరవాత నా మోము తప్పకిటు చూడ ॥పల్లవి॥

మేలుకొను నాయన్న మెల్లనే నీ తోడి
బాలులదె పిలిచేరు బడినాడను
చాలునిక నిద్దురలు చద్దికూళ్ళ పొద్దు
వేళాయె నా తండ్రి వేగ లేవే ॥ ॥హరి॥

కనుదెరవు నా తండ్రి కమలాప్తుడుదయించె
వనిత మొకమజ్జనము వడిదెచ్చెను
మొనసి మీ తండ్రి యిదె ముద్దాడ జెలగీని
దనుజాంతకుండయిక దగ మేలుకోవే ॥హరి॥

లేవె నా తండ్రి నీ లీలలటు వొగడేరు
శ్రీ వేంకటాద్రిపతి శ్రీ రమణుడా
దేవతలు మునులు జెందిన నారదాదులు
ఆవలను బాడేరు ఆకసమునందు ॥హరి॥

**- ఆధ్యాత్మ సంకీర్తనలు, సం॥ 3-543**

మిన్నక వేసాలు మాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగనిద్ర చాలు మేలుకోవయ్యా ॥పల్లవి॥

ఆవులు పేయలకుగా నరచీ బిదుకవలె
గోవిందుడ యింక మేలుకోవయ్యా
ఆవలీవలి పడుచులాటలు మరిగి వచ్చి
త్రోవగాచుకున్నారిదే మేలుకోవయ్యా ॥మిన్న॥

వాడల గోపికలెల్ల వచ్చి నిన్ను ముద్దాడ
గూడియున్నారిదే మేలుకోవయ్యా
తోడనే యశోద గిన్నెతో బెరుగు వంటకము
యీడకు దెచ్చిపెట్టె నిక మేలుకోవయ్యా ॥మిన్న॥



పిలిచీ నంద గోపుడు పేరుకొని యదె కన్ను
గొలకులు విచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీ వేంకటాద్రి మీది బాలకృష్ణ
యిల మా మాటలు వింటివిక మేలుకోవయ్యా ॥మిన్న॥

**- ఆధ్యాత్మ సంకీర్తనలు, 1-374**

తల్లి ఉదయముననే కుమారునకు పెరుగు వంటకములను తినబెట్టుట శ్రీనాథుడు (క్రీ.శ. 1370-1480) కాశీఖండములో గుణనిధి కథలో వర్ణించియున్నాడు.

చ. అరుణ గభస్తి బింబముదయాద్రిపయిం బొడతేర గిన్నెలో
చెరుగును వంటకంబు వడపిందియలుం గుడువంగ బెట్టుని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే?
హరహర యెవ్వరింక గడుపారఁగఁ బెట్టెద రీప్సితాన్నముల్ ॥

**- కాశీఖండం, 4-114**

తాళ్ళపాక అన్నమాచార్యుల (క్రీ.శ. 1408-1503) సంకీర్తన పై శ్రీనాథుని పద్యమును జ్ఞాపకము చేస్తున్నది.

రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో
రీతిగాదు హరి నెచ్చరికె సేయరే ॥పల్లవి॥

పైపై బొద్దు వొడచి పంకజములు విరిసె
గోపగోవిందుని మేలుకొను మనరె
దీపములు దెల్లబారె తిమిరమింతయు జారె
శ్రీ పురుషోత్తముని జేయంటి లెమ్మనరె ॥ ॥రాతి॥

కలువలు ముకుళించీ కలవింక లెలుగించీ
నెలతలు దేవదేవు నిద్ర దెల్పరే
జలనిధి పొంగణగె చాయల చుక్కలు మాసె
వలరాచగురు నుప్పవడము గమ్మనరే ॥ ॥రాతి॥

జీవులు మేలుకొనిరి చెంగలించె దరువులు
భావించి యచ్యుతు నిట్టె పలికించరె
కావిరింతయు విరిసె కదుసంధ్యకు బొద్దాయ
శ్రీ వేంకటేశుని విచ్చేయు మనరే ॥ ॥రాతి॥

- ఆధ్యాత్మ సంకీర్తనలు, 4-130

పై సంకీర్తనలో అన్నమాచార్యులు శ్రీ వేంకటేశుడు అధికంగా నిద్రపోవడానికి కారణంగా సతుల తోడి సంభోగ శ్రమగా చెప్పడం వారి శృంగారదృష్టిని వెల్లడించుచున్నది. శృంగార రసమునకు అధిపతి శ్రీనివాసుడే గదా! వారి భక్తుడు అన్నమయ్య.

విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా ॥పల్లవి॥

తెల్లవారె జామెక్కె దేవతలు మునులు
అల్లనల్లనంతనింత నదివో వారె
చల్లని తమ్మిరేకుల సారస్యపు గన్నులు
మెల్ల మెల్లనె విచ్చి మేలుకొన వేలయ్యా ॥ ॥విన్న॥
గరుడ కిన్నరయక్ష కామినులు గములై
విరహపు గీతముల వింత తాళాల
పరిపరివిధములం బాడేరు రాగాల నిన్నదివో
సిరిమొగము దెరచి చిత్తగించవేలయ్యా ॥ ॥విన్న॥

పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు
పంకజభవాదులు నీ పాదాలు చేరి
అంకెలనున్నారు లేచి అలమేలు మంగను
వేంకటేశుడా రెప్పలు విచ్చి చూచి లేవయ్యా ॥ ॥విన్న॥

-శృంగార సంకీర్తనలు, 6-25



పొలయలుక నిద్దరలు భోగించ దొరకొంటి
అలర వడి మేల్కొనవె అఖిలేశ్వర! ॥పల్లవి॥

తరుణిమైనపుడె పరితాపసూర్యుడు వొడిచె
వరుసజెలి కన్ను గలువలు మొగిచెను
మరుని సాయకపు తామరలు వికసించె
కరుణతో మేల్కొనవె కమలేశ్వర ॥ ॥పొల॥

కాంత నిట్టూర్పులను గాలియును నగ్నియును
వంత చెమటల వాన వరుణుండును
వింతలుగ నిన్ను సేవింతుమని యున్నారు
పంతమున మేల్కొనవె పరమేశ్వర ॥ ॥పొల॥

మెలత పెనుదురుమనెడి మేఘ మండలములో
నలుగడల జెలగె సుమనస పంక్తులు
కులికి పూవులవాన గురియంగ నున్న దిదే
చలముడిగి మేల్కొనవె సర్వేశ్వర ॥ ॥పొల॥

కదిసి పులకల సృష్టి కదలేక పొదమించు
మదనుడను మానస కమల భవుడును
ముదిత కోపపు హరుడు మొనసి యున్నారిదే
నిదుర మేల్కొనవె జలధి శయనుడ ॥ ॥పొల॥

ఒడికముగ జెలిలోన నుదయ రాగము వొడమె
వెడలె నదె పలుకు గోవిల రవములు
పడతి గూడితివి రవి పరవశం బిక నైన
కడగి మేల్కొనవె వేంకట రమణుడ ॥పొల॥

- శృంగార సంకీర్తనలు, 6-175

**భోగి శయనమును బుసకొట్టెడిని**
**యోగ నిద్ర పాయును మేల్కొనవే ॥పల్లవి॥**

**కన్నులు దెరవక కమలబాంధవుడు**
**వెన్నెల రేణువు వెలయదిదే**
**అన్నున మలసీ నరుణోదయ మిదే**
**మిన్నక నీవిటు మేలుకొనవే ॥భోగి॥**

**తెల్లని కన్నులు దెరవక విరియగ**
**నొల్లక జలజములున్న వివే**
**కల్ల నిదుర నిను గవియగనియ్యక**
**మెల్లనాయ నిటు మేలుకొనవే ॥ ॥భోగి॥**

**తెరవగు రెప్పల దెల్లవారవలె**
**తెరవక చీకటి దీరదిదే**
**తెరగు వేంకటాధిప నీ వెఱుగుదు**
**మెరుగులు చల్లుచు మేలుకొనవే ॥ ॥భోగి॥**

అన్నమయ్య మేలుకొలుపు సంకీర్తనలలో సుప్రభాత స్తోత్ర లక్షణములు లేవు. కేవలము మేలుకొనవే అను ప్రార్థన వుంది.

**మేదిని జీవుల గావ మేలుకోవయ్యా**
**నీ దయే మాకెల్ల రక్ష నిద్ర మేలుకోవయ్యా ॥పల్లవి॥**

**తగు గోపికల కన్నుదామరలు వికసించ**
**మిగుల సూర్య నేత్రుడ మేలుకోవయ్యా**
**తెగువ రాక్షసులనే తిమిరము విరియగ**
**నెగడిన పరంజ్యోతి నిద్ర మేలుకోవయ్యా ॥మేది॥**

**ఘనదురితపు నల్లగలువలు వికసించ**
**మినుకు శశి నేత్రుడ మేలుకోవయ్యా**



**పనివడి వేదాలనే పక్షులెల్లా బలుకగ**
**జనకు యాశ్రిత పారిజాత మేలుకోవయ్యా ॥ ॥మేది॥**

**వరలక్ష్మీ కుచ చక్రవాకము లొండొంటిరాయ**
**మెరయు దోషారహిత మేలుకోవయ్యా**
**పొరసి నీవు నిత్యభోగములు భోగించ**
**నిరతి శ్రీ వేంకటేశ నేడు మేలుకోవయ్యా ॥ ॥మేది॥**

**– ఆధ్యాత్మిక సంకీర్తనలు, 1-377**

గోపికల కన్ను దామరలు వికసించుటకై సూర్యనేత్రుడైన వేంకటేశ్వరుని మేలుకొనుమని కోరుట, దురితములను (పాపములను) నల్లకలువలతో పోల్చుట అసామాన్యమైన ఊహలు. అన్నమాచార్యుల మేలుకొలుపు సంకీర్తనలన్నియు భూపాల రాగమున పాడదగియున్నవి. భూపాల రాగము ప్రభాత సమయమున పాడదగిన రాగము. ఇవి అన్నియు శృంగార రసభూయిష్ఠములుగా, రసగుళికలుగా ఉన్నవి. అన్నమయ్య భావవైచిత్రి పాఠకులను ఆశ్చర్యచకితులను చేయుచున్నది.

* * *

## 9. తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము

**శ్రీగురుం దర్థితో శేషాద్రియందు**
**యోగనిద్రాకేళి నున్న యత్తఱిని**
**వనజాసనాదిదేవత లేఁగుదెంచి**
**వినుతించి రప్పు డవ్విధ మెట్టిదనిన**
**శ్రీకర! వేంకటక్షితిధరావాస.**
**నాకేంద్రనుత రమానాథ మేల్కనుము**
**వసుదేవదేవకీ వరగర్భజాత**

కిసలయాధర రామ కృష్ణ మేల్కనుము
తపము పెంపున యశోదానందులకును
గృపతోడ శిశువైన కృష్ణ మేల్కనుము
పూతనా కైతవ స్ఫురితదుర్వార
చైతన్యహరణ ప్రశస్త మేల్కనుము
అతిముతి శకటాసురాంగంబు లీల
విఱుఁగఁదన్నిన యదువీర మేల్కనుము
సుడిగాలిరాకాసి స్రుక్కడంగించి
గెడపినకెదుబాలకృష్ణ మేల్కనుము
మద్దులఁగూల్చి యున్మద వృత్తి మెఱయు
ముద్దుల గోపాలమూర్తి మేల్కనుము
అద్రిరూపంబైన యఘదైత్యుఁ జంపి
రౌద్రంబు నెఱయు భూరమణ మేల్కనుము
ఆననంబునఁ దల్లి కఖిలలోకములు
పూని చూపిన యాదిపురుష మేల్కనుము
ఖరధేనుకాసురక్రకచ! మేల్కనుము
వరగర్వఘనబకవైరి! మేల్కనుము
చతురాననుఁడు వత్స సమితి నొంచినను
బ్రతియొనర్చిన పరబ్రహ్మ! మేల్కనుము
కాళియఫణిఫణాంగణ నృత్యరంగ
లాలితచరణవిలాస! మేల్కనుము
అతులకుబ్జామనోహరుఁడ! మేల్కనుము
చతురమాలాకారశరణ! మేల్కనుము
వనజాక్ష! యక్రూరవరద! మేల్కనుము



వినయ వాక్యోద్ధవవినుత! మేల్కనుము
భుజ విక్రమక్రమ స్ఫూర్తిమై భోజ
గజముఁ జంపిన బాహుగర్వ! మేల్కనుము
జెట్టిపోరను గిట్టి చీరి చాణూరు
చట్టలువాపిన శౌరి! మేల్కనుము
కురుసైన్యవిదళనాకుంఠితోత్సాహ
భరితపాండవపక్షపాత! మేల్కనుము
చండ భారతరణ చాతుర్య ధుర్య
గాండీవి సారథ్య కరణ! మేల్కనుము
బలభేది భేదించి పారిజాతంబు
నిలకుఁ దెచ్చిన జగదీశ! మేల్కనుము
బాణబాణాస నోద్భట భీమబాణ
పాణిఖండన! చక్రపాణి! మేల్కనుము
రాజసూయమున శూరతఁ జైద్యుఁ దునిమి
పూజలందిన జగత్పూజ్య! మేల్కనుము
మురనరకాసురముఖ్య దానవులఁ
బొరిగొన్న యదురాజ పుత్ర! మేల్కనుము
వీరకౌరవ సభ విశ్వరూపంబు
ధీరతఁజూపిన దేవ! మేల్కనుము
ఇంపునఁ బృథుకంబు లిడినకుచేలు
సంపన్నుఁ జేసిన చతుర! మేల్కనుము
దారుణ భూభార తరణావతార
భూరిప్రతాప స్ఫురణ! మేల్కనుము
సదమలానంద! నిశ్చయముల కంద!

విదురుని విందా! గోవిందా! మేల్కనుము
భోజకన్యా ముఖాంభోజ ద్విరేఫ
రాజీవనయనాభిరామ! మేల్కనుము
వరరూపవతి జాంబవతితోడిరతుల
నిరతిమైనోలాడు నిపుణ! మేల్కనుము
మంజుల సత్యభామా మనస్సంగ
రంజితగాత్ర సంరంభ! మేల్కనుము
లలితకాళిందీ విలాస కల్లోల
కలితకేళీలోల ఘనుఁడ మేల్కనుము
సారసుదంతా భుజకుముద హార
చారుప్రభాపూర చంద్ర! మేల్కనుము
నేత్రరాగ విశేష నిచితప్రతోష
మిత్రవిందారసోన్మేష! మేల్కనుము
భద్రానఖాంకుర బాల చంద్రాంక
ముద్రితభుజతటీమూల! మేల్కనుము
లక్షణా పరిరంభ లక్షితోదార
వక్షోవిశాల కవాట! మేల్కనుము
వేడుకఁ బదియాఱు వేలకామినులఁ
గూడిపాయని పెండ్లికొడుక! మేల్కనుము
కలిత సక్రగ్రాహగంభీర జలధి
వలయిత ద్వారకావాస! మేల్కనుము
జలదనీల శ్యామ! జగదభిరామ!
వెలయ మేల్కను మంచు విన్నవించుటయు
వీనులఁ గదిసిన వెలిదమ్మికన్నుఁ



గోనల నమృతంబు గురియ మేల్కాంచి
సరసిజాక్షుఁడు దేవసంఘంబు మీఁద
కరుణాకటాక్ష వీక్షణము నిగుడ్చి
శ్రీ వేంకటాచల శిఖర మధ్యమున
సౌవర్ణమణి మయ సౌధంబులోన
పూగచంపక కుంద పున్నాగవకుళ
నాగరంగప్రసూన విరాజమాన
తరులతా పరివేష్టితంబైన యట్టి
నిరుపమ కోనేటి నిర్మలాంబువుల
తిరుమజ్జనం బాడి దివ్యాంబరంబు
ధరియించి దివ్యగంధము మేనఁదాల్చి
నవరత్నమయ భూషణంబులు వెట్టి
వివిధ సౌరభముల విరు లోలి ముడిచి
ధారుణీసురులకు దానంబు లొసఁగి
చేరి యక్షతములు శిరసునఁ దాల్చి
వినుతులు గావింప విబుధసన్మునుల
మనవులు విని వారి మన్నించి మించి
యగణితరత్నసింహాసనారూఢుఁ
డగుచు మేరువుమీఁది యభ్రంబువోలె
గరకంకణోజ్జ్వల క్వణనంబు లెసగ
సరసిజముఖులు వెంజామరల్ వీవ
బంగారు గుదియల పడవాళ్లు వరల
నారదవీణా నినాదంబు లెసగ
చారణ మునిసిద్ధ సంఘంబు గొలువ

నానాప్సరస్సతుల్ నాట్యముల్ సేయ
మానవేశులు మహామహులు సేవింప
ఘనతర నిత్యభోగంబులు వెలయ
జనులకెల్ల మహాప్రసాదంబు లొనరఁ
గోరినవారికిఁ గోర్కు లీడేర
నీరీతి జగముల నేలుచునుండు
నని భక్తిఁ దాళ్లపా కాన్నమాచార్య
తనయుండు తిమ్మయ తగఁ బ్రస్తుతించె.

**ప్రాచీనాంధ్ర సాహిత్యములో వేంకటేశ్వరుడు**
**(క్రీ.శ.14-17 శతాబ్దాలు)**

**సంపూర్ణము.**

**// శ్రీ వేంకటేశార్పణ మస్తు //**